సంస్కృత వాఙ్మయ చరిత్ర

ప్రథమ సంపుటము

వైదిక వాఙ్మయము

స్వర్గీయ
మహోపాధ్యాయ, అభినవ వాగనుశాసన
మల్లాది సూర్యనారాయణశాస్త్రి గారు
విశ్రాంత సంస్కృతాంధ్రాధ్యాపకులు
ఆంధ్ర విశ్వకళా పరిషత్కళాశాల, వాల్తేరు.

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్డు — హైదరాబాద్

ద్వితీయ ముద్రణము
1982 డిసెంబరు.
ప్రతులు 1000

మూల్యము : రూ. 20-00

ముద్రణ :
శివాజీ ప్రెస్,
సికింద్రాబాద్.

తొలి పలుకు

తెలుగు భాషలో "సంస్కృత వాఙ్మయ చరిత్ర"ను తెలిపే ఒక ప్రామాణిక గ్రంథాన్ని వ్రాయించి ప్రకటించవలెనని 1958వ సంవత్సరమున ఆంధ్ర సారస్వత పరిషత్తు ఉద్దేశించినది. ఇటువంటి గ్రంథమును ప్రత్యేకముగా ప్రామాణికుడైన ఒక విద్వాంసునిచేత రచింపచేయవలెనన్న ఆలోచన ఆచరణ రూపాన్ని పొందే సందర్భంలో స్వర్గీయ శ్రీ మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు రచించి ఆంధ్ర విశ్వకళా పరిషత్తు 1936 లో ప్రకటించిన గ్రంథం పునర్ముద్రణ చేయవలెననే ప్రతిపాదన ఒకటి సారస్వత పరిషత్తుముందు వచ్చినది. అప్పటివరకు మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు సజీవులై ఉండిరి. స్వయంగా వారే తమ యీ కోరికను సారస్వత పరిషత్తుకు తెలియజేసినారు. అందుచేత శాస్త్రిగారి గ్రంథం ప్రకటించితే పరిషత్తు ఉద్దేశంకూడా నెరవేర గలదని పరిషత్తు నిర్ణయించినది.

స్వర్గీయ మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు సంస్కృతాంధ్ర భాషలలో ప్రామాణికులైన పండితులు, వివిధ కళాశాలలలోను, ముఖ్యంగా ఆంధ్ర విశ్వకళా పరిషత్తు కళాశాలలోను పనిచేసి తెలుగు దేశంలోని విద్వాంసులకు అనేకులకు ఆచార్యులై అనేక సన్మానాలను, సత్కారాలను పొందిన విద్వద్వరేణ్యులు, మహోపాధ్యాయ, అభినవ వాగనుశాసనాది బిరుదాలను పొందిన విద్వాంసులు. వీరు రచించిన సంస్కృత వాఙ్మయ చరిత్రను ఆంధ్ర సారస్వత పరిషత్తు పక్షాన ప్రకటితం కావడం సర్వవిధాల సముచితం. స్వర్గీయ సూర్యనారాయణ శాస్త్రిగారు పరిషత్తుపైన ఆదరాభిమానాలతో ఈ గ్రంథ ప్రకటనకు కావలసిన కాపీరైటు హక్కును పరిషత్తుకు ఇచ్చినారు. ఇందుకు పరిషత్తు పక్షాన వారికి ధన్యవాదాలు.

1961 వ సంవత్సరంలో సంస్కృత వాఙ్మయ చరిత్ర, లౌకిక వాఙ్మయం మాత్రమే పరిషత్తు పక్షాన ముద్రితమైనది. వైదిక వాఙ్మయ చరిత్ర ప్రకటనలో అనివార్యమైన కారణాలవల్ల ఆలస్యం జరిగినది. ఈసారి లౌకిక వాఙ్మయ చరిత్రతోపాటు వైదిక వాఙ్మయ చరిత్ర కూడా పరిషత్తు పక్షాన ప్రకటించగలిగినందులకు పరిషత్తు మిక్కిలి సంతోషిస్తున్నది.

ఆంధ్ర పాఠకలోకం, పండితమండలి, విద్యార్థి ప్రపంచం ఈ రెండు సంపుటాలను ఆదరించ గలవని పరిషత్తు విశ్వసిస్తున్నది.

హైదరాబాదు
1-1-88

దేవులపల్లి రామానుజరావు

విషయ సూచిక

షష్ఠాధ్యాయము

సప్తమాధ్యాయము

అష్టమాధ్యాయము

నవమాధ్యాయము

అనుబంధములు

పీఠిక

యస్య నిశ్వసితం వేదా యో వేదేభ్యోఽఖిలం జగత్
నిర్మమే త మహం వందే విద్యాతీర్థ మహేశ్వరమ్ ।

బ్రహ్మశ్రీ మల్లాది సూర్యనారాయణశా గారు సుప్రసిద్ధ సంస్కృతాంధ్ర పండితులు, బహుళసంస్కృతాంధ్ర గ్రంథర న పటిష్ఠ పాండితీవిరాజితులు. సంస్కృత వాఙ్మయచరిత్ర నాంధ్రమున రచిం పండితులకును కళాశాలావిద్యార్థి గణమునకును భాషాసారస్వతమునకును మహోపకా ము గావించిరి. ఇట్టిగ్రంథములు పాశ్చాత్యభాషలలో నుదయించినవి కాని దేశభాషలలో నిదియే ప్రథమ ప్రయత్నము. సంస్కృతమునఁ గూడ పెక్కులక్షణ గ్రంథరాజము లుద్భవించినను భాషాచారిత్రక గ్రంథములుకాని సారస్వతచారిత్రక గ్రంథములుకాని రచియింపఁబడి యుండలేదు. పాశ్చాత్యపండితులు రచించిన గ్రంథములు మా దర్శకములయినను పర్యాప్తభాషాభిమాన ప్రపూరితములు కానందునను, ప్రాచీనార్య నాగరికతా విజృంభణమును తదౌన్నతిని సంకుచితములుగాఁ గనపర్చు ద్దేశమును వ్యక్తపర్చునవి యగుటను భారతీయుల హృదయములకు కొన్నిపట్ల భ్రమవిషాదములు కలుగఁజేయునవిగాఁ గన్పట్టుచున్నవి. ఇట్టి కొఱంతను దొలగింప స్వదేశ పండితులు తమసహజ శేముషీవిలసిత పరిశోధనములతోడ నార్యవిజ్ఞానఖని యనఁదగుసంస్కృత వాఙ్మయచరిత్రమును లోకమునఁ బ్రకాశింపఁజేయు బాధ్యతగల వారలయియున్నారు, అట్టియెడ గ్రంథకర్తలగు మల్లాది సూర్యనారాయణశాస్త్రి గారు తమకర్తవ్యమును శ్లాఘాపాత్రముగా నిర్వర్తించిరని తెలుపుటకు మిక్కిలి సంతసించుచున్నాఁడను. నేను లౌకిక వ్యవహారనిమగ్నుఁడను. వారు నిరంతరాధ్యాపక కార్యనిష్ఠులు. వారు రచించిన మహాగ్రంథమునకుఁ బీఠికను వ్రాయు భారము ననర్హుఁడనగు నాపై వైచిరి. శక్తికొలఁదిని గాలపరిమితి కొలఁదినినిద్దాని వ్రాయఁబూనితిని. ఇందలి గుణదోషములను బండితులు విచారించుటలో మే ముభయులమును క్షంతవ్యులమే. శాస్త్రిగారి గ్రంథమునందు పాశ్చాత్యమతా విష్కరణమును, తన్మతాను వాదమును గొంతవఱ కనివార్యములుగాఁ గానవచ్చినను స్వాభిప్రాయములను వ్యక్తపఱుచుపట్ల శాస్త్రిగారు నిరంకుశముగా స్వీయమతమును వెలిపుచ్చిరి. ఇట్టి యుద్గ్రంథము మన దేశమునను మన మాతృభాషను నూతనమును బ్రథమప్రయత్నము నగుటను విమర్శకులకు పెక్కులోపము లిందుస్ఫురింప వచ్చును. కాని గ్రంథము వ్యాప్తిచెందిన కొలఁదిని నితరదేశ భాషలలోనికిఁ బరి

వర్తింపఁబడిన కొలఁదిని దీనిగుణ సముదాయము పండితులకు గోచరింపకతప్పదు. ఆట్టితరదేశ భాషలలోనికిఁ బరివర్తనము చేసి ప్రకాశింపఁజేయఁదగిన దీగ్రంథమని మాత్రము నిస్సంశయముగా దృఢవిశ్వాసముతో విన్నవింపఁ గలవాఁడను. కొన్ని తావుల గ్రంథకర్తగారి స్వకీయాభిప్రాయములతోనే నేకీభవింపఁజాలక పోయినను గ్రంథరచనయందు వారు చూపిన సారస్వతపరిచయమును గవేషణ సామర్థ్యమును అనర్గళమృదు మధుర పదవాక్యఘటనా సౌందర్య చాతుర్యలహరీ మహిమను వర్ణనాచమత్కృతిని దిలకించి పులకితాంతరంగుఁడనై భళీయని కొనియాడ వెను దీయువాఁడను మాత్రము కాఁజాలను. సంస్కృత వాఙ్మయమును అందు వైదిక వాఙ్మయప్రాభవమును ఆర్యులయొక్కయు మానవజాతియొక్కయు నమూల్య పైతృకధనముగా భారతీయు లందఱును పరిగణింప వలసియున్నది. వైదిక రహస్యము లపారములుఁ దుర్విజ్ఞేయార్థ బహుళములు, సర్వజ్ఞకల్పములని భాష్య కర్తలవలనను శ్రీశంకరాద్యాచార్య పురుషులవలనను వేయివిధములఁ గొనియాడఁ బడి నవియునైయున్నవి. అర్వాచీనులలో ననేకపండితులు వివిధార్థముల స్వమతాభి మాన పురస్సరముగా వ్యక్తపఱచియుండిరి. ఆర్యసమాజమువారు యజ్ఞములు భౌతికశాస్త్ర క్రియాపరిశోధన సూచక విశేషములుగా వర్ణించియుండిరి. దయా నందసరస్వతీ స్వాములవారు సత్యార్థప్రకాశికయనుపేర స్వతంత్ర గ్రంథమును రచించి పెక్కుచోట్ల వేదమంత్రములకు భిన్నార్థములు గల్పించి వారి శిష్యులకు మార్గప్రదర్శకులైరి. వారి జీవితకాలములోనే వాదప్రతివాదములు ప్రబలి ఖండన మండన గ్రంథము లనేకములు వెడలినవి. ఉదాహరణమునకు మాత్రము గురు దత్తవిద్యార్థిగారును మొన్న మొన్న పి నారాయణగౌడ్ యెమ్. యే. గారును రచించిన Message of the XX th Century అను గ్రంథమును తార్కాణ ముగాఁ దీసికొనవచ్చును. వీర లశ్వమేధయాగమును X-Ray పరముగా సమ ర్థించిరి. బ్రహ్మీభూతులయిన శ్రీబోధానంద భారతీస్వాములవారు వేదమంత్రములు నీచలోహమువలన స్వర్ణమును (Alchemy) పుట్టించువిధులుగా సమన్వయించిరి. ఇటీవల బొంబయినగరమున ముద్రణముగాంచిన యొకానొక గ్రంథమున వి. జి. రేవేగారు దీని శారీరక శాస్త్రమును గాను యోగశాస్త్రముగాను సాధించిరి. మతా చార్యు లద్వైతవిశిష్టాద్వైతద్వైత ప్రకాశకములుగా వర్ణించియుండిరి. మోక్ష మూలరు మొదలగు పాశ్చాత్యపండితులు వీనిమహిమను బొగడియెద్దియో మహత్తర మగునర్థ మిందిమిడి యుండనోపునను నూహను మాత్రము కనఁబర్చి రచనా సౌందర్యమును బొగడుచు నట్టి పురాతన కాలమం దార్యులు కనఁబర్చిన కవితా

శక్తికి నచ్చేరువుచెందుచు పరంపరావిచ్ఛేదమున సరియగునర్థమును బోధచేయు నుపాయమంతరించినదని యంతటితో విరమించిరి.

వేదముల పౌరుషేయములు

ఆస్తికజనము మాత్రము వేదరాశి శబ్దముచేతను నర్థముచేతను నిత్యమును నపౌరుషేయమును, నీశ్వరనిర్మితము కూడఁగాక యీశ్వరనిశ్వసిత రూపమునని మిక్కిలి శ్రద్ధాభక్తులతో దీని భజించుచుండిరి. ఈ విషయమునఁ బూర్వమీమాంసకులకు నుత్తరమీమాంసకులకు నించుకమతభేదము కలదు. తార్కికుల సంసారీశ్వరపురుషనిర్మితములని వాదించిరి. సాంఖ్యు లాప్తవాక్యములనిరి. నాస్తికో వేదనిందకః, అను మనువచనమునకు గుఱియై బౌద్ధచార్వాకాదులు వేదప్రామాణ్యము నంగీకరింపరైరి. ఇట్లనేక విధముల విప్రతిపత్తిని గలిగించు వేదరాశి కాలము గుర్తింప నలవికాని పురాతనవిద్యయై యున్నది, గ్రంథకర్తలు తిలకపండితాదుల ననుసరించి కాలనిర్ణయమునకుఁ గడంగియు, పూర్వోత్తర మీమాంసాది శాస్త్రవచనములఁ జర్చించి, తుదకు 'యుగాంతేఽన్తర్హితాన్ వేదాన్' అనుచు, వేదములు ఋషిదృష్టములను మతము నావిష్కరించిరి. క్రైస్తవమత గ్రంథమగు బైబిలును మహమ్మదీయ మతగ్రంథమగు ఖురాన్‌షరీఫ్ గ్రంథమును, భగవద్వాక్యములుగా నాయామతస్థులు నమ్ముదురు. పారశీకుల ఛందోవ స్థానాదిగ్రంథములు గూడ మహర్షిదృష్టములని నమ్మఁబడుచున్నవి. ఆగమికులు పాంచరాత్రాద్యాగమములు వేదతుల్యము లనియును వేదమంతర్హితమైన దినములలో బ్రహ్మవలనె వెలసిన వనియు నమ్ముదురు. తాంత్రికులు, తాంత్రికాగమములు వేదమునకుఁ బూర్వముండిన వనియును వేదములందంతట తాంత్రికవిద్య ద్యోతకమగుననియును నిగమాగమము లన్యోన్యసంబంధము కలిగి సమానప్రామాణ్య ప్రతిపత్తికలవనియు జెప్పుదురు. ఇందేది సత్యము విశ్వసనీయ మెద్దియను విచారము పండితుల కనివార్యమగుచున్నది. షడంగముల నుభయమీమాంసలను పూర్ణముగా నభ్యసించినను నీశ్వరానుగ్రహమును గురుకటాక్షమును లేనియెడల వేదార్థము దురవగాహమని యాస్తికులనియెదరు. దివ్యజ్ఞానసమాజమువారును వారిలో ముఖ్యులగు Madame Blavatsky గారును వారి శిష్యురాలు అనీబసంతమ్మగారును Secret Doctrine అను నుత్తమ గ్రంథమునందు వేదమంత్రములకు యుక్తిపూరితములయిన కొన్ని నూతనభావములు స్ఫురించునర్థములు దెలిపిరి. బహుగ్రంథ పరిచయమునను పాశ్చాత్యవిద్యాగ్రంథమువలనను ఆధునికులగు భారతీయులు వ్యామోహితులయి సత్యమును వెదకి వెదకి వేసరి విఫలమనోరథులయి యుదాసీనత వహించియున్నవారు,

ఏన్నాఁటనయిన భగవంతుఁడు తనదివ్యజ్ఞాన మహిమను భూమిపయి మనుజునకు నేవిధమునఁ నయినఁ బ్రసాదించియుండెనని నమ్మినచో నది నిక్కముగా వేద ఋషులభావవీథి వారితపఃఫలంబున నావిర్భవింపఁజేసె నననమ్మిక సువ్యక్తము కాకపోదు. గ్రంథకర్తలుగూడ నొకచో నీ భావమే యావిష్కరించిరి,

పతంగో వాచం మనసా బిభర్తి।
తాం గంధర్వో వదద్గర్భే అంతః।
తాం ద్యోతమ నాగ్ స్వర్యం మనీషాం।
ఋతస్య పదే కవయో నిపాంతి॥

యుగాంతేఽంతర్హితాన్ వేదాన్ సేతిహాసాన్ మహర్షయః।
లేభిరే తపసా పూర్వ మనుజ్ఞాతా స్స్వయంభువా॥

వేదమునకంటెఁ బ్రాచీనమయిన సారస్వతసంపద యేమనుజభాషయందును గానరాదు. దీనికి కర్త వెదకినను గానరాఁడు. ఇది అనాదిసిద్ధమై శ్రుతిరూపమున వెలయుచున్నది.

శబ్దమువలన సృష్టి

వైదికభాష సంస్కృతముగ నున్నది. ఇది వైదికలౌకిక భేదమునద్వివిధ ముగఁ గన్పట్టుచున్నది. అథశబ్దానుశాసనమ్ - కేషాం శబ్దానాం లౌకికానాం వైదికానాంచయను పతంజలి మహాభాష్యవచనము లిందుకు నిదర్శనములయి యున్నవి శబ్దార్థములకుఁ గల సంబంధము ఔత్పత్తికము నీశ్వరసంకేతితము ననియుఁ బూర్వమీమాంసకులమతమై యున్నది. అత ఏవచ నిత్యత్వమ్మను నుత్తరమీమాంసా సూత్ర వ్యాఖ్యానావసరమున శ్రీ శంకరభగవత్పాదులవారు శబ్దార్థములచేఁ గూడ నిత్యత్వమును అనుపూర్వీనిత్యత్వమును గూడ నంగీకరించి యుండిరి. కాలాకాశవన్నిత్యత్వమ్మని శ్రీ విద్యారణ్యులవారు సృష్టిదశయందు నావిర్భవ రూపనిత్యత్వము నంగీకరించి ద్యోతకముగావించిరి. Max Muller పండితుఁడుగూడ శబ్దార్థసంబంధ నిరూపణమందు స్ఫోటవాదముయొక్క మహిమను మిక్కిలి కొనియాడి యుండెను. పూర్వమీమాంసా శాస్త్రము వేద ప్రామాణ్యమును గూర్చియు శబ్దప్రామాణ్యమును గూర్చియు విస్తరించి చర్చించి సిద్ధాంతము నేర్పఱచినది. శబ్దసృష్టిని బైబిల్ గ్రంథము కూడ నంగీకరించినది. వేదమువలన

నఖిలజగత్తు సృష్టింపఁబడిన దనినయెడల మన మేల నమ్మరాదు. శబ్దబ్రహ్మము యొక్కమహత్త్వించుక పాశ్చాత్యభౌతికశాస్త్రము గ్రహించుచున్నది. వితంతివార్తా శ్రవణమే యిందులకు దృష్టాంత మయియున్నది మంత్రముల మహిమయును వర్ణానుపూర్వియొక్క ప్రభావమును, ఉపాసకు లందఱకును బ్రత్యక్షమై యున్నవి. మంత్రము యంత్రము దేవత యుపాసకుఁడుగురువును నేకరూపములని మంత్ర శాస్త్రము తెల్పుచున్నది. ఇటీవల నొకపరాసు దేశయువతీమణి కనిపెట్టిన యొక వాద్యవిశేషమువలన వివిధరాగాలాపములచే భిన్న భిన్న దేవతా స్వరూపములు వాలుకలపైఁ జిత్రింపఁబడినవని ప్రకటింపఁబడిన వృత్తాంతము పూర్వమీమాంసా సిద్ధాంతము నెంతయు బలపర్చుచున్నది. పాశ్చాత్యసిద్ధాంతులలోఁ గొందఱి మతముప్రకారము **The word of God** అనఁగా శబ్దము సృష్టికి మూలకారణమని నిర్ణయింపఁబడినది. సృష్టికి కారణము (Logos) అనున దీ విషయమే భౌతిక విజ్ఞాన మభివృద్ధి చెందినకొలఁది ప్రకృతి రహస్యములు ప్రత్యక్షానుభవ గోచరము లగుచున్నవి. ప్రత్యక్ష ప్రమాణము గోరువారికి శ్రుతియు ప్రత్యక్ష ప్రమాణము కాకపోదు.

'స్మృతిః ప్రత్యక్ష మైతిహ్యమ్ ।'
అనుమానః చతుష్టయమ్ ॥

ఇచ్చటఁ బ్రత్యక్ష మనఁగా శ్రుతియే. మనకుఁ బ్రత్యక్షముకాని శ్రుతులు మన్వాది మహర్షులకుఁ బ్రత్యక్షములు గనుక ననుమేయ శ్రుతిమూలకముగ స్మృతి ప్రామాణ్యము సిద్ధించునని స్మృతిపాదమున మీమాంసా శాస్త్ర ముద్ఘోషించినది. వేదము లనంతములు. అనంతా వై వేదాః । యను వేదవాక్యమే కలదు. మంత్ర బీజాక్షరముల మహిమ మంత్రశాస్త్రమువలనఁ దెలియఁదగును. అట్టి మహిమ సాక్షాత్కార దశయందు ప్రత్యక్ష రూపమగును. ఉపాసన బలమున దేవతా ప్రత్యక్షము జరుగుట స్వానుభవైక వేద్యము. అట్టి ప్రత్యక్షము విజ్ఞానశాస్త్ర విరుద్ధము కాదని దివ్యజ్ఞాన సంఘము వారిలోఁ బెక్కండ్రు నమ్ముదురు. ఇంక వైదిక కర్మమువలన నపూర్వము జనించి ఫలరూప మగుననుట నేల విశ్వసింప రాదో తెలియకున్నది. వేదమహర్షులు ప్రత్యక్షానుభూతినే వెల్లడించిరి. వారు లోక ప్రతారణోద్యోగులు కారు. ఆత్మభ్రాంతి కలవారును కారు. అహం మను రభ వమ్మను వామదేవ వాక్యమును, అపశ్య మహమేత త్సూర్యమండలం పరివర్త మానమ్ । అనుగార్గ్య ప్రాణత్రాత వచనమును ప్రత్యక్ష కృతములు పరోక్ష కృత

ములు నాత్మకృతములు ననుయాస్కనిరుక్త కృతమంత్ర విభాగములు నిందుకు దృష్టాంతములయి యున్నవి.

సంస్కృతము దేవభాష

సంస్కృతమునకు దేవభాషయను వాడుక కలదు. దీని కీ నామమెట్లు సార్థక మయ్యెనను విషయము నింకను బండితులు చర్చించి సిద్ధాంతములను నిరూపింతురుగాక ! నాకుఁ దోచినదానిని దెల్పెదను. సప్తకోటి మహామంత్రములకు బీజములయిన అకారాదిక్ష కారాంతములయిన వర్ణమాతృకా సముదాయము సంస్కృతమునఁగాక వేఱొండు భాషఁ గానరాదు. కావున నది వర్ణసమామ్నాయమైనది. ఆమ్నాయ శబ్దార్థము పండితులకు గోచరమే సమామ్నాయః సమామ్నాతః అను యాస్కవచనము సమామ్నాయార్థమును దెలుపును. పాణిని ప్రత్యాహార సూత్రములకును మాహేశ్వర సూత్రము లను సంజ్ఞ కలదు. సనకాది సిద్ధుల నుద్ధరించుటకై నటరాజరాజు నృత్తావసానమందు ఢమరుకమును పదునాల్గుసారులు వాయించిన నవి యుద్భవించినవఁట. నటరాజు నృత్యము ప్రపంచసృష్టి హేతుభూత మెట్లయినదియును నటరాజు విగ్రహమును జూచి Edward Carpenter మొదలగు పాశ్చాత్యులుకూడ విస్మితులయి వ్రాసిన వ్రాతలు సాక్ష్యమిచ్చుచున్నవి. ఈ ప్రత్యాహార సూత్రములపయి నందికేశ్వర కారికలఁజూచిన నిందలి నిగూఢ తత్త్వము దెలియకమానదు. ప్రథమ ప్రత్యాహార సూత్రార్థ మిట్లు వివరింపఁబడినది. నిర్గుణ పరబ్రహ్మ స్వరూపమయిన అకారము మాయా స్వరూపమయిన ఇకార సాన్నిధ్యముచే ఉకారరూప ప్రపంచ పరిణామమును జెందినది. చివరనుండు లణ్ ।హయవరట్। అను సూత్రములు వరుసగ పృథ్వి ఆకాశ వాయు జల (అమృత) అగ్ని (తేజః) భూతములయొక్క బీజములయి యున్నవి. మంత్రశాస్త్రమునందలి యే బీజనిఘంటువునైనఁ జూచినచో వీని శక్తులు దేవతలు ప్రత్యధి దేవతలు మొదలగు విషయములు తెలియఁగలవు. సంయుక్తాక్షరములు నిట్లే బీజశక్తులు కలిగి యున్నవి. క్షరములేని దక్షరము ఆది అకారమును చివరక్షకారమును అగ్నిబీజమగు రకారముతోఁ జేరి 'అక్షర' సంజ్ఞ చెందినది. హం క్షం అను రెండక్షరములు నాజ్ఞా చక్రమున ద్విదళమున మంత్రబీజములై హంస మంత్రమునకు వర్ణములయినవి. హంస మంత్రమున కజపాగాయత్రి యని పేరు. హకారము పురుష బీజము. సకారము ప్రకృతి లేక స్త్రీబీజము. బిందువు పురుష స్వరూపము. విసర్గ ప్రకృతిరూపము. బిందు విసర్గలు త్రిభుజరూపము. ప్రకాశబిందువు విమర్శా

త్మకమై విభిన్నమై విమర్శబిందువై వానివలన మిశ్రబిందు వుదయించి యీ మూటి యొక్క త్రిరేఖా సంబంధమువలన త్రికోణముగా నేర్పడి అందువలనఁ గామకళ యుదయించి సృష్టికిఁ గారణ మగుచున్నదని కామకళా విలాసమను మంత్రశాస్త్ర గ్రంథము తెల్పును. హంస స్సోహమ్ అను మంత్రమునఁ బురుష ప్రకృతులు కలసియున్నవి. సోహమ్మను మంత్రమునుండి పురుష ప్రకృతి బీజరూపములయిన సకార హకారములను విలాపము చేయఁగా అనఁగా సోహమ్ అను దానిలోని సకార హకారములఁ దీసి వేయగా 'ఓమ్' అను ప్రణవము మాత్రము నిలచునని శ్రీ శంకరాచార్యులవారు ప్రపంచసార తంత్రమునఁ దెలిపిరి. మఱియు ప్రథమాక్షరమగు 'అ' కారము 'హ' కారముతోఁగూడి బిందుసంయుతమై యాత్మవాచి యగుచున్నది. మూలాధారము మొదలుగ షట్చక్రములయం దీ బీజన్యాస మెట్లున్నదియు షట్చక్ర నిరూపణము మొదలగు గ్రంథములవలనఁ దెలియనగును. కొన్ని యాంగ్లమున పరివర్తితములయి Sir John Woodroffe అను న్యాయమూర్తివలన Garland of Letters Serpent Power అను నిత్యాది గ్రంథములుగా బ్రకాశింపఁబడినవి. వర్ణమయీ మంత్రమయీ యంత్రమయీ' యిత్యాది దేవతా స్తుతివాక్యములు నిందులకు నిదర్శనములే. మాతృకా విలాసమను సంస్కృత గ్రంథమునఁగూడ నీ విషయము విస్తరింపఁబడినది. అంతర్మాతృకా బహిర్మాతృ కాన్యాసాదులతో మంత్రోపాసనముచేయు సాధకుల కివి యనుభవసిద్ధములే. గ్రంథవిస్తరభీతిచే నింతకంటె విపులముగాఁ జర్చింపనైతిని. బీజశక్తులు సంపూర్ణముగా నావిర్భవించిన వర్ణసమామ్నాయ మితర భాషలయందు లేదు. ఏ భాషయందైనను బీజశక్తులు కలిసిన యెడల మాంత్రికవర్ణానుపూర్విపలన జనించిన శక్తి సిద్ధిహేతువు కాఁబరగునని మంత్రమహార్ణవాది గ్రంథములలో నుదాహరింపఁబడిన మంత్రసము దాయమే దృష్టాంతమయియున్నది. కావ్యముల వర్ణబీజగుణ కూటముల వలన నగుఫలములు నిట్టివే. వైదికమంత్రములు నట్లే ప్రత్యక్షశక్తి గోచరములగుట వైదికుల మ్మతమైయున్నది. కావున శ్రుతిప్రత్యక్షమని వ్యవహరింపఁబడును. ఇష్టప్రా కిని నని పరిహారమునకు నలౌకికోపాయమును బోధించునది వేదమని విద్యారణ్యులు

మును బ్రత్యక్షముగఁ 'జూచి వచ్చినవారలు లేకున్నను, స్వర్గము నిత్యమును ప్రత్యక్షముననియే మీమాంసకమతము. పునరావృత్తి రహితమైనట్టియు స్వస్వరూపావస్థానరూపమగు మోక్షాపేక్షచే కర్మచితలోకము లల్పాస్థిరఫలదములని వేదాంత మతము. ఏది యెట్లున్న నేనాఁడయిన పరమేశ్వరుఁడు పుడమిపై మానవునకు తన దివ్యజ్ఞానమహిమ నించుకేని ప్రసాదించెనని నమ్మవలసివచ్చినప్పుడు వైదిక విజ్ఞానమట్టి భగవత్ప్రసాదమని నమ్మట కెట్టి యాక్షేపణయుఁ గనరాదు. వైదిక

ఋషుల దివ్యజ్ఞాన తేజోవిలసితములగు లోకోత్తరానుభవములను విశదీకరించిన వేదములట్టివను దృఢవిశ్వాసము సమంజసమగుట కాక్షేప మేమి ?

వేదకాలము వేదభూమి వైదికకర్మములను గూర్చి యోకించుక చర్చించుట యిచ్చట నావశ్యకమని యోచించి సంక్షేపముగా నాయావిషయముల వివరింప యత్నింపవలసి వచ్చినది. బహు గ్రంథపరిశీలనము చేసి గ్రంథకర్త లీవిషయమున స్వాభిప్రాయ మచ్చటచ్చటఁ జూపించుచుఁ జరిత్రకారుల మతములను వివరించి యుండిరి. వేద మపౌరుషేయమను విశ్వాసము గల యాస్తికుల కిట్టి బాహ్యాంగ పరీక్షలతో నిమిత్తములేదు. పాశ్చాత్యపండితు లనేకులు వేదకాలము మానవ యుగమునఁ గ్రీస్తునకు పూర్వము కొలదిశతాబ్దముల క్రిందటిదన్నట్లు వ్రాసి యుండిరి. ఇట్టివాదము లభిమానగ్రస్తములు కాని వాస్తవములు కానేరవని శ్రీయుత బాల గంగాధర తిలకుపండితులును నాధునికులలో Rigvedic India గ్రంథకర్త లయిన దాసుగారును మిక్కిలి పరిశోధనముచేసి పాశ్చాత్యవాదము లపభ్రంశము లనియును దుష్పాండిత్య విలసితము లనియును నూతన పరిశోధనపద్ధతులకు మార్గమును జూపిరి. "యోవేదేఽభ్యోఖిలం జగత్" ను ప్రతిజ్ఞయొక్క వాస్తవమును గనిపెట్టఁ దలఁచినచో సర్వజ్ఞకల్పమని యాచార్య పురుషులవలన వేనోళ్లఁ గొనియాడఁబడిన వేదప్రపంచమును బరిశీలింపఁ బూనిననచో నొక పురుషాయుర్దా యమును నొక పురుషబుద్ధియు నీపనికిఁ బర్యాప్తములు కావని చెప్పక తీఱదు. భారతీయుల పైతృకధన మయినట్టియు, సనాతన ధర్మమున కాదిమూలమును హిమ వత్పర్వతమువలెఁ గర్మభూమికి బ్రతిష్ఠానము నయినట్టియు నార్యజాతీయ జీవనదీ ప్రభవస్థానమును దేవతాత్మస్వరూపమును నన్యులకజేయము నగునట్టియు నీ వేద రాశిని భారద్వాజ వృత్తాంతమును స్మరించు కొనిదరిఁజేరఁజూచు వారలు పెక్కు సంఘములుగా నేర్పడి పరిశోధనము చేయవలసిన యావశ్యకత గోచరమగుచున్నది. గ్రంథకర్తలు పొగడిన రీతిని వేదవాఙ్మయ మాంధ్రలోకమున హెచ్చు తేజమును బొందినది. వైదికపరిశోధన శాఖనేర్పరచి యిట్టి కార్యమునకుఁ గడఁగుట యాంధ్రవిశ్వ విద్యాలయమువారి ప్రథమ కర్తవ్యమని వేఱుగ నుడువ నవసరము లేదు. ఉదాహరణమున కొకచిన్న విజ్ఞప్తిని చేయుచున్నాఁడను, లోకమాన్యు లార్యభూమి యుత్తరధ్రువప్రాంతమని సహేతుకముగ నిర్ధారణచేసిరి. దాసుగారా మతమును ఖండించుచు సప్తసింధుప్రదేశ మార్యభూమియని స్థిరపరిచిరి. కాని యుత్తరధ్రువ ప్రాంతలక్షణ సూచకములగు ఋఙ్మంత్రములకు గతి కల్పించుట కాయాసపడిరి. అట్టిభౌతిక పరిస్థితులు భరతఖండమునం దెన్నఁడయినఁ గలిగి

యుండెనా యను సంశయము కలుగవచ్చును. ప్రస్తుతమందు భూవ్యాసాగ్రము లయిన దక్షిణోత్తరధ్రువప్రాంతములు హిమభరితములయి యుండుటయు, నుత్తర ధ్రువము మేరుసంజ్ఞ కనుకూల మయిదేవమానమని పేరుగన్న దీర్ఘాహోరాత్రపరి మితియుఁ జక్రభ్రమణ రూపమయిన సూర్యచంద్ర నక్షత్రగతియు సంభవించు చుండుటయు, నీ మొదలగు కారణములు లోకమాన్యుని గూడ నించుక భ్రమింపఁ జేసినవి. అయినను వేదములయందు ఘటింపఁబడిన జ్యోతిశ్శాస్త్ర విషయములే యుగపరివర్తనమందు దృష్టములయినవో చెప్పజాలమనియుఁ గడపటి పరివర్తన ముంబట్టి పర్యాలోచనముచేయగా నాంగ్లేయుల సిద్ధాంతములకంటె నతిదీర్ఘ కాలద్యోతకములు కాఁజాలుననియు నిర్ణయించి వేదము లనాదులనవచ్చునను భావమును సూచించిరి. గ్రంథకర్తలు గూడ చారిత్రకవాదములు చర్చించియు నిప్పటికిదియే వేదవాక్యములకు దగ్గరగా నున్నదనుచు నీ మతమును బ్రదర్శించిరి. కాని యాధునిక పాశ్చాత్య భూగోళవిజ్ఞానమును పురస్కరించుకొని లక్నో (లక్ష్మణపురీ) విశ్వవిద్యాలయ పండితులగు ప్రొఫెసరు సహానీగారు మొన్న మా పురమందిరమున నిచ్చినయుపన్యాసములో జలస్థలవిభాగమును ఖండపరివర్తనమును వివరించుచు దక్షిణోత్తరధ్రువములని వాడఁబడు ధ్రువములకు కూడ చలనము కలదను నాశ్చర్యోక్తిని బ్రకటించిరి. దాని వినినతోడనే నాహృదయ మమితానందకందళితమైనది. మేరువు హిమగిరి నొక కాలమున నుండియుండుననియు నుత్తరధ్రువ ప్రాంతపరిస్థితు లీసప్తసింధు దేశమునందే యుండెననియును నార్యజాతి యైరోపా మధ్యభాగమునుండి కాని యాశియా మధ్యభాగమునుండి కాని భారతభూమికి వలస వచ్చినది కాదనియు నాకుఁ జిరకాలమునుండి కలిగిననమ్మిక దృఢతరమైనది. కాళిదాసుచే కుమారసంభవమున వర్ణింపఁబడిన హిమగిరి వృత్తాంతము సత్యమై యీ విషయమునఁ బ్రమాణమగుచున్నది. పాశ్చాత్యవిజ్ఞానసంపద నానాఁటికి విస్తరిల్లుచుఁ బ్రకృతిరహస్యముల నన్వేషించుచు వానిని బయలుపరచిన కొలఁదిని వేదఋషులసర్వజ్ఞతత్వము సిద్ధాంతీకరింపఁబడుచున్నది. మహెంజోదారో నాగరికత, సుమేరియను నాగరికతయను నవికూడ నీ విషయమును స్థిరపఱుచును. ఇందు కింకొకచిన్న యుదాహరణము దేశకాలముల తత్త్వమును పాశ్చాత్య భౌతికశాస్త్ర మింతవఱకు బాగుగ గుర్తెఱిఁగి యుండలేదు. జర్మన్యదేశీయ విద్వాంసుఁడగు (Einstein) ఐన్‌స్టైన్ పండితుఁడు తనదివ్య పరిశోధనలవలన పాశ్చాత్యలోకమును విస్మితము గావించెను. ఆయన వలన సిద్ధాంతము చేయఁబడిన రెలెటివిటీ Relativity (సరియైన పారిభాషిక పదము లేమినిద్వంద్వత యందుము) యను నూతనసిద్ధాంతపు మహత్త్వ మింకను కొందఱు పాశ్చాత్యపండితుల కగమ్యగోచ

రముగా నున్నదనియు నుపనిషద్వేదాంతాభ్యాసకుల కది సుగమ మనియును మన శాంతిరామమూర్తి యెమ్. యే. ఐ. సి. యస్. పండితు లొకానొక తఱిఁదన యుపన్యాసములోఁ దెల్పియుండిరి. మఱియు దేశకాలము లేక స్వరూపమనియు వేఱొకభిన్న వస్తుపరిణామములు కాని వాస్తవముగఁదత్త్వములు కానేరవనియు నుడివిరి. ఈ యుక్తిని గణిత శాస్త్రముచే సాధించుశక్తి వారికి కలదు నాకది యసాధ్యము కాని

తస్యాః పాకవిశేషేణ ।
స్మృతంకాల విశేషణమ్ ॥
తస్మా ద్వా ఏతస్మా దాత్మన
ఆకాశ స్సంభూతః ।
ఆకాశా ద్వాయుః ॥

ఇత్యాది వాక్యములయందును కాలాకాశ వన్నిత్యత్వమ్ ॥ అను వ్యావహారిక నిత్వత్వద్యోతనార్థక వాక్యములయందును పరమాత్మ దేశకాలా పరిచ్ఛిన్న వస్తువని తెలుపు వేదాంతములందును భూరాది సప్తవ్యాహృతులఁ దెల్పు నుపనిషద్వాక్యముల యందును నెట్టి నిగూఢ ప్రకృతి రహస్యము లంతర్గతములై యుండునో వానిని నావంటి యజ్ఞుఁడుగాక వివిధ విజ్ఞాన శేముషీ ధురంధరులగు పండిత ప్రకాండులు శోధింతురుగాక యని యొక్క యుదాహరణము మాత్రము సూచించితిని ప్రకృతి యందు చిత్తు జడము ననునవి భిన్నతత్త్వములుగా ప్రవహించిన శాస్త్రములు ఖండితములైనవి. జడజగ త్తనునది చిదాత్మకమను నద్వైత సిద్ధాంతమునకుఁ బాశ్చాత్య భౌతిక విజ్ఞానశాస్త్రము తోడ్పడుచున్నది. కాణాద మతముఁ బరమాణు వాదమున్నది. ఇట్టి పరమాణు లనఁబడునవి (atoms = అణువులు) ప్రకృతి శాస్త్రమున భిన్నములై అట్టి యుద్భవమున ననంతశక్తి సంయుతములయి యుండుటయును, అట్టి అణువుల కోసి విద్యుద్బిందువుల విన్యాస క్రమము ననుసరించి యణువ్యక్తిత్వ మేర్పడుచున్నదనియు నవీన భౌతిక సంప్రదాయసిద్ధమైన వచనము. కాని విద్యుద్బిందు విన్యాసమును (Disposition of Electrons) మూల కారణమగు శక్తి పాశ్చాత్యుల కింకను గోచరించి యుండలేదు. సామాన్యమైన వెలుతురుయొక్క స్వభావమునుగూర్చి మొన్నటివఱకు సిద్ధాంతము లపసిద్ధాంతము లగుచుండినవి. జగదేక పండితుఁడగు మన సర్. సి. వి రామను పండితుఁడు కదా దాని తత్త్వమును లోకమునకు వెల్లడించెను. రామనువంటి పండిత గ్రామణులు

వైదికాగ్రేసరు లయినచో వేదరహస్యములను గుర్తింపకపోరు. విజ్ఞానశాస్త్రము విజృంభించినకొలదిని మానవబుద్ధి వైభవము వికసించినకొలదిని వేనవేలుగా విద్వాంసులు భూగర్భతత్వ ఖగోళ భూగోళ మానవజన్మ వృత్తాంతాది వివిధ శాస్త్రముల పారంగతులయినవారు పై విషయములఁ జర్చించి సారమెఱింగి సభలుగ కూడి పరిశోధించినచో వేదరహస్యము లీశ్వర కటాక్షముండిన భావగోచరములై యమితోత్సాహజనకము లగునని ననుబోటివారలు నిరంతరము ప్రతీక్షించుచుందురు. వైదిక కర్మలను గూర్చియు నార్య సాంఘికాచారములను గుఱించియు పాశ్చాత్య పండితులు మొదలగువారు భిన్నాభిప్రాయములు కలవారై యున్నారు. యజ్ఞేనహి దేవా దివంగతాః ॥ యజ్ఞో వై విష్ణుః ॥ అను నీ మొదలగు వాక్యములు వేదమునందే కలవు. ద్రవ్యమయ యజ్ఞములు పశుహింసాది లక్షణములు కలవని జ్ఞానయజ్ఞమే గీతాశాస్త్రము బోధించినని కావున నదియే యిక్కాలమున నాచరణీయమనియుఁ గొందఱి యభిప్రాయము. యజ్ఞములు, హవిర్భాగము లేదును పాకయజ్ఞము లేదును సోమయాగసంస్థ లేదును నవి సూత్రకారుల మతమై యున్నది. సోమయాగమును కొన్నిపట్ల నిందించినను నద్దానిఁ బొగడుచు సోమము నుత్కర్షచేసిన మంత్రములు కొన్ని పారశీకుల ఛందోప స్థానమునఁ గలవు. సోమ మొక మత్తుపదార్థ మనియును నద్దాని గ్రోలి మత్తిల్లిమయి మఱచుటకుఁగా నీ సోమయాగము లుద్భవించిన వని కొంద ఱందురు. ఆత్మ నిష్క్రియమున సంస్కార్యమును నిత్యశుద్ధ బుద్ధముక్త స్వభావమును గావున జీవేశ్వర భేదమును పురస్కరించుకొని ప్రవర్తించిన వైదిక లౌకికశాస్త్రము లన్నియు నవిద్యా విలసితములని యద్వైతుల సిద్ధాంతము. పశుహింసను విడిచి పిష్టపశువుతో యాగములు సలిపి కర్మఫలములఁ గోరునవి ద్వైత విశిష్టాద్వైత సంప్రదాయములును దీక్షిత పంథానుగు లగు కొందఱి మతమునై యున్నవి. యాగమందలి హింస హింస కాదనియును హింస యను దాని యర్థము వేఱనియును పశువునకు ప్రతినిధి లేదనియును ప్రభుసమ్మితములగు వేదవాక్యములకు వికల్పములఁ గల్పింపరాదనియును కలివర్జ్యములు యాగములని నిషేధించినను వేదప్రచారమును వర్ణాశ్రమాచార ధర్మములును నిల్చియున్నంతవఱకు నవి యవశ్యమాచరింపఁ బడవలయుననియును, ఆస్తికలోకము ఘోషించుచున్నది. పైని నుడివినరీతిని యాగముల కార్యసామాజికులు విపరీతార్థములు గల్పింపసాగిరి. వేదములేని వేదాంత మెచ్చటఁ గలదనియును బరమాద్వైత వాదమున నైష్కర్మ్య సిద్ధికిని చిత్తశుద్ధికిని మూలకారణములగు వైదికకర్మములు విడువరాదనియును గీతా వాక్యముల నుదాహరించు పండిత శ్రేష్ఠులు కలరు. "దీని భావమేమి తిరుమలేశ" యని యస్మదాదులు సందేహాందోళిత మనస్కులై యుఘ్నూత లూఁగుచుందురు.

వివరించిచూడ సృష్టికార్యమే యజ్ఞరూపమున జరిగినట్లు కానవచ్చును. పురుష సూక్తమును దైత్తిరీయమునందలి "ప్రజాపతి రాత్మనో వపాముత్ఖిదత్" ఇత్యాది వాక్యములును గభీర భావముల వ్యక్తిపరచుచున్నవి. దయామయుఁడగు పరమేశ్వరుడు తన శరీరమును యాగము కావించి సృష్టిచేసెను. ఆహా! యెట్టి మహత్తరాశయము. యేసుక్రీస్తు తన శరీరమును బలి సమర్పించి పాపులకు గతి నొసంగెను కదా! ఆత్మయాజీ స్వారాడ్భవేత్॥ అను మనువాక్యమును స్మరణకుఁ దెచ్చుకొనవలయును మస్తిష్కము పురోడాశమనియే పురుష శిరస్సున నెనిమిది కపాలము లుంటంజేసి "యాగ్నేయ మష్టాకపాలం నిర్వపతి" యను నిట్టి వాక్యముల కుపపత్తులు భాష్యముల వివరింపఁ బడియుండెను. నరమేధాది దురాచారములకు కూడ వేదము తావొసంగెనని యపభ్రమలు పొందుటకంటెఁ బురుషజీవిత మొక యుత్కృష్ట యాగరూపమని భావించుట సర్వసమంజసము. ఇట్టి క్లిష్టసమస్యల నూహించి విప్పుట బహుళాయాససాధ్యమని విజ్ఞులకు గోచరింపక మానదు. బైబిలు గ్రంథమందుగూడ నరమేధ ప్రశంస గలదనుటయు భగవంతునికి దనుజుని బలిగా నీయ సమకట్టిన వాని మందలించి భాగపశువు నొసంగుటకై హెచ్చరించిన బైబిలులోని భగవద్వాక్యమును స్మరించిన నిట్టి భావము లన్ని మతగ్రంథము లందును కలవనియు వాని గూఢమర్మము లెఱుంగని మనకు వింతగఁ దోచినను నవ్వానివలన నా గ్రంథముల సత్యత కించుకేనియు న్యూనత వాటిల్లదని బుద్ధిమంతులకుఁ దోపకమానదు. సృష్టియందలి నిగూఢ రహస్యముల దృశ్య ప్రదర్శనములే యాగ సంస్కారములుగఁ కన్పట్టకమానవు. అలౌకిక విషయము లగుటను మానవ బుద్ధికి సులభముగా గోచరింపనేరవు గ్రంథవిస్తరభీతి నీ విషయ మింత టితో ముగింపవలసి వచ్చినది.

ఆర్యవిజ్ఞాన సంపద

ఆర్యవిజ్ఞాన సంపద వేదములఁ గానవచ్చునంతవఱకు నతి మానుషముగఁ దోపకమానదు. వైదిక మంత్రార్థముల వివరించుపట్ల నార్యవిజ్ఞానమును బ్రకటించు తఱి నార్యులకు కృషి వాణిజ్యాది పరిశ్రమముల ప్రావీణ్యము కలదనియు ఖనిజ లోహాది సాధన సంపద గలదనియును నెడారులను పచ్చికబయళ్ళను పశుచారణ వృత్తితో చర్యజరుపు వారలుకాక నగర పురాదిస్థాఁర ప్రతిష్ఠానములు కలవారై సంఘీభావమున రాష్ట్ర సంపదలుకూడ కలవారలనియు నుడువుట యాశ్చర్య జనకములు కాకమానవు. అల్ప మేధస్కులగు మనుజుల విజ్ఞానసీమ యెక్కడ! త్రికాలవేత్తలు నతీంద్రియార్థ ద్రష్టలునగు నార్యమహర్షుల విజ్ఞాన సంపద

యెక్కడ! పాశ్చాత్య సంఘములవలె ఘుణాక్షర న్యాయమున సాంఘికవృత్తి శీలనమున నార్యసంఘ మేర్పడినదికాదు. చిరస్థాయియై పటిష్ఠమై ద్రఢిష్ఠమై సర్వాంగ సుందరమై యన్యుల కజేయమై శాశ్వత శశ్వద్ధర్మముల బ్రతిష్ఠింపఁ బడినది యార్యసంఘము. ఆర్యజాతీయాంతరాత్మ తేజః పుంజచ్ఛటలే వేదరాశి. అట్టి సనాతన ధర్మనిబద్ధమగు నార్యజాతియం దంతఃకలహములఁ బెంచి వర్ణసంకర కారకులగు వారలు నారకీయ జనములని వేఱుగఁ జెప్పనేల? యుగానుసరణముగ ధర్మగ్లాని యొకవేళ గలిగినను నైసర్గికదీప్తిచే పునరుద్ధారమును గొనుశక్తి యార్య జాతియం దంతర్భావము నొందియున్నది. మానవ ధర్మశాస్త్రము మానవకోటి కంతకును బ్రమాణము. అందలి ధర్మసూక్ష్మములు బాగుగ దిలకించుచో నేఁటికి ననుభవ గమ్యములు. మానవ ధర్మశాస్త్ర మహిమమును సాంఘికశాస్త్ర సంబంధ మునఁ దిలకింప నిచ్ఛగించునెడల దానిని గుఱించి పండిత శ్రేష్ఠులగు బాబు భగవాన్‌దాసు మహాశయుల గ్రంథమును దిలకింపుఁడు. మనుధర్మశాస్త్ర మేమి పాపము చేసెనో దానిని దగులఁ బెట్టుటకై కొందఱు యత్నములఁ జేయుచుండిరి. కాని యది తగులఁబడనేరదు. వర్ణాశ్రమధర్మ మార్యజాతికి సంపూర్ణ లక్షణము. మానవజాతి యెద్దియేని యొక విధమున నీ చాతుర్వర్ణ్య విభాగసృష్టి నంగీకరించు చున్నది. నైసర్గిక విభాగమును బోనాఁడి యాగంతుక పరిస్థితుల నవలంబించుచో నీరు పల్లమెఱింగిన దెఱఁగున యుగాంత మందయిన వర్ణవిభాగము కాక మానదు. ద్వంద్వాతీతులును నాత్మవంతులును నహం బ్రహ్మాస్మి సోహం బ్రహ్మ సర్వం ఖల్విదం బ్రహ్మ'' యను మహా వాక్యార్థముల ననుభవమునకుఁ దెచ్చికొనిన విజ్ఞానఘనులు నగు వారలకు విధినిషేధములు లేవు. అత్యాశ్రములు వారలు. వ్యావహారిక దశయందు మాత్రము సృష్టితోఁగూడ వర్ణాశ్రమ ధర్మ ముండునది యని గ్రహింపక తప్పదు. గాంధిమహాత్మునివంటి యత్యాశ్రమియును వర్ణాశ్రమ ధర్మము లుండి తీరవలయునుగాని యైచ్ఛిక రూపమునఁ బునస్సృష్టి కావలె ననియెను. ఇది కేవలము ప్రమాద జనితమని యాస్తికులు నమ్ముదురు.

వైదిక వాఙ్మయము

వేదరాశి యనంతమనియు నపారమనియు బైని జెప్పియుంటిని. కర్మాంగోప యుక్తములగు కొలది సంహితా బ్రాహ్మణములు మాత్ర మామ్నాయ దశఁ జెందియున్నవి. మన దౌర్భాగ్యవశమునఁ దక్కినవి ఖిలములైనవి. మన కగోచరములుగ నున్న వింకెన్ని కలవో మన యూహల కతీతములు. బాబు భగవాన్ దాసు పండితులు ప్రకటించిన ప్రణవవాదమను నుత్కృష్ట గ్రంథపీఠికలో వారు

తెలయఁపరచిన తెలుఁగున నంధుఁడగు నొక పండితుఁ డా గ్రంథము నంతటిని మఱియు ననేక గ్రంథములను ధారావాహినిగా నిరర్గళముగ నొప్పగించువాఁడఁట. ఆయనవలన ఋగ్వేదమునం దొకలక్ష ఋక్కులును వానికి నమిత సంఖ్యగల మహేంద్రభాష్యాది భాష్యములు నున్నట్లును, ఇట్లే యల్పములని మన మనుకొను చున్న పెక్కు గ్రంథములకు శాస్త్రములకు శ్లోకగదాత్మకములగు పెక్కు భాష్య ములు కలవనియు వాని నన్నిటి నాయంధుఁడగు మహనీయుఁడు జిహ్వాగ్రమున నుంచుకొనెననియును వివరించిరి. ఇది యొక యచ్చెరువుకాదు ఆర్యసంతతి యొక్క మహాభాగ్యమిదియే. మనదురదృష్టవశమున పెక్కులమూల్య గ్రంథ ములు మృగ్యములయినవి. కొన్ని విదేశగతము లయినవి కొన్ని భూగర్భ మునం దిమిడియున్నవి మఱికొన్ని పరశురామప్రీతిని బొందినవి సంస్కృత వాఙ్మయమపారజలరాశి. వైదికవాఙ్మయము వాస్తవముగా ననంతమే. "వేదాక్ష రాణియావంతి పఠితాని ద్విజోత్తమైః। తావంతి హరినామాని" యనునార్యోక్తి మృష కానేరాదు. అథర్వణ సంహితను కొన్ని కల్పసూత్రాది గ్రంథములను నచ్చొత్తింపించి మనకు గానుకనిచ్చిన పాశ్చాత్యపండితులు మనకు వందనీయులే. కాని వేమనచెప్పినదియే వేదమని మాత్రము విశ్వసింపరాదు. విధర్ములును విదేశీ యులు నగువిద్వాంసులే తమజీవితముల ధారవోసి యిట్టి పరిశ్రమము చేయుచుండ భారతీయు లుదాసీనులయి యుంట కడుంగడు శోచనీయము. గ్రంథకర్తలగు మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు సంస్కృత వాఙ్మయ చారిత్రమును రచి చి గోచరించెడు గ్రంథరాజముల పరిచయమును బ్రశస్తిని మనకుఁ జూపినందులకు మనకృతజ్ఞతకు పాత్రులు. వేదములు మూఁడు మాత్రము మొదట నుండెననియు నాథర్వణశ్రుతి యాధునిక మనియు నెంచుట సరిగాదని నామదికిఁ దోచుచున్నది. త్రయీశబ్దము సంఖ్యను మాత్రమిచట నిర్దిష్టము చేయదు, చత్వారో వేదాః। అను ప్రామాణ్యవచనము కలదు. యజ్ఞోపయుక్తములగు వేదములు మూడగుటను ప్రధానములుగ గణింపఁబడినవి.

అగ్నివాయురవిభ్యస్తు త్రయం బ్రహ్మసనాతనమ్।
దుదోహయజ్ఞ సిద్ధ్యర్థమ్ ఋగ్యజుస్సామలక్షణమ్ ॥

అని మనువచనము.

దాశతయ్యీ యని ఋగ్వేదమున కొక నామాంతరము కలదు. దాశతయ్యీ యనుశబ్దము వలన ఋక్కులసంఖ్యయు తేటపడును. ఋగ్వేదాధ్యయనమున

కత్యంతోపయుక్తము లగు పది గ్రంథములను నిరంతరపాఠముగ పఠనముచేసిన వారలే దశగ్రంథాలవారైరి. వేదవిభాగమును జేసి వ్యాసులు అనర్థనామధేయము కలవారై వేదవ్యాసులయిరి. ఋగ్వేదమునను సామవేదమునను యజుస్సులున్నను యజుర్వేదమున ఋక్సామములున్నను బాహుళ్యవశమున నాయాయిసంజ్ఞలని శాయనాచార్యులనిరి. అత్యల్పమేధావంతులగు మనుజులకు దుష్కరమైనందున వేదరాశి విభజింపఁబడినది. ప్రధాన ఋత్విగ్గణములయొక్క కర్మవిశేషములనుబట్టి విభాగమేర్పడెను.

ఋగ్వేదేన హోతా కరోతి।
యజుర్వేదే నాధ్వర్యుః।
సామవేదే నోద్గాతా।
సర్వైర్బ్రహ్మ ॥

అనువాక్యమున బ్రహ్మ యాథర్వణము గూడ దెలిసి యధ్వరరక్షణము చేయఁగలవాఁడై యుండవలయునని గోభిలసూత్రమునఁ గలదు సత్యవ్రత సామశ్రమిగారి నిరుక్తపర్యాలోచనమును గ్రంథమును జూడుఁడు విశదమగును. యజ్ఞనిర్వర్తనము కొఱకు మూఁడువేదముల యావశ్యకతయుఁ గలదు. నాల్గవవేదము యజ్ఞరక్షణముకొఱ కగును. శాంతికపౌష్టికాభిచారములయందుమాత్ర ముపయోగముగల యాథర్వణముయొక్క వ్యాప్తి సంక్షిప్తమైన నొక యాశ్చర్యము కానేరదు. ఋగ్వేదమునందలి ఋక్కులన్నియును యాజ్యాపురోను వాక్యలుగా నుపయోగింపఁబడవలసినవిగా నున్నవి. కొలది ఋక్కులుమాత్ర మట్లుపయోగింపఁబడుచు మఱికొన్ని యాశ్వినాదిశస్త్రములుగా పఠింపఁబడుట కల్పసూత్రములను నను క్రమణికల ననుసరించి కానవచ్చుచున్నది. "భూః" అను వ్యాహృతివలన ఋగ్వేదము వైశ్యజాతియు నుత్పన్నము లయినవి. "భువః" అన దానివలన యజుర్వేదము క్షత్రియులును, "సువః" అనుదానివలన బ్రాహ్మణులును సామవేదమును నుత్పన్నములు. గార్హపత్య, దక్షిణ, ఆహవనీయాగ్నులును. గాయత్రీ త్రిష్టుప్, జగతీ చ్ఛందస్సులును ప్రాతర్మాధ్యందినసాయం సవనములును రథంతర వామదేవ్య బృహత్ సామములును పరస్పరసంబంధము గలిగియున్నవి. ఈ విషయము నిరుక్తమునదైవత కాండమునను నుపనిషత్తులను బ్రాహ్మణములను బాగుగఁదెలియఁదగును అగ్ని వాయువు ఆదిత్యుడు నీ మూఁడు వేదములకుఁ బ్రధానదేవతలు ఆదిమంత్రముల సూచింపఁబడిరి. అగ్నిమీళేపురోహితమ్ ॥ ఇషేత్వోర్జేత్వావాయవ స్థోపాయ

వస్థ॥ అగ్న ఆయాహివీతయే గృణానోహవ్యదాతయే॥ అథర్వణమున శాంతి కరము లగునుదకము లాదిని పేర్కొనఁబడినవి. బ్రహ్మయజ్ఞక్రమము దీనినను సరించినదే. యజ్ఞం వాతా దారభే, అని యధ్వర్యుఁడు మొదలిడును. అగ్నివాయు సూర్యులు వాస్తవముగ నొకదేవతయే. స్థానభేదమువలన నామాంతరములు. అగ్ని, దేవతలలో నవముఁడు విష్ణు వధికుడు. అగ్ని దేవతలలో మొదటిసృష్టి. అగ్నిం దేవతానాం ప్రథమ మస్పృజత పాశ్చాత్యుల సృష్టివిధానశాస్త్ర మెంత చక్కఁగ నిట నిరూపింపఁబడినదియో చూడుడు. భూమ్యాది గ్రహమండల ములు మండుచుండు వాయురూపములయి యుండి ద్రవరూపమయి పిదప ఘనీభ వించిన వఁట (Nebular Theory) అగ్నిః పూర్వ రూపంఆదిత్య ఉత్తరరూపం। ఆపః సంధిః। వైద్యుతస్సంధానమ్'' జ్వలనరూపమగు (నగ్నివాయువు) ఆదిత్య రూపమగు ప్రాణవాయువును, వైద్యుతము (Electricity) వలన సంధానము చేయఁబడి సంధిరూపమగు నుదకము లేర్పడినవి. విజ్ఞాన శాస్త్రమున Electroly-sis యెలెక్ట్రొలిసిస్ (H_2O = water) అని ఋజువు చేయఁబడిన విషయమిదియే. ఆదిత్యుడు ప్రాణవాయు స్వరూపమని పాశ్చాత్యు లంగీకరించియే యున్నారు. సర్వ భూత ప్రాణసమష్టిమూర్తియే యాదిత్యుఁడు. "యోఽసౌ తపన్నుదేతి। ససర్వే షాంభూతానాం ప్రాణానాదాయోదేతి.'' కావుననే బ్రహ్మ హిరణ్యగర్భుఁడు త్రయీ మయుఁడు విశ్వమూర్తి త్రిమూర్త్యాత్మకుఁడు జగచ్చక్షువు కర్మసాక్షియునై యున్న వాఁడు. "అగ్నౌప్రాప్తాహుతిస్సమ్య గాదిత్య ముపతిష్ఠతే" ఆదిత్యా జ్జాయతే సృష్టిః ''భూమిం పర్జన్యా జిన్వంతి దివం జిన్వం త్యగ్నయ'' ఇతి ఇత్యాది వాక్యము లూహ్యములు. సహస్రగ్ం సూర్యతాయా ఇతివైశంపాయనః" ఇట్లనేక బ్రహ్మాం డాధిపతులగు సూర్యులు కలరను పాశ్చాత్య సిద్ధాంతము దృఢతర మగుచున్నది.

In the beginning there was the deep.
The Spirit of the Lord moved over the deep.

(*The Bible, Genesis.*)

ఇది బైబిలులోని ప్రథమవాక్యము సృష్టిని దెలుపునది. దీనితో శ్రుతి వాక్యములఁ సరిపోల్చి చూడుడు.

అంభస్యపారే భువనస్యమధ్యే నాకస్యపృష్ఠే మహతో మహీయాన్.
శుక్రేణజ్యోతీగ్ంషి సమను ప్రవిష్టః ప్రజాపతిశ్చరతి గర్భేఅంతః।

"హిరణ్యజ్యోతిః సరిరస్యమధ్యే"
ఇమే వై లోకాః అపాగ్ంరసః ॥
హిరణ్యగర్భంపశ్యత జాయమానం॥

ఇత్యాదివాక్యముల తాత్పర్యము నించుక నిదానించి తిలకించినచో నిజము తేటపడును. దిక్ప్రదర్శనముగా నింతవఱకు నాకుఁదోఁచిన వానిని సంగ్రహించి వ్రాసితిని. ఇందులేనిదందునులేదు అందుగల దిఁదునుగలదు. ఇందులేనిదెందు లేదనునార్యోక్తి స్పష్ట మగుచున్నది. కావున వేద మీశ్వరస్వరూపము నీశ్వర నిశ్వాసరూపము నగుటచే జగత్సృష్టి కారణమనుటలో నెట్టి సంశయము నుండరాదు. ఏతౌవై సూర్యాచంద్రమసౌర్మహిమానం బ్రాహ్మణోవిద్వా నభిజయతి। బ్రహ్మణో మహిమానమాప్నోతి। అనువాక్యముల యర్థమును దేవయానపితృయాన మార్గములు గలుగు నుత్తరాయణ దక్షిణాయన శుక్లకృష్ణ పక్షములగతియు నిడాపింగళా సుషమ్నలతత్వమును జీవునకు బ్రహ్మభావమును బోధించును. ఇట్టి యమూల్యవిజ్ఞాన ఖనియగు వేదరాశి మనపాలిటి భాగ్యసంపద కావున నగణిత కాలమునుండియు స్వరాక్షరపద భ్రంశములు లేకుండ కేవలము శ్రుతిరూపమున బెద్దలవలన కాపాడు కొనఁబడుచు వచ్చుదానిని భద్రపరచుకొని యిహపరముల సాధించు చతుర్వర్గ పురుషార్థముల వృద్ధినొంది యార్యసంతతి తమయమోఘ విజ్ఞానసంపదల దిక్కుల వెద చల్లి మానవాళియజ్ఞానతిమిరమును బటాపంచలుకావించి తన నైసర్గిక దివ్యప్రభా రింఛోళితేజః పుంజముల ముల్లోకముల నావరించి విలసిల్లుఁగావుతమని వేదమూర్తిని వేఁడుకొనుచు నింతటితో విరమింపఁదలచినాఁడను.

శ్లో॥ నమస్తే గార్హపత్యాయ।
నమస్తే దక్షిణాగ్నయే।
నమ ఆహవనీయాయ।
మహావేద్యై నమోనమః॥

కాండద్వయో పపాద్యాయ।
కర్మబ్రహ్మ స్వరూపిణే।
స్వర్గాపవర్గ రూపాయ।
యజ్ఞేశాయ నమోఽస్తుతే॥

ఓమ్ ॥ సహ నావవతు ।

సహ నౌభునక్తు ।

సహ వీర్యంకరవావహై ।

తేజస్వి నా వధీత మస్తు

మా విద్విషావహై ॥

ఓం శాంతిః ! శాంతిః !! శాంతిః !!!

ఓం తత్సద్బ్రహ్మార్పణమస్తు

ఆంగిరస ఫాల్గుణ పూర్ణిమా
భానువారము
విశాఖ పట్టణము
12 మార్చి 1933.

విబుధ విధేయుఁడు
భారద్వాజ గోత్రుఁడు
ప్రభల లక్ష్మీనరసింహము
(B. A. B., L. Advocate)

ఏతచ్చరిత్రరచనోపయుక్త గ్రంథపట్టిక

సంస్కృత గ్రంథములు, సభాష్యములు సవ్యాఖ్యానములు

1. అథర్వసంహిత సేవకలాల ప్రతి,
   శంకరపాండురంగ ప్రతి
2. అమరకోశము
3. అష్టాధ్యాయి, పాణిని
4. ఆపస్తంబ శ్రౌత, గృహ్య,
   ధర్మసూత్రములు
5. ఆశ్వలాయన శ్రౌతవృత్తి
6. ఋక్ప్రాతిశాఖ్యము, శౌనకుడు ?
7. ఋగ్విధానము
8. ఋగ్వేదసంహిత,
   మాక్సుముల్లరు ప్రతి
9. ఐతరేయబ్రాహ్మణము
10. ఐతరేయారణ్యకము
11. కర్ణాటచ్ఛందోంబుధి, నాగవర్మ
12. కాండానుక్రమణి
13. కాత్యాయన వార్తికములు
14. కౌషీతకి బ్రాహ్మణము
15. గోపథబ్రాహ్మణము
16. గౌతమ ధర్మసూత్రము
17. చరణవ్యూహము
18. చరణవ్యూహ పరిశిష్టము
19 ఛాందోగ్యోపనిషత్తు
20. తంత్రవార్తికము, కుమారిలభట్టు
21. తాండ్యబ్రాహ్మణము
22. తైత్తిరీయసంహిత
    కృష్ణయజుర్వేదము
23. తైత్తిరీయబ్రాహ్మణము
24. తైత్తిరీయారణ్యకము
25. తైత్తిరీయోపనిషత్తు
26. తైత్తిరీయ ప్రాతిశాఖ్యము
27. దేవీభాగవతము
28. నారదశిక్ష
29 నిరుక్తము, యాస్కుడు
30 నృసింహ తాపిన్యుపనిషత్తు
31. న్యాయసూత్రములు
32 పరాశరస్మృతి-మాధవీయవ్యాఖ్య
33. పూర్వమీమాంసాదర్శనము,
    శబరస్వామి భాష్యముతో
34 ప్రాకృత ప్రకాశము, వరరుచి,
   డాక్టరు వైద్యాగారి పీఠికతో
35 బృహదారణ్యోపనిషత్తు
36. బృహద్దేవత
37. బోధాయన గృహ్యసూత్రములు
38. బ్రహ్మసూత్రభాష్యము,
    శంకరాచార్య కృతము
39. భాగవతము
40 మత్స్యపురాణము
41 మనుస్మృతి
42. మహాభారతము
43 మహాభాష్యము, పతంజలి
44 మాండూకోపనిషత్తు
45 ముండకోపనిషత్తు
46 ముక్తికోపనిషత్తు
47 యాజ్ఞవల్క్యస్మృతి
48 వంశబ్రాహ్మణము
49. వాజసనేయ సంహిత
50. వాయుపురాణము
51 వాల్మీకిరామాయణము
52. విష్ణుపురాణము
53 వేదాన్త పరిభాష
54. వైఖానసూత్రము
55. శతపథ బ్రాహ్మణము

56. శుక్లయజుః ప్రాతిశాఖ్యము కాత్యాయనుఁడు
57. షడ్భాషాచంద్రిక చెరుకూరి లక్ష్మీధరశాస్త్రి
58 షడ్గురుశిష్యుని వేదార్థదీపిక
59 సర్వానుక్రమణి
60. సాంఖ్యకారికలు
61. సిద్ధాన్తకౌముది భట్టోజీదీక్షితులు
62 సూర్యసిద్ధాన్తము, భాస్కరాచార్యులు
63. లిఖిత సంస్కృత గ్రంథవిషయ వివరణ పట్టికా సంపుటములు

౧. తంజావూరు మహారాజ లైబ్రరీ
౨ మదరాసు ఓరియంటల్ లైబ్రరీ
౩. బొంబాయి ,,
౪. కలకత్తా ,,
౫. లండన్ ఇండియా ఆఫీసు ,,

ఆంధ్ర గ్రంథములు

1. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము కొ వెం. లక్ష్మణరావుగారి "అక్షరములు అథర్వవేదము" అను వ్యాసములు
2. వేదభూమి అ. వెం. చలపతిరావు గారిది
3. వైదిక నిలయము
4. వేదకాల నిర్ణయము
తిలక పండిత గ్రంథముల యాంధ్రానువాదములు మా. సత్యనారాయణ శాస్త్రి కృతములు

ఆంగ్ల గ్రంథములు

1. 'ఆర్యుల యుత్తరధ్రువ నివాసము' 'The Arctic Home in the Vedas' లోకమాన్య బాలగంగాధర తిలక పండితులు.
2. డాక్టరు ఇసాక్ టైలరు పండితుని 'Origin of the Aryans'
3. ష్లెగల్ పండితుని 'Origin of the Hindus.'
4. బన్సెన్ పండితుని 'Outlines' Vol. 1.
5. మాక్సుముల్లరు పండితుని 'Lectures on the Science of Language'
6. మెగ్డోనలు పండితుని 'History of Sanskrit Literature.'
7. గోవెన్ పండితుని 'History of Indian Literature.'
8. లార్డ్సు ఎల్ఫిన్స్టన్ పండితుని 'History of India.'
9. మూయిర్ పండితుని 'Original Sanskrit Texts' Vol. II.
10. చింతామణి వినాయక వైద్య పండితుని 'History of Sanskrit Literature.'
11. బర్నెలు పండితుని 'South Indian Palaeography.'
12. మాక్సుముల్లరు పండితుని 'History of Ancient Sanskrit Literature.'
13. మాక్సుడంకరు పండితుని 'History of Antiquıty.'
14 గోల్డుస్టూకర్ పండితుని 'Panini' his place in Sanskrit Literature.'
15. R. G. Bhandarkar Commemoration Vol.
16. కాల్డువెల్లు పండితుని 'Comparative Grammar of the Dravidian Languages.'
17. Journal of R. A. S. Vols. II, V, XVI.
18. పార్గిటర్ పండితుని 'Ancient Indian Historycal Traditions.'

విజ్ఞప్తి

సంస్కృత కవిజీవితము, ఆంధ్రభాషానుశాసనము మొదలగు బహు గ్రంథములు రచియించి చిరకాలముగా సంస్కృతాంధ్ర భాషాసేవ యొనర్చుచున్న విఖ్యాత పండితులగు బ్రహ్మశ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు నిర్మించిన యీ వైదిక వాఙ్మయ చరిత్రమును ససాకల్యముగాఁ జదివి సంస్కృతభాషా వాఙ్మయ చరిత్ర ప్రశంసా రూపముగా సంతోష పూర్వకముగాఁ బాఠక లోకమునకీ విజ్ఞప్తి యొనరించు భాగ్యము నా కబ్బినది. ఉదారహృదయులగు పాఠకోత్తములిందలి గుణము గ్రహింతురుగాక.

గీర్వాణ వాఙ్మయ చరితమునకుఁ దొలుత దారితీసినవారు పాశ్చాత్య పండితులు. అందు ప్రధానముగా శార్మణ్య దేశీయ సంస్కృత పండితులు. వారు సంస్కృత సారస్వతేతిహాస విషయక గ్రంథము రచియించిన పిమ్మటనే భారతీయ పండితుల దృష్టి యటు ప్రసరించినది. ఇంచుమించు రెండు శతాబ్దములనుండి పాశ్చాత్యులు గీర్వాణ వాఙ్మయమున కఖండ సేవ యొనరించుచున్నారు. నిష్పాక్షిక దృష్టితో నీ విషయముం దలఁచుకొని నపుడెల్లఁ బ్రాజ్ఞుఁడగునే భారతీయుని మనంబున నైన నాశ్చర్యము, లజ్జ కృతజ్ఞత ముప్పిరిగొనక మానవు. సంస్కృత సారస్వతము తత్పూర్వము పాశ్చాత్యుల కంతగాఁ దెలియదు. తద్వాఙ్మయముం బరివేష్టించియున్న యాచ్ఛాదనమును పాశ్చాత్యపండితులు 150 సంవత్సరముల క్రిందటఁ దొలఁగించి యుండిరి. దీనినే వారు ('Discovery of Sanskrit') అను చుందురు.

భారతీయసారస్వత మేశాఖయందుఁ జూచిన నపారత్వముం బ్రదర్శించునని 'సర్ విలియమ్ జోన్స్' ('Sir William Jones) పండితుఁడు నుడివియున్నాడు.

గీర్వాణభాషా వాఙ్మయముల వైశిష్ట్యమును మఱియొక పాశ్చాత్య సంస్కృత పండితుఁ డిట్లు నుడివియున్నాఁడు.

"To the Sanskrit, the antiquity and extent of its literary documents, the transparency of its grammatical structure, the, comparatively primitive state of its accent system and thorough grammatical treatment it has early received at the hands of native scholars, must ever secure the foremost place in the comparative study of Indo-Aryan Researches"

'సర్ మోనీర్ విలియమ్స్' (Sri Monier Williams) అను పాశ్చాత్య సంస్కృత పండితుఁడు గూడ సంస్కృత వైశిష్ట్యమును స్వనిర్మితమగు "ఆధునిక హైందవదేశము" అను గ్రంథరాజమునఁ జక్కఁగ విశదీకరించి యున్నాఁడు,[1] అట్లే శార్మణ్యదేశీయ విద్వత్కవికంఠీరవుఁడును, విమర్శకాగ్రేసరుఁడు నగు "శ్లెగెల్" (Schlegel) పండితుఁడు తన 'సారస్వతేతిహాస విచారము' ను గ్రంథమున సంస్కృతభాషా ప్రాశస్త్యము నుగ్గడించియున్నాఁడు.[2]

వైదికవాఙ్మయమునందలి లిఖితగ్రంథములను సంపాదించి, ముద్రించి, వైదిక సారస్వతాభ్యుదయమునకుఁ దోడ్పడిన పాశ్చాత్య సంస్కృత పండితులందఱకు భారతీయులు ఋణగ్రస్తులనుట నిక్కము. వారి నిర్నిద్రదీక్షచేతనే వైదిక వాఙ్మయవిషయక గ్రంథములు క్రిమికీటకములపాలు గాక సూర్యాలోకభాగ్యము వడసినవి. ప్రప్రథమమునఁ గ్రీ. శ. 13, 14 శతాబ్దులలోఁ పాశ్చాత్యదేశీయులు భారతీయశాస్త్ర విజ్ఞానవైభవమును 'అరేబియా' దేశీయులవలనఁ దెలిసికొనియుండిరి. క్రీ. శ. 16-వ శతకమునుండియు నైరోపీయ మత ప్రచారకులు భారతీయుల సనాతన భాషావాఙ్మయములం గూర్చి వినుటయే కాక, తత్పరిచయ భాగ్యముం గూడ నించించుక పొందుచుండిరి. సుమారు 3 శతాబ్దముల క్రిందట (1651 లో) 'అబ్రహామ్‌రోజర్' అను మత ప్రచారకుఁడు భర్తృహరి 'సుభాషితత్రిశతి' ని 'పోర్చుగీస్' భాషలోనికిఁ బరివర్తింపించి, దానిని 'డచ్' భాషలోని కనువదించి యున్నాఁడు, ఇతఁడు ప్రాచీనభారతీయ బ్రాహ్మణవాఙ్మయము నధికరించి ('Open door to the hidden Heathen dom') అను నొక గ్రంథముం గూడ నిర్మించియున్నాఁడు. ఐనను 150 సంవత్సరముల క్రిందటిదనుక భారతీయ మేధా సంపదం గూర్చి పుక్కిటి పురాణముగాఁ జెప్పుకొనుట దక్క ఐరోపా దేశములో సంస్కృత సారస్వత వైభవము నిదమిత్థమని యుద్ఘోషించు ప్రమాణ గ్రంథ మెద్దియు లేదయ్యె. క్రీ శ. 17-వ శతాబ్దిలో నైరోపీయుఁడగు 'నొబిలియన్' (Rev. Roberto de Nobilius) అను 'జెసూట్' మతప్రచారకుఁ డొకఁడు వేదగ్రంథ సంపాదనకుఁ బ్రయత్నించి, చెన్నపురి రాజధానినుండి 'యజుర్వేద' పుఁ బ్రతినొక పండితునియొద్దనుండి సంగ్రహించి 'ఐరోపా' తీసికొనివెళ్లి తనయొద్ద 'యజుర్వేదము'న్నట్లు ప్రచురించెను. ఇది నిజమైన 'యజుర్వేదమే' యనుకొని, సుప్రసిద్ధ ఫ్రెంచి కవీశ్వరుఁడగు 'వోల్‌టెయిర్' (Voltaire) దీనిం

1. Sri M. M. William's "Modern India."
2. History of Literature by Schlegel. P, 117.

బఠించి, ప్రశంసించి 'ఫ్రాన్స్‌దేశ రాజకీయ గ్రంథాలయము'లో దీనిం జేర్చెను. కాని యిది నిజమైన 'యజుర్వేదము' కాదు. పై భారతీయ పండితుఁ డా పేరితోఁ గల్పించిన గ్రంథము. ఇట్లే 'కోల్‌బ్రూక్' పండితుఁడు (Colebrooke)కూడ వేద సంగ్రహణమునకుం బ్రయత్నించి, మోసపోయెను తరువాత 1789 ప్రాంతముల 'పోలీర్' Colonel Polier అను నాతఁడు భగీరథ ప్రయత్న మొనర్చి జయ పురమున నాల్గు వేదముల ప్రతులను సంపాదించి వానిని 'బ్రిటిష్ మ్యూజియమ్' (British Museum) లోఁ జేర్చెను. కల్పిత వేదగ్రంథ వృత్తాంతము పాశ్చాత్య పండితులలో వేదముల విషయమై యవిశ్వాసముం బుట్టించెను. సంస్కృత సారస్వ తమే లేదను నొక యపోహ వారిలో మొన్న మొన్నటిదనుకఁ బ్రబలియుండెను. 'స్టివార్ట్' (Dugald Stewart) అను తత్త్వవేత్త సంస్కృత వాఙ్మయమేకాక, సంస్కృత భాషయు మిథ్యయేయనియు, 'అలెగ్జాండర్' దండయాత్రలకుఁ బిమ్మట 'గ్రీక్' భాషా వాఙ్మయ పద్ధతిని సునిపుణధిషణులగు బ్రాహ్మణులు సంస్కృత భాషా సారస్వతముల సృష్టించి యుందురనియు వ్రాసియున్నాఁడు. 1888 లోఁ గూడ 'డబ్లిన్' నగర పండితుఁ డొకఁడు పై యభిప్రాయమును బ్రబలముగ సమ ర్థించుచు వ్యాసము వ్రాసియున్నాఁడు.

1830 లో 'రోసెన్' పండితుఁడు (Prof. Rosen) ఋగ్వేదమునందలి కొన్ని సూక్తముల 'లండన్' నగరమునఁ బ్రచురించెను. 1838 లో నీతఁడు లండన్ నగరమునఁ బ్రచురించిన ఋగ్వేద ప్రథమాష్టకముతోడనే వైదికశబ్ద తత్త్వగవేషణము నిజముగా నారంభమైనదని చెప్పవలెను. ఈతఁ డకాల మృత్యువు వాతఁ బడుటంజేసి తక్కిన యష్టకములు ప్రచురింపఁ బడవయ్యె. కాని యితని వైదిక వాఙ్మయసేవ పాశ్చాత్య పండితుల మనంబుల నరికట్టివైచెను. దీనికి ఫలముగ ఫ్రాన్స్ దేశమున 'బర్నాఫ్' (Eugene Burnouf) పండితుని యాధ్య క్ష్యమున వేదాధ్యయనమునకు బీజారోపణ మొనర్పఁబడినది. తచ్ఛిష్య శిఖామణి యగు 'రాథ్' Prof. Rudolf Roth) పండితుఁడు 1846 లో వైదిక వాఙ్మయేతి హాసములం గూర్చి (On the Literature and History of the Veda') యొకానొక గ్రంథము రచించి ప్రకటించెను. ఇందలి కొన్ని భాగములను 1847-48 నడుమ, 'మూయిర్' (J. Muir) పండితుఁ డాంగ్ల భాషలోనికిఁ బరివర్తించి 'వంగీయాసియా పరిషత్పత్త్రిక' ('Journal of the Asiatic Society of Bengal') బ్రచురించియున్నాఁడు. 'లిడ్లే' (Lydley) పండితుని యభిప్రాయాను సార మా పరిషత్తు 1847 నుండి 'భారతీయ గ్రంథమాల' (Bibliotheca Indica) యనుపేర గ్రంథములఁ బ్రకటింప మొదలిడెను. అవత్సరముననే ఆచార్య

'రోయర్' (Dr. Roer) ఋగ్వేద ప్రథమ ద్వితీయాష్టకముల నాంగ్లానువాదముతోఁ బ్రచురించియుండెను. కాని ప్రాచ్యభారతీయ సంఘము (East India Company) వారి యాలంబమున 'మ్యాక్స్‌మ్యూలరు' పండితాగ్రణి (Porf Max Muller) సాయణ భాష్యముతోడను, 'విల్సన్' పండితుని (Porf H. H. Wilson) యాంగ్లానువాదముతోడను ఋగ్వేదమును బ్రకటించుచున్నాఁడని తెలియఁగా నతఁడా ప్రయత్నమును మానివేసెను. 1849-75 నడుమ 'మ్యాక్స్ మ్యూలరు' భట్టాచార్యుఁడు ఋగ్వేదము నాలు భాగములుగా, (టీక, శబ్దానుక్రమణికలతోఁ బ్రచురించెను. ఈతఁడే 1856-69) నడుమ ఋగ్వేద ప్రథమాష్టకమును 1873 లో ఋగ్వేదమును బూర్తిగాఁ బదపాఠముతో ముద్రింపించెను. 1877 లో 'ఔఫ్రెట్' పండితుఁడు (Prof. Th. Aufrecht) ఋగ్వేదము నంతను రోమన్ లిపిలో, ననుక్రమణికతోఁ గూడఁ బ్రకటించెను. 1848-51 నడుమ నీ వేదము ఫ్రెంచ్ భాషలోని కనువదింపఁబడెను. 1976 లో 'లుడ్విగ్' పండితుడును (Prof. Alfred Ludwig), 1876-7 లో 'గ్రాస్‌మన్' పండితుఁడును (Prof. Hermann Grassmann) ఋగ్వేదమును జార్మణ్యభాష (German) లోనికిఁ బరివర్తించి, ప్రచురించిరి. 'బోట్లింగ్' పండితుఁడును (Prof. Bohtlingk) 'రాథ్' (Prof. R. Roth) పండితుఁడును, 1853-75 నడుమ, రష్యాదేశ రాజధానియగు 'సెయింట్ పీటర్స్‌బర్గ్' (St. Petersburgh) నగరమున 'సంస్కృత జర్మన్ బృహన్నిఘంటువుం' బ్రకటించిరి. 1848-52 నడుమ 'రాథ్' యాస్కుని 'నిరుక్తము'ను వ్యాఖ్యతోడను, తన టిప్పణులతోడను ముద్రింపించెను. 1863 లో 'హౌగ్' పండితుఁడు (Prof. Martin Haug) 'ఐతరేయ బ్రాహ్మణము'ను రోమన్ లిపిలో రెండు సంపుటములుగా బ్రచురించుటయేకాక దాని కాంగ్లపీఠికానువాదములంగూడఁ బ్రకటించెను. 1864-65 లో 'స్టెన్జ్‌లర్' (Prof. Stenzler) పండితుఁ 'డాశ్వలాయన గృహ్యసూత్రము'ను జర్మన్ భాషానువాదముతోఁ గూడఁ బ్రచురించెను. ఆ సమయముననే 'ఓల్డెన్‌బర్గ్' పండితుఁడు (Prof. Hermann Oldenburg) 'సాంఖ్యాయన గృహ్యసూత్రము'ను, భాషాంతరీకరణ టిప్పణులతో, 'వీబర్' (Prof. Weber) పండితుని పత్రిక ('Indische Studien') లోఁ బ్రచురించెను. 1857-8 లో ఋగ్వేదముయొక్క 'శౌనక ప్రాతిశాఖ్యము'ను, భాష్యానువాదములతో, ఫ్రెంచ్ దేశీయ వైదిక పండితుఁడగు 'రేనీర్' (Prof. Regnier) ప్రచురించెను. 1856-69 లో దీనినే 'మ్యాక్స్‌మ్యూలరు' జర్మనీ భాషానువాదముతో ముద్రించెను. తన పత్రికలో 'వీబర్' పండితుఁడు 1857 లోఁ 'పాణినీయశిక్ష'ను, 1868 లో రోమన్ లిపిలోఁ బింగళుని 'ఛందస్సూత్రము'ను బ్రకటించెను. 'మేయర్'

పండితుఁడు (Rudolf Mayer) 1877 లో 'ఋగ్విధాన, బృహద్దేవతల'ను పీఠికతో ముద్రించెను. 1862 లో 'హాల్' విద్వాంసుఁడు (Dr. Fitz Edward Hall) ఋగ్వేదముపై 'రావణ భాష్యము'ను గొంత భాగము బ్రకటించెను (In 'Asiatic Researches') ఇట్లు వైదిక సారస్వత క్షేత్రమునఁ గఠోరకృషి సల్పిన పాశ్చాత్య సంస్కృత పండితుల మూలమున 'షడ్వింశ బ్రాహ్మణము' 'సామ విధాన బ్రాహ్మణము', శుక్ల. కృష్ణ యజుర్వేదములు', 'అథర్వవేదము', 'పాతంజల మహాభాష్యము', 'శాంకర శారీరక భాష్యము', 'రామానుజీయ శ్రీభాష్యము మొదలగు ననేక గ్రంథములు ప్రచురింపఁబడెను. మఱియు వీరు వైదిక, పౌరాణిక వాఙ్మయముల నధికరించి యనేక వ్యాసములఁ బ్రచురించియుండిరి.

పాశ్చాత్యుల వేదసమన్వయ పద్ధతి :— పాశ్చాత్య వైదిక విద్వాంసులలో 'గోల్డ్‌స్టూకర్' (Prof Theodor Goldstucker) దిగ్దంతి. ప్రాచీన వేదభాష్య కర్తలగు యాస్క, మహీధర, సాయణాదులయం దీతని కమేయ గౌరవప్రపత్తులు గలవు. వీరిలో నుత్తరోత్తరుల కంటెఁ బూర్వపూర్వులే ప్రమాణపరులని యీతని విశ్వాసము, వేదమునకుఁ దద్భాష్యవ్యాకరణ నిర్మాతలకు గాలవ్యవధి యెంత వఱకు నుండునో దాని ననుసరించి వీరియెడ మనకుఁ బ్రామాణ్యము తగ్గుచుండును. పాణినివ్రాసిన వైదికశబ్దముల వివరణమునకుఁ దత్పూర్వులగు యాస్క, గార్గ్య శాకల్య, శాకటాయనాదులు వ్రాసినదానికి భేదము పొడగట్టినచో మనము నవీనుఁ డగుపాణిని యభిప్రాయముకంటెఁ బ్రాచీనులగు యాస్కాదుల వ్రాఁతలనే ప్రమాణతరముగ నంగీకరింపవలెనని 'గోల్డ్‌స్టూకర్' పండితుని యభిప్రాయము. తక్కిన పాశ్చాత్య వైదిక విద్వాంసులలో మహారథుఁడు 'రాథ్' పండితుఁడు, వేదాధ్యాపనమునను, వైదిక వైదుష్యమునను దనతో సమానుఁడు లేఁడని యీతని యభిప్రాయము. తన సంస్కృత బృహన్నిఘంటు పీఠికలో నీతఁడు సాయణాదుల నిరసించుచు, నూతన మగుతన వేదసమన్వయ పథమును స్పష్టీకరించి యున్నాఁడు:-

(1) సాయణుఁడుఁ దనకు బూర్వము గొన్ని శతాబ్దముల క్రిందట బ్రచారములోనున్న వైదికపండితుల యభిప్రాయమును మాత్రమే క్రోడీకరించెను.

(2) సాయణాది ప్రాచీనవేదభాష్య కర్తలకంటె వేదము యొక్క సరియైన యర్థముం జెప్పుటలోఁ దాను విశేషసమర్థుఁడఁట !

(3) సాయణాదులేదైన వైదికపదమునకుఁ బూర్వపరవిచారము లేక, యాపద మాయాచోటులనెట్లు ప్రయోగింపఁబడినదో చూడక, తమకుఁదోఁచినట్లు

లర్థముంజెప్పుదురు తానన్ననో వేదమున నాపదమెక్కడెక్కడఁ బ్రయోగింపఁ బడెనో యా భాగముల నన్నిటిని గూలంకషముగ శోధించి, పిమ్మట నాపదమున కర్థము వ్రాయునఁట !

(4) వేదభాష్య కర్తలవలెఁగాక తాను వారి మార్గమున కంటెఁ బ్రశస్తతర మగు శబ్దవ్యుత్పత్తి పద్ధతింబట్టి వేదమును సమన్వయ మొనర్చునఁట !

(5) వేదద్రష్టల హృదయమును బోధపఱచుట తన పరమోద్దేశముగాని, కొన్ని శతాబ్దములనుండి యను శ్రుతముగా వచ్చుచున్న సంప్రదాయ దత్తమగు వైదికార్థమును బోధిపఱచుట కాదఁట !

పై వాక్యముల నన్నిటిని 'గోల్డ్‌స్టూకర్' పండితుఁడు తీవ్రముగా ఖండించి యున్నాఁడు ; దిఙ్మాత్రము సూచించెద :—

(1) సుప్రాచీనములగు నితిహాస సంప్రదాయముల ననుసరించియే సాయ ణుఁడు వేదభాష్యమును నిర్మించియున్నాఁడు. ఈతఁడు మిక్కిలి యాస్కుని బ్రమాణీకరించుకొని యున్నాఁడు కావున నీతనిభాష్యమున నించుక ప్రాచీనములగు సంప్రదాయార్థములు క్రోడీకరింపబడె ననుట సరికాదు. 'రాథ్' వాక్యమునకుఁ బ్రమాణములు లేవు.

(2) సాయణునికంటె దాను వేదసమన్వయమున సమర్థుఁడ ననుటకు నాతని పాండిత్యమంతయు నీతని కుండుటయేకాక, తన్నిర్మిత గ్రంథములం గూడ నీతఁడు వ్యాసంగమొనర్చి యుండవలెను. నిఘంటు నిర్మాణావసరమున 'రాథ్' సాయణ వేదభాష్యపు వ్రాత ప్రతులకొఱకు గవేషణ మొనరించియు, వానిం బడయఁజాలక, యెట్లకేలకుఁ బ్రథమాష్టకభాష్యమును మాత్రము పడయఁగల్గెను. తరువాత నీ పీఠికారచనావసరమునఁ దృతీయాష్టకభాష్యములోఁ గొంతవఱకుఁ జూచియుండు నేమో, తక్కిన సాయణభాష్యమంతయు నీతని కచుంబితమే ! ఇట్టియెడ నీతఁడు సాయణభాష్యము నంతను జూచినవానివలెనే, సాయణధిషణాతీతమగు ఘనకార్య మును దాను నిర్వహించుచుంటినని చెప్పుట యెంతసాహసమో యాలోచింపుఁడు !

(3) సాయణుఁడు భారతవర్షమున నవతరించిన మహావిద్వాంసులలో నాయక మణి ; త్రయీభాష్యనిర్మాత, ప్రధాన బ్రాహ్మణములకును, గల్పగ్రంథమునకును భాష్యకర్త, దిగ్దంతివంటి మీమాంసకుఁడు, సంస్కృతధాతువులం గూర్చి యుద్గ్రంథమును నిర్మించిన మహాశాబ్దికుఁడు. పాణినికాత్యాయనాదుల కృతులు జిహ్వాగ్ర

మునఁ గలవాఁడు భారతవర్షమున నపరశివావతారముగా నారాధింపఁబడువాఁడు: ఇట్టిమేధానిధి వేదములలో నొకేపదముయొక్క వివిధ ప్రయోగముల విమర్శింపక భాష్యము వ్రాసెనఁట! ఆయన చేయలేదని తాననుకొనిన యీ కార్యమును 'రాథ్' చేసెనఁట!

(4) కూలంకషమగు శబ్దశాస్త్రజ్ఞానము లేక, కేవలశబ్దవ్యుత్పత్తి మార్గము ననుసరించి వేదముల సమన్వయించుట దుశ్శకము. తన సంస్కృత జర్మన్ నిఘంటువులో సంస్కృత వ్యాకరణ విరుద్ధముగ నీతఁడు వ్రాసిన యపార్థములం గనుచో నీతనికిఁ గలవ్యాకరణ వైదుష్యము తేటపడును!

(౫) ప్రాచీనవేద భాష్యములఁగవేషణ మొనర్చియే సాయణుఁడు భాష్యమును రచించెను. కాని తన కించుక పూర్వకాలమునందలి సంప్రదాయము ననుసరించి వేదమును సమన్వయింపలేదు. అట్లుకానిచో వేదము సమన్వయింపనేరదు.

'రాథ్' కంటె నీతని సహగ్రంథకర్త శాస్త్రజ్ఞానమున నధికుఁడు. అట్టి వానికే పాణినీయాదులు సుబోధములు కాలేదు! ఈతనిమాట యేల? వీరి నిఘంటువులో నీతఁడు రచించిన భాగములు వ్యాకరణ దోషబహుళములుగా నున్నవి. ఇట్టి యీతఁడు సాయణునికంటె సదసద్వివేచనముగల సమన్వయకర్తయఁట!

వేదసమన్వయ విషయమునఁ బాశ్చాత్యసంస్కృత కోవిదులు భిన్న భిన్న మార్గముల ననుగమించిరి.

(i) 'బోట్లింగ్,' 'రాథ్' 'గ్రాస్‌మన్' పండితుల మత మొకటి. వీరు భారతీయ వేదభాష్యకారులను తృణీకరించిరి.

(ii) 'గోల్డుస్టూకరు,' 'విల్సన్' పండితుల మతము వేఱు; వీరి యభిప్రాయము ననుసరించి, సాయణాది భారతవర్షీయ భాష్యకర్తలే వేదముల సరిగా సమన్వయింప దక్షులు.

(iii) 'లుడ్విగ్' (Alfred Ludwig) మొదలగు పండితులు 'యాస్క' సాయణ, మహీధరాదులు పరంపరాగతమగు సనాతన సంప్రదాయార్థము నెఱిఁగిన వారగుటచే వారి భాష్యములు నిరసింపఁ దగినవికావు; కానివారు చెప్పినదే పరమార్థమని యెంచక, వారి యభిప్రాయముల బాగుగా విమర్శించి పరిగ్రహింపవలె' నని నుడివియున్నారు.

(iv) 'రాథ్' 'లుడ్విగ్' పండితుల పద్ధతులలోని గుణమును మాత్రము గ్రహించి, 'పిషెల్' గెల్డ్నర్' (Geldner) పండితులు మఱియొక మార్గమును నిర్మించిరి; వేదవేత్త కాదలచినవాడు, సాయణుని యభిప్రాయము లెంతయసంబద్ధములుగా బరస్పరవిరుద్ధములుగా, జూపట్టినను వానిని నిరసింపఁజనదు. వారి భాష్యఖండనము కేవలతుషాఖండనమువలెఁ బైకిఁ జూపట్టినను, బరిణామమున నంతస్సారప్రయోజకమే. ప్రాచ్యప్రాశ్చాత్య పద్ధతులకు సామరస్యము గల్పించి యా నూతన ఫక్కిని వేదమును సమన్వయించుట తగునని వీరి యభిప్రాయము. ఈ దృశసమన్వయ పద్ధతియే యనుత్తమమని నా యభిప్రాయము కూడ.

ఆధునిక కాలమున భారతవర్షమున సంస్కృత భాషాభ్యసనమునకుఁ బ్రోత్సాహ మొసఁగిన మహనీయుఁడు 'ఇండియా గవర్నర్ జనరల్' అగు 'హేష్టింగ్స్' ప్రభువు (Lord Warren Hastings) భారతీయులను వారి ధర్మశాస్త్రము ననుసరించి పాలించుట న్యాయమని యాతఁడు 'వివాదార్ణవసేతువ'ను ధర్మశాస్త్ర గ్రంథమును సంస్కృతముననే పండితులచే రచింపించెను. నాఁడు సంస్కృతమున జితశ్రములగు నాంగ్లపండితులు లేకపోవుటచే నిది 1776 లో 'పెర్షియన్' భాషలోనికి, నందునుండి యాంగ్లమునకుఁ బరివర్తింపఁబడెను. ప్రాచీన సంస్కృత భాషా వాఙ్మయముల నధికరించి యాంగ్లమున వ్రాయఁబడిన ప్రథమ ప్రమాణగ్రంథము, పై గ్రంథముయొక్క పీఠికయే.

పాశ్చాత్య సంస్కృత పండితులు

1. **'చార్లెస్ విల్కిన్స్' (Charles Wilkins : 1750-1836) :—** ఆంగ్లదేశ సంస్కృతి పండితులలోఁ బ్రథముఁడగు నీతఁడే 'యూరప్' దేశమునకు సంస్కృత గ్రంథ పరిచయముగలిగించిన మార్గదర్శి. 'హేష్టింగ్స్' ప్రోద్బలముననే యీతఁడు సంస్కృత క్షేత్రమునఁ గఠోర వ్యవసాయమొనర్చి 1785 లో భగవద్గీత'కును, 1787 లో 'హితోపదేశము'నకును బరివర్తనములఁ బ్రచురించెను.

2. **సర్ విలియమ్ జోన్స్ (Sir William Jones : 1746-94) :—** ఈయన పాశ్చాత్య సంస్కృత పండితులలో మహర్షి; నిశితాసిసదృశధిషణా సంపన్నుఁడు; సర్వతో ముఖపాండితీ మండితుఁడు; కలకత్తా రాజధానిలోఁ బ్రధాన న్యాయమూర్తి 28 భాషలలోఁ బండితుఁడు; 1784 లో నాసియావిద్వత్పరిషత్తును గలకత్తాలో స్థాపించెను; ప్రాచ్యవిజ్ఞాన విషయక వ్యాసములకై యొక పత్త్రికను (Journal of the Asiatic Society) నెలకొల్పెను. 1789 లో 'శాకున్తల

ము'ను 'మనుస్మృతి'ని ఆంగ్లములోనికిఁ బరివర్తించెను. ప్రాచీన సంస్కృత గ్రంథముల నాగరలిపిలో ముద్రించిన ప్రథమ పాశ్చాత్యుఁడీతఁడే. స్వయముగా నాగరాక్షరములంజెక్కి, మూసలోఁబోసి 'యూరప్'లోఁ బ్రథమమున నాగరముద్రణము నొనర్చిన మహనీయుఁడేతఁడే; హైందవశాసనములఁ బరిశోధించి యాంగ్లీకరించి భారతీయ పురాతత్త్వగవేషణమున విశేషాభిరుచింగలిగించెను; సంస్కృతము, 'జర్మన్' 'ల్యాటిన్' భాష లేకమూలకములనియుఁ బరస్పర బద్ధములనియుఁ బ్రతిపాదించెను; 'జర్మన్' 'కెల్టిక్,' 'పెర్షియన్' భాషలతోఁ గూడ సంస్కృతమునకు సంబంధ ముండి యుండునని నిరూపించెను; ప్రాచీనభారతీయ దేవతలకు 'గ్రీస్' 'రోమన్' దేవతలకు నత్యంత సామ్య మున్నదని సిద్ధాంతీకరించి యున్నాఁడు.

3. హెన్రీ థామస్ కోల్‌బ్రూక్' (Henry Thomas Colebrooke 1765-1837) :— ఆనుషంగిక శబ్దశాస్త్ర స్థాపనమునకుఁ బురాతత్త్వగవేషణమునకు మూలపురుషుఁడు. 'జోన్స్' ప్రజ్వలింపఁజేసిన ప్రాచ్యవిజ్ఞానదీపిక కీతఁడు స్నేహపూరణము జేసెను. శాస్త్రీయపద్ధతుల ననుసరించి సంస్కృతభాషా వాఙ్మయ సమాలోచన మొనరించినవారిలోఁ బ్రథముఁడు. ఈతఁడు వేసిన పునాదులమీఁదనే తక్కిన పాశ్చాత్య సంస్కృత పండితులు సారస్వతసౌధముల నిర్మించియుండిరి. భారతీయుల ధర్మశాస్త్రములు, దర్శనములు, మతములు, వ్యాకరణము, గణితము, జ్యోతిషము మొదలగువాని నధికరించి యీతఁడనేక కృతుల నిర్మించెను; 1805 లో వేదముల గుఱించి, సప్రమాణము, నుత్తమమునగు వ్యాసమును రచించి పాశ్చాత్యులకు వేదపరిచయము నొనరించిన మహోదయుఁ డీతఁడే. పెక్కువేల రూప్యములు వెచ్చించి యీతఁడు సంపాదించిన సంస్కృత లిఖితకోశ సముచ్చయము ప్రకృతము 'లండన్' నగరమునందలి భారతీయ భవనము (India Office) నలంకరించియున్నది. 19 వ శతాబ్దారంభమున 'జర్మనీ' 'ఫ్రాన్స్' దేశీయుల ననేకుల సంస్కృతమున దిగ్గంతులవంటి పండితులఁగా నొనర్చిన మహనీయుఁడు.

4. 'అలెగ్జాండర్ హేమిల్టన్' Alexander Hamilton : 1765-1824) ఇతఁడు భారత వర్షమున, సంస్కృతమునందు దృఢవ్యుత్పత్తినంది, 18(2 లో 'ఫ్రాన్స్' దేశము ద్వారమున 'నింగ్లాండు వెడలుచుండ నాఁటి రాజకీయ పరిస్థితులంబట్టి విదేశీయుఁడగు నతనిఁ గారాగారమం దుంచిరి. ఆ సమయమున నా దేశమునన్నున్న 'జర్మనీ' దేశ కవిశిరోమణి.

5. 'ష్లెగల్' (Friedrich Schlegel : 1772-1829) ఈతనియొద్ద సంస్కృతము నభ్యసించి భారతీయ భాషా విజ్ఞానములం గూర్చి ('On the Language and Wisdom of the Indians' 1808) యొక గ్రంథమును రచించెను. ఈ గ్రంథమే భాషా ప్రపంచమున నమిత సంక్షోభమును గలిగించి, చారిత్రక దృష్టిని, భాషా తత్త్వమును సమాలోచించు నూతన పథమును నిర్మించెను. నాఁటినుండియు సంస్కృత వాఙ్మయమునకు సేవ యొనరించిన పాశ్చాత్య పండితులలోఁ బ్రధానులు చాలవఱకు 'జార్మణ్య' దేశీయులే. 'ష్లెగెల్' పండితుని కృతియే యీ యఖండసేవకు మూలకందము. ఇతని సంస్కృతభాషా సేవకంటెను గూడ నీతని సోదరుఁడగు—

6. 'అగస్ట్ విల్‌హెల్మ్‌వాన్ ష్లెగల్' (August Wilhelm von Schlegel : 1767-1845) చేసిన సంస్కృత సారస్వతసేవ మిగులఁ బ్రశస్యము. 1818 లో నూతనముగ స్థాపింపఁబడిన 'బోన్ విశ్వకళా పరిషత్తు' (Bonn University) లో నీతఁడు గీర్వాణాచార్యుఁడుగా నియమింపఁబడెను. జర్మనీ దేశమునందలి గీర్వాణాచార్యులలోఁ బ్రథముఁడు (The first Sanskrit Professor in Germany), 1823 లో నీతఁడు 'భారతీయ గ్రంథావళి' (Indische Bibliothek) యను పత్రికను బ్రచురింప నారంభించి, యందు భారతీయ శబ్దతత్త్వ విచారకములగు ననేక వ్యాసములఁ బ్రచురించెను: మఱియుఁ బ్రాచీన సంస్కృత గ్రంథములఁ బ్రచురించియు, వాని ననువదించియు, శబ్దతత్త్వ విచారకరములగు ననేక కృతుల నిర్మించియు పాశ్చాత్యులకు సంస్కృతమున నన్నప్రాశన మొనరించిన మహానుభావుఁడు.

7. 'ఛేజీ' (A. L. Chegy : 1773-1832) 'ఫ్రాన్సు' దేశములోఁ బ్రప్రథమమున సంస్కృతము నభ్యసించి ప్రథమ సంస్కృతాచార్యుఁ డనఁ బరగెను. 1803-1832 నడుమ నీతఁడు 'ఫ్రాన్సుదేశ కళాశాల' (College de France) లోఁ బ్రథమ గీర్వాణాచార్యుఁడుగా నుండెను; అనేక సంస్కృత గ్రంథములఁ బ్రకటించి, యనువదించి సంస్కృతమున కనర్ఘసేవ యొనరించెను. 'ష్లెగెల్' పండితునికి సతీర్థ్యుఁడును, 'ఛేజీ' పండితుని శిష్యుఁడునగు—

8. 'ఫ్రాన్స్ బాప్పు' (Franz Bopp : 1791-1867) 'జర్మనీ' దేశీయుఁడే 1812 లో 'ప్యారిస్' నగరమున 'ఛేజీ' సన్నిధినే సంస్కృతమున నఖండ పాండితిని సంపాదించి, యత్యగాధగవేషణ మొనరించి, సంస్కృత క్రియా

పదముల రూపములను, 'గ్రీక్', 'ల్యాటిన్', 'పెర్షియన్', 'జర్మన్' భాషలలోని క్రియాపద రూపములతోఁ బోల్చుచు నొక యుద్గ్రంథమును ('Conjugations system') రచించి, 1816 లో దానిం బ్రచురించి 'తులనాత్మకశబ్ద తత్త్వశాస్త్రము (Science of Comparative Philology) అను నొక నూతన శాస్త్రమునకు శంకుస్థాపన మొనర్చెను. నేఁటివఱకు నీ శాస్త్ర మనర్గళాభ్యుదయము నందుచున్నది. అనేక సంస్కృత గ్రంథములఁ బ్రచురించుటయే కాక యితఁడు 'కోల్ బూక్' పండితుఁ డాంగ్లీకరించిన వేదములలోఁ గొన్ని భాగముల 'జర్మనీ' భాషలోనికిఁ బరివర్తించెను. ఈతని సంస్కృత వ్యాకరణములు, అకారాది సంస్కృత శబ్దకోశము ('Glossarium Sanscritum' Berlin, 1830) ను 'జర్మనీ దేశములో సంస్కృత భాషాభ్యుదయమునకు విశేష సాహాయ్య మొనరించెను. 'బాప్' పండితునికి సహాధ్యాయియు, గురువును, 'షేజీ' పండితుని యన్తేవాసియు నగు—

9 'బర్నాఫ్' (Prof. Eugene Burnouf: 1801-'52) అను 'ఫ్రెంచ్' సంస్కృత పండితుని మూలముననే యూరప్ఖండ పండితులు నిజముగా వేదాధ్యయనమునకు మొదలిడిరని చెప్పవలెను. 1832 లో 'ఫ్రాన్స్‌దేశ కళాశాల' (College de France) యందు 'షేజీ' పండితుని తరువాత నీతఁడే గీర్వాణాచార్య పీఠము నధిరోహించెను. ఈ వైదిక చూడామణి చరణ సన్నిధినే, 'బాప్', 'రాథ్', 'మ్యాక్స్‌మూలర్' మొదలగు ననేక మహనీయులు వేదాధ్యయన మొనరించి వైదిక శిరోమణులైరి. 1329-43 నడుమ 'బర్నాఫ్' 'వెండిడాడ్' (Vendidad Sade) ను బ్రకటించెను. ఐరోపా ఖండమున వేదాధ్యయనమునకు మార్గదర్శి యగుటయే కాక, ఇతఁడు 'ల్యాస్సెన్' (C. Lassen) పండితునితోఁ గలసి పాళీభావను గుఱించి యొక వ్యాసమును, బౌద్ధమత చరితమును రచించెను. 'ష్లెగెల్' (A. W. von Schlegel) పండితుని శిష్యుఁడగు—

10. 'ల్యాస్సెన్' (Christian Lassen: 1800—'76) పండితుఁడు తన కాలమువఱకు భారత వర్షమును గుఱించి తెలిసిన యుదంతమునంతయు నొక్కచోఁ గ్రోడీకరించి 'భారతీయ పురాతత్త్వకోశము' (Indische Alterthums Kunde = Indian Archaeology) అను నాలుగు సంపుటముల బృహద్గ్రంథమును 1843-62 నడుమఁ బ్రకటించెను.

యూరప్ ఖండమున సంస్కృత భాషాభ్యసనము ప్రారంభదశలో నున్న కాలమున ననఁగా 1830 ప్రాంతమువఱకుఁ, బాశ్చాత్య సంస్కృత పండితులు విశే

షముగా లౌకిక సంస్కృత వాఙ్మయమునసే కృషిసల్పుచుండిరి. 'శాకుంతలము' 'భగద్గీత' 'భర్తృహరి' 'హితోపదేశము' మొదలగునవియే ప్రాచ్యసారస్వతమునఁ బ్రధాన గ్రంథములని వారితలంపు. ప్రాచ్యవిజ్ఞానమునకు మూలకందమగు 'వేదము' గాని, 'బౌద్ధవాఙ్మయము' గాని వారికి చుంబితప్రాయము లనియే యనఁదగును. ప్రప్రథమమున వేదముల నధికరించి 'కోల్‌బ్రూక్' పండితుఁడు (1805 లో) ప్రమాణమగు వ్యాసమును బ్రచురించియే యున్నాఁడు. కాని సనాతనమగు వైదిక వాఙ్మయమును యూరప్‌ఖండమునకు సుగమముగా నొనర్ప సంకల్పించుకొని :—

11. 'రోసెన్' (Friedrich Rosen: 1805-'37) అను జార్మణ్య దేశీయ వైదికాగ్రణి, ప్రాచ్యభారత భవనము (East India House) నందలి పరస్సహస్రతాళ పత్ర గ్రంథములగవేషణ మొనర్చి ఋగ్వేద ప్రథమాష్టకమును బరిష్కరించి వైదికశబ్దతత్త్వ విచారమునకుఁ ద్రోవఁజూపెను. ఈతఁడు కాల ధర్మము నందినయచిరకాలమున నివి ప్రచురింపఁబడెను. (1838 ఈతనియకాల మృత్యువు వలన నీ గ్రంథమంతటితో నిలిచిపోయెను. 'బాప్' పండితుని శిష్యుఁడును, జార్మణ్యదేశీయ వైదికాగ్రణులలో నొకఁడునగు :—

12. 'బెన్ఫీ' (Theodor Benfey: 1809-1881) పండితులు 1848 నుండి 'గోట్టింజెన' (Gottingen in Germany) విశ్వవిద్యాలయమున గీర్వాణా చార్య పీఠము నలంకరించియుండెను. సంస్కృత వాఙ్మయమున కఖండసేవ యొనరించిన 'బ్యూలర్' పండితుఁడును, మొన్న మొన్నను గీర్త్తిశేషుఁడైన ఫ్రెంచ్ సంస్కృత పండితుఁడగు 'సెనార్' (Emile Senart) నీతనిశిష్యులే, 1848 లో నీతఁడు 'సామవేదము' ను, 1866 లోఁ దనసంస్కృతాంగ్ల నిఘంటు వును బ్రచురించెను. 'బెన్ఫీ' పండితునికి సహపాఠియు, 'బర్నాఫ్' 'బాప్' పండితుల శిష్యుఁడును, జర్మనీదేశ వైదిక చక్రచూడామణియు నగు :—

13. 'మ్యాక్స్‌మ్యూలర్' Prof Friedrich Max Muller: 1823-1900) పండితుఁడు వైదిక సాహిత్యమున కఖండసేవ యొనరించెను. 'బర్నాఫ్' పండితుని ప్రోద్బలముననే యీతఁడు తన జీవితమంతయు ఋగ్వేదాధ్యయనమునకై ధారవోసి, ఋగ్వేదమును మొట్టమొదట సాయణభాష్యముతో నాగరలిపిలో (1849-75) నడుమఁ బ్రచురించెను. సుగృహీతనామఁడు, నభినవభోజుఁడును, విజయ నగరప్రభువునగు స్వర్గీయ శ్రీ మదానంద గజపతీంద్రుని యౌదార్యమువలన నీ యుద్గ్రంథమును రెండవసారి యా పండితుఁడే 1890-92 లోఁ బ్రచురించెను. మఱియు నీతఁడు 'ప్రాచీన సంస్కృత సారస్వత చరితము,' 'భారతీయదర్శన

షట్కము' మొదలగు సద్గ్రంథముల రచించి, 'ప్రాచ్యసారస్వత పవిత్ర గ్రంథావళి' ని ప్రచురించియుండెను. ఇతఁడు తులనాత్మక పురాణతత్త్వశాస్త్రము Comparative Mythology) నకు మూలపురుషుఁడు. ఇతని సహాధ్యాయియు జర్మనీ దేశీయ వైదికపండితుఁడు నగు—

14. 'రుడోల్ఫ్‌రాథ్' (Rudolph Roth : 1821-'95) 'టుబిన్జన్' (Tubingen) విశ్వవిద్యాలయమున గీర్వాణాచార్యుఁడుగా నుండెను; 'బర్నాఫ్' పండితుని యన్తేవాసి; 'విట్నీ' (William D. Whitney 1827-'94) 'ల్యాన్ మన్,' 'గెల్డ్‌నర్' పండితుల కాచార్యుఁడు. 1846 లో నీతఁడు వైదికవాఙ్మయము, వైదికచరితముల నధికరించి (On the Literature and History of the Veda') జర్మనీ భాషలో నొక యుద్గ్రంథమును రచించి, యా దేశములో వేదాధ్యయమునకు శంకుస్థాపనమొనరించెను. నాఁటినుండియుఁ దద్దేశీయులనేకులు ప్రజ్వలితోత్కంఠతో వేదవేదాఙ్గములఁ గూలంకషముగ మథింప మొదలిడిరి. 19. శతాబ్దము. నుత్తరార్ధమున భారతీయ పురాతత్త్వ పరిశోధనము (Indian Archaeology) విశేషాభ్యుదయము నందుటకు మూలకందము 'రాథ్' పండితుఁడు.

15 'ఆటోబోయిట్లింగ్ ('Otto Bohtlingk : 1815-?) అను నిరువురు జర్మనీదేశ వైదిక పండితులు నిర్మించిన బృహత్సంస్కృత నిఘంటువే (The Sanskrit-Worterbuch') ఇది 1852-75 నడుమ 7 సంపుటములలో రష్యా రాజధాని 'సెయింట్‌పీటర్స్‌బర్గ్' (St. Petersburg) నగరము నందలి 'శాస్త్రకళాపరిషత్తు' (Academy of Arts and Sciences) వారిచేఁ బ్రకటింపఁబడెను, జర్మనీ దేశీయులెంతటి నిర్నిద్రదీక్షతోఁ గఠోరవ్యవసాయము సల్పుదురో యీ గ్రంథము నొక్కపరి యవలోకించినఁ దెలియఁగలదు.

16. 'థియొడర్ ఔఫ్రెఖ్ట్' (Theodor Aufrecht : 1822-1907.) 'మ్యాక్స్‌మూలర్' 'బెన్ఫీ' పండితుల సతీర్థ్యుఁడు : 'బాప్స్' పండితుని శిష్యుఁడు : 'ఎడింబరో' (1862-75), 'బోన్' (1875-89) విశ్వవిద్యాలయములలో గీర్వాణాచార్యుఁడు. 'మ్యాక్స్‌మూలర్' నకు ఋగ్వేద ప్రచురణావసరమున విశేషము తోడ్పడి, యది ముద్రింపఁబడుచున్న కాలముననే (1849-75) 'ఔఫ్రెఖ్ట్' పండితుఁడును ఋగ్వేద మూలమును బూర్తిగాఁ (1861-'63) బ్రచురించి వైదిక వాఙ్మయమునకు విశేషసేవ యొనరించెను. 40 సంవత్సరములు, ముద్రితాముద్రితములగు సంస్కృత గ్రంథముల సూచికల నీతఁడు గవేషణ మొనర్చి, నిర్నిద్ర

దీక్షతో (1891-1903 నడుమ) 3 సంపుటములలో సంస్కృత గ్రంథములయు, గ్రంథకర్తలయు సూచిక (Catalogus Catalogorum) ప్రచురించెను. ఈ బృహత్కోశమున నకారాదిగఁ బేర్కొనఁబడిన గ్రంథ, గ్రంథకర్తృసంఖ్య వేలుగాని వందలు గాదు. ఏదేనొక గ్రంథముయొక్క ప్రతులు ప్రాచ్యపాశ్చాత్య గ్రంథ నిలయములలో నెక్కడెక్కడ నెన్నెన్ని కలవో, యాయా గ్రంథకర్తల కృతు లెవ్వియో యిందు సూచింపఁబడెను. ప్రాచ్య సారస్వత పరిశోధకుల కిది కల్ప తరువు.

పాశ్చాత్య సంస్కృత పండితుల ధర్మమాయని వైదిక గ్రంథముల కేమి, లౌకిక సంస్కృత గ్రంథముల కేమి ప్రమాణతమములగు ప్రతులు ప్రచురింపఁ బడినవి. ప్రకృత ముపలబ్ధమగు ప్రాచీన 'గ్రీస్' దేశ వాఙ్మయ మంత వైపుల్యము గల వైదిక వాఙ్మయమును పాశ్చాత్యులు మథించివైచిరి. ఒక్క శతాబ్దిలో, 'గ్రీస్' సారస్వత, 'రోమన్' సారస్వతములకంటె విపులమగు వైదిక, లౌకిక గీర్వాణవాఙ్మయ మంతయు వీరిచే క్షుణ్ణము చేయఁబడినది. సమర్థులగు పండితు లీ వాఙ్మయమునందలి మూలగ్రంథములను, వానికిఁ బరివర్తనముల, విమర్శములఁ బ్రచురించియుండిరి. సంస్కృత వాఙ్మయమునఁ బ్రతి శాఖయందు నపారముగ గవేషణ మొనర్పఁబడెను. సర్వతోముఖముగ నభ్యుదయము నందిన హైందవ వాఙ్మయమున నన్నిశాఖలలోను పాండిత్యము సంపాదించుకొనుట యెంతటి యతి మానుష ప్రతిభాశాలికైనను దుశ్శకముగా నుండెను. హైందవ విజ్ఞాన శాస్త్రమున బహుముఖముల నొనరింపఁబడిన పరిశోధనముల ఫలములను, విజ్ఞాన సర్వస్వము వంటి యొక సర్వంకషకోశ (Encyclopaedia) రూపమున నేక ముఖముగా నొనర్చుట యత్యంతాపేక్షణీయముగాఁ జూపట్టెను. అట్టి ఘనకార్యమును దలపెట్టిన మహాత్ముఁడు జర్మనీ సంస్కృత విద్వచ్ఛిరోమణియు, సర్వంకష మేధానిధియు నగు—

17. 'జార్జి బ్యూలర్' (Dr. J George Buhler: 1837-1898) పండితుఁడు; 'బెన్ఫీ' పండితుని శిష్యుఁడు; ప్రకృతము 'ప్రేగ్' (Prague) విశ్వ విద్యాలయమున గీర్వాణాచార్యపీఠిక నలంకరించి, చిరకాలము క్రిందటనే 'జర్మనీ' భాషలో గీర్వాణ వాఙ్మయ చరితమును రచించి జగద్గీత కీర్తినొందిన 'వింటర్ నిట్జ్' పండితుడు 'బూలర్' శిష్యుఁడే. 1863 నుండి చిరకాలము 'బూలర్' బొంబాయిలోని 'ఎల్ఫిన్‌స్టన్' కళాశాలలోను, పిమ్మట 1880 నుండి 'వియన్నా' విశ్వకలా పరిషత్తు (University of Vienna) నందును గీర్వాణాచార్యుఁడుగా

నుండి, 'వియన్నా' లోనే 'విశ్వకళా పరిషత్ప్రాచ్య సాహిత్య పరిషత్తు'ను, పరిషత్పత్రిక (Vienna Oriental Journal) ను నెలకొల్పి ప్రాచ్య విజ్ఞానమున కెంతయో సేవచేసెను. భారతీయులం గూర్చి నాఁటికిఁ దెలిసిన సర్వవిషయములు-వారి చరిత్రము, మతము, దర్శనములు, సారస్వతము మొదలగున వన్నియు - బోధించు 'హైందవార్య శబ్దతత్త్వ పురాతత్త్వ విజ్ఞాన సర్వస్వము' ('Encyclopaedia of Indo-Aryan Philology and Archaeology' or briefly 'Encyclopaedia of Indo-Aryan Research') అను గ్రంథ సముచ్చయమును బ్రచురింప నీతఁ డుపక్రమించెను. ఇతని సంపాదకత్వముననే యిది 1897 నుండియుఁ బ్రచురింపఁ బడఁజొచ్చెను. ఈ బృహద్గ్రంథ నిర్మాణమునకై జర్మనీ ఆష్ట్రియా, ఇంగ్లాండు, హాలెండు, అమెరికా, ఇండియా మొదలగు దేశములలోని దిగ్దంతులవంటి సంస్కృత పండితులు నడుము కట్టిరి. ఈ గ్రంథ మకారాది కోశ రూపముగాదు; ఆయా విషయముల నధికరించి సర్వంకషముగఁ దెలుపు గ్రంథము లీ నామముతోఁ బ్రచురింపఁబడుచున్నవి. ఇది ప్రారంభింపఁబడిన యొక వత్సరమునకే 'బూలర్' కీర్తిశేషుఁడయ్యెను. ఈతని యకాల మృత్యువుచేఁ బ్రాచ్యవిజ్ఞానమునకుఁ దీరని లోటు వాటిల్లినది. ఈతని జీవిత కాలమున 9 సంపుటములు మాత్రము ప్రచురింపఁబడినవి. తరువాత నీ భారమును 'గొటింజన్' Gottingen) సంస్కృత విద్వాంసుఁడు 'కీల్‌హార్న్' (Prof. Kielhorn) వహించెను. ప్రకృత మీ ఘనకార్యమును 'ల్యూడర్స్' (Prof. H. Luders) 'వకెర్‌నగెల్' (Prof. J. Wackernagel) అను నిరువురు ప్రసిద్ధ విద్వాంసులు నిర్వహించుచున్నారు. ఈ గ్రంథములలోఁ జాలవఱకు 'జర్మనీ' భాషలోనే రచింపఁబడినవి. భారతీయులకుఁగూడఁ బోధపడు నట్లీ గ్రంథములన్నియు నాంగ్లముననే రచింపఁబడవలెనని 'బూలర్' పండితుఁ డెప్పుడును గోరుచుండెడివాఁడు. వైదిక దేవతలం గుఱించి 'మెక్‌డానెల్' (Prof A A. Macdonell) పండితుఁడు వ్రాసిన (Vedic Mythology) అను గ్రంథము, అథర్వవేదము నధికరించిన (The Atharva-veda) 'బ్లూమ్‌ఫీల్డ్' పండితుఁడు (1899) రచించిన కృతి, 'జకారయా' (Zachariae) పండితుని సంస్కృత నిఘంటు చరితము (Die Indischen Worterbucher 1897) మొదలగు ననేక కృతు లీ గ్రంథ సముచ్చయముననే ప్రచురింపఁబడినవి.

18. 'గెల్డ్‌నర్' (Prof Karl Friedrich Geldner : 185"-1929) జర్మనీ దేశీయుఁడు, 'రాథ్' పండితుని శిష్యుఁడు; 'బెర్లిన్' నగరమున (1890 - 1907), 'మార్‌బోర్' (University of Marburg) విశ్వవిద్యాలయమున

1907 నుండి) గీర్వాణాచార్యుఁడుగా నుండెను. వేదముల సమన్వయ మార్గమున 'రాథ్' మతము నీతఁడు ఖండించెచు. 'రాథ్' పండితుఁ డనేక స్థలముల వేదమున కపార్థము చెప్పెననియు నాయా భాగములకు సాయణుఁడే సరియైన యర్థము వ్రాసెననియు, నమెరికా, యూరప్‌ఖండ పండితులు సాయణ భాష్యముల నెంత హాస్య భాజనములుగా నెంచినను, వేదసమన్వయ పథమునఁ దద్భాష్య సాహాయ్యము లేక యొక పదమైనను గదల్చుట దుస్తరమనియు నీతఁడును, దన్మిత్రుఁడు 'పిషెల్' (Prof R. Pischel) పండితుఁడును వేదముల నధికరించి వ్రాసిన ('Vedische Studien') గ్రంథము పీఠికలో వ్రాసియున్నారు. వ్యాఖ్యాన్విత ముగ నీతని ఋగ్వేదజర్మన్ భాషానువాదము మొదటిభాగము 1923 లోఁ బ్రక టింపఁబడెను. ఈ యనువాదమున కాంగ్ల పరివర్తనమును బూర్తిగా 'హార్వార్డ్ ప్రాచ్యగ్రంథమాల'లోఁ (Harvard Oriental Series) బ్రచురింప 'గెల్డ్నర్' పండితుని ప్రాణమిత్రుఁడు, నమెరికాదేశ సంస్కృత విద్వాంసులలో నాయక మణియు నగు—

19 'చార్లెస్ రాక్వెల్ ల్యాన్‌మన్' (Prof. Charles Rockwell Lanman) సమకట్టినట్లు తెలియుచున్నది. ఇతఁడు 'విట్నీ' (William Dwight Whitney: 827-'94) పండితుని శిష్యుఁడు, 'హార్వర్డ్' విశ్వవిద్యాలయమున గీర్వాణాచార్య పీఠాధిపతి ; 1891 నుండి 'హార్వర్డ్ ప్రాచ్యగ్రంథమాల' యను పేరితో ననేకములగు సుద్గ్రంథములు ప్రచురించిన సుకృతి, 'మెక్‌డానెల్' పండితుఁడు పరిష్కరించిన శౌనకుని 'బృహద్దేవత' (1904, 'విట్నీ' పండితుని 'అథర్వవేదాంగ్లానువాదము' (1905), 'బ్లూమ్‌ఫీల్డ్' (Prof. Maurice Bloomfield) పండితుని 'వైదికప్రతీక' 'Vedic Concordance,' 1906) 'బెరిడేల్ కీత్' పండితుని (Prof. A. B. Keith) 'తైత్తిరీయ సంహితాంగ్లానువాదము' (1914), ఋగ్వేదీయ బ్రాహ్మణముల యనువాదము' (1920), 'వేదోపనిషత్తుల యందలి మతదర్శనములు' ('The Religion and Philosophy of the Vedas and the Uphanishads' (1925) 'కీత్' పరిష్కృతమగు 'ఐతరేయారణ్యకము,' బ్లూమ్‌ఫీల్డ్' నిర్మిత 'ఋగ్వేదీయ పునరుక్త్యనుక్రమణిక' (Rigveda Repetitions,' 1916) 'మెక్‌డానెల్' పండిత పరిష్కృతమగు కాత్యాయనుని 'ఋగ్వేదీయ సర్వానుక్రమణి' మొదలగు సుద్గ్రంథము లీ గ్రంథమాలలోఁ బ్రచురింపఁబడినవియే.

20, 'మెక్‌డానెల్' పండితుఁడు (Prof. Arthur Anthony Macdonell : 1854-1931) ఇతఁడు 'బెన్ఫీ' పండితుని శిష్యుఁడు, 'ఆక్స్‌ఫర్డ్' విశ్వకళాపరిషత్తులో గీర్వాణాచార్యుఁడు (Boden Prof. of Ssnskrit) 'బూలర్' పండితుని 'విజ్ఞానసర్వస్వమున కీతఁడు 'వైదిక దేవతలం' గూర్చి రచించిన ('Vedic Mythology' అను) కృతియు, వైదిక వ్యాకరణము' 'సంస్కృతాంగ్ల నిఘంటువు' 'వైదికనామ, విషయానుక్రమణిక' 'హార్వర్డ్ ప్రాచ్యగ్రంథమాల'లో నీతఁడు పరిష్కరించిన కృతులును సుప్రసిద్ధములే. ఇతఁడు 1928 లో 'ఆక్స్‌ఫర్డ్' నగరమున సమావేశమైన యంతర్జాతీయ ప్రాచ్యవిద్యన్మహా పరిషత్తునకు (The XVII 'Internatoinal Congrees of Orientalists') అగ్రాసనాధిపత్యము వహించెను. చిరకాలము క్రిందటనే యీతఁడు 'సంస్కృత వాఙ్మయ చరితము' నాంగ్లమున రచించెను. మొన్న మొన్న 'భారతవర్ష ప్రాచీనవైభవము' ('India's Past' 1927) అను సద్గ్రంథమును రచించి, 1931 లోఁ గీర్తి మూర్తిని ధరించెను. ఇతని శిష్యులలో నగ్రగణ్యుఁడు గురువును మఱపించెడి పాండిత్యముగలవాఁడును, 'స్కాట్‌లెండ్' నందలి 'ఎడింబరో' విశ్వకళాపరిషత్తున గీర్వాణాచార్య పీఠిక నలంకరించిన—

21 'బెరిడేల్ కీత్' (Prof. Arthur Berriedale Keith : 1879) పండితుఁడిపు డింకను సంస్కృత వాఙ్మయసేవ యొనరించుచున్నాఁడు. ప్రాచ్య విజ్ఞాన ప్రపంచమున నీతని కచుబింతమగు శాఖయేలేదఁట ! ఇతఁడు బహుగ్రంథ నిర్మాత. ఇతని 'సంస్కృత నాటకచరితము,' 'సంస్కృత వాఙ్మయ-లౌకిక-చరితము' సుప్రసిద్ధములే. 'హార్వర్డ్‌ప్రాచ్య గ్రంథమాల' లోఁ బ్రచురింపఁబడిన యీతని కృతులిదివఱకే పేర్కొనఁబడియున్నవి.

ఏడిలంగ్. వీబర్, మ్యాక్స్‌మూలర్, స్మోల్, మెక్‌డానెల్, ఎర్న్‌హార్ విట్జ్, వింటర్‌నిట్జ్, ఫ్రెజర్, మొదలగు పాశ్చాత్యదేశ పండితులును ; టి యస్. భట్టాచార్యులు, తరణీచరణ చౌదరి, ఆచార్య మాధవదాస చక్రవర్తి, చింతామణి వినాయకవైద్యపండితుఁడు, మొదలగు భరతఖండ పండితులు నిప్పటికాంగ్లభాషలో సంస్కృత వాఙ్మయము నధికరించి వేలు వేలు చరిత్ర గ్రంథములు రచియించిరి. సంస్కృతభాషలో యజ్ఞేశ్వరచిమనభట్ట పండితుఁడు 'ఆర్య విద్యా సుధాకర' మను

పేరు నొక చరిత్రము నిర్మించెను. కేదార విద్యాభూషణుఁడు వైదిక వాఙ్మయ చరితను, మహామహోపాధ్యాయ రామావతారశర్మ పాండేయులు సంస్కృతసారస్వతేతిహాసమును రచియించిరని వింటిని గాని వానిని జూచుభాగ్యము నాకు లభింపలేదు. మెక్‌డానెల్ పండితుని వైదిక వాఙ్మయ చరిత్రభాగమును పి. పి. సుబ్రహ్మణ్యశాస్త్రి యమ్. ఏ. శిరోమణి కె. యల్. వ్యాసరాయ శాస్త్రిగారును సంస్కృత భాషలో ననువదించియున్నారు. ఇది వైదిక సాహిత్యచరిత మనుపేరఁ బ్రకటితమైనది. దీనినే ఉభయభాషాప్రవీణ క్రొత్త సత్యనారాయణ చౌదరి గారాంధ్రీకరించిరి. ఇది గాక గీర్వాణవాక్ప్రపంచ మనుపేర, పిన్నంరాజు వెంకట సుబ్రహ్మణ్యశర్మగారు తెలుఁగునఁ బ్రకటించినది మఱియొకటి కలదు. కేవలము సంస్కృత వాఙ్మయచరితము లనఁదగినవి గాకున్నను, సర్. యమ్, మోనియర్ విలియమ్సు, డాక్టరు. ఏ. ఏ. మాక్డానెల్ మొదలగు మఱికొందఱు పాశ్చాత్యులు భారతీయసారస్వతము భారతీయ విజ్ఞానము మొదలగు వానినిగూర్చి గ్రంథములు రచియించి ప్రకటించియున్నారు.

ఇట్లు వైదికలౌకికరూపమైన సంస్కృత సారస్వతమునుగూర్చి పెక్కండ్రు చరిత్ర గ్రంథములు నిర్మించియున్నారుగాని వీనిలో మెక్‌డానెల్ పండితుని సంస్కృత సారస్వతచరితమే మన దేశమున నెక్కువగా వ్యాపించియున్నది. కడచిన 32 సంవత్సరములలో జరిగిన పరిశోధనలను బట్టి యిందుమార్పులు సవరణలు చేయవలసియున్నది గాని నేఁటికి నది యట్లే ప్రచురింపఁబడుట శోచనీయము. దీనిని సంస్కృతీకరించిన పి. పి. యస్. శాస్త్రిగారు వగయిరాలు కూడ దీని నట్లే యనువదించిరి గాని సవరింపలేదు. పైగా మూలగ్రంథములోనివే కాక యనువాదమున మఱికొన్ని దోషములు దొరలినవి. వీరి సంస్కృతానువాదమును సత్యనారాయణ చౌదరి గారాంధ్రీకరించుచు, పై రెంటిలోని దోషములకుఁ దోడుగా మఱికొన్ని దోషములు చేర్చిరి. ఇఁక, శర్మగారి గీర్వాణ వాక్ప్రపంచమన్నచో,[1] బహుదోష భూయిష్ఠముగానే యున్నది. అందువలన వైదికవాఙ్మయము నధికరించి రచియించిన యుత్తమచరిత్ర గ్రంథ మిదివఱకు లేదయ్యె. ఆ లోపముం దీర్పనాంధ్ర విశ్వకళాపరిషత్తువారు గుణోత్తరమును స్వతంత్ర పరిశోధన మూలకము నగు బ్రహ్మశ్రీ సూర్యనారాయణశాస్త్రిపాదుల వైదిక వాఙ్మయ చరిత్రమును బ్రచురించి, ఆంధ్రవిద్వల్లోకమునకు మహోపకృతి నొనరించిన వారైరి. శ్రీ శాస్త్రి

1. దీనిమీఁద నా విమర్శనమును, 'భారతి' మార్చి 1931, అక్టోబరు 1931, సంచికలు చూడనగును.

గారును, పాశ్చాత్యపండితులు చెప్పినదానినే వేదవాక్యముగా గ్రహింపక, అందలి గుణదోషములు చక్కఁగా విమర్శించి, తమ స్వాతంత్ర్యముం జాటియున్నారు.[1] శ్రీ శాస్త్రిచరణుల 'లౌకిక సంస్కృత వాఙ్మయ చరితమను ద్వితీయ భాగమును గూడ నచిరకాలమునఁ బ్రకటించి విశ్వకళాపరిషత్తు సంస్కృత శారదారాధన మొనరించును గాక !

ఇట్లు
పండిత పాదపరమాణువు

విజయనగరము
20-2-1938

యాయాణ్ణి వేఙ్కట వీరరాఘవాచార్యుఁడు బి. ఏ.,
అధ్యక్షుఁడు
'ఆన్ధ్ర గీర్వాణ సాహిత్య పరిషత్తు'

1. చూ. మెక్‌డానెల్, వీబరు, పండితుల యభిప్రాయముల మీఁద విమర్శనములు. పుటలు 183-184.

కృతికర్తృ విజ్ఞాపనము

ఆర్యులారా!

క్రీ. శ. 1909 మొదలుగా 1917 వఱకు నన్నుఁ దమ యాస్థాన విద్వాంసునిగా నాదరించి, ఉత్తర రామచరితాంధ్ర దశరూపకాది గ్రంథములు నాచే రచియింపఁజేసిన సంస్కృతాంధ్ర భాషాభిజ్ఞులును నాఁటి వెంకటగిరి సంస్థానాధీశ్వరులు నగు శ్రీ మహారాజా సర్ వెలుగోటి రాజగోపాల కృష్ణయాచేంద్ర బహదరు జి. సి. ఐ. ఇ. వారి పోషణమున సంస్కృత కవిజీవితము రచియించి 1911 లోఁ బ్రకటించితిని. ఆ యుద్యమమున శ్రీవారే కాక, నన్నుఁ దమ యాస్థాన పండితునిగా నాదరించి సత్కరించుచువచ్చిన నాఁటి జటప్రోలు సంస్థానాధిపతులగు శ్రీ రాజా సురభి వెంకట లక్ష్మారావు బహదరువారును, నాఁటి మసునూరు సంస్థాన ప్రభువులగు శ్రీ రాజా నారయప్పారావు బహదరువారును, ప్రస్తుత వెంత్రప్రెగడ సంస్థాన పతులగు శ్రీ రాజా సింహాద్యప్పారావు బహదరువారును, నన్ను మిక్కిలి యాదరించిరి. ఆ రాజ మహారాజులనాఁటి సమాదరణమే నేఁటి సంస్కృత వాఙ్మయ చరిత్రకుఁ బునాది యగుటచే వారు నా కొనర్చిన యుపకృతి సత్కృతుల కియ్యెడ ముందుగాఁ గృతజ్ఞత చూపుచున్నాను.

సంస్కృత కవిజీవితము పునర్ముద్రణ మపేక్షించునాఁటి కనఁగా 1916 లోనే ననంతపుర దత్తమండల కళాశాలలోఁ బనిచేయుచుంటిని. అపుడు క్రొత్తగాఁ గళాశాలకు వచ్చిన సంస్కృత గ్రంథ సంచయముఁగాంచి, సంస్కృత వాఙ్మయ చరిత్రమే రచియించి ప్రకటించెదఁగాక యని సంకల్పించి యపుడే ఋగ్వేదాది గ్రంథపఠన పరిశోధనము లారంభించితిని గాని 'శ్రేయాంసి బహు విఘ్నాని' యన్నట్లు కొంతకాల మా పని సాగునప్పటికి నేను రాజమహేంద్రవర కలాశాలకు మాఱుటయు దైవికములయిన క్లేశములపా లగుటయు, నడుమ నడుమ భీష్మప్రతిజ్ఞ, ఆంధ్రభాషానుశాసనము మొదలగు కృతులు ప్రకటించుటయుఁ గారణములుగాఁ దలపెట్టిన యాకృత్యము నిర్విఘ్నముగా జరుగలేదుకాని, ఆ యుద్యమము మాత్రము విడువలేదు.

అనంతరము 1929 మొదలుగా సుమారు రెండు సంవత్సరములు రాజమహేంద్రవరమం దుండియు, పదపడి యాంధ్ర విశ్వకళా పరిషత్కళాశా లాంధ్రాధ్యాపక పదవీ వశమున విశాఖపట్టణము వచ్చియు, తదేకదీక్ష వహించి యెట్లో

వైదిక వాఙ్మయ చరిత్ర రచనము పూర్తిగావించి నేఁటికిఁ బ్రాజ్ఞలోకమునకు సమర్పింపఁ గలిగితిని. లౌకిక వాఙ్మయ చరిత్ర రచనమును గావించుచున్నాను.

పూర్వ శాస్త్రకర్తలు కొందఱు వేదావిర్భావతిరో భావములంగూర్చి చర్చించియుఁ దుద కవి యనాదు లపౌరుషేయములనుచుఁ దత్కాల కర్తృత్వ విచారమునకు స్వస్తిచెప్పి వైదిక విజ్ఞానము విస్తరింపఁజేయు మార్గము పట్టిరిగాని తదుత్పత్తి వికాసముల విచారణము పొంతఁ బోరైరి. దానంజేసి యా విషయ మజ్ఞేయమని యూహింపఁదగియున్నది. అయినను ముందు కొందఱు పాశ్చాత్య పరిశోధకులును, తరువాతఁ గొందఱు భారతీయ విద్వాంసులును సాహసించి వైదిక విద్యారణ్యమునఁ జొరఁబడి యధిక పరిశ్రమచేసి తచ్చరిత్రము వెలువరింపఁ గొన్ని త్రోవలు త్రొక్కిరి గాని యవి యన్నియుఁ గొన్ని ప్రధాన చరిత్రాంశముల నేకీభవింపక వేఱుపడినవనుట విదితము. ఆ విషయము లెవరెట్లు శోధించిన నిదమిత్థమని నిర్ణయింప శక్యముగాని వగుటయే యందుకుఁ గారణమని చెప్పఁదగియున్నది. అందుచేఁ జరిత్ర రచనము క్లేశాతి క్లేశకరమని యెఱిఁగియు సంస్కృత వాఙ్మయ చరిత్ర మాంధ్ర వాగ్దేవి చరణ కమలముల నుపాయనముగా సమర్పించు నుత్కంఠతోఁ బూర్వ చరిత్రకర్తల మార్గములు పరిశీలించియు స్వతంత్రముగా వైదిక వాఙ్మయము పరిశోధించియు నీ చరిత్ర గ్రంథము రచియింప శక్తివంచనలేక పరిశ్రమ యొనర్చితిని. ఈ గ్రంథమున వర్ణింపఁబడిన బహువిధ విషయములును వానిం గూర్చి కావించిన చర్చలును విమర్శనములును, అందుకుఁ బ్రమాణములుగాఁ జూపిన బహు గ్రంథములలోని వాక్యములును నా పరిశోధన పద్ధతిని విశదీకృత విషయ స్వరూప స్వభావములను దెలుపకపోవు గాని, గుణగ్రహణ పారీణులగు విద్యాధికుల యామోదము తెలియు వఱకును నా కృషి సార్థక మైనదని మాత్రము తలంపఁ జాలను. అదిగాక లోకములో నెందయిన గుణముతో దోషముగూడ నుండకపోదు గావున నీ సందర్భమున—

"దృష్టం కిమపి లోకేఽస్మి న్న నిర్దోషం న నిర్గుణమ్
ఆవృణుధ్వ మతో దోషాన్ వివృణుధ్వం గుణాన్ బుధాః."

అను సూక్తిని సహృదయులగు పాఠకులకు స్మృతికిఁ దెచ్చుటకంటె వే ఱేమియు వ్రాయఁజాలను.

నేను రాజమహేంద్రవరము విడిచి విశాఖపట్టణము వచ్చిన తఱిని గావలసిన గ్రంథములు యూనివర్సిటీ పుస్తక భాండాగారమునకు వచ్చియుండలేదు. ఆ సమ

యమున బ్రహ్మశ్రీ ప్రభల లక్ష్మీనరసింహము పంతులుగారు తమవద్దనున్న వైదిక గ్రంథము లన్నియును, క్రీ శే. శ్రీమన్మహోపాధ్యాయ పరవస్తు రంగాచార్యుల వారి పౌత్రులగు శ్రీమాన్ లక్ష్మీనరసింహస్వామి అయ్యవార్లంగారు తమ యార్ష పుస్తకాలయమందలి ముద్రితాముద్రిత గ్రంథ సంతతిని సంతోష పూర్వకముగా నా కెరవిచ్చిరి. ఆంధ్ర విశ్వవిద్యాలయములోని చరిత్రాధ్యాపకులును మన్మిత్రులు నగు శ్రీయుతులు మామిడిపూడి వెంకట రంగయ్య పంతులు (M A) గారును, గొర్తి వెంకటరావు (M. A. L. L. B) గారును, ఆంగ్ల చరిత్ర పరిశోధనమున నాకుఁ గలిగిన సంశయము లెడనెడఁ దీర్చుటయేకాక, తత్పరిశోధనమునకుఁ దగిన సూచనలుగూడఁ దెల్పుచు వచ్చిరి. నా యభిలాషము వెలుగావింపక, ఆంధ్ర విశ్వకళా పరిషదుపాధ్యక్షులగు సర్ ప్రొఫెసరు సర్వేపల్లి రాధాకృష్ణ పండితు లాదరముతోఁ గృతిపతిత్వ మంగీకరించిరి. వేదవేదాంగ పాఠకులును సుప్రసిద్ధ న్యాయవాదులు నగు శ్రీ ప్రభల లక్ష్మీనరసింహము పంతులుగారు ప్రేమతో దీనికిఁ బీఠిక రచియించిరి. సంస్కృతాంధ్ర సాహిత్య పరిషదధ్యక్షులగు శ్రీ యీయుణ్ణి వేంకట వీరరాఘవాచార్యులు (B A) గారు విజ్ఞప్తి వ్రాయుటయే కాక అకారాది పదసూచిక నిర్మించిరి. ఆంధ్ర విశ్వకళా పరిషత్పాలకులు దీనిని బరిషత్పక్షమున దయచేసి ప్రకటించిరి. వీరి కందఱికిని గృతజ్ఞతాపూర్వక వందనము లర్పించుచున్నాను. ఈ గ్రంథ రచనమున నే నుపయోగించిన యాయా గ్రంథముల పట్టిక యొకటి మొదటఁ జేర్చితిని. తత్కర్తల కెల్లరకుఁ గృతజ్ఞుఁడను. ముద్రణమున సంభవించిన కొన్ని ముఖ్యదోషములకు శుద్ధపత్రము చివరఁ జేర్చితిని. అత్యల్పములయిన మఱికొన్ని యచ్చుతప్పు లుండును. పాఠకు లట్టి వానిని సవరించుకొని పఠింతురుగాక. ఉదార హృదయముతో నీ గ్రంథము చదివి యిందలి గుణము గ్రహించుటయే నా పరిశ్రమకుఁ దగినఫల మను నా విన్నపమును విద్వల్లోక మాదరించుఁగాక.

ఆంగిరస ఫాల్గుణ పూర్ణిమా
భానువారము
విశాఖపట్టణము, 12-3-1933

ఇట్లు, విన్నవించు విధేయుఁడు
మల్లాది సూర్యనారాయణశాస్త్రి
కృతికర్త

కృతిసమర్పణ ప్రశంస

శ్రీముఖసంవత్సర చైత్ర శుద్ధ సప్తమీ భానువాసరమున విశాఖపట్టణ పుర మందిరమున శ్రీ విజయపుర సంస్థానాధీశ్వరులగు శ్రీ విక్రమ దేవవర్మ మహారాజు లుంగారధ్యక్షులుగా జరిగిన కృతిసమర్పణ మహాసభలో, ఆంధ్రవిశ్వకళాపరిష త్కళాశాలాంధ్ర విద్యార్థులు గావించిన కృతిసమర్పణ ప్రశంస

శ్లో. ప్రబోధోప నిషద్దేవ్యోః పాణిగ్రాహమహోత్సవే
వధూమధురవక్త్రాబ్జే, వ్యాపృతాఽమృత వర్షిణీ?
ప్రబోధస్వామినో దృష్టి ర్యచ్ఛన్తీ సర్వసంపదః
పాయా దేతాం కృతిం చాస్యాః, ప్రణేతారం చ పాలకమ్.

ఉ. మించినని మాగురుఁ డమేయము వైదిక వాఙ్మయమ్ము గా
లించినక మంతయు ఫలించిన దీకృతిరాజమందుని
ర్వంచిత శ్రీ కృష్ణబుధరాజ ! పవిత్ర చరిత్ర దీనిఁ బా
లించుము కూర్మిమైఁ బ్రమదలీలలఁ దేల్చి యుదారవృత్తిమై.

మ. అనుశాసించి తెనుంగుబాసకుఁ బ్రియుం డయ్యెన్ ద్రయీధర్మస
న్మణిపుంజమ్ములు కొల్లగొట్టి బుధసమ్మానార్హతం గాంచె నీ
వినమచ్ఛిష్యహితాభిలాషి మృదుగంభీర స్వభావుండు మా
యనుగుందేశికుఁ డాఢ్యుఁడై యుభయభాషా వాఙ్మయ ప్రౌఢిమన్.

చ. అమృతమయాంగి నీకృతి నవాంబుజనేత్రఁ బరిగ్రహించు నీ
సమయము నీకుఁ భావిశుభశంసి సుమీ ! యిఁక నాత్రిలింగ భా
షము సకలావనిన్ విబుధసంతతి యుల్లము లుల్లసిల్ల నీ
విమలయశస్సరోజము గవించెడు శాశ్వతసౌరభంబులన్.

ఇట్లు
దివాకర్ల వెంకటావధాని

ఉ. పండితుఁడున్ విమర్శకుఁడు పాఠకుఁడై కవియై త్రిలింగ భూ
మండలమం దఖండుఁ డని మాన్యత కెక్కినవాఁడు పాండితీ
చండిమ యొప్పఁగా నిలిపె సంస్కృత వాఙ్మయ సచ్చరిత్ర మీ
పండితువాక్కులోఁ బడినవాఁడవు నీ విఁక శాశ్వతుండవే.

ఉ. ఈ నిఖిల ప్రపంచ మెపుడేనియుఁ బోవును గాని సప్తసం
తానములం బ్రశస్త మగు తత్కృతి రత్నము శాశ్వతంబ యా
భానుశశాంక. మాకృతికి భర్తయుఁ గర్తయు నై నమీరలున్
దాని వశమ్మునన్ బొరసినా రమరత్వము విశ్వలీలలో.

చ. ప్రశమితవైరి యీ యుభయపండిత మిత్రుఁడు, బ్రహ్మవిద్యలోఁ
గుశలుఁడ వంట నీ వుభయగోళములన్, గృతియున్ బ్రశస్తతా
దశ వెలుఁగొందుఁ బో యుభయతారకమై, కృతి కర్త భర్తయీ
దృశగుణధన్యతం బొలుతు రే యిది యెంతటి దివ్యయోగమో !

ఉ. మాయనుగుం గురూత్తముకుమారిక యీకృతి మాకు నెయ్యపుం
దీయని ముద్దు చెల్లియలు దీనిపవిత్ర చరిత్ర సన్నుతుల్
చేయుట మేలె మాకు ? దయ చేసి గ్రహింపుము దీని సద్యశ
శ్శ్రీయుతులై వెలుంగుఁ డితరేతర వర్ధిత వైభవంబునన్.

చ. ఎఱుఁగనివార లెవ్వ రిట నీకృతికన్యకయాభి జాత్యపుం
గరువము, వేఱుగాఁ బొగడఁగాఁ బని లే దిఁక నాంధ్ర భాషలోఁ
దిర మగుఁ గాక యీ కృతికృతిత్వము నీకృతినాయకత్వమున్
గురుని కృతిప్రసూత్వమును గూడిన యీ పరిషద్దయావిధిన్.

ఇట్లు
పాటిబండ మాధవశర్మ

అభిప్రాయములు

పిఠాపురము }
8-1-1933 }

పిఠాపుర సంస్థాన విద్వాంసులు
బ్ర. శ్రీ శ్రీపాద లక్ష్మీనృసింహ శాస్త్రిగారు

బ్రహ్మశ్రీ మల్లాది సూర్యనారాయణ శాస్త్రులుగారికి
తమరు పంపిన సంస్కృత వాఙ్మయ చరిత్రము స్థాలీపులాక న్యాయమునఁ జూచితిని. ఇయ్యది వైదిక వాఙ్మయ చరిత్ర విషయమున విశేషముగ లోకోపకారక మని నమ్ముచున్నాను. దీనింగూర్చి మీరు చేసిన పరిశ్రమము సర్వలోక ప్రశంసనీయము.

పిఠాపురము }
12-1-33 }

పిఠాపుర సంస్థాన విద్వాంసులు, ఆమ్నాయార్థ వాచస్పతి
వడలి లక్ష్మీనారాయణశాస్త్రిగారు

శ్రీ ...శాస్త్రిగారు వైదిక సారస్వతము పరిశోధించి రచియించు నాఁటి నుండియు నీ గ్రంథముతో నాకుఁ బరిచయము కలదు. ప్రాచీన నవీన పద్ధతుల ననుసరించి వ్రాయఁబడిన యీ చరిత్రము లోకోత్తరమై "సంగః కస్య హి న స్వదేత మనసే మాధ్వీకమృద్వీకయోః" అన్నట్లు సర్వజనాదరణీయ మగునని విశ్వసించుచున్నాను.

రాజమండ్రి }
26-1-33 }

బ్ర శ్రీ. కూచిమంచి గోపాలకృష్ణమ్మగారు, యమ్. ఏ. యల్. టి.
Lecturer Govt. Arts College.

శ్రీ...... శాస్త్రిగారు రచియించిన సంస్కృత వాఙ్మయ చరిత్ర చదివితిని. ఇందు బ్రాహ్మణాది విభాగములును వానియందలి ప్రశంసనీయములగు విషయములును జక్కఁగఁ బ్రతిపాదింపఁ బడినవి. ఆంధ్ర భాషయం దిట్టి గ్రంథ మపూర్వము. ఇయ్యది నూతన పరిశోధనలతో నలరుచు, సంస్కృతాంధ్ర భాషాభిమాను లెల్లరకు మిగుల నుపయోగకరముగా నొప్పుచున్నది. ఇట్టి గ్రంథరాజమును రచించుట మూలమున నాంధ్రలోకమునకు మహోపకార మొనర్చిన శ్రీ శాస్త్రులవారి యుద్యమ మెంతయు శ్లాఘ్యము.

విజయనగరము 28-1-33

మహారాజ సంస్కృత కళాశాలలోని
వ్యాకరణ సాహిత్యాధ్యాపకులగు
బ్ర. శ్రీ నౌడూరు వెంకటశాస్త్రిగారు

శ్రీ...... శాస్త్రిగారి సంస్కృత వాఙ్మయ చరిత్రము చూచితిని. ఇది వైదిక వాఙ్మయమునఁ గల యెల్ల విషయములను సవిర్శముగఁ బరిశోధించి వ్రాయఁబడిన దనుట నిర్వివాదము. పాశ్చాత్యులీ వాఙ్మయమునుగూర్చి వ్రాసిన గ్రంథములను బరిశీలించి వారి మార్గములను జర్చించుచున్న యీ గ్రంథము మన దేశభాషలో నవీనమై సంస్కృతాంధ్ర భాషాభిమానులకు మిక్కిలి యుపయోగకరముగ నున్నదని నొక్కి వక్కాణించుచున్నాను.

Chittigudur
24-2-33

S. T. G. VARADACHARYULU. M. A.,
Principal, Narasimha Sanskrit College.

Dear Sir,

I have read carefully some portions of your learned work the "History of Sanskrit Literature" Part I Vedic period and feel glad to cangratulate you upon it. You have rightly drawn upon all available sources and given your own conclusions fearlessly from the orthodox point of view. In works such as these where each author starts a fresh theory that some of your conclusions are, at variance with those of others, is nothing strange. Your language is admirably adapted to the subject-matter. The Andhra University stands to gain by its publication of your work. I look forward with eagerness to the publication of the second part of your work in the near future.

Waltair
28-2-33

M. VENKATARANGAYYA PANTULU, M. A.,
Reader, University College of Arts.

The History of Sanskrit Literature written by Pandit Suryanarayana Sastri Garu is a remarkable undertaking. It he first of its kind in Telugu. He has shown great powers of lysis and critical abilities of high order in writing his book.

He has summed up in a brief compass salient points in the controversies regarding the chronology of the Vedic Literature and the growth of Sanskrit from the point of view of a linguist, a grammarian and a man of letters. He has succeeded in making it possible for students to form conclusions of their own without himself being dogmatic on any matter. The work is planned on an elaborate scale and the first volume has been executed in accordance with the plan. The work is sure to bring deserving credit to the author and also to the University.

బందరు
28-2-33

నోబులుకాలేజి సంస్కృత పండితులగు
బ్ర. శ్రీ. శిష్టా నరసింహశాస్త్రిగారు

బ్ర. శ్రీ...... శాస్త్రిగారి సంస్కృత వాఙ్మయ చరిత్ర ప్రథమభాగ మానందముతోఁ జదివితిని. సహృదయ రంజకమైన సద్విమర్శనముతోను స్వతంత్ర పరిశోధనముతోను మనోహరమగు శైలితోను విలసిల్లుచున్న యీ చరిత్ర మితరదేశ భాషలలోనికిఁ బరివర్తితమైనచో నింకను సకల జనోపయోగకర మగునని యాశించుచున్నాను. అపూర్వమైన యీ గ్రంథరాజ మాంధ్ర వాగ్దేవి కంఠహారమునకు నాయకమణి యనఁదగియున్నది.

ముక్త్యేశ్వరము
4-8-33

మ. రా. శ్రీ. జయంతి రామయ్య పంతులుగారు
బి. ఏ. బి. యల్.

బ్ర శ్రీ...... శాస్త్రులుగారు రచించిన వైదిక వాఙ్మయ చరిత్రమునందలి పంచమాధ్యాయము చదివినాఁడను. ఇందు ఋగ్వేద స్వరూపము దాని విభాగములు విపులముగా నిరూపింపఁబడినవి. ఇంతియకాక యీ వేదసూక్తములఁబట్టి యూహింపఁదగిన నాఁటి జనులలోని విభాగములు వారి యాచార వ్యవహారములు మొదలగు ననేక విషయములు విమర్శన పూర్వకముగా నిరూపింపఁ బడినవి. ఇందు నిరుక్తము సూత్రములు భాష్యములు మొదలగు వానినేకాక పాశ్చాత్య పండితుల యొక్కయు వారి మార్గము ననుసరించి యీ విషయముల విమర్శించిన బాలగంగాధర తిలక ప్రభృతులగు భారతీయ పండితుల యొక్కయు నభిప్రాయములనుగూడ శాస్త్రులుగారు విపులముగా నుదాహరించి క్రోడీకరించినారు.

"కావున బ్రాహ్మణ క్షత్రియాది వర్ణవ్యవస్థ ఋగ్వేద కాలము కడపట నేర్పడినది గాని మొదటనుండియు నున్నది కాదని చరిత్రకారు లూహించుట యుచిత మనియే తోఁచుచున్నది.'' ఇత్యాది సిద్ధాంతములు కొన్ని పాశ్చాత్య విద్యా సంపర్కములేని కేవల వైదిక విద్వాంసు లామోదింతురని తోఁచదు. అట్లయినను మిగుల శ్రద్ధతోఁ బెక్కు విషయములు సంగ్రహించి వానిని వైదుష్యముతో విమర్శించి ఫలితమును సర్వాంధ్రజన సుగమ మగునట్లు సులభశైలిని గ్రంథ మొనర్చిన శ్రీ శాస్త్రిలుగారి యుద్యమ మెంతయు శ్లాఘ్యము. ఈ గ్రంథ మాంధ్రవాణికిఁ గంఠాభరణముగా నుండఁదగినదని నా యభిప్రాయము.

श्रीरस्तु.

ओन्नमः परब्रह्मणे.

సంస్కృత వాఙ్మయము చరిత్ర

ప్రథమ భాగము

వైదిక వాఙ్మయము

ప్రథమాధ్యాయము

గ్రన్థావతారిక

ఓ న్నమ స్సర్వవేదాన్తవేద్యాయ పరమాత్మనే ।
వేదేభ్యో వేదదర్శిభ్యో మహర్షిభ్యో నమో నమః ॥

నత్వా గణాధిపం వాణీం కృత్వా చ గురువన్దనం ।
ధ్యాత్వా సూత్రపురాణాది గ్రన్థకర్తౄన్ మహామునీన్ ॥

వైదిక లౌకిక సారస్వతతత్వ మహత్త్వ దర్శనాదర్శం ।
సంస్కృతవాఙ్మయచరితం కరోమి సవిమర్శ మాన్ధ్రభాషాయామ్ ॥

వేదవేదాంగ మీమాంసాది భేదమునను స్మృతీతిహాస పురాణాది భేదమునను బహువిధమయ్యు వైదిక లౌకిక భేదమున ద్వివిధమైన యార్య వాఙ్మయము భరత ఖండముపాలిటి మహాభాగ్య నిధియై వైదిక లౌకిక భాషా నిబద్ధమై యలరారుచు నదియే క్రమముగా సంస్కృత వాఙ్మయ మను సామాన్య నామము వహించినది. దీర్ఘాయువగు నొక ప్రతిభాశాలి తన జీవితకాల మంతయు దారవోసినను ససాకల్యముగాఁ దెలిసికొనఁ దరముగాని యా వాఙ్మయము – అందును విశేషించి వైదిక భాగము పెక్కువేల సంవత్సరములుగా బ్రాహ్మణ సంతతివారిచే నధ్యయనాధ్యాపన

వ్యవహారమునఁ జెక్కు చెదరకుండఁ గంఠస్థముగా రక్షింపఁబడుచు వచ్చుటయే దాని మహిమను వేనోళ్ళఁ జాటుచున్నది. అట్టి విజ్ఞాన నిధానము పరమ పావనము సకలార్థ సాధనమునైన యార్య సారస్వతము తొల్లి చిరకాల మాసేతు హిమాచలము భరత ఖండమున నేకచ్ఛత్రాధిపత్య మొనరించియు దేశకాల పాత్రముల మార్పులనుబట్టి క్రమముగా క్షీణదశకు వచ్చుటచే నీ కాలమున బ్రాహ్మణ జాతి యందు లౌకిక సాహిత్యమునఁ బరిచయము గలవాఁడు నూటి కొకఁడుగాని వేదములు పఠించినవాఁడు వేయింటి కొకఁడుగాని యుండఁడని చెప్పవలసివచ్చినది. **అహో** కాలము ! అనంత శక్తిసంపన్నమైన దాని విలాస మెపు డెట్లు పరిణమించునో యెవఁ డెఱుఁగును ?

ఆయినను సర్వసంపత్సమేతయు సాత్త్విక చిత్తవృత్తియు నగు భరతమాత యెడనెడ ననార్యుల పోరాటములకును దన పుత్రుల యంతఃకలహములకును విదేశీయుల ఘోరయుద్ధములకును మతద్వేషుల దురంత హింసలకును అనుకూల శత్రువుల వంచనలకును లోనై పడరాని పాట్లుపడి కలఁత చెంది చెంది వాడి వత్తయై ధైర్యస్థైర్యములు ధనరత్న రాసులు ఛత్రచామరములుఁ గోల్పోయియు నడుమ నడుమ నించించుక సారస్వత సంపదగూడఁ బోగొట్టుకొనియు ఆ వేద వేద్యుని కరుణాకటాక్ష వీక్షణ విశేషముననో వైదికార్యుల సత్సంకల్ప ప్రభావము ననో తనకాణాచి యగు వాఙ్మయ నిధినిమాత్ర మెట్లో రక్షించుకొనుచు వచ్చెననియే మన మిపుడు సంతోషింపవలసియున్నది. కావుననే గతిలేని బానిసయై యొఁకటి బాధ నకనకంబడు భరత ఖండమున వేదశాస్త్రాదు లిప్పటికిని, కొనయూపిరితో దేశమున నందందు గానవచ్చుచున్నవి గాని లేకున్న వాని పేరైన లేకుండఁ బోయి యుండునుగదా !

అట్టి వాఙ్మయ సంపదతోఁ గొన్ని వేల సంవత్సరముల క్రిందట నార్యావర్తమునుండి క్రమముగా దక్షిణా పథమునకు వెడలివచ్చిన యార్యులలోఁ గొందఱీ యాంధ్రదేశముఁ జొచ్చి యిందు స్థిరపడి వేదవేదాంగ విజ్ఞాన సుధాధారల నీ దేశమంతయుఁ బావనము గావించిరి. నాఁటినుండి నేఁటిదనుక నాంధ్రదేశీయు లగు శ్రోత్రియులవలె సుస్వరముగా శ్రుతిరంజకముగా వేదములు పఠించువారు భరతఖండమున లే రనెడి ఘనత కీ దేశము పాత్రమైనది. ఇప్పటికి నట్టి వేదపాఠకు లిందు కొందఱు కలరుగాని మొత్తముమీఁద ముఖ్యముగా నాముష్మిక చింతతో వేదాదివిద్య లభ్యసించు బ్రాహ్మణజాతి యిపుడు ముప్పాతిక మువ్వీసము దానికి దూరమైనదని చెప్పవలసి వచ్చినపుడు తక్కిన యాంధ్రలోకమునకు వాని

మహత్త్వ మించుకైన గోచరింపకున్నదని వేఱే చెప్పనేల ? కావున మహర్షులును మహాకవులును దమ విజ్ఞాన సూత్రమున గ్రుచ్చి భారతీదేవి మకుటమున కలంకార ముగా సమర్పించిన సంస్కృత వాఙ్మయ దివ్యమాల్యము సుగంధ మింతైన నాఘ్రా ణించి యాంధ్రు లానందింతురుగాక యని యాంధ్రభాష నీ సంస్కృత వాఙ్మయ చరిత్ర రచియింప నారంభించుచున్నాను.

ఆర్యులు — వారి మొదటి నివాసము

ఈ గ్రంథమున మొదటిభాగమగు వైదిక వాఙ్మయము నుదంతము తెలిసి కొనుటకు ముందు దాని కాధారభూతులైన ప్రాచీనార్యులను గూర్చియు వారి నివా సాదికమును గూర్చియుఁ గొంత యెఱుఁగుట యావశ్యకమేకాని, ప్రత్యేక గ్రంథము కాఁదగిన యీ విషయమును బ్రాచ్యపాశ్చాత్య పండితులనేకు లనేక విధములఁ జర్చించి సిద్ధాంతీకరించియుండ మరల దానినే విమర్శించి నిర్ణయింపఁబూనుట చర్వితచర్వణమే కాక గ్రంథవిస్తరము కూడనగును గావున నార్యుల యుదంతము నిందు సంగ్రహముగా ముచ్చటింతము.

ఆర్యశబ్దము ఋగ్వేదమునఁ బెక్కుచోట్లఁ గానవచ్చును.[1] దీనికిఁ బూజ్యులైన విద్వాంసులనియుఁ గర్మానుష్ఠానపరులనియుఁ ద్రైవర్ణికమైన యుత్తమజాతి వారనియు నీశ్వరపుత్రులనియు నర్థములు కలవు. అట్టి యీ యార్యులెక్కడివారు ? ఎప్పటివారు ? అను ప్రశ్నలిపుడు చరిత్ర పరిశోధకులను గలఁతపెట్టుచున్న ప్రాచీనచరిత్ర విషయక ప్రశ్నలలో నతిముఖ్యములైనవి. వీనికి సదుత్తరము లిచ్చుటకుఁ దగిన సాధనసామగ్రి మిక్కిలి తక్కువయనుటకుఁ బ్రపంచమందలి యిప్పటి వివిధ జాతులవారి భాషలలోని కతిపయశబ్ద సాదృశ్యమును వారి గ్రంథ ములలోని కొలఁది గాథలును వారి కొన్ని యాచారములును భూగర్భశాస్త్రమును భూగర్భగత వస్తుపరిశోధన శాస్త్రమును మున్నగునవి యాధారములుగాఁ బరిశీలించి విమర్శించియు, సిద్ధాంతమున వేఱు వేఱు త్రోవలు ద్రొక్కిన యాధునిక చరిత్ర కారుల యాశయములే తార్కాణము. ఆర్యుల తొలుతటినివాసస్థాన మేదో యొకటి

1. విజానీ హ్యార్యాన్. ఋ. 1-51-8;
   జ్యోతి శ్చక్రథు రార్యాయ. ఋ. 1-117-21.
   హత్వీ దస్యూన్ ప్రార్యం వర్ణ మావత్. ఋ. 3-34-9.
   ఆర్యం త్రైవర్ణిక వర్ణమ్ సాయణభాష్యము.
   ఆర్య ఈశ్వరపుత్రః. నిరు—6-26.

యగును గాని వారు వారూహించినయన్నియును గావు కదా! కాని, యా చరిత్ర కర్తలందఱును మాననీయులే. అట్టియెడ వారిలో నెవరి మత మౌననము? ఎవరిది కాదనము? అయినను, ప్రపంచమందలి సకలవాఙ్మయ పఙ్క్తికి ఋగాదివేద వాఙ్మయము శ్రీకారమని యెల్ల ఖండముల వారంగీకరించి యుండఁగా, ఆర్యుల నిజవృత్తాన్త మిసుమంతైనఁ దెలియఁజేయ దానికంటె వేఱొకటి యుత్తమప్రమాణము కాఁజాలదనుట సత్యమై యుండఁగా, ఏది వేదవచనప్రామాణ్య మనుసరింపక పైపూఁతమెఱుంగులతోఁ దల యెత్తెనో యట్టి సిద్ధాంత మూహలమీఁదిమేడ యనక తీఱదని కొందఱు తలఁతురు కాని యది సరిగాదు. ఏ మనఁగా ?— విషయమా, బహుపురాతనము మిక్కిలి దురవగాహము. ఉపాయసంపదయా, అత్యల్పము సంశయాస్పదము. అట్టియెడ వాఙ్మయసేవాభిలాషతోఁ జేసిన యెట్టి కృషియైనను సత్యాన్వేషణ తత్పరులగు తరువాతి వారికి మార్గదర్శకమగునే కాని యూరకపోదు. అందుచే నేసిద్ధాంతమైన నేదో యొకవిధముగాఁ బ్రయోజనకారియే కాని యనాదరణీయము కాదు.

ఇఁక వేదవచన ప్రామాణ్య మందుమా, ఆర్యుల కాలనివాసాదులను దెలుపు వాక్యములు వేదములందైనను విశేషముగా లేవు. ఆయున్నవైన నొకచోట లేవు. అందందు చెదరి పడియున్నను వివిధ సందర్భములలో నున్నయవి ప్రత్యక్షముగాఁ బై విషయములను బోధించినట్లు కానరావు. అయినను వాని నిజార్థము గ్రహింత మన్న నందలిభాష సుఖబోధ్యము గాదు. పైగా వారినాఁటికే యందలి నిజము గోచరింపమిఁగాఁబోలు భాష్యకర్తలు గూడఁ గొన్నికొన్ని వాక్యముల యర్థమును మార్గాంతరముఁ బట్టించియున్నారని కొందఱనుచున్నారు. అయినను శ్రమపడి వాని తత్త్వము గ్రహింతమన్నఁ బై విషయముల కాధారములుగాఁ గనవచ్చెడి యాయావాక్యముల సమన్వయైక్యము దుర్ఘటమగుచున్నది. అందుచేతనే పెక్కండ్రు చరిత్రకారులార్య నివాసాదికమును వేదవాక్యముల సాహాయ్యమున నిరూపింపఁజాలక పోయిరని యూహింపవలసియున్నది. కాని, యీ పనికి దొరఁకొన్నవారును గొందఱు గలరు. వారిలో నగ్రగణ్యులు లోకమాన్య బాలగంగాధర తిలక పండితులు. వేదప్రమాణ నిరూపితమైన వారి సిద్ధాంతము గూడ సరిగాదని యాధునికులు మఱికొందఱు తలంచుచున్నారు. కావున బహుపురాతన మగుటచే నిదమిత్థమని నిర్ణయింప శక్యముగాకున్న యీ విషయమును గూర్చి వారి వారి యభిప్రాయములు సంగ్రహముగా నుదాహరించుకొనుటయే మన మొదటిపని.

ఐరోపాఖండ వాదము

ఆర్యుల మొట్టమొదటి నివాసస్థాన మైరోపాఖండ మనియు, ఉత్తర ధ్రువ మండల మనియు, ఆర్యావర్తమనియు, మధ్యాసియాఖండ మనియు, నాలుగు వాదములు గలవు. వీనిలో నైరోపావాదము కేవలము స్వదేశాభిమానముతో బయలు దేఱిన దగుటచేతను, దీనిని బలపఱిచెడి హేతువులు సమంజసములు కాకపోవుట చేతను, భారతీయ చరిత్ర కారులు దీనిని గణింపక పోవుట యటుండ సుప్రసిద్ధులైన పాశ్చాత్య పరిశోధకులు కూడ దీని నాదరింప లేదనుట విదితము. ఆర్యుల తొంటి నివాసము జర్మనీ యనియు, తూర్పుయూరపనియు, మధ్యయూరపనియు, ఉత్తరయూరపనియు, స్కాండినేవియా యనియు, ఇంక నేదేదో యనియు నీ వాదమునం దనేక మతములు కలవు.[1] వీని కనుగుణముగా, పుఱ్ఱెల సిద్ధాంత మొకటి లేచినది. భూగర్భము త్రవ్వి త్రవ్వి తీసిన పుఱ్ఱెలలోఁ గొన్ని పొడుగుగా నుండి హైందవుల తలలను బోలియుండుటచే హిందూదేశార్యులు యూరపునుండి లేచి వెళ్ళినవారే యని యొక నిర్ణయము. ఆ పుఱ్ఱెలలో వెడల్పుగా నున్నవే యార్యుల కపాలము లనియు, ఆ ప్రాచీనార్యు లిప్పటి ఫ్రాన్సు దేశమున మొదట నివసించిన గాలు లనియు మఱియొక నిర్ణయము. ఆ పొడుగు పుఱ్ఱెలవా రిప్పటి జర్మనుల మూలపురుషులే యని యింకొక నిర్ణయము.[2] యూరపులోని లిథూనియన్ భాష వైదిక సంస్కృతముకంటెను ఆ వెస్తాకంటెను మిక్కిలి ప్రాచీన మైనదిగాఁ గనఁబడుచున్నది గావున, పురాతన నార్యజాతిలో మొట్టమొదటి శాఖవారు లిథూనియనులే యని తోఁచుచున్నదని యొక యూహ.[3] యూరపులోని యతి ప్రాచీనమైన లిథూనియన్ భాషనుండియే సంస్కృతభాష పుట్టి హిందూదేశము చేరిన దని యొక సిద్ధాంతము.[4] ఇట్లు తల లెత్తిన సారము లేని యీ వివిధ మతములే యైరోపా వాదము దుర్బలమని చెప్పక చెప్పుచున్నవి. ఇఁక రెండవది—

ఉత్తర ధ్రువమండల వాదము

డాక్టరు వారెన్ మొదలగు విదేశీ పండితులు సూచించిన యీ యుత్తర ధ్రువమండల వాదము తిలకుగారి వలన నభివృద్ధికి వచ్చినది. వారు వేదములఁ

1. Aryan cradle P. 35.
2. Arctic Home P. 15, 16.
3. Aryan cradle.
4. Origin of Aryans P. 20.

యుత్తర నివాసము (Arctic Home in the Vedas) అను పేర నార్యుల మొదటి నివాస ముత్తర ధ్రువమండల మని నిర్ణయించుచు నాంగ్లమున మహా గ్రంథము రచియించిరి. అది యంతయుఁ జదివినవారికిఁగాని దాని గొప్పతనము పూర్తిగా గోచరింపదు కాని, యీ వాదము సమర్థించుటకు వారు చూపిన ప్రధాన ప్రమాణముల యాకార మొకింత గ్రహింతము.

"భూమండలముయొక్క యుత్తర ధ్రువమునకు సరిగా నుత్తరమున నొక నక్షత్రము కలదు. అదియే ధ్రువనక్షత్రము అది యెప్పుడును గదలక యొక చోటనే యున్నట్లు కనఁబడును. ఉత్తర ధ్రువమువద్దకు వెళ్ళి నిలిచి చూచిన వారి కా నక్షత్రము సరిగా నెత్తిమీఁద నున్నట్లును, తక్కిన నక్షత్రములు దాని చుట్టును, తలమీఁది గొడుగువలెను లేక కుమ్మర సారెవలెను గిరగిరఁ దిరుగుచున్నట్లును గన వచ్చును. అచ్చట ఖగోళములో నుత్తరార్ధగోళమే కనఁబడును దక్షిణార్ధగోళ మెప్పుడును మఱుఁగుపడియే యుండును. అచ్చట సూర్యుఁ డుదయించిన యాఱు నెలలకుఁగాని యస్తమింపఁడు. అస్తమించిన యాఱు మాసములకుఁ గాని యుద యింపఁడు. అందుచే నిక్కడ నాఱుమాసము లెడతెగని పగలును, ఆఱుమాసము లెడతెగని రాత్రియు సంభవించుచుండును. ఆ మహా రాత్రి గతించునపుడు సూర్యుఁడు దక్షిణార్ధ గోళముననుండి యుత్తరార్ధ గోళములోని కుదయించు చున్నట్లు ప్రత్యక్షమగును. ఇట్టి లక్షణములతోఁ గూడిన యుత్తర ధ్రువమే మేరు పర్వతమని ప్రాచీనులు వర్ణించి యున్నారు.

మఱియు సూర్యుఁ డుదయించుటకు ముందు గనిపించు వెలుతు రుషస్సనఁ బడును. అది యుత్తర ధ్రువవాసులకు దీర్ఘరాత్రి యంతరించు సమయమున భూమ్యాకాశములు కలిసినట్లుండు దిక్చక్రమువద్ద (Horizon) కనవచ్చి దాని యంచు చుట్టును, ఆఱువది గడియల కొకసారి గిఱ్ఱునఁ దిరుగుచుండును. క్రమ క్రమముగా వెలుతు రధికమగు చున్నట్లుగా, ఆ యుషస్సులు ముప్పది రోజులు తిరుగు నప్పటికి సూర్యబింబము ప్రత్యక్షమగును. కెప్టెన్ పిమ్ (Captain Pym) అను పండితుఁ డుత్తర ధ్రువమునొద్దఁ గనవచ్చు దివారాత్రములను సంధ్యాకాలము లను వివరించి యచటి సంవత్సరము నిట్లు వర్ణించియున్నాఁడు :— "జనవరి 29 తేదిని మొట్టమొదట వెలుఁగు కనిపించును. ఇదే యుషఃకాంతి. ఇది 47 దినము లుండును. తరువాత మార్చి 16 తేదిని సూర్యబింబ ముదయించును. సెప్టెంబరు 26 తేది నస్తమించును. కాని తరువాత 48 రోజుల వఱకును సంజవెలుఁ గుండును. తరువాత నవంబరు 13 తేది మొదలుగా 76 రోజులు సూర్యసంబంధమైన వెలుతురే

యుండదు. కాని యా రోజులలోఁగూడ, ఉత్తర ధ్రువమునకు సరిగా నెత్తిమీఁదఁ బసిఁడిరంగు కాంతులను విరివిగా వెదచల్లునట్టి ఆరోరా బోరియాలిస్ (Aurora borealis) అను పెద్ద జ్యోతివలన వెలుతురు సంభవించుచుండును. అట్టి బంగారు కాంతులచేఁ గ్రమ్మఁబడి యుండుటచేతనే మేరువు బంగారుకొండ యను ప్రసిద్ధి గాంచిన దనుట నిజము. ఇది యుత్తర ధ్రువబిందువువద్ద నుండు లక్షణము. దీని ప్రాంత ప్రదేశమే యుత్తర ధ్రువమండల మనఁబడును. అది యతి ప్రాచీన కాలమున సమశీతోష్ణమై మనుష్యులు నివసించుట కనుకూలముగా నున్నట్లును, ఆర్యు లా కాలమున నచ్చట నివసించి యున్నట్లును, పిదపఁ గొంతకాలమునకు వచ్చిన హిమప్రళయముచే నా ప్రదేశమంతయు హిమమయము కాఁగా నందు నశింపఁగా మిగిలినవారు దక్షిణదేశములకుఁ జేరినట్లును భూగర్భ శాస్త్రాది పరిశోధనలవలనఁ దెలియుచున్నది. కావున నార్యుల తొంటి నివాస ముత్తర ధ్రువమండల మని విశ్వ సింప నగును."

పై యుత్తరధ్రువలక్షణ వర్ణనలు వేదాదులందు కలవనుట కుదాహరణములు కొన్ని :—

ఉత్తరధ్రువమువద్ద నిలిచి పైకిఁ జూచినవానికి సరిగాఁదన నెత్తిమీఁద నక్షత్రమండలము బొంగరమువలె గిరగిరఁ దిరుగుచున్నట్లు కనఁబడుననుట యక్కడి లక్షణములలో మిక్కిలి విచిత్రమైనది. దీనిని సమర్థించు ప్రమాణ వచనము లిట్లున్నవి.

"ఇంద్రుఁడు ఇరుసుచే రథచక్రములను వలెనే తనబలకర్మచే భూమ్యా కాశములను గట్టిగాఁ బట్టి యుంచెను."[1]

"ఇంద్రుఁ డాకాశమున సూర్యుని లేక ద్యులోకమును స్తంభింపఁ జేసెను."[2]

ఇంద్రుఁడనేకములైన తేజస్సులను సారథి రథచక్రములను ద్రిప్పునట్లే త్రిప్పుచున్నాఁడు."[3]

1. యో అక్షేణ చక్రియా శచీభి ర్విష్వక్త స్తంభ పృథివీ ముత ద్యాం, ఋ. 10-89-4.

2. అవంశే ద్యా మస్తభాయ ద్బృహంత మారోదసీ, ఋ. 2-15-2.

3. స సూర్యః పర్యురూవరాం స్యేంద్రో వవృత్యా ద్రథ్యేవ చక్రా. ఋ. 10-89-2.

పై వాక్యములనుబట్టి చూడఁగా, ఆకాశ మొక స్తంభ మాధారముగా నిలిచి యున్నట్లున్న దనుటచే, ఆ స్తంభముకొన ధ్రువనక్షత్రమనియు, అది సరిగా నెత్తి మీఁదనున్న దనియుఁ దెలియవచ్చును. దాని చుట్టును నక్షత్రములు తిరుగుచున్న వనుటచే నాకాశము రథచక్రమువలెనే యా స్తంభాగ్ర మాధారముగా గిరగిరఁ దిరుగు చున్నదనుట స్పష్ట మగుచున్నది. మఱియు, "సప్తర్షిమండలము మిక్కిలి యెత్తుగానున్న దనియు నది రాత్రి కనిపించును గాని పగలు కనఁబడదనియు,"[1] వర్ణింపఁ బడియుండుటచే, సప్తర్షిమండల ముదయాస్తమయము లెఱుఁగదనియు, సరిగా నెత్తిమీఁద నుండునది యెల్లప్పుడును ధ్రువనక్షత్రము చుట్టు దిరుగుచునే యుండుననియు విదితమగుచున్నది. ఈ వర్ణన లుత్తరధ్రువమునకు మాత్రమే సరిపడునవి యగుటచే నచ్చటి పూర్వోక్తములైన యాకాశ స్థితిగతులను గన్నులారఁ జూచినవారో లేక వారివలనఁ గర్ణాకర్ణికగా విన్నవారో పైవర్ణనలు చేసి యున్నారనుట నిర్వివాదము గావున నార్యులుత్తరధ్రువ మండలమున నివసించిన వారని చెప్పవలసి వచ్చుచున్నది.

ఉత్తరధ్రువమువద్ద నాఱునెలలు పగలు నాఱునెలలు రాత్రియు సంభవించు నన్నదానికిఁ బ్రమాణములు;—"ఏది మనకొక సంవత్సరమో, అది దేవతల కొక్క దినము."[2] అను తైత్తిరీయ బ్రాహ్మణములోని వాక్యములనుబట్టి దేవతల దినము నందు సగము పగలును సగము రాత్రియుననుట తెల్లమే కావున, ఆ పగటిభాగము మన యాఱుమాసముల యుత్తరాయణమనియు, ఆ రాత్రిభాగము మన యాఱు మాసముల దక్షిణాయనమనియు స్పష్టమగుచునే యున్నది. దీనిని మనుస్మృతిలోని యీ వాక్యము మఱింత ధ్రువపఱుచుచున్నది.

"మానవ సంవత్సరము దేవతల కొకపగలు నొకరాత్రియు నగును. అది వాభాగ ముత్తరాయణము. ఆ రాత్రిభాగము దక్షిణాయనము."[3] దీని నింకను మహాభారత మిట్లు తేటపఱుచుచున్నది.

"తేజశ్శాలియైన మహామేరు వుత్తరదిక్కును బ్రకాశింపఁ జేయుచు నున్నది.........ఈ మేరువునకుఁ బ్రతిదినము సూర్యచంద్రులు ప్రదక్షిణము

1. అమీ య ఋక్షా నిహితాస ఉచ్చా నక్తం దదృశ్రే కుహ చిద్ది వేయుః. ఋ. 1-24-10, తై. ఆ. ప్రశ్న 1-11.
2. ఏకం వా ఏత ద్దేవానా మహః య త్సం వత్సరః. తై. బ్రా. 3-9-22-1.
3. దైవే రాత్ర్యహానీ వర్షం, ప్రవిభాగ స్తయోః పునః,
అహ స్త త్రోదగయనం, రాత్రి స్స్యా ద్దక్షిణాయనం, మను. 1-67.

చేయుచుందురు. నక్షత్రములు దీని చుట్టును దిరుగుచుండును........ఇచ్చట నున్నవారి యొక పగలు నొకరాత్రియుఁ గలిసి మన సంవత్సరముతో సమాన మగును."[1] జ్యోతిశ్శాస్త్ర ప్రమాణమునుబట్టి పైని వర్ణింపఁబడిన మహామేరు వుత్తరధ్రువ మనుటయు, అచ్చటి యాఱుమాసముల పగటిని ఆఱుమాసముల రాత్రిని ప్రాచీనార్యులు చూచిరనుటయు స్పష్టముగదా! ఇఁక నుత్తరధ్రువ రూపమైన మహామేరువువద్దఁ గనవచ్చు సూర్యుని, తైత్తిరీయారణ్యక మెట్లు వర్ణించినదో చూతము

"ఆరోగుఁడు భ్రాజుఁడు పటరుఁడు పతంగుఁడు స్వర్ణరుఁడు జ్యోతిషీమంతుఁడు విభాసుఁడు, అను పేళ్లుగల సప్తసూర్యులను లోకహితార్థము ప్రాణికోటి కనుకూలముగా నాకాశ మంతయుఁ బ్రకాశింపఁ జేయుచున్నారు కశ్యపుఁ డనెడివాఁ డెనిమిదవ సూర్యుఁడు. అతఁడు మహామేరువు నెన్నఁడును విడువఁడు. ఆ సప్త సూర్యులును జగత్తును బ్రకాశింపఁ జేయుటకై కశ్యపునివల్ల జ్యోతిస్సు పొందు చున్నారు." ఇందు వర్ణింపఁబడిన సూర్యులను జూచిన సాక్షులుకూడ నీ యనువాక మందే లభించుచున్నారు.

"వత్సపుత్రుఁ డగు పంచకర్ణ ఋషియు, ప్లక్షపుత్రుఁడగు సప్తకర్ణ ఋషియు 'మేము సప్త సూర్యులను జూచినాము. కశ్యప సూర్యుఁడు మాకు గురూపదేశము వలన వినవచ్చినవాఁడే కాని యతనిని మేము చూడలేదు. అతఁడున్న మహా మేరువును జేర్చుటకు మేము సమర్థులము కాలేదు' అని చెప్పఁగా గర్గపుత్రుఁడైన ప్రాణత్రాత మహర్షి వారితో నిట్లు పలికెను. 'ఓ మునులారా! మహా మేరువునఁ బరివర్తమానమగు కశ్యపనామక సూర్యమండలమును నేను గన్నులారఁ జూచితిని. మీరు మహామేరువు నొద్దకు వెళ్ళి దాని శిఖర మెన్నఁడును విడువని కశ్యప సూర్యుని సందర్శింపుఁడు'"[3] అని చెప్పి వారికి మార్గ ముపదేశించెను.

1. ఉదీచీం దిశమా స్నేష దిశం తిష్ఠతి వీర్యవాన్
   మహామేరు ర్మహాభాగ శివో బ్రహ్మవిదాం గతిః,.......
   ఏనం త్వహ రహ ర్మేరుం సూర్యాచంద్రమసౌ ధ్రువం,
   ప్రదక్షిణ ముపావృత్య కురుతః కురునందన.
   జ్యోతింషి చా ప్య శేషేణ సర్వా ణ్యనఘ! సర్వతః
   పరియాంతి మహారాజ గిరిరాజం ప్రదక్షిణం.............
   బభూవ రాత్రి ర్దివసశ్చ తేషాం సంవత్సరేణైవ
   సమావకాలః॥ భార - అరణ్య - 163, 164 అధ్యా.

2-3. "ఆరోగో భ్రాజః పటరః పతఙ్గః స్వర్ణరో జ్యోతిషీమాను విభాసః"
   ఇత్యాది — తై. అర - 1-7. అనువా.

పై సూర్యవర్ణన ముత్తరధ్రువ లక్షణమును గన్నులకుఁ గట్టుచున్నదనుట స్పష్టము గదా! ఇఁక నార్యు లా ధ్రువలక్షణములను బ్రత్యక్షముగాఁ జూచియున్న వా రనుట కాశ్చర్యమేమి? అయిన నీ విషయమునఁ బ్రత్యక్ష ప్రమాణము జ్యోతి శ్శాస్త్రము గావున సూర్యసిద్ధాంతమున భాస్కరాచార్యు లేమి చెప్పిరో చూతము.

"మేరువు నుత్తరాగ్రముననున్న దేవతలు, రాత్ర్యనంతరమున నొక్కమాఱు మాత్రమే యుదయించునట్టియు మేషాది రాశిషట్కమం దుండునట్టియు సూర్యుని నిరంతరము చూచుచుందురు."[1] దీనినిబట్టి మేరువువద్ద మేష సంక్రమణమునాఁటి సూర్యోదయము మొదలుగా తులా సంక్రమణమునాఁటి సూర్యాస్తమయము వఱకు నాఱునెలలు విడువని పగ లనియు, తరువాత మరల మేష సంక్రమణము వఱకు నాఱునెలలు విడువని రాత్రి యనియు, ఆ మేరు వుత్తర ధ్రువమే యనియు విదిత మగుచున్నది. ఇట్టిచ్చటి యాఱేసి నెలల యహోరాత్రములను బ్రత్యక్షముగాఁ దెలియఁజేయు వాక్యములు బహు పురాతనమైన ఋగ్వేదములోఁ గనరాకపోయినను, ఈ భావము తెలుపు వాక్యములందు లేకపోలేదు. అందు గనవచ్చు దేవయానపద ముత్తరాయణమునకు సమాన మనియు, పితృయాణ పదము దక్షిణాయనమునకు సమాన మనియుఁ దెలియవచ్చును. దేవయానపదము ఋగ్వేదమునఁ బెక్కుచోట్లఁ గనఁబడును.[2] 'పితృయాణ' శబ్ద మిట్లే సరిగా లేదుగాని, ఇది దేవయానముకంటె నితరమైన మృత్యుమార్గమని యొకచోట నున్నది. ఇంతకంటె విస్పష్టముగా, దేవతల మార్గము పితృదేవతల మార్గము నని మఱియొకచోట నున్నది.[3] పై వాక్య మున కర్థము వ్రాయుచు సాయణాచార్యులు దేవయాన పితృయాణము లని యర్థము వ్రాసియున్నారు. పై దేవయాన పదము దివాకాలపర మనెడి భావము తెలుపుచున్న 'ప్రమేపంథా' యనెడి ఋక్కును[4] పరిశీలింతము. "నా చేత దేవయాన మార్గములు

1. మేరౌ మేషాది చక్రార్ధే దేవాః పశ్యన్తి భాస్కరం. సకృ దే వోదితం— సూ. సి. 12—67.

2. ఋగ్వే - అంత ర్విద్వాగ్ అధ్వనో దేవయానా వతంద్రో 1-72-7 ఏహ యాతం పథిభి ర్దేవయానైః. 1-183-6

3 పరం మృత్యో అనుపరేహి పంథా యస్తే స్వ ఇతరో దేవయానాత్. 10-18-1 ద్వేస్రుతీ అశృణవం పితౄణా మహం దేవానా ముత - 10-88-15. ఋ—

4. ప్ర మే పంథా దేవయానా అదృశ్ర న్నమర్ధంతో వసుభి రిష్కృతాసః। అభూ దు కేతు రుషసః పురస్తాత్ప్రతీ చ్యాగా దధి హర్మ్యేభ్యః. 7-76-2.

చూడఁబడుచున్నవి. ఎట్టివి ? బాధ కలిగింపనట్టివియు, తేజస్సులచే సంస్కరింపఁ బడినట్టివియును. ఏమన ?— తూర్పున నుషస్సుయొక్క కేతువగు తేజస్సు కనవచ్చుచున్నది. ఆయుషస్సు మిక్కిలి యెత్తయిన ప్రదేశములనుండి ప్రత్యఙ్ముఖమై మన కభిముఖముగా వచ్చుచున్నది." దీనినిబట్టి దేవయాన ముషస్సుతోఁ బ్రారంభ మగుననియు, పితృయాణము చీఁకటితోఁ బ్రారంభ మగుననియు గ్రహింపనగును. అయితే, ఈ దేవయాన పితృయాణములు మనదేశమునఁ గనవచ్చు దివారాత్రములే యని యేల తలంపరా దనెడి యాక్షేపము వచ్చునేమో కాని, పై ఋక్కుల కాధారభూతులైన పూర్వ ఋషులును తాము ప్రతి పన్నెండు గంటలకుఁ జూచునట్టి యహోరాత్రములనే యంత గొప్పచేసి, నేను దేవయానము చూచినాను, నేను దేవయాన పితృయాణ మార్గములను విన్నాను' అనుచు నాశ్చర్యముతోను, అత్యాసక్తితోను, అట్లు పలికియుండరని యూహించినచో, నివి యుత్తర ధ్రువ లక్షణములైన యాఱు మాసముల పగటికిని. ఆఱుమాసముల రాత్రికిని సమానము లని తెలియకపోదు. ఈ భాషము పూర్వోదాహృతములైన తైత్తిరీయ బ్రాహ్మణాది వాక్యముల యర్థములకు సరిపడుచున్నది. ఇది ఖగోళశాస్త్రమును గణిత శాస్త్రమును బట్టి యిక్కడి ప్రాచీనార్యులు గ్రహించి చెప్పినమాట కాదు. ఏ మనఁగా ? ఈ శాస్త్రములు రెండును వేదములకుఁ దరువాత వ్యాప్తిచెందినవి గాని వేదకాలమునఁ బ్రబలినవి కావు. ఋగ్వేదాదులందు ఖగోళ జ్ఞానమునకుఁ గొన్ని నిదర్శనములు గనవచ్చుచున్నను, అవి కంటికి గోచరించునవే కాని యూహించి లెక్కవేసి చెప్పినవి కావు. మంత్ర బ్రాహ్మణముల కాలమునఁ బై విషయ మట్టి విజ్ఞానమునఁ గనిపెట్టఁబడినదని విశ్వసించుటకుఁ దగిన యాధారములును గనరావు. అది గాక మన యార్యులనుండి కట్టకడపట విడిపోయిన వారగు పారశీకుల మతగ్రంథమగు 'వెందిదాదు'లోఁ గూడ నీయర్థమిచ్చు వాక్యముండుటఁబట్టి చూడఁగా వీరందఱును ద్రొల్లి యొక్కచోటఁ గలసియున్నతఱిఁ గన్నులారఁ గాంచిన యీ వైచిత్ర్యమును మఱవక తమ గ్రంథములలో వర్ణించుకొనియున్నారని తోఁచకపోదు. అందిట్లున్నది "తైచ అయర మైన్యన్తే యత్ యారే"[1] దీని యర్థమిది—"వారు, ఏది యొక సంవత్సరమో, అది యొకదినముగా భావింతురు." ఈ వాక్యము తైత్తిరీయబ్రాహ్మణములోని — 'ఏకం వా ఏత ద్దేవానామహః య త్సంవత్సరః' అను వాక్యమునకు సరియైన దండాన్వయమువలె నున్నది గదా ! ఇంకనిట్టి వెన్నో వైవిషయము

1 వెందిదాద్. ఫరార్డ్, 2, పేరా 40. Arc. H. P. 71.

దృఢపఱుచుటకుఁ దగిన[1] ప్రమాణములుకావు. ఇఁక నుత్తరధ్రువమండలమున నెలరోజు లుషస్సు గనవచ్చు ననుటకుఁ బ్రమాణవచనములు కొన్ని—

సంహితలందును బ్రాహ్మణములందును గూడ, ఉషస్సు పెక్కుచోట్ల మిక్కిలి విచిత్రముగా వర్ణింపఁబడినది. అనేకస్థలముల నిది బహువచనాంతముగా వాడఁబడినది. మఱియు, ఉదయింపఁబోవునది - ఉదయించుచున్నది - ఉదయించినది, అని మూఁడు భేదములతోను, మూఁడురంగులతోను వర్ణింపఁబడినది [2] దీర్ఘకాల ముండునదిగాను ముప్పదిరోజు లుండునదిగాను నిరూపింపఁబడినది. ఈ యుషస్సును గూర్చి తిలకుపండితులు ప్రత్యేకముగా నొక ప్రకరణము వ్రాసి యున్నారు.[3] విశేష విషయములు దానివలనఁ దెలియవచ్చును గావున గ్రంథ విస్తరము గాకుండనిందు కొలఁది ప్రమాణములు మాత్రము గ్రహింతము. 'ఈయుషస్సుదయించి యెంతకాలమైనది? దీని కంతము కనఁబడదే! ముందు పుట్టిన యుషస్సులవలెనే యిదియును వెలుఁగు కలిగించుచుఁదన వెనుకఁ బుట్టునట్టి తక్కిన యుషస్సులతోఁ జక్కఁగాఁ గలియుచున్నది."[4] (దీనిచే, ఉషస్సున కనంతత్వము క్తమగుచున్నది. రాఁబోవునుషస్సులు కూడ దీని ప్రకాశము ననుకరించుచున్నవి. భాష్యము) 'అక్కచెల్లెళ్లయిన ముప్పదిమంది ఉషోదేవతలు సమానమైన ప్రకాశరూపమును ధరించి విద్యుత్పురుషులవలెఁ గనవచ్చుచు గిరగిరఁ దిరుగుచు బయలుదేరినచోటు చేరుచున్నారు. '(ఉషస్సులు) ఈ దినమునను బరస్పరము సమానములే. అట్లే రేపును బరస్పరము సమానములే. ఇట్లేకరూపములయిన యుషస్సులు పరిశుద్ధములు. ఇవి యత్యంత మాయతమును తమోనివారకుఁడగు సూర్యునిస్థానమునగు మేరువలయమును (ప్రతిదినము) సేవించుచున్నవి. (ఇవి సూర్యునికి) ముందు ముప్పదియోజనముల దూరమునఁ బుట్టుచున్నవి. వీనిలో

1. ఉషసే స్వాహా వ్యుష్ట్యై స్వాహోదిష్యతే స్వాహోద్యతే స్వాహోదితాయ స్వాహా. తై. సం. 7-2-20. త్రింశ దాను చిత్రాః-ఋ ౧-౧౨-౧.

2. Arctic Home. cha V.

3 కియత్యా యత్సమయా భవాతి యావ్యూషు ర్యాశ్చనూనం వ్యుచ్ఛాన్, అనుపూర్వాః కృపతే వావశానా ప్రదీధ్యానా జోషమన్యాభి రేతి. ఋ. 1-113-10

4. త్రింశ త్స్వసార ఉపయన్తి నిష్కృతగ్ం సమానం కేతుం ప్రతి ముఞ్చమానాః ఋతుగ్ం స్తన్వతే కవయః ప్రజానతీ ర్మధ్యే చ్ఛన్దసః పరియన్తి భాస్వతీః. తై. సం. 4-3-11.

నొక్కొక్కటియు (ఏకైక భూభాగవర్తులకు) తత్కాలమందే గమనాగమనాది రూపమైన ప్రజ్ఞను నిర్వహించుచున్నవి.'[1]

'సదృశీ రద్య'యను ఋక్కునకుఁ బై యర్థము వచ్చునట్లు సాయణాచార్యులవారు భాష్యము వ్రాయుచు, ఉషఃకాల పరిమితిని ప్రతిదినసూర్యగతిని యోజనశబ్దార్థమును నిర్ణయించుచు, సర్వదేశములవారికి నొక్కదినమందే యుషస్సు గనఁబడును గావునఁ బ్రదేశబాహుళ్యమునుబట్టి యుషస్సులనెడి బహువచనము యుక్తమగుచున్న దనుచు నింకనుగొన్ని విశేషములు వివరించియున్నారు. తిలకుగారీఋక్కు నుదాహరించుచు "ఇంతకు మున్నెవ్వరును దీని భావము తృప్తికరముగా వెల్లడించియుండలేదు. సూర్యునిముందు ముప్పదియోజనముల దూరమున నుషస్సులు వెలుఁగుచున్న వనెడిసాయణవచనము మిక్కిలి సరసముగా నున్నది. కాని సాయణులు యోజనశబ్దమునకు సరియైన యర్థము వ్రాయలేదు. వ్రాసినయర్థము జ్యోతిర్గణితమునకు విరుద్ధముగా నున్నది. పాశ్చాత్త్య లీపదమునకు వ్రాసిన యర్థములైనను బొసఁగవు.' అనుచు ఋగర్థ మిట్లు వ్రాసిరి.

'ఉషస్సులు నేఁడున్నట్లే రేపు నుండును. అవి వరుణదేవుని నివాసమునఁ జాలకాలము వసియించును. అవి పరిశుద్ధములు. అవి యొకదాని వెనుక నొకటి వలయాకారముగా ముప్పదియోజనములు తిరుగును. అట్లు తిరుగు ప్రతి యుషస్సును మొదట బయలుదేఱిన స్థలమును మరలఁ జేరును."[2]

ఇందు. పరియన్తియను క్రియకు గుండ్రముగాఁ దిరుగుచున్న వనియు, క్రతుశబ్దమునకు యథాస్థానమనియు, యోజనశబ్దమున కొకరోజునఁ దిరుగ,దగిన దూరమనియు నర్థములు వ్రాసిరి. యోజన శబ్దమున కీయర్థమును సాయణులెచ్చటను వ్రాయలేదు. పాశ్చాత్త్యపండితు లెవరును కూడ నిట్లు వ్రాయలేదు. కాని పూర్వోదాహృత ప్రమాణవచనములను బట్టియు సందర్భమును బట్టియు నితర ఋక్కులలోని పదాదిశబ్దములను బట్టియు తిలకపండితు లీయర్థము సాధించిరి. దీని యౌచిత్త్యమునకు విద్వల్లోకమే ప్రమాణము. ఈ సందర్భమున సద్యశ్శబ్దమున కొకయర్థము నాకు స్ఫురించినది, అది యీ వాదమున కుచితమగునేని పండితలోక మాదరించుఁగాక. అపుడు చతుర్థపాద తాత్పర్య మిట్లుండును.

1. సదృశీ రద్య సదృశీ రిదు శ్వో దీర్ఘం సచంతే వరుణస్య ధామ, అనవద్యాస్త్రింశతం యోజనా న్యేకైకా క్రతుం పరియన్తి సద్యః. ఋ. 1-513-8.

2. Arctic Home P. 103.

"(ఉషస్సులు) ఒక దినమం దొకటి చొప్పునఁ దిరుగుచు మొదట బయలుదేఱిన స్థలముఁ జేరును' సద్యశ్శబ్దమున కొక దినమం దనెడి యర్థము నిరుక్త సమ్మత మగును. ఇంక నీ విషయమును సమర్థింప నుదాహరింపఁబడిన యుషోవర్ణనము లనేకములు కలవుగాని యందు రెండు మాత్రము గ్రహింతము.

'బ్రహ్మ యీ పరిదృశ్యమానమైన జగత్తు నైదుగు రుషో దేవతలతో నిర్మిం చెను. వారిలో నొక్కొక్కరి కైదుగురు చొప్పునఁ జెల్లెండ్రను గలిగించెను.'[1]

మొదటి యైదుగురును వారి సోదరు లిరువది యైదుగురును గలిసి ముప్పది మంది యగుచున్నారు. అనఁగా నుత్తరధ్రువ ప్రాంతమున విడువకుండఁగా ముప్పది దినములలోఁ గనవచ్చు నుషస్సులు వీరే యనుట విదితము. మఱియు, "ఉషోదేవీ! భర్త సమీపమున సంచరించు పతివ్రతవలెనే జారుఁడై రాత్రితోఁ గలసియున్న నీ ప్రియుఁడగు సూర్యునియెడ సంచరించుచు, నతని విడువక యింకను నీవు కనఁబడుచునే యున్నావు. (అనఁగా దుష్టశీలుఁడైన పతిని సాధ్వి యెట్లు విడువదో యట్లే నీవును సూర్యుని విడువకున్నా వని భావము) అందుచే సూర్యుఁ డుదయించుచుండ నతని (ప్రాచీనం) ముందు ప్రదేశమున నేవి యుద యించుచున్నవో, ఆ నీ తేజస్సులే (అహాని) యింక ననేకము లున్నవి."[2]

పై సాయణభాష్య తాత్పర్యము తిలకించిన తిలకపండితులు 'అహాని' యను దానికి దినము లర్థము చెప్పి యా రోజు లింక ననేకము లున్నవని చెప్పుట సమం జస మని యభిప్రాయ మిచ్చిరి. ఈ మార్పుగూడ సందర్భోచితమై యుత్తరధ్రువ వాదమును బలపఱచుచున్నదని చెప్పవచ్చును.

ఉత్తర ధ్రువమునకును దానికిఁ గ్రిందుగా నుండు ధ్రువరేఖకును నడుమ నుండు భూభాగ ముత్తర ధ్రువమండల మనఁబడును. అచ్చట ధ్రువనక్షత్రము సరిగా నెత్తిమీఁద నుండక ప్రక్కగాఁ గనిపించును. సూర్యునియుదయాస్తమయ ములందును మార్పులు గనవచ్చును. అచ్చటి సంవత్సరలక్షణ మందలి భిన్నభిన్న ప్రదేశములనుబట్టి మాఱుచుండును. అనఁగా, దీర్ఘరాత్రి - రాత్రి యెక్కువ

1. పఞ్చపఞ్చ భ్రాతా విదధా విదం యత్తాసాగ్ స్వసృ రజనయ త్పఞ్చ పఞ్చ. తై. సం. 4-3-11.

2. తా నీ దహాని బహులా న్యాసన్యా ప్రాచీన ముదితా సూర్యస్య, యతః పరిజార ఇ వాచర న్త్యుషో దదృ శే న పున ర్యా తీవ. ఋ. 7-76-3.

పగలుతక్కువయగు దివారాత్రములు, పగలెక్కువ - రాత్రి తక్కువయగు దివారాత్రములు, దీర్ఘ దివసము - అనుక్రమమున సంవత్సర చక్రము తిరుగుచుండును. దీర్ఘరాత్రి దీర్ఘ దివసముల తగ్గుదలనుబట్టి క్రమముగా, అహోరాత్ర క్రమముగల మాసములు. ఏడు - ఎనిమిది - తొమ్మిది - పది - పదకొండు. అగును. ఈ మాసస్థితికిఁదగినట్లు, ఉషఃకాలపరిమితియు క్షీణించుచుండును.

ఆ మండలమున నందందు నివసించువారి సంవత్సరములు సూర్యరశ్మి గల మాసములకే సంబంధించినట్లును, అట్టి సంవత్సరములలోఁ జేయు క్రతువులు వార్షిక సత్రములనఁబడుచు వచ్చినట్లును, ఆ యజ్ఞములు చేయువారు - నవగ్వలు - దశగ్వలు - అను పేళ్లఁ బరఁగినట్లును, వేదములవలనఁ దెలియవచ్చుచున్నది.[1] ఈ విషయములన్నియు నిందు వివరించుట ప్రకృతముగాదు కావునఁ బ్రధాన విషయమునకు సంబంధించిన దీర్ఘరాత్రి వర్ణనము లొకటి రెండు చూతము.

'అదితీ ! మిత్రావరుణులారా ! మీయెడ నపరాధము చేసినాము. అయినను మాపై దయ యుంచి రక్షింపుఁడు ఇంద్రా ! విస్తీర్ణమును భయరహితమునైన నీ తేజస్సును మేము పొందెదముగాక, గాఢాంధకారయుక్తములైన దీర్ఘరాత్రులు మా కెదురుగా వ్యాపింప కుండుఁగాక.'[2]

"చిత్రావసూ ! సుఖముగా నీపారమును బొందనిమ్ము. రాత్రియే చిత్రావసువు......దీనికై పురాతన కాలమందు బ్రాహ్మణులు భయపడిరి.[3]

'దేని యావలియొడ్డు కనవచ్చుటలేదో, అట్టి రాత్రియందు చరాచర ప్రపంచ మంతయు విభజింపరాక యేకాకారముగా నున్నది. ఓ రాత్రీ! మేము విపత్తులేమియు లేకుండ నీ పారము పొందెదము గాక. ఓ దేవీ! నీ యావలియొడ్డు చేరెదము గాక.[4]

1. ఋ 9-114-3, 5-45-9, 1-164-2, 1-33-6. 3-39-5. మొదలైనవి.
2. అదితే మిత్ర వరుణోత మృళయ ద్యో వయం చకృమా కచ్చి దాగః। ఉర్వశ్యా మభయం జ్యోతి రింద్ర మానో దీర్ఘా అభినశ న్తమిస్రాః ఋ. 2-27-14.
3. చిత్రావసో స్వస్తితేపార మశీయ......రాత్రి ర్వైచిత్రావసు రవ్యుష్ట్యైవా ఏతస్యై పురా బ్రాహ్మణా అభైషు ర్వ్యుష్టి మేవా వరున్ధే. తై. సం. 1-5-5,7.
4. న యస్యాః పారం దదృశే న యోయు వద్విశ్వ మస్యాం నివిశతేయ తేజతి। అరిష్టాస న్త ఉర్వి తమస్వతి పార మశీమహి పారమశీమహి. అథ. 19-47-2.

'మేము, ఒక్కొక్క రాత్రినే చూచువారమై మా బిడ్డలతో నీ దీర్ఘరాత్రిని దాఁటెదముగాక. నావ లేనివారు గంభీరమైన సముద్రాదికమునువలెనే మా శత్రువు లీ రాత్రిని దాఁటఁ జాలరు.[1]

అబ్బా! ఏమిభయము! ఎంత పరితాపము? ఈ రాత్రి కంతమున్నదా? ఎప్పటికైనఁ దెల్లవాఱునా? మా పిల్లలును మేమును బ్రతికి బయటఁ బడుదుమా? అనిపించి దేవతలకు మ్రొక్కించి ప్రాచీనార్యులను భయసాగరమున ముంచిన యా దీర్ఘరాత్రి యుత్తర ధ్రువమందలి భయంకర రాత్రి యగునుగాని, కొన్ని గంటల మాత్ర ముండునట్టి భరతఖండ రాత్రి యగునా? ఇఁక నితర ప్రమాణములు కొన్ని—

పారసీకుల మత గ్రంథములందును గ్రీకులు మొదలగువారి పూర్వగ్రంథములందును ఋగ్వేదాదులలోని యుత్తర ధ్రువప్రాంత వర్ణనలకు సరివచ్చు వర్ణనము లనేకములు కలవు. అవి యన్నియు, తిలకుగారి గ్రంథమునఁ జూడనగును. వానిలో నొకటి యిం దుదాహరింతును. ఇది హిమప్రళయము లేక జలప్రళయమునకు సంబంధించిన గాథ—

"ఒకనాఁటి యుదయమున మనువునకుఁ జేతులు కడుగుకొనుట కొకరు నీ ళ్ళిచ్చిరి. అతఁడు హస్తప్రక్షాళనము చేయుచుండఁగా నొక చేఁపపిల్ల యా నీళ్ళ నుండి యతని చేతిలోఁ బడి 'అయ్యా! నన్ను రక్షింపుము తరువాత నిన్ను నేను రక్షింతు' ననెను. ఎట్లు రక్షింతువని యతఁ డడుగ ప్రజానాశకమైన జల ప్రళయమునుండి నిన్ను రక్షింతునని యది పలికెను. నిన్ను నే నెట్లు రక్షింతునని మరల నడుగ నది యిట్లనియె.

'మే మెన్నాళ్ల చిన్నపిల్లలముగా నుందుమో. అన్నాళ్లును భయమే సంభవించుచుండును. ఏ మనఁగా? చేఁప చేఁపనే తినును. అందుచే న న్నొక నీళ్ళ కుండలోఁ బెట్టుము. ఆ కుండ నాకుఁ జాల నపుడు పెద్ద నీళ్ళగొయ్యితీసి దానిలో విడిచిపెట్టుము. ఆ గొయ్యి మించునట్లు నేను బెరిఁగినంతనే నన్నుఁ దీసికొనిపోయి సముద్రములో విడిచిపెట్టుము. అపుడు నేను హాని లేకుండఁ జక్కఁగా వర్ధిల్లుదును. ముం దొకానొక సంవత్సరము పెద్ద వఱద వచ్చును. అపు డొక నావయెక్కి నా వద్దకు రమ్ము. నేను వఱద దాఁటించి నిన్నుఁ గాపాడుదును' మనువు మత్స్యము

1. రాత్రిం రాత్రి మరిష్యన్త స్తరేమ తన్వా వయం। గంభీర మప్లవా ఇవ న తరేయు రరాతయః. అథ. 19-50-3.

చెప్పినట్లు చేసెను. అది చెప్పినట్లే యొకయేఁడు వఱదయు వచ్చెను. మనువు నావయెక్కి యా మత్స్యమునొద్దకు వెళ్ళెను. ఆ ఝషము నావను సమీపించెను. మనువు దాని నోటికి నావత్రాడందిచ్చెను. అది యా త్రాడు నోటఁబట్టుకొని యుత్తరగిరి వైపు నావను లాగుకొనివచ్చి (గిరిని జేరి) ఈ చెట్టునకు నావకట్టి పెట్టుము. ఈ ప్రవాహము తగ్గినపిదపఁ గ్రిందికి దిగుమని చెప్పెను. మనువట్లే చేసెను. అందుచేతనే యుత్తరగిరికి మనువు నవసర్పణమను పేరువచ్చినది. ఆ వఱదలో సర్వప్రజలు నశించిరి మను వొక్కఁడు మాత్రమే మిగిలెను. అందుచే నతఁడు ప్రజాకాముఁడై పాకయజ్ఞము చేసెను. దానివలన నొకసంవత్సరమున కొకస్త్రీ యుదయించెను.'' శతపథ బ్రాహ్మణము.[1] ఈ కథయే, అథర్వవేదమునఁ గూడఁ గలదు.[2] ఇదియే పారశీకుల 'వెంది'యులు అను మత గ్రంథములోఁగూడ నున్నది.[3] ఇందలి జలప్రళయ మందు కూడ ప్రళయ మనఁబడినది. ఇందలి మను వందు యిమ యనురాజుగా నుండెను. మనువు వివస్వంతుని పుత్రుఁడు 'యిమ' వివంఘతుని పుత్రుఁడు. దీనినిబట్టి యిద్దఱును వైవస్వతులగు చున్నారు. ఇందు మత్స్యము రక్షణోపాయము చెప్పెను. అందు అహురామజ్దాయను దైవము రక్షణోపాయము చెప్పెను. ఈ కథలయొక్క పోలికనుబట్టి యీ రెండార్యశాఖల వారును దొల్లి యొకచోట నివసించియుందురని చెప్పవచ్చును గదా! ఇఁక నట్టిస్థల మేది యనుటకిది వఱకుఁ జూపినవాని కుపోద్బలకముగా, పారసీక గ్రంథములలోని మఱికొన్ని వాక్యము లాలోకింతము.

అహురామజ్దా యను పారసీకుల దేవుఁడు, ఐర్యనవైజో - సుగ్ద - మోరు హ ప్తహిందు - రంఘ - మొదలగు పదునాఱు దేశములను మానవ - నివాసయోగ్యములనుగా నిర్మించెననియు, అందు ఐర్యనవైజో స్వర్గమనియు వెందిదాదులో వర్ణింపఁబడినది. ఇందు, ఏడుమాసములు వేసవియు, అయిదుమాసములు చలియు నుండునని 'బుందహిష్' అను గ్రంథము చెప్పుచున్నది. పది మాసములు వేసవియు రెండుమాసములు చలియనుండునని 'అవెస్తా' చెప్పుచున్నది. ఈ భేదములు ఋగ్వేదములోని సప్తమాస, దశమాస సంవత్సరములకు సరిపడుచున్నవి. దీనిని బట్టి ఐర్యనవైజో యనునది, ఉత్తరధ్రువమండలమే యనియు, ''ఐర్యన=ఆర్యుల

1. 'మనవేహవై ప్రాతః—' ఇత్యాది-శత-బ్రా-కాం. 1. అధ్యా. 8. బ్రా. 3. మం. 1-12.
2, 14-39 - 7, 8, అథర్వ—
3. వెందిదాద్ 2. అధ్యా.

యొక్క, వైజో = బీజము, విత్తనము, అనఁగా మూలస్థానము" అనెడి వ్యుత్పత్త్యర్థమును బట్టి యిది యార్యుల నివాసస్థానమనియు విశదమగుచున్నది. ఇఁకనో, ఐర్యనవైజో యెక్కడిదనెడి విషయమున బహువాదములు గలవు. వాని నెల్ల తిలకుపండితులు ఖండించి, అది యుత్తర ధ్రువమండలమేయని నిర్ధారణ చేసి యున్నారు. కావున నిఁక దీనిని విడిచి మూఁడవవాదము గ్రహింతము.

ఆ ర్యా వ ర్త వా ద ము

ఆర్యుల జన్మభూమి యార్యావర్త మనెడి వాదము గూడఁ బ్రాచీనమైనదే కాని నేఁటిదిగాదు. స్వదేశమందలి యభిమానముచే భారతీయులే యిట్లు చెప్పుచున్నారనుటకు వీలులేకుండఁ బాశ్చాత్యపండితులు కొంద ఱీయభిప్రాయము నెడనెడ వెల్లడించు చుండుటయే యిందలి విశేషము. ఋగ్వేదమందు వర్ణింపఁబడిన సప్తసింధువులు (నదులు) ప్రవహించినట్టి దేశమే యార్యుల జన్మభూమియనియు, అదే యార్యావర్తమనియు నిందలి సారాంశము. ఈ వాదమును సమర్థించుటకును, ఉత్తర ధ్రువవాదమును ఖండించుటకును, ఆర్యుల యాదిమ నివాసమునుగూర్చి ప్రాచ్యపాశ్చాత్య పండితులు చర్చించి వ్రాసిన చరిత్ర గ్రంథములలోని కొన్ని విమర్శన వాక్యములను, భూగర్భ భూగోళాది శాస్త్రజ్ఞుల యూహలను ఋగ్వేదాదులలోని కొన్ని మాటలతో సరిపుచ్చి సమన్వయించుచు, కలకత్తా విశ్వవిద్యాలయ చరిత్రాధ్యాపకులగు అవినాశ చంద్రదాసుగారు 'ఋగ్వేదీయ హిందూదేశము' (Rig- Vedic India) అనుపేర నొక పెద్దగ్రంథము నాంగ్లమున రచియించి. 1921 లోఁ బ్రకటించిరి. అందలిచర్చ యంతయు సంగ్రహముగానైన మన మిందు గ్రహించుట కవకాశము లేదు. కావలసిన వారాగ్రంథమును జూతురుగావున నుత్తరధ్రువ వాదమును నిరాకరించుటకు వారెత్తుకొనినవానిలో నతిముఖ్యములైన కొన్ని విషయములను మాత్రము మనము గైకొని పరికింతము.

''ఇతర నదులన్నిటిలోను మిక్కిలి పవిత్రమైన సరస్వతీనది పర్వతముల నుండి సముద్రమువఱకుఁ బ్రవహించుచున్నది.[1] అనెడి ఋగ్వేద వచనమునుబట్టి యీ ఋక్కు పుట్టినకాలమున సరస్వతీనది సముద్రములోఁ గలియుచున్న దనుట తెల్లము. కాని యది యిప్పుడు సముద్రములోఁ బడుటలేదు సరిగదా పైగా రాజపుతానా యెడారిలోని యిసుకదిబ్బలలో నంతరించి పోయినది. అక్కడికి సముద్ర

1. ఏకా చేతత్ సరస్వతీ నదీనాం శుచి ర్యాతీ గిరిభ్య ఆ సముద్రాత్. ఋ. 7-95-2.

మిపుడు కొన్నివందల మైళ్లదూరమునఁ గానిలేదు. కావున సరస్వతీనది యఱఁగిపోయిన రాజపుతానాయెడారి బహుప్రాచీనకాలమున సముద్రమై యుండునని తెలియవచ్చుచున్నది. మఱియు, ప్రాచీన హైందవార్యులు నాలుగు సముద్రము లెఱిఁగినట్లును, ఆర్యవణిజులు సముద్రముపై నౌకాయానము చేసినట్లును ఋగ్వేదమునఁ బెక్కుచోట్లఁ గనవచ్చుచున్నది.[1] వారు నివసించు భూభాగమున సప్తసింధువులు (నదులు) ప్రవహించుచున్నట్లును, అందుచే నది సప్తసింధుదేశ మయినట్లును, అదియే యార్యావర్తనామము చెందినట్లును ఋగ్వేదములోని కొన్ని వర్ణనల వలనఁ దెలియవచ్చుచున్నది.[2] ఈ సప్తసింధువే పారశీకుల జెండవెస్తాలో 'హప్తహిందు'గాఁ బేర్కొనఁబడినది.

ఋగ్వేదీయార్యులు సప్తసింధుదేశము దాఁటి యావలిదేశము నెఱిఁగినట్లు కనఁబడదు. అందుచే వారికిఁ దెలిసినట్లు వర్ణింపఁబడిన నాలుగు సముద్రము లీ యార్యావర్తభూమికి నాలుగు సరిహద్దులుగా నుండవలసియున్నది. భూగర్భశాస్త్రమునుబట్టి చేసిన పరిశోధనవలన సప్తసింధుదేశము చతుస్సముద్ర పరివేష్టితమని తేలినది. ఈ దేశము ఋగ్వేదీ యార్యులు నివసించుకాలమున మిక్కిలి హిమప్రాయమై యున్నట్లుగా ఋగ్వేదమువల్లను, పరిశోధనవల్లను గూడఁ దెలియవచ్చుచున్నది. కాని యీ కాలమున దీని సరిహద్దులగు సముద్రములు కానరావు. అవి యతి ప్రాచీనకాలమున భూకంపాద్యుపద్రములవలన మఱుఁగుపడిపోయినవి. ఆ సముద్రప్రదేశములు మెట్టలయిపోయినవి. అంత మాత్రమున నార్యులు సముద్రమే యెఱుఁగరనియు ఋగ్వేదములలో వర్ణింపఁబడిన సముద్రము మనము చూచుచున్న సముద్రమువంటిది గాదనియు, అది మిక్కిలి లోఁతునీటితో నున్న నదిలోని పెద్ద మడుఁగనియుఁ బాశ్చాత్యులు కొందఱు చెప్పినమాట సరిగాదు. వైదికార్యులనాఁటి దేశపరిస్థితులును ఆనాఁటి సరిహద్దులును అప్పటి శీతోష్ణస్థితియు మాఱి యెన్నో వేల సంవత్సరములైనది. అయినను, ఆ చిహ్నములు ఋగ్వేదమువల్లను భూగర్భ పరిశోధనవల్లను సత్యములని తెలియుచున్నది. కావున ఋగ్వేదీయార్యుల తొలుతటి నివాసము సప్తసింధుదేశ మనుట ధ్రువము. ఉత్తర ధ్రువమండలముగాని, యితర ఖండములు గాని కావు," అనుచు బహువిధ ప్రమాణము లుదాహరించుచు నార్యా

1. 'రాయః సముద్రాం శ్చతురోఽస్మభ్యం సోమవిశ్వతః ఇత్యాది ఋ. 9-33-6, 10-47-2, 1-48-3- 1-56-2, 1-116-3, 4-55-6, 5-35-6, 7-88-3.

2. 'ఇమం మేగం గే—' ఇత్యాది—10-75-5, 6; 1-32-12, 4-28-1.

వర్తవాదమును సమర్థించి, తిలకుగారు చూపిన ప్రమాణముల నీ క్రింది విధముగా ఖండించిరి.[1]

[2]"నక్షత్రమండల మధ్యముగా, కుమ్మరసారెవలెఁ దిరుగుట యుత్తర ధ్రువ లక్షణమైనట్లును, అది ఋగ్వేదవర్ణనలకు సరిపడుచున్నట్లును, తిలకుగారు చెప్పినది సరిగాదు. ఋగ్వేదములలో నది రథచక్రమువలెఁ దిరుదుచున్నట్లు వర్ణింపఁబడినది. ఆఱునెలల పగటిని; ఆఱునెలల చీకఁటిని దెలుపువర్ణనలు ఋగ్వేదమున లేవని తిలకుగారే యంగీకరించిరి. ఉత్తర ధ్రువమున సూర్యుఁడు దక్షిణ దిక్కున నుదయించుచున్నట్లు గోచరించును గావున, ఉషస్సుకూడ దక్షిణదిక్కునందే యుదయించునట్లు గోచరింపవలెనుగాని ఋగ్వేదములో నది తూర్పున నుదయించు చున్నట్లు వర్ణింపఁబడినది. అందుచే ఋగ్వేదములోని యుషోవర్ణన లుత్తర ధ్రువ వాదమున కుపకరింపవు. ఈ విషయ మొక్కటియే తిలకుగారిని సమాధానపఱిచి వారి యుత్తర ధ్రువవాదము వదలుకొనునట్లు చేయుటకుఁ జాలియున్నది. మఱియు నెలదినము లెడతెగనియుషస్సు ఋగ్వేదవర్ణనలలోఁ గనరాదు. 'వెందిదాద్'లోని ఐర్యనవైజో తిలకుగారు తలంచినట్లుగా నుత్తర ధ్రువములోనిది గాదు. కావున నుత్తర ధ్రువవాదము సరిగాదు. ఆర్యుల మొదటి నివాస మార్యావర్తమే" అనుచు తిలకుగారు చూపిన వివిధ ప్రమాణములను విమర్శించుచు నెంతో వ్రాసిరి. మఱియు తిలకుగారుదాహరించిన మనుమత్స్య కథను వీరుగూడ లేవనెత్తి చరిత్రలో ముఖ్య మైన హిమప్రళయ వృత్తాంతము ఋగ్వేదమున వర్ణితము కాలేదనియు, అర్వాచీన మైన శతపథ బ్రాహ్మణములోని యీ కథ నుత్తరధ్రువమునకు సరిపుచ్చుట యుక్త ముగా లేదనియుఁ జెప్పుచు, భూకంపాదులవలన రాజపుతానా సముద్రము పైకి లేవఁగావచ్చిన జలప్రళయమునకు సప్తసింధుదేశము పాల్పడినపుడు మనువు ప్రాణ సంరక్షణార్థ ముత్తరగిరికిఁ జేరెననుట సముచితముగా సమన్వయించుచున్నదని సమర్థించిరి. ఇది యిట్లుండ—

1. పూర్వోక్తవిషయమును, చెప్పఁబోవు నుత్తర ధ్రువవాద ఖండన విషయమును దాసుగారి ఋగ్వేదీయ హిందూదేశములోని వివిధ ప్రకరణములనుండి సంగ్రహింపఁబడినవి. వివరము లాగ్రంథమునఁ జూడనగును.
2. ఇందు దాహరింపవలసిన ప్రమాణవచనములుత్తర ధ్రువవాద సందర్భమున వెనుక నుదాహరింపఁబడినవి.

దాసుగారి గ్రంథము మాడ్కి నుత్తరధ్రువవాదమును. వేద భూమి' యను నాంధ్రగ్రంథముగూడ నిరసించుచున్నది.[1] ఇంతకు మున్నుదాహరించిన మను మత్స్య కథయందలి 'ఉత్తరగిరి' ప్రయోగమునుబట్టి "ఉత్తరధ్రువవాసులు ప్రళయా నంతరము దక్షిణముగా వచ్చుచుఁ దమకు దక్షిణదిక్కున నున్న హిమగిరి నుత్తర గిరియనుట సంభవింపదు కావున, నార్యావర్తమునుండి యుత్తర ధ్రువమునకు వలసవెళ్లి యొకశాఖవారు కొంతకాలమచ్చట నివసించి ప్రళయము వచ్చినపుడు తిరిగి తమ జన్మభూమియగు నార్యావర్తమునకు వచ్చుచుఁ దమకుఁ బూర్వమభ్యస్త మయిన రీతిని హిమాలయము నుత్తరగిరియని పిలిచి యుందురు. అట్లు కానిచోఁ గ్రొత్తగా వచ్చువారు తమకు దక్షిణముగా నున్న హిమగిరి నుత్తరగిరియని పిలు చుట కేవల మసంభవము" అని యీ గ్రంథమొక యాక్షేపము చేసియున్నది. కాని యిది యసంగతము. ఉత్తరధ్రువమునకు వలసవెళ్లినవారే మరలఁ దిరిగివచ్చి రనుటకు వీలులేదు. వారి సంతతివారికి హిమగిరి యుత్తరగిరియనెడి యభ్యాస ముండుట కంతకంటెను వీలు కనఁబడదు. కాక యెవరయినను దమకు దక్షిణ ముగానున్న కొండ నుత్తరగిరియనుట యుక్తియుక్తమే కాదు. కావున హిమగిరికి దక్షిణభాగమున నివసించిన యార్యసంతతిమహర్షులు తమ ప్రాచీన గురుపరంపర నుండి కర్ణాకర్ణికగా వచ్చుచున్న యాగాథను శతపథబ్రాహ్మణమున సమకూర్చుచు, మనువు విపత్సముద్రమును సముద్రమును దాఁటి యీ యుత్తరగిరిని జేరెనని చేతితోఁజూపుచుఁ బ్రయోగించినట్లుగా 'ఏతముత్తరగిరిం' అని ప్రయోగించి యుందు రనుట సంభావ్యమగును గాని యార్యావర్తార్యు లుత్తరధ్రువము చూచుటకు వెళ్లి వచ్చుచు నిట్లు ప్రయోగించి యుందురనుట యర్థము కాదు. అయినను ఋగ్వే దాదులలోని యుత్తరధ్రువలక్షణ వర్ణనలను సమర్థించుటకై యార్యులు కొంత కాలమైన నుత్తరధ్రువమండలమున వసించిరని యంగీకరించుచున్న యీ గ్రంథ మందలి పై యాక్షేపము కూడ ముదావహమే యగుచున్నది. ఇఁక నాల్గవవాద మును గూడ నించుక యవలోకింతము.

మధ్యాసియా ఖండవాదము

ఈ వాదమును 1820 లో, జే. జి. రోడ్ అను పాశ్చాత్య విమర్శకుఁడారం భించెను. వేదాదులలోని ప్రథమ ప్రకరణమునఁ దెలియవచ్చు భూగోళ పరిస్థితిని

1. అచ్యుతుని వెంకటాచలపతిరావుగారి యీ గ్రంథము స్వధర్మప్రకాశినిలోఁ బ్రకటింపఁబడినది.

బట్టి చూడఁగా, ఇరానియనుల (పారశీకుల) ప్రథమనివాసము బాక్ట్రియా ప్రదేశమని యతని యూహ. దీనినే తరువాత పాట్‌దొరయు (Schlegal) షెగ్లల్ పండితుఁడును బలపఱిచిరి. ఆసియా ఖండముయొక్క కేవల దక్షిణ భాగముననున్న హిందూదేశమునుండి మానవతరంగము లుత్తరపశ్చిమ దిశలకుఁ బ్రవహించినవనుట యుక్తముగాదు. తమ జన్మస్థానమునకు దగ్గఱగానుండు దేశములకు మనుష్యులు వలసపోవుట సహజము. అట్టిమధ్యదేశము కాస్పియను సముద్రము తూర్పుభాగమనుట సమంజసమని షెగ్లల్ పండితునివాదము.[1] దీని కనుగుణముగా, ఇండియా జర్మనీ జాతుల మొదటి నివాసము, ఇరానియన్ దేశములోని ఆక్సస్, జక్సార్టీస్ నదుల ప్రాంతభూమియని స్పీగల్‌పండితుఁడు తలంచెను.[2] బన్సెన్ పండితుఁడు, ఆర్యులు హిమాలయములు దాఁటి దక్షిణముననున్న సప్తసింధుదేశమునకుఁ బోయినట్లు కనఁబడుచున్నది. అంతకుముందు వారు హిమాలయముల కుత్తరమున గ్రీకులు - ఇటాలియనులు - స్లావియనులు - జర్మనులు - కెల్టులు - అనువారితోఁ గలసియుండిరని వ్రాసెను.[3] ఆర్యుల నివాసము మధ్యాసియా యను తలంపుతోనే భాషాశబ్దముల సాదృశ్యమును దానికిఁ దోడు చేసి మాక్సుముల్లరు (Max Muller) పండితుఁడు, హైందవులు - పారశీకులు - గ్రీకులు - రోమనులు - స్లావులు - కెల్టులు - జర్మనులు అను జాతులవారి పూర్వులందఱు నొకప్పుడొకచోటఁ గలసియుండురనియు, అది మధ్యాసియాలోని యత్యున్నత ప్రదేశమై యుండుననియుఁ దలంచెను.[4] ఆర్యులు హిందూకుష్ పర్వతములు దాఁటివచ్చి హిందూదేశములోని భాగమైన పంజాబుదేశ మాక్రమించి యుందురని (Macdonell) మాగ్డోనలు పండితుఁడు వ్రాసెను.[5] గోవెన్ (Gowen) పండితుఁడు గూడ వీరిమతమే యవలంభించెను.[6] తరువాతికాలమున శకులు యూనీలు హూణులు మంగోలీలు, అను వారు మధ్యాసియానుండియే హిందూదేశమునకుఁ గొందఱును యూరపుదేశమునకుఁ గొందఱును ప్రయాణము చేయుట చూడఁగాఁ దొలుత నార్యజాతులవారు కూడ నచ్చటనుండియే బయలుదేఱి యితర దేశములకుఁ బోయి యుందురని యూహించుట కెక్కువ యవకాశము కనఁబడుచున్నది. కావున హిందూదేశార్య

1. Origin of Hindus.
2. Spiegel's Avesta.
3. Bunsen's outlines Vol I. p. 139.
4. Lectures on the Science of Language in 1861.
5. History of Sanskrit Literature p. 139.
6. History of Indian Literature Ch. 3.

లచ్చటినుండి వచ్చినవారే యనుట సంభావ్యమని కొందఱూహించు చున్నారు. మఱియు దూరదేశములకుఁ బోయిన తెగలు చిన్న వగుటచే నక్కడి జాతులతోఁ గలసిపోఁగా వారిస్వభాష మిక్కిలి మాఱిపోయి యుండుననియు, అయినను హైందవార్యభాషలోని కతిపయశబ్దముల సాదృశ్యము నేఁటికిని లిథూనియన్ మొదలగు కొన్నిటియం దెక్కువగాఁ గనఁబడుచున్నదనియు వారు తమవాదమును బలపఱుచుకొనుచు, మధ్యాసియానుండి సప్తసింధు దేశమునకు వచ్చినతెగ పెద్దది యగుటచేతను, అది యీ దేశమునఁ దొలుతనున్న సంఘముతోఁ గలియక వాని నణఁగించిన దగుటచేతను, భాషయందు మార్పేమియు సంభవింపక యది యట్లే నిలిచి వర్ధిల్లినదని కూడ వారుపపత్తి చూపుచున్నారు. పై కారణములను బట్టి యీ వాదము కొంతవఱకు సముచితముగాఁ గనఁబడుచున్నను వైదిక ప్రమాణముల కిది గుఱికాలేదనెడి యాక్షేపము మాత్రము దీనివెన్నంటి యున్నది. అయిన నీ వాదము నేఁటికిని జరిత్రకారుల సమ్మతిని గాంచుచునే యున్నదిగాని, యింతకు మున్నే (Lord Elphinstone, Muir) లార్డు ఎల్ఫిన్‌స్టన్, మూయిరు మొదలగు పండితులు కొందఱు హైందవార్యుల జన్మభూమి హిందూదేశమేయనెడి భావము ప్రకటించిరి.[1] ఉత్తర ధ్రువవాదులవియు నివియుఁ గూడ నూహలమీఁద సిద్ధాంతములే యనుచున్నారు.

చతుర్వాద పరిశీలనము

ఇంతవఱకు నార్యుల ప్రథమ నివాసమునుగూర్చి నాలుగు వాదముల స్వరూప స్వభావములు సంగ్రహముగాఁ దెలిసికొని యున్నాము కాని, వీనిలో నేది గ్రాహ్య మనెడి విచారణయే కష్టసాధ్యముగా నున్నది. ఐరోపావాదము నిస్సార మని బహు విమర్శకుల వ్రాఁతలనుబట్టి నిశ్చయింపవచ్చునుగాని, తక్కిన మూఁడింటిలోను గుణములు దోషములు కలసి యుండుటచే నెందలి గుణములు హెచ్చుగా నున్నవో కనిపెట్టుట కష్టమగుచున్నది. తరువాతి రీతినిబట్టి మధ్యాసియాదేశమే తొలుతఁగూడ నితరదేశము లన్నిటికిని జనప్రవాహములను బంపియుండుననియు, అందు దగ్గఱనున్న సప్తసింధు దేశమునకు వచ్చిన యార్యసంఘ మితర సంఘముల సంపర్కములేమిని దమ తొల్లిటి భాషను సాంఘికాచారములను గాపాడుకొనుచు వచ్చి యభివృద్ధి కెక్కెననియు భావింతమన్న, ఈ వాదము

1. History of India p. 95, 96. Original Sanskrit Texts Vol. II. p. 322, 387.

వైదిక ప్రమాణములకు గుఱికాకున్నదన్న యాక్షేపమునకు మాత్రము విఱుగుడు కనఁబడుటలేదు. ప్రాచీన కాలస్థితినిబట్టి మధ్యాసియాలో నెడతెగని మబ్బులవలన సూర్యరశ్మిలేని కొన్ని దినముల కాలము దీర్ఘరాత్రివలె నుండియుండునని తలంత మన్నను, ఋగ్వేదములోని యాఱునెలల రాత్రి, ఆఱునెలల పగలు, నెలదినముల యుషస్సు, అనెడి లక్షణములు మధ్యాసియాకు సంభవింపఁజాలవు. ఈ లక్షణములు దీనికి సరిపుచ్చుట సాధ్యమయ్యేనేని, యీ వాద మన్నిటికంటె నుత్తమమగును.

తక్కిన రెండు వాదములు నెక్కువగా వేదవాక్యములమీఁద నాధారపడి యున్నవి. అందు తిలకుగా రుదాహరించిన ఋక్కులు కొన్ని యుత్తరధ్రువ లక్షణములకు సరిపడకున్నవనియు, మఱికొన్ని వారు చెప్పిన యర్థము నీయఁజాల వనియు, ప్రాచీనతమమయిన ఋగ్వేదమే యీ విషయమునఁ బ్రమాణమనియుఁ జెప్పుచు, వా రుదాహరించిన ఋక్కులుకూడఁ బురాతన సప్తసింధు దేశమునకే సమన్వయించుచున్నవని దాసుగా రనుచున్నారు. వీరు తలంచినట్లు తిలకుగా రిచ్చిన యుదాహరణములు సమర్థములైనను గాకున్నను, తొంటి సప్తసింధుదేశము చతుస్సముద్ర పరివేష్టితమనెడి వీరి భూగర్భశాస్త్ర ప్రమాణమును, వేదములలోని దీర్ఘ రాత్రి దీర్ఘోషోవర్ణన లాకాలమున నార్యావర్తమునకే సరిపడుననెడి వీరి వాదమును సమర్థనీయము లైనచో నార్యుల పుట్టి ల్లార్యావర్త మనుటకు సంతసించువారిలో మన మగ్రగణ్యుల మగుటకు సందేహము లేదు.

తిలకుగారి యుత్తర ధ్రువవాదముగూడ భూగర్భ భౌతిక ఖగోళాది పరిశోధన సిద్ధాంతములతోనే ప్రారంభమైనది. వాని ననుసరించి తమ వాదము నెలకొల్పుటకు వారు రెండు ప్రకరణము లుపయోగించిరి. వారు వారు గావించిన పరిశోధనములఁ గల విరోధములను జూపించిరి. కేవలము వానినే నమ్మినచోఁ దత్త్వము తేలదనెడి భావము సూచించిరి. కావున నవీన పరిశోధనలనుబట్టి యిందే వాద మౌననము? ఏది కాదనము? ఆ పరిశోధనలు రే పెట్లు మాఱునో! అవి నిర్దుష్టములైన సిద్ధాంతములని యెవరు చెప్పఁగలరు? అందుచే గ్రాంథిక వాక్యములే యిందు ప్రమాణ మనవలసి వచ్చినది. అయితే, దానినిబట్టి యెవరి వాదము సముచితము?

"తాసీదహాని-యనెడి ఋక్కులోని కొన్ని పదములకు, తిలకుగారు బలాత్కారముగాఁ దమ వాదమున కనుకూలమయిన యర్థము లాగిరికాని, వారు దీనికిఁ

బూర్వమందున్న - ప్రమే పంథా దేవయానా - యనెడి ఋక్కును.[1] లెక్కచేసి చదివినచోఁ దప్పక మఱియొక మార్గమునకు మళ్ళియుందురు. తిలకుగారి వాదమునుబట్టి, ఉషస్సు దక్షిణ దిక్కున నుదయించినదని చెప్పవలసి యుండఁగా ఆ ఋక్కు, తూర్పున నుదయించినట్లు చెప్పుచున్నది గావున నది యెంతమాత్ర ముత్తర ధ్రువలక్షణమును సూచింపఁజాలదు. ఇదొక్కటియే వెంటనే తిలకుగారిని సమాధానపఱిచి వారి వాదమును వదలుకొనునట్లు చేయఁగలదు." అని దాసుగారు దృఢ ప్రతిజ్ఞతో వ్రాసిన విషయ మెంతవఱకు సత్యమో చూతము.

తిలకుగారు తిన్నగాఁ జూడలేదని దాసుగా రన్న ఋక్కులోని పదము 'పురస్తాత్.' దీనికి సాయణులు 'పూర్వస్యాందిశి' (తూర్పుదిక్కున) అని యర్థము వ్రాసిరి. తిలకుగా రీ ఋగర్థము నాంగ్లమున నిట్లు సంగ్రహించి వ్రాసిరి.

"The Devayana Path has become visible to me...The banner of the Dawn has appeared in the east."[2]

దీని యర్థమిది :— దేవయాన మార్గము నాకుఁ గనఁబడుచున్నది... ఉషస్సుయొక్క కేతువగు తేజస్సు తూర్పుదిక్కున గోచరించుచున్నది.

దీనినిబట్టి తూర్పుదిక్కున నుషస్సు గనవచ్చుచున్న దన్నయర్థము తిలకు గారు గ్రహించిరనుట విదితము గదా! ఇఁక వారు గ్రహింపని దేది ?— ఉత్తర ధ్రువవాదమే సరియైన దైనచో నీ ఋక్కు దక్షిణ దిక్కున నుష స్సుదయించెనని చెప్పవలె నఁట. అట్లు చెప్పక తూర్పున నుదయించినదని చెప్పిన దఁట. అందుచే నిది యుత్తర ధ్రువలక్షణ సూచకము గా దఁట ఉత్తర ధ్రువవాసు లక్కడ సూర్యుఁ డుదయించు దిక్కు దక్షిణ దిక్కని వ్యవహరించుకొన్న ట్లొక యుదాహరణమైన దాసుగారు పురాతన గ్రంథములనుండి యుదాహరించినచో వారి యాక్షేప మమోఘమై వెలయునుగాని యట్లు జరుగలేదు.

ఏ దేశమందైనను, ఏ కాలమందైనను, మానవుఁ డించుక ప్రపంచ జ్ఞానము వచ్చినది మొదలుగా సూర్యుఁ డుదయించు దిక్కు తూర్పు దిక్కని వ్యవహరించు కొనుట జగత్ప్రసిద్ధము. అట్టియెడ ఖగోళ భూగోళ విజ్ఞానము విస్తరించిన యీ కాలమున నిక్కడనున్న మనము, లేక యక్కడికి వెళ్ళివచ్చిన వారి వ్రాఁతలవల్లఁ దెలిసికొన్న మనము, ఉత్తర ధ్రువమువద్ద సూర్యుఁడు దక్షిణార్ధ గోళముననుండి

1. ఈ ఋక్కుల యర్థము వెనుక వివరింపఁబడినది.
2. Arctic Home in the Vedas. p. 73.

యుదయించుచున్నట్టు గోచరించునని గ్రహించుచున్నాము గదాయని యుత్తర ధ్రువమండలమున నివసించిన యా కాలమునాఁటి యార్య ఋషులు దక్షిణమున నుష స్సుదయించిన దనక తూర్పున నుదయించినదని వర్ణించుటచే నది యుత్తర ధ్రువలక్షణ సూచకము గా దనుట యతి సాహసముగాని వేఱుగాదు. అక్కడి సూర్యోదయ మిక్కడి మనకు శాస్త్రజ్ఞానమునుబట్టి దక్షిణమైన ట్లుండునని యక్కడి వారికిఁ గూడ దక్షిణము గావలసినదేనా ? మన కయినట్లే యక్కడివారికి సూర్యుఁ డుదయించు దిక్కు తూర్పుదిక్కు కాదా ? తైత్తిరీయారణ్యకముగూడ, సూర్యుఁ డుదయించునదే తూర్పు దిక్కని వర్ణింపలేదా ?[1] కావున దానుగా రతిముఖ్యమని తలంచిన యీ వ్యాఖ్యాన ముత్తర ధ్రువవాదమునకు బాధకము గాక సాధకమే యగుచున్నది. కాని, కడపటి హిమ ప్రలయము తరువాతనే యార్యు లుత్తర ధ్రువము విడిచి యూరపు ఖండములలో నాఁగక మధ్యాసియాకు వచ్చి యక్కడ సుమారు రెండువేల యేండ్లు గడపిన తరువాత వా రితరములవారు సప్తసింధు దేశమునకువచ్చి పెక్కువందల మైళ్లదూరమునఁ గాని లేని చతుస్సముద్రముల నెట్లు వర్ణింపఁగలిగిరను నాక్షేపమునకు మాత్రము సదుత్తరమిందు తృప్తికరముగా లభింపకున్నది. మఱియు ఋగ్వేదములోని సప్తసింధువు లార్యావర్తములోనివి కావు. అవి దేవలోక నదులు. వాని పేళ్లు తరువాత వీనికిఁ బెట్టఁబడియుండు నునెడి యూహయు నంత తృప్తికరముగా సమన్వయింప కున్నది. కాని, తక్కిన యుత్తర ధ్రువ లక్షణములు మాత్రము ఋక్కులతోఁ జక్కఁగా సమన్వయించు చున్నవి. విషయ మతిదురవగాహమగుటచేతను, ప్రత్యక్షముగా నిర్ణయింపఁ దగిన యాధారములు దుర్లభ మగుటచేతను, పై వాదమునుగూర్చి యిదమిత్థ మనుట సాహసము కాక పోదుగాని, యిప్పటికిఁ జేసిన చర్చకు ఫలముగాఁ ఆర్యుల మొదటి నివాసముత్తర ధ్రువమండల మనియు, పురాతనవైదిక విజ్ఞానము సాంగో పాంగముగా వికసించినచో టార్యావర్తమనియు భావింతము.

ఆర్యుల రాక

ఉత్తర ధ్రువమండలమున నాలుగైదు హిమప్రళయములు వచ్చియుండు ననియు, రెండే వచ్చియుండుననియు భూగర్భ శాస్త్రజ్ఞులమతములు ద్వివిధముగా నున్నవి. ఇందు రెండవమత ముచితతరమని పెక్కండ్రు భావించుచున్నారు.

1. స ఇత ఆదాయవః । అంజలినాపురస్తాదు పాదధాత్ । ఏవాహ్యేవేతి । తత ఆదిత్య ఉదతిష్ఠత్ , సాప్రాచీదిక్ ॥ ప్ర. 1-23.

కడపటి హిమప్రళయమునకుఁ బూర్వము పెక్కువేల సంవత్సరముల క్రిందటనే యచ్చట మనుష్యులు నివసించిన చిహ్నములు కనవచ్చుచున్న వనియు, ఆ ప్రళయము క్రీస్తు పూర్వము సుమారెనిమిది, లేక పదివేల సంవత్సరముల క్రిందట వచ్చినదనియు, భావించిన యమెరికను భూగర్భశాస్త్ర వేత్తల నిర్ణయము మన వేదపురాణముల మతమునకు సరిపడుచున్నదని తిలకుగారు సమర్థించియున్నారు. ఈ సమర్థనము, వారి 'మృగశీర్ష'యను పుస్తకములోని వేదకాలనిర్ణయమునకు సరిపడుటకై దేవమనుష్యమానములను సరిపుచ్చుటచే నమెరికను భూగర్భశాస్త్రజ్ఞుల నిర్ణయము ననుసరించినది గాని, లేకున్న మొదటి హిమప్రళయము తరువాతనే యార్యులుత్తరధ్రువము విడిచివచ్చిరని నిర్ణయించినచో, దాసుగారు చూపినభూగర్భశాస్త్రవేత్తల మతమున కది సరియై రాజపుతానాయెడారి సముద్రముగా నున్న కాలమునకు సరిపడునేమోయని యనుమానింపవలసి యున్నది. అట్లన్నచో వేదకాలము చాల వెనుకకుఁబోవునేమోయని తిలకుగారు సందేహించిన మాటనిజము.[1]

ఆర్యులుత్తర ధ్రువమండలమున వసియించుకాలమునం దార్యేతరజాతులు కొన్ని యైరోపాఖండమునఁ బూర్వశిలాయుగమునాఁటి మోటుతనముతో నుండెననియు, ఉత్తరశిలాయుగ మారంభమై సుమారెనిమిదివేల యేండ్లయి యుండుననియు మఱికొందఱు భూగర్భపరిశోధకులు చెప్పినమాటలు గూడఁ దమసమర్థనమునకుఁ దోడు గావించుకొని, భూగోళపరిస్థితులు తెలుపునెడ నొకటిరెండువేల వత్సరముల తారతమ్యము గణనీయము కాదనుచుఁ తుదకు నేఁటికిఁ బదివేల సంవత్సరముల క్రిందట నార్యులుత్తర ధ్రువమున నివసించిన వారని తిలకు పండితుఁడు నిర్ధారణచేసెను. కాని, యిక్కడ నొక్కమాట.

ప్రపంచమందలి మానవజాతి కంతకు నుత్తర ధ్రువమే జన్మస్థలమా? మనుష్యజాతుల కన్నిటికిని దొలుదొల్త మూలాధారమైన దొక్కదాంపత్యమేనా? ఇపుడార్యుల మనుకొను ఖండాంతరవాసులును భారతీయార్యులు నొక్క చోటినుండి విడిపోయినవారేనా? అను ప్రశ్నల కెవరెట్టి సమాధానములు చెప్పినను, అవి యన్నియు, నూహలే కాని సిద్ధాంతములు కావు. ఉత్తర ధ్రువము విడిచి దక్షిణముగా బయలుదేఱినయార్యు లాయప్రదేశములఁ జిరకాలము వసించుటయు నపుడపుడు శాఖలుగా విడివడి యాయాదేశముల కేగుటయు నసంభావ్యములు కావు కాని,

1. ఉత్తర ధ్రువావార్యావర్త వాదములకు సమన్వయము గావింపఁగగిన యీ విషయమింకను విచారణీయము.

యట్లు దేశద్రిమ్మరులై వచ్చునార్యసంతతివారు కడపట రెండుచీలిక లగుటయు, సంచౌకశాఖ పారశీకమునను రెండవశాఖ యార్యావర్తమునను స్థిరపడుటయు బహుసాదృశ్యములనుఁబట్టి విశ్వసనీయములని విస్పష్టముగాఁ జెప్పుటకుఁ దగినంతగా, ఖండాంతరవాసులైన యార్యులు పారశీక భారతీయార్యులనుండి విడిపోఁనవారే యని చెప్పఁదగినంత ప్రబలాధారములు మాత్రము విశేషించి కానరావు. భాషలలోని కొన్ని శబ్దముల సాదృశ్యమును వాఙ్మయములలోని కొన్ని గాథలయేకీభావమును జాత్యైక్యమును సమర్థింపఁజాలవని కొందఱి యభిప్రాయము. హిమప్రళయమునకు మున్నో తరువాతనో యార్యజాతి శాఖోపశాఖలుగా విడిపోయి యుండుననియు, మధ్యాసియాఖండమునకు వలసవచ్చినపిదపనే యార్యజాతి విడిపోయి యుండుననియు మఱికొందఱి యభిప్రాయము. ఇంతకును, ఉత్తరధ్రువమండలమున నొక్క యార్యజాతియే నివసించియుండె ననుటకుఁ గాని, ఆ కాలమందితరమానవజాతులందు నివసింపలేదనుటకుఁ గాని ప్రమాణము లెవరికిని లభించి యుండలేదు. అట్టియెడ నిట్టియగాధ విషయములోఁతు కనుంగొన నెవరితరము ? ఏది యేమయినను సనాతనమైన వైదిక విజ్ఞానసంపదతోఁ దులఁదూగుచున్న యార్యశాఖ యొకటి యుత్తరధ్రువమునుండి దక్షిణముగా బయలుదేఱెననియు, అది యచ్చటినుండి విడిపోయిన యితరశాఖలవల్లఁ గాని తరువాత మధ్యాసియాఖండమునఁ దనతో విడిపోయిన పారశీకార్యశాఖ వల్లఁగాని మరల సాంకర్యము చెందక పరమపావనమై యుండెననియు, అది యార్యావర్తమునకు వచ్చినపిదపఁ గూడ నిందలి యనార్యశాఖలను జెంతఁ జేరనీయక పరిశుద్ధముగా నుండెననియు, అదియే మన వైదికార్య శాఖయనియుఁ దలంచుట కిసుమంతయు సందేహములేదు.

హిమప్రళయము నాఁటికే మన ప్రాచీనార్యులు నాగరికులై ధర్మనిష్ఠులై యుత్తమజ్ఞానదాయినియగు వాగ్దేవి నుపాసించుచున్న వారనుటకు ఋగ్వేదములోని కొన్ని సూక్తములే ప్రమాణము. కాని యా మహావిప్లవమున నశింపఁగా మిగిలిన వారెట్లో ప్రాణములతో నీవలఁబడి యందందు తిరుగుచు మధ్యాసియాఖండమునందలి సమప్రదేశములఁ బ్రవేశించి స్థిరపడునాఁటికి వారితరములు గొన్ని గడచి యుండవచ్చును. అప్పటికిని వారి వంశములవారు పూర్వులనుండి యనుశ్రుతముగా వచ్చుచున్న వైదిక విజ్ఞానసంపదను మాత్రము పోఁగొట్టుకొనక హృదయమందును కంఠమందును, ఆచరణమందును, నిలుపుకొని యుండే సుమారు రెండువేల సంవత్సరములు గడపియుందురు. పిదప వారి తరములవారు తమ కా ప్రదేశములు గూడ ననుకూలము గానిస్థితికి వచ్చినందుననో మఱెందుచేతనో

వానిని విడిచి క్రమముగా గాంధారాది దేశములగుండా హిమాలయ దక్షిణభాగ మందలి సప్తసింధుతీర భూముల స్థిరనివాసము లేర్పఱుచుకొని తమనివాసమున నాభూమి కార్యావర్తమను పేరుతెచ్చిరి. అనఁగా, ఉత్తరధ్రువమండల వైదికార్య పరంపరలోని యార్యులు హిమప్రళయానంతరము సుమారు మూఁడువేల సంవత్స రములకుఁ బిదప, లేకయిప్పటికి సుమారాఱువేల సంవత్సరముల క్రిందట భరత ఖండమందలి సప్తసింధుతీరాశ్రమములందు తమ వైదిక విజ్ఞానబీజములను మొల కెత్తింప నారంభించి యుందురని విశ్వసింపనగును. అట్లు వారు తమపూర్వుల యుపదేశముగా వచ్చుచున్న వైదిక విజ్ఞానము నెట్టియిక్కట్టు వచ్చినను మఱవక తమప్రాణముకంటె నెక్కుడుగా సంరక్షించు కొనుచు వచ్చిరనుటయే వేదనిత్యత్వ మహత్త్వములను వేనోళ్ళఁ బ్రశంసించుచున్నది. ఇందుకే ప్రపంచ మంతయు నాశ్చర్య మగ్నమానసమై సర్వవిశ్వ వాఙ్మయమున కాద్యమైనది భారతీయ వాఙ్మయమేయని పొగడుచున్నది. అట్టి మహావాఙ్మయమున కాధారభూతులైన ప్రాచీనమహర్షుల పాదారవిందము లొక్కసారి మనసార స్మరించి యిఁక వైదిక విజ్ఞానస్వరూప మవలోకింతము.

ఇది శ్రీహరితసగోత్ర మల్లాది వెంకమాంబా శ్రీరామావధాని పుత్ర
సూర్యనారాయణశాస్త్రి విరచితమైన సంస్కృత వాఙ్మయ
చరిత్ర ప్రథమ భాగమగు వైదిక వాఙ్మయ చరిత్ర
యందలి ప్రథమాధ్యాయము.

ద్వితీయాధ్యాయము

వైదిక విజ్ఞానము

వేదములు నిత్యము లనాదు లపౌరుషేయము లందుమా, వాని కొక కాలమే లేదు. అనిత్యములు సాదులు పౌరుషేయము లందుమా, వీని యనిత్యత యెట్టిదో, వీనియాది యెక్కడనో, వీనినెవరు రచించిరో, యుక్తిప్రమాణానుభవ సిద్ధముగా నిర్ణయింప వీలు కనఁబడదు. అయినను ప్రాచ్యపాశ్చాత్య చరిత్ర కర్తలు కొందఱు వేదకాలమును భిన్నభిన్నగతుల సూచించి యుండుటచే వేదసూక్తములందు గోచరించుచున్న విజ్ఞాన మెప్పటిదని వివారింపవలసి వచ్చినది.

ఆర్యావర్తమునకువచ్చి స్థిరపడిన యార్యులు తమప్రాచీన పరంపరనుండి యానుపూర్విగా వచ్చుచున్న వైదికవిజ్ఞానము నేమఱక చాలవఱకు సంరక్షించు కొనుచు వచ్చిరని యింతకు మున్ను తెలిసికొని యుంటిమి. అందలి సత్యమును నిరూపించు నాధారములు ఋగ్వేదసూక్తములం దనేకములు కలవు. అందు గొన్ని :—

"అగ్నిదేవుడు పూర్వమహర్షులకు స్తుత్యుఁడు. ఇప్పటి మనకును స్తుత్యుఁడు[1]. ఏయింద్రుఁడు పూర్వకాలపు ఋషులచేఁ జేయఁబడినట్టియు, ఇప్పటి ఋషులచేఁ జేయఁబడు చున్నట్టియు స్తుతులచే వృద్ధి పొందు చున్నాఁడో, ఆ యింద్రుఁడు సోమమునకుఁ బ్రభువు. ఓ యధ్వర్యూ! ఇతనికి సోమ మిమ్ము[2]. ఇంద్రుని సంబంధమైన ధనదానము లనాది కాలసిద్ధములు[3]. ఇంద్రుఁడు చేసిన పూర్వకాల ప్రసిద్ధములైన శూరకృత్యములు చెప్పుచున్నాను[4]. ఓస్తోతా! ఇంద్రుఁ డొనర్చినపురాతన కృత్యములను స్తుతింపుము[5]. ఓ యశ్వినీదేవతలారా! నే నిపుడు వర్ణించిన బహు పురాతనములైనట్టి మీ వీరకర్మములను మాపితృపితామహాదులు

1. అగ్నిః పూర్వేభి ర్ఋషిభి రీడ్యో నూతనై రుత. ఋగ్వే. 1-1-2.
2. అధ్వర్యో వీర ప్రమహే సుతానా మింద్రాయ భర సహ్యస్య రాజా,
   యః పూర్వ్యాభి రుత నూతనాభి ర్గీర్భి ర్వావృధే గృణతా మృషీణాం. 6-44-13.
3. పూర్వీ రింద్రస్య రాతయో న విదస్యం త్యూతయః. 1-11-3.
4. ఇంద్రస్య ను వీర్యాణి ప్రవోచం యాని చకార ప్రథమాని వజ్రీ. 1-32-1.
5. అస్యేదు ప్రబ్రూహి పూర్వ్యాణి తురస్య కర్మాణి నవ్య ఉక్థైః. 1-61-13.

చెప్పిరి[1]. ఓ యింద్రా ! ఈ నూతనస్తుతిచే బలవత్తముఁడ వయినట్టి పురాతనుఁడ వైన నిన్ను, పురాతనమహర్షుల వలెనే వృద్ధి నొందింపఁ బ్రవర్తించుచున్నాను[2]. ఋషులలోపల సత్యవంతులు కవులు పూర్వకాలికులు సూర్యతేజస్సును బొందిన వారు సత్యమంత్రులు నైన యంగిరసులు దేవతలతోఁ గలసి యానందించు వారైరి[3].

పై వాక్యములందువలెనే, అదితి వసిష్ఠులు మిత్రావరుణులు మొదలగు వారి గాథలందును పూర్వీ పూర్వ పూర్వ్యయుగ ప్రత్నాది శబ్దములు కనవచ్చుచున్నవి. అవి ప్రాచీనదేవతలను ప్రాచీనమహర్షులను వారికి సంబంధించిన పురాతన కార్యములను బోధించుచు, వానియందలి విషయ మంతయుఁ బూర్వ్యయుగమునాఁటిదని తెలుపుచున్నవి. ఇట్లు పూర్వ్యయుగమో యని ఋక్కులు ఘోషించుచుండఁగా నందలి విషయమంతయు హిమప్రళయమున కీవలిదే కాని యావలిదికాదని కొందఱు పాశ్చాత్య విమర్శకులు వాదింప సాహసించుటకుఁ గారణమేమో యూహింప వలసినదే కాని చెప్పవలసినది గాదు. ఇట్లనుటచే ఋగ్వేదాదులందు నూతన విషయములు లేవని నామతము కాదు. ప్రాచీనార్వాచీన విషయములు రెండును సుస్పష్టముగా నందు గోచరించుచునే యుండును. వానింగూర్చి తరువాత విచారింతము. ఇపుడు మన కంటియెదుట నున్న సూక్తములమాట వేఱు. అందలి విషయము మాట వేఱు. ఆ విషయములోను నవీనము నవీనమే. ప్రాచీనము ప్రాచీనమే. మన మిపుడు ప్రాచీన విషయముఁగూర్చియే ప్రసంగించుచున్నాము. వేదము, ఋషులు తీరికూర్చుండి రచించిన పుక్కిటి పురాణముగాదనియు, ఈశ్వరానుగ్రహలబ్ధము సత్యప్రమాణబద్ధమునగు నుత్తమ గ్రంథమనియు విశ్వసించిన వారికిని దాని సంప్రదాయ మెఱిఁగిన వారికిని వేదవిషయముయొక్క ప్రాచీనత యెట్టిదో సులభముగా బోధపడును.

పురాతనదేవత యగునింద్రుని బురాతన ఋషులు స్తుతించినట్లే నేను స్తుతించుచున్నాను. బహు పురాతనములైన యశ్వి దేవతల వీరకృత్యములను ప్రాచీన

1. ఏతాని వా మశ్వినావీర్యాణి ప్రపూర్వ్యాణ్యాయవోఽవోచన్. 1-117-25.
2. తం వో ధియా నవ్యస్యా శవిష్ఠం ప్రత్నం ప్రత్నవ త్పరితం సయధ్యై. 6-22-7.
3. త ఇద్దేవానాం సధమాద ఆస న్నృతావానః కవయః పూర్వ్యాసః
గూఢం జ్యోతిః పితరో అన్వవిందన్ త్సత్య మంత్రా అజనయ న్నుషాసం. 7-76-4.

గురుపరంపరనుండి యానుపూర్విగా వచ్చుచున్నరీతిని వినుచున్నాను. అనునవి మొదలుగాఁగల పురాతన విషయములతోడి సూక్తములు హిమప్రళయమునకుఁ దరువాతివన్న ననవచ్చునుగాని యావిషయములు పురాతనములు గావనవచ్చునా ? అంగిరసులు దేవలక్షణములతో విలసిల్లుచున్నారని స్తుతించిన ఋషి యర్వాచీనుఁడే యని యంగీకరించినను, ఆ గాథ ప్రాచీనము కాకపోదు గదా ?.[1] అదితిగాథను దెల్పుసూక్తమిటీవలి దన్నను, ఆ గాథావిషయ మెన్నికల్పములుగ క్రిందటిదో, దానినిగూడ నిటీవలికిఁ జేర్ప సాహసించువా రుందురా ? కావున నెట్లు పరిశీలించి చూచినను, ఋగ్వేదాదులందు పురాతనములని వర్ణింపఁబడిన విషయములెల్ల, హిమప్రళయమునకుఁ బూర్వ ముత్తర ధ్రువమండలమున నివసించిన యార్యులకుఁ బురాతనములై యంతకుఁ బూర్వమయిన యుగమునకు సంబంధించినవే కాని హిమప్రళయానంతర కాలమునకు సంబంధించినవి కావని తెలియవచ్చును. దీనిని బట్టి యార్యవైదిక విజ్ఞానము పాశ్చాత్యులు తలంచిన దానికంటె నెంతో కాలము పూర్వమునకుఁ బోవుచున్న దనుట నిజము సత్యాన్వేషణ తత్పరుల కిది యాశ్చర్య కరము కాఁజాలదు గదా !.

ప్రపంచము పుట్టినపిదప ననేక ప్రళయములు వచ్చి యుండెనని మన పురాణములు చెప్పుచున్నవి. భూగర్భశాస్త్రజ్ఞులును జెప్పుచున్నారు. ప్రళయ కాలము, ఒక ప్రళయమునకు మఱియొక ప్రళయమునకుఁ గల మధ్యకాలము, చతుర్యుగ పరిమితి, మన్వంతరము, కల్పము, మొదలగునవి మనుస్మృతి మహా భారతములం దొకరీతిగాను, తక్కిన పురాణాదులందు మఱియొక రీతిగాను గనవచ్చుచున్నవి. ప్రళయకాల నిర్ణయమున భూగర్భశాస్త్రవేత్తల మతములు వేఱువేఱుగా నున్నవి. ఇట్లున్న వివిధమతములకుఁ గొంచె మెచ్చు తక్కువగా నైక్యము గలుగునట్లు ఖగోళశాస్త్రముతో సమన్వయించుటకై పూర్వులు దేవమాన మునఁజూపిన యతిశయోక్తిని, తగ్గించుచు సప్రమాణముగాఁ జక్కనిచర్చ యొనర్చి యుగ మనునది పదివేల సంవత్సరము లనియు సంధికాలములతో నది పన్నెండు వేలయేండ్లగు ననియు, తిలకుపండితు లొక యభిప్రాయము తెలిపి యున్నారు[2]. దానినిబట్టి చూచినను, హిమప్రళయానంతర యుగారంభమునకును దత్పూర్వ యుగారంభమునకును బండ్రెండువేల సంవత్సరముల యంతరము గనవచ్చుచున్నది. ఋగ్వేదమందు పేర్కొనఁబడిన పూర్వయుగ మాయుగమో

1. ఋ. 10-72.

2. Arctic Home - XIII cha.

దాని పూర్వ యుగమో లేక దానికిని బూర్వయుగమో యెవ్వరును నిర్ణయింపఁ జాల రనుటకు, అదితి మొదలగు ప్రాచీన దేవతలగాథలే తార్కాణ మగుచున్నవి. అందుచే నార్యుల వైదిక విజ్ఞానసూత్ర మవిచ్ఛిన్న మైనదనియు దాని మొదలు పూర్వపూర్వమునకుఁ బోయి కాలగర్భమం దెక్కడనో మానవదృష్టికి గోచరింపని చోట మఱుఁగుపడి యున్నదనియు నూహింపవలసి వచ్చుచున్నది. ఆ కారణముచేతనే యట్టి సంతతావిచ్ఛిన్న విజ్ఞానసూత్రమున గ్రుచ్చిన సూక్తములతోడి వేదము లనాదు లనబడుచున్నవి. కావున నిందలి సత్యము తెలిసికొన వేదశాస్త్రాదులేమి చెప్పు చున్నవో చూతము.

''సకల బ్రహ్మాండమయుఁడు సర్వజ్ఞుఁడునగు విరాట్పురుషుని వలన ఋక్కులు సామములు ఛందస్సులు యజుస్సులు జనియించినవి.[1] ప్రజాపతి లోకములకు మేలు చేయఁదలఁచి పృథ్వీసార మగ్ని యనియు అంతరిక్షసారము వాయువనియు ద్యులోకసార మాదిత్యుఁడనియు నిశ్చయించి వారివలనఁ గ్రమముగా ఋగ్యజుస్సామవేదము లుద్ధరింపఁజేసెను.[2] వేదప్రాప్తికొఱకుఁ దపస్సు చేయు చున్న పురుషులకు స్వయంభుబ్రహ్మ వేదపురుషుఁడై ప్రత్యక్ష మయ్యెను. అతనిని జూచుటచేఁ బురుషులు ఋషులైరి. ఇంద్రియాతీతమైన వేదమును బరమేశ్వరాను గ్రహమునఁ జూచిన యా పురుషులు ఋషులనుపేరఁ బరఁగిరి.[3] ఋగ్వేద మగ్ని వలన యజుర్వేదము వాయువువలన సామవేద మాదిత్యుని వలన జనియించెను.[4] ఋగ్యజుస్సామాథర్వములు, ఉపనిషత్పురాణేతిహాస సూత్రాదులును, పరమేశ్వర నిశ్వసితములు.[5] పూర్వకాలమందు మహర్షులు మహాతపస్సు చేసి స్వయంభు బ్రహ్మచే ననుజ్ఞాతులై యుగాంత కాలమందంతర్హితములైన యితిహాసములతోడి వేదములను మరలఁ బొందిరి.[6] చతుర్ముఖ బ్రహ్మనాలుగు ముఖములనుండి నాలుగువేదములు పుట్టెను. పరమేశ్వరుఁడు ముందుగా బ్రహ్మను సృజించి యతనికి వేదము లుపదేశించెను."[7]

ఇట్లే యింకను బెక్కువచనములు కలవు. ఇందు వేదోత్పత్తి మార్గములు భిన్నభిన్నములుగాఁ గనవచ్చుచున్నను, తుదకివి యన్నియు వేదములకుఁ బరమేశ్వ రుఁడే మూల కారణమనెడి ప్రధాన మార్గమునఁ గలియుచున్నవి గావునను, శాస్త్ర యోనిత్వాత్తనుసూత్ర మీ యర్థమే స్థిరపఱుచుచున్నది కావునను వీనినైవిధ్యము

1. ఋ. 10-90-9.—2. ఛాందో. 4-17.—3. తై. ఆ. 2-9.
4. ఐ. బ్రా. 5-32.—5. బృహదా. 2-4-10.
6. భార. శాం. 210-5-19.—7. స్మృతివచనములు.

చర్చనీయము కాదు కాని, పై వాక్యములనుబట్టి చూచినచో వేదము లనాదులనెడి విశ్వాస మా గ్రంథములనాఁటికే దృఢముగా నాటుకొని పోయినదని మాత్రము తెలియకపోదు. ఇందుకు వేదము నిత్యమా, అనిత్యమా? పౌరుషేయమా, అపౌరుషేయమా? అని సకలశాస్త్ర కర్తలు బహువిధములఁ జేసినవిమర్శనములే ప్రమాణము. అతిగంభీరములు నపారములు హేతువాదబద్ధములునైన యా విమర్శనముల సారాంశ మిందు కొంచెము గ్రహింతము.

వేదనిత్యత్వాపౌరుషేయత్వ విచారము

ఆస్తికమతము లన్నియు వేదమనాది యపౌరుషేయమను సిద్ధాంతమున నేకీభవించుచున్నవి కాని. దాని నిత్యత్వమునెడ నీషద్భేదము గలదు. వేదమ కర్తృకము, అత్యంతనిత్యము, అపౌరుషేయమని పూర్వ మీమాంసా మతము. వేదము పరమేశ్వర కర్తృకము, వ్యవహారనిత్యము, అపౌరుషేయ మని యుత్తర మీమాంసామతము. తక్కిన పెక్కుమతములు కొంచె మెచ్చు తక్కువగా దీనినే యనుకరించుచున్నవి.

జైమినిమతమందు వేదమునకుఁ గర్తలేఁడు. బాదరాయణ మతమందు వేదమున కీశ్వరుఁడు కర్త. అట్లే కాదేని యద్వితీయ పరబ్రహ్మమును బ్రతిపాదించెడి యద్వైతమునకే భంగము వచ్చును. కావున వేద మీశ్వర కార్యమని యుత్తరమీమాంసామత మంగీకరింపక తప్ప కున్నది. ఇందుకు ఋగ్వేదాది సకలశాస్త్రములకుఁ బరబ్రహ్మము కారణమనెడి శాస్త్రయోనిత్వాత్తను సూత్రమే ప్రమాణము. ఈ సూత్రము వేదాంతములు పరమాత్మను బ్రతిపాదించుటంజేసి, అతఁడు శాస్త్రము ప్రమాణముగాఁ గలవాఁడని రెండవపక్షమునకుఁ గూడ నవకాశ మిచ్చుచున్నది గాని, ఆ పక్షమైనను వేదమున కీశ్వరుఁడు కర్తయనెడి మొదటి పక్షమున కడ్డమురాదు. ఇట్లున్న ద్వివిధమతముల ననుసరించి వేదప్రామాణ్యమును జర్చించి సాయణాచార్యులు ఋగ్వేదభాష్యావతారికలో వేదనిత్యత్వాదుల నిట్లు నిర్ణయించియున్నారు.[1]

"రఘువంశాది కావ్యములమాడ్కి వేదములుకూడ నీ కాలమందలివే కావున నవి యనాదులు కావు. వైయాసికము భారతము, వాల్మీకీయము రామాయణ మనుచో భారతరామాయణములకు వ్యాసవాల్మీకులు కర్తలుగాఁ జెప్పఁబడుచున్నట్లే

1. ఆయవతారిక ననుసరించి యీ విషయమిందు సంగ్రహముగాఁ జూపితిని.

వేదభాగములైన కాఠకతైత్తిరీయాది శాఖలకుఁ గఠతిత్తిర్యాది పురుషులు కర్తలుగాఁ దలంపఁబడుచున్నారు. కావున వేదము లపౌరుషేయములు కావు. కాళిదాసాది వాక్యమువలె వేదవాక్యమును బౌరుషేయమగును. మఱియును, అనిత్యులు జనన మరణవంతులు నగు బబరాది పురుషులు వేదమునందు పేర్కొనఁబడియున్నారు. ఆ బబరాదులకుఁ బూర్వము వేదములేదని దీనివలనఁ దెలియుచున్నది గావున వేదము లనిత్యములగును.''

"వేదరూపశబ్దము కఠాదిపురుషులకంటెఁ బ్రాచీనమైన దనియు, అది నిత్యమనియు, జైమిన్యాచార్యులు సిద్ధాంతీకరించియున్నారు. దానినిబట్టి వేదశబ్దములును వాని యర్థములును వాని సంబంధములును నిత్యములని తెలియుచున్నది. బబరాది పురుషవాచక శబ్దములు శబ్దానుకరణములుగాని యనిత్యమనుష్య వాచకములుకావు. కావున నట్టిశబ్దములను కరణరూపము లగుటచే నిత్యార్థమునే తెలుపుచున్నవనుట సత్యము. కఠతిత్తిర్యాదు లాయాశాఖలను లోకమునఁ బ్రవర్తింపఁజేసినవారు గాని తత్కర్తలు గారు. వేదవాక్యములకుఁ గర్తలేఁడు. అవి స్వతంత్రము లనాదులు."

"అయితే, పూజ్యపాదుఁడైన బాదరాయణుఁడు, ఋగ్వేదాది సకల శాస్త్రమును నిర్మించుటచేతనే పరబ్రహ్మ సర్వజ్ఞుఁ డగుచున్నాఁడని చెప్పెనుగదా! వేదమునకుఁ గర్త లేకపోవుట యెట్లు?"

"పరమేశ్వర నిర్మితమన్నను మనుష్య నిర్మితము కాదు కావున వేదము పౌరుషేయ మనఁదగదు. ఇట్టి యపౌరుషేయత్వ ముద్దేశించియే బాదరాయణులు, అత ఏవ చ నిత్యత్వమ్మను సూత్రమున వ్యవహారదశయం దాకాశాదికమువలెనే వేదము నిత్యమని సెలవిచ్చి యున్నారు. మఱియు 'వాచా విరూప నిత్యయా' ఇత్యాది ఋక్కులనుబట్టి, అవాంతర ప్రళయావ స్థాయియగు వేదము దేవ మనుష్యాది సృష్టికి హేతువగుచున్నది కావున వేద శబ్దము నిత్యమనియు నభిప్రాయ మిచ్చియున్నారు.''

"వేద మీశ్వర ప్రణీతమని శ్రుతి స్మృతులు చెప్పుచున్నను, శరీరధారియైన పురుషుఁడు నిర్మించినది కాకపోవుటచే నది యపౌరుషేయమని సాధింపఁ జూచితివి కాని, సహస్ర శీర్షా పురుష ఇత్యాది శ్రుతులచే నీశ్వరుఁడును నశరీరుఁడని తెలియు చున్నది. కర్మఫల రూపమైన శరీరము తాల్చినవాఁడు కాఁ డందువేని, అదియును బొసఁగదు. జీవ విశేషులైన యగ్ని వాయ్వాదిత్యులవల్ల వేదము లుత్పన్నము లైనవని వేదమే చెప్పుచున్నది. కావున వేదము పౌరుషేయమే."

"అగ్న్యాదు లీశ్వర ప్రేరణమున ఋగాదివేదము లావిష్కరించినవారు గాని నిర్మించినవారు కాదు. అందుచే నీశ్వరునికిఁ బ్రేరకత్వ రూపమైన కర్తృత్వము ద్రష్టవ్య మగుచున్నది. దానంజేసి వేదమునకుఁ బురుష కర్తృత్వ దోషశంక యుదయింప నవకాశము లేదు."

ఇత్యాదిగాఁ బూర్వపక్ష సిద్ధాంతము లొనర్చిన శ్రీసాయణులు తైత్తిరీయారణ్యక భాష్యమున మంత్ర కృన్మంత్ర పతిశబ్దముల యర్థము వివరించుచు 'కానైతే వేదములకు కర్తలు లేరు. అయినను, కల్పాదియం దీశ్వరానుగ్రహమున వేదములను బొందినవారు మంత్ర కృత్తులనియు వారే సంప్రదాయ ప్రవృత్తిచే మంత్రములను బాలించి మంత్రపతులనియుఁ, జెప్పఁబడుచున్నారు. అని స్వాభిప్రాయ మెఱిఁగించిరి. దీని నంతనుబట్టి ఋషులు మంత్రద్రష్ట లనియు వేదము లపౌరుషేయము లనియు వారి నిర్ణయము స్పష్టపడుచున్నది. ఈ విధముగా నుభయ మీమాంసా మతముల నుద్ఘాటించిన సాయణులు పూర్వమీమాంసా మతమం దెక్కువ తాత్పర్యము చూపినట్లు గోచరించుచున్నను, వేద మీశ్వరకార్య మనెడి యుత్తర మీమాంసా మతముకూడ వారి కిష్టము కాకపోలేదు.

అది యట్లుండ శబ్దము వర్ణాత్మకమనియు ధ్వన్యాత్మకమనియు స్ఫోటాత్మకమనియు భిన్న మతములు కలవు. శంకర భగత్పాదులు వాని నెల్ల నొక్కచోఁ జేర్చి చర్చించి స్ఫోటవాదమును నిరసించి ధ్వని వ్యంగ్యము వర్ణాత్మకమునైన శబ్దము నిత్యమని సిద్ధాంతీకరించి[1] వేద మీశ్వరకార్యమనెడి యభిప్రాయమును వారు విస్పష్టముగా నావిష్కరించుటచే వారి మతమందు వేద మాకాశాదికమువలెనే వ్యవహార నిత్యమై యపౌరుషేయ మగుననెడి నిర్ణయమే తేలుచున్నది.

ఇఁక నిట్లే వివిధములయిన శాస్త్ర చర్చలు కలవుగాని వానినెల్ల సందర్భించిన వేదాంత పరిభాష యేమి చెప్పుచున్నదో చూతము.

"వేదములు నిత్యము లగుటచేఁ బురుష నిర్మితత్వదోషము లేక ప్రమాణము లగుచున్నవని మీమాంసకు లందురు కాని, ఆ నిత్యత్వ మెట్టిది ? వర్ణ నిత్యత్వమా ? అనుపూర్వితోడి నిత్యత్వమా ? వర్ణనిత్యత్వ మందువేని లౌకిక వాక్యములును నిర్దోషము లగును. అనుపూర్వీ విశిష్ట నిత్యత్వ మందువేని వర్ణము లనిత్యము లగుటచే వర్ణ సముదాయాత్మకమయిన పదమును, పదసమూహాత్మకమైన వాక్యమును గూడ ననిత్యము లగును గావున వాక్యాత్మకమైన వేద మనిత్యము కాక

1. బ్ర. సూ. 1-4-28.

తప్పదు. మా మతమందును వేదము నిత్యము కాదు. ఏ మందువా? అది పుట్టుచున్నది కాఁబట్టి - ఋగాది వేదములు పరమేశ్వర నిశ్వసితములని శ్రుతులే చెప్పుచున్నవి. అయినను వేదములు, నైయాయికులు చెప్పుచున్నట్లు క్షణికములు కావు. వర్ణపదవాక్య సముదాయాత్మకమైన వేదము లాకాశాదులవలె సృష్టికాలమం దుదయించి ప్రళయకాలమం దంతరించును గాని యా మధ్యకాలమందు వర్ణముల కుత్పత్తి వినాశములు కలుగవు "అట్లయితే గగనాది ప్రపంచమువలెనే యుత్పత్తి నొందు వేదము పరమేశ్వర కర్తృకమై పౌరుషేయ మగుచుండఁగా, వేద మపౌరుషేయ మనెడి నీ సిద్ధాంతమునకు మాత్రము భంగము రాదా?" యని యడుగుదువేని వినుము.

ఇది పురుషుఁ డుచ్చరించుటచేఁ గలిగిన పౌరుషేయత్వముగాని, పురుషుని వలనఁ బుట్టుటచేఁ గలిగిన పౌరుషేయత్వము గాని కాదు. పౌరుషేయ మనఁగా నేమి? "ఆనుపూర్విగా వచ్చునట్టి సమాన జాతీయ వాక్యముల యుచ్చారణము నపేక్షింపకుండఁగా నొక పురుషుఁడు నవీనముగా నుచ్చరించిన వాక్య సముదాయము పౌరుషేయ మనఁబడును.[1] అట్టి పౌరుషేయత్వము వ్యాసాదుల భారతాదులకు సంభవించును గాని వేదమునకు సంభవింపదు పరమేశ్వరుఁడు సృష్టికి మొదటఁ దత్పూర్వసర్గ సిద్ధమైన వేదానుపూర్వికి సమానమైన యానుపూర్వి గల వేదమునే రచియించెను గాని దానికి విజాతీయమైన వేదము రచింపలేదు.[2] ఈ హేతువునుబట్టి యీశ్వరకర్తృకమైనను వేద మపౌరుషేయమేయని గ్రహింపఁదగును."

ఇది యిట్లుండ సృష్టి వేదశబ్దమువల్లనే జరుగుచున్నదని వేదనిత్యత్వవాది యగు వైదికమతము మఱియొక విధముగా నిట్లు చెప్పుచున్నది.

"ప్రజాపతి సృష్టి యారంభించుటకు ముందుగా 'ఏతే'యని యుచ్చరించి దేవతలను అసృగ్రమ్' అని యుచ్చరించి మనుష్యులను 'ఇందవః' అని యుచ్చరించి పితృదేవతలను, ఇక్లే యాయాశబ్దము లుచ్చరించి పశుపక్షాద్యులను సృజించె

1. వే. ప. అ — సజాతీయోచ్చారణా నపేక్షోచ్చారణ విషయత్వం పౌరుషేయత్వం.
2. తథాచ, సర్గాద్యకాలే పరమేశ్వరః పూర్వసర్గసిద్ధ వేదానుపూర్వీసమానానుపూర్వీకం వేదం విరచితవాన్- నతు తద్విజాతీయ మితి, వే. ప. అ. ధర్మరాజాధ్వరీంద్రః.

ననియు,[1] బ్రహ్మ వేదత్రయప్రకాశితమైన సృష్టిని మనస్సున నాలోచించెననియు,[2] స్వయంభువు సృష్టికిముందు వేదమయమైన దివ్యవాక్కును సంప్రదాయాను గుణముగాఁ బ్రవర్తింపఁజేసె ననియు,[3] శబ్దపూర్వక సృష్టిని శ్రుతిస్మృతులు చెప్పు చున్నవి. ఈ విషయముననే యీ క్రిందిస్మృతి వచనములు బలపఱుచుచున్నవి.

"నామరూపేచ భూతానాం కర్మణాంచ ప్రవర్తనం
వేదశబ్దేభ్య ఏవాదౌ నిర్మమే స మహేశ్వరః,
సర్వేషాం చ స నామాని కర్మాణి చ పృథక్పృథక్
వేదశబ్దేభ్య ఏవాదౌ పృథ క్సంస్థాశ్చ నిర్మమే."

మఱియు నియతాకృతి గల దేవమానవాదిజగత్తు నిత్యమైన జాతిని జెప్పు చున్నవైదిక శబ్దములవలననే యుత్పన్న మగుచున్నది గావున వేదశబ్దములకు నిత్యత్వ మంగీకరింపఁదగునన్న 'అతఏవచనిత్యత్వ'మ్మను బ్రహ్మసూత్రము నర్థమును 'ధీరులైన యాజ్ఞికులు పూర్వపుణ్య విశేషమున వేదప్రాప్తిమార్గము తెలిసికొన నర్హతకలవారై అతీంద్రియద్రష్టలైన మహర్షులయందు ప్రవేశించియున్న యా వేదవాక్కును సాక్షాత్కరింపఁజేసికొనిరను శ్రుత్యర్థము స్థిరపఱుచుచున్నది.[4] దీనినిబట్టి వైదికశబ్దము నిత్యమని తెలియవచ్చుచున్నను, ఈ నిత్యత పూర్వమీమాంస తెల్పిన యాత్యంతికనిత్యత కాదని బాదరాయణమతమునఁ దెలియుచున్నది. ఇట్లున్న వివిధమతములలో నొక్కపూర్వ మీమాంసామతము తప్పఁ దక్కిన మతముల యభిప్రాయములనుబట్టి వేద మీశ్వరనిర్మితము, వ్యవహార నిత్యము, అపౌరుషేయము, అని సాధింపఁగలిగినను, మనము ఋగ్వేదమందలి యొకటి రెండర్థములు మాత్రము చాటవలసియున్నది.

ఋగ్వేద వాక్యవిచారణ

ఋగ్వేదమందు, ఆర్యావర్తమునకును, ఆర్యుల సాంఘికస్థితులకును వారి వృత్తులకును సంబంధించిన వర్ణనలు కొన్ని కనఁబడుచున్నవి. కొన్ని ఋక్కులును

1. ఛాందో - ఏత ఇతి వై ప్రజాపతి ర్దేవా నసృజత.........
2. బృహ - స మనసా వాచం మిథునం సమభవత్. 3-1-4.
3. అనాదినిధనా నిత్యా వా గుత్సృష్టా స్వయంభువా - ఆదౌ వేదమయీ దివ్యా యత స్సర్వాః ప్రవృత్తయః.
4. యజ్ఞేన వాచః పదవీయ మాయన్ తామన్వవింద న్నృషిషు ప్రవిష్టామ్. ఋ 10-71-3.

సూక్తములను ఋషులు రచియించినట్లు కనఁబడుచున్నవి. ముఖ్యముగా నీ రెండు విషయములును వేదములు పౌరుషేయము లనుటకుఁ గారణముగాఁ గొందఱు గ్రహించుచున్నారు. కావున నట్టివానిని గొన్నిటి నుదాహరించి యందలి విషయము యథాశక్తి పరిశీలింతము.

ఓ గంగా యమునా సరస్వతీ శుతుద్రీ పరుష్ణీ నదులారా ! అసిక్నీ నదితోఁ గూడినయో మరుద్వృధా ! వితస్తాసుషోమా నదులతోఁ గూడినయో యార్జికీయా ! మీరు నాస్తోత్రము వినండి.[1]

గంగా యమునాది సప్తనదులు నింద్రునికీర్తిని ధరించుచున్నవి.[2]

ఇట్లే గంగాదినదుల వర్ణనలు పెక్కుచోట్లఁ గలవు.

కృష్ణుఁడను పేరుగల యసురుఁడు పదివేలమంది యసురులతోఁ గూడినవాఁడై, అంశుమతీ నదీతీరమందుండెను. బృహస్పతిసహాయుఁడైన యింద్రుఁడచ్చటికి వెళ్లి వానిని వాని యనుచరులను గొట్టెను.[4]

సాయణాచార్యు లీకథను వ్రాయుచు, ఈ ఋక్కునకు వైదికకర్మపరముగా వ్యాఖ్యానము చేసిరి. ఇట్టి గాథలు ఋగ్వేదమున నెన్నో కలవు. వాని నన్నిటిని గూడ భాష్యకర్తలు కర్మపరముగా సమన్వయించి యున్నారు.

ఇంద్రా ! అనార్యులు నాస్తికులు నగుకీకటులు నివసించు కీకటజనపదము లందు నీగోవు లేమి చేయుచున్నవి ?.[5]

1. ఇమం మే గంగే యమునే సరస్వతి శుతుద్రి స్తోమం సచతా పరుష్ణ్యా. అసిక్న్యా మరుద్వృధే వితస్త యార్జికీయే శృణు హ్యాసుషోమయా, ఋ. 10-75-5.
2. అన్యాశ్రవోనద్యస్సప్త బిభ్రతి. 1-102-2.
3. 1-3-10 ; 1-32-12 ; 3-23-4 ; 4-28-1 ; 6-61-10 ;
4. అవద్రప్సో అంశుమతీ మతిష్ఠ దియానః కృష్ణో దశభి స్సహస్రైః ఆవత్త మింద్రః శచ్యా ధమంత మపస్నేహితీ ర్నృమణా అధత్త. 8-96-13. ఇదే యీ షద్భేదముతో తై. అర 1-6 లో నున్నది.
5. కిం తే కృణ్వంతి కీకటేషు గావో నాశిరం దుహ్రే న తపంతి ధర్మం. ఋ. 3-53-14.

ఓ యింద్రా ! గోతమపుత్రుఁడయిన నోధ యను ఋషి, గుఱ్ఱములను బూన్చిన రథము గలవాఁడవును బలవంతుఁడవునైన నిన్ను స్తుతించుటకు నూతన మైన యీ సూక్తము రచియించెను.[1]

ఓ యింద్రా ! ప్రయాణముఁగోరు పురుషులు మార్గములు నిర్మించునట్లే నిన్ను స్తుతించుటకై గృత్సమదులీ స్తోత్రము నిర్మించిరి.[2]

ఎద్దులు సుఖముగా నాఁగటికాఁడి మోయుఁగాక, కర్షకులు చక్కఁగాఁ బని చేయుదురు గాక, నాఁగలి చక్కఁగా దున్నుఁగాక, ఓ నాఁగటి చాలా ! నీవు మాకు మేలు గలిగింప నీకు వందనము చేయుచున్నాము.[3]

యజ్ఞము చేయుటచే దంపతులు పూర్ణాయుర్దాయము కలవారై ధనకనక పుత్ర సంపదలు పొందుచున్నారు.[4]

జూదగానిని భార్య నిందించినది. అత్తగారు తిట్టినది [5]

జూదమాడిన నన్ను నా భార్య తిట్టలేదు, సిగ్గుపడలేదు, మంచిది.[6]

బ్రాహ్మణులవలె స్తుతిపాఠకు లగుచున్నారు. రాజులవలె సేవింపఁ దగినవా రగుచున్నారు.[7]

ఇట్లు దేశజాతి వృత్తిధర్మములను దెలుపు ఋక్కులింకను గొన్ని ఋగ్వేద మందు కలవు. ఇట్లే యజురాది వేదములందును బ్రాహ్మణములందునుగూడ నర్థ వాదములైన మంత్రములు, జాతి సంఘముల ధర్మములను దెలుపు గాథలు, రాజులు మొదలగు మహాపురుషుల కథలు గనవచ్చు నన్నమాట సత్యమే కాని,

1. సనాయతే గోతమ ఇంద్ర నవ్య మతక్ష ద్బ్రహ్మ హరియోజనాయ. ఋ. 1-62-13.
2. ఏవా తే గృత్సమదాః శూర మన్మా వస్యవో నవయునాని తక్షుః. 2-19-8.
3. శునం వాహాః శునం నరః శునం కృషతు లాంగలం. 4-57-4. అర్వాచీ సుభగే సీతే వందామహే త్వా యథా నః సుభగా ససి. 4-57-6.
4. పుత్రిణా తా కుమారిణా విశ్వమాయు ర్వ్యశ్నుతః. ఉభా హిరణ్య పేశసా. ఋ. 8-31-8.
5. ద్వేష్టి శ్వశ్రూ రప జాయా రుణద్ధి. 10-34-3.
6. న మామిమేథ న జిహీళ ఏషా శివా.
7. విప్రాసో న మన్మభిః స్వాధ్యః—రాజానో నచిత్రాః. 10-78-1.

యీ వేదములందే మంత్రములు దేవతా కర్తృకము లనియు ఋషులు జ్ఞానదృష్టిచే సూక్తములు దర్శించిరనియు, దేవతలు దివ్యవాక్కున సూక్తములు రచించిరనియు ననేక స్థలములం గనవచ్చును. అందు గొన్ని :—

దేవతలు దివ్యవాణిని గలిగించిరి. —ఆ వాగ్దేవి మనలను బొందుఁగాక.[1]

ఓ విరూప మహర్షీ ! ఉత్పత్తి రహితమైన మంత్రవాక్కుచే స్తుతింపుము.[2]

ఇంద్రావరుణులు పూర్వము ఋషుల కనుగ్రహించిన మనీషను వాక్కును మతిని శ్రుతమును, పూర్వయాజ్ఞికులు యజ్ఞము చేయువారై సృజించిన స్థానములను, తపశ్శక్తిచే నేను జూచితిని.[3]

అంభృణ మహర్షి కూఁతురగు వాగ్దేవి బ్రహ్మవిదుషియై తానే సర్వ జగద్రూపము సర్వాధిష్ఠానమని తన్నే స్తుతించుకొనెను. తాను వసురుద్రాది స్వరూపమున సంచరించుచున్నట్లు వర్ణించుకొనెను.[4]

గోతముఁ డుచ్చరించిన స్తుతిరూపమైన సూక్తమును మరుత్తులు మిక్కిలి యుత్కృష్టమును సుప్రసిద్ధమునైన దానినిగాఁ జూచిరి — ఇచ్చట గోతముఁడు ప్రవక్తయే కాని సూక్తకర్త కాఁడని విదిత మగుచున్నది.[5]

ఓ యింద్రా ! యజమానుఁడు నీకై సరిక్రొత్తదియు స్తుతిలక్షణ మైనదియు నగు సూక్త రూపవాక్కును రచియించెను. ఇతనికిఁ బురాతనమును సత్యమును సర్వహృదయముల నెఱుంగునదియు నగు బుద్ధి నొసంగుము[6] — ఇందు స్తుతి

1. దేవీం వాచ మజనయంత దేవా స్తాం విశ్వరూపాః పశవో వదంతి సా నోమంద్రేష మూర్జం దుహానా ధేను ర్వా గస్మా నుప సుష్టు తైతు. ఋ. 8-100-11.
2. తస్మై నూన మభిద్యవే వాచా విరూపనిత్యయా. ఋ. 8-75-6.
3. ఇంద్రావరుణా య దృషిభ్యో మనీషాం వాచో మతిం శ్రుత మదత్త మగ్రే। యాని స్థానా న్యసృజంత ధీరా యజ్ఞం తన్వానా స్తపసా భ్యపశ్యం. ఋ. 8-59-6.
4. అహం రుద్రేభి ర్వసుభి శ్చరా మ్యహ మాదిత్యైరుత విశ్వేదేవైః అహం మిత్రావరుణోభా బిభర్మ్యహ మింద్రాగ్నీ అహ మశ్వినో భా. 10-125-1.
5. ఏత త్త్యన్న యోజన మచేతి సస్వర్హ యన్మరుతో గోతమో వః. పశ్యన్ హిరణ్య చక్రానయోదంష్ట్రా న్విధావతో వరాహూన్. 1-88-5.
6. ఇంద్ర య స్తే నవీయసీం గిరం మంద్రా మజీజనత్ । చికిత్విన్మనసం ధియం ప్రత్నా మృతస్య పిప్యుషీం. ఋ. 8-95-5.

వాక్యములు క్రొత్తవైనను, ఇందలి విషయము పురాతనమని తెలియవచ్చు చున్నది.

అగ్నిం మీళే ఇత్యాదిక సూక్తమునకు విశ్వామిత్ర పుత్రుఁడు మధుచ్ఛంద సుఁడు ద్రష్ట. అతీంద్రియమైన వేదమును బరమేశ్వరానుగ్రహమున ముందు సందర్శించినవాఁడు ఋషి యనఁబడును—ఇట్లే వేదసూక్త కాండాదుల కా యా ఋషులు ద్రష్టలుగాఁ జెప్పఁబడుచున్నారు.[1]

ఇఁక నీ సందర్భమునకు సరిపడునట్టి శాస్త్ర వచనములు రెండు మూఁడుదా హరించి ప్రకృత మనుసరింతము.

"స్రష్ట పూర్వకల్పమందే విధముగా సృజించెనో యా విధిముగానే యుత్తర కల్పమందును సూర్యచంద్రులను మూఁడులోకములను సృజించుచు."[2] అని తెల్పు మంత్రమును బట్టియు, "సంసార మనాది యని బాదరాయణులు నిరూపించుటను బట్టియు[3] వారి మతమున, సమస్త వ్యక్తులు పుట్టుచుఁ జచ్చుచు మరలఁ బుట్టు చుండుట నైసర్గికము గావునఁ బూర్వ సృష్టిలోని చేతనాచేతన వస్తువుల నామ రూపము లుత్తర సృష్టిలోఁగూడ నెడతెగక సంభవించుచునే యుండును. అందుచే వేదములందు తాదృశ వస్తునామములు గనపచ్చుచున్నను విరోధము లేదు."[4] అని యాచార్యులవారు బాదరాయణుల సూత్రమున కర్థము వివరించి, పై యభిప్రాయ మును ధ్రువపఱుచుచు సెలవిచ్చియున్నారు. అందుచేతనే ఋగ్వేద సూక్తములను మధుచ్ఛందసుఁడు మొదలగు ఋషులును, యజురాది వేదముల భాగములను ప్రజాపతి మొదలగు కాండర్షులును సందర్శించిరని శౌనకాదులు స్మరించుచున్నారు. మఱియు 'పూర్వకల్పమందే ప్రాణు లే కర్మము లాచరించిరో, వా రుత్తర కల్పమందా కర్మలకు సజాతీయములైన కర్మములనే యాచరింతురు.[5] 'ప్రళయా

1. ఋ. 1-1-1 అవతారిక.
2. సూర్యాచంద్రమసౌ ధాతా యథా పూర్వ మకల్పయత్, దివంచ పృథివీం చాంతరిక్ష మథో స్వః. ఋ. 10-190-3.
3. ఉపపద్యతే చాప్యుపలభ్యతే చ. బ్ర. సూ. 2-1-36.
4. సమాన నామరూపత్వా చ్చావృత్తా వప్యవిరోధో దర్శనా త్స్మృతేశ్చ. బ్ర. సూ. 1-3-30.
5. తేషాం యే యాని కర్మాణి ప్రాక్ సృష్ట్యాః ప్రతిపేదిరే । తా న్యేవ తే ప్రపద్యంతే సృజ్యమానాః పునః పునః ॥

నంతరము జన్మించిన ఋషులకు వారి పూర్వనామములను, వేదవిషయకమైన వారి పూర్వజ్ఞానమును బ్రహ్మదేవుఁడు మరల నిచ్చుచుండును.[1] అని స్మృతులు ఘోషించుచున్నవి.''

దీనినిబట్టి నదీ ఋష్యాది సంజ్ఞ లుండుటచే వేదములు ఋషికల్పితము లనుట పొసఁగదని శంకరులవారి యభిప్రాయము విశదమగుచున్నది.

అపౌరుషేయత్వ విచార పర్యవసానము

విషయ మిట్లున్నది. వేదప్రామాణ్య వాదులగు శాస్త్రకర్తలలో నొకరును వేదము పౌరుషేయమని యంగీకరించి యుండలేదు. కాని, నాస్తికులైన చార్వాకాదులు మాత్రము వేదము పురుష ప్రణీతమని వాదించుచున్నారు. వేదకర్తలే వేద ద్రష్టలుగాఁ జెప్పఁబడుచున్నారు గాని ఋషులే వేదములు నిర్మించిరని పాశ్చాత్యు లనుచున్నారు. ఇఁక దీనిం గూర్చి విశేష చర్చయేల? వైదిక విజ్ఞాన మెన్నఁడు లోకమునఁ బ్రవృత్త మయ్యెనో, తెలియరామింజేసి యది యనాది యనియు ఛందోరూపము దాల్చిన దాని ప్రవృత్తి కీశ్వర ప్రేరణమే పరమ కారణముగా బ్రహ్మజ్ఞాన సంపన్నులు తపోయోగ నిష్ఠాగరిష్ఠులు నగు మహర్షులు వేద మంత్రములు సందర్శించిరనియు దానఁజేసి వేదము అపౌరుషేయము అనెడి విశ్వాసము భరత ఖండమున వేళ్లు నాటుకొని నిశ్చలముగా నున్నదనియుఁ దెలియ నగును. వేదము అపౌరుషేయము అనుటలో నిదియే పరమార్థము.

వే ద కా ల ము

దీనినిగూర్చి ప్రాచ్యపాశ్చాత్య విమర్శకు లనేక మార్గములఁ జర్చించి తమకుఁ దోఁచినరీతి నభిప్రాయము లావిష్కరించి యున్నారు. వారిలో వేదము అతి ప్రాచీనములని చెప్పుచుఁ గొంత చర్చచేసియుఁ దుదకు వేదకాలనిర్ణయ ప్రయత్నము నిరర్థకమని విడిచినవాఁడు వీబరు పండితుఁ డొక్కఁడే కాని, తక్కినవా రందఱు నేదో యొకమాట చెప్పుచునే వచ్చిరి. మోక్షము లరు ఋగ్వేద పరిశోధనమున బహుకాలము గడపియు వేదకాలము క్రీస్తుపూర్వము ౧౨౦౦ సంవత్సరముల దాఁటదని చెప్పెను. మేగ్డోనలు పై యభిప్రాయము నేదో కొంచెము విమర్శించి దానిని ౧౫౦౦ వఱకు గొంచెను. విట్నీ పండితుఁడు ౨౦౦౦ అనెను. బ్ర

1. ఋషీణాం నామధేయాని యాశ్చ వేదేషు దృష్టయః । శర్వర్యంతే ప్రసూతానాం తాన్యే వైభ్యో దదా త్యజః ॥

హాఫరు ౨౮౦౦ అనెను. జాకోబీ పండితుఁడు ४००० పై మాటయని వక్కా-ణించెను. ఋగ్వేదమున వక్కాణింపఁబడిన నాలుగు సముద్రములును ప్రాచీనార్యావర్త దేశమునకు నాలుగు సరిహద్దులుగా మున్నొక కాలమున నుండియున్నట్లు భూగర్భశాస్త్ర పరిశోధనవలనఁ దెలియవచ్చుచున్నది కాఁబట్టి, యాచతుస్సముద్రము లంతరింపక పూర్వము ఋగ్వేదము పుట్టెనని ప్రాచీనమత మనుసరించిన దాసుగారి సిద్ధాంతము. వారి యభిప్రాయ ప్రకార మా కాలము లక్షయేండ్లకుఁ దక్కువ కాదన్న నగుచున్నను. భూగర్భశాస్త్ర పరిశోధనలవలనఁ దేలిన యభిప్రాయ ములును, ప్రళయకాలములను గూర్చిన యభిప్రాయములును గూడ వేఱువేఱుగా నుండుటచే వానిపై నాధారపడు వారివిషయమున మిక్కిలి యావలికి బోవుటయో మిక్కిలి యీవలికి వచ్చుటయో సంభవించుచున్నది. ఎట్లయినను వేదకాల నిర్ణయమున నిర్వివాదమైన సిద్ధాంతములేదు. అనేకు లిట్లే తమకుఁదోఁచిన ట్లిచ్చిన యభిప్రాయములనెల్ల నిరసించుచు, సృష్టి ప్రక్రియ వేదమందు నిరూపింపఁ బడినది గావున సృష్ట్యాదినుండియు వేదములిట్లే వచ్చుచున్నవని మన పెద్దలను చున్నారు. ఇఁక నీవిషయముఁ గూలంకషముగా విమర్శించిన తిలకపండితుల యాశయ మెట్లున్నదో చూతము. వీరు 'వేదములలోని యుత్తరనివాస' మను గ్రంథమునఁ గడపటియధ్యాయము దీనివిషయము చక్కఁగాఁ చర్చించుటయే కాక వేదకాల నిర్ణయమునకు (orion) మృగశీర్ష యను చిన్న గ్రంథముకూడ రచియించియున్నారు. ఈ గ్రంథమున వేదములలోని ఖగోళజ్ఞానమును బోధించు వాక్యముల నుదాహరించి జ్యోతిర్గణితమునుబట్టి వేదకాలము నిర్ణయించుచు, అందుకు వ్యతిరేకాభిప్రాయము సూచించినబెంట్లీ మొదలగువారి వాదములను ఖండించుచు, తమ యభిప్రాయమును బలపఱుచునట్టి గ్రీకుపారశీకాదిగాథల నుదాహరించుచు సంపూర్ణ విమర్శనము గావించి యున్నారు. వారివలె నీవిషయము తరిచినవారు లేరనుట యతిశయోక్తి కాదు. కావున వారియభిప్రాయ మిందు సంగ్రహముగాఁ దెలుపుచున్నాను

"సూర్యుఁడే దినమున నేనక్షత్రము వద్దనుండి బయలుదేఱెనో, ఆ దినము సంవత్సరాది యనియు : ఆ నక్షత్రమువద్దకు మరల సూర్యుఁడు వచ్చునప్పటికి సంవత్సరమయ్యె ననియుఁ బూర్వులు గ్రహించి దానినిబట్టి వార్షికసత్రములు మున్నగుకర్మము లాచరించుచుండెడి వారనుటకు వేదములలోఁ బ్రమాణవచన ములు గలవు.[1] దీనినిబట్టి యా సంవత్సరాది దినమున సూర్యునివద్ద నున్ననక్ష

1. తై. బ్రా. 1-5-2-1.

త్రము ప్రథమనక్షత్రముగా గణింపఁబడుచు వచ్చెననియు, అందు విషువత్తుండె ననియుఁ దెలియవచ్చుచున్నది. విషువత్తనఁగా నహోరాత్రములు సమానముగా నుండు కాలము.

పైని జెప్పినదాని కనుగుణముగా, కృత్తిక ప్రథమనక్షత్రముగా గణింపఁ బడినకాలము తైత్తిరీయబ్రాహ్మణమువలనఁ దెలియుచున్నది.[1] ఈ విషయమును బలపఱుచునట్టి వాక్యములు బ్రాహ్మణాదులం దింకను కలవు.[2] ఈ ప్రమాణము లను బట్టి తైత్తిరీయ సంహితాకాలమునాఁటికి వసంతవిషువత్తు కృత్తికా నక్షత్రమం దున్నట్లు విదితమగుచున్నది. ఒక్కొక్కనక్షత్రమందు విషువత్తు ౯౬౦ సంవత్స రములుండును. అది యొకనక్షత్రమునుండి మఱియొక నక్షత్రమున కతిసూక్ష్మ ముగా వెనుకకు నడచుచుండును. వరాహమిహిరుని కాలమున విషవత్తు రేవత్యం తమం దున్నది. (అది యిప్పటికి ౧౪౦౦ సంవత్సరముల క్రిందటిమాట.) దానిని బట్టి విషువచ్చలనమును జోతిర్గణితరీతిచేఁ బరిశీలింపఁగా, కృత్తికానక్షత్రమందు విషువత్తున్నకాలము క్రీస్తుపూర్వము ౨౩౫౦ సంవత్సరము లగుచున్నది. అందుచేఁ దైత్తిరీయసంహితాకాల మదియే యని తేలుచున్నది. కాని యింతటితో వేదకాల నిర్ణయము కాలేదు. వేదములలోని యితరవాక్యములనుబట్టి యింకను వెనుకకు వెళ్లుట కవకాశము కలదు.

తైత్తిరీయసంహితలో[3] ఉత్తరఫల్గునీ నక్షత్రయుక్త పూర్ణిమయు చిత్రా నక్షత్రయుక్త పూర్ణిమయు సంవత్సరాది దినము లయినట్లును, ఆ దినములు దీక్షా రంభదినము లయినట్లును, సంవత్సరముఖము లయినట్లును వర్ణింపఁబడియున్నది. ఈ విషయమును బలపఱుచునట్టి వాక్యము లనేకములు బ్రాహ్మణములలోఁ గన వచ్చుచున్నవి.[4] ఈ ఫాల్గునియు చైత్రియు దినములను దెల్పునవే కాని మాసము లను దెల్పునవి కావు.

1. 1-5-2-7, 2. 1-1-2-1, తై.సం. 4-4-10. 7-4-8, తం బ్రా. 5-9 మొద.
3. సంవత్సరాయ దీక్షిష్యమాణా ఏకాష్టకాయా మిత్యాది—తై. సం. 7-4-8.
4. "ఏషాహ వై సంవత్సరస్య ప్రథమా రాత్రి ర్య త్ఫాల్గునీ పౌర్ణమాసీ." శత – బ్రా. 6-2-2-18.
"ఏషావై ప్రథమా రాత్రిః సంవత్సరస్య య దుత్తరా ఫల్గునీ ముఖత ఏ సంవత్సర స్యాగ్ని మాధాయ వశీయా న్భవతి." తై బ్రా. 1-1-2-8.
"ముఖంవా ఏత త్సంవత్సరస్య య త్ఫాల్గునీపౌర్ణమాసీ." సాం. బ్రా. 4
"ముఖ ముత్తరే ఫల్గున్యౌ పుచ్ఛం పూర్వే." గో. బ్రా. 1-19.
"ఉత్తరయో రాదధీత ఏషావై ప్రథమా రాత్రిః సంవత్సరస్య య దుత్త ఫల్గునీ" ఆధాన బ్రాహ్మణము.

దీనినిబట్టి ఫాల్గునపౌర్ణమాసి సంవత్సరాది దినముగానున్న కాలమును, చైత్రపూర్ణిమ సంవత్సరాది దినముగా నున్న కాలమును, పూర్వోక్తసంహితా బ్రాహ్మణములకు మున్నొకానొకప్పుడు కలవని విదితమగుచున్నది. ఇందు ఫాల్గున పూర్ణిమ సంవత్సరాది దినమగుటగూర్చి యించుక విచారింపవలసియున్నది. ఇది వసంతవిషువత్సంవత్సరాది యన్నచో వసంతవిషువత్తు, ఉత్తరాభాద్రలో నుండవలెను. అట్లుండెనేని యా కాలము క్రీస్తుపూర్వము ౨౦ వేల సంవత్సరము లగును. అది యసంభవము గావున హిమసంక్రమణము వద్ద ఫాల్గున పూర్ణిమనాఁడు సంవత్సర మారంభమయ్యెనని చెప్పవలసియున్నది. అట్టి సంవత్సరాది ప్రాచీన కాలమునఁ గల దనెడిగాథ తమనాఁటి కనుశ్రుతముగా వచ్చుటచేతనే తైత్తిరీయ సంహితాబ్రాహ్మణాదులలో ఋషులట్లు వర్ణించియున్నారనుట విశ్వసనీయము. ఫాల్గునపూర్ణిమ హిమసంక్రమణమువద్ద సంవత్సరాది దినమైన దనఁగా మృగశీర్షలో వసంతవిషువత్తున్న దనుటయే. అనఁగాఁ దైత్తిరీయ సంహితాకాలమునఁ గృత్తికలోనున్న విషువత్తు రెండు నక్షత్రముల వెనుకనున్న దనుట, అట్లయినచో మృగశీర్ష, ప్రథమనక్షత్రముగా గణింపఁబడినట్లు ప్రమాణము కావలసియుండునుగదా!

మృగశీర్ష నక్షత్రమునకు ఆగ్రహాయణియను నామాంతరము కలదు.[1] ఆగ్రహాయణీ నక్షత్రయుక్త పౌర్ణమాసి దానియందు కలదు. కావున మార్గశీర్ష మాసమున కాగ్రహాయణిక మనుపేరు గూడ వచ్చినది.[2] ఈ యర్థమును, పాణినీయము బలపఱచుచున్నది గావున,[3] ఒకప్పుడు మృగశీర్ష నక్షత్రము ప్రథమ నక్షత్రముగా గణింపఁబడె ననుటకును, దానియందు విషువత్తుండె ననుటకును, ఆగ్రహాయణీ శబ్దవ్యుత్పత్తియే ప్రమాణము[4] దీనినిబట్టి మృగశీర్ష నక్షత్రమువద్ద సూర్యుఁ డుదయించు సమయమును ప్రాచీన వైదిక ఋషు లెఱుఁగుదురనియు, ఆ దినము సంవత్సరాదిగా గణింపబడుటచేతనే మృగశీర్ష కాగ్రహాయణీనామము వచ్చె ననియు విదితమగుచున్నది. కాని, మార్గశీర్షమున కాగ్రహాయణిక మను

1. మృగశీర్షం మృగశిర స్తస్మి న్నే వాగ్రహాయణీ, అమరకోశము,
2. మార్గశీర్షే సహోమార్గ ఆగ్రహాయణిక శ్చ సః,
మృగశిర ఏ వా గ్రహాయణీ తద్యుక్తాపూర్ణి మాస్మి న్నితి, వ్యాఖ్యా.
3. సా స్మి న్పౌర్ణ మాసీతి, 4-2-21 ; ఆగ్రహాయణ్యశ్వత్థాట్ఠక్. 4-2-22. అష్టాధ్యాయి.
4. అగ్రే హాయన మస్యా ఇత్యాగ్రహాయణీ, అని పాణినిమత మనుసరించిన భట్టోజిదీక్షితుల వృత్తి.

పేరుండుటచే మార్గశీర్ష మాసముతో సంవత్సరారంభ మయ్యెనని మాత్రము తలంపరాదు. అశ్వినీ నక్షత్రము మనకిపుడు నక్షత్రగణనలోఁ బ్రథమనక్షత్రమైననుఁ ఆశ్వయుజ మాసము సంవత్సరారంభ మాస మగుటలేదు. కావున మృగశీర్ష యందు విషువత్తున్నదని తెలుపుటచేతనే, దాని యాగ్రహాయణీనామ మన్వర్థమగు చున్నదని గ్రహింపఁ దగును[1]. ఇట్లు మృగశీర్ష నక్షత్రమందు విషువత్తున్నదను విషయమును బ్రాచీను లెఱుఁగుదురని తిలకపండితులు గ్రీకుపారశీకాది సారస్వత ములనుండి కొన్ని గాథ లుదాహరించుచు విపులముగాఁ జర్చించి నిర్ణయించిరి. ఈ కాలము క్రీస్తుపూర్వము సుమారు ౪౦౦౦ సంవత్సరము లగుచున్నది. ఇంతటితోను విడువక తిలకుగారింకను వెనుకకుఁ బోఁజూచి విషువత్తు పునర్వసులో నుండుట గూడఁ బ్రాచీను లెఱుఁగుదు రనుటకు సూచనలు చూపించిరి.

వెనుక నుదాహరించిన తైత్తిరీయ సంహితా వాక్యములవలనఁ జైత్రపూర్ణిమ గూడ నొకప్పుడు సంవత్సరాదిగా నున్నట్లు తెలిసికొనియున్నాము. అది గూడఁ బూర్వయుగ వృత్తాంతమునే తెలుపుచున్నది గావున దానినిబట్టి హిమసంక్ర మణమువద్దఁ జైత్రపూర్ణిమనాఁడు సంవత్సరారంభ మైనకాలము గూడ గోచరించు చున్నది. అక్కడ సంవత్సరారంభమైన దనఁగా విషువత్తు పునర్వసు నక్షత్రము నందున్న దనుటయే. అనఁగా మృగశీర్షకంటె రెండు నక్షత్రముల వెనుకనున్న దనిభావము. అట్లయినచో పునర్వసునక్షత్రము ప్రథమ నక్షత్రముగా గణింపఁ బడినట్లు ప్రమాణవచనములు కావలెను. అట్టి ప్రత్యక్ష వాక్యములు వేదాదులందు గనరావు కాని, యైతరేయ బ్రాహ్మణ తైత్తిరీయ సంహితలలోని యొకగాథమాత్ర మీవిషయమును జక్కఁగా సూచించుచున్నది.

"ఒకప్పుడు యజ్ఞపురుషుఁడు కోపగించి దేవతల యాగమునుండి లేచిపోయెను. అపుడు దేవతలు యజ్ఞాంగమునొనర్ప నశక్తులై, అదితివద్దకువెళ్ళి మాయాగము మేము సమాప్త మొనరించునట్లను గ్రహింపవలసినదని కోరిరి. అందు కదితి యంగీకరించి, సోమయాగములన్నియు నాతోఁ బ్రారంభించి సమాప్తి గావింపవలెనని వరముకోరెను.

1. దీనియర్థము సాధించుటకై తిలక పండితులు, పెద్ద వ్యాఖ్యానము చేసి యున్నారు. మాసము పేరునుబట్టి నక్షత్రమునకుఁ బేరు వచ్చినట్ల మర సింహాదులు పొరబడి రనెడి యభిప్రాయముతోను మాసానాం మార్గశీర్షోఽహం ఋతూనాం కుసుమాకరః, అనుభగవద్గీతావచనము మార్గశీర్షము సంవత్సరాద్యమాసమని సూచితమగుట యసంగతమను తలంపుతోను వారట్లు హెచ్చుగా వ్రాసియుందురు.

అందుకు దేవత లంగీకరించి యాగప్రారంభ కాలమందలి చరువును (హవ్యము) సమాప్తి కాలమందలి చరువును, అదితిదేవతాకములుగాఁ జేయవలెనని నిర్ణయించిరి. అదితి యట్లు కోరెను గావునఁ బ్రారంభావసానములందలిచరు వట్లదితి దేవతాకముగాఁ జేయుట యుక్తము. ఈ యర్థమునే తైత్తిరీయము కూడఁ జెప్పుచున్నది.[1] దీనినిబట్టి పునర్వసునక్షత్రమునకు. అదితి యధిష్ఠానదేవత యగుటచే, ఆ నక్షత్రముతో యజ్ఞ మారంభించి యానక్షత్రముతో యజ్ఞము సమాప్తి చేయవలసినట్లు తెలియవచ్చుచున్నది. అనఁగా, పునర్వసు నక్షత్రమందు విషువత్తుండుటచే. ఆనక్షత్రమువద్ద సూర్యుఁడుదయించి మరల నానక్షత్రమువద్దకు వచ్చుటకు సంవత్సరమగు ననియు, అందుచే పునర్వసు నక్షత్రముతో సంవత్సర మారంభ మగు ననియు భావము. ఇట్లు సూచింపఁబడిన యీ భావమును, తిలకుగారు ఋగ్వేదాదులలోని యితర వాక్యములచే సమర్థించియున్నారు. దీనిని బట్టియుఁ బ్రాచీనుల యజ్ఞాచారములనుబట్టియుఁ బురాతన ఋషులు పునర్వసులో విషువత్తున్న కాలముగూడ నెఱిఁగియుందు రనుట కవకాశము గలుగుచున్నది. అందుచే వేదకాలము మఱి రెండువేల సంవత్సరములు వెనుకకు జరుగును. అనఁగా క్రీస్తుపూర్వము ౬౦౦౦ సంవత్సరములనుట. ఇట్లు వేదకాలమును జర్చించి సిద్ధాంతీకరించిన తిలకపండితులు తమ రెండు గ్రంథముల కడపట నిచ్చిన వేదకాల విభాగాదికమును సంగ్రహముగా నిందు తెలుపుచున్నాను.

అదితియుగాది నిర్ణయము

ఉత్తర ధ్రువహిమ ప్రళయానంతర యుగారంభము.

క్రీస్తు పూర్వము ౧౦,౦౦౦ లేక ౮౦౦౦ సంవత్సరములు. వేదసూక్తములందలి యనేక విషయములు హిమప్రళయ పూర్వకాలమందలి వని వైదికఋషు లెఱుంగుదురు. బహుపురాతనములైన యావిషయములే సూక్తరూపమును దాల్చినవి.

క్రీస్తుపూర్వము ౮౦౦౦–౬౦౦౦. ఈ కాలమున నుత్తరధ్రువము విడిచిన యార్యులు క్రమముగా నాసియా ఖండాదులందు సంచరించుట అందందు నివసించుట. ఇది యార్యనాగరికతయందు ప్రథమయుగము. ఇదే. అదితియుగము

1. యజ్ఞో వై దేవేభ్య ఉపక్రామత్—ఇత్యాది—ఐ. బ్రా. 2-1 దేవా వై దేవయజనమధ్యవ సాయ—ఇత్యాది—తై. సం. 6-1-5.

లేక పునర్వసుయుగము. ప్రాచీనవైదిక విజ్ఞానవికాసము మరల నీయుగమం దారంభమైన దనవచ్చును.

క్రీస్తుపూర్వము ౨౦౦౦-౩౦౦౦. ఇది యార్యనాగరకతయందు ద్వితీయ యుగము. ఇదే మృగశీర్ష యుగము. ఇందు ఋగాదివేదములలోని యనేక సూక్తము లావిష్కృతములైనవి. హిమప్రళయమునకుఁ బూర్వమునుండియుఁ బ్రాచీన మహర్షి పరంపరాముఖమున వచ్చుచున్న వైదికవిజ్ఞానము నేమఱక యీ కాలమందలి ఋషులు దానిని భద్రపఱిచిన విధానమిందు గనవచ్చును.

క్రీస్తుపూర్వము ఇది యార్యసభ్యతయందు తృతీయ యుగము. ఇదే కృత్తికాయుగము. ఇందు తైత్తిరీయ సంహితయు బ్రాహ్మణములు మొదలగు వైదిక భాగములు సంపూర్ణత వహించినవి.— తైత్తిరీయమునకు మున్ను సామవేదమును వెనుక నథర్వవేదము నీ యుగమునందే యావిర్భవించిన వని చెప్పవచ్చును. వీని పౌర్వాపర్యమునెడ మతభేదములు కలవు. సామవేదము ముందో తైత్తిరీయము ముందో నిర్ణయించుట క్లిష్టమే కాని యీ రెండింటికిని గూడ నథర్వ వేద మర్వాచీన మగుట మాత్రము తెల్లము—.

క్రీస్తుపూర్వము ౧౪౦౦—౨౦౦. ఇదియార్య సభ్యతయందు చతుర్థ యుగము. ఇదే గౌతమ బుద్ధపూర్వయుగము. దీనిని సూత్రయుగ మందురు. ఇందు వివిధ సూత్రములు బహువిధ వేదాంతములు నుదయించినవి.

వేదముల నింకను, కాలగర్భములోనికిఁ గొనిపోవుటకు సూచనలు లేక పోలేదు. ఆర్యవిజ్ఞానముపునాది కనిపెట్టవలె నంటే హిమప్రళయ కాలమువెనుక కెక్కడికో పోవలెను. కాని యావారి యగమ్యగోచరముగా నున్నది. అందు చేతనే పూర్వులు వేదము లనాదులనిరి. వైదికవిజ్ఞానము బహుపురాతన మచింత్య మతిమానుషము నగుటచే వారట్లు భావించుట సమంజసమే."

వేదము లీశ్వరానుగ్రహ లబ్ధములు ఋషిదృష్టములునని వైదిక ఋషులును బూర్వశాస్త్రకర్తలును దలంచిన దానిని తిలకుగారియభిప్రాయము సమీపించుచునే యున్నది. ఎట్లయిన నేమి? వేదముకంటెఁ బురాతనమైన గ్రంథము ప్రపంచ మందు వేఱొకటి కనఁబడలేదు. దానికంటెఁ బూజనీయమైన ప్రత్యక్షదైవతము వేఱొకండు కనఁబడదు.

కావున వేదకాలమునుగూర్చి యెవరెన్ని వ్రాసినను, అవి యన్ని నూహలేయగును గాని సిద్ధాంతములు కాఁజాలవని నా యభిప్రాయము. అం

దెలిసినంతలో నేదో యొకటి యిదమిత్థమనుట చరిత్రకారునివిధి కావున నా బుద్ధికి శ్రీతిలకపండితుల సిద్ధాంతమిప్పటి కుచితముగాఁ గనఁబడుచున్నదని మనవిచేయు చున్నాను.[1] ఇఁక నీ విషయము నెక్కువగాఁ జర్చించుటకంటె—

"యుగాన్తేఽన్తర్హితాన్ వేదాన్ సేతిహాసాన్ మహర్షయః,
తపసా లేభిరే పూర్వ మనుజ్ఞాత స్స్వయంభువా."

అను భారతోక్తిని స్మరించి దాని తత్త్వము గ్రహించుటయే యుచితము.

ఇది సంస్కృత కవి జీవితాది కృతికర్తయగు మల్లాది
సూర్యనారాయణశాస్త్రి రచియించిన వైదిక
వాఙ్మయచరిత్ర యందలి
ద్వితీయాధ్యాయము

---

1. శ్రీచింతామణి వినాయక వైద్యపండితుల యభిప్రాయముకూడ దీనికి దగ్గఱగానే యిట్లున్నది.
శ్రుతియుగము—క్రీ. పూ. ౪౫౦౦–౮౦౦.
స్మృతియుగము–లౌకిక సంస్కృతయుగము–క్రీ. పూ. ౮౦౦–క్రీ, ౮౦౦.
భాష్యయుగము–క్రీ. ౮౦౦–౧౫౦౦.
H. San. Literature Vol I. P. 17.

తృతీయాధ్యాయము

భాష

వైదికార్యులు వేదములోని శబ్దజాలమును, తాము నిత్యము వ్యవహరించు కొను శబ్దజాలము, నేపేరఁ బిలుచుచుండెడివా రను ప్రశ్నకు ఋగాది సంహితలలో నెట్టి సమాధానము కనరాదు గాని, పాణినీయ మిట్లు సమాధాన మిచ్చుచున్నది. అందు వైదిక శబ్దములకు వేదము – ఛందస్సు – అనియు, లౌకిక శబ్దములకు లోకము – భాష – అనియు, సంజ్ఞలు కనవచ్చుచున్నవి. వైదిక లౌకిక శబ్దముల భేదము చూపించు సందర్భములందు 'ఛందసి – భాషాయామ్' అనుచుఁ బాణిన్యా చార్యులును, ''ఛందసి – వేదే, భాషాయామ్ – లోకే, అనుచుఁ బతంజలిమునియు, ఇట్లే యాస్కాచార్యులును రెండు విధములైన సంజ్ఞలు వాడియున్నారు.[1] ఈ సంజ్ఞలు శబ్దరాశిపరములని యీ క్రింది వ్యుత్పత్తులు చెప్పుచున్నవి.

విద జ్ఞానే – దేనిచే ధర్మాధర్మములు తెలిసికొనుచున్నారో, అది వేదము. అది ఆహ్లాదనే – నియమబద్ధమైన యేది యాహ్లాదకర మగుచున్నదో, అది ఛందస్సు.[2] లోకృ దర్శనే, భాషార్థశ్చ – దేనిచే జనులు పరస్పరము సంభా షింతురో, అది లోకము. భాష వ్యక్తాయాం వాచి – దేనిచే జనులు పరస్పరాభి ప్రాయములు స్పష్టపఱుచుకొందురో, అది భాష.

ప్రదీపోద్ద్యోతకర్తలగు కైయట నాగేశభట్టులు నీ సంజ్ఞలు శబ్దజాలపరము లనెడి భావము తెలిపియున్నారు. అయితే, ఇట్లు ఛందోవేద సంజ్ఞలచే విలసిల్లిన వైదిక శబ్దరాశియు భాషాలోక సంజ్ఞలచే విలసిల్లిన లౌకిక శబ్దరాశియుఁ దొలుదొల్త నేకమా భిన్నమా ? అను విషయ మిపు డాలోచింపవలసియున్నది. ఇందుకు మఱి కొంచెము వెనుకకు వెళ్ళి చూతము.

వేదములోని పెక్కు శబ్దములను గ్రీకు లాటిన్ జర్మన్ ఫ్రెంచి లిథూని యన్ మొదలగు భాషలలోని పెక్కు శబ్దములు పోలియున్నవనియు, పారశీకుల

1. పాణిని - అష్టా. 1-2-61, 8-2-108, మహాభా. 1-1-1 నిరుక్త. 1-4-6 1-2-5, 1-2-7.
2. ఛది సంవరణే - ?

జెండవెస్తాలోని భాష ఋగ్వేదభాషకు మిక్కిలి దగ్గఅగా నున్నదనియు నార్యభాప శబ్ద సాదృశ్య పరిశోధకులు నిర్ణయించియున్నారు. సకార హకార భేదముతోను ఈషద్వర్ణ భేదముతోను, వైదిక శబ్దములును జెండవెస్తా శబ్దములు నసంఖ్యాః ములు పోలుచున్నవి. కొన్నిటికి భేదమే కనఁబడదు. ఇందుకుఁ గొన్ని:—సప్త - హప్త, సింధు - హిందు, అసుర - అహుర, మన్యస్తే - మైన్యస్తే, దేవ - దేవ ఇంద్ర - ఇంద్ర, ఇత్యాదులు. ఇఁక దీనికిని దక్కిన కొన్ని భాషలకునుగల పోలికః కుదాహరణములు కొన్ని :—

సంస్కృ.	లాటిన్.	గ్రీకు.	జర్మన్.	ఇంగ్లీ.
అస్తి	ఎస్ట్	ఎష్టి	ఇష్ట్	ఇజ్
భరామి	ఫెరో	ఫెరో	బైరా	బేర్
ద్వౌ	దువో	దువో	ట్వై	టూ
నౌః	నావిప్	నౌస్	నౌ ?	...
సప్త	సెప్టెమ్	హెప్టె	సిబున్	సెవెన్
అగ్నిః	ఇగ్నిస్	...	ఓగ్ని	...
మానవః	మెన్స్	...	మన్	మేన్
జానుః	గెనూ	గొనూ	క్నియూ	నీ
నవః	నోవుస్	న్యో	న్యూఎ	న్యూ
నభః	నెబులా	నెఫోస్	నెబులా	...
జనః	గెనుస్	గెనోస్	జీనస్	...
పితా	పాటెర్	పాటెర్	ఫాటెర్	పాదర్
మాతా	మాటెర్	మాటెర్	ముట్టెర్	మదర్
భ్రాతా	ఫ్రాటెర్	...	బ్రూదెర్	బ్రుదర్

చిన్న మార్పులతోడి యిట్టి పదము లనేకములు కలవు. ఇట్టి శబ్దసాదృశ్య మునుబట్టి హైందవార్యుల ప్రాచీనులు ము న్నొకప్పుడున్న యేదో యొక చోటినుండి కాని, వారినుండికాని, గ్రీకు మొదలగు శాఖలవారు విశిచిపోయినపుడును, తరువాతఁ బారసీకులు విడిపోయినపుడును, వారేభాష మాటలాడుచుండెడివారో దేశకాల పరిస్థితులనుబట్టి పెంపును మార్పును జెందిన యా భాషలో సప్తసింధు దేశముఁ జొచ్చినవారి సంతతివా రగు వైదికార్యులు సూక్త మంత్రములను సందర్శింప నారంభించిరనియు, ఆ భాషనే తొలుదొల్త నిత్య వ్యవహారమున నుపయోగించు చుండిరనియుఁ జెప్పవలసియున్నది. కాని, ఆ స్థితి మాత్రము చిరకాలము నిలిచి

యున్న దనుటకు వీలులేదు. ఏ మనఁగా? సంఘము పెరుఁగుచున్న కొలఁదిని దేశము విస్తరించుచున్న కొలఁదిని నూతన వృత్తులు నవీన పదార్థములు వాని వివిధోపయోగములు నేర్పడుచున్న కొలఁదిని, అన్యజాతులతో సహవాసముగాని సంఘర్షణముగాని సంభవించుచున్న కొలఁదిని వాడుకలో నూతన శబ్దజాలము హెచ్చుటయుఁ బ్రాఁతశబ్దములు రూపమునందు నర్థమునందు మార్పు చెందుటయుఁ గొన్ని వ్యవహారమునుండి తొలఁగిపోవుటయు వ్యావహారిక భాషల నైజమనుట మన కనుభవసిద్ధము, ప్రాచీనార్యుల కాలమునఁగూడ వారి భాష కిట్టి యవస్థ సంభవించిన దనుట యస్వాభావికము కాదు. అట్లు పెరిఁగినట్టియు మాఱినట్టియు శబ్దజాతము ఛందస్సున కనుకూలమయిన యుదాత్త పాఠనరూపముతో వేదద్రష్టల వాక్కులకెక్కి వేదమున స్థిరపడుటయు, అదియే జనసామాన్యమునోటఁబడి మరలమరల మార్పు చెందుటయుఁ గారణములుగాఁ గ్రమముగా నచిరకాలముననే వైదికలౌకిక శబ్దజాలము లించించుక వేఱుపడుచు వచ్చినవనుట వాస్తవము. ఇందుకుఁ గొన్ని యుదాహరణములు :—

౧. తొల్లి క్రమముగా వ్యవహారమందుండెడి 'దేవాసః - దేవాః, కర్ణేభిః - కర్ణైః, అస్మే - అస్మభ్యమ్, యుష్మే - యుష్మాసు ఇత్యాదిద్విరూపములు వేదమున నిలిచినవి, వీనిలో మొదటి రూపములు లోకమున నడుగంటినవి.

౨. 'స' అనెడినిపాతము తొల్లి, ఉపమానార్థమును నిషేధార్థమును గూడఁ జెప్పుచుండెడిది. దీని యీ యర్థములు రెండును వైదికమున నున్నవి. ఇందు మొదటియర్థము లౌకికమునఁ దొలఁగినది.

౩ తొలుత వర్తమానాది కాలముల విధింపఁబడెడి దశవిధలకారములలో లేట్లకారమునకు సంబంధించిన 'ఈశై - పతామ - తారిషత్,' మొదలగు రూపములు ఛందస్సులో నున్నవి. ఈలకారమే భాషనుండి జాఱిపోయినది.

౪. పూర్వము సాధారణముగా నొక లకారమునకు బదులుగా మఱియొక లకారము ప్రయోగింపఁబడుచుండెడిని. లోడర్థమందు 'ఆగమత్' వర్తమానార్థమందు 'మమార' అనురీతి నుండెడి యీ పద్ధతి వైదికిలోఁ గనవచ్చును. లౌకికిలోఁ గనరాదు.

౫. లిఙ్వద్భావమందు "బభ్రిః-పపిః-దదిః" ఇత్యాదిరూపములు వైదికిలో నున్నవి. లౌకికిలో లేవు.

౬. మున్ను తుమర్థమందు ధాతువునకు 'సే-సేన్-అసే-అసేన్-' ఇత్యాదులు పదియేను ప్రత్యయములు చేరుచుండెడివి.[1] వీనితోను, తుమ్ప్రత్యయముతోను గూడిన యట్టిరూపములు వేదములోఁ గనఁబడుచున్నవి. తుమ్ప్రత్యయాంత రూపములు మాత్రమే లోకమునఁ గనవచ్చుచున్నవి. తక్కినప్రత్యయములు పదియేనును గూడ నిఁదు లోపించినవి.

౭ "ఇవ-చిత్-ను-చ-అథాపి" అనునిపాతములు రెండింటియందునుగలవు. కాని యివి తఱచుగా వేదమున నుపమార్థకములు గూడ నగును. ఇందు 'ఇవ' ఒక్కటియే లోకమున నుపమార్థక మగుచున్నది.

౮. వేదములోని వికరణములు లోకములోని వికరణములును, పరస్పర విరుద్ధములై పెక్కుచోట్లఁ గనవచ్చును. "భేదతి-భినత్తి," మరతే-మ్రియతే, నేషతు-నయతు. తరుషేమ-తరేమ" ఇత్యాదుల సంఖ్యాకములు కలవు. పైజంటలు సమానార్థకములు. ఈ ద్వివిధరూపములును వైదికిలో నున్నవి. రెండవ రూపములు మాత్రమే లౌకికిలో నున్నవి.

౯. ఈ రెంటిలోని శబ్దములను బోల్చి చూచినచో వర్ణలోప వర్ణాగమ వర్ణాదేశ వర్ణవ త్యయాది రూపములైన వికారములు గనిపించును. ఇందుకు గృభ్ణామి - గృ మి, జభార - జహార, హిరణ్యయేన - హిరణ్యమయేన, పన్థాః - పన్థానః, వ్యోమ - వోమ్ని.[2]

ఇత్యాదు లుదాహరణములు. పైజంటలన్నియు వేదమున నున్నవి. రెండవ రూపములు మాత్రమే లోకమున నున్నవి. ఇట్టి వసంఖ్యాకములు కలవు. ఈ ప్రయోగభేదములనుబట్టి యార్యుల తొల్లిటి వ్యవహారమునందు వర్ణలోపాదుల రూపభేదము చెందుచు వచ్చినశబ్దములన్నియు వేదమున కెక్కియందు నిశ్చలములై నిలిచియున్నవనియు, వానిలోఁ గొన్నికొన్ని క్రమక్రమముగా వ్యవహార ప్రవాహమునఁబడి కొట్టుకొనిపోయిన వనియుఁ దెలియకపోదు. అందుచేతనే యివి రెండును మొట్టమొదట నొక్కటై తరువాత రెండై కొంతకాలము దగ్గఱదగ్గఱగా వచ్చి తరువాత మెల్లగాఁ బరస్పరము దూరమై పిదపఁ బూర్తిగా విడిపోయినవని చెప్పఁ

1. అష్టాధ్యాయి—3-4-9.

2. పై తొమ్మిదింటిలోను గనవచ్చు వ్యాకరణసంజ్ఞలు తరువాత వైయాకరణులు కల్పించిన వనుట విదితము.

బడుచున్నది. అట్లు విస్పష్టముగా వేఱుపడినను, రెంటియందునేకమైన వర్ణసమామ్నాయములును శబ్దమూలములును బహుశబ్దరూపములును వీని ప్రాచీనైకత్వమును స్మృతికిఁ దెచ్చుచునేయున్నవి. అయిన నేమి? కాలక్రమమున లౌకికభాషయనేకాంతరములు దాఁటి వచ్చినకొలఁదిని దానిని సంపూర్ణముగా నెఱిఁగినవారి కైనను, శబ్దకఠిన మర్థగంభీరము పరుషోచ్చారణము విలక్షణ నామక్రియాదిరూప మక్షరాక్షర స్వర ముదాత్తవేషమునైన వైదికభాష తెలియరానిస్థితికి వచ్చుటయు, దాని నుభయ భాషాభిజ్ఞు లగునైరుక్తులు వైయాకరణులు మొదలగు విద్వాంసులు విడఁగొట్టి యర్థము చెప్పవలసివచ్చుటయు సంభవించినది.

పైని వివరించిన విధముగా వైదికినుండి వేఱుపడిన లౌకికి క్రమముగా నియమహీనమగుచుండుట కనిపెట్టి కాశ్యప శాకల్య శాకటాయ నాదిమును లాయా కాలములందు దానిని యథోచితముగా సంస్కరించుచు వచ్చినట్లుగాఁ బాణినీయము లోని వారి ప్రశంసవల్లనే తెలియవచ్చు చున్నది. వారి వ్యాకరణములలో శాకటాయనుని శబ్దానుశాసనము సజీవమై యున్నట్లు తెలియు చున్నది. ఆ వ్యాకరణము లసమగ్రము లగుటచేతనో మఱెందుచేతనో లౌకికి స్వేచ్ఛగా విజృంభించుటయు వికృతి శబ్దజాలము మఱొక భాషగా మాఱుచుండుటయుఁ, జూచి తరువాత నార్యభాషను జక్కఁగా శాసింపఁ బాణిన్యాచార్యులు పూనుకొనిరనుట విదితము. తరువాత వారి ననుసరించి వరరుచియు (కాత్యాయనుఁడు) పతంజలియు భాషను మిక్కిలి కట్టుదిట్టము చేసిరి. అట్లు శబ్దశాస్త్ర క్రమము ననుసరించి సంస్కారము నొందుచు వచ్చిన యార్యభాష సంస్కృత సంజ్ఞను దాని వికృత శబ్దజాలము ప్రాకృత నామమును జెందినవి. భాషాపరమయిన యీ సంస్కృత శబ్దము పాణిన్యాచార్యులకు మున్నె పుట్టినట్లుగా వాల్మీకి రామాయణమునఁ గనఁబడుచున్నది.[1] వార్తికకార వరరుచికి సమకాలికుఁడో పూర్వుఁడో యైన మఱియొక వరరుచి రచియించిన ప్రాకృత సూత్రములలోఁ గనవచ్చు చున్నది.[2] ఈ ప్రాకృత వ్యాకరణమైనను క్రీ. పూ. ౩౦౦ సంవత్సరముల క్రిందటి దనుట స్పష్టము. ఇందు సంస్కృతమునుండి శౌరసేన ప్రాకృతమును దానినుండి పైశాచియుఁ బుట్టినట్లు చెప్పఁబడినది.[3] కాని పైశాచియే శౌరసేనికంటె ముందటి

1. ధారయన్ బ్రాహ్మణం రూప మిల్వల సంస్కృతం వదన్. ఆమంత్రయతి విప్రాన్ స్మ. వా. రా. 3-11-57.
2. శౌరసేనీ-ప్రకృతి స్సంస్కృతమ్. 12-1-2.
3. పైశాచీ, ప్రకృతి శ్శౌరసేనీ. 10-1-2.

దని కొందఱి మతము. ఇట్లు తెలియవచ్చు సంస్కృత ప్రాకృతముల సంబంధ మునుబట్టి పాణినికి మున్నే యార్యభాషనుండి వికృతి శబ్దజాలము వెలువడి యొక దేశభాషగా మాఱెననియు నందుచేతనే సాంకర్యము గలుగకుండుట కది సంస్కా రార్థమై గాఢముగా సంస్కృతమైనదనియు వికృతికిఁ బ్రకృతి యార్యభాష యనుటకు బదులుగా వఱరుచ్యాదులు తమ నాఁటికిఁ బ్రసిద్ధమైన సంస్కృత సంజ్ఞను వాడిరనియు నిట్లు భాషాస్థానమునఁ బ్రవేశించిన సంస్కృతసంజ్ఞ సుప్రసిద్ధ మగుటచే సకలార్య వాఙ్మయమునకు సంస్కృత వాఙ్మయ మనెడి వ్యవహారము క్రమముగాఁ బ్రబలినదనియుఁ దెలియనగును. ఇంతదనుకఁ జేసిన పరిశీలనమును బట్టి యార్యావర్తమునకు వచ్చిన యార్యుల మాతృభాషయే వేదమునకును లోకము నకును మాతృకయనియు లోకముయొక్క కడపటి పరిణామమే సంస్కృత మనియు నడుమ కాలక్రమమున దాని వికారములగు ప్రాకృతములకుఁ దల్లి యయ్యెననియు విదితమగుచున్నది. కాని యిక్కడ నొక్కమాట. లోక మొక్క టియే మాఱుచు రాలేదు. వేదమును గొంచెము కొంచెము మాఱుచునే వచ్చినది. మంత్రములందలి యుచ్చారణ కాఠిన్యమును శబ్దముల బిగువును బ్రాహ్మణములం దించుక మందగించినవి. అందును వేదాంతములందు మఱియు సడలినవి. గ్రాంథిక వ్యావహారిక భాషల కుండఁదగిన మర్యాద కనుగుణముగా లౌకిక భాషాధర్మములు వైదిక భాషలో వ్యాపింపఁ జొచ్చిన వనుట కిదియే నిదర్శనము. ఇట్లు వాఙ్మయ సాక్ష్యమునుబట్టి భాషా స్వరూపము తెలిసికొన్నట్లే లిపి స్వరూపమును గూడ నించుక తెలిసికొన యత్నింతము.

ఆర్య లి పి

ఇది యొక గొప్ప విషయము. హైందవార్య భాషకు లిపి యెప్పుడు పుట్టెనని పరిశీలింపఁ బాశ్చాత్య పరిశోధకులు కొందఱు పృథివి తలక్రిందుచేసి చూచి తుదకు, కొండ త్రవ్వి యెలుకను బట్టిన ట్లన్న సామెత సార్థకము కావించిరి. ఔను వేదములే మొన్నమొన్నటి వనువారికి లిపి నిన్నటిదిగాఁ గనఁబడుట యుక్తమే భారతీయుల నాగరకత ప్రాచీనమగుట యిష్టము గానివారి కట్లే కనఁబడును. కనుక నట్టివారి వ్రాఁతలను గణింపకుండుటయే యుచితము.

ఏ దేశమందైనను, ఏ జాతియైనను నాగరికతను బెందిన దన్నచో, అది లిపి యెఱుఁగునని నిశ్చయముగాఁ జెప్పవచ్చును. అట్టియెడ జగత్తునందలి యితర జాతులు తమ మానవత్వమును గుర్తించుకొనుట కెంతో ముందుగా జ్ఞాన నేత్రమున

వైదిక సూక్తములు సందర్శించుచు ఖగోళ విజ్ఞానమున సూర్యచంద్ర నక్షత్రాదుల గతు లెఱుంగుచు, పక్షమాస సంవత్సర దినములను గణించుచు, ఒకటి మొదలుగాఁ బరార్థమువఱకుఁ గల సంఖ్యలను లెక్కించుచు, కృషి వాణిజ్యములు చేయుచు ననార్యులతోఁ బోరాడి వారి నణఁచుచు బహువిధమైన యుత్తమలోక జ్ఞానమున నాగరికులై విలసిల్లిన వేదములనాఁటి యార్యులు లిపియే యెఱుఁగ రనుటకంటె హాస్యాస్పదమైనది వేఱుండదు. ఏ చరిత్రాంశమైనను నిర్ణయించుటకు వారికి ముందుగా శిలా తామ్రశాసనములో పత్రములో ప్రత్యక్షము కావలెను గాని యనుమాన ప్రమాణ మెంత బలవత్తరమైనను వారు నమ్మరు. పైగా విషయమునకు సంబంధించిన ప్రాచీన శబ్దములకుఁగూడఁ దమవాదమున కనుకూలమైన యర్థము చెప్పుదురుగాని సరియైన యర్థము చెప్పరు.

"సంస్కృత భాషలో మొదట లిపి యను పదమే లేదు అది క్రీస్తు పూర్వము దేరియస్ను పారసీకరాజు చెక్కించిన బేహిస్తాన్ శాసనములోని 'డిపి' యను పదమునుండి వచ్చి లిపియైనది. ఆ పదముతోనే పురాతన పారశీక భాషలోని వ్రాఁత యక్షరములుగూడ హిందువులకు వచ్చిన'వని బర్నెల్ పండితుని యభిప్రాయము.[1] సంస్కృతములోని లిపిశబ్దమే పారశీకమునకుఁబోయి డిపియైనదను కోసోవిజ్, స్పెగల్ పండితుల మాటలుగూడ బర్నెలుగారికి నచ్చలేదు. ఋగ్వేద పరిశోధనమందును దాని ముద్రణమందును దన వయస్సంతయుఁ గడపిన మోక్షమూలరుపండితుఁడు "వైదికార్యులు లిపి యెఱుఁగరు. వారి వేదములు ముఖస్థములే కాని గ్రంథస్థములు కావు. ఆ కాలమున గురుముఖమునుండి శిష్యులు వేదమంత్రములువిని నేర్చుకొనుచుండెడివారు కావుననే వేదములకు శ్రుతు లనుపేరు వచ్చినది. నేఁడు గూడ వేదము ఘనాంతము కంఠపాఠముగా వచ్చినవారు కనఁబడుచుండఁగా, ఆ కాలమున వేదము కేవలము ముఖస్థముగానే పఠనపాఠన వ్యవహారమున నిలిచినదనుట యబ్బురము కాదు. ఆ కాలమున లిపియే యున్నయెడల దాని యుపకరణముల పేళ్లయిన వేదమున నుండకపోవు. నిజ మరయఁగా, లిపి సూత్రకాలమున వచ్చినదనఁదగును గాని యపుడైన నది వాడుకలో లేదు." అని సిద్ధాంతీకరించి యున్నారు.[2] అచ్చుపుస్తకములు సిద్ధముగానున్న యీ కాలములోఁ గూడ, బ్రాహ్మణులు గురుముఖమునుండి వినియేవేదము కంఠపాఠముచేయుచున్నారని తెలిసియు, నిదే కారణముగాఁ బూర్వకాలమున లిపి లేదనుటకు వీరెట్లు సాహసిం

1. Burnell's South Indian Paleography. P. 6, 7.
2. Ancient Sanskrit Literature.

చిరో చెప్పఁజాలము. "క్రీస్తు పూర్వము నాల్గవశతాబ్దినుండి హిందువులు లిపి నెఱుఁగుదు"రని మేగ్డోనలు పండితుఁడు, నియార్కసు మొదలగువారి యూహలను బట్టి వక్కాణించియున్నాఁడు.[1] "క్రీస్తుపూర్వ మెనిమిదవ శతాబ్దిలో వేదసంహితలు వ్రాఁతలో నుండవచ్చు" నని మాక్సుడంకరు చెప్పియున్నాఁడు.[2] గోల్డుస్టక్కరు' పండితుఁడు, తన 'పాణిని' పీఠికలో, 'పాణిని క్రీస్తుపూర్వ మష్టమశతాబ్దిలో నుండెను. ఆతఁడు లిపి నెఱుఁగును. కావున నది క్రీ. పూ. వెయ్యి సంవత్సరముల నాఁడే వెలసియుండును. అని వ్రాసియున్నాఁడు.[3] ఇంక నెందఱో యెన్నివిధము లనో యిట్లే యభిప్రాయము లిచ్చియున్నారు. ఇట్టి యభిప్రాయములు చూచియే కొమరరాజు లక్ష్మణరావుగా రక్షరములనెడి వ్యాసమున లిపినిగూర్చి సవిస్తరముగాఁ జర్చించి సిద్ధాంతీకరించి యున్నారు.[4] ఆ వ్యాస మాంధ్రలోకమునకు విదితమే కావున మనము విశేషముగాఁ జర్చింపక లిపి సిద్ధాన్తసారము మాత్రము గ్రహింతము.

క్రీస్తుపూర్వము ౨౭౪—౨౩౭ నడుమఁ బాటలీపుత్రము రాజధానిగా హిందూదేశ మేలిన యశోకచక్రవర్తి దేశమంతటను ధర్మశాసనములు స్థాపింపఁజేసెననియు, వానిలో హిందూదేశవాయవ్య భాగమందలి పొలిమేరలలోని శాసనముల లిపి యపసవ్యముగా నుండి ఖరోష్ఠి యనఁబడుచున్నదనియు, తక్కిన దేశమంతట నున్న శాసనములలోని లిపి సవ్యముగా నుండి బ్రాహ్మీయను పేరఁ బిలువఁబడుచున్నదనియు విదితమే కావునఁ బరిశోధకు లందఱు నీలిపికాల మంగీకరింపక తప్పినదిగాదు. అశోకునిశాసనములకు ధర్మలిపులని పేరు. దేశమందలి యెల్ల జనులును మతధర్మములు తెలిసికొనుట కాశాసనము లేర్పడిన వనుట సమంజసము కావున నప్పటికి దేశమున లిపి వ్యాపించినదని చెప్పవచ్చును. మనుమనికాలములో లిపి యిట్లు ప్రబలియుండఁ బితామహుని కాలములో లిపియను మాటయే లేదనుట యెట్టిసాహసమో చెప్పఁజాలము. అశోకుని తండ్రి బిందుసారుఁడు. ఆతఁడు క్రీ. పూ. ౨౯౭-౨౭౪ నడుమ రాజ్యముచేసెను. అతనితండ్రి చంద్రగుప్తుఁడు క్రీ. పూ. ౩౨౧-౨౯౭ నడుమ హిందూదేశ మేలినవాఁడు. అతనికిఁ బూర్వము కడపటినందరాజు రాజ్యము చేయుచుండఁగా గ్రీకురాజైన యలగ్జాండరు హిందూ

1. History of Sanskrit Literature P. 19.
2. History af Antiquity.
3. "Panini. His place in Sanskrit Literature"
4. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము. ౧. సంపుటము.

దేశము మీఁదికి దండెత్తివచ్చి వాయవ్యభాగము కొంత వశపఱుచుకొని పోయెను. అతనితో హిందూదేశమునకు వచ్చినసేనానాయకుఁడగు 'నియార్క్' స్సనువాఁడును, కడపటినందుని జంపి చక్రవర్తియైన చంద్రగుప్తునివద్దకు సెల్యూకస్సను గ్రీకురాజుచే రాయబరిగాఁ బంపఁబడిన మెగస్థనీ సనువాఁడును, హిందువులు లిపి యెఱుఁగరని వ్రాసినట్లుగాఁ బాశ్చాత్యులు కొందఱభిప్రాయ పడిరిగాని వారి యభిప్రాయము లసత్యములని మెగస్థనీసు వ్రాఁతవల్లనే స్పష్టపడినది. అతఁడు, హిందూదేశమున బాటలప్రక్క దూరము తెలుపుగుర్తులును మకాములు తెలుపుగుర్తులును గల ఱాళ్లు పాతఁబడి యుండెననియు, చంద్రగుప్తునికిఁ బూర్వము ౬౪౫౧ సంవత్సరములు రాజ్యము చేసినమూటయేఁబది ముగ్గురు రాజులపేళ్లను దెలుపుపట్టిక యొకటి చంద్రగుప్తసంస్థానమున నేను జూచితిననియు వ్రాసిన మాటలు బయలు పడినపిదప వారి యభిప్రాయము లబద్ధములు గాక మఱేమగును? లిపి లేకయే రాజులనామములు పట్టికలో నుండెనా? అంకెలు లేకయే పురాతన రాజుల రాజ్యకాలములు తెలపఁబడెనా? అక్షరములు లేకయే మజిలీలపేళ్లు రాళ్లమీఁదఁ జెక్కఁబడెనా? ఇది యిట్లుండ నిండు. శాసనమే కావలెనంటే పిప్రవాశాసనముకంటెఁ బురాతనమైనది యింతవఱకుఁ గనరాదు. దానిని గూర్చియు మనవారికిని దెల్లవారికిని భేదాభిప్రాయములు కలవు. అది యొక మృత్పాత్రము. బుద్ధుని గోత్రము వారయిన శాక్యులతని యస్థులాపాత్రములోఁ బెట్టి పాఁతిపెట్టిన విషయము ప్రాచీన పాలీభాషలో దానిమీఁదఁ జెక్కఁబడి యున్నది. ఈ విషయము బుద్ధుని మరణకాలమునాఁటిదే కాని, యీ శాసనము మాత్రము తరువాతిదేయని కొందఱు. ఆ శాసనభాష ప్రాచీనము గావున శాసనము గూడఁ బ్రాచీనమేయని కొందఱు. శాసనభాషనుబట్టి యీ శాసనము బుద్ధుని నిర్యాణకాలమునాఁటిదే యన్నచో, లిపి క్రీ పూ. ౫౦౦ వఱకును, అప్పటికి శాసనలేఖనాచార ముండటంబట్టి యింకను వెనుకకును బోవును. ఇంచుకింక గ్రంథములే శరణము.

శోకుని కాలమునఁ బుట్టిన లలితవిస్తరమను బౌద్ధమతగ్రంథ మొకటి ప్రసిద్ధికెక్కి యున్నది. అందు బుద్ధుని చరిత్ర వర్ణింపఁబడియున్నది. దానిలో బుద్ధుఁడు బ్రాహ్మి - ఖరోష్ఠి - పుష్కరసారి - అంగలిపి -మగధలిపి - దేవలిపి - నాగలిపి - మధ్యాక్షరవిస్తరలిపి - సంఖ్యాలిపి - హూణలిపి - దక్షిణలిపి-బ్రహ్మవల్లీలిపి - పునుష్యలిపి - ఉత్తరకురుద్వీపలిపి - పూర్వవిదేహలిపి - అపరగౌడాది లిపి - పాదలిఖితలిపి - అనులోమలిపి - అంగుళీయలిపి - లేఖప్రతిలేఖలిపి - మొదలుగా నలువదినాలుగు లిపు లెఱిఁగినట్లు వర్ణింపఁబడినది. ఇందుకొన్ని వర్ణమ

వ్రాఁతను దెలుపునవిగాను మఱికొన్ని చిత్రలిపులుగాను గనవచ్చుచున్నవి. ఇన్ని లిపులు బుద్ధుఁడెఱుఁగునా యనునది వేఱువిషయము. ఇన్ని లిపుల నా కాలమున లలితవిస్తర కర్తయెట్లు పేర్కొనె ననుటయే మనకిపుడు కావలెను. అందుకుఁ బ్రాచీనమైన లిపి సంప్రదాయ మొకటి లిపి కారపరంపరాయత్తమై వచ్చుచుండెడి దని చెప్పవలసినదే. అంతకు మున్నెన్ని వేల యేడ్లనుండియో వివిధరూపముల విస్తరించుచు వచ్చినదనుటయే యట్టి లిపి సంప్రదాయ మానాఁటికి వెల్లివిరిసెనని యూహింపవలసినదే. ఈ యూహయెట్లు స్థిరపడునో చూతము.

పాణినికాలమును గొందఱు ముందుకు లాగఁజూచిరి కాని, అది తప్పక యష్టమశతాబ్దియేయని జర్మనీ పండితుఁడగు గోల్డుస్టక్కరు నిర్ణయించియున్నాఁడని యింతకుఁ బూర్వమే చదివియున్నాము. పాణిని 'దివావిభానిశేత్యాది సూత్రముతో' లిపి-లిబి-శబ్దములను బేర్కొని, లిపికర లిబికర రూపములను శాసించెను.[1] దానిని బట్టి పాణినికాలమున లిపి వ్యాప్తి చెందియుండెనని చెప్పవచ్చునుగదా! కాని లిపి కరశబ్దమునకు శిలలమీఁదశాసనములు చెక్కువాఁడని మాక్స్‌ముల్ల రర్థముచెప్పెను అనఁగాఁ బత్రములమీఁద నక్షరములు వ్రాసెడి యాచార మా కాలమున లేదని యతని యభిప్రాయము. ఈ యభిప్రాయమెట్లు సముచితమగునో చర్చింతము.

"లిప ఉపదేహే. లిప్యతే౽నయా పత్ర మితి లిపిః. లిపిం కరో తీతి లిపి కారః, లిఖ అక్షరవిన్యాసే లిఖ తీతి లేఖకః" అని, ధాత్వర్థములనుబట్టి రెంటికిని భేదము గనవచ్చుచున్నను, లిపికారలేఖక శబ్దములు సమానార్థకములేయని యంగీకరింతము. అమరసింహుఁడును వీనిని బర్యాయ పదములనుగానే పేర్కొనియున్నాఁడు.[2] అశోకుని శాసనములకు ధర్మలిపులను పేరును గనఁ బడుచున్నది. ఇవంతయు సత్యమే కాని శిలాశాసనములు చెక్కుటకు, ఉలి మొదలగు నుపకరణములు నిర్మించుకొన్న యా నాఁటివారు తాటాకుమీఁదనో భూర్జ త్వక్కుల మీఁదనో యక్షరవిన్యాస మొనర్ప గంటమువంటి యుపకరణము నిర్మించుకొన కుందురా! శిలాశాసనము లేఖనము లిపి కావచ్చును గాని పత్రలేఖనము లిపి కావని యెక్కడ నున్నది? ఏరంగుతోనో వ్రాయఁబడినదియు లిపి యగునని లిపిధాత్వర్థమువలనఁ దెలియుచున్నదిగదా! లిప లిఖ ధాతువులయర్థము విచారించి నచో, పత్రాదులమీఁది యక్షరవిన్యాసము లిపి యనియు, శిలాదులమీఁది యక్షర విన్యాసము లేఖనమనియు, పాణినికాలమున వాడఁబడుచుండెనని తోఁచకపోదు.

1. అష్టాధ్యాయి. 3-2-21.
2 లిపికారో౽క్షరచణో౽క్షరచుంచు శ్చలేఖకే.

తరువాత నివి రెండును సమానార్థకములుగా వాడఁబడుటచే నిఘంటుకారులు వీనిని బర్యాయపదములనుగాఁ జేసియుందురు. అంతమాత్రమునఁ బత్రలిపి పాణిని కాలమున లేదనరాదు ఇందుకు మఱియొక నిదర్శనము.

ఇంద్రవరుణేత్యాది సూత్రమునఁ బాణిన్యాచార్యులు యవనానీశబ్దమును శాసించిరి.[1] అది లిప్యర్థక మనెడివారి యభిప్రాయము 'యవనాల్లిప్యామ్' అను వార్తికమునఁ గాత్యాయనులు వివరించిరి. 'యవనయవాల్లిపిదుష్టే.'[2] అనెడి శాకటాయన వ్యాకరణసూత్రమును జూచియే పాణిన్యాచార్యులు యవనానీ రూపమును దమసూత్రమున శాసించిరనుట స్పష్టము. దీనివలనఁ బాణినికాలమందే కాదు. అతనికిఁ బూర్వుఁడయిన శాకటయనుని కాలమందుగూడ లిపి వాడుకలో నున్నదనియు, నాఁటియార్యులు తమలిపినే కాక, క్రొత్తదైన యవనలిపిని గూడ నెఱుఁగుదురనియుఁ దెలియుచున్నది.[3]

వేదములలో లిపిశబ్దము లేదు గాని, అక్షర వర్ణ-శబ్దములు తఱచుగాఁ గనవచ్చును[4] ఈ రెండును ధ్వన్యాత్మకములుగాఁ గనఁబడవచ్చును గాని, వర్ణ ధాత్వర్థమును వర్ణ శబ్దార్థమును బరిశీలించినచో వేదకాలమున లిపియున్నదనుట కవకాశ మధికముగాఁ గనఁబడకపోదు. పాణినీయధాతుపాఠమందు, వర్ణధాతువునకు వర్ణక్రియ, విస్తారము, గుణవచనము, లని మూఁడర్థములు కలవు.[5] వర్ణశబ్దమీ యర్థములను బోధించుచు సర్వవాఙ్మయమందు వ్యాపించినది. ఈధాత్వర్థములను బట్టియే, అమరసింహాదులు, వర్ణశబ్దము ద్విజాతులను - శుక్లాదులను-స్తుతిని - అక్షరమును; తాలవిశేషమును-బ్రహ్మచర్యమును-విశేషణమును-విలేపనమును - కథను-

1. ఇంద్ర వరుణ భవ శర్వ రుద్ర మృడ హిమారణ్య యవ యవన మాతులాచార్యాణా మానుక్. 4-1-49.
2. శాక. వ్యా. 1-3-56 (తంత్రవార్తికమునుండి).
3. ఇది, పాణిని కెంతో తరువాత వచ్చిన గ్రీకులిపి కాదు. ప్రాచీనమైన కీలలిపి యని లిపిశోధకుల యభిప్రాయమఁట.
4. ద్వయోరనుష్టుభో శ్చతుష్షష్టి రక్షరాణి. తేభ్యస్త్రయో వర్ణా అజాయంత. ఐ. బ్రా 15.
ఓంకారం పృచ్ఛామః. కోధాతుః.. కత్యక్షరః కతివర్ణః ఇత్యాది. గో. బ్రా. 1-24.
ద్విపదా చతుష్పదాక్షరేణ మిమతే స ప్తవాణీ. ఋ. 1-164-24.
5. వర్ణ వర్ణక్రియా విస్తారగుణవచనేషు. చురాది.

చెప్పునని తెలిపియున్నారు.[1] మఱియు బ్రాహ్మణాది జాతులను జెప్పు వర్ణశబ్దమునకు, కపిలారుణపీత కృష్ణవర్ణములచే నిరూపింపఁబడునవి వర్ణములు (జాతులు) అని వ్యాఖ్యాత లర్థము వ్రాసియున్నారు.[2] ఈ యర్థమునకుఁ బ్రమాణమైన విష్ణుపురాణ వచన మిట్లున్నది.

"కపిలా శ్చారుణాః పీతాః కృష్ణా శ్చేతి పృథక్ పృథక్
బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా శ్శూద్రా శ్చేతి వివక్షితాః."

ఇట్లున్న వర్ణధాత్వర్థ వివరణమును వర్ణశబ్దార్థ వైవిధ్యమునుబట్టి చూడఁగా కపిలాదికములయిన రంగులనుబట్టి బ్రాహ్మణాది జాతులకు వర్ణములను పేరు వచ్చినట్లే, పీలారుణాదికములయిన రంగులతో వ్రాయుటనుబట్టి యక్షరములకు వర్ణములను పేరు వచ్చియుండునని చెప్పవచ్చును ఒక జాతిపలకమీఁద జాతిముక్కతో వ్రాసినవు డక్షరములు తెల్లగా నుండును. లేక పసపుతోఁగాని మషితోఁ గాని భూర్జపత్రములమీఁద వ్రాసినచో నవి పచ్చగానో నల్లగానో యుండును, లేక బొగ్గుతో భూమిమీఁద వ్రాసినచో నల్లగానుండును. అట్టి యక్షరము లన్నియు నాయా రంగులనుబట్టి వర్ణము లగుచున్నవి. ఋషులు తా ముచ్చరించునట్టి స్వర వ్యంజనముల కిట్టి రూపకల్పనము చేసికొని యుందురని యూహించుట యొక గొప్పగాదు. మహిత విజ్ఞాన సంపన్నులగు వారి మహాప్రతిభ కక్షర రూపకల్పనమైన లిపి గోచరింప లేదనుట వింతగాని, యతి మానవములైన మంత్ర బ్రాహ్మణములను గనిపెట్టినవారు లిపిని గనిపెట్టిరనుట యొక వింతగాదు ఇందుకు మఱియొక నిదర్శనము.

ఋగ్వేదాదులందు గనవచ్చు ఖగోళ విశేషవర్ణనములే తరువాతి జ్యోతిశ్శాస్త్ర విజృంభణమునకు బీజమనుట నిర్వివాదము. ఆనాఁడు వా రేవయిన నుపకరణములు నిర్మించుకొనియే ఖగోళము పరిశోధించినారేమో చెప్పఁజాలముగాని, యిప్పటివారందు కుపయోగించు వివిధోప కరణములకంటెను సునిశితమైన జ్ఞానదృష్టియుఁ బ్రతిభా విశేషమును వారి పరమోపకరణములని మాత్రము విస్పష్టముగాఁ జెప్పఁగలము.

1. వర్ణో ద్విజాదౌ శుక్లాదౌ స్తుతౌ వర్ణంతు వాఽక్షరే. అమరకోశము. వర్ణ స్తాల విశేషే స్యాద్బ్రహ్మచర్యే విశేషణే విలేపనే కుథాయాంచ.
2. వర్ణ్యంతే కపిలారుణపీత కృష్ణవర్ణై ర్నిరూప్యంత ఇతి వర్ణాః.

వేదములం గనవచ్చు జ్యోతిశ్శాస్త్ర సంబంధమయిన విజ్ఞానము క్రీ. పూ. ౨౭౮౦-౧౮౨౦ మధ్యకాలమును దెలుపుచున్నదని (Weber) వీబరు పండితుఁడు సూచించెను.[1] మృగశీర్ష ప్రథమ నక్షత్రముగా గణింపఁబడిన కాలమును వైదికార్యులు వేదములందు సూచించియున్నారని యింతకుఁ బూర్వము చదివియే యున్నాము. అట్లే నక్షత్ర గతులు మేషాది రాసుల గతులు దినమాస సంవత్సరముల పరిమితులు వారు చక్కఁగా నెఱుఁగుదురనుట కన్ని సంహితా బ్రాహ్మణములలోను బహు ప్రమాణములు గనవచ్చును గావున గ్రంథవిస్తరము గాకుండఁ బ్రకృత విషయమును బలపఱుచుటకై వారి జ్యోతిశ్శాస్త్ర విజ్ఞానమును దెలుపునట్టి యొక్క విషయ ముదాహరించెను.

జ్యోతిర్విజ్ఞానము — లిపి

శుక్ల పక్షప్రతిపత్తు మొదలుగా, అమావాస్యాన్తము చాంద్రమాసమగును. ఇందు ముప్పదితిథులుండును. సూర్యోదయము మొదలుగా మరల సూర్యోదయము వఱకు నొకదినము. అట్టిదినములు ముప్పది సవనమాస మగును. కాని చాంద్ర మాసతిథులు చంద్రగతిని బట్టి యించుక తగ్గుచువచ్చుటచే సవన మాసదినములతో సరిచూచునపుడు సంవత్సరమున కాఱుదినములు తగ్గును. అనఁగా సంవత్సరమునకుఁ జాంద్రమానమునుబట్టి ౩౫౪ దినములు. సావన మానమునుబట్టి ౩౬౦ దినములు, పూర్వకాలమందు వైదికార్యు లీయాఱుదినముల భేదము కనిపెట్టి సావనమానమును చాంద్రమానమును సరిపుచ్చుకొనుటకై యజ్ఞ కర్మలయం దాదినము లుత్సృజ్యము లని చేసిన నిర్ణయమును, అందేదిన ములుత్సృజ్యములని చేసినవిచారణయు, తైత్తిరీయ సంహితలోఁ గనవచ్చుచున్నవి.[2] మఱియు సూర్యుఁడొక నక్షత్రము వద్దనుండి బయలుదేఱి తిరిగి యా నక్షత్రమువద్దకు వచ్చునప్పటికి ౩౬౬ దినములు పట్టును. సూర్యగతిని బట్టి యేర్పడుదీనినే సౌరమాన సంవత్సరమందురు. దీనికిని చాంద్రమాన సంవత్సరమునకును ౧౨ దినముల భేదమున్నది. ఈ భేదమును బూర్వులు కనిపెట్టి, వార్షిక సత్రముచేయు సందర్భమునందీ పండ్రెండు దినములు

1. See History of Indian Literature P. 2. Note. 2.
2. "షడహై ర్మాసా న్త్సంపాద్యాహ రుత్సృజన్తి షడహైర్హి మాసా న్త్సంపశ్యన్తి। అర్ధమాసై ర్మాసా న్త్సంపాద్యాహ రుత్సృజన్తి." ఇత్యాది. 7-5-6-1.

   "ఉత్సృజ్యాం 3 నోత్సృజ్యా 3 మితి మీమాగ్ంసన్తే బ్రహ్మవాదిన స్తద్వ్యాహు రుత్సృజ్య మే వేతి ఇత్యాది. 7-5-7-1.

యించిన కాలం-మెసపొటోమియాలలోని ముద్రలను బోలియున్నవనియు, కావునఁ జిత్రలిపి యాకృతిగల యీ ముద్రలు క్రీస్తుపూర్వము మూఁడువేల సంవత్సరములపై కాలముకోనివై యుండుననియు, తద్వస్తు పరిశోధనము నొక గ్రంథముగాఁ బ్రకటించిన సర్ జాన్ మార్షల్ దొరగారు వ్రాయుచున్నారు. ఆ ముద్రల మీఁదిలిపి కుడివైపు నుండి యెడమవైపునకుఁ జదువఁ దగినదిగా నున్నది. అందలి కొన్ని యక్షరములు బ్రాహ్మీలిపిలోని వానికిఁ బ్రకృతులనఁదగి యున్నవి. ఆ పురము లార్యులవా ? లేక యనార్యులవా ? ఈలిపి వీరిదా ? వారిదా ? అను విషయము లింకను సందిగ్ధములుగానే యున్నవి గాని, యెట్లయిన నతి ప్రాచీనమైన యీ విషయముగూడ సింధునదీ ప్రాంతమునఁ గ్రీస్తుపూర్వము మూఁడువేల యేండ్ల క్రిందట నొకలిపి కలదని చెప్పుటకుఁ బ్రబల ప్రమాణము కాకపోదు. ఇంక—

ఆర్యభాష - వ్యావహారికస్థితి

వేదముతో విడిపోక మున్నేది యార్యవ్యవహారమం దుండెనో, అదియే దానితో విడిపోయిన పిదప లోకము లేక భాష యను పేర వాడుకలో నుండెననియు, అదియే క్రమముగా సంస్కృతసంజ్ఞ చెందినదనియు నింతకుమున్ను తెలిసికొనియున్నాము. ఆ యభిప్రాయమునే మఱికొంత దృఢపఱుచుకొందము.

పాణిన్యాచార్యులకుఁ బూర్వమునుండియుఁ బామరుల యుచ్చారణమున వైకల్యము నొందిన యార్యభాషాశబ్దజాలము కొంత వికృతరూపమున దేశమందు వ్యాపించుచు వచ్చిన దనుట సత్యమేకాని, అతనినాఁటికే కాదు, పతంజలిముని నాఁటికిఁగూడ నార్యభాష యుత్తమజాతుల వాడుకలో నున్నదనుట కావంతయు సందేహములేదు. ఇందుకుఁ బూర్వలక్షణ గ్రంథములే యేకగ్రీవముగా సాక్ష్యమిచ్చుచున్నట్లింతకుఁ బూర్వమే యెఱిఁగియున్నాము. మఱియు:—

దేశభేదమునుబట్టి వచ్చిన లౌకికశబ్ద భేదములకు 'ఉదీచామ్', 'ప్రాచామ్' అనుచుఁ బాణిన్యాచార్యులను శాసనము గావించి యున్నారు.[1] ఉదా.— హారిషేణిః హారిషేణ్యః.—ఆమగుప్తాయనిః-ఆమగుప్తిః, ఇత్యాదులు. ఈ జంటలలో మొదటి రూపములు దీచ్యులుచ్చరించునవి. రెండవ రూపములు ప్రాచ్యులు పలుకునవి. ఇట్లే పాణినీయాష్టాధ్యాయికి లొంగని బహుశబ్దములు వాడుకలోఁ దనకుఁ గన

1. సేనాన్తలక్షణకారిభ్యశ్చ. 4-1-152, ఉదీచామిఞ్. 4-1-153. ఉదీచాం వృద్ధాదగోత్రాత్. 4-1-157, 3-1-90, 4-2-119.

గనవచ్చుటంజేసి కాత్యాయను లనేకవార్తికములు కల్పించి వాని కనుశాసనము గావించియున్నారు.[1] ఉదా.—పద్మనాభః-పఞ్చనదమ్-సప్తగోదావరమ్-క్షీరోదః-దధూటీ-వార్ధకమ్-ఇత్యాదులు-ఇట్లు వేలకొలఁది లౌకిక శబ్దములకు వార్తికములు గతి కలిగించినవి. ఇట్లే భగవత్పతంజలి పెక్కు లౌకిక ప్రయోగముల విచారణ కావించుటయే కాక, ఉదీచ్య ప్రాచ్య దాక్షిణాత్య దక్షిణాపథభేదముతో బహు శబ్దముల యర్థభేదములను రూపభేదములనుగూడఁ బేర్కొనుచు, ఆర్యులవాడుకను జూపుచూ ననేక స్థలముల లౌకిక శబ్దప్రసంగము గావించియున్నారు[2] ఉదా — వేదే లోకేయని ప్రయోగింపఁదగియుండ దాక్షిణాత్యులు వైదికేషు లౌకికేషు, అని ప్రయోగింతురు. దక్షిణాపథమందు గొప్ప సరస్సును 'సరసీ'యని వ్యవహరింతురు. సురాష్ట్రులు రంహతిధాతువును వాడుదురు. ఆర్యులు గమిధాతువునే వాడుదురు. ఇత్యాదులు. ఈ విధముగానే యాస్కాచార్యులు నిరుక్తప్రయోజనములు వక్కాణించుచు, "లోకమందలి శబ్దములట్లు వేదమందలి శబ్దములును, అర్థవంతములే. పాత్రమాహర, ఆహరపాత్రమ్ అని లోకమందనునట్లుగా, 'అగ్న ఆయాహి'యను దానిని, 'ఆయా హ్యగ్నే' యనుటకు వీలు లేదని మంత్రము లనర్థము లనరాదు. లోకమందును ప్రయోగనియమము కనఁబడుచున్నది. 'ఇంద్రాగ్నీ-పితాపుత్రౌ' ఇత్యాదులు నియతవాచోయుక్తియు నియతానుపూర్వియుఁ గలుగునట్లుగానే ప్రయోగింపఁబడుచున్నవి" అనుచు లౌకిక శబ్ద ప్రసంగము పెక్కుచోట్లఁ దెచ్చియున్నారు.[3] ఆర్యభాష వాడుకలో నున్నదనుటకుఁ బైలక్షణకర్తల వచనములే మొదటి ప్రమాణము. ఇఁక రెండవది:—

స్త్రీయును శూద్రుఁడునుగాక తక్కిన యార్యజాతి పురుషులు నమస్కరించినచో వారి నాశీర్వదించునపుడును, కొంచెము దూరమందున్నవారిని సంబోధించు

1. అన్యత్రాపి దృశ్యతే, నదీగోదావరీభ్యాఞ్చ. ఉత్తరపద స్యేతి వక్తవ్యమ్, వయస్య చరమ ఇతి వాచ్యమ్, వృద్ధా చ్చేతి వక్తవ్యమ్.
2. ప్రియతద్ధితా దాక్షిణాత్యాః. యథా లోకే వేదే చేతి ప్రయోక్తవ్యే, యథా లౌకిక వైదికే ష్వితి ప్రయుఞ్జతే. మ. భా. 61-P. దక్షిణాపథేహి మహాన్తి సరాంసి సరస్య ఇత్యుచ్యన్తే. P. 257 హమ్మతిః సురాష్ట్రేషు రంహతిః ప్రాచ్యమధ్యమేషు, గమి మేవ త్వార్యాః ప్రయుఞ్జతే. దాతి ర్లవనార్థే ప్రాచ్యేషు. దాత్ర ముదీచ్యేషు. P. 65.
3. అర్థవ న్త శ్శబ్దసామా త్, యథా ఏతన్నియతవాచో యుక్తయో నియతానుపూర్వ్యా భవ తి లౌకికే ష్వ ప్యేతదర్థేన్ద్రాగ్నీ పితాపుత్రా వితి-ఇత్యాది-నిరుక్తము. -16-1-4-

నపుడును, హై-హే-యను శబ్దములను నామములకుఁ జేర్చి పిలుచునపుడును, వాక్యముతుద 'భోః' చేర్చి దీవించునపుడును, ప్లుతస్వర మాయాశబ్దముల కుచిత ముగాఁ బాణినీయమున విధింపఁబడియున్నది [1]

ఉదా:—ఆయుష్మా నేధి దేవదత్త 3. పయః పిబసోమదత్త 3
విజయీ భవ భోః 3 హే 3. రామ. రామహై 3. ఇత్యాదులు.[2]

ఆర్యభాష వాడుకలో లేనిచో నిరుపయోగమైన యీ విధిని, పాణిని యేల చేసియుండును? అట్లు వాడుకయే లేనిచో లోకవ్యవహారమందు మాత్రమే యుండఁదగిన దీనిని, కాత్యాయనపతంజలు లాదరించి యేల వివరింతురు? కావున దీనిం బట్టియు నార్యావర్తమం దానాఁ డార్యభాష వాడుకలో నున్నదనవచ్చును.

కాని, రానురాను వికృతిభాష దేశమున వ్యాపించుచున్న కాలఁదిని సంస్కృత ముత్తమ జాతుల వాడుకలో నుండుచు వచ్చి, క్రమముగాఁ దక్కిన జాతులు గూడ సనియమ సంస్కృత భాషోచ్చారణమున నలసములగుటచే నది బ్రాహ్మణ జాతివాడుకలో మాత్రమే సుష్ఠురూపమున నిలిచి యున్నదని మహాభాష్యములోని కొన్ని వాక్యము-నుబట్టి తెలియవచ్చుచున్నది. అక్కడక్కడ నున్న యావాక్యముల భావమిందు తెలుపుచున్నాను.

"శబ్దములను జక్కఁగాఁ దెలిసికొని యందు నేర్పరియై వ్యవహార కాలమునఁ బ్రయోగించువాఁడు ఫలమును బొందును. శబ్దజ్ఞానమున ధర్మము, అపశబ్దజ్ఞానమున నధర్మము కలుగును. అపశబ్దము లెక్కువ. శబ్దములు తక్కువ, (సుశబ్దములనుట) ఒక్కొక్క శబ్దమున కనేకములయిన యపభ్రంశములు కలవు. 'గౌః' అనుశబ్దమునకు గావీ, గోణీ, గోతా, గోపోతలికా, ఇత్యాదులయిన యపభ్రంశములు పెక్కుకలవు. కావున వాగ్యోగవేదియై శబ్దములను బ్రయోగింపవలెను. బ్రాహ్మణుఁడు ఫల మపేక్షింపక షడంగ యుక్తమైన వేదము చదువవలెను, దాని నెఱుఁగవలెను." బ్రాహ్మణుఁ డపశబ్దము పలుకరాదు. బ్రాహ్మణుఁ డవశ్యము

1. ప్రత్యభివాదేఽశూద్రే-దూరాద్ధూతేచ-హైహేప్రయోగే హైహయోః. 8-2-83-85. అష్టా.
భోరాజన్యవిశాం వేతి వాచ్యమ్. కాత్యా.
అవిద్వాంసః ప్రత్యభివాదే నామ్నో యేన ప్లుతిం విదుః।
కామం తేషు తు విప్రోష్య స్త్రీష్వివాయమహం వదేత్ ?
వివృతౌ-మహాభా. P. 34—81.
2. ఉదాహరణములలోని 3 అంకె ప్లుతస్వరమునకు గుర్తు.

శబ్దము లెఱుఁగవలెను. శబ్దప్రయోగమందు నిపుణులగువారు శిష్టులు."[1] అనుచు బ్రాహ్మణులు మాత్రమే వేదవేదాంగములు చదివి సుశబ్ద ప్రయోగమున నేర్పరులు కావలెనని పతంజలి శాసించుటచే నతని నాఁటికి వేదాధ్యయనము బ్రాహ్మణ జాతి మాత్రాధీనమైన దనియేకాదు, దేశమున నపభ్రంశవ్యాప్తి యధికమయ్యె ననియు విదిత మగుచున్నది. మఱియు నీ శాసనమే బ్రాహ్మణేతరులు బ్రాహ్మణుల వలె సుశబ్ద ప్రయోగదక్షులు కాకపోయినను సంస్కృతభాషా వ్యవహారమునకు దూరము కాలేదనియు, అట్టితర జాతివ్యవహారమున శబ్దము లపభ్రంశము లగు చుండుటచేతనే పతంజలి బ్రాహ్మణులను మేల్కొలిపెననియు సూచించుచున్నది. ఈ సూచనమునుగూడ, సూతుఁడొకఁడు సూతశబ్దార్థ నిర్వచనము విషయమై యొకవైయాకరణునితో వివాదపడుటను దెల్పు మహాభాష్యమే స్థిరపఱుచుచున్నది. ఇఁక మూఁడవది:—

భగవత్పతంజలికిఁ దరువాతఁగూడ నట్లే సంస్కృతము వాడుకలో నుండుటయుఁ గొన్నిజాతు లపభ్రంశ మధికముగా మాటలాడుటయుఁ గలదు కావుననే నాటకములలో నుత్తమ పాత్రములకు సంస్కృతమును స్త్రీ నీచపాత్రములకుఁ బ్రాకృతమును రూపకకర్తలు వాడుటయు, ప్రదర్శన సమయమున నీచపాత్రము లుత్తమ పాత్రముల సంస్కృత భాషణము గ్రహింపఁ గలుగుటయు, నాటక ప్రేక్షకులందఱును బ్రాకృతమువలెనే సంస్కృతము తెలిసికొని యానందింపఁ గలిగి యుండుటయు, సమర్థనీయములగు చున్నవి. కావున నింతకు మున్ను చేసిన చర్చనుబట్టియుఁ జూపిన ప్రమాణములనుబట్టియుఁ దొల్లి యార్యావర్తమున నార్య భాష వాడుకలో నున్నదనియు, శాకటాయన పాణినీయాది సంస్కృతమై యది సంస్కృతసంజ్ఞ చెందిన పిదపఁగూడ నట్లే యుండి క్రమముగా నుత్తమజాతు లందును దరువాత బ్రాహ్మణజాతి యందును వాడుకకు వచ్చి యనంతరము క్రీస్తు శకారంభమున కించుక మున్నే గ్రంథములయందు విశ్రమించెననియు విశ్వసింప వచ్చును. తక్కిన కాలనిర్ణయాదులందు వేఱుత్రోవలు త్రొక్కినను సంస్కృత మార్యావర్తమున సూత్రయుగము కడపటివఱకు వాడుకలో నున్నదను విషయమున

1. యస్తు ప్రయుఙ్క్తే కుశలో విశేషే శబ్దాన్యథావద్వ్యవహారకాలే— భూయాంసోఽపశబ్దాః అల్పీయాంసః శబ్దాః...."బ్రాహ్మణేన నిష్కారణో ధర్మః షడఙ్గో వేదోఽధ్యేయో జ్ఞేయశ్చ." బ్రాహ్మణేన నమ్లేచ్ఛితవై నాప భాషితవై. బ్రాహ్మణే నావశ్యం శబ్దాః జ్ఞేయాః. ఇత్యాదయః-మ-భా-శబ్దానుశాసన ప్రయోజనాది విషయములలోనివి.

మాత్రము వీబరు మొదలగు పాశ్చాత్య పండితులనేకు లేకీభవించుచున్నారు. ఈ విషయ మింకను బలపఱుప సంస్కృత ప్రాకృతముల ప్రకృతి వికృతి సంబంధ మొకింత పరీక్షింతము.

సంస్కృతము – ప్రాకృతములు

క్రీ. పూ. నాల్గవ శతాబ్దిలోని పతంజలిముని యొక్కొక సంస్కృత శబ్దమున కనేకాపభ్రంశములు కలవని చెప్పినట్లును, తత్పూర్వము పుట్టిన ప్రాకృత లక్షణము సంస్కృతమునుండి శౌరసేన్యాది ప్రాకృతములు దయించినవని చెప్పినట్లును. అంతకంటెను బూర్వుఁడును. ఎనిమిదవ శతాబ్దిలోనివాఁడునగు పాణిన్యాచార్యులకునుదత్పూర్వులగు శాకల్య శాకటాయనాదులకును బూర్వమే యార్యభాష లోని శబ్దజాలము వికృతిగా మాఱుచుండినట్లును జదివియున్నాము. ఇందుకుఁ దగినట్లుగా నీచపాత్రముల కుపయోగింపఁబడినయట్టి వికృతిశబ్దములు దృశ్య కావ్యములఁ గనవచ్చుచున్నవి. ఇప్పటి భారతీయదేశభాష లన్నిటియందును వినవచ్చుచున్నవి. ఇది కాదనుటకు శక్యము కాదుగదా! ఇఁక సంస్కృత శబ్దములు వికృతరూపములు తాల్చుటకుఁ గారణ మేమి? అట్టి వికృతశబ్దజాల మెప్పటినుండి యే విధముగా నొకవాడుక భాషగా మాఱినది? అను ప్రశ్నల కుత్తరములు చెప్పవలసియున్నది. ఇందు మొదటిదాని కొక్కటే కారణము. అది యుచ్చారణదోషమే - సంఘము పెరిఁగినకొలఁదిని, భాషాభిజ్ఞత తగ్గినకొలఁదిని, యథావర్ణానుపూర్విగా శబ్దములను గ్రహింపఁజాలని స్త్రీబాలమందుల తప్పుపలుకు బడియే కారణమనుట స్పష్టము. అందుచేతనే సుశబ్దము లపశబ్దములైనవి. అందుకే శాకటాయనాదులు భాషను నిర్బంధింపవలసివచ్చినది. అందుచేతనే, "అపశబ్దములు హెచ్చుచున్నవి బ్రాహ్మణుఁడైన వాఁడెవఁడును దుష్టశబ్దము లుచ్చరింపరాదు" అని పతంజలి శాసనము చేయవలసివచ్చినది. అట్లు పలుకుబడిలో మాఱినవాని కుదాహరణములు :—

ఏకమ్-ఎక్కం, బ్రహ్మ-బమ్హా, ధర్మః-దమ్మం, గృహమ్-ఘరం, కస్య-కస్స, సూత్రమ్-సుత్తం ఇత్యాదులు. ఎట్టిసుశబ్దములైనను వాడుకలో నిట్లు మాఱు ననుటకు, మనకిపుడు వినవచ్చుచున్న-బేధం-గోధావారి-లగ్గం-యగ్గెం-జొరం-మొదలైన యపభ్రంశములే నిదర్శనము. ఇఁక రెండవది:—

పాణినినాఁటికే యపభ్రంశ శబ్దజాలము దేశమున మఱియొక వాడుక భాషగా వ్యాపించినదనుట నిజమేయైనను, అందుకుఁ దగినలిఖిత ప్రమాణము

చూపింపఁజాలకున్నాము కాని బుద్ధుని నాఁటికది వాడుకలోనున్నట్లు నిదర్శనము లభించుచున్నది. బుద్ధుడు తన మత ధర్మములన్నియు సులభముగాఁ దెలియుటకై యే భాషలో దేశీయులకుపదేశించెనో. ఆ భాషలోనే యాధర్మోప దేశములన్నియు నతని శిష్యులు 'పిటకము'లను పేర సమకూర్చియున్నారు. బుద్ధుఁడు క్రీస్తు పూర్వము ౫౦౦ సంవత్సరములకుఁ బూర్వుఁడగుటచే నప్పటికి సంస్కృతేతరమైన యొక భాష యాదేశమంతట వాడుకలో నున్నదనుట నిజమని తెలియుచున్నది బుద్ధుని ఖననస్థానమున దొరకిన 'పిప్రవా' శాసనములోని శబ్దములు ప్రాచీన పాలీభాషకుఁ జెందినవనియు, క్రీ. పూ. మూఁడవ శతాబ్దిలోని యశోకుని శాసనములలో నున్న శబ్దము లర్వాచీన పాలీభాషకుఁ జెందినవనియుఁ బరిశోధకులు చెప్పుచున్నారు. ఆ రెంటిలోని పదములను సంస్కృత పదముల వికృతరూపము లనుట సిద్ధము.

ఉదా :— పిప్రవాశాసనములో - బుధస - భగవతే - సభగినికనం - సపుతదలనం - అనుమాట లున్నవి. ఇవియే, అశోకశాసనముల నాఁటిపాలీలో, బుద్ధస్స - భగవతో - సభగినం - సపుత్తదారానం - అని వ్రాయవలసియుండును. ఇవి క్రమముగా నీ క్రింది సంస్కృత శబ్దముల వికృతులు.

బుద్ధస్య - భగవతో - సభగినీకమ్ - సపుత్రదారమ్.

కావున బుద్ధునికిఁ బూర్వమే వికృతశబ్దజాలము దేశమున నొక వాడుక భాషగా వ్యాపించి సంస్కృతము ప్రక్కనే నడచుచున్నదనుట నిజమగుచున్నది,

దీనినిబట్టి క్రీ. పూ. అనేక శతకాబ్దములకుఁ బూర్వమే సంస్కృత జన్యమైన యొకభాష సంస్కృతము ప్రక్కననే లోకవ్యవహారమున నున్నట్లును, అదియే పాలీ యని పిలువఁబడుచున్నట్లును దెలిసినది. కాని యీ పాలీ యెపుడెక్కడఁ బుట్టినదను విషయము మాత్రము నేఁటికిని నిశ్చితము కాలేదు. దీనినిగూర్చి శాసన పరిశోధకులును భాషాశాస్త్రజ్ఞులును బహువిధములుగాఁ దలఁచుచున్నారు. అయినను గొంత తెలియఁ బ్రయత్నింతము.

ప్రాకృత వ్యాకరణ సంప్రదాయములు రెండు. మొదటిది హిందూదేశ ప్రాగ్భాగమునకును, రెండవది పడమటి భాగమునకును సంబంధించినవి. శాకల్య భరతకోహలాదుల ననుసరించి, వరరుచి వ్రాసిన 'ప్రాకృత ప్రకాశము' తూర్పు సంప్రదాయమునకుఁ జేరినది. ఈ వరరుచి వార్తికకారుఁడై ప్రసిద్ధి కెక్కిన కాత్యాయనవరరుచి కాఁడు. కాని యతనికి సమకాలికుఁడో పూర్వుఁడో యగును.

ఏ మనఁగా నితని ప్రాకృతసూత్రములకే కాత్యాయనుఁడు 'ప్రాకృతమంజరి' యను పేర వ్యాఖ్య వ్రాసెను.[1] ఈ ప్రాకృతప్రకాశము ననుసరించినవారు క్రమదీశ్వర లంకేశ్వర రామశర్మ తర్కవాగీశ భామహాదులు. పడమటి సంప్రదాయమునకుఁ జేరిన సూత్రాత్మకమైన ప్రాకృతవ్యాకరణము మఱియొకటి యున్నది. దానిని వాల్మీకి రచియించెనని తన్మతానుసారులైన త్రివిక్రమ హేమచంద్ర సింహరాజ లక్ష్మీధరశాస్త్రి ప్రభృతులు చెప్పుచున్నారు.[2]

ఈ యుభయసంప్రదాయములవారును, పైశాచీ ప్రాకృతము హిందూదేశమునఁ బెక్కుచోట్లఁ బెక్కువిధములుగా వ్యాపించినదని చెప్పుటయే ప్రాకృతభాషలలో దీని ప్రాముఖ్యమును బ్రకటించుట యగుచున్నది. మార్కండేయ పండితుఁడు పైశాచి వ్యాపించిన కేకయ మగధ శూరసేన పాండ్యాదులను గణించుచు, వానిలోఁ గేకయ శూరసేన పాంచాలములలోని పైశాచి పరిశుద్ధమైనదని చెప్పెను. లక్ష్మీధరశాస్త్రియు నట్లే యుత్తరదక్షిణములలోని పెక్కు దేశములను గణించుచుఁ బైశాచి సింహళమునందు గూడ వ్యాపించెనని తెల్పియుండెను.[3] ఇట్లే పెక్కండ్రు పైశాచీభాషను బ్రశంసించియున్నారు. అట్టి యీ పైశాచికిని పాలీభాషకును సంబంధమేమయినఁ గలదేమో చూతము.

క్రీ. పూ. 3-4 శతాబ్దులలో బుద్ధశిష్యపరంపరలోనివారు వ్రాసినబౌద్ధగ్రంథములలోని భాషయిపుడు మాగధిగాఁ దలంపఁబడుచున్నది. అశోకుని శాసనములలోని భాష సంస్కృత ప్రాకృతజన్య మగుట విదితము. ఇది గాక, బుద్ధుని యుపదేశ వాక్యములచేఁ బవిత్రమయిన పాలీభాషయే దాక్షిణాత్యదేశ బౌద్ధులు వాడఁజొచ్చిరి. అదియే క్రమముగా సింహళమున (సిలోను) ప్రవేశించి సింహలియైనది. ఈ విధముగాఁ దెలియవచ్చుమాగధి లేక యర్వాచీన పాలి, ప్రాచీనపాలీ రూపాంతరమే యనుట కవకాశము గలదు.

'స్టైన్‌కోనో' యను పాశ్చాత్యపండితుఁడు పైశాచీభాషాస్థాన నిర్ణయమును గూర్చి యొకవ్యాసము వ్రాయుచు, నందు, పైశాచివింధ్యాద్రికిఁ దూర్పుదక్షిణములఁ బెక్కుదేశముల వ్యాపించినదనియు, దానితో బహువిధములఁ బాలీభాష యేకీభవించుచున్నదనియుఁ జెప్పుచు నా రెంటికిఁగల సంబంధమును వర్ణించియున్నాఁడు.

---

1. చూ. డాక్టరు వైద్యాగారి ప్రాకృత ప్రకాశపీఠిక.
2. ఈ విషయము వివాదగ్రస్తమై యున్నది.
3. షడ్భాషాచంద్రిక.

అతఁడు సూచించిన పాలీపైశాచీసంబంధ మంగీకరించుచు, గ్రియర్సన్ పండితుఁడు, కేకయదేశమునఁ బైశాచీప్రాకృతము చిరకాలము క్రిందటనే దేశభాషగా నున్నట్లును, పాణిన్యాచార్యుల జన్మస్థానమైన తక్షశిలకుఁ బ్రాంతమందంతటను బైశాచియే పూర్వము వాడుకలో నున్నట్లును దాని రూపాంతరమే పాలీభాషయైనట్లును చెప్పుచునందు కనేకలాక్షణికుల యభిప్రాయములను గూడ నుదాహరించెను.[1] కాల్డువెల్లు పండితుఁడు పైశాచీ ప్రాకృత సంబంధముగల పెక్కు దేశభాషలలో ద్రావిడ భాషలకు మాతృకయైన ప్రాచీన ద్రవిడభాష యొకటియని వ్రాసెను.[2] నాగవర్మ యను కర్ణాట లాక్షణికుఁడును, పైశాచీవ్యాప్తిని దెలిపియున్నాఁడు.[3] ఇట్లు తెలియవచ్చు ప్రమాణములనుబట్టి సంస్కృతమునుండి పుట్టిన ప్రాకృతములలోఁ బైశాచి ప్రధానమైన దనియుఁ బ్రాచీనపాలీభాష కదియే మాతృకయనియుఁ దెలియుచున్నది. ఒకవేళ నెవరైనను, పాలీభాషకుఁ బైశాచి యాధారము కాదని చెప్పఁజూతురేమో కాని, ఆ పాలీలోని శబ్దజాలము సంస్కృతజన్యమై మాఱినది కాదని మాత్రము చెప్పఁజాలరు. కావున నిఁక నీ చర్చ యిటుంచి యేప్రాకృతమిపుడే దేశభాషగా మాఱినట్లు కనఁబడుచున్నదో తెలిసికొందము.

ప్రాకృతములు - దేశభాషలు

ప్రాకృతి లేక ప్రాకృతమునుండి మహారాష్ట్రిభాషయై మరాటి యేర్పడినది. అపభ్రంశప్రాకృతమునుండి సింధి - పడమటిపంజాబి - కాశ్మీరి - బయలు వెడలినవి. శౌరసేనినుండి, తూర్పుపంజాబి - పూర్వ మవంతీ సంజ్ఞ గలహిందీ - గుజరాతి - బయలుదేఱినవి. మాగధినుండియే, మరాటి - బహువిధమైన బెంగాలీ జనియించినవని కొందఱు అర్ధమాగధి బెంగాలిమూల మని మఱికొందఱు. కడపటివానిలో, ఉరియాకూడఁ జేరును. పైశాచీప్రాకృతము మూలద్రవిడభాషకుఁ బ్రాపయిన దనెడి లాక్షణికమతమును బట్టి, తమిళము - తెలుఁగు - కన్నడము - మొదలగు ద్రావిడ భాషలలోని తద్భవములకుఁ బైశాచీ ప్రాకృతమే మూలమనుట గ్రాహ్యము. ఇంక నెన్నోభాషలు ప్రాకృతభాషామూలకములని పరిశోధనలవలన గ్రహింప నగుచున్నది. దీనినిబట్టియు నెంతోదీర్ఘకాల మార్యభాష, లేక సంస్కృతము వాడుకలో నున్నఁగాని, యందలి యపారశబ్దజాలము వర్ణలోపవర్ణాగమ వర్ణవ్యత్యయాదిరూపమైన బహువిధవికారములు చెంది యన్ని ప్రాకృతములై

1. R. G. Bhandarkar Commemoration Vol. 119—23.
2. Comparative Grammar of the Dravidian Languages.
3. కర్ణాటచ్ఛందోఽంబుధి.

యిన్ని దేశభాషలుగా మాఱఁజాలదనుట నిక్కమని తోఁచకపోదు కావునఁ దొల్లి చిరకాల మార్యభాష వింధ్యహిమాలయ మధ్యభాగమునలుఁగడల వాడుకలో నున్న దని నిరాక్షేపముగా విశ్వసింప వచ్చును. ఇట్లార్యభాష, పిదపఁ బ్రాకృతభాషలను గని పెంచుటయే కాదు, అతి ప్రాచీనకాలమున విదేశభాషలకుఁ గూడఁ జేయూఁత యొసఁగియున్నదని పాశ్చాత్యు లొనర్చిన ప్రశంసవల్లనే తెలియవచ్చుచున్నది గావున మనము మన సంస్కృతమహత్త్వమును వేఱుగాఁ బొగడుకొనుట యనా వశ్యకము.

సంస్కృత భాషాప్రశంస

కర్జన్‌పండితుఁడు (Curzon) ఒక వ్యాసములో "జెండు-గ్రీకు-లాటిన్-గోధికు - మొదలగు భాషలన్నియు వేఱు వేఱు కాలమున సంస్కృతమునుండి పుట్టినవని స్థిరపఱుప సాహసించుచున్నాను" అని నుడివియుండెను.[1] (W. C. Taylor) టైలరుదొర యొక వ్యాసమున "దేశమున నెన్నిమార్పులు సంభవించినను, చెక్కుచెదరక సాటిలేనిసొగసుందనమున విలసిల్లునట్టియు, యూరపుఖండ భాషలకుఁ దల్లియైనట్టియు, గ్రీకుభాషమార్దవమునకును రోమన్ భాష శక్తికిని గారణమైనట్టియు సంస్కృతభాష నేఁటికి నట్లే హిందూస్థానమునఁ గనఁబడుట యెంతయు నాశ్చర్యకరము'' అని పొగడియుండెను.[2] లూయిజ్ జకోలిట్టను ఫ్రెంచిపండితుఁడు "పురాతనమైన సంస్కృతభాషనుండియే ప్రాచీనార్వాచీన వివిధ భాషాసంప్రదాయము లుత్పన్నములైనవి" అని వ్రాసియున్నాఁడు.[3] బీమ్సుపండితుఁడు "అతిప్రాచీనములైన యనేకశబ్దములవాడుక చూడవలెనంటే, అది మనకిష్టమైనను గాకపోయినను సంస్కృతభాషలో మునిఁగియే చూడవలెను." అని వక్కాణించెను.[4] ఇంక వీఁరు మేక్సుముల్లరు మేగ్డోనలు మొదలగు విద్వాంసులు తాము రచియించిన వాఙ్మయ చరిత్రలలో సంస్కృతభాషా వాఙ్మయములను మిక్కిలి ప్రశంసించి యున్నారనుట పునరుక్తము. ఇట్లెందఱో దీనిని స్తుతించి యున్నారు. వారు వీరని గణింపనేల? సంస్కృతము చదువ నేర్చినవాఁడెవఁడైనను దీనికిఁ జేయెత్తి మ్రొక్కనివాఁడు లేఁడనుటకంటె దీనిఘనతను వర్ణింపఁ

1. Journal of R. A. S. of G. B. & I. Vol. XVI.
2. Journal of R. A. S. Vol. II.
3. La Bible Dance L. Ind'e P. 178.
4. J. R. A. S. Vol. V.

జాలము. కావున దేని ప్రాచీన వృత్తాంత మెఱుఁగఁగోరి యింతవఱకును నలుదెసలు పరికించితిమో, అట్టిజగద్వంద్యమును, మహామహిమాభిరామంబును ప్రాచీనార్యుల యమృతవాక్కుల నుదహరించి యార్యావర్తమునఁ బెరిఁగి భరతఖండ మంతట విస్తరించినదియు నగునార్యభాషలో విలసిల్లు మహావాఙ్మయము నుదంతమువైపు మన మిఁక దృష్టిమరలింతము.

ఇది ఆంధ్రభాషానుశాసనాది బహుకృతి కర్తయగు
మల్లాది సూర్యనారాయణశాస్త్రి నిర్మించిన
వైదిక వాఙ్మయచరిత్ర యందలి
తృతీయాధ్యాయము

చతుర్థాధ్యాయము

వాఙ్మయ విభాగము

భారతీయార్యసాహిత్య మంతయు నిపుడు సంస్కృత వాఙ్మయమను పేర నేకాకారముగాఁ గనఁబడుచున్నను, ఇందు వివిధములైన విభాగములు కలవు. దీనిని వైదికము లౌకికము నని కొందఱు చరిత్రకారులు ద్వివిధముగ విభజించి యున్నారు. ఇందు కొంచెము విప్రతిపత్తి కనవచ్చినను, ఈ విభాగము సముచిత మనియే చెప్పవచ్చును. భాషనుబట్టి కాని కాలమునుబట్టి కాని విషయమును బట్టి కాని యీ వాఙ్మయమును విభజింపఁ బూనినచోఁ బెక్కుతరగతులుగా విభజింప వలసివచ్చును, అట్లు చేసినను, అందు విప్రతిపత్తులు కనిపింపకపోవు. కావున వేదములును వానికెక్కువగా సంబంధించిన గ్రంథములును వైదికమనియు, తక్కిన సకల గ్రంథములును లౌకికమనియు విడఁదీయుటయే యుక్తమగుచున్నది. ఇందు —

సంహితలు బ్రాహ్మణములు ఆరణ్యకములు ఉపనిషత్తులు షడంగములు వేదలక్షణములు పరిశిష్టములు వేదసంబంధిసూత్రములు మొదలయినవి వైదిక భాగమునఁ జేరుననియు,

వేదసంబంధము తక్కువగాఁగల కొన్ని సూత్రములును, షడ్దర్శనములును మతధర్మ గ్రంథములును, పురాణేతిహాస కావ్యాదులును, లౌకిక భాగమునఁ జేరు ననియు స్థూలదృష్టిని బట్టి పరిగణింతము. ఈ రెండు భాగములలోని సూక్ష్మ విషయములు ప్రకరణవశమునఁ దెలియఁగలవు. ఇపుడు సకలవాఙ్మయ శిరోభూషణమైన వేదముల వృత్తాంతము సంగ్రహముగాఁ దెలిసికొందము.

వేదములు

దేనివలన లోకము ధర్మాధర్మములను దెలిసికొనుచున్నదో, అది వేదము. అది ఋగ్వేదము సామవేదము యజుర్వేదము అథర్వవేదము, అని నాలుగు విధములు. మొదటిమూఁడింటికిని మొత్తముగా వేదము శ్రుతి ఆమ్నాయము ఛందస్సు స్వాధ్యాయము, అను సంజ్ఞలారణ్యకోపనిషత్తులలోఁ గనవచ్చుచున్నవి. కాని ఋక్కు - ఋక్కులు, సామము - సామములు, యజుస్సు యజుస్సులు, అనునవియే వీని యేకవచన బహువచన రూపములైన మొదటి ప్రత్యేకసంజ్ఞలని

యీ వేదములవల్లనే తెలియవచ్చుచున్నది.[1] మంత్ర బ్రాహ్మణాత్మకము వేదమని మఱియొక లక్షణము కలదు. దానినిఁబట్టి సంహిత మంత్రభాగమనియు, దాని వ్యాఖ్యానరూపమైనది బ్రాహ్మణమనియు స్థూలదృష్టిని దెలిసికొనవచ్చును.

పై ఋక్సామయజుస్సులను మొత్తముగా మంత్రమనెడి సంజ్ఞ తొల్లి వాడుకలోనున్నట్లు తైత్తిరీయ బ్రాహ్మణము చెప్పుచున్నది.[2]

ప్రాచీనమహర్షి దృష్టములును, త్రివిధములునైన యామంత్రము లేకరాశిగా నుండఁగా నర్వాచీనమహర్షులు దానినుండి పాదముతో నర్థముతోఁ గూడి వృత్తబద్ధములైన మంత్రములను, వృత్తగీతివర్జితములను వాని వాని ధర్మములను బట్టి విడఁబఱిచి యొక్కొక్క భాగముగాఁ గూర్చుటచే నవి సంహితలనెడి సంజ్ఞలను జెందినవి. ఆ విధముగా సంధింపఁబడిన మంత్రభాగములే ఋక్సంహితయని సామసంహిత యజుస్సంహితయని చెప్పఁబడుచున్నవి అట్లు విడఁబఱిచిన పిదపఁ గూడఁ గొన్ని ఋక్కులు యజుస్సునందును, పెక్కుఋక్కులు సామమునందును, కొన్ని సామములు యజుస్సునందును, కొన్ని యజుస్సులు ఋక్సంహితయందును సామమునందునుగూడఁ గనవచ్చుచున్నవి. అట్లు త్రివిధ సంహితామంత్రములు సంకీర్ణముగా నుండుట కనిపెట్టి సూత్రకారులు "మంత్రములకు వ్యవస్థితలక్షణము లేదు" అనెడి యాక్షేప మెత్తుకొని, "వృత్తబద్ధత్వమును గీతిరూపత్వమును వృత్తగీతి వర్జితత్వమును బట్టి ఋక్సామ యజుస్సుల నెఱుఁగవచ్చును గావున వానికి సాంకర్యము కలదని యాక్షేపింపరాదు" అని సమాధానము చెప్పిరి.[3] ఇది కూడ మంత్రము లన్నియు నేకరాశిగా నుండఁగాఁ బూర్వులు వానినివిడఁదీసి త్రివిధముగాఁ గూర్చిరనియు నందుచే నవి సంహితా సంజ్ఞ చెందినవనియుఁ జెప్పిన పై విషయమును జక్కఁగా సూచించుచున్నది.

మఱియుఁ బూర్వోక్త లక్షణమునుబట్టి వేదమందలి రెండవభాగము బ్రాహ్మణమని తెలియవచ్చినదిగదా! అదియు నా భాగమందలి విషయమున కను

1. తదస్య దైవ యజ్ఞస్య సామ్నా యజుషా క్రియతే శిథిలమ్, తదస్య దృచా తద్రూఢమ్-తై. సం. 6-5-10- ఋచ స్సామాని యజూంషి తై. బ్రా. 1-2-1-26.
2. అహే బుధ్నియ మంత్రం మే గోపాయ. య మృషయ స్త్రైవిదా విదుః ఋచ స్సామాని యజూంషి. 1-2-1-26.
3. పూ. మీ. 2-1-35—37. సాయణుల ఋగ్వేదభాష్యావతారిక.

గుణముగా వచ్చిన యర్వాచీనసంజ్ఞయే. సకల జగత్కారణమైన బ్రహ్మమును బ్రతిపాదించుటంజేసి వేదముగూడ బ్రహ్మశబ్దవాచ్యమైనది. సంహితారూపమయిన దానికి వ్యాఖ్యానరూపమై సంబంధించిన భాగమగుటచే దీనికి బ్రాహ్మణమను పేరు వచ్చినది. ఇట్లు వేదభాగములకు వచ్చిన సంహితా బ్రాహ్మణసంజ్ఞ లారణ్యకాదు లందు సర్వత్ర కనవచ్చుచున్నవి. ఇఁక నితరసంజ్ఞల యర్థము : --

దేనివలన ధర్మాధర్మములు వినఁబడుచున్నవో, అది శ్రుతి. పారంపర్యముగా నభ్యసింపఁబడున దామ్నాయము. అధ్యయన మధ్యాయము, స్వకీయ శాఖాధ్యాయము స్వాధ్యాయము. ఇది తత్తచ్ఛాఖాపరముగా నున్నది ఛందోబద్ధ మయిన మంత్రము ఛందస్సు.[1] ఇట్లు వేదాది సమూహ సంజ్ఞలను ఋగాది ప్రత్యేక సంజ్ఞలను జెందిన మంత్రములు సంహిత లయినవి. ఈ సంహితలలోని త్రివిధ మంత్రములును సమకాలికములా, లేక భిన్నకాలికములా, యని విచారణ చేయ వలసియున్నది. వెనుకటి చరిత్రకారు లందఱును ఋగాదిసంహితలు భిన్న కాలికము లనియు ఋక్సంహిత సామసంహిత యజుస్సంహితలు క్రమముగా విశేషాంతరములలో బయలు వెడలిన వనియు వ్రాసియున్నారు. అది యెంతవరకు సత్యము ?—

సంహితల పౌర్వాపర్యము

సంహితా బ్రాహ్మణాదులలో వేదక్రమమును దెల్పువాక్యములు కొన్నికలవు. అన్నిటిలోను ఋగ్వేదము ముందున్నదనుట నిర్వివాదము. కాని కొన్నిటిలో సామ వేదమును, మఱికొన్నిటిలో యజుర్వేదమును, ఋగ్వేదము తరువాతఁ బేర్కొనఁబడి యున్నవి. అందుచే సామవేదమే ముందని కొందఱును యజుర్వేదమే ముందని కొందఱును జెప్పుట కలదు. కాని సామసంహిత యంతము ఋగాశ్రితమే యగుటచే దాని ముందువెనుక లాలోచింపవలసిన పనియే లేమింజేసి యావాదము నిరస్తమగు చున్నది.[2] ఇఁక ఋగ్యజుస్సంహితలు. ఋక్సంహితలో యజుస్సును, యజుస్సంహితలో ఋక్కును బేర్కొనఁబడినవని యింతకు మున్నుదాహరించిన మంత్రముల వల్లనే తెలియుచున్నది ఇవి సమకాలికములనుట కిదియే ప్రమాణము. అట్లు కాక పోయిన యెడల నొకదాని నొకటి పేర్కొనుట యెట్లు సంభవించును ? ఋక్సంహిత మొదటిదైనచో దానిని యజుస్సంహిత పేర్కొనవచ్చునుగాని, తరువాతిదైనదీ నిన

1. తై ఆ. 7-11 2-15.

2. సామ్నాంతు సర్వేషాం ఋగాశ్రితత్వం ప్రసిద్ధమ్. ఋగ్భాష్యావతారిక.

దెట్లు పేర్కొనఁగలుగును? అయితే వారికిక్కడ నొకయుక్తి చెప్పవచ్చును. ఋగ్వేద సూక్తము లన్నియు నొక్కమా ఱుదయింపలేదు అవి కాలక్రమమునఁ బుట్టుచు వచ్చెను. కడపటి సూక్తములు పుట్టునప్పటికి యజుర్మంత్రములు గూడ జనియించుచు నుండును. అందుచే ఋక్సూక్తమున యజుస్సు పేర్కొనఁబడి యుండు"నని, సరే. ఇదియు మాకు నిష్టాపత్తియే. ఋగ్వేదసూక్తములు సమాప్తి నొందునప్పటికి యజస్సులుకూడఁ బుట్టుచుండెననుట యవి సమకాలికములుగా వచ్చుచున్నవనుట కంటె వేఱుగాదు. ఇదిగాక యిందొక్క విశేషము. ప్రాచీనార్యుల వైదిక విజ్ఞాన మనాదియని యంగీకరింపక తప్పదు. పురాతన యుగమునుండియు నార్యులు క్రతుపరాయణులై గవామయనాది వార్షికసత్రము లాచరించుచు వచ్చిరని ఋగ్వేద వాక్యములవల్లనే తెలిసికొనియున్నాము. క్రతువులందాధ్వర్యవ మంతయు యజుస్సంబంధ మనుట తెల్లము. అధ్వర్యువేదమున నిష్పన్నమైన యజ్ఞ శరీరమును స్తోత్ర రూపమయిన ఋగ్వేదమును శస్త్రరూపమయిన సామవేదము ననుసరించి యుండునని కర్మకాండ మంతటను గనవచ్చుచున్నది మఱియు, మనోమయ పురుషునికి యజుర్వేదము శిరస్సు, ఋగ్వేదము దక్షిణపక్షము. సామవేద ముత్తర పక్షము, అని చెప్పెడితైత్తిరీయారణ్యక వాక్యమున యజుర్వేదమునకే ప్రాధాన్య మెక్కువయని తెలియవచ్చుచున్నది.[1] అట్టియెడఁ బ్రధాన భూతములైన యజుర్మంత్రములు లేకుండఁగాఁ గేవలము ఋఙ్మంత్రములతోనే పురాతన మహర్షులు సత్రము లాచరించిరనుట పొసఁగదు గావున యజ్ఞము లొనర్పఁగావలసిన యజుర్మంత్రములు ఋక్కులతోనే పుట్టినవని చెప్పవలసి వచ్చుచున్నది. అట్లు యజ్ఞోపయుక్తములయిన త్రివిధమంత్రములు కలసియుండుట చేతనే వానిని సంహితలక్రిందఁ దరువాతివారు విభజింపవలసి వచ్చినది. ఈ యర్థమునే తైత్తిరీయ బ్రాహ్మణవాక్యమిట్లు బలపఱుచుచున్నది.

"హేబుధ్నియా! ఏమంత్రమును (జాత్యేకవచనము) అతీంద్రియ ద్రష్టలైన త్రైవిదు లెఱుఁగుదురో! ఆఋగ్యజుస్సామాత్మకమైన నామంత్రమును రక్షింపుము, సన్మార్గవర్తులకదే నాశనము లేనిసిరి.[2] ఋగ్యజుస్సామములను మూఁడు వేదముల నెఱిగినవారు త్రివేదులు వారి సంబంధమయినవారు త్రైవిదులు. వారే వృత్తబద్ధమైన మంత్రము ఋక్కనియు, గీతిరూపమయిన మంత్రము సామమనియు, తద్వ్యతిరిక్తము గద్యరూపము నయినది యజుర్మంత్ర మనియు

1. తై. ఆ. 8-౨.
2. తై. బ్రా. 1-2-1-26.

నెఱిఁగిన వారనుట స్పష్టము. కావునఁ ద్రయీ మంత్రములన్నియు నొక కాలమునఁ గలసియున్నవనియు, అవి సమకాలికము లనియుఁ దెలుప నింతకంటె నితర ప్రమాణ మావశ్యకముకాదు. అదిగాక, ఇపుడు మన కంటియెదుటనున్న ఋక్సంహితలోఁ గొన్ని సూక్తములును, యజుస్సంహితలోఁ గొన్ని ప్రపాఠకములును, అర్వాచీన మహర్షి దృష్టములైనవి చేరియున్నవని వేదపరిశోధకుల యభిప్రాయము. అందుకుఁ గొన్ని ఋక్కులును యజుస్సులును గూడఁ దోఁచుచున్న వనుట సత్యము. అట్టివానిని బురాతన ఋగ్యజుస్సులలోఁ జేర్చకుండఁగాఁ బరిశీలించినచోఁ దక్కిన పురాతన మహర్షి దృష్టములైన ఋగ్యజుస్సంహితాభాగములు సమకాలికములనుట కడ్డమేమియురాదు. దీనిచే వేదములు సమకాలికములని బోధించుచున్న వైదికవాక్యములు సార్థకములగుటయే కాదు, వేదము లనాదులనెడివారి విశ్వాసముగూడా సఫలమగును. కావునఁ బురాతనములైన ఋక్సామయజుస్సంహితలు సమకాలికములనుటయే యుచితమని నా యభిప్రాయము.

త్రయి — అథర్వణము

పైని జెప్పిన త్రివిధములయిన సంహితలందును వాని బ్రాహ్మణములందును ఋగ్యజుస్సామములు మూఁడు మాత్రము సర్వత్ర పేర్కొనఁబడుటయే కాదు, ఈ మూఁడు వేదములకు నేకముగా 'త్రయీ' యనెడి సంజ్ఞగూడఁ దఱచుగాఁ బ్రయోగింపబడి యున్నది.[1] దీనినిబట్టి చూడఁగా ఋగ్యజుస్సామ వేదములకుఁ దరువాతనే యథర్వవేదము వెలసినట్లు కనఁబడుచున్నది. ఉపనిషత్తులలోఁ బెక్కుచోట్ల నాథర్వణము పేర్కొనబడి యున్నది.[2] కాని తక్కిన వేదములవలె నిది యజ్ఞక్రియలయందు తొల్లి యుపయోగింపఁబడినట్లు కనఁబడదు. యాగములయందు హోత - అధ్వర్యుఁడు. ఉద్గాత - బ్రహ్మ - అనువారు ప్రధానులు. హౌత్రము ఆధ్వర్యవము ఔద్గాత్రము బ్రహ్మత్వము, ననునవి క్రమముగా వారి

1. సైషా త్రయ్యేవ విద్యా తపతి తై. ఆ 10-13.
త్రయో వేదా అజాయన్త. ఐ. బ్రా. 5-32.
త్రయీ వై విద్యా ఋచో యజూంషి సామాని శ. బ్రా. 4-5-7.
2. ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేద మాథర్వణం చతుర్థమ్ ఛాం. ఉ. 7-1-2.
ఋగ్వేదో యజుర్వేద స్సామవేదోఽథర్వవేదః ము. ఉ. 1-1-5,
చత్వారో వేదా స్సాఙ్గా స్సశాఖాః—వృ తా. 1-2.

కృత్యములు పూర్వము క్రతువులయం దీకృత్యములెట్లు నిర్వహింపఁబడుచుండెడి వను విషయము నైతరేయ బ్రాహ్మణమిట్లు తెల్పుచున్నది.

"హౌత్రము ఋక్కుచేతన, ఆధ్వర్యవము యజుస్సుచేతను, ఉద్గీథము లేక, ఔద్గాత్రము సామముచేతను జరుపఁబడుచున్నవి. అందుచే నివి త్రయీ విద్య యనఁబడుచున్నవి. అట్లయిన బ్రహ్మత్వము దేనిచే జరుపఁబడుచున్నది? త్రయీ విద్యచేతనే యని చెప్పవలెను."[1]

దీనినిబట్టి యజ్ఞాది క్రియలందివి బ్రాహ్మణములనాఁటిఁ గూడఁ బ్రామాణికము గాదని తెల్లమగుచున్నది కాని యారణ్యకముల కాలమున దీనికిఁ బ్రామాణికత్వ మబ్బినట్లు తైత్తిరీ యారణ్యకాదులవలనఁ దెలియుచున్నది.

"ఋగధ్యయన క్రియలు దేవతలకు క్షీరాహుతులు, యజురధ్యయన క్రియలు ఘృతాహుతులు, సామాధ్యయన క్రియలు సోమాహుతులు, అథర్వాఙ్గిరోఽధ్యయన క్రియలు మధ్వాహుతులు నగును."[2]

"ప్రజాపతి యజ్ఞమొనర్చెను. అతఁడు ఋక్కుచే హౌత్రమును యజుస్సుచే నాధ్వర్యవమును సామముచే నౌద్గాత్రమును అథర్వాఙ్గిరస్సులచే బ్రహ్మత్వమును జరిపెను."[3]

దీనినిబట్టి యిది యజ్ఞ క్రియాసంబంధము లేక ఋగాది వేదములతో సమాన ప్రతిపత్తి పొందకుండుట చూచి యాథర్వణశాఖవారు యజ్ఞోపయోగిగాఁ గడపటి కాండమును జేర్చిరనియు, నాఁటినుండి యిది యజ్ఞాదిక్రియలం దుపయుక్తమగుచుఁ బ్రామాణికత్వము చెందినదనియుఁ జరిత్రకారు లూహించుట సముచితమే యగుచున్నది. నిజముగా నీ వేదము మొదటినుండియు యాగములం దుపయోగింపఁబడుచుండెనేని దీని పేరుగూడ మిగిలిన సంహితా బ్రాహ్మణములలో నుండియే యుండును. అట్లుగాక కడపటి కాండము చేరినపిదప నిది యజ్ఞోపయోగియైనది కావుననే దీనిపేరు తరువాత వెలసిన యారణ్యకోపనిషత్తులలోఁ గనవచ్చినది. తక్కిన కాండములలోని కొన్ని కొన్ని మంత్రములు స్మార్త క్రియలయందును మూర్ధాభిషేకాది క్షత్రియోచిత కర్మలయందును వినియుక్తము

1. ఐ బ్రా. 5-33.
2. తై. ఆ. 2-9-1.
3. గో. బ్రా. 3.2.

లగుచున్నను,[1] ఇరువదవ కాండములోని మంత్రములు యజ్ఞములయందు వినియోగింపఁబడుటచేతనే యిది తక్కిన వేదముఁవలెఁ బ్రామాణ్యము సంపాదించుకొనఁ గలిగినదనుట నిజము. అందుచేఁ దొలుత మూఁడు వేదములకుఁ ద్రయీసంజ్ఞ వచ్చినదనియు, నథర్వవేదము ప్రమాణమైన పిదప వేదములు నాలుగనెడి వ్యవహారము వచ్చినదనియు, విదితమగుచున్నది.

వేద ప్రశంస

ఇహపురాతనార్యులనాది యనియు నపౌరుషేయ మనియు నిరుపమాన భక్తివిశ్వాసములతో నారాధించుచు వచ్చిన సనాతన వైదిక విజ్ఞానఖనిలో నతీంద్రియద్రష్టలైన ప్రాచీన మహర్షులు తపశ్శక్తిచేఁ గనిపెట్టి పైకిఁ దీసి మెఱుఁగుపెట్టిన దివ్యరత్నములే వేదములు. వేలకొలది సంవత్సరముల క్రిందట వీని దివ్యకాంతులచేఁ దొలుత వెలుఁగొందిన దార్యావర్తము. క్రమముగా వీని సముజ్జ్వల తేజఃపుంజ మాసేతుహిమాచలము భరతఖండ మంతటఁ బ్రసరించి భారతీయుల యజ్ఞానతిమిరము నణఁచి వారిజ్ఞాన నేత్రమును వికసింపఁజేసినదనుట ప్రాచీన భరతఖండ చరిత్రములోని మొట్టమొదటి విషయమని యంగీకరింపని వారుండరు.

విదేశవిద్యలును వైదేశికాచారములును వెల్లి విరియుటంజేసి సనాతన ధర్మము లడుగంటి నవనాగరికత హెచ్చుచున్న యీ కాలమునఁ గూడ వేదములనుమాట యుచ్చరించినంతనే లేక విన్నంతనే సాక్షరుఁడైన యెట్టివాని హృదయమందేని యపూర్వ మనిర్వచనీయమునైన యొకానొక పూర్వకాలపావన చరిత్రాంశస్మృతి యంకురించుటకుఁ గారణము ప్రాచీనార్యులకు వానియెడఁ గలపూజ్యభావము శాశ్వతమై తరతరములనుండి తత్సంతతి వారిహృదయముల నంటి వచ్చుటయే కాక వేఱేమి కలదు? మఱియు నాఁటినుండి నేఁటిదనుక భరతఖండ మెన్నోయుపద్రవముల పాలయినది. సముద్రభాగములు మెట్టలైనవి. భూభాగములు సముద్రములఁ గలసినవి. రాజ్యములు తలక్రిందైనవి. సామ్రాజ్యములు పేరుమాసినవి. భాషలు మాఱినవి. వేషములు మాఱినవి. వృత్తులు మాఱినవి. పెక్కేల? నాఁటి భరతఖండము నేఁటిదిగాదు. అయినను, వేదములు మాత్రమొక యక్షరమైనఁ బోకుండ నింతస్వరమైనఁ దప్పకుండఁ బలుకుబడిలో పీసమంత హెచ్చుతగ్గు రాకుండఁ జెక్కుచెదరకుండఁ బుట్టినవి పుట్టినట్లుగా నట్లే కొన్నివేల సంవత్సరములనుండి

1. అభిషిక్తోఽథర్వమంత్రైర్మహీం భుఙ్క్తే ససాగరామ్. మత్స్య.

భరతఖండమునలుఁగడల సంచారము చేసిచేసి యలసియు, నీనాఁడుగూడ భారతీయుల హృదయములందు తమయెడ భక్తివిశ్వాసము లుప్పతిల్లునట్లు విలసిల్లుటకుఁ గారణమేమి ? ఆ మహావిద్యల యనిర్వచనీయ మహత్త్వమును, ఆ వేదద్రష్టల యసాధారణతపోమహిమయుఁ గాక వేఱేమి కలదు ? అట్టివి గదా వేదములు ! అట్టి ప్రశంసనీయములును భరతఖండము పాలిటి భాగ్యదేవతలును జతుర్విధ పురుషార్థ సాధనములునగు వేదముల చరిత్రము సవిస్తరముగా నెఱుంగఁ గోరినమనకు, వానిలో నగ్రగణ్యమని వినుతి గాంచినదియు భారతీయవిద్యల కోశాగారమును సకలప్రపంచ వాఙ్మయమునకు శ్రీకారమునగు ఋగ్వేదము హృదయరంజకముగాఁ గన్నుల పండువుగా ముందు ప్రత్యక్ష మగుచున్నది.

ఇది శ్రీ చర్ల బ్రహ్మశాస్త్రి ప్రియ శిష్యుఁడగు
మల్లాది సూర్యనారాయణశాస్త్రి రచియించిన
వైదిక వాఙ్మయ చరిత్ర యందలి
చ తు ర్థా ధ్యా య ము

పఞ్చమాధ్యాయము

ఋక్సంహిత — దాని విభాగము

ఋగ్వేద మంత్రభాగమే ఋక్సంహిత యనఁబడుచున్నది. మన కిపుడు గనవచ్చు పద్ధతి నెపుడు ఋక్సూక్తములు సంహితారూపము తాల్చినవో నిర్ణయింపఁ జాలముకాని, ప్రాచీన మహర్షి పరంపరాదృష్టములగుచుఁ గాలక్రమమున బహుసంఖ్యాకములై యొక యేర్పాటులేక పఠనపాఠవ్యవహారసిద్ధములైన వానినెల్లఁ దరువాతి మహర్షులు విషయమునుబట్టి విభజించి యొక క్రమము ననుసరించి వానిని సమకూర్చి యుందురనియు, ఆ పని శాకల్యదృష్టమైన పదపాఠము వెలయుటకు మున్నే జరిగి యుండుననియుఁ జెప్పవచ్చును. అట్టి యీ సంహిత యెట్లు విభజింపఁబడెనో చూతము.

అనియతసంఖ్య గలకొన్ని ఋక్కు లొకసూక్తము. అట్టి కొన్ని సూక్తము లొక యనువాకము. అట్టి యనువాకములు కొన్ని యొకమండలము. అట్టి పది మండలములు ఋక్సంహిత.

అనియత సంఖ్యగల కొన్ని ఋక్కు లొకవర్గము. అట్టి కొన్ని వర్గము లొక యధ్యాయము. ఎనిమిది యధ్యాయము లొక యష్టకము. ఎనిమిది యష్టకములు ఋక్సంహిత.

ఇందు మొదటిది శౌనకపద్ధతి యనియు రెండవది కాత్యాయనపద్ధతి యనియుఁ బ్రతీతి కలదు కాని. అష్టకసంజ్ఞ తప్పఁ దక్కినభాగసంజ్ఞలు సర్వానుక్రమణీచరణ వ్యూహాదులందు సమానముగానే కనవచ్చుచున్నవి. అయినను ఋక్సంఖ్య మాత్ర మాయాగ్రంథముల వేఱుపడుచున్నది. ఇందుకు ఖిలసూక్తము లలోని కొన్ని ఋక్కులు కలియుట కారణమని కొందఱును, ఆ భేదము శాఖాభేదమునుబట్టి వచ్చినదని కొందఱును దలంచుచున్నారు. ఇది యిట్లుండ సర్వానుక్రమణిలోని మాటలనుబట్టియే ఋక్సంఖ్య వివిధముగాఁ గనవచ్చుచున్నది.[1] ఈ యనుక్రమణి శాకలశాఖకు సంబంధించినది. ఒక శాఖకుఁ జెందిన ఋక్కుల

1. సర్వానుక్రమణి శౌనకప్రణీతమా, కాత్యాయనకృతమా, అను విషయము తరువాత విచారింపఁబడును.

మొత్త మొకటిగా నుండక వేఱగుటకుఁ గారణమేమో, తెలిసికొనుటకు ముందుగా విభాగములను గనుఁగొందము.

౧. సర్వానుక్రమణిలోని మండలాది నిర్ణయము,

ఋక్సంహిత ౧౦ మండలములు. ౬౪ అధ్యాయములు, ౮౫ అను వాకములు ౧౦౧౭ సూక్తములు (ఇందుఖైలిక సూక్తములు చేరలేదు.) ౨౦౦౬ వర్గములు. ౧౦౫౮౦—౧/౪ ఋక్కులు.[1] ' /౪ అర్ధ ఋక్కులు. ౧౧౦౭౦౪ చర్చాపదములు. ౧౫౩౮ ౨౬ పదములు.[2] ౪౩౨౦౦౦ అక్షరములు. బాష్కల సంహితలో ౮ సూక్తము లెక్కువగా నున్నవి గావున నందలి సూక్తములు ౧౦౨౫.

౨. మండల క్రమమున ననువాకవిభాగము

ప్ర-౨౪. ద్వి-౪. తృ-౫. చ-౫. పం-౬. ష-౬. స-౬. అ-౧౦. న-౭. ద-౧౨. మొత్తము ౮౫ అను వాకములు.

౩. మండలక్రమమున సూక్తవిభాగము

ప్ర-౧౯౧. ద్వి-౪౩. తృ-౬౨. చ-౫౮. పం-౮౭ ష-౭౫. స.౧౦౪. అ-౯ ౨. న-౧౧౪. ద-౧౯౧. మొత్తము ౧౦౧౭ సూక్తములు. (అష్టమమండలములో వాలఖిల్యసూక్తములు ౧౧ కలవు. వానితో ౧౦౨౮ సూక్తములగును.)

౪. ఎన్నేసి ఋక్కులు గలవర్గము లెన్నెన్నియని చేసిన నిర్ణయము.[3]

ఎన్ని ఋక్కులుకలవి ?	ఎన్ని వర్గములు ?	ఋక్కులసంఖ్య.
౧ ఋక్కుకలది	౧	౧
౨ ఋక్కులుకలవి	౨	౪

1. ఋచాం దశసహస్రాణి ఋచాం పంచశతానిచ ।
ఋచా మశీతిః పాదశ్చైతత్పారాయణ ముచ్యతే ॥

2. శాకల్యదృష్టే పద మేకలక్షం సార్ధంచ వేదే త్రిసహస్రయుక్తం ।
శతాని చాష్టౌ దశకద్వయంచ పదాని షట్చేతిచ చర్చితాని ॥

3. వర్గాణాం పరిసంఖ్యాతం ద్వే సహస్రే షడుత్తరే. ఈ మొత్తము విషయమున సర్వానుక్రమణి, అనువాకానుక్రమణి, చరణవ్యూహముకూడ నేకీభవించుచున్నగాని వివరములో నీషద్భేదము లున్నవి. అనువాకానుక్రమణిలో ఎనిమిది ఋక్కులు గల వర్గములు ౫౭ 'త్ర్యూనాషష్టి రష్టకానాం' అను పాఠము ప్రామాదికము.

ఎన్ని ఋక్కులు కలవి ?	ఎన్ని వర్గములు ?	ఋక్కుల సంఖ్య
౩ ఋక్కులు కలవి	౯౭	౨౯౧
౪ ఋక్కులు కలవి	౧౭౪	౬౯౬
౫ ఋక్కులు కలవి	౧౨౦౭	౬౦౩౫
౬ ఋక్కులు కలవి	౩౪౬	౨౦౭౬
౭ ఋక్కులు కలవి	౧౧౯	౮౩౩
౮ ఋక్కులు కలవి	౫౯	౪౭౨
౯ ఋక్కులు కలవి	౧	౯
	౨౦౦౬	* ౧౦౪౧౭

౫. ఒక్కొక్క ఛందస్సునం దెన్నేసి ఋక్కులున్నవని చేసిననిర్ణయము

గాయత్రి	౨౪౫౧	వెనుకటి మొత్తము.	౯౭౮౬
ఉష్ణిక్కు	౩౪౧	అష్టి	౬
అనుష్టుప్పు	౮౫౫	అత్యష్టి	౮౪
బృహతి	౧౮౧	ధృతి	౨
పంక్తి	౩౧౨	అతిధృతి	౧
త్రిష్టుప్పు	౪౨౫౩	ఏకపాదములు	౬
జగతి	౧౩౪౮	ద్విపాదములు	౧౭
అతిజగతి	౧౭	ప్రగాథబృహతి	౧౯౪
శక్వరి	౧౯	కకుప్పు	౫౫
అతిశక్వరి	౯	మహాబృహతి	౨౫౧
	౯౭౮౬		§ ౧౦౪౦౨

* ఏవం దశసహస్రాణి శతానాం తు చతుష్టయమ్ ।

§ ఋచాం ద్వ్యధిక మాఖ్యాత మృషిభి స్తత్త్వదర్శిభిః, సర్వాను–వర్గములనుబట్టి వచ్చిన మొదటి మొత్తమునకును, ఛందస్సులనుబట్టి వచ్చిన రెండవ మొత్తమునకును ౧౫ ఋక్కులతేడా కనఁబడుచున్నది. మాక్సిముల్లరు రెండవ మొత్తము౧౦౪౦౯ అయినట్లు చూపెను.

ఈ భేదమున కవకాశమిచ్చిన శ్లోకమిది :—

“దశైనాతి జగత్యోఽపి తథా సప్తవ సంశయః। శక్వర్యోఽపి తథైవోక్తా స్తథానవ విచక్షణైః॥” దీనినిబట్టి, అతిజగతీ ఛందస్సులోని ౧౭ ఋక్కులకు ముల్లరుగారు ౯ చేర్చి శక్వరీఋక్కులు ౨౬ అన్నారు. అందలి ౧౦ ఋక్కులకు ౯ చేర్చి శక్వరీఋక్కులు ౧౯ అని నేనభిప్రాయపడితిని. ఇందుకు దాని క్రిందనే యున్న ‘ఏవం దశసహస్రాణీత్యాది శ్లోకమే ప్రమాణము.

ఋక్సంఖ్యానిర్ణయము

పై పట్టికలలోని పువ్వుగుర్తుగల ఋక్సంఖ్యలు పరస్పర విరుద్ధములుగాఁ గనఁబడుచున్నమాట సత్యము. ఇది యిట్లుండ; కలకత్తాసంస్కృత కలాశాలలోని వ్రాఁత ప్రతియగు శౌనకానుక్రమణిలో ఋక్కులసంఖ్య ౧౦౪౧౭ కనఁబడు చున్నది. మాక్సిముల్లరు చూచిన చరణవ్యూహములలో ౧౦౬౨౨ ఋక్కులున్న వఁట. ప్రొఫెసరు శేషగిరిశాస్త్రిగారు చూచిన యచ్చుప్రతిలో ౧౦౫౩౧ ఋక్కులున్నవఁట. ఇట్లు ఋక్సంఖ్యాపరిమితి విభిన్నముగాఁ గనవచ్చుచున్నది. అందుచే సాయణాచార్య భాష్యముతో మాక్సిముల్లరు ప్రకటించిన ఋగ్వేదమందలి ఋక్కులను లెక్కపెట్టి చూడఁగా ౧౦౪౭౨ లెక్కకు వచ్చినవి.[1] ఇందు వాలఖిల్యసూక్తములలోని ఋక్కులు చేరలేదు. వాలఖిల్యఋక్కుల సంఖ్య ౮౦, కాని వీనికి సాయణాచార్యులు భాష్యము వ్రాయకపోవుట చూడఁగానివి శౌనకుని ఛందోఽను క్రమణిలోఁ జేరలేదని విదిత మగుచున్నది. ఇట్లు వెవ్వేఱుగాఁ గనవచ్చు ఋక్కుల మొత్తములలోఁ దక్కినవానిమాట యెట్లున్నను ముఖ్యముగా శౌనకుని మూఁడు మొత్తములకును, ఇపుడు వ్యాప్తిలోనున్న ప్రతినిబట్టి నేను లెక్కపెట్టిన మొత్తమునకు సమన్వయ మెట్లయినఁ గుదురునేమో చూతము.

(1)	(2)	(3)	(4)
౧౦౪౦౨	౧౦౪౧౭	౧౦౫౮౦,౧/౪	౧౦౪౭౨

ఇందు మొదటి మొత్తము ఛందోఽను క్రమణినిబట్టి వచ్చింది. రెండవది వర్గానుక్రమణినిబట్టి, మూఁడవది ఋగనుక్రమణినిబట్టి వచ్చినవి. నాల్గవది నేను స్వయముగా లెక్కపెట్టినది. దీనిలో ఏకపాదఋక్కులు ద్విపాదఋక్కులు పునరుక్తములైన ఋక్కులు పూర్తిగా లెక్కింపఁబడినవి.

మొదటి దానికంటె రెండవదానిలో ౧౫ ఋక్కు లెక్కువ యున్నవి. అవి కొన్ని పునరుక్తఋక్కులగుటచే వానిని విడిచినచో నిది మొదటిదానికి సరిపడును.

1. నా లెక్కకు ౧౦౪౭౦ మాత్రమే వచ్చినవి గాని ౨ ఋక్కులు చరణ వ్యూహమున నెక్కువగాఁ గనఁబడుటచే, లిఖిత పుస్తకములందుగాని ముద్రణమందు గాని యీ రెండును, పొరబాటునఁ దప్పియుండునని చరణ వ్యూహ పాఠమునుబట్టి యా రెండు ఋక్కులను చేర్చితిని.

మొదటిదానిలో ఏకపాద ఋక్కులు ౬ ద్విపాదఋక్కులు ౧౭ మాత్రమే గణింపఁబడినవి. అవి ప్రత్యేక మర్థవంతములగుటచేత ఛందస్సులనుబట్టి ప్రత్యేకముగా గణింపఁబడినట్లును, అర్థైక్యమునుబట్టి యొక్కొక్క ఛందస్సులో నున్న రెండేసి ద్విపాదఋక్కు లొక్కొక్క చతుష్పాదఋక్కుగా గణింపఁబడినట్లును ఛందోఽనుక్రమణి పద్ధతినిబట్టి తెలియవచ్చుచున్నది. ఇందుకు సాయణాచార్య వచనమే ప్రమాణము.

మొదటి మండలములో ౬౫ మొదలుగా ౭౦ సూక్తమువఱకును ౬ సూక్తములు ద్విపాదర్చములు. వానికి భాష్యము వ్రాయుచు నాచార్యులిట్లు చెప్పిరి.

"పశ్వేత్యాదీని షట్సూక్తాని ద్వైపదాని, తే ష్వధ్యయన సమయే ద్విపదే ద్వే ద్వే ఋచౌ చతుష్పదా మేకైకా మృచం కృత్వా సమామ్నాయతే. అయుక్సం ఖ్యాసు యాన్త్యాతిరిచ్యతే సా తథైవామ్నాయతే. ప్రాయే ణార్థోఽపి ద్వయోర్ద్విపదయో రేక ఏవ, ప్రయోగేతు తాఃపృథక్పృథక్ప్రశంసనీయాః"

దీనినిబట్టి, యేకార్థముకల రెండేసి ద్విపద లొక చతుష్పదఋక్కుగాఁ బఠింపఁబడుచున్నట్లును, మిగిలిపోయిన ద్విపద యొక ఋక్కుగానే పఠింపఁబడుచున్నట్లును దెలియవచ్చుచున్నది. అట్టిఋక్కులు పైసూక్తము లాఱింటిలోను ౬౧, అయిదవ మండల మిరువదినాల్గవ సూక్తములో ౪, అఱువదియొకటవ సూక్తములో ౧౦, మొత్తము ౭౫ నా లెక్కకు వచ్చినవి. వానిని సాయణాచార్య వచన ప్రకారము మార్చినచో ౩౮ ఋక్కులగును. ఈ పద్ధతినిబట్టి పైనాల్గవ మొత్తములో ౩౮ తగ్గును. మఱియు,

ఛందోఽను క్రమణి పద్ధతినిబట్టి యొక ఛందస్సులో గణింపఁబడిన ఋక్కు రెండుమూఁడు సూక్తములలోఁ బునరుక్తమయినను మరల గణింపఁబడినట్లు కనఁబడదు. అందుచే ఛందోఽనుక్రమణికకును, ఋగను క్రమణికకును ఋక్సంఖ్యలో భేదము రాక మానదు. నేను గణించిన నాల్గవ మొత్తములోఁ గొన్ని ఋక్కులు రెండేసిమార్లు గణనకు వచ్చియున్నవి. ఇందుకొకటి రెండుదాహరణములు:—

'ఉరౌ దేవా అని బాధే స్యామ' అనెడి యేకపాద ఋక్కు, అయిదవ మండలము ౪౨-౪౩ సూక్తములు రెంటిలోనుగూడ నున్నది. ఇట్లే "సమశ్వినో 'వసా' ఇత్యాదిఋక్కును బైసూక్తములలో రెండుచోట్ల నున్నది. అట్టివానినెల్ల

నేను సరిగా గణింపలేదు గాని ౩౨ ఋక్కులుండా ననుటకు సందేహము లేదు.[1] అందుచేఁ బైనిజూపినవి ౩౮, ఇట్లు వచ్చినవి ౩౨. మొత్తమీ ఋక్కులను పై నాల్గవ మొత్తమునుండి తీసివేసినయెడల నది మొదటి మొత్తముతో సరిపడును. కావున ఛందోఽనుక్రమణి పద్ధతినిబట్టి శౌనకాచార్యులిచ్చిన ఋక్సంఖ్య ౧౦౪౦౨ పరినిష్ఠితమని చెప్పవచ్చును. ఇఁక నతఁడే యిచ్చిన మూఁడవ మొత్తము ౧౦౫౮౦-౧/౪ ఉన్నది. దీనినిగూర్చి శౌనకుని పేరనే ముద్రితమైన యొక చరణవ్యూహ మనులక్షణమిట్లు చెప్పుచున్నది.[2]

"వాలఖిల్య వ్యతిరిక్తమైన ఋక్సంఖ్య ౧౦౪౭౨. ఇందు నిత్యద్విపదములు నైమిత్తిక ద్విపదలుగూడఁ జేరినవి. హవనమందును, అధ్యయనమందును సమానముగా లెక్కకు వచ్చుద్విపద నిత్యద్విపద. హవనమందు ప్రత్యేకముగాను, అధ్యయనమందు రెండేసి యొకటిగాను లెక్కకు వచ్చునట్టివి నైమిత్తిక ద్విపదలు. అట్టి నిత్యద్విపదలు ౨౨ ను, అట్టి నైమిత్తిక ద్విపదలు ౧౪౦ యును, ఈ మొత్తములో నున్నవి,[3]" అనుచు నట్టిద్విపద ఋక్కులను గణించి చర్చించియందు ప్రత్యేక ఋక్త్వముగల ఋక్కుల నిర్ణయించి, తుదకు నధ్యయనమందలి ఋక్సంఖ్య ౧౦౪౯౬ అనియు, పారాయణమందలి ఋక్సంఖ్య ౧౦౫౮౦-౧/౪ అనియు సిద్ధాంతీకరించియున్నది [4]

1. సాయణులవారు, ఇయం ఋక్ వ్యాఖ్యాతా, అని పెక్కుచోట్లఁ దెలిపియున్నారు 2-3-4-6 మండలములలో నట్టి వెక్కువగా నున్నవి. ఇది నేను స్థూలదృష్టితోఁ గావించిన ఋగ్గణనము దీనిని సూక్ష్మదృష్టితో, చరణ వ్యూహము చర్చించి యున్నది.

2. ఈ చరణవ్యూహము శౌనకోక్తమనియే కాశీపుర ముద్రితమయిన పుస్తకము వలనఁ దెలియుచున్నది. చరణ వ్యూహములు ౨-౩ ఉన్నవి. అన్నిటి యందును నీషద్భేదములు గనవచ్చుచునే యున్నవి. లేఖక దోషములు ముద్రణ దోషములుగూడ నందు గలవు.

3. ఛందోఽనుక్రమణికలో నేకపదములు ౬ అని యున్నది.

4. చూ. చరణవ్యూ—ప్రథమకండిక. పుటలు 13-18. నాల్గవ మొత్తములో నెక్కువగానున్న ౭౦ ఋక్కులకు నేను స్థూలదృష్టితోఁ గావించిన చర్చయే యిందు సూక్ష్మదృష్టితోఁ గావింపఁబడె ననుట విదితము. అందుచే శౌనకుఁ డిచ్చిన మొదటి మొత్తమును మూఁడవ మొత్తమును దీనిచే సరిపడుచున్నవి. అందలి విశేషములు చరణ వ్యూహమునఁ దెలియఁగలవు

ఇట్లు ఋక్సంఖ్యతో నిర్ణయింపఁబడిన శాకల సంహితాసూక్తములు ౧౦౧౭. ఇవి గాక వాలఖిల్యములనుపేర ౧౧ సూక్తములు ముద్రితపుస్తకములలో నెనిమిదివ మండలము ౪౮వ సూక్తము తరువాత వరుసగాఁ గనబడుచున్నవి. అందలి ఋక్కులు ౮౦, ఇవి గాక ఖైలికములనుపేర ౩౨ సూక్తములు పదియవ మండలమున కనుబంధముగా ముద్రింపఁబడియున్నది అందలి ఋక్కులసంఖ్య ౧౭౭. వాలఖిల్యములకు వలెనే ఖైలికములకును సాయణులవారు భాష్యము రచియింపలేదు. కాని యందలి శ్రీసూక్తములోని ౧౫ ఋక్కులకు మాత్రము వ్యాఖ్యానము గావించిరి. లోకప్రసిద్ధిమైన శ్రీసూక్తము వారి హృదయము నాకర్షించుటయే యందుకుఁ గారణము. ఇఁక బృహద్దేవతలోని యార్షానుక్రమణికనుబట్టి సూక్త ద్రష్టలను వారు సందర్శించిన సూక్తములను దెలిసికొందము

సూక్తద్రష్టలు – సూక్తములు

అతీంద్రియద్రష్టయగు మహామహిముఁడు ఋషి యనఁబడును. అనఁగా సాధారణమానవుని కేవిధమునను గోచరింపని మంత్రమయ వాక్కులను జ్ఞాననేత్రమున సందర్శించిన విశేషప్రతిభాశాలియగు విద్వద్వరిష్ఠుఁడు ఋషియని భావము. తాదృశఋషిదృష్టమైన మంత్రమయవాక్కులు సూక్తమనఁబడుచున్నవి. సూక్తమనఁగా సువాక్సముదాయమని యిక్కడ తాత్పర్యము. సూక్తములలో నొకఋక్కుకంటెఁ దక్కువగా నున్నది గాని ౫౮ ఋక్కులకంటె నెక్కువగా నున్నది గాని లేదు. అట్టి పరమపవిత్రములు దివ్యజ్ఞానబోధకములునగు ఋక్సంహితాసూక్తములు వైదికవాఙ్మయమునకే కాదు ఆర్యవాఙ్మయ మంతకును ఋనాదులనుట పునరుక్తము. ఋక్సంహితలోఁ గనవచ్చు సూక్తములలో నతిప్రాచీనములు గొన్నియుఁ బ్రాచీనములు కొన్నియు నర్వాచీనములు కొన్నియుఁ గలవని మున్నే తెలిసికొని యున్నాము కావున, నవి యన్నియు నేకకాలమున దృష్టములైనవని కాని, ఇపుడు సంహితలోఁ గనవచ్చుచున్న వరుసనేయవి కాలక్రమమున ఋషిపరంపరా దృష్టములైనవని కాని తలంపరాదు. ఇందు కొకయుదాహరణము. విశ్వామిత్రుని కొడుకును, మనుమఁడును దర్శించిన సూక్తములు మొదటి మండలమున నున్నవి. విశ్వామిత్రుఁడును, ఆతని తండ్రి తాతలును గనిపెట్టినవి మూఁడవమండలమున నున్నవి. సూక్తములును వానినిబట్టి మండలములును గాలక్రమము ననుసరించియే యేర్పడెనని తలంచితిమేని, యొక ఋషియొక్క మనుమని మనుమఁడు సందర్శించిన సూక్తములకుఁ దరువాత సుమారు రెండువందల సంవత్సరముల కాఋషిదర్శించిన సూక్తములు వెలసెనని చెప్పవలసి

వచ్చును, నాఁటి ఋషులెంతదీర్ఘాయువులైనను, ఇంతటి వ్యవధానము సంభావ్యము కాఁజాలదు. కావున ఋషు లాయాకాలముల సూక్తములు సందర్శించుచు వచ్చిరనియు, వానిని దరువాతివారు సంహితగాఁ గూర్చుకాలమున విషయమునుబట్టియుఁ బ్రాధాన్యమునుబట్టియు వ్యాప్తినిబట్టియు ముందువెనుకలుగాఁ గూర్చిరనియు భావించుట యుచితము.

ఏయార్యుఁడే సూక్తమును దర్శించెనో యతఁడు దానికి ఋషి. మఱియు సూక్తమందలి వాక్యము లెవరివో వారు వానికి ఋషులు. అననయముల ననుసరించిన యనుక్రమణికలను, సాయణులఋగ్వేద భాష్య సూక్తావతారికలను పరిశోధింపఁగా సూక్తద్రష్టలు రమారమి నాలుగువందలమంది లెక్కకువచ్చిరి. వారిలో నొకఋషి కొన్నిఋక్కులు మాత్రమే కనుఁగొనెను. మఱియొకఁడు సూక్తమంతయు దర్శించెను. ఇంకొకఁ డనేకసూక్తములు సందర్శించెను. ఒక్కొక్కఁ డొక్కొక్కమండలమే చూచెను. ఒక్కొకఁ డనేకులతోఁ గలిసి యనేకసూక్తములఁ బొడ్గొనెను. మఱియుఁ గొన్ని ఋషిగణములు కలిసి యొక సూక్తమే కనిపెట్టెను. ప్రత్యేకముగా స్త్రీలు కొన్నిసూక్తములు చూచిరి. దంపతులు కొన్ని కనుఁగొనిరి. వేఱు వేఱు స్త్రీ పురుషులు కలసి మఱికొన్ని దర్శించిరి. మఱియు ఋగ్వేదసూక్తముల మొత్తములో నేవోకొన్ని లెక్కకురావు స్త్రీ దృష్టములును, తక్కిన వందలకొలఁది సూక్తము లార్యజాతి బ్రహర్షి రాజర్షి దృష్టములునైన మాట సత్యమైనను, అల్పసంఖ్యాకములయిన కొన్ని సూక్తముల కతిమానుషమైన యార్షత్వమును మూఁడు నాలుగుసూక్తముల కమానుషమైన యార్షత్వమును సూక్తవిషయాదులనుబట్టి, అనుక్రమణికలు సూచించుచున్నవి కాని యంతమాత్రమున మానుషేతరవ్యక్తులే వాని ద్రష్టలని యా యనుక్రమణికల యభిప్రాయముగా గ్రహింపఁదగదు.

సూక్తకాలమునకును, అనుక్రమణికాకాలమునకును నడుమఁ బెక్కువందల సంవత్సరముల యంతర మున్నమాట నిజము. అంత కాలమును సూక్తములతోఁ గూడ సూక్తద్రష్టలనామములు గూడఁ గంఠపాఠముగా నార్యుల వంశక్రమమున వచ్చినవే కావి యెవరో యొకరొకచోట వ్రాసిపెట్టి యుంచినవికావు. అట్లు వ్రాసియుంచు కాలమునకు సూక్తద్రష్టల నామములు కొన్ని కొన్ని తబ్బిబ్బు లగుటయుఁ దాఱుమాఱగుటయు స్మృతిపథము దాటుటయుఁగూడ సంభవించినదని యనుక్రమణికలలోని కొన్ని ఋషినిర్ణయవాక్యములే తెలుపుచున్నవి. ఇందు కొకటిరెం డుదాహరణములు :—

మొదటిమండలము ౧౦౫ వ, సూక్తము త్రితుఁడు దర్శించినదా, లేక కుత్సుఁడు రచించినదాయని సందేహము కలిగినది.[1]

మూఁడవమండలము ౩౮ వ, సూక్తము దర్శించినఋషి ప్రజాపతి, ఇతఁడు విశ్వామిత్ర పుత్రుఁడా, లేక వాక్పుత్రుఁడాయని సందేహము కలిగినది.[2]

ఆఱవ మండలము ౧౫ వ, సూక్తము దర్శించిన వీతహవ్యుఁడు భరద్వాజ గోత్రమువాఁడనియు, ఆంగిరస గోత్రుఁడనియు మతభేదము సంభవించినది.[3]

ఎనిమిదవ మండలములోని వాలఖిల్యసూక్తముల ఋషులే కనఁబడరు.[4]

తొమ్మిదవ మండలము. ౮౬ వ సూక్తమును దర్శించినవారి గోత్రముల ప్రసిద్ధములఁట.[5]

ఇంక నిట్టియుదాహరణము లనేకములుకలవు. వీనినిబట్టియు, గోత్రములు తెలియనిఋషుల నాంగిరస గోత్రులనుగాఁ దెలిసికొనఁ దగు నన్నవిధి యేర్పడు టనుబట్టియు:[6] కొందఱు ఋషుల జన్మవృత్తాంతము లతిమానుషములైన కథలుగా వర్ణింపఁబడుటను బట్టియుఁ జూడఁగా నను క్రమణికా కాలమునాఁటికే వేదపాఠ మందున్న శ్రద్ధ ఋషిచ్ఛందోదేవతా పాఠము సం దుండక క్రమముగా మంద గించుచు వచ్చినదనియు• అప్పటికిఁ గొందఱు వేదర్షులు దేవతలుగా భావింపఁబడుచు వచ్చిరనియుఁ దెలియకపోదు. అందుచేతనే ఋషిచ్ఛందో దేవతాది విజ్ఞానము లేని యధ్యయనాధ్యాపనములు పాపహేతువులు గావున వానిని దప్పక తెలిసికొన వలెనన్న శాసన ముద్ఘంపవలసి వచ్చినది. కొన్ని సూక్తముల యందలి విషయములనుఁబట్టి కొందఱు సూక్తద్రష్టలను దేవతాదులనుగా ననుక్రమణికాకర్తలు నిర్ణయింపవలసి వచ్చినది. ఇందు కొకటిరెండుదాహరణములు :—

1. చంద్రమా ఇతి సూక్తస్య త్రిత ఆప్త్యోఽథవా, ఋషిః (కుత్సః) బృహద్దేవత; సా. భా.
2. అత్రానుక్రమణికా-అభితుష్టేవ దశ-ప్రజాపతిః స వైశ్వామిత్రో, వాచ్యోవా ద్వావా తౌ నవై కోఽపీతి - సా భా.
3. ఆంగిరసస్య వీతహవ్యస్య భారద్వాజస్య వార్షమ్. సా. భా.
   ఇమ మూషువ ఇత్యస్య సూక్త స్యాంగిరస స్సుతః వీతహవ్యః-బృహః—
4 సర్వానుక్రమణిలోఁ గాని బృహద్దేవతలోఁగాని వారిపేళ్లు లేవు.
5. ఏషాంతు గోత్రం క్వచిదప్రసిద్ధం బృహః—
6. అనుక్తగోత్ర మాంగిరసం విద్యాత్. శౌనకానుక్రమణి—అనుక్తగోత్రోయ స్త్వత్రమండలే లక్ష్యతేమునిః । స తు కాణ్వ ఇతి జ్ఞేయః—బృహద్దేవత

ప్రజాపతి తృతీయమండలమున విశ్వామిత్రపుత్రుఁడో లేక వాక్పుత్రుఁడో యైన యార్యుఁడు అతఁడు దశమమండలములోని ౧౨౯ వ, సూక్తమును సందర్శించి యందలి విషయమును బట్టి యనుక్రమణిలో స్పష్టికర్తయగు పరమేష్ఠిగా మాఱెను. ఇందుకు, ప్రజాపతిశబ్దము బ్రహ్మపర్యాయములలోఁ జేరుట కూడ నొకకారణమై యుండవచ్చును.

అగ్నినామక మహర్షులు ముగ్గురునలుగురు భిన్నగోత్రముల వారున్నారు. వారిలో నొకఁడు పావకుఁడుగా మాఱెను. ఇంద్రుఁడొక ఋషిగాఁ బెక్కుచోట్ల నుండి దశమ మండలమున వైకుంఠుఁడయ్యెను. సరమ దేవశునియైనది ఊర్వశి యచ్చరయైనది. ఇట్లే పూర్వమండలములలోని ఋషులు కొందఱు దశమమండలములో దేవతాదులుగా మాఱిరి. దీనినిబట్టి యితిహాసములు ప్రబలినకాలమందు వెలసినయనుక్రమణికలలో సూక్తద్రష్టలు కొందఱు నామసామ్యమును బట్టియు నర్థసందర్భమునుబట్టియు నయ్యాసూక్తముల యందలి విషయములను బట్టియు దేవతాదులుగాఁ బరిగణింపఁబడిరని యూహించుట యసంగతము గాదు.

మఱియు నవమమండలము ౬౬ వ, సూక్తమును పందమంది వైఖానసులు దర్శించిరనియు. అష్టమమండలము ౩౪ వ, సూక్తమును వేయిమంది వసురోచులు సందర్శించిరనియు, నవమమండలము ౮౬ వ, సూక్తమును సికతనివావరాది ఋషిగణములు నాలుగు దర్శించెననియు ననుక్రమణికలనుబట్టి తెలియవచ్చును.[1] ఇచ్చట, ఒక్కసూక్తములోని కొన్ని ఋక్కులను వందలకొలఁది వేలకొలఁదిఋషులు సందర్శించుట సంభావ్యమా యని శంకింప నక్కఱలేదు. ఆ సూక్తములను జూచిన వారొకరిద్దఱేయైనను గురుకులములలోని తత్సహవాసు లందఱును, కారయితలుగాను ప్రేరకులుగాను ననుమోదకులుగాను దత్సూక్తములఁ బాల్గొనియుండుటచేఁ దత్కర్తలనామము లా సూక్తముల నంటిరాక గణసంజ్ఞలు మాత్రమే వానితో వచ్చి యుండెననుట వాస్తవము. కావున సూక్తద్రష్ట లందఱును ప్రాచీనమహర్షులేయని విశ్వసింపనగును, వారిసంఖ్య రమారమి ౪౦౦—.[2]

అనుక్రమణికాదులనుబట్టి నామములు తెలియవచ్చిన ఋషులసంఖ్య పై విధముగా నున్నను, పేళ్లు తెలియని గణర్షులు రెండు మూఁడు సూక్తములఁ బాల్గొనియున్నట్లు వానివల్లనే తెలియవచ్చినది గావున ఋగ్వేదర్షులు సుమారు

1. చూ. ఆయా సూక్తముల భాష్యావతారికలు.

2. ఋషిసూక్తపట్టిక—మొదటి యనుబంధము చూడఁదగును.

రెండువేలమందియైన నుండియుందు రనుటకు సందేహము లేదు. పేళ్లు తెలిసిన వారిలో నిరువదినలుగురు స్త్రీ లున్నారనుటకంటె నేటి కైదువేల సంవత్సరముల క్రిందట భరతఖండమందలి నాగరికతను వేఱుగా వివరింప నక్కఱలేదు. సూక్త ర్షులను గణించిన యనుక్రమణికా కర్తలెల్ల సూక్తదర్శినులైన స్త్రీలను బ్రహ్మ వాదిను లనుపేర నొక పట్టికగాఁ బ్రత్యేకముగాఁ జూపుచు వచ్చిరనుటకంటె వారి కాలమందలి స్త్రీ విద్యాభిరుచికి మఱియొక యుదాహరణ మావశ్యకము కాదు. ఆ బ్రహ్మవాదిను లొకరో యిద్దఱో తక్కిన మండలములలోఁ గూడఁ గనవచ్చు చున్నను దశమ మండలములో నట్టివారు పదాఱుగు రుండుటచే ఋగ్వేద కాలమున వేదవిద్య క్రమముగా స్త్రీ సంఘమున నెట్లు వ్యాపించుచువచ్చినదో తెలియక పోదు. అందుకై మంత్రదర్శనమున భరతఖండ మంతకును ఖ్యాతితెచ్చిన యట్టి స్త్రీ రత్న ముల నెల్ల నొకచోఁ జేర్చి చూచి యానందింతము.[1]

రోమశ	వాగ్దేవి	జహూదేవి
లోపాముద్ర	శ్రద్ధ	సరమ
అదితి	యమి	ఊర్వశీ
అపాల	శశ్వతి	ఇషాంమాత
శిఖండిని ౧.	విశ్వవార	ఇంద్రమాతలు
శిఖండిని ౨.	శచి	సార్పరాజ్ఞి
ఘోష	సూర్య	రాత్రి
దక్షిణ	ఇంద్రాణి	గోధ

1. ఈ స్త్రీలను దెల్పు శ్లోకములు బృహద్దేవతాదులలో నీషత్పాఠ భేదములతోఁ గనఁబడుచున్నవి. భాష్యమునఁ గనవచ్చు నామములనుబట్టి యా భేదములు సవరించి యా శ్లోకము లిందు చూపితిని.

> గోధా ఘోషా విశ్వవా రాపా లేపాముద్రాత్ప కర్షికా ।
> బ్రహ్మజాయా జుహూ ర్నామ అగస్త్యస్య స్వ సాదితిః ।
> ఇంద్రాణీ చేంద్రమాతా చ సరమా రోమ శోర్వశీ ।
> లోపాముద్రా చ నద్యశ్చ యమీ నారీచ శశ్వతీ ।
> శ్రీ ర్లాక్షా సార్పరాజ్ఞీ వాక్ శ్రద్ధా మేధాచ దక్షిణా ।
> రాత్రీ సూర్యాచ సావిత్రీ బ్రహ్మవాదిన్య ఈరితాః ॥"
> అపాలోపనిషన్నిషత్ - అని పాఠా.
> భాష్యములలోనున్న కొంద ఱిందు లేరు.

వీరు ఋక్సంహితలోని బ్రహ్మవాదినులు. బ్రాహ్మణాదులలో నింక నిట్టివా రనేకు లున్నారు.

సూక్తద్రష్టలు శతర్చులు మధ్యములు క్షుద్రసూక్తులు మహాసూక్తులు నని చతుర్విధముగా నున్నారు. వారిలో :—

శతర్చులు :— ప్రథమ మండలద్రష్టలలోని - మధుచ్ఛందుఁడు - మేధాతిథి - శునశ్శేపుఁడు - హిరణ్యస్తూపుఁడు - కణ్వుఁడు - ప్రస్కణ్వుఁడు-సవ్యుఁడు-నోధసుఁడు - పరాశరుఁడు - గోతముఁడు - కుత్సుఁడు - కశ్యపుఁడు - కక్షీవంతుఁడు - పరుచ్ఛేపుఁడు - దీర్ఘతముఁడు - అగస్త్యుఁడు - అను పదునారుగురును. ఆ మండలములోని తక్కిన జేత - ఇంద్రుఁడు మొదలగువారి కీసంజ్ఞ లేదు.[1] ఒక్కొకరు నూఱేసిఋక్కులను జూచిన వారగుటచే వీరి కీ పేరు వచ్చినట్లు లక్షణములు చెప్పుచున్నవిగాని ఋక్కులసంఖ్య మాత్రమట్లు కనఁబడదు. మేధాతిథి చూచిన ఋక్కులు ౧౪౩. హిరణ్యస్తూపుఁడు కనుఁగొనినవి ౭౧. ఇట్లే వీరు ప్రత్యేకముగా దర్శించిన ఋక్కులు నూటి కెక్కువగానో లేక తక్కువగానో యున్నవి గాని నూఱేసిలేవు. అట్టియెడ వీరికి మాత్రమే యీ పేరేల వచ్చెనో, వీరివంటి తక్కిన ప్రథమమండలర్షుల కీ సంజ్ఞ యెందుకురాలేదో తెలియరాదు గాని, తొలుత వీరు చూచిన ఋక్కులు నూఱగుటయే వీరి కీ పేరు వచ్చుటకుఁ గారణమని చెప్పవచ్చును. తరువాత ఋక్కులసంఖ్య మాఱి యుండును.

మధ్యములు :— ప్రథమదశమ మండలములు గాక తక్కిన మధ్యమండలములలోని సూక్తములను దర్శించినఋషులకు మధ్యములను పేరు కలదు.

క్షుద్రసూక్తులు, మహాసూక్తులు :— దశమ మండలములో పదికంటె నెక్కువఋక్కులు గల సూక్తములను నిర్మించినవారు మహాసూక్తులనియు, పదికంటెఁ దక్కువ ఋక్కులు గల సూక్తములు నిర్మించినవారు క్షుద్రసూక్తులనియుఁ బేర్కొనఁబడిరి.

ఇట్లు ప్రత్యేకసంజ్ఞలు వడసినసూక్త ద్రష్టలలో మధ్యమసంజ్ఞ కలవారితోఁ గొందఱు మండలద్రష్టలను ఖ్యాతికిఁ బాత్రులైరి. వారినిగూర్చియు మండలముల యేర్పాటును గూర్చియు నించుక తెలిసికొందము.

1. ఋచాం శతానాం ద్రష్టృత్వా దేత ఏవ శతర్చినః ।
జేత్రా దీనాంతు త న్నాస్తి తస్మా న్నైతే శతర్చినః - బృహ.

మండలద్రష్టలు — మండలములు

ప్రథమ మండలమునను ప్రత్యేకముగా నొకఋషి ద్రష్టగాఁ బరిగణింపఁ బడియుండలేదు. అది విశ్వామిత్రపుత్రుఁడగు మధుచ్ఛందసుని సూక్తములతో నారంభమై యగస్త్యునిసూక్తములతో సమాప్తిగాంచునట్లు కూర్పఁబడినది. అందలి 191 సూక్తములును 15 గురు ఋషులపేరఁ గనఁబడును. వారిలో గోతముఁడు కశ్యపుఁ డింద్రుఁడు మొదలగు మహర్షులుగూడఁ గలరు. పెక్కండ్రు మహర్షులు దర్శించిన సూక్తములనేకము లందుండుటచేతనే దానికిఁ బ్రత్యేకద్రష్టగా నొకఋషి పేర్కొనఁబడలేదని విదితమగును.

ద్వితీయ మండలమునకు ద్రష్ట గృత్సమదుఁడు. ఈ మండలమున నతని పుత్రుఁడగు కూర్ముఁడు మూఁడుసూక్తములను, భార్గవుఁడైన సోమాహుతి నాలుగు సూక్తములను దర్శించిరి. తక్కినవన్నియు శౌనకాపరనాముఁడగు గృత్సమదుఁడే సందర్శించెను. అందుచే నతని కుమారుఁడును, శిష్యుఁడో లేక మిత్రుఁడోయైన సోమాహుతియు నిర్మించినవి కొలఁదిగా నున్నను. దీనికర్తృత్వము గృత్సమదునికిఁ జెందుట యుచితమే యగుచున్నది. ఈ మహర్షినిగూర్చి ఋషిపరంపర నుండి వచ్చిన యొకకథను, వేదార్థదీపికయను పేరఁ గాత్యాయనుని సర్వాను క్రమణికకు వృత్తి రచియించిన షడ్గురుశిష్యుఁ డీ క్రిందివిధముగా వర్ణించియుండెను.

"భరద్వాజుని కొడుకు శునహోత్రుఁడు. ఆ మహాముని కుమారుఁడు శౌనహోత్రుఁడు. ఆ మునీంద్రుఁడు యజ్ఞము చేయుచుండఁగా నతనిని సంతోష పెట్టుటకై యింద్రుఁడచ్చటికి వచ్చెను. ఇంద్రునిరాక తెలిసికొని యసురులతఁ డొకఁడే వచ్చెను బంధింపవచ్చునని తలంచి యజ్ఞశాలకు వచ్చిరి. ఇంద్రుఁడది కనిపెట్టి యజమానునివేషముతో నచ్చటినుండి తప్పించుకొని పోయెను. అపుడసురులు శౌనహోత్రుఁడే యింద్రుఁడని యూహించి యతనిఁబట్టి తీసికొని పోవుచుండిరి. అపుడాఋషి వారినిజూచి 'ఓయసురులారా! నే నింద్రుఁడను గాను, ఎవఁడు పుట్టుచునే సురలలోఁ బ్రధానుఁడయ్యెనో, ఎవఁడు మనస్విలలో నగ్రగణ్యుఁడయ్యెనో యతఁ డింద్రుఁడు. ఎవఁడు కదలిపోవుచున్న భూమిని దృఢపఱచెనో, ఎవఁడు ఱెక్కలతో నెగిరిపోవుచున్న పర్వతములను వానివాని స్థలముల నిలిపెనో యతఁ డింద్రుఁ''డనుచు, 'సజనాసఇంద్రః' అనుమకుటము గల పదునాల్గుఋక్కులతో నింద్రుని స్తుతించుచు నట్టివాఁ డింద్రుఁడు కాని నేనుగా''నని చెప్పెను. ఆ మాటలు విని వారతనిని విడిచిపెట్టి పోయిరి. పిదప నింద్రుఁడు శౌనహోత్రుని బిలిచి

"ఋషివర్యా! నీ స్తుతివాక్యముల నన్ను సంతోషపెట్టితివి కావున నీవు గృత్స మదుఁడను సంజ్ఞను బొందుము. నీ స్తుతివాక్యము లోకసూక్తముగా వెలయును. నీవు భృగుకులమున శునకమహర్షి పుత్రుఁడవై జన్మించి శౌనకుఁడను పేరఁబరఁగి యీ స్తుతిరూప సూక్తముతోఁ గూడ ద్వితీయ మండలమునకు ద్రష్టవై ఖ్యాతి గాంచుము" అని పలికెను. అనంతర మతఁడట్లే శౌనకర్షియై ఋక్సంహితలోని రెండవమండలము సందర్శించెను.''

ఈ యితిహాసము నమ్మఁదగినదేని ద్వితీయమండల ద్రష్టయైన శౌనకుఁడే ఋక్ప్రాతిశాఖ్యము, బృహద్దేవత మొదలగు గ్రంథముల కర్తయైనట్లును, అతఁడే కల్పసూత్రకర్తయగు నాశ్వలాయనునికిని, సర్వానుక్రమణికాది కర్తయగు కాత్యా యనునికిని గురువైనట్లును నమ్మవలసివచ్చును. అది యసంగతము. పాణిన్యా చార్యుల తరువాతి వాఁడయిన వరరుచి నామక కాత్యాయనునికి ఋగ్వేదద్వితీయమండల కర్తయైన శౌనకుఁడను గృత్సమదుఁడు గురువగుట యెన్నటికిని బొసఁగదు. ఋగ్వేదశౌనకుఁడు మహాభారతమున కెంతో పూర్వుఁడు బృహద్దేవతాది కర్తయగు శౌనకుఁడు మహాభారతమునకుఁ దరువాతివాఁడు.

తృతీయమండల ద్రష్ట విశ్వామిత్రుఁడు. జమదగ్ని ఘోరుఁడు మొదలగు నిద్దఱుముగ్గు రన్యగోత్రములవారు నిర్మించిన సూక్తములిందు కొలఁదిగా నున్నవి. తక్కినవన్నియు విశ్వామిత్రుఁడును అతనిపుత్రులును అతని తండ్రి తాతలును సందర్శించినవి. అయినను, ఇందలి బహుసూక్తము లతనివంశమువారికి సంబంధిం చిన వగుటచేతను, అతఁడు సప్తమహర్షులలో నొకఁడగుటచేతను, ఈ మండలము విశ్వామిత్రద్రష్ట మనెడి ప్రసిద్ధి వచ్చినది.

చతుర్థమండలము దర్శించినఋషి వామదేవుఁడని ప్రసిద్ధి. ఇందలిసూక్త ములలో నితరులు చూచినవి మూఁడు నాలుగు మాత్రమేయున్నవి. అవిసంహితా నిర్మాణకాలమున విషయసందర్భమును బట్టి యిందుచేరినవి. అందుచే నీ మండ లము వామదేవ్యమనెడి ఖ్యాతికిఁ దగియున్నది

పంచమ మండలమున కాత్రేయమని పేరు. అత్రియు నతని పుత్ర పౌత్రు లును సందర్శించిన సూక్తము లిందనేకములు. ఇతర గోత్రములవారు చూచినవి స్వల్పములు. ఈ మండలమందను క్తగోత్రుఁడైన ఋషి నాత్రేయునిగాఁ దెలిసి కొనవలెనని యనుక్రమణికలు చెప్పుచున్నవి.

షష్ఠమండలము కేవలము భారద్వాజమును కీర్తిగాంచినది. భరద్వాజుఁడు నతనిసుతులును గాక యితరులు దర్శించిన సూక్త మిందొకటియు లేదు. అందుచే నిది పరిశుద్ధముగా భరద్వాజునికే చెందుచున్నది.

సప్తమమండల ద్రష్ట వసిష్ఠుఁడు. ఇందన్ని సూక్తములును వసిష్ఠుఁడు రచియించినవే. ఒకదానిలో మాత్రమతని పుత్రులు సహాయులుగా నుండిరి. ౧౦౨ వ, సూక్తములో వసిష్ఠునితోఁగూడ నగ్నిపుత్రుఁడగు కుమారుఁడను ఋషి యున్నట్లు బృహద్దేవత చెప్పుచున్నది గాని తక్కినవానిలో నట్లు కనఁబడదు దీనినిబట్టి చూడఁగా మూఁడుఋక్కుల చిన్న సూక్తములో నన్యగోత్రుఁడయిన మఱియొక ఋషిని జేర్చిన బృహద్దేవతా మతముకంటె నతనిని విడిచిన యితరానుక్రమణికామతమేయుచితతరమగుచున్నది. సాయణులవారుకూడ నతనిని జేర్చ లేదు. అందుచేతనే యనుక్రమణికలనాఁటికే సూక్తర్షి విజ్ఞానము మందగించుచు వచ్చినదని యూహింపవలసివచ్చినది.

అష్టమమండలము. ఇందలి సూక్తము లతి కణ్వభృగ్వంగిరో మరీచ్యాది గోత్రములవారు సందర్శించినవగుటచే దీని కొకఋషి ప్రత్యేక ద్రష్టగానెందును పేర్కొనఁబడలేదు. ఇందలి సూక్తములు తొలుత ౯౨ అయినను వాలఖిల్యములు చేరినపిదప ౧౦౩ అయినవి. ఈ వాలఖిల్యములకు వీరు కర్తలని యేయనుక్రమణికయు నిరూపించియుండలేదు గాని, కాత్యాయనసర్వానుక్రమణికా భాష్య వివరణము రచియించిన జగన్నాథపండితుఁడు కణ్వపుత్రులు ప్రస్కణ్వాదులు పదిమంది యాపదునొకండు సూక్తములు రచియించినట్లు వక్కాణించియున్నాఁడు.[1] వారి నామములును వారు రచియించిన సూక్తములును, అనుబంధ పట్టికలోఁ గాంచ నగును. సాయణాచార్యులు వీనికి భాష్యము వ్రాయకపోవుటను బట్టి యీ వాలఖిల్యములు ప్రాచీన మహర్షి ప్రోక్తములు కావని తెల్లమగుచున్నది.

నవమమండలము. ఇది వైశ్వామిత్ర కాణ్వాంగిరస భారద్వాజాదు లనేకులు రచియించిన సూక్తములతో నిండియున్నది. దీనికిఁ బ్రత్యేక ద్రష్టలేఁడు. కాని ప్రాచీనులైన కశ్యపాదులిందు కొన్ని సూక్తముల ద్రష్టలుగా నున్నారు. ఇందలి పవమాన సూక్తములనుబట్టి దీనికి, పావమానమండల మనుపేరు వచ్చినది[2]. పవమాన గుణవిశిష్టుఁడగు సోముఁడిందలి సూక్తముల దేవత సోమదేవమాహా

1. చూ. బృహద్దేవత. పుట. 257 లఘుటీక.

2. పావమానం పరం హ్యేత న్నవమం మండలం పఠేత్ । ఋగ్విధానము.

త్మ్యము వర్ణించు నీ మండలమునకు సౌమ్య మండలమని యుఁ బేరుకలదు. ఇది కేవలము సోమయాగమునకుఁ జెందినది.

దశమమండలము. — ఇది ద్వితీయాది మండలములకంటె మిక్కిలి పెద్దది. ఇందలి సూక్తర్షులను బహుసంఖ్యాకులు. దీనికిని ప్రత్యేక ద్రష్టగాఁ బేరుపొందిన ఋషి యొకఁడు లేఁడు. కాని పూర్వమండలములలోని మహర్షులు పెక్కండ్రు రచించిన సూక్తములిందును గలవు. ఈ మండలము మిక్కిలి యర్వాచీనమని కొందఱి యభిప్రాయము. ఇందర్వాచీన ఋషులు దర్శించిన సూక్తములు కొన్ని యున్నంతమాత్రమున నిది యంతయుఁ దరువాత బయలు వెడలినదేయని చెప్పుటకు వీలుగాకున్నది. ఋషుల గోత్రములనుబట్టి చూచినచో నన్నిటియందును, అర్వాచీనర్షులు రచించిన సూక్తములు గనవచ్చును, అన్నిటియందును ప్రాచీనర్షులు సందర్శించినవి కనఁబడును. విషయములనుబట్టి చూచినను, అట్టి సామ్యము కనరాకపోదు. అట్టియెడ నిదియే యర్వాచీనమని యెట్లు చెప్పనగును ? మఱియు సూక్తముల కాలక్రమమునుబట్టి మండలము లేర్పడలేదని తెలియుచుండఁగా నిది ప్రాచీనమిది యర్వాచీనమని యెట్లు నిర్ణయింపనగును ? తత్త్వమరయఁగా ఋక్సంహితయంతయు సప్తమహర్షి కుటుంబములకును మఱి మూఁడు నాలుగితర మహర్షి వంశములకును సంబంధించినట్లు కనఁబడుచున్నది. ఇపుడు సంహితలోఁగనవచ్చు మండలములనుబట్టి చూచినచోఁ దత్కర్తల పౌర్వాపర్యము ముందువెనకలై బహువిధముగాఁ గనిపించును జూడుఁడు.

కశ్యపుడు - అత్రి - భరద్వాజుఁడు విశ్వామిత్రుఁడు - గోతముఁడు - జమదగ్ని - వసిష్ఠుఁడు-అనువారు సప్తమహర్షులుగా ఋక్సంహితలోఁ గనవచ్చుచున్నారు. వీరివంశములవా రే యే మండలములతో సంబంధించియుండిరో ముందు తెలిసికొందాము.

అంగిరో మహర్షివంశ మనేకశాఖము. అందొక శాఖకు మూల పురుషుఁడగు బృహస్పతి కుమారుఁడు భరద్వాజుఁడు సప్తర్షులలోనివాఁడు. సపుత్రుఁడైనయా మహర్షి షష్ఠమండలద్రష్ట. ఆ భరద్వాజుని పౌత్రుఁడును శునహోత్రుని పుత్రుఁడు నగు గృత్సమదుఁడు ద్వితీయమండల ద్రష్ట. అంగిరసుఁడైన యితఁడే శౌనకుఁడను పేరభార్గవుఁడయ్యెనఁట. అందుచే నీ ఋషి రెండు గోత్రములకుఁ జెందినవాఁడయ్యెను. రహూగణపుత్రుఁడు గోతముఁడు. ఇతఁడు సప్తర్షులలోనివాఁడు. ఇతనికుమారుఁడు గౌతముఁడైన వామదేవుఁడు చతుర్థమండల ద్రష్ట. ఇషీరథ పుత్రుఁడు కుశికుఁడు. అతనికొడుకు గాథి. అతని కుమారుఁడు విశ్వామిత్రుఁడు.

ఇతఁడు సప్తర్షులలోనివాఁడు. తండ్రి తాతలతోను, పుత్రులతోను గూడిన యీ విశ్వామిత్రుఁడు తృతీయమండల ద్రష్ట. భౌమవంశములోని వాఁడత్రి మహర్షి. ఇతఁడు సప్తర్షులలోనివాఁడు. సపుత్రుఁడైన యీ యత్రిమహర్షి పంచమ మండల ద్రష్ట. మిత్రావరుణపుత్రుఁడు వసిష్ఠుఁడు సప్తర్షులలోనివాఁడు. సపుత్రుఁడైన యితఁడు సప్తమమండల ద్రష్ట. మఱియు, అంగిరో వంశములో మఱియొక శాఖకు మూలపురుషుఁడైన ఘోరమహర్షి పుత్రుఁడగు కణ్వుని సంతతివారును ఆంగిరసులును; గోతముఁడు నతని సంతతివారును; సప్తర్షులలోనివాఁడును మరీచి పుత్రుఁడగు కశ్యపుఁడును; వసిష్ఠపౌత్రుఁడగు పరాశరుఁడును, వృషగిరో వంశములోని యంబరీషాది రాజర్షులును; ఇంద్రాగస్త్యదీర్ఘతమః కక్షీవంతులును; విశ్వామిత్ర పుత్రులును మొదలగువారు ప్రథమ మండల సూక్తద్రష్టలుగానున్నారు. కశ్యపుఁడు నతనివారును, వరుణపౌత్రుఁడు భృగుపుత్రుఁడునై సప్తర్షులలోనివాఁడగు జమదగ్నియు, అత్రిభరద్వాజ విశ్వామిత్రగోతమ వసిష్ఠాదులతోఁబాటుగా నవమ మండల సూక్తద్రష్టలుగా నున్నారు. అష్టమ మండల మెక్కువగా నాంగిరసులకు నాంగిరసులైన కాణ్వులకును సంబంధించి యున్నది. తక్కువగాఁ గశ్యపాత్రి భరద్వాజ వసిష్ఠజమదగ్ని వంశములకు జెందియున్నది. దశమ మండలమున నదితియుఁ దత్పుత్రుఁడగు వివస్వంతుఁడు నతనివంశము వారగు యమ యమ పుత్రాదులును కశ్యపాదిసప్తర్షులును తద్వంశములవారును మఱికొందఱితరగోత్రములవారును సూక్తద్రష్టలుగాఁ గనవచ్చుచున్నారు. ఇందొక్క విశేషము కశ్యపాది సప్తమహర్షులును గలిసి సందర్శించిన సూక్తమొకటి నవమ మండలమందును మఱియొకటి దశమ మండలమందును గనవచ్చు చున్నవి. ఈ వివరణమునుబట్టి సప్తర్షి సంబంధములేని మండలము లేదని స్పష్టపడుచున్నది గావున దశమండలములోను ప్రాచీనమహర్షి సూక్తములు కొన్నికొన్ని కలవనియు, నవియు నవీనములును గలిసియే యజ్ఞకర్మలయందు హోత్రోపయోగార్థముండున ట్లొక క్రమము ననుసరించి సంహితారూపము దాల్చినవనియుఁ దెలియనగును.

మండలముల యేర్పాటు

మండలము లొక్కొక్కమహర్షి కుటుంబములోని వారు దర్శించిన వగుటచే నవి యట్లే నిలచినవి. అందలిసూక్తముల విషయములకు సంబంధించిన యితరర్షుల సూక్తములుకూడఁ గొన్ని యందందు ప్రవేశించినవి. తక్కిన నాల్గును మధ్యమండలములకు సంబంధించునట్లుగా వివిధయాగ క్రియోపయోగమున కనుగుణముగాఁ గూర్పఁబడినవి. ద్వితీయాదిమండల ద్రష్టలయితర సూక్తములిందు

సందర్భోచితముగాఁ బ్రవేశించినవి. దీనినిబట్టి సూక్తములన్నియు యజ్ఞక్రియార్థము లనెడి భావమును, తదనుగుణమైన క్రియాచరణమును బ్రబలిన కాలమున నీ మండలముల యేర్పాటు జరిగియుండుననుట విదితము. కావుననే మధుచ్ఛందసుని సూక్తములు ప్రథమమండలము మొట్టమొదట నుండుటయు నతని ముత్తాతయగు కుశికుని సూక్తము మూఁడవమండలము కడపటి భాగములోని దగుటయు సమర్థ నీయము లగుచున్నవి. సప్తర్షులును వారి పిత్రాదులగు పూర్వులును దర్శించిన సూక్తము లొక్కొక్కచో నుండక విషయమునుబట్టి యన్ని మండలములలో నందందుండుట కూడ సముచిత మగుచున్నది. వివిధకాలములలోనివగు పూర్వ సూక్తములను దరువాతిమును లొకక్రమ మేర్పఱిచి కూర్చి రనుటకు సంహితలోనే కొన్ని నిదర్శనములు కనఁబడుచున్నవి.

అష్టమనవమ మండలములఁదప్పఁ దక్కిన మండలముల మొదట నగ్నీంద్ర స్తుతిపరము లయినయనువాకములు కూర్పఁబడినవి. ఆ యేర్పాటొక యభిప్రాయ ముతోఁ జేసినట్లు కనవచ్చును జూడుఁడు.

ప్ర. మం.	అనువా —	౧. అగ్నిస్తుతి.	ష. మం.	అనువా —	౧. అగ్ని.
,,	,,	౨-౩. ఇంద్ర.	,,	,,	౨. ఇంద్ర.
ద్వి. మం.	,,	౧. అగ్ని.	స. మం.	,,	౧. అగ్ని.
,,	,,	౨. ఇంద్ర.	,,	,,	౨. ఇంద్ర.
తృ. మం.	,,	౧-౨. అగ్ని.	ద. మం.	,,	౧. అగ్ని.
,,	,,	౩-౪. ఇంద్ర.	అ. మం.	,,	౧. ఇంద్ర.
చ. మం.	,,	౧. అగ్ని.	స. మం.	,,	౧. ఇంద్ర.
,,	,,	౨-౩. ఇంద్ర.			
పం. మం	,,	౧. అగ్ని.			
,,	,,	౨. ఇంద్ర			

ఇందు కొన్ని యనువాకములు పూర్తిగా నగ్నీంద్రస్తుతి పరములుకాక పోయినను, వారిస్తుతితోనే ప్రారంభింపఁబడి యున్నవి. అష్టమనవమ మండలముల ప్రథమ సూక్తములు క్రమముగాఁ బ్రగాథ సోమసూక్తములను పేళ్లుగలవి. అవియు నింద్రారాధ నోద్దిష్టములుగానే యున్నవి. ఇట్లు మండల ప్రథమ భాగము లొక్కరీతి నుండుట యర్వాచీనముని కృతముగాక సహజ మనఁదగునా ? మఱియు:—

సూక్తములలో, ఆప్రీసంజ్ఞ కలవి పది యున్నవి. అందొక్కొక్క సూక్తమున ౧౧ ఋక్కులచొప్పున నుండునుగాని, ఒకదానిలో ౧౨ మఱియొక

దానిలో ౧౩ ఋక్కులు కనఁబడుచున్నవి. ఆ ఋక్కులు, ఇధ్మాగ్ని లేక సమిద్ధాగ్ని - తనూనపాదగ్ని - నరాశంసాగ్ని ఇడగ్ని - బర్హిరగ్ని - యజ్ఞశాలా ద్వారాభిమాన్యగ్నులు - ఉషోనక్త దేవతాగ్నులు - దైవ్యహోతృక నామకాగ్నులు - ఇళా సరస్వతీ భారతీ సంజ్ఞకాగ్నులు - త్వష్టృనామకాగ్ని - వనస్పత్యగ్ని - స్వాహాకృత్యగ్ని - అను ద్వాదశవిధరూపములతో నున్నయగ్ని దేవుని స్తుతించు నవిగా నున్నవి. వేఱువేఱు ఋషులు సందర్శించిన యాసూక్తములు ౪, ౬, ౮ మండలములలోఁ దప్పఁ దక్కిన మండలములలో, తత్తత్కృతు విశేషస్తుత్యర్థ ములుగాఁ గూర్పఁబడినవి ఆ క్రమ మిది:—

మం.	సూక్త.	ఋక్కు.	ఋషి.	మ	సూక్త	ఋక్కు.	ఋషి
౧.	౧౩	౧౨	మేధాతిథి	౫	౫	౧౧	వసుశ్రుతుఁడు.
౧.	౧౪౨	౧౩	దీర్ఘతముఁడు	౭	౨	౧౧	వసిష్ఠుఁడు
౧.	౧౮౮	౧౧	అగస్త్యుఁడు.	౯	౫	౧౧	అసితుఁడు.
౨.	౩	౧౧	గృత్సమదుఁడు	౧౦	౭౦	౧౧	సుమిత్రుఁడు.
౩.	౪	౧౧	విశ్వామిత్రుఁడు.	౧౦	౧౧౦.	౧౧	జమదగ్ని.

వీనిలో మొదటి రెండుసూక్తలయందలి పన్నెండేసి ఋక్కులును ద్వాదశ విధాగ్నిస్తుతి పరములు. రెండవదానిలోఁ గడపటిది యింద్రస్తుతిపరము. తక్కిన వానిలో ౩-౫-౮-౧౦ సూక్తములలో నరాశంసాగ్నిస్తుతి లేదు. ౪-౬-౭-౯ సూక్త ములలో, తనూనపాదగ్నిస్తుతి లేదు. ఇంతే భేదము. తక్కిన వివిధ రూపాగ్ని స్తుతి యన్నిటియందు సమానముగా నున్నది.

ఈ యాప్రీసూక్తములు పదియును బది ఋషికుటుంబములకును సంబంధించి యున్నవి. ఆ కుటుంబముల ప్రధానమహర్షులు - కణ్వుఁడు - అంగిరస్సు - అగస్త్యుఁడు - శునకుఁడు - విశ్వామిత్రుఁడు - అత్రి - వసిష్ఠుఁడు - కశ్యపుఁడు - వధ్ర్యశ్వుఁడు - జమదగ్ని - అనువారు. ఆ ప్రీసూక్త కర్తలలో జమదగ్ని వసిష్ఠ విశ్వామిత్రులు గాక తక్కినవారు పై ప్రధానమహర్షుల వంశములలోని వారని ఋషుల పట్టికవలనఁ దెలియఁగలదు ఇంక నిట్టినిదర్శనములు కొన్ని కలవు కాని, పై విషయములనుబట్టి చక్కఁగా నాలోచించినచో మండలములు సహజముగానే యిట్లేర్పడియుండలే దనియు నర్వాచీనులు వాని నిట్లు సంతరించి యుందురనియుఁ దెలియకపోదు. ఇట్లు సమకూర్పఁబడిన మండలములలో, నందును గడపటి మండలములలోఁ గొన్ని యర్వాచీన సూక్తములు గూడఁ జేరియున్న వనవచ్చును

గాని, తరువాత బయలుదేఱిన యితిహాసముల నాధారముగాఁ జేసికొని, ప్రాచీ నార్వాచీన మహర్షుల నామము లొకటిగాఁ గనవచ్చినంత మాత్రమున నితఁడే యతఁడని భ్రాంతిపడి సూక్తముల పౌర్వాపర్యము నిర్ణయించుటమాత్ర ముచితము కాదనవలెను. ఇందుకు గృత్సమదుని యితిహాస మొకదృష్టాంతము. భారద్వాజ గోత్రుఁడు శునహోత్రపుత్రుఁడు నయినగృత్సమదుని భృగుకులమున జన్మింపఁ జేసి యతనికి శౌనకుఁడనుపేరు కల్పించి యీ శౌనకుఁడే ద్వితీయమండల ద్రష్ట యైనట్లు వర్ణించునొక యితిహాసముమబట్టి బృహద్దేవతాది లక్షణకర్తయగు శౌన కుఁడే ద్వితీయమండల సూక్తకర్తయైనట్లు తలంచుట యుచితమా? ఇట్లనుటచే ఋక్సంహితలో నర్వాచీన సూక్తములు లేవని నా యభిప్రాయము కాదు. కొన్ని యున్నవి. అవి యైనను బ్రాహ్మణములకుఁ బూర్వములు కాని పరములు కావనియు ఋషులమహత్త్వము దెల్పఁ దరువాతి వారెవరో కల్పించిన కథలనుబట్టి పౌర్వాపర్య మును దేల్చుట సరిగాదనియుఁ దలంపనగును. ఇందుకు వైదికర్షుల యితిహాస ములుగూడఁ గొన్ని చవిచూతము.

ఋషుల యితిహాసములు

౧. శ్యావాశ్వునికథ :— "పూర్వకాలమందు దార్భ్యుఁడైన రథవీతియను రాజు కలఁడు. అతఁడు యజ్ఞము చేయఁబూని, అత్రిమహర్షి పుత్రుఁడైన 'అర్చ నాను'డను ఋషి నార్త్విజ్యము చేయఁ బ్రార్థించెను. అతఁడు దాని కంగీకరించి శ్యావాశ్వుఁడను తనపుత్రుని వెంటబెట్టుకొనివెళ్లి యజ్ఞము జరిగించుచుండెను. అంత నొకసమయమున రథవీతికూఁతురు సర్వలక్షణ సంపూర్ణయగు కన్యయజ్ఞశాలకు వచ్చి తండ్రివద్దఁ గూరుచుండెను. అత్రిపుత్రుఁడా పిల్లను జూచి, ఇది నాకోడ లయిన బాగుండునని తలఁచి 'రాజా! ఈ కన్యను నా సుతుని కిచ్చి పెండ్లి చేయు' మని కోరెను. అతఁడందు కిష్టపడియు, తనభార్య యేమిచెప్పునోయని యామె నడిగెను ఋషి (మంత్రద్రష్ట) కానివానికి మనమింతకు మున్ను పిల్ల నిచ్చియుండ లేదని యామె బదులుచెప్పెను. రాజామాట విని, యవును నిజమేయని, అనృషికి మేము కన్యనివ్వమని యాత్రేయునితోఁ జెప్పెను. శ్యావాశ్వుఁడామాట విని నిరా శుఁడై వెడలి బ్రహ్మచర్యరతుఁడై శాంతుఁడై మహాతప స్సొనరించుచు నొకనాఁడు భిక్షార్థమై తరంతమరాజు గృహమున కేగి యతని పత్నియుఁ బరమసాధ్వియునగు శశీయసియను పట్టమహిషిని భిక్షవేఁడెను. ఆమెయుఁ దపశ్శాలి వచ్చినందు కానందించి యావార్త భర్తతోఁ జెప్పెను. అతఁడును సంతోషించి యీ మునీం ద్రుని బూజింపుమని నుడివెను. అంత శశీయసి గోశతములు నాభరణములు

నతనికిని దానముచేసెను. అంతలో రాజు వచ్చియతనికి ధనమిచ్చి సత్కరించి తన సోదరుఁడగు పురుమీళ్హునివద్దకుఁ కూడ వెడలి యతనిసత్కారము లందుకొనుమనిచెప్పి పంపెను. శ్యావాశ్వుఁడు నట్లేయని పయనమై పోవుచు మార్గమధ్యమునకుఁ దన్నుఁ జూడఁదలఁచి వచ్చిన సమాన దివ్యరూపులగు మరుద్దేవతలను సందర్శించి ప్రాంజలియై మ్రొక్కి యర్థవంతములగు సుత్తమవాక్కులతో వారిని స్తుతించెను. ఆ స్తుతివాక్యములకు వారు సంతోషించిరి. వానిచేతనే శ్యావాశ్వుఁడును సూక్తద్రష్టయైన ఋషి యయ్యెను. అంత మరుత్తులు శ్యావాశ్వునికి సువర్ణమిచ్చి వెడలిపోయిరి.

పిదప శ్యావాశ్వుఁడు తనకు లభించిన ఋషి భావమునకును ధనకనకాది లాభమునకును హృష్టుఁడై పితృగృహమునకుఁ దరలిపోయి "నేను ఋషి నయితిని గదా! రథవీతికన్యను బరిణయమాడ నర్హత కలిగినది" అని తలంచి యా రాజపుత్రిని మనసార ధ్యానించుచు మనోరథావేశమున నొకరాత్రి, రథవీతితో 'నాఋషి భావము తెలుపుము'ని రాత్రి దేవిని దూత్యమొనరింప వేఁడుకొనెను ఆ రాత్రి దేవియు నట్లొనరించెను. రథవీతియు శ్యావాశ్వుని యార్షమును విని తనకన్యను వెంటబెట్టుని యర్చనానసుని యింటికివచ్చి మున్ను మీ కోరికను నిరాకరించినందుకు క్షమింపుమని యతనిఁ బ్రార్థించి, 'నీ పుత్రుఁడు వేదపితయై ఋషి యయ్యెను. నీవు ఋషిజనకుఁడ వైతివి. నీ సంబంధ మవశ్యవాంఛనీయ మయ్యెను' అని పలిక శ్యావాశ్వునికిఁ దనకూఁతురినిచ్చి మహావైభవముతో నుద్వాహము జరిగించి యా నూతనదంపతులకు ధనకనక వస్తువాహనము లరణమిచ్చి తానరణ్యమునకుఁ బోయి తపోనిష్ఠ నుండెను." ఆ సందర్భమున శ్యావాశ్వునినోట వెలువడినవాక్యము లన్నియు ఋక్కులై ఋగ్వేదపంచమ మండలమున ౬౧, ౬౨ సూక్తములుగా వెలయుచున్నవి.

౨. వామదేవునికథ.—మాతృగర్భముననున్న వామదేవుఁడు పెరిఁగి జ్ఞానసంపన్నుఁడై "నేను గర్భము ప్రక్కనుండి బయటఁబడుదునుగాని యోని మార్గమున బయటికిఁ బోవువాఁడనుగాను" అని యాలోచించుకొనుచుండెను. ఆయాలోచన మతనితల్లి తెలిసికొని శాంతికై, ఇంద్రుని- అతని తల్లియగు నదితిని ధ్యానించెను. వారును సత్వరముగ నామె యాశ్రమమునకు వచ్చిరి. అపుడింద్రుఁడు గర్భస్థుని సంబోధించి 'ఓయీ! యోనిమార్గమున దేవతలందఱు జన్మించిరి. అట్టియెడ మనుష్యులట్లే పుట్టిరని చెప్పవలెనా? చిరకాల గర్భవాసమున నీతల్లి కషాయము కలిగింపక సహజమార్గమున రమ్మని పలికెను. అపుడు

గర్భస్థుఁడు "ఇంద్రా! నీవు చెప్పినది స్వాభావికమేయైనను, ఆ మార్గము మిక్కిలి దుఃఖకరము కావున నేనట్లు రాను. నాతల్లి కపాయము కలిగింపవద్దని నీవు నాకు బోధించితివి గాని, అనేక సంవత్సరములు నీతల్లి నిన్ను గర్భమున ధరింపలేదా? అపుడు నీవామెకుఁ గ్లేశము గలిగింపలేదా? అని బదులు చెప్పెను. అంత నదితి యతనిని వారించి 'కుమారా! ఇంద్రునిసాటి యే దేవతలకును రారు. అతఁడు చేసిన మహాకార్యములే యతని మహత్త్వమును దెల్పుననుచు నింద్రుని కృత్యములు కొన్ని చెప్పెను. అపుడు వామదేవుఁడు దౌర్గత్యశాంతిని గోరుచుఁ బలికెను.

ఇత్యాదిగనున్న వారి సంవాదమే చతుర్థమండలమున ౧౮-వ, సూక్తముగా నున్నది.

౩ గోతముని కథ.—ఇతఁడొక యాశ్రమమున ఘోరతపస్సొనరించుచు నొకనాఁడు మిక్కిలి పిపాసార్దితుఁడై మరుత్తులను ధ్యానించి జలమిమ్మని కోరెను. వారును దగ్గఱనే యున్నకూపము నచ్చటికిఁదెచ్చి యొకచోట స్థాపించి యుదకలి జలముచే నా ఋషిని సంతృప్తుని గావించిరి. దానిచే నతఁడు వేదదేటి యామరు త్తులను స్తుతించి మఱియుఁ దనకు ధనధాన్యపుత్రాదిసంపద గలిగింపుఁడని వేఁడు కొనెను. ఈ కథ ప్రథమ మండలము ౮౫-వ, సూక్తములోఁ గొన్ని ఋక్కులందు గలదు.

౪ అత్రికథ:— అత్రిమహర్షి తనయాశ్రమమునఁ దపస్సు చేసికొను చుండఁగా రాక్షసులు వచ్చి యతనిని మంటలోఁ బడఁద్రోసిరి. అతఁడా వేఁడిమికి సహింపలేక శైత్యముఖము గలిగింపుఁడని యశ్విదేవతలను స్తుతించెను. వారా స్తోత్రమునఁ బరితుష్టులై యగ్నిజ్వాలలబాధ కలుగకుండ నతనిని రక్షించిరి. అత్రి గావించిన యశ్విదేవతాస్తుతియే ప్రథమ మండలమున ౧౧౦ వ, సూక్తమనునది.

౫. భుజ్యునికథ:— అశ్విదేవతలకు మిత్రుఁడైన తుగ్రుఁడను పేరుగల రాజర్షి యొకఁడుండెను. ద్వీపాంతర వాసులతని యెడవైరము వహించి యక స్మాత్తుగా వచ్చి తుగ్రునికి నతనివారికిని బాధ కలిగించి పోవుచుండిరి. వారిని జయించినఁ గాని యీ పీడతప్పదని తలఁచి యతఁడు తగినసేనతోఁ గూడఁ దన పుత్రుఁడయిన భుజ్యుని వారిని గెలిచి వచ్చుటకై నావమీఁద ద్వీపాంతరమునకుఁ బంపెను. సేనాయుతుఁడగు భుజ్యుఁడు నావ యెక్కి సముద్రమునఁ జాలదూరము వెళ్లినపిదపఁ బెద్దగాలి దెబ్బవలన నతనినావ పగిలిపోయెను. అంతట భుజ్యుఁడు ధైర్యము వహించి నిశ్చలచిత్తతతో నశ్విదేవతలను స్తుతించెను. దానికి వారు

సంతుష్టులై నావలెక్కివచ్చి సైనికులతోఁగూడ భుజ్యుని దమనావలమీఁద నెక్కించు కొని మూఁ డహోరాత్రములు గడచునప్పటికి నొడ్డుచేర్చి తుగ్రుని యొద్దకుఁ గొంపోయి యతని కప్పగించిరి:— ఈ స్తుతి ప్రథమ మండలము ౧౧౬ వ, సూక్తమునఁ గనవచ్చును.

౬. దీర్ఘతముని కథ :— ఉచథ్యుఁడు బృహస్పతియనను నిద్దఱు ఋషు లొకయాశ్రమమున నివసించుచుండిరి. వారిలో నుచథ్యుని భార్యయైన మమతాదేవి గర్భవతియై యుండఁగా నొకనాఁ డాముని యింటలేని సమయమున బృహస్పతి యామెను మఱొకచోటికిఁ గొంపోయి యామెతోఁ గ్రీడింపఁజొచ్చెను. అపుడు గర్భస్థుఁడైన శిశువు 'ఓ మునీ! నేను గర్భమం దింతకు మున్నే యున్నాను. రేతస్సాంకర్యము గావింపకుము' అని వారించెను. అంత బృహస్పతి క్రీడా నివృత్తుఁడై కినిసి "ఓ గర్భస్థా! క్రీడాభంగము గావించితివి గావున నీవు జాత్యం ధుఁడవు క''మ్మని శపించెను.

అనంతరము మమత శిశువును గనెను. పుట్టుగ్రుడ్డియైన యా శిశువే దీర్ఘ తముఁడు. అతఁడు దృష్టిలేమికి వగచి, అగ్నిదేవుని బ్రార్థించెను. అగ్నియు నా బాలునిస్తుతికి మెచ్చి దృష్టి నిచ్చెను. (౧ మం. ౧౪౭. సూ) ఈ దీర్ఘతముని గూర్చి యనేక కథ లీ మండలమునఁ గనవచ్చును.

౭. వృశునికథ :— ఇక్ష్వాకు వంశపురాజయిన త్రివృష్ణుని పుత్రుఁడు త్ర్యరుణుఁడు అతని పురోహితుఁడు జననామక మహర్షి కుమారుఁడు వృశుఁడు. రాజసంరక్షణార్థము పురోహితులు రథమునడపుట యా రాజవంశమందలి యాచా రము. దానినిబట్టి యొకనాఁడు త్ర్యరుణుఁడు రథారూఢుఁడై యెక్కడికో బయలు దేఱ వృశుఁడు గుఱ్ఱముల పగ్గములుచేఁ బూని రథము నడపుచుండెను. అరదము కొంతదూరము పోవునప్పటికి మార్గమధ్యమున నొక బ్రాహ్మణ బాలుఁడు దానిక్రిందఁ బడి మృతినొందెను. వృశుఁడు వెంటనే రథ మాఁపి యా బాలు నీవలికిఁ దీసి 'రాజా! బ్రాహ్మణకుమారుని జంపితివి గదా!' యనెను. నీ పిపిల్లవానిమీఁద రథము నడపి నేను జంపితి ననెద వేల 'యని రాజనెను. 'నీవు రథస్వామివి గావున నీవే ఘాతుకుఁడ' వని వృశుఁడన, 'నీవు రథచోదకుఁడవు గావున నీవే ఘాతుకుఁడ'వని మరల రాజనెను. ఇట్లు 'నీ వంటే నీ' వని వారిద్దఱు వివాదపడి పెద్దరాజునొద్దకు వెళ్ళిరి. అతఁడు జరిగిన సంగతి విని, రథము తోలినవాఁడే ఘాతకుఁడని తీర్పు చెప్పెను. అది విని వృశుఁడు తనపైఁ బడినదోషము పరి హరించుకొనఁ దలఁచి, ఋగాత్మకసామమున గానమొనరించి యా విప్ర బాలుని

బ్రతికించెను. దానిచే నా పిల్లవాని తల్లి దండ్రులు పితరులు నానందించిరి. అంత వృశుఁడు ' ఈ రాజులు నాపై దోషమారోపించిరి. గావున వీరియిండ్లలో నగ్ని ప్రజ్వరిల్ల కుండుఁగాక యని మనస్సులోనే శపించి వెడలిపోయెను.

ఐక్ష్వాకుల గృహములలో నిప్పు రాఁజలేదు. వంటలు లేవు. భోజనములు లేవు. రాచనగరిలో గోల పుట్టినది. పెద్దలకుఁ దెలిసినది. వారందఱు కలసి యాలోచించి బ్రాహ్మణశాపమే యిందుకుఁ గారణమని నిశ్చయించి వృశునిబిలిపించి క్షమింపుమని ప్రార్థించిరి. అపుడాఋషి మఱియొకసామమున గానము చేసెను. యథాపూర్వముగా రాజగృహములలో నగ్ని ప్రజ్వరిల్లెను. (ఇది ౫ మం. ౨-వ, సూక్తమందున్నది) ఈ కథ శాట్యాయన బ్రాహ్మణమున శ్లోకరూపమునను న్నది

౮. అపాలకథ :— అపాలయను నామె యత్రిమహర్షి కూఁతురు. బ్రహ్మవాదిని. దైవికముగా నామె చర్మరోగముపాలైనది. అందుచే భర్తచే విడువఁబడిన యాతన్వి తండ్రియింటనే వసియించుచుఁ జర్మరోగనివారణార్థ మింద్రుని గూర్చి తపస్సు చేయ నారంభించెను. ఒకనాఁడాయువతి, 'ఇంద్రునికి సోమ మిష్టముగదా' దానిని సంపాదించి యతనికి సమర్పించెద'నని తలఁచి నదీతీరమునకుఁ బోయి యందందు సోమలతకై వెదకి యెందును గానక, యేటిలో స్నానము చేసి వచ్చుచుండఁగా దారిలో నొకచోట సోమలత కంటఁబడెను, సంతోషముతో దానిముక్క యొకటిగైకొని యింటికివచ్చుచు నాముక్కనోటఁ బెట్టుకొనికొఱికెను. ఆ చప్పుడు యజ్ఞము కొఱకు ఱాళ్లతో సోమలత చితుకఁగొట్టిన చప్పుడువలె విన వచ్చుటచే నింద్రుఁ డచ్చటికి సిద్ధమై 'యిక్కడ గ్రావములతో సోమలత నణఁగఁ గొట్టి రసము తీయుచున్నారా'యని యామె నడిగెను. అందు కపాల 'లేదు లేదు. ఒకకన్య స్నానము చేసి వచ్చుచు దారిలో దొరికిన సోమమును, కొఱికి నములు చున్నది. ఆ చప్పుడు నీకట్లు వినిపించినది కాఁబోలు'నని బదులుచెప్పెను. ఆ మాటవిని యింద్రుఁడు మరలి పోవుచుండఁగా నామె "ఏమి! తిరిగి పోయెద వేల? నీ వింటింటికి సోమమునకుఁ దిరుగువాఁడవుగా నున్నావు. ఇపుడు నా పండ్లతోఁ దిండినసోమరసము త్రాగి పొమ్ము" అని పలుకుచు, నతఁడింద్రుఁడని యపుడు గ్రహించి "అయ్యా! నీ వింద్రుఁడవని మొదట గ్రహింపలేక పోయితిని. నీవు మాయింటికి రమ్ము. బహుమాన మొనరింతునని ప్రార్థించి, యతఁడు తిరిగి సమీపించినంతనే 'ఓ సోమమా! ముందు మెల్లగాను బిదప వడిగాను నీ వింద్రునిగూర్చి స్రవింపు' మని నోటిలోనున్న సోమమును గోరెను. అపుడింద్రుఁ డామెను గామించి యామెనోటిలో నోరుపెట్టి సోమము పానముచేసెను. అపుడపాల 'చర్మదోషమున

నేను భర్తచే విడువఁబడియు నింద్రునిచే నాదరింపఁ బడితి' నని పలికెను. ఆ మాట విని యింద్రుఁడు 'నీ కేమి కావలెనో కోరుకొను' మన, నామె "నా తండ్రి బట్టతల మీఁద శిరోజములు మొలవవలెను. నా జనకుని యూషరక్షేత్రము ఫలవంతము కావలెను. నా చర్మరోగము పోవలెను' అని మూఁడు కోరికలు కోరెను. అందు కింద్రుఁడు "నీ మొదటికోరికలు ఫలించును. నీ శరీరము సుప్రకాశమగునట్లు చేయుదును" అని చెప్పి, యపాలను రథచక్ర రంధ్రమునఁ బెట్టి మూఁడు సార్లు గిరగిరఁద్రిప్పెను. దానిచే నా యాత్రేయి దేహము సూర్యసదృశమై ప్రకాశింప జొచ్చెను" (మం. ౮. సూ-౯౧.)

ఇట్లిన్ని మండలములలోను బహువిధములైన యితిహాసము లసంఖ్యముగా నున్నవి. వీనినిబట్టి చూడఁగాఁ బూర్వకాలమున ఋషులు సంతోష సమయమునఁ గాని యాపత్సమయమునఁ గాని దేవతలను దమ మేలుకొఱకుఁ బ్రార్థించునపుడు గాని యితరుల నేదయినఁ గోరునపుడు గాని ప్రకృతివైచిత్ర్యములను గన్నులారఁ జూచినపుడు గాని తన్మయతఁజెంది కావించిన ఋగాత్మకములైన వర్ణనములే సూక్తములైనవనియు నట్టివి యజ్ఞార్థములై తత్తదృషిదృష్టములైన సూక్తములతో సందర్భోచితముగా నయ్యామండలములఁ గూర్పఁబడిన వనియు గ్రహింపఁదగును. మఱియు నిట్టికథలలో నేవో కొన్ని విశ్వసనీయములుగా నున్నను, అవిశ్వసనీయములు నచింతనీయములు నత్యద్భుతములునగు కథలే యపరిచితముగాఁ గనవచ్చుటచేఁ దరువాత బయలుదేఱిన యైతిహాసికులు, సూక్తములందును గొన్ని ఋక్కులందును గనవచ్చు చిన్న చిన్న కథా బీజములను మెల్లగా మొలకెత్తించి పూర్వర్షుల యితిహాసములుగా నాటక్యాకాదులందు వర్ణించిరని గ్రహింపఁదగును గాని, యింగుగొన్ని యసంగతవిషయము లున్నను, అవియే యా ఋషుల చరిత్రములని మాత్రము విశ్వసింపరాదు. ఇఁకనో, ఋషులుగూడ నసంగత విషయములతోడి కొన్ని యితిహాసములను సూక్తములందు వర్ణించినట్లు కనఁబడుచున్నను, ఐహికాముష్మికజ్ఞానములను బోధింపఁ బ్రవృత్తము లయినట్టి వానియందలి భావము మాత్రము మనకు గ్రాహ్యము గాని వాని సత్యాసత్య సత్యత్వవిచారణ యావశ్యము గాదనుట స్పష్టము కావున నిఁక నీ విషయమిట్లుంచి దేవతలనుగూర్చి కూడఁగొంత విచారణ చేయుదము.

ఋగ్వేద దేవతలు

ఏ ఋక్కు లెవరిని బ్రతిపాదించునో లేక స్తుతించునో లేక యాహ్వానించునో, వారు వానికి దేవత లనెడి యనుక్రమణికా నియమమునుబట్టి దేవతల

సంఖ్య కొన్ని వంద లుండునుగాని యట్టివా రందఱు నతి మానుషలక్షణ లక్షితు లైన దివ్యులు కారు. కొన్ని ఋకు లకుఁ దత్కర్తలగు ఋషులే దేవత లగుదురు. కొన్ని సంవాద సూక్తములలో ను శింపఁబడిన స్త్రీ పురుషు లెవరయినను దేవత లగుదురు ఇందు కొక యుదాహరణము, ఊర్వశి పురూరవు నుద్దేశించి సంభాషించునపుడు పురూరవుఁడు దేవత యగును. పురూరవుఁ డూర్వశి నుద్దేశించి మాటలాడునపు డూర్వశి దేవత యగును. ఈ పద్ధతిచేఁ గొన్ని సూక్తములలోఁ దిర్యక్కులుగూడ దేవత లగుట సంభవించినది. ఇది యనుక్రమణికా పద్ధతి. ఇతి హాసిక పద్ధతియు దేవతా నిర్ణయమున దీనితో నేకీభవించును. కాని నైరుక్తుల దేవతా నిర్వచనపద్ధతి యింతకంటె వేఱుగా నుండును.

'ఈ దేవత యనుగ్రహమున నా కీ యర్థము సిద్ధించుఁగాక' యను బుద్ధితోఁ ఋషి యగువాఁ దేమంత్రముచే నేదేవతను స్తుతించునో, యామంత్రము తద్దేవతాకి మగును. ఆస్తుతి, నామస్తుతి బంధుస్తుతి కర్మస్తుతి రూపస్తుతియని చతుర్విధము. మఱియు నా మంత్రములు, పరోక్షకృతములు ప్రత్యక్షకృతములు ఆధ్యాత్మికములు నని త్రివిధములు అందు:—

ప్రథమాది నామవిభక్తి ప్రయుక్తములు ప్రథమపురుష నిర్దిష్టములు పరోక్ష కృతములు. ఉదా:—

"ఇంద్రో దివ ఈశే పృథివ్యాః ఇంద్రమిద్ గాథినో బృహత్.— ఇంద్రుఁడే దివికిని భువికి నీశ్వరుఁడు, ఓ సామగులారా! ఇంద్రుని బృహత్సామచే స్తుతింపుడు." ఇత్యాది సర్వవిభక్తి యుక్తమయిన స్తుతి పరోక్ష కృతమని భావము.

మధ్యమపురుష ప్రయుక్తములు ప్రత్యక్ష కృతములు. ఉదా:— "త్వమింద్ర బలా దధి, కణ్వా అభిప్రగాయత, - ఇంద్రా! నీవు పరాభిభవ సమర్థమైన బలము వలన విఖ్యాతుఁడవైతివి. ఓ కణ్వులారా! మీరు గానము చేయుఁడు" ఇట్లు మధ్యమ పురుష సర్వనామ ప్రయుక్తమయిన స్తుతి ప్రత్యక్ష కృతమని భావము.

ఉత్తమ పురుషయుక్తము లాధ్యాత్మికములు. ఉదా:— "అహం రుద్రేభి ర్వసుభి శ్చరామి, - నేను రుద్రులతోను వసువులతోను గలసి సంచరించు చున్నాను" ఇట్లుత్తమపురుష సర్వనామ ప్రయుక్తమయిన దాధ్యాత్మికమని భావము.

ఇట్లు త్రివిధస్తుతి రూపములుగాక మిగిలిపోయిన మంత్రము లే యజ్ఞమం దుపయుక్తము లగుచున్నవో దాని దేవతయే వానికిని దేవత యగును. అనఁగా

నట్టి మంత్ర మగ్నిష్టోమమున నుపయోగింపఁ బడెనేని దాని కగ్నియే దేవత యని భావము.

అనుచు నైరుక్తులు బహుళముగా ఋగ్దేవతా స్వరూపము దెలిపియున్నారు. ఇదియుఁ బై యనుక్రమణికా పద్ధతినే పోలియున్నట్లు కనఁబడును గాని వారి దేవతా సంజ్ఞల నిర్వచనము మాత్రము భిన్నముగా నుండును పురూరవ శబ్దము నకు బహువిధముగా ధ్వనిచేయునట్టి ప్రాణమని వా రర్థము చెప్పుదురు. ఇట్లే యెన్నో సంజ్ఞలకు వారి నిర్వచనములు విచిత్రముగాఁ గానవచ్చును. మఱియును ఋభువులు మనుష్యులయ్యుఁ దపశ్శక్తిచే దేవత్వమును బొందిరనియు, ఆంభృణి బ్రహ్మవిద్యా పారీణురాలై దేవతాత్వము చెందినదనియు నిట్లే మఱికొందఱు మానవులు దేవత్వము ప్రాపించిరనియుఁ గొన్ని ఋక్కులే చెప్పుచున్నవి. ఇట్లున్న వివిధ పద్ధతులనుబట్టియు యాజ్ఞిక పక్షమునుబట్టియు ఋగ్వేద దేవతలు దాదాపు మూఁడుపందలమంది లెక్కకు వత్తురు. వారిలో దివ్యలక్షణ లక్షితులై మహా మహిమ సంపన్నులుగా వర్ణింపఁబడినవారు సుమారు ముప్పది మందికంటె నెక్కువగా నుండరు. వారిలోను, అగ్నీంద్ర సోమమిత్రవరుణ మరుదశ్వి విశ్వేదేవాది సంజ్ఞలు గలవా రల్పసంఖ్యాకులు ప్రధాన దేవతలు. ప్రథమ మండలమున రమారమి ౮౦ సూక్తముల నగ్నియు ౫౦ సూక్తముల నింద్రుఁడును వర్ణింపఁబడి యున్నా రనుటయే పై దేవతలలోఁగూడ నింద్రాగ్ను లత్యంత ప్రధానులని తెలుపఁ గలదు మొత్త మన్ని మండలములలోను సుమారు ౨౫౦ సూక్తముల నింద్రుఁడును, ౨౦౦ సూక్తముల నగ్నియు, ౧౦౦ సూక్తముల సోముఁడును స్తుతింపఁ బడిరి. పర్జన్యమృత్యు యమాదులు కొందఱు మూఁడేసి సూక్తముల నుతింపఁ బడిరి. తక్కినవారిలోఁ బ్రధాన దేవతలను వర్ణించు సూక్తములు నూటికిఁ దక్కువగాను మూఁటి కెక్కువగాను గనిపించును. దీనినిబట్టి చూడఁగాఁ దరువాతి కాలమున శివకేశవుల కెట్టి ప్రాధాన్యము వచ్చినదో, అంతకంటె నధికమైన ప్రాధాన్యము ఋగ్వేదకాలమున నింద్రాగ్నులకుఁ గలదని స్పష్టమగును.

మఱియు నందందలి ఋక్కులనుబట్టి చూడఁగా, పృథివీస్థానులు, అంతరిక్ష స్థానులు, ద్యుస్థానులు, అని దేవతా స్వరూపులు త్రివిధముగాఁ గనవచ్చుచున్నారు. అట్టివారిలో నగ్నియు, వాయువు లేక యింద్రుఁడు, సూర్యుఁడు, నయ్యా స్థానములనుబట్టి ప్రధాన దేవతలుగా వర్ణింపఁబడిరి. వారిలోను సూర్యుఁడే తక్కిన దేవతల నిజరూపమనియు, నతఁడే కార్యవశమున వివిధ దేవతారూపము దాల్చెననియు మఱికొన్ని వర్ణనలు కనఁబడుచున్నవి. ఇందుకొక యుదాహరణము :—

"దేవతా తత్త్వవేత్తలయిన మేధావు లాదిత్యునే యింద్రునిగాను మిత్రునిగాను వరుణునిగాను, అగ్నినిగాను దివ్యుఁడు సుపర్ణుఁడునైన గరుత్మంతునిగాను యముని గాను మాతరిశ్వునిగాను జెప్పుచున్నారు".[1]

ఇత్యాదులందు త్రివిధ స్థానదేవతాత్మత్వ మాదిత్యున కారోపింపఁబడినది. మఱియొకచో నగ్నియే సర్వదేవతా స్వరూపుఁడని వర్ణింపబడినది.[2] ఇంకొకచో సకల దేవతా స్వరూపుఁడు సర్వజగన్మూలపురుషుఁడు నతీతాగామిస్సృష్టిమయుఁడు విరాట్పురుషుఁడని వర్ణింపఁబడినది.[3]

ఇట్లు కనవచ్చు వివిధ వర్ణలనుబట్టి మంత్ర ద్రష్టలైన ఋషు లాయా సమయముల నిందాహర్షశోక ప్రశంసాదులలో నేదోయొకటి కారణముగ నీశ్వర మహిమా విష్కృతులయిన యగ్ని వాయ్వాదిత్యాదులను, అణిమాద్యైశ్వర్య సంపన్నులైనవారి రూపాంతరములను, మఱియు నశ్వాదిసత్వములను నదీపర్వ తౌషధీలతాదులగు నచేతములనుగూడ వర్ణించి యుండిరనియు, అట్టి వన్నియు యాజ్ఞికపక్షమున దేవతలుగాఁ బరిగణింపఁబడిన వనియుఁ దెలియనగును. అంతే కాని, "నాఁటి ఋషులు చెట్టుపుట్ట గూడ దేవతలనియే భావించెడివారు. ఐకాత్మ్య తత్త్వమే యెఱుఁగ"రని మాత్రము భావింపరాదు. ఈ విషయము తత్వజ్ఞానమను శీర్షిక క్రిందముందు విచారింపఁబడును గావున నిపుడు ఋషుల దేవతావర్ణనము లందలి విశేషములు కొన్ని గ్రహింతము.

పరమేశ్వర సంకల్పసిద్ధమైన పంచమహాభూత సృష్టిలో దృశ్యములును జ్ఞేయములును జేతనాచేతన రూపములు నయిననయుత్తమ పదార్థము లన్నియుఁ గార్యకారణాభేద భావమునఁ దత్తద్ధర్మానుగుణముగా ఋగ్వేదమున వర్ణింపబడినవి. అట్టి దేవతల రూపములు తఱచుగాఁ బురుషవిధములుగానే కల్పింపఁబడినవి. అనఁగా మానవపురుషులకువలె నా దేవతలకును గరచరణాద్య వయవములు నామ ధేయములు వాహనాద్యు పకరణములు గమనాగమన శ్రవణదర్శన భాషణాది కృత్యములు నారోపింపఁబడినవి. కొన్ని యచేతనములకు సకల చేతన ధర్మములు

1. ఇంద్రం మిత్రం వరుణ మగ్ని మాహు రథో దివ్యః స సుపర్ణో గరుత్మాన్।
ఏకం స ద్విప్రా బహుధా వదం త్యగ్నిం యమం మాతరిశ్వాన మాహుః. ఋ. 1-164-46.

2. అగ్నిర్వై సర్వాదేవతాః.

3. పురుష ఏ వేదం సర్వం యద్భూతం యచ్చ భవ్యమ్. ఋ. 10-90-2.

కల్పింపబడకపోయినను మహత్త్వబోధకము లగుకొన్ని గుణములు వాని కారోపింపఁబడినవి. సామాన్యముగా దేవతావర్ణనములు రూపకోప మోత్ప్రేక్షా స్వభావోక్తి తద్గుణాద్యలంకారములలో నొకదానికి గుఱియై కనవచ్చును.

సూర్యోదయ పూర్వకాలమందలి యుషస్సు స్త్రీవలె వర్ణింపఁబడినది. సోమలతను నఱకఁగొట్టుచున్న గ్రావములు తమ యాకుపచ్చని నోళ్ళతో సోమపానము చేయువానిని దయచేయుఁడని పిలుచుచున్నట్లు వర్ణింపఁబడినవి. ఇంద్రుఁడు మహాశూరునివలె నాయుధము చేతఁబట్టి వచ్చినట్లు వర్ణింపఁబడెను. ఇట్టి వర్ణనలను బట్టి చూడఁగా నయ్యాప్రాకృత పదార్థములందు ఋషుల కున్నట్లు తలంపఁబడు దేవతాబుద్ధికంటెఁ దత్తద్వస్తు వర్ణనములందలి వారి కవితాచాతురియే యధికముగా స్ఫురించుచున్నదని చెప్పనవకాశము గలుగుచున్నది.

మఱియు దేవతలు కొందఱు కొందఱు వేఱువేఱు ధర్మములు కలవారయ్యు నిద్దఱుచొప్పునఁ గలసి వర్ణింపఁబడిరి. అట్టి దేవతాద్వంద్వము లనేకము లనేక విధములుగాఁ గనవచ్చుచుండును. అగ్నీసోములు అగ్నీంద్రులు, అగ్నీపర్జన్యులు అగ్నావిష్ణులు, ఇంద్రాగ్నులు, ఇంద్రాబృహస్పతులు, ఇంద్రాపూషులు ఇంద్రా బ్రహ్మణస్పతులు, ఇంద్రావిష్ణులు, ఇంద్రాపర్వతులు, ఇంద్రాకుత్సులు, ఇంద్రావాయువులు, మిత్రావరుణులు, సోమాపూషులు, సోమారుద్రులు, సూర్యాచంద్రమసులు, వాతా పర్జన్యులు, ఇత్యాదిగా బహుదేవతాద్వంద్వములు కనవచ్చును. మఱియు దేవతలలో నొకరి కొకరు ప్రకృతియగుట కలదు. ఇది మనుష్యధర్మ విరుద్ధము. మానవులలోఁ దండ్రి కుమారునికిఁ బ్రకృతి యైనట్లు మారుఁడు తండ్రికిఁ బ్రకృతి కాఁజాలఁడు కదా! దేవతాధర్మ మట్లుకాదు. తండ్రికొడుకులు పరస్పరము ప్రకృతు లగుదురు. సూర్యుఁ డగ్నికిఁ బ్రకృతిగాను, అగ్ని సూర్యునికిఁ బ్రకృతిగాను గూడ వర్ణింపఁబడిరి. అదితి దక్షునికిఁ దల్లి, దక్షుఁడదితికిఁ దండ్రి[1] మరల నదితి యాదిత్యులకుఁ దల్లి ఇత్యాది దేవతా ధర్మములెన్నో ఋక్సంహితలోఁ గనవచ్చును.

స్త్రీ దేవతలలో నదితి యగ్రగణ్యురాలు, ఆమె దేవమాత. ఋగ్వేద గాథలలో నదితిగాథ మిక్కిలి ప్రధాన మైనదియేకాక యతిపురాతన మైనదిగాఁ గూడఁగనవచ్చును. అగ్నీంద్ర వరుణపత్నులగునాయి ఇంద్రాణి వరుణానియను పేళ్ళ దేవతలుగా స్తుతింపఁబడిరి. మఱియు సరమ దేవశునియను నైతిహాసిక

1. అదితే ర్దక్షో అజాయత దక్షా దదితిః పరి ఋ 10-72-4.

పక్షమునకు వ్యతిరేకముగా సరణశీలమైన మధ్యమవాక్కని నైరుక్తు లర్థముచెప్పిరి. అట్లే సరస్వత్యాదులు నవీకల్పదేవత లనిరి. ఇట్లు సమర్థింపఁ బడినవియు సూక్తముల వర్ణింపఁబడినవియు నగు కల్పిత స్త్రీ పురుషరూప చేతనా చేతన పదార్థము లెన్నో యాజ్ఞికపక్షమున దేవతలుగా గణనకు వచ్చినమాట సత్యమేకాని యట్టివానిని ఋషులు భజనీయములైన వివిధ దైవతములనుగా భావించినట్లు మాత్ర మూహింపరాదు. ఇట్లు బహుదేవతలు సూక్తము లందెల్లఁ గనవచ్చు చున్నను దివూదాస పుత్రుఁడయిన పరుచ్ఛేపమహర్షి చేసిన స్తుతినిపట్టి యజ్ఞార్థ దేవతలు ముఖ్యముగా ముప్పదిముగ్గురని యీక్రిందివిధముగాఁ దెలియ వచ్చుచున్నది.

"యే దేవాసో దివ్యేకాదశస్థ పృథివ్యామ ధ్యేకాదశస్థ
అప్సుక్షితో మహి నై కాదశస్థ తే దేవాసో యజ్ఞ మిమం జుషధ్వం.[1]"

ద్యులోక దేవతలు పదునొకండుగురు. పృథివీలోక దేవతలు పదకొండు గురు. అంతరిక్షలోక దేవతలు పదకొండుగురు. నిజముగా, పృథివ్యంతరిక్షద్యులో కాభిమానినులైన దేవతలు ముగ్గురే. కాని, వారే తమతమ మహిమలచే ముప్పది ముగ్గురు దేవతలగు చున్నారు. వారే అగ్ని వాయ్వాదిత్యాదులనుట స్పష్టము, దీనినిబట్టి మహామహిమవిరాజితు లయిన యగ్న్యాదులే ప్రధాన దేవతలుగా యజ్ఞ ములం దారాధింపఁబడుచు వచ్చిరని తెలియుచున్నది. ఈ ముప్పదిముగ్గురే నిజ మహిమవిలాసముల ముప్పది మూఁడుకోట్ల దేవతలుగాఁ బురాణేతిహాసాదులఁ బ్రశంస కెక్కిరనితోఁచుచున్నది. ఇఁక నీ విషయమిట్లుంచి శాఖాభేదముల నించుక పరిశీలింతము.

ఋగ్వేద శాఖలు

సంహితాబ్రాహ్మణాత్మకము లయిన నాలుగు వేదములు ననేకవిధశాఖలయి నట్లు లక్షణ గ్రంథములవలనఁదెలియవచ్చును గాని యందు యజుర్వేదము కృష్ణ శుక్లభేదమున ద్వివిధమై కనవచ్చునట్లు తక్కిన ఋగాదివేదముల శాఖలు వేఱుగాఁ గనరావు. అందు ప్రకృతమైన ఋగ్వేదమునకు ౨౧ శాఖలును సామవేదమునకు ౧౦౦౦ శాఖలును యజుర్వేదమునకు ౧౦౧ శాఖలును అథర్వవేదమునకు ౯ శాఖలును గొందఱిమతమున ౧౫ శాఖలును గలవనియు, అధ్వము పాదము శ్రుతి శాఖయనునవి పర్యాయవాచకము లనియు షడ్గురుశిష్యుఁడు తెలిపియున్నాఁడు కాని

1. ఋ. 1-139-11.

యాయాశాఖలనామము లన్నియు వక్కాణింపలేదు.[1] ఋగ్వేదశాఖలలో నైదింటి నామములు మాత్రము తత్ప్రవర్తకుల పేళ్లతోపురాణలక్షణ గ్రంథాదులఁ గనవచ్చుచున్నవి. అవియైనను, ఒకదానిలోని సంజ్ఞలతో మఱియొక దానిలోనివి పోల కున్నవి. శాకల్యశిష్యులైన ముద్గల గోఖుల వాత్స్యశారీర శిశిరసంజ్ఞలు గలవారైదుగురు శాఖాభేద ప్రవర్తకులని ఋక్ప్రాతి శాఖ్యభాష్యములో నువ్వటుఁ డుదాహరించిన పురాణవచనము చెప్పుచున్నది.[2] పై వానిలోని గోఖుల శారీరసంజ్ఞలు మఱియొకప్రతిలో గోకుల శైశిరసంజ్ఞలుగాఁ గనవచ్చుచున్నవి. వాయుపురాణములో ముద్గల గోలక ఖాలీయ మాత్స్య శైశిరేయ సంజ్ఞలు కనవచ్చుచున్నవి. విష్ణుపురాణము, ముద్గల గోఖ్వలు వాత్స్య శాలీయ శిశిర సంజ్ఞలు చూపుచున్నది.[3] వ్యాళికృత వికృతి వల్లి శాకల్యశిష్యులైన నైష్ఠిక బ్రహ్మచారులు నూర్వురిలోను గృహస్థులు ధర్మిష్ఠులు కుటుంబవంతులునగు శైశిరబాష్కల సాంఖ్య వాత్స్యాశ్వలాయనులు శాఖాప్రవర్తకులని చాటుచున్నది.[4]

ఇట్లు విభిన్నములుగానున్న పూర్వోదాహృత వచనములలోనేది సరియైనదో, యేది కాదో నిర్ణయింప నాధారములు కనరావుకాని షడ్గురుశిష్యుని వచనము తప్పఁ దక్కినవన్నియు ఋక్శాఖలైదని మాత్రము చెప్పుచున్నవి. ఇది ఇట్లుండ చరణ వ్యూహమను మఱియొక లక్షణగ్రంథ మాశ్వలాయన శాంఖాయన శాకల బాష్కల మాండూకాయన భేదమున ఋక్శాఖలైదు విధములని చెప్పుచు వానియందలి మండలాధ్యాయసూక్త ఋగాదిగణనమును మనమింతకు మున్ను శౌనకుని యను

1. ఋగ్రూపమంత్రబహుళ్యా దృగ్వేద స్సాస్య త్తేత రా,
ఏకవింశ త్యధ్వయుక్త మృగ్వేద మృషయో విదుః,
సహస్రాధ్వా సామవేదో యజు రేకశతాధ్వగమ్,
నవాధ్వా థర్వణోఽన్యేతు ప్రాహుః పంచదశాధ్వగమ్,
అధ్వా పాద శ్శ్రుతిశ్శాఖా, ఇతి పర్యాయవాచకాః,
కాత్యాయన సర్వానుక్రమణీ వృత్తిపీఠిక.

2. చూ. కాశీలో ముద్రింపఁబడిన ప్రతి.

3. మాక్సిముల్లరు Sans lit. P. 189.

4. శాకల్యస్య శతం శిష్యా నైష్ఠిక బ్రహ్మచారిణః,
పంచ తేషాం గృహస్థా స్తే ధర్మిష్ఠా శ్చ కుటుంబినః,
శైశిరో బాష్కల స్సాంఖ్యో వాత్స్య శ్చై వాశ్వలాయనః,
పంచై తే శాకలా శ్శిష్యా శ్శాఖాభేద ప్రవర్తకాః,
మద్రాసు ప్రాచీనాముద్రిత సంస్కృతగ్రంథపట్టిక. P. 694.

క్రమణికనుబట్టి చదివిన విధముననే తెలుపుచున్నది.[1] మఱియు, ఋగ్వేదసర్వానుక్రమణి సూక్తగణనము చేయుచు 'ఏత త్సహస్రం దశసప్త చైవ, అష్టా వతో బాష్కలకే ఽధికాని'—శాకల సంహితలో ౧౦౧౭ సూక్తములున్నవి. ఇంతకంటె నెనిమిదిసూక్తము లెక్కువగా బాష్కలసంహితలో నున్నవి. అని తెలుపుచున్నది.[2] ఈ రెంటినిబట్టియుఁ బూర్వోదాహృత వివిధవచనములను బట్టియుఁ బరిశీలింపఁగాఁ దొలుత ఋక్సంహిత యొకటే యనియు, దానిని లోకమునఁ బ్రవర్తింపఁజేసిన వారి నామములనుబట్టి యదియే యైదు శాఖలుగా వ్యవహరింపఁబడుచున్న దనియు విదిత మగుచున్నది. ఇది సత్యమైనను, ప్రవర్తకుల నామములు కొన్ని వేఱు వేఱుగాఁ గనవచ్చుటచే నందు ప్రధానశాఖా ప్రవర్తకు లెవరనెడి సందేహ ముదయింపకపోదు కాని, పూర్వాచార్యవచనప్రామాణ్యమునుబట్టి తెలిసికొనఁ దగినంతలోఁ జరణవ్యూహము పేర్కొనిన సంజ్ఞలలో బాష్కల సంజ్ఞ తప్పఁ దక్కిన నాలుగును బాణినిసూత్ర నిష్పన్నములై కనవచ్చుటచేతను[3] వికృతివల్లి వక్కాణించిన శైశిరీయ శాఖ శాకల శాఖలో నంతర్భూతమని సర్వానుక్రమణీ ఋక్ప్రాతి శాఖ్యములు చెప్పుటచేతను[4]. పాణినిదృష్టమైన శాంఖాయన శబ్దమే[5] క్రమముగా సాంఖ్యాయన శబ్దముగా మాఱియుండు ననుట విశ్వసనీయమగుట చేతను, మాండూకాయన శాఖా ప్రవర్తకులలోఁ దరువాత 'ప్రసిద్ధుఁడగు వాత్స్యుఁడను మునిపేర నదియే

1. ఈ చరణవ్యూహము శౌనకునిదని యొకప్రతిలోను, వ్యాసునిదని మఱియొక ప్రతిలోను గనవచ్చును.

తత్ర ఋగ్వేద స్యాష్టౌ భేదా భవంతి, చర్చా శ్రావక శ్చర్చక శ్రవణీయపారః క్రమపారః క్రమజటః క్రమపదః క్రమరథః క్రమదండ శ్చేతి, చతుష్పారాయణ మేతేషాం పంచవిధా భవంతి, ఆశ్వలాయన...... తేషా మధ్యయనం, అధ్యాయానాం చతుష్షష్టి ర్మండలానామిత్యాది.

2. బాష్కలసంహితలో నెక్కువగానున్న యెనిమిది సూక్తములును వాలఖిల్యములనుట కవకాశము కలదు గాని మాక్సిముల్లరు ప్రకటించినదానిలో నవి ౧౧ సూక్తములుగాఁ గనఁబడుచున్నవి. అతనికి లభించినప్రతులలో మఱిమూడు సూక్తములు ప్రక్షిప్తములై యుండునని యూహింపనయ్యెడి.

3. నడాదిభ్యః ఫక్. 4-1-99; అశ్వాదిభ్యః ఫఞ్. 4-1-110, శాకలా ద్వా. 4-3-128, శారద్వమాండూకాభ్యాంచ. 4-1-19,

4. శా న్యారణే శాకలే శైశిరీయే-సర్వాను—యథా ఋగ్వేదే పారయణా మ్నాయే శాకల్యే శైశిరీయకమితి-ఋక్ప్రా.

5. అశ్వాదిభ్యః పఞ్,-గోత్రావత్యే - గణపాఠే శంఖ.

వాత్స్యాయనశాఖయని వ్యవహరింపఁబడియుండు ననుట సంభావ్య మగుటచేతను[1] వికృతివల్లికంటెఁ జరణవ్యూహ మెక్కువగాఁ బూర్వకాలమునఁ బ్రసిద్ధి కెక్కియుండుట చేతను దీనిలోని శాఖాసంజ్ఞలు సరియైనవని తోఁచుచున్నది. ఇట్లు సంహితా ప్రవర్తక శాఖలేకాక, అధ్యయన బ్రాహ్మణసూత్ర భేదములవల్లఁ గూడ నేర్పడిన శాఖ లనేకములుకలవు. వానిస్వరూప మించుక పరిశీలింతము.

"వేదరాశి విధ్యర్థ వాదమంత్రాత్మకమై త్రివిధముగా నున్నది.[2] అందు మంత్ర బ్రాహ్మణాత్మకమైన స్వాధ్యాయైకదేశము శాఖయని చెప్పఁబడుచున్నది ఆ సంహితా బ్రాహ్మణములలో దేనికైనను సంభవించిన భేదమునుబట్టి వేదమున నవాంతరశాఖ లేర్పడుచున్నవనుట సత్యము. సాంగమైన స్వాధ్యాయము వేదశబ్ద వాచ్యమైనట్లే సాంగమైన శాఖగూడ వేదైకదేశ మగుటచే శాఖాంతరత్వమును బొందు చున్నది అట్టి శాఖ కంగము సూత్రము. దాని భేదమున స్వాధ్యాయాధ్యయనము భేదించుచున్నది కావున శాఖాభేద వ్యవహారమునకు సూత్రము హేతువగుచున్నది."[3] ఇత్యాది వాక్యములనుబట్టి, ఐతరేయ - కౌషీతకి - పైంగి - బౌధాయన - కాత్యాయన - మాధ్యందినాది శాఖలు, సంహితా బ్రాహ్మణ సూత్రములు వ్యాపించిన కాలఁదిని, కిర్మాచరణమున భిన్నమతము లుదయించిన కాలఁదిని బయలుదేఱినవని తెలియవచ్చుచున్నది. కావున ఋక్సంహిత మాత్రమేవో కొన్ని యితర సూక్తములు కలియుటచేతను, లేక తదధ్యయన భేదముచేతను వేఱయినట్లు కనిపించినను స్వరూపముచే నొకటి యైనట్లు విశ్వసింపవచ్చును. ఇట్లేర్పడిన వివిధ శాఖలలోని బ్రాహ్మణాది గ్రంథములఁ గొన్ని కొన్ని పాఠములు నశించుటయుఁ గొన్నిశాఖ లడుగంటుటయుఁ గాలక్రమమున సంభవించెననుట నిజము. ఇందుకు బ్రాహ్మణోక్త విధులలో నుత్పన్నములైన పాఠములు ప్రయోగమునుబట్టి యనుమానింపఁ బడుచున్న వనునది మొదలుగాఁ గల శాస్త్రవచనములే ప్రమాణము.[4] దీనినిబట్టి

1. మండూకవాత్స్యలలో నెవరు ప్రాచీనులో! పాణినిదృష్టము మాండూకాయన శబ్దము.
2. తత్ర తావ ద్విధ్యర్థవాదాత్మనా త్రిధా వ్యవస్థితో వేదరాశిః బౌధా. సూ. సాయణులు.
3. స్వాధ్యాయైకదేశ మంత్రబ్రాహ్మణాత్మక శ్శాఖేత్యుచ్యతే - ఇత్యాది— హిరణ్య - సూ, భా.
4. బ్రాహ్మణోక్తా విధయ స్తేషా ముత్పన్నాః పాఠాః ప్రయోగాదను మీయ న్తే ఉత్పన్నాః పాఠాః, అధ్యేతృదౌర్బల్యాత్, ఆప - సూత్ర.

శాఖానాం విప్రకీర్ణత్వాత్పురుషాణాం ప్రమాదతః, నైయేశ్చ మన్వాదిస్మృతీ నా ముప్యుత్పన్న శాఖామూలత్వ మభ్యుపగతమిత్యాది—కుమారిలతంత్ర. 1-3.

పేళ్లు తెలియకుండఁగా జీర్ణములైనవే కాక నామమాత్రావశిష్టములైన శాఖలుగూడ బ్రాహ్మణసూత్ర పాఠభేదములనుబట్టి వేలయినను, ప్రాచీన మహర్షి దృష్టములైన సూక్తములయెడ వేలు గావనియు, ఆ సూక్తములే సంహితగా నేర్పడినవనియు, దానికిఁ బదము (పదవిభాగము) నిర్మించిన శాకల్యమునియే తత్సంహితా ప్రవర్తకుల కాదిగురువనియు దానంజేసి ఋక్సంహితకుఁ దొలుత శాకలసంహిత యనుపేరు వచ్చినదనియుఁ దెలియనయ్యెడి. అట్టి లోకైక పూజ్యమయిన యీ సంహితలోని మనోహరములైన కొన్ని వర్ణనలు చదివి యానందింతము.

ఋక్సంహితలోని వర్ణనలు

నిత్యసత్యవ్రతులు నైహిక విజ్ఞానఘనులు నాముష్మిక పరాయణులు వశ్యవాక్కులు నగు పూర్వమహర్షులు వీనులార వినియుఁ గన్నులారఁ గాంచియు యథార్థములని నమ్మియు మనసార భావించియు వర్ణించిన వివిధ విషయములతో నాఁటి కాలమును గన్నులకుఁ గట్టు దివ్యమణి దర్పణమైన ఋక్సంహిత కేవలకర్మ పరతంత్రమైన మంత్రరాశి మాత్రము కాదు. వింధ్య హిమాచల మధ్యదేశమున ధర్మము నాలుగు పాదముల నడపించిన ప్రభువు. దక్షిణా పథంబున వైదిక విజ్ఞానమునకు దారిచూపిన మిత్రుఁడు. భరత ఖండమునకు భవ్యోపదేశము చేసిన పరమగురువు. శిక్షకు శిక్ష, వ్యాకరణంబున కాకరము, ఛందస్సునకు మూలకందము, నిరుక్తంబునకుఁ బ్రవక్త, జ్యోతిషంబునకు జ్యోతి, కల్పమున కాకల్పము, మీమాంసలకు మేర, న్యాయంబున కాయువు, పురాణేతిహాసముల పుట్టిల్లు, ధర్మశాస్త్రములత , వివిధార్యభాషల విత్తనము. వేయేల? సకల విద్యోప జీవికయగు నుపజ్ఞ. వా వి కుపాయనముగా ఋషులు తొలుదొల్త సంతరించి సమర్పించిన దివ్యరత్న టిక. వివిధ విజ్ఞానమణుల విలసిల్లునదియే భారతీయుల పెన్నిధి. మఱియు ఋగ్వేదము భావిసంతతివారు చూచి గ్రహించి యానందించుటకై ప్రాచీన మహర్షులు చిత్రించి యుంచిన యార్యావర్త చిత్రపటము. అందు ఋష్యాశ్రమములు యజ్ఞవాటికలు నదులు పర్వతములు వనములు తరుగుల్మ లతాదులు ఆర్యులు అనార్యులు పోరాటములు జయములు పరాజయములు, కృషి గోరక్షణము వాణిజ్యము నౌకాయానము రథయానము వధూవరుల యనురాగములు దౌత్యములు వివాహములు సమావేశములు విరహములు తపోమహిమలు దేవతానుగ్రహములు సల్లాపములు సంవాదములు సమాలోచనములు ప్రకృతి విజ్ఞానము పదార్థవిజ్ఞానము ఖగోళవిజ్ఞానము భూగోళవిజ్ఞానము ధైర్యసాహసములు కామక్రోధాదులు శమదమాదులు మొదలయిన వెన్నో యాయా సందర్భముల ననేక భంగుల దృగ్గోచర

మగును. అట్టి వాఙ్మయ కల్పభూరుహమైన ఋక్సంహితలోని కొన్ని వర్ణనల యందలి విశేషములు గ్రహించి యానందించుటకు ముందు సర్వదేవతా నమస్కార రూపమగు మంగళాచరణముగా నఖిల దేవముఖమైన యగ్నిదేవుని మధుచ్ఛందో మహర్షి వాక్కుతోనే స్తుతింతము.

"అగ్ని మీళే పురోహితం యజ్ఞస్య దేవ మృత్విజం హోతారం

రత్న ధాతమం ॥"

రాజునభీష్టము సంపాదించు పురోహితు నట్లు యజ్ఞమున కపేక్షితమైన హోమమును సంపాదించునట్టియు లేక యజ్ఞమునెదుట నాహవనీయ రూపమున నుండునట్టియు, ప్రకాశింపఁ జేయువాఁడు లేక దానాది గుణయుక్తుఁ డైనట్టియు, దేవతల యాగములందు హోత యనుపేర ఋత్విజుఁ డైనట్టియు, యాగఫల రూపమైన రత్నాది ధనసంపద నిచ్చునట్టియు, అగ్నిదేవుని స్తుతించుచున్నాను లేక యాచించుచున్నాను" అని యర్థము. యజ్ఞములందు ముందుభాగమునకుఁ దీసికొని రాఁబడువాఁడనియు, దేవసేనను ముందు నడపువాఁడనియు కాష్ఠాదులయందు సంకుచితముగాఁ దన యంగమును బొందించువాఁడనియు నగ్నిశబ్దమును బహు విధముగా యాస్కుఁడు నిర్వచించెను. ఇందు కడపటి నిర్వచనము సహజముగాను దక్కినవి యజ్ఞపక్షముగాను బౌరాణిక పక్షముగాను సరిపడుచున్నవి.

ఈ ఋక్కు ఋక్సంహితలో నిపుడు మొట్టమొదటిదిగాఁ గనవచ్చుచున్న మాట సత్యమే కాని యిది వైదిక వాఙ్మయ రచనయం దాద్యమంత్రము మాత్రము కాదు. సంహిత యేర్పడు కాలమునఁ బ్రాచీనార్వాచీన సూక్తములు కొన్ని ముందు వెనుక లయినవను విషయము నింతకుమున్నే కొంత తెలిసికొని యున్నాము. ఇది గాక మధుచ్ఛందసుఁడే తా నర్వాచీనుఁ డయినట్లు దీని తరువాతి ఋక్కులోనే యీ క్రింది విధముగా సూచించియున్నాఁడు.

"అగ్నిః పూర్వేభి రృషిభి రీడ్యో నూతనై రుత । స దేవా ఏహ వక్షతి॥"

అర్థము :— ఈ యగ్ని పూర్వర్షు లనఁగా, పురాతనులైన భృగ్వంగిరః ప్రభృతి మహర్షులకు స్తుత్యుఁడు, నూతను లనఁగా నిదానీంతనులమైన మనకును స్తుత్యుఁడు. మనచేఁ గొనియాడఁబడిన యితఁ డీ యజ్ఞమునకు దేవతలను దీసికొని వచ్చుఁగాక.''

దీనినిబట్టి మధుచ్ఛందసునికిఁ బూర్వము మహర్షు లనేకు లగ్నిస్తుతి యొనరించి యున్నారని స్పష్టమగుచున్నది. అట్టి యగ్నిస్తుతిరూప సూక్తములు ప్రతిమండలమందును గనవచ్చుచున్నవి. "ఇతనికిఁ బూర్వము ఋషు లుండవచ్చును, వారగ్నిస్తుతులు చేసియుండవచ్చునుగాని యవి సూక్తములై యీ సంహితలోనున్న వనుటకుఁ బ్రమాణ మేమి ?'' అని యడుగుదురేని. మధుచ్ఛందసుని యీ స్తుతిని సూక్తముగా గణించుచువచ్చిన యార్షానువాక సంప్రదాయము జమదగ్న్యాది మహర్షుల యాస్తుతులనుగూడ సూక్తములనుగా గణించుచు వచ్చుటయే ప్రమాణము. ఇందలి రత్నధాతమ శబ్దము తప్పఁ దక్కినవన్నియు నతిసులభములై లౌకికభాషలోని శబ్దములవలె నున్నవి. కావున నెట్లయిన నీ ఋక్కు ఋషిదృష్టములయిన వానిలో మొట్టమొదటిది కాదనుట నిర్వివాదమని నామతము. ఈ సందర్భమున మంత్రకృత్తుల కాలమందే కాక యా మంత్రములను సంహితగాఁ గూర్చిన యర్వాచీన కాలమందుఁ గూడజాతి కంటె గుణమే యెక్కువ పూజాస్థానముగా నుండెడిదను విషయమును, రాజర్షియైన మధుచ్ఛందసుని సూక్తములను బ్రహ్మర్షులు ఋగ్వేదాదియందు సమకూర్చుటయే ధ్రువపఱచుచున్నదని స్మరింపఁదగును.

ఋక్సంహితలో నైదవవంతు సూక్తము లగ్నిస్తుతిపరములేయని తెలియుచుండ నగ్నివర్ణన లెన్నియని యిందుదాహరింప నగును ? అందుచే నందందలి కొన్ని ఋక్కులయర్థమిందు తెలుపుచున్నాను. దీర్ఘతముఁ డనుఋషి వేఁడిమి యగు గుణము ప్రధానముగా నగ్నిదేవు నిట్లు వర్ణించెను.

''అగ్ని, పాకాదికముచే సన్నసాధకుఁడగు చున్నాఁడు. శరీరాభివృద్ధికి హేతు వగుచున్నాఁడు. యజ్ఞములందు హవిస్సు గొనుచున్నాఁడు. అట్లు లౌకిక వైదికకర్మములను నిర్వర్తింపఁజేయుచు నిత్యుఁడై భూలోకవర్తియగునితఁడే సకల లోకహితకారియగు వృష్టికిఁగారణమై విద్యుద్రూపమున నంతరిక్షమున వెలుఁగొందుచున్నాఁడు. మఱియు నీ యగ్నియే సూర్యకిరణముల ప్రవృత్తికి మూలమై తద్ద్వారా భూమిమీఁద జలము నాకర్షించి సూర్యుని బొందించి యచటఁ జిరకాల ముంచి పిదప నంతరిక్షమున మేఘములయందుంచి యాజలమును వర్షకాలమున మరల వర్షింపఁజేయుచున్నాఁడు.."[1] మఱియు నీ ఋషియే యగ్ని వుని తేజశ్శక్తిని విశ్వాత్మకత్వము నిట్లు కొనియాడెను.

"ఓయగ్నీ ! నీ వల్లనే రాత్ర్యభిమానియగు వరుణుఁడు వర్షాదికర్మ సమర్థుఁడగుచున్నాఁడు. అహరభిమానియగు మిత్రుఁడు తమోనాశకుఁడగు చున్నాఁడు.

1. ఋ. 1-141-2.9.

అట్లే యర్యముఁడును దానాదిస్వకార్య ధురంధరుఁడగు చున్నాఁడు. బండికంటి కమ్మి చక్రమును జుట్టి యున్నట్లే నీవు సర్వకర్మప్రవృత్తిచే విశ్వాత్ముఁడవై వరుణాదులను వ్యాపించియున్నావు.''[1]

సోమాహుతియను ఋషి దావాగ్ని నిట్లు వర్ణించెను

"అగ్ని, మిక్కిలి తొందరపాటుతో వనములు దహించుచున్నాఁడు. నీటి ప్రవాహమువలెనే యిటునటు పోవుచున్నాఁడు. యుద్ధమునకుఁ బోవురథమువలెనే ధ్వని చేయుచున్నాఁడు. రమణీయుఁడును సంతాపకుఁడు నయిన యితఁడు తన నల్లనిజాడలనడుమ నల్లని యంతరిక్షమున సంచరించు నాదిత్యునివలెనే ప్రకాశించు చున్నాఁడు.''[2]

నోధోమహర్షి వైశ్వానరాగ్ని నిట్లు స్తుతించెను.

"ఓయగ్నీ ! లోకములలోనున్న యగ్నులన్నియు నీ శాఖలే కాని వేఱుకావు. నీ వల్లనే నిర్జరు లందఱును జీవించుచున్నారు. సకల నరులగర్భములందు జాఠర రూపమున నాభి వగుచు, నిట్టాడు తనమీఁద మోపినవెదుళ్ల నన్నిటిని ధరించునట్లే యా నరుల నందఱిని నీవు ధరించుచున్నావు.''[3]

ఆంగిరసుఁడైన హిరణ్యస్తూపుఁడగ్ని ప్రార్థనము గావించుచుఁ బ్రాచీన యష్టలను గొందఱి నిట్లు పేర్కొనెను.

"హవిస్సులు గ్రహింప యజ్ఞములకుఁ బోవుస్వభావము గల యగ్నిదేవా! మనువు అంగిరోమహర్షి యయాతి ఇంకను బూర్వులును యాగము లొనరించి నపుడు వెళ్లినట్లే యిపుడీ యజ్ఞమునుగూర్చియు దేవయజన ప్రదేశమునకు వెళ్లి దేవతాసమూహము నిచ్చటికిఁ దోడ్కొని రమ్ము వారిని దర్భాసనములమీఁదఁ గూర్చుండఁబెట్టుము. వారికిష్టమైన హవిస్సు లిమ్ము,''

ఇంద్రుఁడు :— ఇంద్రవర్ణన సూక్తములు ఋక్సంహితలో నాల్గవవంతున్న వని యింతకు మున్నే చదివియున్నాము. య దికర్మలందు మిక్కిలి ప్రధాన దేవతగాఁ గొనియాడఁబడు నింద్రుని బూర్వు లందఱు గూడ వర్ణించియున్నా రనుట యతిశయోక్తి కాదు. ఇంద్రుఁడు వనాయకుఁడైన మహాశూరుఁడనెడి

1. ఋ. 1-141-2, 9.
2. ఋ. 2-4-6.
3. ఋ. 1-59-1.

పురాణేతిహాస ప్రసిద్ధికి ఋగ్వేదమే మూలమనుట నిజముకాని, యందలి కొన్ని ఋక్కులభావము ననుసరించి నిరుక్తకారుఁడైన యాస్కుఁ డింద్రశబ్దము నెట్లు నిర్వచించెనో ముందు చూతము.

ఇరాం దృణాతీతి - భోజనపదార్థముల నుద్దేశించి తన్నిష్పాదకమైన జలము కొఱకు మేఘమును బద్దలుకొట్టువాఁ డింద్రుఁడు. ఇరాం దదాతీతి - వృష్టి నిష్పాదనముచే నన్నమును లోకమున కిచ్చువాఁ డింద్రుఁడు. ఇరాం దధాతి - తృప్తి కారణమైన సస్యమును జలదానమునఁ బోషించువాఁ డింద్రుఁడు. ఇరాం దారయతీతి - భోజ్యద్రవ్యములను బుట్టించుటకై కర్షకముఖమున భూమిని దున్నువాఁ డింద్రుఁడు. ఇరాం ధారయతీతి - సస్యములు నశింపకుండఁగా నిలుపువాఁ డింద్రుఁడు. ఇందవే ద్రవతీతి - సోమరసము కొఱకు యజ్ఞభూమికిఁ బరుగెత్తువాఁ డింద్రుఁడు. ఇందౌ రమతే - సోమరసములఁ గ్రీడించువాఁ డింద్రుఁడు. ఇంద్ధే భూతాని - ప్రాణిదేహములందు చైతన్యరూపమునఁ జొచ్చి వానిని బ్రకాశింపఁ జేయువాఁ డిం ద్రుఁడు—ఈ కడపటి నిర్వచనమును వాజసనేయులుగూడఁ జెప్పుచు, సర్వేంద్రియాధిష్ఠాన పురుషరూపుఁడై ప్రాణిదేహములను బ్రకాశింపఁజేయువాఁ డింద్ధుఁడనియు, అతనినే యింద్రుఁడను చున్నారనియుఁ జెప్పిరి.—పరమాత్మ స్వరూపుఁడయిన యీ దేవుని సకలేంద్రియములతోను బ్రాణాపానాది వాయువుల తోను గూడిన వానినిగా నుపాసకులు ధ్యానించుచుఁ బ్రకాశింపఁజేయుచున్నారు గావున నితని కింద్రనామము సంపన్నమైన దనియొక బ్రాహ్మణము చెప్పుచున్నది. ఈ పక్షమున - ఇధ్యతే దీప్యత ఇ తీంద్రః - అనికర్మార్థంవ్యుత్పత్తి చెప్పవలెను. ఆగ్రాయణముని - ఇదంకరణాత్ - పరమాత్మ స్వరూపుఁడయిన యితఁడీ జగత్తును నిర్మించుటచే నింద్రుఁడయ్యెనని చెప్పెను. ఔపమన్యవముని - ఇదందర్శనాత్- వివేకముచేఁ బరమాత్మ నపరోక్షముఁగాఁ జూచినవాఁ డింద్రుఁడని నిర్వచించెను. ఇంక నిట్టి నిర్వచనము లనేకములు కలవు.[1] వీనినన్నిటని బట్టి చూచినచోఁ బూర్వులింద్రుని భావించుచు వచ్చిన క్రమము తెలియకపోదు. అట్టి యింద్రుని వైదికర్షులు కొందఱెట్లు భావించి వర్ణించిరో పరిశీలింతము. హిరణ్యస్తూపుఁడను ఋషి యిట్లు పలుకుచున్నాఁడు.

"ఇంద్రస్యను వీర్యాణి ప్రవోచం యానిచకార ప్రథమాని వజ్రీ।
అహ న్నహి మన్వప స్తదర్ద ప్రవక్షణా అభిన త్పర్వతానాం ॥"[2]

1. చూ. ఋ, భా. 1-3-4. 2. ఋ. 1-32-1,2.

వజ్రధారియైన యింద్రుఁ డొనర్చిన పూర్వసిద్ధములు ముఖ్యములు నైన పరాక్రమకృత్యములను జెప్పుచున్నాను. అతఁడు మేఘమును బద్దలుకొట్టెను. పిదప దానినుండి జలము భూమిమీఁదఁ బడునట్లు చేసెను. పర్వతములకు సంబంధించిన జలౌఘములు నదులుగాఁ బ్రవహించునట్లు చేసెను.''

''అహ న్నహిం పర్వతే శిశ్రియాణం త్వష్టాస్మై వజ్రంస్వర్యం తతక్ష।
వాశ్రా ఇవ ధేనవః స్యందమానా అంజః సముద్ర మవజగ్ము రాపః॥''[1]

ఈ యింద్రునికి త్వష్ట చక్కఁగాఁ బ్రయోగింపఁదగిన వజ్రాయుధము చేసి యిచ్చెను. దానితో నితఁడు పర్వతము నాశ్రయించియున్న మేఘమును భేదించెను. దానంజేసి భూమిపైఁబడి ప్రవహించుచున్న జలములు, హంభారవ మొనర్చుచు ధేనువులు తమదూడలను జేరునట్లే లెస్సగా సముద్రమును జేరుచున్నవి." ఇట్లే యీ సూక్తమంతయు మేఘరూపవృత్ర వధవర్ణన కుపయుక్తమై యున్నది. ఇందలి మఱికొన్ని ఋక్కుల భావము.[2]

దుర్మదుఁడైన వృత్రుఁడు తనకుఁ బ్రతివీరుఁడు లేఁడను గర్వముతోఁ బర భయంకరుఁడగు నింద్రుని బోరికిఁ బిలిచెను. కాని వాఁడింద్రుఁడు చేయువధను దప్పించుకొన లేకపోయెను. తుద కింద్రునిచే హతుఁడై నదులలోఁబడి వానిని గలఁచి వానిగట్లను విఱిచివైచెను.''

''కాళ్ళును జేతులును దెగినవృత్రుఁడు మరల లేచి యింద్రునితో యుద్ధము చేయఁగోరెను. అపుడింద్రుఁడు కొండచఱియవంటి వాని ఱొమ్ముమీఁద వజ్రముతోఁ గొట్టెను అంత నవయవ హీనుఁడైన వృత్రుఁడు, కొజ్జావాఁడు వీరవురుషుని సాటి గోరియు నశక్తుడైనట్లే వ్యర్థుఁడై క్రిందఁబడెను.''

"వర్షములేమిని ఖిన్నమయిన జనమున కానందము గలిగించినట్టి జలములు ప్రవాహ వేగమున గట్టుతెగిన సింధునదము నతిక్రమించి పోవునట్లే చచ్చి పడియున్న వృత్రుని దాఁటిపోవుచున్నవి. ఏ వృత్రుఁడు బ్రతికియున్నపు డేజల ములను నిరోధించెనో, యిపుడామేఘరూప వృత్రుఁ డాజలముల కాళ్ళక్రిందనే పడినవాఁడయ్యెను.''

1. ఋ. 1-32-1, 2.
2. ఋ. 1-32-6, 7. 8, 10, 11.

"నిలుకడలేక నిచ్చలు ప్రవహించునట్టి నీళ్ళలోఁబడి మునిఁగిపోవుటచేఁ బేరు తెలియకుండఁగాఁ బోయిన వృత్రుని దేహమును జలము లాక్రమించి ప్రవహించుచున్నవి. వృత్రుఁడు దీర్ఘమైన నిద్రాత్మక మరణము నొంది యంతర్హితుఁ డయ్యెను."

"వర్షము లేకుండఁజేసి లోకమునకు హాని కలిగించిన వృత్రుఁడు, పణి నామకరాక్షసుఁడు గోవుల నరికట్టినట్లే యుదకములను నిరోధించెను. అపుడు, ఇంద్రుఁడు వృత్రుఁడు మూసివేసిన జలద్వారమును వానిని జంపి తెఱచెను."

ఇట్లు వృత్రవధరూపమయిన యింద్రుని కృత్యమును వర్ణించెడి యీ సూక్తమందు, అహిశబ్దము మేఘపరముగాఁ గొన్నిచోట్లను, వృత్రపరముగా నొకచోటను గనవచ్చుచున్నది. ఎనిమిదవ ఋక్కులో అహివృత్ర శబ్దములు రెండును బ్రయోగింపఁ బడినవి. ఆ రెండును మేఘపరముగానే వ్యాఖ్యానము చేయఁబడినవి.[1] దీనిని బట్టియు నీసూక్తమందలి యహివృత్ర శబ్దములకు భాష్యకారులు వ్రాసిన యర్థ వివరణములను బట్టియు వృత్రుఁడనగా మేఘుఁడనియు మేఘత్వమును బ్రచ్ఛన్నము గావించి యసురత్వమును గల్పించుట చమత్కార కారిణియైన ప్రాచీన మహర్షుల శైలియనియుఁ దెలియవచ్చుచున్నది. మఱియు, వృత్రుఁడసురుఁడయినట్లును వాఁడు క్రూరకృత్యము లొనర్చినట్లును, ఇంద్రుఁడు దేవుఁడయినట్లును శూరుఁడయిన యతఁడు వృత్రుని సంహరించినట్లును యజ్ఞాది రక్షకుఁడయినట్లును వివిధవర్ణన లీవేదమందు లేకపోలేదుగాని, పైసూక్తమందలి విషయమును విమర్శింపఁగాఁ బౌరాణికుల యింద్రవృత్రులవలె వైదికర్షుల యింద్రవృత్రులు దేవాసురులుగారని తెలియుచున్నది. ఇందుకు యాస్కముని యేమి చెప్పెనో చూతము.

"తత్కో వృత్రః ? మేఘ ఇతి నైరుక్తాః, త్వాష్ట్రోఽసుర ఇత్యైతిహాసికాః, అపాంచ జ్యోతిషశ్చ మిశ్రీభావకర్మణో వర్ష కర్మజాయతే; తత్రోపమార్థేన యుద్ధవర్ణా భవంతి। అహివత్తు ఖలు మంత్రవర్ణా బ్రాహ్మణవాదాశ్చ। వివృద్ధ్యా శరీరస్య స్రోతాంసి నివారయాంచకార, తస్మిన్ హతే ప్రసస్యందిర అపః"[2].

అట్లయిన వృత్రుఁడెవఁడు ? మేఘుఁడని నైరుక్తులందురు. త్వష్టకొడుకైన యసురుఁడని యైతిహాసికులందురు. మేఘుఁడే వృత్రుఁడయితే మంత్రములవల్ల వినవచ్చు యుద్ధము మాటయేమి ? చెప్పెద వినుము. మేఘోదరగతములయిన

1. అహి ర్వృత్రో మేఘ స్తాసా మపాం పత్నుతః సా.–ఋ. భా.

2. యాస్కనిరుక్తము. పుట 144-146.

జలములకును వైద్యుతజ్యోతిస్సునకును గలిగిన సంఘర్షణమువల్ల వర్షము పుట్టు చున్నది. మారుతావేష్టితమైన యింద్రాఖ్యమగు వైద్యుత జ్యోతిస్సుచే తాడ్య మానములయిన యుదకములు వర్షభావమునొందుచున్నవి. ఇట్లు పరస్పర ప్రతి ద్వంద్వీభూతములైన తేజో జలముల కింద్ర వృత్ర రూపకల్పనచే యుద్ధకల్పనము చేయఁబడినది. అంతే కాని యిచ్చట నిజమైన సంగ్రామము లేదు. ఇంద్రునకు శత్రువులే లేరని 'యదచర స్తన్వా' యనెడి ఋక్కే చెప్పుచున్నది.[1] సరేకాని, యుద్ధకల్పనములు వృత్రుఁడున్నట్లే కనఁబడుచున్నవా? వృత్రుఁడున్నట్లును, అహియున్నట్లునుగూడ మంత్రలింగములు కలవు. శాఖాంతర బ్రాహ్మణవచనము లును గలవు. అందుచే నహివృత్ర శబ్దములకు మేఘుఁడర్థమగుట సముచితమగు చున్నది. దానంజేసి మేఘరూపవృత్రుఁడు స్వశరీరాభివృద్ధిచే జలములను నివా రించెననియు, వైద్యుతజ్యోతిస్స్వరూపుఁడైన యింద్రుఁడు వానిని గొట్టఁగానే యుదకములు స్రవించెననియు స్పష్టమగుచున్నది. ఈ విషయమున, వైదిక శబ్దార్థములకు వన్నెలు చిన్నెలు కల్పించి కథలల్లిన యైతిహాసికులకంటెఁ ప్రాచీన సంప్రదాయము ననుసరించి వానిని జక్కఁగా నిర్వచించిన నిరుక్తకారులే యెక్కువ ప్రామాణికులగుదురు గావున, వైదిక మహర్షులు జ్యోతిర్మేఘ స్వరూపములను వర్ష కారణములను జక్కఁగా నెఱిఁగియే ప్రరోచనార్థములయిన యింద్రవృత్ర సంగ్రామ కల్పనములు గావించి వర్ణించియుండిరని గ్రహింపఁదగును.

సూర్యుఁడు:—ద్యుస్థాన దేవతలలోఁ బ్రధానుఁడైన సూర్యదేవుని బూర్వ ర్షులు పెక్కురూపములతో వర్ణించియున్నారు. పృథివ్యంత రిక్షద్యులోకములకు మహోపకర్తయగు నీదేవుని వర్ణనములనేకములు స్వాభావికములై యున్నవి. పౌరాణిక సూర్యవర్ణనల కుపజీవ్యములైన వర్ణనలును ఋక్సంహితలోఁ గనవచ్చు చున్నవి. అట్టి యాదిత్య సవితృమిత్రాది రూపముల వర్ణింపఁబడిన సూర్యుని మహత్త్వమునకుఁ గొన్ని యుదాహరణములు:—కుత్సమహర్షి సూర్యునిట్లు వర్ణించెను.

"సకలదేవతా తేజః పుంజరూపమును విచిత్రమునైన సూర్యమండల ముదయాచలము నధిష్ఠించినది. మిత్రాగ్ని వరుణలోకములకుఁ బ్రకాశక దివ్య నేత్రమైన యీ మండలము తనతేజః పుంజముచేఁ బృథివ్యంత రిక్షద్యులోక ములను నింపుచున్నది. ఇట్టి దివ్యమండలములోపల నున్న సూర్యుఁడంతర్యా మియై సర్వలోక ప్రేరకుఁడగుచు జంగమస్థావరాత్మకమై సకలజగమున కాత్మ

1. ఋ. 10-54-2.

యగుచు విలసిల్లుచున్నాఁడు.[1] దీనినిబట్టి సకలస్థావర జంగమాత్మకమైన జగత్తునకుఁ గారణమై యఖిల ప్రాణిజాతమునకు జీవాత్మయైన సూర్యుఁడుదయించినంతనే మృతప్రాయమైన జగత్తంతయు మరలఁ జైతన్య యుక్తమగుచున్నదని తెలియుచున్నది.

సూర్యోపాసనవలన సకలరోగములు శాంతించుననెడి నమ్మకము ఋగ్వేద కాలమందే పుట్టినదనుటకు మహర్షియైన ప్రస్కణ్వుఁడు తనకు సంభవించిన చర్మ రోగము శాంతించుటకై సూర్యోపాసన చేసి రోగవిముక్తుఁడయినట్లు తెలియవచ్చు ప్రాచీన సంప్రదాయమే తార్కాణము. ఆ ఋషి గావించిన మూఁడు మంత్రముల తోడి యాస్తుతి తృచమనుపేర నేఁటికిని లోకప్రసిద్ధమై యాచరణములో నున్నది. సూర్యోపాసన విధానములలో, తృచవిధానమే మొదటిది. ఆస్తికులయిన కొందఱీ విధానమున సూర్యనమస్కారము లొనర్చి యిప్పుడుగూడ నిష్టార్థసిద్ధిని గాంచుచున్నారనుటకంటె దీని మహత్త్వమును వేఱుగాఁ బ్రశంసించుట యనావశ్యకము[2].

సూర్యుని సవితృరూపునిగాఁ గొందఱు ఋషులు వర్ణించియున్నారు. వారిలో విశ్వామిత్ర మహర్షి కనిపెట్టిన యొకఋక్కు ఛందోమాతయగు గాయత్రి యందు నిబద్ధమగుటచే గాయత్రి యనియు సవిత దేవత యగుటచే సావిత్రి యనియుఁ బ్రసిద్ధమై సంధ్యోపాసన జపింపఁదగిన దివ్యమంత్రమై ప్రశంసకెక్కినది. ఆ మంత్రమెప్పుడు పుట్టినదో యూహింపఁజాలముకాని యెల్ల వేద శాఖలవారును నాఁటినుండి నేఁటిదనుక దానిని నిత్యము త్రికాలములందు సభక్తినియమముగా జపించుచు వచ్చుట చూచినను, ఆ మంత్రమందలి విషయము చూచినను, మంత్రద్రష్టలైన ఋషులు వేదారంభకాలమునందే తమకు నిర్మల బుద్ధిని ప్రసాదింప నా మంత్రముచే సవితృతేజస్సును ధ్యానించుచుండెడివారని చెప్పవచ్చును. ‘నగాయత్ర్యాః పరమ్మంత్ర’మ్మను నభియుక్తోక్తికి గుఱియైన యా మంత్రమందలి యుపాసనీయమైన తేజస్సును సవితృరూప సూర్యతేజస్సునుగాను భావించి భాష్యకర్తలు దానికర్థములు వ్రాసియున్నారు. ప్రాతర్మధ్యాహ్న సాయాహ్నములయందు క్రమముగా గాయత్రీ సావిత్రీ సరస్వతీ సంజ్ఞల నావాహన మొనర్పఁదగిన సంధ్యా దేవత నుపాసింప వినియుక్తమగుచున్న యాగోప్య మంత్రమునుగూర్చి యింతకంటె విపరించుట యుచితము కాదు.[3]

1. చిత్రందేవానామిత్యాది. ఋ. 1-125-1.
2. ఋ. 1-50-11, 12, 13, మంత్రములు మూఁడు.
3. ఋ. 3-62-10

మఱియు సంధ్యోపాసనాపరులు నిత్యము పఠించు ప్రాతరుపస్థాన మంత్రములు మూఁడు విశ్వామిత్రమహర్షి సందర్శించిన మఱియొక సూక్తమున నున్నవి.[1] మిత్రరూప సూర్యుని వర్ణించు నా మంత్రముల భావమిది :—

''వృష్టి ప్రదానమున మనుష్యులను జీవింపఁజేయు మిత్రదేవుని సంబంధమయినయన్నమును భజనీయమయిన ధనమును మిక్కిలి కీర్తియుక్తములైనవి.''

''వర్ష ప్రదానమున నందఱిని రక్షించునట్టియు స్తూయమానుఁడగు నట్టియు మిత్రరూప సూర్యుఁడు కర్షకులచేఁ గృష్యాది కర్మప్రయత్నము చేయించుచున్నాఁడు. మఱియు నతఁడే, అన్నమును యాగములను గలిగించుచుఁ బృథివీద్యులోకములను ధరించుచున్నాఁడు. అతఁడే తెప్పపాటు లేనిదయామయ దృష్టితో సకలకర్మప్రవృత్తులగు మనుష్యులను జూచుచున్నాఁడు. ఓ ఋత్విజులారా ! ఇదంతయు గ్రహించి ఘృతయుక్త మయిన పురోడాశాదికహవిస్సు నతనికి సమర్పింపుఁడు.''

''ఓ యాదిత్యా ! వ్రతయజ్ఞాదిపరుఁడగునే మనుష్యుఁడు నీకు హవిర్దానము చేయుచున్నాఁడో, అతఁ డన్నవంతుఁ డగుఁగాక. నీచే రక్షితుఁడయిన యతఁడు పరులచే బాధింపఁబడఁడు. అవమానింపఁబడఁడు. అతనిని దగ్గఱనుండి కాని దూరమునుండి కాని యేపాపమును బొందదు.''

కుత్సమహర్షి సూర్యునిమహిమ నిట్లు వర్ణించెను.[2]

''తత్సూర్యస్య దేవత్వం తన్మహిత్వం మధ్యా కర్తోర్వితతం సంజభార ।
యదేదయుక్త హరితః సధస్థాదాద్రాత్రీ వాసస్తనుతే సిమస్మై॥''

1. ఋ. 3-59-6, 1, 2, ఈ మూఁడు మంత్రములును గొన్నిపదముల పాఠభేదములతో యజుస్సంహితలో నున్నవి, అవియే యజుశ్శాఖీయుల సంధ్యోపాస్తిమంత్రములుగా వచ్చుచున్నవి. సానసి - ద్యుమ్నం - బ్రువాణః - మిత్రాయ — జుహోత — అనుపదములు యజుస్సంహితలో, సానసిం సత్యం. ప్రజావన్-సత్యాయ-విధేమ-అనువిధములుగాఁ గ్రమముగా మాఱినవి. చూ. తై. సం. 8-2.

2. ఋ. 1-155-4.

జగత్ప్రేరకుఁ డయిన సూర్యుని స్వాతంత్ర్యము గాని మహిమగాని యనన్య లభ్యములు. ఏ మనఁగా? మనుష్యు లారంభించిన కృష్యాదికర్మలు సమాప్తి నొందకుండఁగానే సూర్యుఁ డస్తమించుచుఁ దనరశ్మిజాలము నీ లోకమునుండి యుప సంహరించుకొని తనయందణఁచు కొనుచున్నాఁడు. అస్తమించుచున్న యతనిని జూచి కృష్యాదికర్మకారులును, అసమాప్తములైన తమపనులు విడిచిపెట్టుచున్నారు. ఇట్టి స్వాతంత్ర్యము గాని మహిమగాని సూర్యవ్యతిరిక్తుఁడైన యే దేవునికిఁ గలదు? అతని కొక్కనికే యీ రెండుగొప్పతనములు గలవనుట నిజము. అది గాక, సూర్యుఁడెపుడు రసహరణశీలమైన తనరశ్మిజాలము నీ భూలోకమునుండి మరల్చి మఱియొక చోటికిఁ ద్రిప్పుచున్నాఁడో, లేక హరిద్వర్ణములైన తనగుఱ్ఱములను రథమునుండి విడిపించుచున్నాఁడో, అపుడే లోకమంతటను జీఁకటి వ్యాపించు చున్నది. లేదా, పగటిని దొలఁగించి రాత్రి విస్తరించుచున్నది. ఈ మహిమ సూర్యునిది గాక మఱెవరిది?

భరద్వాజమహర్షి పూషరూపసూర్యు నిట్లు స్తుతించెను.[1]

"శుక్రం తే అన్య ద్యజతం తే అన్య ద్విషురూపే అహనీద్యౌ రివాసి ।
విశ్వాహి మాయా అవసి స్వధావో భద్రాతే పూష న్నిహ రాతి రస్తు॥"

ఓ పూషా! నీ వర్ణనములలో నొకటి శుక్ల మయినది; అది పగటిని కలిగించునది మఱియొకటి కృష్ణమైనది, అది రాత్రిని గలిగించుచున్నది. అందుచేతనే దివారాత్రములు విషమరూపము లగుచున్నవి. అహోరాత్ర నిర్మాతయగునా దిత్యునివలెనే నీవును సర్వమును బ్రకాశింపఁ జేయుచున్నావు. అన్నవంతుఁడవైన నీవు సకలజంతుజాలమును రక్షించుచున్నావు. కావున నీవు సూర్యుఁడవే యగుదువు. అట్టి నీవు మాకు శుభప్రదాత వగుదువు గాక.

ఋగ్వేద మంతట నిట్టిసూర్యవర్ణన లనేకములు కలవు. ఒక్కొక్కవర్ణనమున నొక్కొక్కవిశేషము గనవచ్చును. వాని నన్నిటిని బరిశీలించినచో వైదిక మహర్షులు దిక్కాలాది విజ్ఞానమున కాధారభూతము సర్వలోక సంరక్షకమునగు సూర్యమండలముతత్త్వము చక్కఁగా గ్రహించిన వారని తెలియకపోదు. యోగదృష్టి కద్ద ముండునా?

1. ఋ. 6-58-1.

ఋగ్వేదవర్ణనలలో సంస్కృత భాషాభిజ్ఞులగు పాశ్చాత్య పండితులనుగూడ నాహా యనిపించిన వుషోవర్ణనములు. ఉషస్సును స్త్రీ దేవతగా భావించి వర్ణించిన ఋక్కులు సుమారు రెండువంద లుండును. అందలికొన్నిటి యర్థము చవిచూతము. అంగిరసుఁడైన కుత్సమహర్షి యిట్లు వర్ణించెను.[1]

'సకల జ్యోతిస్సులలో నుషస్సు శ్రేష్ఠమైనది. నక్షత్రములు తమ్ముమాత్రమే ప్రకాశింపఁజేసికొనును గాని, ఉషస్సు చీఁకటిని దొలఁగించి సకల లోకము నొక్కమాఱుగాఁ బ్రకాశింపఁజేయును. అట్టి వెలుఁ గుదయించినది. అది సకల పదార్థములను దెలియఁ జేయుచున్నది. సూర్యుఁ డుదయింప నీ యుషస్సెట్లు కారణ మగుచున్నదో, అట్లే దీని యుత్పత్తికి రాత్రి పరభాగము కారణమగుచున్నది."

సూర్యుఁడనువత్సను వెనుక నిడుకొని శ్వేతవర్ణముతో వచ్చుచున్న యీ యుషస్సునకు రాత్రి తన కడపటిభాగముచే నించుక నల్లరంగు కల్పించుచున్నది. రాత్ర్యుషస్సులు రెండును సూర్యునికిఁ జుట్టములు. రెండును నాశములేనివి. సూర్యునిముందు వెనుకల ననుసరించి యుండునవి. నభోఽంతరిక్ష మార్గముల సంచరించునవి''.

''నరపశుపక్షి మృగాదులనోట శబ్దము పుట్టించునట్టియుషస్సు తమోద్వారములను దెఱచి తిరోహితమైయున్న సకల పదార్థసంతతిని వెలువరించుచున్నది''.

''కడచిపోయిన యుషస్సుల మార్గము నీయుషస్సను గమించుచు రాఁబోవు నుషస్సుల కాద్యమై యొప్పుచున్నది. దీనివలెనే యుదయింపఁబోవు నుషస్సులు నొనరించును. ఈ యుషస్సు నిద్రించినవారి జీవాత్మలను బ్రేరించుచు మృతులయినట్లు పడుకొనియున్న వారిని సచేతనులఁ జేయుచున్నది''— ఈ వర్ణన ముత్తర ధ్రువమండలి ముప్పది దినముల యుషస్సును సూచించుచున్నది.

"ఓరీ మనుష్యులారా! పడక విడిచి లేవండి. మనజీవాత్మ వచ్చినది. తమస్సుపోయినది. అదిగో! ఉషఃకాంతి సూర్యుని మార్గమును విశదపఱుచుచున్నది. మనయన్న మెక్కడ వర్ధిల్లునో యక్కడికిఁ బోవుదము రండి.''

దీర్ఘతమః పుత్రుఁడగు కక్షీవంతుఁడిట్లు వర్ణించి యున్నాడు.[2]

1. ఋ. 1-113-1, 2, 4, 8, 16.

2. ఋ 1-123-5, 10, 11,—1. 124-2.

"ఉషోదేవీ! నీ వాదిత్యునికిని సవితకును గూడ సహోదరివి. కావున నీవు పూజ్యురాల వైతివి."

ఈ ఋషియే, ఉషస్సును స్త్రీతోఁబోల్చి దాని బాల్యాద్యవస్థలను దెల్పుచు నుషోదేవి సూర్యుని ప్రియురాలుగా వర్ణించియున్నాఁడు.

"ఉషోదేవీ! నీవు ముందుగా, నింటిలో దెసమొలతో సంచరించు చక్కని కన్యవలెనే సర్వాంగము స్పష్టముగాఁ గనఁబడునట్లు గోచరించుచున్నావు. తరువాతఁ బ్రగల్భురాలవై ప్రకాశమానుఁడు ప్రియుడునగు సూర్యుని సమీపించుచున్నావు. పిదపఁ బ్రౌఢయగు యువతివలెనే చిఱునవ్వు మొగముతో నీ మనోహరుఁడైన సూర్యునియెదుటఁ గులుకు లొలుకఁ గౌఁగిలి యపేక్షించు దానివలె నురఃప్రదేశ మావిష్కరించుచున్నావు."

"ఉషోదేవీ! తల్లి జలకమార్చి యలంకరించిన నిర్మలాంగియగు యువతి వలె విలసిల్లునీవు నీ శరీరలావణ్యము నందఱికిని జూపుచున్నావు, ఓకల్యాణశీలవగు దేవీ! ఈ యావరకమైన యంధకారమును దూరముగాఁ దఱిమివేయుము."

"ఏషా దివో దుహితా ప్రత్యదర్శి జ్యోతి ర్వసానా సమనా పురస్తాత్ ।
ఋతస్య పంథా మన్వేతి సాధు ప్రజాన తీవ న దిశో మినాతి ॥"

ద్యులోకపుత్రియైన యీ యుషోదేవి తేజోరూపమైన తెల్లనికోక కట్టుకొని చక్కఁగా నటించుచు నఖిలజీవరాశి కొక్కమాఱుగా గోచరించుచు నెల్లప్రాణుల కభిముఖముగాఁ బ్రకాశించుచున్నది. అట్టియీమె సూర్యునిమార్గమైన మేరుప్రాంత ప్రదేశమును మెల్లగా నెక్కుచున్నది. లోకములో ననురక్తురాలయిన భార్య భర్త నెట్లు విడువకయుండునో యట్లే యీమె తనప్రియుఁడైన సూర్యుఁ డెక్కడికిఁ బోవునో యక్కడికి ముందు నడచుచున్నదని భావము. మఱియు నీమె దిగ్భ్రాంతి కలుగకుండఁ బ్రాచ్యాదిదిగ్వ్యవహారము కలిగించుచున్నది. —అనఁగా, ఉషస్సెక్కడఁ గనవచ్చునో యది తూర్పుదిక్కని తెలియవచ్చుననుట. భాష్యకర్తలు వ్రాసిన యీ భావమునుబట్టి కూడ నీ ఋక్కునందలి విషయ ముత్తరధ్రువలక్షణ సూచకమని విశ్వసింపవచ్చును. కక్షీవన్మహర్షి యుషోవర్ణనము లొకటి రెండు త్తరధ్రువవాద సందర్భమున నుదాహరింపఁబడినవి. ఈ వర్ణనములనుబట్టి యీ

ఋషియుత్తరధ్రువ మండలవాసి యని చెప్పరాదు గాని వీనియందలి విషయమును బట్టి యితఁడుత్తర ధ్రువలక్షణములను బెద్దలవలన వినియున్నవాఁడని మాత్రము చెప్పవచ్చును. మఱియు నీఋషి యుషస్సును సూర్యునిదుహితఁగాను, దానికి ముందును వెనుకను జనించిన యుషస్సులు దానియప్పచెల్లెండ్రుగాను గల్పించి గావించిన వర్ణనలలోఁ గూడఁ బూర్వోక్త లక్షణముల సూచనలు కొంచెముగాఁ గనవచ్చును.[1]

వసిష్ఠమహర్షి యుషస్సు నతిమనోహరముగా వర్ణించియున్నాఁడు. ఉత్తర ధ్రువలక్షణ బోధకములగు నితనిఋక్కు లట్టివిరెండు పూర్వ ముదాహరింపఁబడినవి.[2] ప్రాచీనచరిత్ర బోధకమగు వానితరువాతిఋక్కు నిం దుదాహరించెదను.

"త ఇ ద్దేవానాం సధమాద ఆస న్నృతావానః కవయః పూర్వ్యాసః।
గూళ్హంజ్యోతిః పితరో అన్వవిందన్ త్సత్యమంత్రా అజనయన్నుషాసం॥"

పురాతన కాలమువారును సత్యవంతులును, కవులు ననఁగా ననూచానులును సర్వపాలకులు నగునేయంగిరసులు తమస్సుచే నావృతమయిన సూర్యతేజస్సును మంత్రశక్తిచేఁ జూడఁగలిగిరో, వారుఋషులలో నెల్లదేవతలతోఁ గలసి యానందించువారైరి. సత్యమంత్రశక్తి గల యా మహర్షులే ధ్యానమహిమచే నుషస్సును గలిగించిరి."—దీనినిబట్టి, యుత్తరధ్రువము మేరువనియు, మేరువు దేవనివాసమనియు, మన మింతకుమున్ను తెలిసికొన్నదాని కనుకూలముగా, సప్తర్షులలోనివాఁడగు వసిష్ఠమహర్షి కూడ బహుపురాతనులని పేర్కొన్నయంగిరసులుత్తర ధ్రువనివాసులై దేవసహ వాసులగుట విశ్వసనీయ మనియు (మేరువున నివసించువారు దేవత లనుట పురాణ ప్రసిద్ధము) వారు సూర్యదర్శనమునకై మహాతపస్సు చేయఁగా దానిమహిమ వలనఁ గొంతకాలమున కుషస్సు కనఁబడెననియుఁ దరువాత సూర్యుఁడు ప్రత్యక్షమయ్యె ననియు, నిది యంతయు నుత్తర ధ్రువమండల మందలి దీర్ఘోషస్సులను దెలుపుచున్నదనియు గ్రహింపవచ్చును. ఇందుకువసిష్ఠుని మఱియొక ఋక్కుగూడఁ బరిశీలింతము.

1. 1.124-7, 8, 9.

2. 7-76-2, 3, 4.

"ఏషా స్యా నవ్యమాయు ర్దధానా గూఢ్వీ తమో జ్యోతి షోషా అబోధి ।
అగ్ర ఏతి యువతి రహ్రయాణా ప్రాచి కిత త్సూర్యం యజ్ఞ మగ్నిం."[1]

"కడచిన రోజులలోఁ గనబడుచువచ్చుచున్న యీ యుషోదేవి నవతర యౌవనము దాల్చి తన తేజస్సున గూఢమైన యంధకారమును నివారించుచు భర్త ముంగట సిగ్గు విడిచియుండు యువతివలెనే సూర్యునిముందటఁ గనవచ్చుచున్నది. ఇట్టి యీమె సూర్యుని, యజ్ఞమును, అగ్నినిగూడఁ జక్కఁగా జ్ఞప్తికిఁ దెచ్చు చున్నది."

ఇందు వర్ణింపఁబడినయుషస్సు భరతవర్షమునఁ బ్రతిదినము సూర్యోదయ మునకు ముందు కొన్ని గడియలు కనిపించునుషస్సైన యెడల 'స్యా-నవ్య మాయుర్దధానా' అనెడి విశేషణములు రెండును సార్థకములు కాఁజాలవు. ఇది కొన్ని దినములనుండి యెడతెగకుండ వచ్చుచున్న యుషస్సు కావుననే, దినములు గడచిన కొలఁదిని, కాంతి హెచ్చుచుండుటయు సూర్యోదయము సమీపించుచుండుటయుఁ గనిపెట్టి, యాఋషి పైవిశేషణము లుపయోగించె ననుట తెల్లము. మఱియు నుషోదేవి పెక్కుదివసములనుండి తనభర్త నెపుడు చూతునని యాత్రము చెంది యున్నట్లు సిగ్గువిడిచి పతియెదుట సంచరించు జవ్వనివలెనే సూర్యునిముందు నిర్లజ్జముగా సంచరించుచున్నదని యలంకరించి వర్ణించుటయు సముచితమగుచున్నది. కావున నిది యుత్తరధ్రువదీర్ఘోష స్సూచకమైన వర్ణనమని తోఁచకపోదు. ఇట్టి యుషస్సు సూర్యునికిఁ బత్నియై త్రివిధముగా నతని నాశ్రయించి యుండుననియు నిదియే మధ్యాహ్నకాలమున సూర్యయను పేరను, సాయంకాలమున వృషాకపాయి యను పేరను బరఁగుచున్నదనియు వర్ణింపఁబడినది.

మనమిపుడు సంస్కృతాంధ్రాది భాషలలో రూపకాద్యలం కారములతోను గల్పనాచాతుర్యముతోను విలసిల్లునిట్టి వర్ణనల కెక్కువగా నలవాటు పడియున్నాము కావునఁ బై వర్ణనలయందు ప్రత్యేకించి చెప్పఁదగిన విశేషమేమియు గోచరింపక పోయినను, ఆ కాలమును స్మరించుకొన్నచో వట్టియుషస్సునట్లు వన్నెలు చిన్నెలు

1. 7-80-2.
2. ఉషా ఏషా త్రి ధా త్మానం విభజ్య ప్రైతి గోపతిమ్, ఉషాః పురోదయా ద్భూత్వా సూర్యా మధ్యం దివే స్థితే, భూత్వా వృషాకపాయీ చ దినాంతే వ్యవగచ్ఛతి. బృహద్దే. 7-120.

పెట్టి మనోహర శైలిని వర్ణించిన యానాఁటి వైదికర్షులయమేయ ప్రతిభావిశేషము గోచరింపకపోదు. అదిగాక వేదమందలి యిట్టి వర్ణనలే తరువాత బహువిధ వర్ణనల కును బీజములైనవనుట యంగీకార్యము కాకపోదు. అదే యిందలి విశేషము.

విష్ణువు :— అగ్నీంద్రాదులవలె విష్ణువధిక సూక్తము లాక్రమింపలేదు కాని యీ కాలమున దశావతారమూర్తియగు లోకరక్షకుఁడుగా నారాధింపఁబడు శ్రీమహా విష్ణువే యీ కాలమునఁ గూడ సకలలోకస్రష్టయైన పరమేశ్వరుఁడుగా ఋషులచే ధ్యానింపఁబడిన ట్లాకొలఁది సూక్తములే చెప్పుచున్నవి. ఇందుకు దీర్ఘత మోమహర్షి వాక్యములు కొన్ని యాంధ్రీకరించి యుదాహరించుచున్నాను.[1]

"ఓ నరులారా! విష్ణునివీరకృత్యములు చెప్పుచున్నాను, వినండి. అతఁడు పృథివ్యంతరిక్షద్యు లోకాభిమానులైన యగ్నివాయ్వాదిత్య రూపములగు రంజ నాత్మకరజస్సులను నిర్మించెను. మఱియు నతివిశాలమైన యంతరిక్షమునగ్న్యా దుల కాధారభూతముగా నిర్మించెను. అనఁగా లోకత్రయస్రష్టయని భావము. సాయ ణాచార్యులవారు మఱియొక విధముగాఁ గూడ నర్థము వ్రాసిరి.— పృథివిక్రింది సప్తలోకములను భూమ్యాదిసప్తలోకములను సృజించెను—" "అక్షీయమాణము లమృతపూర్ణములునైన యీ విష్ణుని త్రిపదములు తమ్మాశ్రయించినవారి నన్నముచే సంతోషపెట్టుచున్నవి. అతఁడు చతుర్దశభువనములను, అందలి భూతజాతములను బృథివ్యప్తేజోరూపములగు మూఁడు ధాతువులతోఁ గూడిన వానిగాఁజేసి ధరించు చున్నాఁడు."

"అమ్మహావిష్ణుని ప్రియభూతమైనట్టి యవినశ్వరమైనట్టి యంతరిక్షము ననఁగా బ్రహ్మలోకమును గాంక్షించుచున్నాను. ఆ లోకమునందు నివసించునట్టి యీ విష్ణువును బొందఁగోరుచు నరులు యజ్ఞదానాదికృత్యము లొనర్చి తృప్తినొందు చున్నారు. సర్వజగద్రూపమునఁ బరిణమించిన వ్యాపనశీలుఁడయిన యీ పరమే శ్వరుని కేవలసుఖాత్మకమైన యీ లోకమం దమృతము స్రవించుచుండును. అది పునరావృత్తిరహిత బ్రహ్మలోక నివాససిద్ధికి మూలము. మేధాతిథిమహర్షి యీ క్రిందివిధముగా విష్ణుస్తుతి యొనరించి యున్నాఁడు.[2]

1. 1-154-1, 4, 5,
2. 1-22-17, 18, 19, 20, 21.

ఇదం విష్ణు ర్విచక్రమే త్రేధా నిదధే పదం।

సమూళ్హ.[1] మస్య పాంసురే ॥

త్రీణి పదా విచక్రమే విష్ణు ర్గోపా అదాభ్యః।

అతో ధర్మాణి ధారయన్ ॥

విష్ణోః కర్మాణి పశ్యత యతో వ్రతాని పస్పశే।

ఇంద్రస్య యుజ్యః సఖా ॥

తద్విష్ణోః పరమం పదం సదా పశ్యంతి సూరయః।

దివీవ చక్షు రాతతం ॥

తద్విప్రాసో విపన్యవో జాగృవాం సః సమింధ తే।

విష్ణో ర్య త్పరమం పదం ॥

అర్థము క్రమముగా:— "విష్ణుదేవుఁడీ ప్రతీయమానమైన సకలజగము నుద్దేశించి పాదవిక్షేప మొనర్చెను తనపాదమును మూఁడు తెఱఁగుల విక్షేపించెను ఆ విష్ణుని ధూళియుక్తమైన పాదస్థానమం దీజగ త్తంతయు సంతర్భూతమై యున్నది."

"ఇతరుల కబాధ్యుఁడును సకల జగద్రక్షకుఁడునైన విష్ణువు, అగ్నిహోత్రాది సకల ధర్మములు పోషించుచుఁ బృథివ్యాది స్థానములందు మూఁడడు

1. అచ్చులమధ్యనుండు డకారమును ళకారముగాను, ఢకారమును ళ్హకారముగాను బహ్వృచులు పఠింతురని కారిక—అజ్మధ్యస్థడకారస్య ళకారం బహ్వృచా జగుః। అజ్మధ్యస్థ ఢకారస్య ళ్హకారక వై యథాక్రమమ్॥

గులు పెట్టెను" ఇతిహాస పురాణములలోని త్రివిక్రమావతారవర్ణనకీ ఋక్కులు రెండును మూలమనుట విస్పష్టము.

"ఓ ఋత్విజులారా! ఏ విష్ణువనుగ్రహమువలన యజమానుఁ డగ్నిహోత్రాదికర్మ లాచరించుచున్నాఁడో, అతని పరిపాలనాది కృత్యములను జూడుఁడు. అఁతడే యింద్రుని కనుకూలుఁడైన మిత్రుఁడు."

"చక్కఁగాఁ బ్రసరించిన నేత్ర మాకాశమందెట్లు చూచుచున్నదో, అట్లే విద్వాంసులు జ్ఞాననేత్రముచే నుత్కృష్టమైన యా విష్ణుని స్థానమును జూచుచున్నారు."

"శబ్దార్థ పరిజ్ఞాతలును స్తుతిప్రవీణులు నగుమేధావులా విష్ణుదేవుని పరమపదమును జక్కఁగాఁ బ్రకాశింపఁజేయుచున్నారు." పైవానిలోఁ గడపటి మంత్రములు రెండు నిత్య మీశ్వరారాధన సమయమున నుపయుక్తములగుట విదితము.

రుద్రుఁడు.—ఋగ్వేదీయ దేవతలలో విష్ణువలెనే రుద్రుఁడుగూడ మహామహిమానిత్వుఁడుగాఁ గనవచ్చును. ఋగ్వేదములో రుద్రస్తుతిపరములైన సూక్తము లయిదుమాత్రమే ముఖ్యములై యున్నవి. ఋగ్వేదీయరుద్రుఁడే తరువాత బయలుదేఱిన శైవమతమున కాధారభూతుఁడైన శివుఁడని చెప్పుటకుఁ దగినట్లుగా నిందు వర్ణింపఁబడిన రుద్రలక్షణము లన్నియుఁ దరువాతి గ్రంథములలోని శివునికి సంక్రమించినవని చెప్పవచ్చును. ఈ సంహితలోఁ గూడ రుద్రుఁడింద్రాదిదేవతలకంటె విలక్షణమైన యుత్కృష్టగుణములు కలవాఁడుగానే వర్ణింపఁబడియున్నాఁడు. అయినను విష్ణురుద్రు లిరువురును వేఱయిన పరమేశ్వరులనియే వైదికర్షులు భావించెడివారని మాత్రము తలంపరాదు. సృష్టిస్థితిలయ కారణుఁడయిన పరమేశ్వరుఁడొక్కఁడే యనెడి పరమార్థము వారివాక్కులం దెల్లడ గోచరించుచునే యున్నది. "స్థిరధన్వుఁడు శ్రీఘ్రగామి బాణుఁడు పరానభిభూతుఁడు శత్రుహింసకుఁడు విధాత నిశితాస్త్రుఁడు" అనునర్థ మిచ్చువిశేషణములతో నీ క్రింది ఋక్కు రుద్రునిరూప మహత్త్వములను బ్రత్యక్షము గావించుచున్నది.[1]

"ఇమా రుద్రాయ స్థిరధన్వనే గిరః క్షిప్రేషవే దేవాయ స్వధావ్నే।
అషాళ్హాయ సహమానాయ వేధసేతిగ్మాయుధాయ భరతాశృణోతు నః"॥

1. 7-46-1, 2, 3, 4.

ఇట్లు వర్ణించినవసిష్ఠ మహర్షి మఱియుఁ దరువాతిఋక్కులలో—రుద్రదేవుఁడు భువిమీఁదివారికిని దివిలోనివారికిని గూడఁ బరమైశ్వర్యముచేఁ దెలియఁబడుచున్నాఁడు - ఓ రుద్రదేవా ! ద్యులోకమునుండి నీవు విడిచిన యే యాయుధము భూమిమీఁదఁ దిరుగుచున్నదో, అది మమ్ము విడిచిపెట్టుఁగాక. అనఁగా జ్వరాది రోగభయములు మాకుఁ గలుగకుండుఁ గాక యనిభావము. మఱియు నోయనుల్లంఘనీయశాసనా ! నీ భక్తులమైన మాకు రోగభయము లేకుండుటకై వేలకొలఁదిగానున్న నీదివ్యౌషధములు మా కనుగ్రహింపుము. మా బిడ్డలను హింసింపకుము - ఓ రుద్రదేవా ! మమ్ముఁ జంపకుము. కాని మమ్ము విడిచిపెట్టకుము. కోపగించిన నీ బంధనమునందు మాత్రము మేముండఁజాలము. మా యజ్ఞమునకు రమ్ము. మమ్ము రక్షింపుము-అనుచు వర్ణించుటనుబట్టి చూడఁగా ఋగ్వేదకాలముననే రుద్రదేవుఁడు లయకారకుఁడుగా భావింపఁబడెడివాఁడని తెలియవచ్చుచున్నది. మఱియు, నిగ్రహానుగ్రహసామర్థ్యసమేతుఁడు సకలైశ్వర్య సంపన్నుఁడు మహావీరుఁడు మహాబలశాలి మహాకోపభయంకరుఁడు ధనుర్బాణపాణి మరుద్దేవతాజనకుఁడు దివ్యతేజోవిరాజమానుఁడు ధవళాంగుఁడు జటాజూటధారి రోగశాంతిప్రదుఁడు లోకరక్షకుఁడు భక్తప్రియుఁడనుచు నిందు వర్ణింపఁబడిన రుద్రుఁడే తరువాతఁ దైత్తిరీయసంహితలో.[1] సకల జగదాత్మక పరమేశ్వరుఁడుగా వర్ణింపఁబడెననుట సత్యమే కాని యిందుమాత్ర మతఁ డిష్టకామ్యార్థసిద్ధిప్రదుఁడగు నుత్తమదేవతగానే వర్ణింపఁబడెను.

ఋగ్వేదకాలమునుండియు నిత్యపారాయణమునఁ బ్రసిద్ధి కెక్కినకొన్ని సూక్తములలోఁ బంచరుద్రసూక్త మొకటి. ఋక్సంహితలో నందందు గనవచ్చు రుద్రదేవతాకము లయిన యైదు సూక్తములను సంపుటీకరించివానికిఁ బంచరుద్రసూక్తమని యర్వాచీనమునులు పేరు పెట్టినట్లు కనఁబడుచున్నది. ఆ సూక్తములే యే మండలములలోనివో, అందెన్నేసి ఋక్కులు కలవో, ఈ క్రింది పట్టికవలనఁ దెలియఁగలదు.

మం.	సూ.	ఋక్కులు.	మం.	సూ.	ఋక్కులు.
౧	౪౩	౯	౬	౭౪	౪
౧	౧౧౪	౧౧	౭	౪౬	౪
౨	౩౩	౧౫	మొత్తము		౪౩ ఋక్కులు.[2]

1. రుద్ర ప్రశ్నము. తై. 4.
2 రెండవమండలములోని ౩౪ వ, సూక్తములలోని మొదటిమూఁడు ఋక్కులు కలిపి ౪౬ ఋక్కులని కొందఱు గణించినట్లు కనఁబడుచున్నది.

కణ్వుఁడు - కక్షీవంతుఁడు - గృత్సమదుఁడు-భరద్వాజుఁడు - వసిష్ఠుఁడు- అను మహర్షులు క్రమముగా సందర్శించిన పై సూక్తములందు రుద్రదేవుని మహత్త్వము సంపూర్ణముగా వర్ణింపఁబడి యున్నది. ఈ సూక్తములు రుద్రయాగాదులందు దిగాద్యుపస్థానపరములని భాష్యకర్తలు వ్రాసియున్నారు. శౌనకుని పేరఁ గనవచ్చు ఋగ్విధానమను గ్రంథమందు పంచరుద్ర సూక్తపఠనమున కీక్రింది విధముగా ఫలము చెప్పఁబడినది.

"ఇమా ఇతి జపే చ్ఛశ్వ ద్రౌద్రసూక్తం ద్విజ శ్శుచిః
ఆయు ర్విద్యాం ధనం పుత్రాన్ గృహాం శ్చాప్నో త్యనామయాన్."[1]

నిరుక్తకారులును భాష్యకారులును రుద్రశబ్దమునకు బహువిధములైన వ్యుత్పత్తులు వ్రాసియున్నారు. అందు గొన్ని :—

"ఉఱుము కలిగించువాఁడు, మేఘోదరస్థుఁడై ధ్వని చేయుచు ద్రవించువాఁడు, శత్రువులను దుఃఖింపఁజేయువాఁడు; అంతకాలమం దందఱి నేడ్పించువాఁడు, సంసారదుఃఖమును నశింపఁజేయువాఁడు, శబ్దరూపోపనిషత్తులవలనఁ దెలియఁబడువాఁడు, ఉపాసకులకుపనిషద్విద్య నిచ్చువాఁడు, అంధకారమును జీల్చువాఁడు," ఇత్యాదికములు. ఇందలి కొన్నియర్థము లిటీవలివారు కల్పించినవైనను, మొత్తముమీఁద ఋగ్వేదరుద్రుఁడు కొందఱు తలంచినట్లు కేవలము ప్రాకృతదేవతగా భావింపఁబడినవాఁడు గాఁ డనియు, అతఁడే ఋగ్వేదమందలి విశేషణములనుబట్టి తరువాత శైవమతమున కాలంబనమైన వాఁడుగాఁ గనవచ్చుచుండెననియు విశ్వసింపవచ్చును.

వరుణుఁడు :— అంతరిక్షస్థాన దేవతలలో వరుణుఁడు ప్రధానుఁడు రాత్ర్యభిమాని బలపరాక్రమశాలి. ఇక్ష్వాకునియజ్ఞమందు యూపబద్ధుఁ డయినశునశ్శేఫ ఋషి కాందిశీకుఁడై నే నిపుడే దేవుని శరణుచొచ్చెదనని యాత్రముచెంది తొలుఁత ప్రజాపతిని, అతని యానతిన నగ్నిని. అతనిచేఁ బ్రేరితుఁడై సవితను, అతని యాజ్ఞచేవరుణుని స్తుతించి ప్రార్థించినట్లున్న ఋగ్వేదములోని ఋక్కులనుబట్టియే యైతరేయబ్రాహ్మణములోని శౌనశ్శేఫాఖ్యాన ముదయించినది. అజీగర్తపుత్రుఁ డయిన యాఋషి గావించిన వరుణస్తుతి యిట్లున్నది.[2]

---

1. ఇది యొకసూక్తమునకు ఫలము. ఇట్లే తక్కిన సూక్తముల ఫలములు వేఱుగా నున్నవి.
2. 1-24-6, 7, 8, 10, 11 ; 1-25-7.

"వరుణుని కున్న బలవేగ పరాక్రమములు మఱెవ్వరికిని లేవు - వరుణరాజు మూలరహితమైన యంతరిక్షముననుండి తేజస్సమూహముల మొదళ్లను బైకిఁబట్టు కొనుచున్నాఁడు. ఆ తేజఃకాంతులు క్రిందికిఁ బ్రసరించుచున్నవి — వరుణరాజు సూర్యునిమార్గము విశాలము గావించెను. అతఁడు, చంద్రనక్షత్రములు రాత్రుల యందు ప్రకాశించునట్లు చేయుచున్నాఁడు. అతనికృత్యము లమోఘములు - ఓ వరుణరాజా! చచ్చుటకు సిద్ధముగా నున్ననన్ను రక్షింపుము— అంతరిక్షగతుఁడై యాకాశమున నెగురుపక్షుల స్థానమును, సముద్రగతుఁడై యందు పోవునావల స్థానమును దెలిసికొనునట్టి వరుణుఁడు నా బంధనములు విడిపించుఁగాక." ఇత్యాదికము.

నా భాగుఁడను ఋషి, "వరుణుఁడు సప్తసింధువులకు రాజు. అతఁడు తన రశ్మిజాలమును బగలు తెల్లగాను రాత్రినల్లగాను జేయును. సూర్యుఁడు ద్యులోకమును ధరించినట్లే వరుణుఁడు ద్యావాభూములను ధరించియున్నాఁడు." అని వర్ణించెను.[1]

వసిష్ఠమహర్షి, వరుణుఁడు ద్యావాభూములను నిలుపుచున్నాఁడు. అతఁడు దివాభాగమున సూర్యుని రాత్రిభాగమున నక్షత్రములను బ్రేరేపించుచున్నాఁడని వర్ణించెను [2]

ఇట్లే వరుణునిగూర్చి పెక్కండ్రు ఋషులు పెక్కువిధముల స్తోత్రములు గావించియున్నారు అతని నింద్రునితోఁ గలిపియు మిత్రునితోఁ గలిపియుఁ గొందఱు స్తుతించియున్నారు. వరుణుఁడు సూర్యునివలెనే లోకహితకారి యనెడి భావము వరుణదేవతాకసూక్తములందు గనవచ్చును. వర్ష వాయువులను బ్రేరేపు వాఁడు వరుణుఁడనియు నతఁడు జలాధిపతియనియు ప్రాచీనుల ముఖ్యభావము.

నదులు :—ఇందలి నదీవర్ణన లల్పసంఖ్యాకములేయైనను, ప్రాచీనార్యుల నివాసమును దెల్పుచున్న యివి చరిత్ర దృష్టిచే ముఖ్యములగుచున్నవి. ఉన్నంతలో సింధు సరస్వతీనదులస్తుతు లెక్కువగా నున్నవి. సింధుశబ్దము నదీవిశేష వాచకముగాను గంగాదినదీ సామాన్యవాచకముగాను గూడ నిందు ప్రయోగింపఁబడినది. ఇందుకు "సింధుః - సప్తసింధూన్" ఇత్యాది ప్రయోగములే ప్రమాణము.[3] సప్తసింధుశబ్దము ఋగ్వేదమున సింధునదీ ప్రాంత దేశపరముగా నుపయోగింపఁ

1. 8-41.—2. 7-86-1.

3. అదబ్ధా సింధు రపసాం ౧౦-౭౫-౭.

సప్తసింధూన్. ౧-౩౨-౧౨ ; ౮-౨౪-౧, ఇత్యాది.

బడిన సూచనగలదనియు, నిదియే తరువాత నార్యులతో విడిపోయిన పారశీకార్యుల జెండ వెస్తాలో 'హ ప్తహిందు' అని తూర్పు కాబూలు దేశపరముగాఁ బ్రయోగింపఁబడినదనియుఁ గొందఱు చరిత్రకారు లూహించియున్నారు. ఆర్యు లుత్తర ధ్రువమండలమం దేడు మాసముల సూర్యరశ్మిగల ప్రదేశమందు నివసించినపుడు, అథోలోకమునందలి సముద్రమునుండి వెడలి పైకివచ్చు దివ్య జలపూర్ణములైన యేడు దివ్యవాహిను లేడుగురు సూర్యులను దమవెంటఁ గొనివచ్చుచున్నట్లు వర్ణించుచు వానికి సప్తసింధువులను పేరు పెట్టుకొని యుందురనియు, వారార్యావర్తమునకు వచ్చిన వెనుక నిందలి ప్రధానములయిన సప్తనదుల కాపేరే వాడుకొని యుందురనియు, అదియే జెండవెస్తాలో 'హ ప్తహిందు' అను పేర దేశపరముగా నుపయోగింపఁబడియుండుననియు శ్రీతిలకుగారు తలంచిరి.[1] ఈ యభిప్రాయభేదము లెట్లున్నను, సింధు శబ్దము క్రమముగా దేశపరమయిన ట్లీక్రింది విధముగాఁ దెలియవచ్చును.

తొలుత నార్యులు నివసించిన చోటికిఁ బడమటి దిక్కునఁ బ్రవహించెడి యొకనది సింధువని పిలువఁబడెడిది. దానినిబట్టి తత్ప్రాంత ప్రదేశము సింధుసంజ్ఞ చెందినది. దానిని పారసీకులు 'హిందు' అని పిలిచిరి. గ్రీకులు 'ఇండోస్' అని పిలిచిరి. అర్వాచీన పారసీకులు సింధునది ప్రవహించిన వింధ్యహిమాచల మధ్య దేశమున కంతకును హిందుస్థానమను పేరు పెట్టిరి. అదియే, ఉరుదులో 'హిందూస్తాన్' అయినది. దేశవాచకమయిన యా హిందూ శబ్దమే యాంగ్లేయుల వాడుకలో భరతఖండమంతకును 'ఇండియా' అను సంజ్ఞగా మాఱినది. హిందూకుష్ పర్వతములోని హిందూశబ్దముకూడఁ బారసీక భాషలో మాఱిపోయిన సింధుశబ్దరూపాంతరమే యనుట తెల్లము. దీనినంతసుబట్టి పరిశీలించినచో నార్యులు మొట్టమొదట భరతఖండము వాయవ్య భాగమందలి యొక పర్వతారణ్యముగుండా (హిందూకుష్) లోపలికి వచ్చినట్లును, తమ కచట ముందుగాఁ గనఁబడినదిని వారు సింధువని పిలిచినట్లును, అదియే యా పర్వతమునకును సింధు దేశమునకును, ఆర్యావర్తమునకును భరతఖండమునకును గూడ సంజ్ఞగా మాఱినట్లును ప్రాచీన చరిత్ర విషయమొకటి గోచరింపకపోదు. అట్టి సింధునదిని ఋగ్వేద వర్ణితములైన సప్తసింధువులను దక్కిన నదులనుగూర్చి వైదికర్షుల వర్ణనము లెట్లున్నవో చూతము.

ప్రియమేధపుత్రుఁడైన సింధుక్షిన్మహర్షి సింధునదినిట్లు స్తుతించుచున్నాఁడు.[2]

1. Arctic Home P. 289–296.
2. ఋ. ౧౦-౭౫-౧, ౨.

"ఓ జలములారా! మీ మహిమను గొనియాడునట్టి నేను యజమాన గృహమందుండి యిట్లు పలుకుచున్నాను. మీరు భువియం దేడు నదులుగాను, అంతరిక్షమం దేడునదులుగాను దివియందేడు నదులు గాను, ప్రవహించుచున్నారు. ఇట్లు మూఁడు లోకములందు ప్రవహించు నేడేసి నదులలోను సింధునది మిక్కిలి యోజోవేగములు కలదియై తక్కిన యెల్లనదుల నతిక్రమించి ప్రవహించుచున్నది.

"ఓ సింధునదీ! వరుణుఁడు నీ ప్రయాణమున కనుకూలములైన మార్గము లేర్పఱిచెను. నీవు ప్రాణుల యన్నము నభిలక్షించి ప్రవహించుచున్నావు. మఱియు నోదేవీ! పర్వతములు భేదించుకొనివచ్చు నీవు మిక్కిలి దీర్ఘమార్గమునఁ బోవుచు భూమి మీఁది సమస్త ప్రాణికోటికిఁ బ్రత్యక్షమగుచున్నావు"

సప్తసంఖ్యాకనదులు ముల్లోకములందు ప్రవహించుచున్న వనెడి మొదటి ఋక్కు భావము ననుసరించియే తిలకుగారు, సప్తసింధు సంజ్ఞ తొలుతనార్యులు 'ఈథర్'వలె నుండు దివ్యజల ప్రవాహముల కిడిరనియు నదియే తరువాత నార్యావర్తమందలి సప్తప్రధాన నదులకు సంభవించినదనియు నభిప్రాయము విశదీకరించి యున్నారు. ఆ సప్త నదులను సింధుక్షిన్మహర్షి యీ క్రింది విధముగాఁ బేర్కొని యుండెను.

గంగ యమున సరస్వతి శుతుద్రి మరుద్వృధ పరుష్ణి ఆర్జికీయ యనునవి యేడును బ్రధాన నదులు. వీనిలో మరుద్వృధ కసిక్నియు, ఆర్జికీయకు వితస్తా సుషోమలు నుపనదులుగా నున్నవి.[1]

ఈ పదినదులనిట్లు పేర్కొని యీ ఋషియె సింధునదిలో సంగమించెడి యుపనదులనిట్లు తెలిపియుండెను.

క్రుముగోమతి తృష్టామ సుసర్తు రసశ్వేత్యా కుభమేహత్ను, అనుసంజ్ఞలు కలనదులు సింధునదిలోఁ గలియుచున్నవి.[2] ఇక్కడికి మొత్తము పందొమ్మిది

1. ఇమం మే గంగే యమునే సరస్వతి శుతుద్రి స్తోమం సచతా పరుష్ణ్యా।
అసిక్న్యామరుద్వృధే వితస్త యార్జీకీయే శృణు హ్యాసుషోమయా॥
౧౦-౭౫-౫.

2. తృష్టా మయా ప్రథమం యాతవే సజూః సుసర్త్వా రసయా శ్వేత్యా త్యా।
త్వం సింధో కుభయా గోమతీం క్రుముం మేహత్న్వా సరథం యాభి రీయసే॥
౧౦-౭౫-౬. ఇచ్చట సాయణాచార్యులు 'క్రుముం' అనుదానికి 'క్రమణశీలాం' అని యర్థము వ్రాసి దీనిని గోమతికి విశేషణము చేసియున్నారు. కాని చరిత్రకారులనేకులు క్రుమునదిని వేఱుగా గణించియున్నారు.

నదులులెక్కకు వచ్చినవి. వీనిలో, పరుష్ణికి ఇరావతియనియు, అర్జికీయకు విపాట్, అనియు లోకవ్యవహార మున్నట్లు ఋజ్వర్థవ్యాఖ్య చెప్పుచున్నది. ఇరావతీ సంజ్ఞ కలయీపరుష్ణి యీ కాలమున రావీనదియనియు, మరుద్వృధ కుపనదియైన యసిక్ని చంద్రభాగ యనియుఁ బిలువఁబడుచున్నవి. పైనుదాహరించిన నదులలో వితస్త అసిక్ని పరుష్ణి విపాట్ (అర్జికీయ) శుతుద్రియనెడి యైదును ప్రవహించుదేశము పంచాపసంజ్ఞ చెందినదనియు నదియే పారశీక భాషలో 'పంజాబ్' అని చెప్పఁబడు చున్నదనియుఁ దెలియవచ్చుచున్నది. ఈ యైదు నదులును వేఱువేఱుగాఁ బ్రవహించి క్రమముగా నేకీభవించి తరువాత సింధునదిలో సంగమించుచున్నవి. అందుచే నివి దాని యుపనదులనఁ దగియున్నవి. ఈ యైదు నదులను సింధుకుభానదులు రెంటిని బట్టిమొట్టమొదట సప్తసింధుసంజ్ఞ వెలసినదనియు, తరువాతగుభానదియే సరస్వతిగా వ్యవహరింపఁబడిన దనియు మేగ్డోనలు పండితుని తలంపు. సాయణాచార్యులవారు సప్తసింధు శబ్దము వచ్చినచోట్ల నెల్లనింతకుఁ బూర్వ ముదాహరించిన గంగాయము నాది సప్త ప్రధాననదులనే పరిగణించిరి కాని. అసిక్నీ వితస్తలను సింధుకు భానదులను గణించియుండలేదు. ఋగ్వేదమున 'సప్తసింధవః'అను శబ్దము పెక్కు చోట్లఁ బ్రయోగింపఁబడినదనియు[2] వృత్రవధచే విముక్తిగాంచిన గోవులు వెలుఁగు మొదలగువానివలెనే దివ్యజల ప్రవాహములు విముక్తిగాంచినట్లుగా నాయావర్ణనల వలనఁ దెలియవచ్చుచుండఁగాఁ జరిత్రకారులు కొందఱు పంజాబులోఁ బ్రవహించు నైదు నదులకు మఱిరెండు సింధుశాఖలను జేర్చి సప్తసింధు శబ్దము నార్యావర్త నదీపరముగా సమన్వయించిరనియుఁ గాని యిది యెంతమాత్రము సరిగాదనియు, తిలకపండితులు వక్కాణించియున్నారు. మనకీచర్చ ప్రస్తుతము కాదు గాని యెట్లయినను సప్తసింధు శబ్దము ఋగ్వేదకాలమున నార్యావర్త మందలి సప్త నదులకును గొంత దేశమునకును సూచకముగా నున్నదనియుఁ దరువాత నదీవాచక మైనదనియు నంగీకరింపక తప్పదు.

ఇపుడు పంజా బనఁబడు పంచాపదేశములోని యైదు నదులు జీలం – చెనాబ్ రావి – బీయాస్ – శత్లుజ్ – అనునవి. వీని ఋగ్వేదీయ సంజ్ఞలు క్రమముగా వితస్త – అసిక్ని (చంద్రభాగ) పరుష్ణి (ఇరావతి) అర్జికీయ (విపాట్) శుతుద్రి – అనునవి. వాజసనేయ సంహితలో సరస్వతియే యైదు విధములుఁ బ్రవహించు చున్నదనియు, ఆయైదు నదులును మరల సరస్వతీనదిలో సంగమించుచున్న

1. ఋ 4-23-1; 1-32-12; 1-102-2. ఇత్యాదులు.

వనియు నందుచే నా దేశము పంచనదమయిన దనియు వర్ణింపఁబడియున్నది.[1] దీనినిబట్టి పంజాబులోని యైదుపనదులకుఁ బ్రధానభూతమైన సింధునదియే సరస్వతియను పవిత్ర నామమునఁగూడ వ్యవహరింపఁబడెడిదను కొందఱి వాదమునకుఁ గూడఁ గొంచె మవకాశము కలిగినదిగాని, యమునా శతుద్రినదుల మధ్య ప్రదేశమున సరస్వతియను చిన్ననది యొకటి ప్రవహించు చున్నట్లు మఱికొన్ని ఋక్కులవలన సూచితమగుటచేతను, ఇండస్సను పేరనిపుడు సింధునది సజీవమగుటయు సరస్వతియంతర్వాహిని యగుటయుఁ బ్రసిద్ధ మగుటచేతను ఋగ్వేదములోని సరస్వతీ నదిగూడ సింధునదీ ప్రధాన శాఖలలో నొకటియై యుండునని యూహించుట సముచిత మగుచున్నది.

వైదికార్యు లీపంచాపదేశమందును, సింధునది కావలిభాగమందు కుభానది ననుసరించి యుత్తరముగా సువాస్తునదీపర్యంతము దక్షిణముగా క్రుము గోమతీ నదుల పర్యంతముగల ప్రదేశమందును నివసించి యున్నట్లును ఋక్కులలోఁ బేర్కొనఁబడిన పైయెల్లనదులను బట్టి విదిత మగుచున్నది. ఈ కుభకాబూ లనియు నీసువాస్తు స్వాటనియు నీక్రుము కురుమనియు నీగోమతి గోమాలనియు నిపుడు వాడఁబడుచున్నవి.

వైదికర్షుల దృష్టిలో భీకరమగు మహాధ్వనితోఁగూడిన జవాతి రేకమందు సింధునదివలెనే పావనత్వమునందు సరస్వతీనది పొగడ్త గాంచినది. తరువాతి కాలమునఁ గొందఱు గంగా యమునా తీరములఁగూడ నివసించి యున్నట్లుగా నానదుల నామములు ఋక్కులలోఁ గనవచ్చుటచేతఁ దెలియవచ్చుచున్నను, ఈ కాలమున వానికున్న ప్రఖ్యాతి యా కాలమున లేదని చెప్పవచ్చును. అందుకుఁ బ్రాచీనార్యులు తత్తీరముల నివసింపక పోవుటయే కారణమగును. అందుచే ఋగ్వేద కాలమున సింధునదియుఁ బవిత్రతకు సరస్వతియుఁ బ్రసిద్ధి కెక్కెననుట స్పష్టము. పూర్వకాలమహర్షులు సరస్వతీ నదీతీరమందు యజ్ఞాదికర్మ లాచరించుచుండెడి వారనుటకుఁ 'ఋషయోవై సరస్వత్యాంసత్ర మాసత' యనెడియైతరేయవాక్యమే ప్రమాణము.[2] దీనివలెనే, ఆపయా దృషద్వతీ నదుల తీరభూములు గూడ మనుష్య సంచారయోగ్యములు యాగాచరణ సమర్థములునని భరతపుత్రులైన దేవయాత దేవశ్రవసులను మహర్షులు వర్ణించియున్నారు.[3] భరద్వాజమహర్షి, సరస్వతీనది

1. పంచనద్య స్సరస్వతీ మపి యంతి సస్రోతసః ।
సరస్వతీతు పంచధా సో దేశేఽభవ త్సరిత్. 34-2.
2. ఐ. బ్రా. 2-19 ;
3. ఋ. 3-23-4 ;

పర్వతములను భేదించుకొని ప్రవహించుచున్నదనియు, దాని సాహాయ్యమున నింద్రుఁడు వృత్రాద్యసురులను వధించెననియు, సస్యాద్యభివృద్ధికి హేతువై జన రక్షకముగా నున్నదనియు, అక్కడ చెల్లెళ్ళయిన యేడునదుల కాశ్రయమై మహర్షి సేవిత యైనదదియు బహుభంగుల వర్ణించెను.[1]

పర్వతములు:—వీని ప్రసక్తి ఋగ్వేదమున నందందు కనవచ్చును గాని ప్రత్యేకముగా వీనిని వర్ణించు సూక్తములు లేవు. హిమాలయములు ముంజవంతము ఋజీకము మొదలగు గిరులు కొన్ని ఋక్కుల సూచితములైనవి. కొండలు నదుల జన్మస్థానము మహౌషధులకు నిలయములనియు వర్ణింపఁబడినది.

సింధు గంగాదినదులు హిమవద్గిరి భాగములనుండి ప్రవహించుచున్నట్లుగా ఋజీక పర్వతమునుండి యార్జీకీయ జన్మించి ప్రవహించుచున్నట్లుగా తెలియ వచ్చుచున్నది. ముజవత్పుత్రుఁడైన అక్షుఁడను నొకఋషి, ముజవత్పర్వతము మీఁది సోమము మిక్కిలి యుత్తమ మైనదని వర్ణించియుండెను.[2] ఈ ముజవంత మునే మూజవంతమని ముంజవంతమని యాస్కుఁడు ద్వివిధముగా నిర్వచించెను. ఈ ముంజవంతము హిమాలయశిఖరములలో నొకటి యనియుఁ గాశ్మీర దేశమునకు వాయవ్యభాగమునందు కాబూలు దేశమునకు దగ్గఱగానున్న శిఖరములలో నొకటి యనియుఁ దెలియవచ్చుచున్నది. ఈ పర్వతముపేరే యీ ఋషి తండ్రి పేరుగాఁ గూడఁ గనవచ్చుటనుబట్టి దీని పరిసరమున వైదికార్యులు నివసించి యుండిరనియు నిది వారి హృదయముల నాకర్షించినగిరి యనియుఁ దలంపఁవచ్చును. ఇట్లే వివిధ లతాతరు వనమృగవిహగలోహాదు లయ్యా ఋక్కుల వర్ణింపఁ బడియున్నవి. లోహములలో నినుమును బంగారమును వైదికర్షు లెక్కువగాఁ జూచినట్లును వానిని బహువిధముగా నుపయోగించినట్లును వానివివిధ వర్ణనల వలనఁ దెలియనగును. మఱియు వృక్షములలో నశ్వత్థము, లతలలో సోమలత, వనమృగములలో సింహము, పక్షులలో హంస, పెక్కుచోట్ల వర్ణింపఁబడినవి. అనఁగా వైదికర్షుల హృదయములు నాకర్షించినవానిలో నీ పూర్వోక్తములు ప్రధానములని గ్రహింపఁ దగును గాని తక్కిన వానిని వారెఱుఁగరని గ్రహింపరాదు.

సముద్రము :— వైదికార్యులు సముద్ర మెఱుఁగరని కొందఱు విమర్శ కులు చెప్పసాహసించిరి గాని యది పొరపాటు. సింధునదినే గొప్పజలౌఘముగా

1. ఋ. 6-61.

2. ఋ. 10-34-1.

భావించిరనుటయు సింధుశబ్దము నదీసామాన్యవాచకముగాను సింధునదీ పరముగాను గూడఁ బెక్కుచోట్లఁ బ్రయోగింపఁబడుటయు సత్యమే కాని వారు సముద్రమునే చూడలేదనుట సరికాదు. "స్ధ్రీచీః సింధు ముశతీ రివ" అనుఋక్కునందు.[1] కామయమాన లయిన స్త్రీలు తమభర్తను వలెనే నదులు స్వపతియగు సముద్రుని బొందుచున్నవని విస్పష్టముగా వర్ణింపఁబడియున్నది ఇచ్చట సింధు శబ్దమునకు సముద్రమనియే భాష్యకర్త లర్థముప్రాసిరి. నదులు సముద్రమునఁ గలియుట సహజమే కదా! మఱియుఁ బర్వతములనుండి ప్రవహించుచున్న విపాట్ శుతుద్రీనదులు వాజిశాలనుండి విడువఁబడిన గుఱ్ఱముల వలెనే యతివేగమునఁ బరుగెత్తుచు సముద్రమును జేరుచున్నవనియు, 'ప్రయత్సింథవః... సముద్రం రథ్యేవ జగ్మః' నదులు కోరికతో సముద్రునిగూర్చి పోవుచున్నవనియు వర్ణింపఁబడెను.[2] మఱియు సమస్తజలాధిష్ఠానము సముద్రమనియు దానికి వరుణుఁడు రాజనియు వసిష్ఠుఁడు వర్ణించెను.[3] ఇట్టి వానినిబట్టి సింధుసముద్ర శబ్దములు సాగరపరముగాఁ గూడఁ బ్రయోగింపఁబడినట్లు విస్పష్టమగుచున్నది గావున వైదికర్షులు సరిత్పతియగు సముద్రమును జక్కఁగా నెఱుఁగుదురని విశ్వసించునది.

ఆర్యులవర్గములు-జాతులు :— సప్తసింధుదేశమందు, లేక యార్యావర్తమందు తొలుదొల్త నివసించిన ప్రాచీనులయిన యుత్తమజాతివారిని దెలిపెడి సామాన్యనామమైన యార్యశబ్దమువలెనే వారి తెగలను బోధించెడి యదు-తుర్వశ-అను - ద్రుహ్యు - పూరు - శబ్దములును, ఈ యైదింటిని దెలిపెడి పంచజన శబ్దమును, ఆర్యవిశేష వాచకములుగా ఋక్కులలో నలుఁగడలఁ గనవచ్చుచున్నవి. ఇట్లే చతుర్వర్ణ వాచకములైన బ్రాహ్మణ రాజన్య వైశ్యశూద్ర శబ్దములును, పంచవర్ణ వాచకమగు నిషాదశబ్దమును, అనార్యవాచకములైన అసుర - దస్యు - దాస - యాతుధాన - క్రవ్యాద - మూరదేవ - రక్షశ్శబ్దములును ఋక్సంహితలోఁ బ్రయోగింపఁబడి యున్నవి. పై వానిలో యదుతుర్వశాది సంజ్ఞలైదును యయాతి పుత్రుల నామములుగా మహాభారతాదులైన యితిహాసాదులందు గనవచ్చుచున్నవి. యయాతిపేరు నతని తండ్రియైన నహుషునిపేరుఁ గూడ ఋగ్వేదములో స్థలాంతరములఁ గనవచ్చుచున్నవి. ఇదంతయు నెఱిఁగియు నితిహాసాదులలోని యదుతుర్వశాది సంజ్ఞలకును ఋగ్వేదములోని యా సంజ్ఞలకు నేకీభావము లేదని

1. 10-112-10.
2. ఋ. 3-33-1 ; 3-36-6, 7.
3. ఋ. 7-49-1, 2, 3, 4.

తలంచియో లేక యదుతుర్వశాది నామము లార్యవర్గపరము లనెడి సంప్రదాయము తమనాఁడు లేమింజేసియో నిరుక్తకారులు యదుతుర్వశాది శబ్దములను బంచజన శబ్దమునుగూడ మనుష్యవాచక నామములలోఁ జేర్చిరి.[1] దానినిబట్టి వేదభాష్యకర్త లీ శబ్దములు బహువచనాంతములుగాఁ గనఁబడినచోట్ల నెల్ల మనుష్యులనెడి యర్థమును, ఏకవచనములుగాఁ గనఁబడినచోట్ల యదుతుర్వశాదులు రాజర్షులనెడి యర్థమును వ్రాసిరి. మఱియు, పంచజనశబ్దమునకు నిరుక్తమునఁ గనవచ్చు "దేవ పితృ గంధర్వాసురరక్షస్సులు, బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రనిషాదులు, దేవ మనుష్య పితృ పశు పక్షులు."[2] అనెడి యర్థములలో నేదో యొకదానిని సందర్భోచితముగా వ్రాసిరి గాని యార్యవర్గములనెడి యర్థ మొక్కచోటును వ్రాయలేదు. ఇది యిట్లుండ సంస్కృతవాఙ్మయ పరిశోధకులును బ్రాచీనచరిత్ర పరిశోధకులు నగు నాధునిక ప్రాచ్య పాశ్చాత్యపండితులు కొందఱు "ఆర్యావర్త నివాసులైన పురాతనార్యుల కాలమున జాతిభేదము లేదు.

బ్రాహ్మణోఽస్య ముఖ మాసీ ద్బాహూ రాజన్యః కృతః ।

ఊరూ త దస్య య ద్వైశ్యః పద్భ్యాం శూద్రో అజాయత ॥

అనెడి మంత్రము తోడి.[3] పురుషసూక్త మర్వాచీనఋషి దృష్టమై ఋగ్వేదమునఁ బ్రవేశించినది గాని యిది పూర్వమహర్షి దృష్టము గాదు, ఋగ్వేదమున నందందు బహువచనాంతములుగాఁ గనవచ్చు - యదవః - తుర్వశాః - అనవః - ద్రుహ్యవః - పూరవః - అనునవి సప్తసింధుదేశమున నందందు నివసించు నార్య వర్గములను బోధించుచున్నవనుట నిజము. పంచశినాది శబ్దము లీ యైదువర్గములను దెల్పునవి గాని యన్యములు గావు.[4]" అనుచు నిశ్చయించి యున్నారు. కావున నిందేమతము గ్రాహ్యమని యిపుడు విచారణ చేయవలసియున్నది.

1. అసురశబ్దము, బలవంతుఁడు తేజోవంతుఁ డనెడి యర్థముల నగ్నీంద్రాదు లకుఁ గూడ విశేషణముగా వాఁడబడినది గాని యిది బహువచనాంతముగాఁ బెక్కుచోట్ల స్థానభ్రష్టులు చపలు లనెడియర్థముల రాక్షసపరముగానే ప్రయోగింపఁబడినది. చూ. యాస్కనిరు. 188 పుట.
2. నిరు 189 పుట.
3. ఋ. 10-90-12.
4. మెక్డోనలు. San. Lit. P. 158 ; పార్గిటరు A. I. H. Tr. P. 87-88 అవినాశ చంద్రదాసు. R. V. I, Ch. VII.

భాష్యకారులు నిషాద పంచమ చతుర్వర్ణ పరముగాను విమర్శకులు పూర్వార్యవర్గపరముగాను సమన్వయించిన పంచజనాది శబ్దములన్ని మండలములలోను గలవు. అందు గొన్ని :—

"పంచక్షితీనాం - పంచకృష్టీః - పంచజన్యాసు కృష్టిషు - జనేషు పంచసు - పంచమానుషాన్ - పంచజనాన్ - పంచజనాః - పాంచజన్యయా విశా - ఇత్యాదులు. ఇందు కొన్ని రెండు మూఁడు సార్లు గూడఁ బ్రయోగింపఁ బడినవి. నిరుక్తకారులు మనుష్యనామములుగాఁ బేర్కొన్న ఋగ్వేదములోని శబ్దము లివి :—

మనుష్యాః	నహుషః	తస్థుషః
నరః	హరయః	వివస్వన్తః
ధవాః	మర్త్యాః	పృతనాః
జంతవః	మర్యాః	పంచజనాః
విశః	మర్తాః	తుర్వశాః
క్షితయః	వ్రాతాః	ద్రుహ్యవః
కృష్టయః	ఆయవః	యదవః
చర్షణ్యః	జగతః	అనవః
		పూరవః

ఈ యిరువదియైదు బహువచనాంతములు మనుష్యార్థమందే సమన్వయించుచున్నవి. పంచజనశబ్దము విశేషముగా నిషాదపంచమము లయిన నాలుగు వర్ణములను జెప్పుచున్నది మఱియు, క్షితి కృష్టి మొదలగు కొన్ని శబ్దములు పంచశబ్దముతోఁ గలసి పూర్వోక్తములయిన యైదు వర్ణములను జెప్పుచున్నవి. కొన్నిచోట్ల నిట్టిపంచజనాది శబ్దములు మున్ను చెప్పినట్లుగా దేవగంధర్వాదులను జెప్పుచున్నవి. భాష్యకర్తలు నిర్ణయించిన యీ యర్థము లాయాఋక్కులయెడ ననుచితముగా నున్నవని యెవరును జెప్పఁజాలరుగాని, మనుష్యవాచకముగాను మనుష్యసమూహవాచకముగాను గూడ జనశబ్దమే సరిపడుచుండఁగా నాయర్థమందే సంఖ్యావాచకమైన పంచశబ్దమును దానికిఁ జేర్చి మంత్ర ద్రష్టలు ప్రయోగించియుండరనియు నట్లు ప్రయోగించుటలో నేదో యొక విశేషముండి యుండవలె ననియుఁ జెప్పవచ్చును. నిషాదవర్ణముతోడి నాలుగు వర్ణములను జెప్పుటయే యా విశేషమని తలంతు మేని వర్ణవాచకమైన పంచజనశబ్దమును నిరుక్తకారులు మనుష్య

1. ఋ 1-7-9 ; 1-76-7 ; 6-46-7 ; 4-38-10 ; 3-59-16 ; 9-65-23 ; 8-9-2 ; 8-32-2 ; 9-92-3, 10-45-6 ; 8-63-7 ; 10-60-4. 10-53-5.

సామాన్య నామములలోఁ జేర్చుట యుచితము కాదేమోయని తోఁచకపోదు. మఱియు "త్వ మహో యదవే తుర్వశాయ'' ఇత్యాదిస్థలములందు.[1] యదు తుర్వశ శబ్దము లేకవచనములుగా నున్నపుడు 'యదునామకరాజు, తుర్వశనామకరాజు' అని భాష్య కర్త యర్థము వ్రాసి, యివియే 'యదవః-తుర్వశేషు.[2]' అనురీతి బహువచనాంత ములుగా నున్నపుడు నిరుక్తమునుబట్టి మనుష్యులని యర్థము వ్రాసినను, ఆ యర్థ మాస్థలముల సరిపడుచున్నను, ఆమనుష్యులు యదువునకు సంబంధించినవారనియుఁ తుర్వశునకు సంబంధించినవారనియు స్ఫురింపకపోఁబు, కావునఁ బై మనుష్య నామము లోని కదపటితుర్వశాదిసంజ్ఞ లైదునార్యవర్గ వాచకములనియు, పంచజన శబ్దము తద్వర్గపంచక వాచకమనియుఁ బరిశోధకులు తలంచుట సముచితమనియే తోఁచు చున్నది. కాని నిజముగా మంత్రకర్తలీ శబ్దములను ప్రాచీనార్యవర్గపరములనుగానే ప్రయోగించియున్నచో వీనియర్థమిట్లేల మాఱిపోవుననెడి ప్రశ్న మించట నుదయింపక పోదు.ఇందుకొక్కటే సమాధానము. వేదరచనోత్తర క్షణమునుండియు వేదముకర్మా ర్థమనెడి దృఢవిశ్వాసము వైదికమతమున వేళ్లనాటుకొని పోవుటచే వేద గత చరిత్ర సంప్రదాయము క్రొంత యడుగంటుటయే కొన్ని చరిత్ర బోధక శబ్దముల యర్థము మాఱిపోవుటకుఁ గారణమయ్యె. అందుచేతనే మను నహుష యయాత్యాదులగు కొన్ని శబ్దములకు.[3] రాజర్షులయిన మనునహుషాదులని యర్థము వ్రాసిన భాష్య కర్తలు:—

''పూరుః - పూరవః - అనవః."[4] ఇత్యాది శబ్దములు కొన్నిటి కాయా సందర్భములందు పూరునామకరాజు, అతనికి సంబంధించినవారు, అను నామక రాజునకు సంబంధించినవారు, అనెడి యర్థములు సరిపడుచున్నను, మనుష్యుఁడు, మనుష్యులనెడి యర్థములను మాత్రమే వ్రాయుట తటస్థించినది. దానం జేసియే మంత్రకర్తలయిన ఋషుల గాథలవలెనే మంత్రోదాహృతులగు ప్రాచీన వీర మహాపురుషుల గాథలు నానోట నానోటఁ బడిపడి యతిమానుషములుగానో యమానుషములుగానో యద్భుతములుగానో మాఱిమాఱి యార్య వంశపరంపరలోఁ గర్ణాకర్ణికగా వచ్చివచ్చి తుదకితిహాస పురాణాదులందేదో యొక రూపమున నిలచి నవి. అవియే ప్రాచీనార్య చరిత్రమును బురాతన భరతవర్ష చరిత్రమును బరి శోధించు పరిశోధకులకుఁ బ్రధానాధారములైనవి. అందుచేతనే వేదములలోని

1. 5-31-8. 2 8-4-19.

3. ఋ. 1-31-12, 17.

4. ఋ. 5-17-1; 1-59-6, 5-31-.4

పురుష సంజ్ఞలకును ముడిపెట్టుట తగదని కొందఱును, అవియే యివియని కొందఱును దలంపవలసి వచ్చినది. ఆ యితిహాసాదులలోని కొన్ని రాజ వంశ క్రమము లొకదానితో నొకటి పోలక లోపభూయిష్ఠము లగుటచే నందేది విశ్వాస్యమో యేది యవిశ్వాస్యమో నిర్ణయింప గత్యంతరము లేక చరిత్రకర్తలు యథేష్టమార్గములు ద్రొక్కవలసివచ్చినది. సత్యవిషయమిట్లు నిగూఢమై యవ్య వస్థముగానున్నను మనమిపుడు ఋగ్వేదములోని యదుతుర్వశాది సంజ్ఞలు ప్రాచీ నార్య కుటుంబవాచకములని యంగీకరింపక తప్పదు. ఇట్లంగీకరించినను మనము వెనుకఁ దెలిసికొన్న వేదకాలమునకు మాత్రము భంగము వాటిల్లదనుట నిజము. ఇఁక నీ విషయమిట్లుంచి ప్రకృతమనుసరింతము.

వేదములోని పంచజన శబ్దమును సార్థకము గావించుటకై, అను-ద్రుహ్యు-తుర్వశ - యదు - పూరువులను గొందఱు గణించిరని యింతకు మున్ను చదివి యున్నాము. మఱికొందఱిందలి యదు పూరువులకు బదులుగా తృత్సుభరతులను గణించిరి.[1] కాని వసిష్ఠుఁడు పురోహితుఁడుగాఁ గల తృత్సు వంశరాజులే భరతు లుగా వ్యవహరింపఁబడెడివారని సాయణాచార్యు లొకచో వ్రాసియున్నారు.[2] మఱి యొకచో విశ్వామిత్రుఁడు "ఓనదులారా! మదీయులైన భరతులు మిమ్ము దాఁటి పోఁగలరు."[3] అని చెప్పిన వాక్యమున భరతులు గనవచ్చుచున్నారు. ఈ రెండు విధములైన భరతు లొకరో వేఱో, ఇది యొక సందిగ్ధ విషయము. ఇది యిట్లుం డఁగా, సౌదాసులు క్షత్రియులునైన భోజులు - కుశిక గోత్రజులైనకుశికులును[4] మత్స్యులును మొదలగు మఱికొన్ని సంఘములును, మహర్షుల నామములతో వసిష్ఠులు - అంగిరస్సులు - భృగువులు - కణ్వులు-విశ్వామిత్రులు-జమదగ్నులు అథర్వులు - మొదలగు సంఘములనుగూడఁ గనవచ్చుచున్నవి. ఇందే వర్గములు పంచజన శబ్దముచేఁ జెప్పఁదగినవనుట మఱియొక సందిగ్ధ విషయము. అయినను నిజముగాఁ బంచజనశబ్ద మార్యవర్గ వాచకముగా నెదుటఁ గనబడుచున్నది గావున నితర వర్గములెన్ని యున్నను ప్రధానములైన యైదు వర్గములివి యని వాని నొక్కచోఁ జేర్చి చెప్పుచున్న యీ క్రింది ఋక్కును బట్టి తెలియవచ్చును

యదింద్రాగ్నీ యదుషు తుర్వశేషు యద్ద్రుహ్యుష్వనుషు పూరుషుస్థః।[5]

1. R. V. I. 118 పుట. 2. ఋ. 7-33-6.
3. ఋ. 3-33-11, 12. 4. ఋ. క్రమముగా - 3-53-7, 9; 11.
5. ఋ, 1-108-8.

దీనినిబట్టి యదువులు తుర్వశులు ద్రుహ్యులు అనువులు పూరువులు, ఐనునవి యైదును బంచజన శబ్దముచేఁ జెప్పదగిన యైదార్యవర్గములనుట విదితము. ఇది సత్యమని తోఁచుచున్నను సాయణాచార్యులవా రీఋక్కునకు భాష్యము వ్రాయుచు:—

"యదుషు - అహింసకేషు మనుష్యేషు, తుర్వశేషు = హింసకేషు మనుష్యేషు, ద్రుహ్యుషు = ఉపద్రవ మిచ్ఛత్సు మనుష్యేషు, అనుషు = జ్ఞాతృష్వనుష్ఠాతృషు మనుష్యేషు, పూరుషు, = కామైః పూరయితవ్యే ష్వన్యేషు స్తోతృజనేషు".

అని యర్థము వ్రాయుటకు నిరుక్తసంప్రదాయమే కారణమనుట స్పష్టము. అయినను, ఈ వర్గముల మనుష్యులిట్టి స్వభావములు కలవారని తెలిసికొనుటకీ యర్థములు తోడ్పడుచున్నవని తలంపవచ్చును. కాని ఋగ్వేదములోని రాజవంశములు సక్రమముగా నితిహాసాదులకు లభింపలేదనియు, ఋగ్వేదమునందే ప్రధానార్యవర్గములతోఁ బాటుగా సప్రధానార్యవర్గములు గూడ ననేకములు గనవచ్చుటంజేసి యుందేవేవి యాప్రధాన వర్గముల చీలికలో గ్రహింపనవకాశము తక్కువగా నున్నదనియు, ఋగ్వేదమునఁ గనవచ్చుయదు తుర్వశాదివంశముల విచ్ఛిన్నములుగాఁ బురాణాదులకు లభింపమిచే నిందు లభించిన వంశక్రమములను బట్టియే వేదములోని వంశములను సరిపుచ్చివేదకాల నిర్ణయము చేయుటసముచితము గాదనియుఁ గొందఱు తలంచుట మాత్రము యుక్తమని చెప్పవచ్చును. ఇందుకొక దృష్టాంతము

"సుదాసుఁడను రాజుచే వసిష్ఠపుత్రులు యజ్ఞము చేయించుచున్నారు. ఆ సమయముననే మఱియొకచోటఁ బాశద్యుమ్నుఁడను రాజు యాగముచేయుచుండెను. ఇంద్రుఁడా జన్నమున నుండి సోమపానము చేయుచుండగా వసిష్ఠపుత్రులు మంత్రబలముచే నతనిని సుదాసునియజ్ఞమునకు రప్పించిరి. సుదాసునికిఁ బదిమంది రాజులతో యుద్ధము సంభవించినది. అపుడు వసిష్ఠులస్తుతి కానందించి యింద్రుఁడు సుదాసుని రక్షించెను." ఇత్యాదిగా ఋగ్వేదమునఁ గొన్ని వర్ణనలు గలవు.[1] ఇందు పేర్కొనఁబడిన సుదాసుఁడే రాజవంశమునకుఁ జేరినవాఁడో యెప్పటివాఁడో యెక్కడఁ బదిమంది రాజులతోఁ బోరాడెనో యారాజులెవరో తెలిసికొనుటకు ఋగ్వేదమున సరియగు నాధారములు గనరావు. అయినను 'ఆర్యులు తొలుతఁ బంజాబు నాక్రమించునపు డచ్చటివారితో సుదాసునికిఁ బోరు సంభవించె' నని

1. ఋ 7-33-2, 8.

కొందఱును, 'ఆర్యావర్తమున నార్యులు స్థిరపడిన తరువాతఁ జాలాకాలమున కుత్తర పాంచాలమునకు రాజయిన సుదాసునికిఁ గొందఱార్యులతోను. అనార్యుల తోను బోరాటము తటస్థించెనని మఱికొందఱు నూహించుచున్నారు.[1] నిరాధారము లయినయిట్టి యూహలే ఋగ్వేదములోని రాజవంశములు దురవగాహములుగానున్న వనియు వానికిని బురాణాదులలోని వానికిని సంబంధ మత్యంత దురవగాహముగా నున్నదనియుఁ జెప్పుచున్న వనుట స్పష్టముకదా! దీనినిబట్టి యచతుర్వర్ణాది శబ్దము లార్యవర్గబోధకము లన్నమాట సత్యమైనను, దానివలన మనకుఁ దెలియవచ్చెడి చరిత్ర విషయము మాత్రము సందిగ్ధమే కాని స్పష్టముకాదు 'సంస్కృత వాఙ్మయమందు సరియైన చరిత్ర విషయములు పూర్తిగా మఱుఁగుపడి యున్న'వని యిట్టి యభిప్రాయమునే మార్గోనలు పండితుఁడు మఱియొక సందర్భమున నావిష్కరించి యుండెను.[2] ఇఁక దీని నిట్లుంచి, ఆర్యులకు శత్రువులుగా వర్ణింపఁబడిన యనార్యులను గూర్చి యించుక ప్రసంగింతము.

అనార్యులు:— పుణ్యకర్మహీనులును యజ్ఞాదిక్రియ లాచరించునార్యులకు బాధ కలిగించువారును దొంగలును మారణకర్మశీలురు నగుమనుష్యులు కొందఱు గుంపులు గుంపులుగా నార్యావర్తమున నందందు నివసించి యార్యులకుఁ బీడ గలిగించు చుండినట్లును వారి నింద్రుఁడు పరిమార్చుచుండినట్లును ఋగ్వేదము నలుఁగడలఁ గొన్ని వర్ణనలు గనవచ్చుచున్నవి. అట్టివారినే చరిత్రకారు లనార్యులని వ్యవహరించుచున్నారు.

అట్టి క్రూరకర్ములను దెల్పుశబ్దములు. అసుర - దాస - దస్యు - యాతుధాన - క్రవ్యాద - మూరదేవ - రక్షస్సులనునవి. ఇందు దాసాది శబ్దములకు నాశకుఁడు చోరుఁడు మాంసభక్షకుఁడు మారకుఁడు మొదలగు వ్యుత్పత్త్యర్థములు వ్రాయుచు వీని కన్నిటికీ నసురులనెడి ముఖ్యార్థమునే భాష్యకర్తలు తెలిపియున్నారు. పైశబ్దములచేఁ జెప్పఁబడు నీమోటవారె వారార్యులు సప్తసింధు దేశమునకు రాక మున్నే యందుండిరనియు నార్యులందు ప్రవేశించి వారిని జయించి వశపఱుచు కొనియుఁ దక్షిణమి వైచియు నణఁగించియు, వారిని దాసులు లేక దస్యులను పేరఁ బిలుచుచుండి రనియు వారే తరువాత నార్యులకు వ్యతిరిక్త ధర్మములు కలవారగుటచే ననార్యులని వ్యవహరింపఁబడుచు వచ్చిరనియుఁ గొందఱి యభిప్రాయము.[3]

1. పార్గిటెరు A. I. H. Jr. P. 2.
2. Sans. Lit. P. 10.
3. Sans. Lit. P. 152.

దాసులు లేక దస్యులనఁబడువా రార్యులకంటె నితరులుగారనియు, నార్యులలోనే యజ్ఞాదికర్మ లాచరింపక వైదికనిష్ఠకు వ్యతిరేకముగా నుండువా రార్యజాతినుండి బహిష్కృతులై క్రూరకర్మ పరతంత్రులై దస్యుదాసాది సంజ్ఞల వ్యవహరింపఁ బడుచుండెడి వారనియు మఱికొందఱి యభిప్రాయము.[1] ఈ దాసదస్యు లార్యుల కంటె నితరులైన క్రూరులన్నను వారిలోని వారేయై దుశ్చరితమున వేఱుపడిన క్రూరులన్నను ఋక్సంహితా నిర్మాణ కాలమునందే వీ రార్యులకుఁ ప్రబలశత్రు వులుగా నుండిరను విషయమునఁ బై యభిప్రాయములు రెండు నేకీభవింపక తప్పదు గావున నార్యులార్యా వర్తములకు వలసవచ్చినవారు గాక మొదటినుండియు నందున్నవారే యనెడి యార్యావర్తవాదమును సమర్థించుట కుద్దేశింపబడిన రెండవ యభిప్రాయమింతకుఁ బూర్వమే గతార్థమగుటచే దానిఁగూర్చి చర్చించుట యనా వశ్యకము. ఆర్యులు సప్తసింధు దేశము చొచ్చునప్పటి కందాదిమ నివాసులు కొందఱుండిరనుటయు వారితోఁ బోరాడి యార్యులు జయముగాంచి రనుటయు విశ్వసనీయములగును.[2] ఇఁక నార్యుల విజయములకుఁ గొన్ని యుదాహరణములు.

గృత్సమదమహర్షి యిట్లు పలుకుచున్నాఁడు.

"అనాత్మజ్ఞులును దుష్టకర్ములునగు బహుశత్రువుల నేదస్యుహంతయణఁ గించెనో యతఁడే యింద్రుఁడు. దురితాత్ముఁడయ్యుఁదన పరాక్రమమునకు జడిసి పాఱిపోయి పర్వతగుహలలో దాఁగియున్నమాయావియగు శంబరాసురుని నలువది సంవత్సరములకు వెదకి పట్టుకొని యే మహాశూరుఁడు పరిమార్చెనో యతఁ డింద్రుఁడు.[3]

వామదేవమహర్షి యిట్లు చెప్పుచున్నాఁడు.

"ఇంద్రా! కులితరాసురుని పుత్రుఁడును దాసుఁడునగు శంబరాసురుని బర్వతముమీఁదఁ బట్టుకొని తలక్రిందుగాఁ బడఁగొట్టి చంపితివికదా! మఱియు దాసుఁడును వర్చినామకుఁడునైన యసురునికి సంబంధించిన పదియేను వందల మంది హింసకులను హింసించితివి — ఇంద్రుఁడు ఱాతికట్టడములతోఁ గూడిన శంబరా సురుని నూఱుపురములను దివోదాసుఁడను యజమానునకు వశపఱిచెను. మఱియు లోకాపకారులైన ముప్పది వేలమంది దాసజాతివారిని వర్చినామ కార్యునికొఱకై వధించెను."[4]

1. R. V. I. Ch. VII.
2. ఋ. 1-100-18,—1-103-3, 8,—1-183-2, 3.
3. ఋ. 2-12-10, 11.
4. ఋ. 4-30-14, 15, 20, 21.

ఆత్రేయుఁడైన బభ్రుమహర్షి యింద్రుని విజయమిట్లు పొగడుచున్నాఁడు.

"ఓ యింద్రా! నీజన్మ శత్రువైన వృత్రుని వాని యనుచరులగు నసురులను హింసించి యీ యుద్ధమందే దాసుఁడయిన నముచి రాక్షసుని తల చూర్ణము చేసితివి. ఈనముచి యింద్రునితోఁ బోరాడుటకు స్త్రీ సేనలను సిద్ధపఱిచెను. అవుడింద్రుఁడు నముచికి మిక్కిలి ప్రియురాండ్రగు నిద్దఱిని ముందుగా నొక యింటిలో దాఁచి పిదపఁ బోరిలో నముచిని సంహరించెను."[1]

వామదేవ మహర్షి యిట్లనుచున్నాఁడు

"ఓయింద్రా! నీవు పిప్రునామకుఁడును మృగయనామకుఁడునైన యసురులనుగొట్టి, ఋజిశ్వరాజునకు వశపఱిచితివి. ఏఁబది వేలమంది నల్లని రాక్షసులను జంపితివి. శంబరాసురుని పురములు పగులఁగొట్టితివి."[2]

భారద్వాజుఁడైన పాయుమహర్షి లోకహింసకులయిన రాక్షసులను నశింపఁ జేయుమని యగ్నిదేవుని బ్రార్థించుచు నొకసూక్తము నిర్మించెను.[3] అందొక ఋక్కున నిజముగా నట్టివానిని జూచి చెప్పెనో లేక వాని దుశ్చేష్టలకుఁ దగినట్లు వానిరూపము గల్పించి చెప్పెనో చెప్పఁజాలము గాని 'మనుష్యులలో మిక్కిలి బాధకుఁడు గానున్న యారాక్షసుని జూచి వానిమూఁడు శిరస్సులను నఱికివేయు,' మని యగ్నినిగోరెను. మఱియు రాక్షసులు ఘోరాకారులై తమస్త్రీలను వెంటఁ బెట్టుకొని సంచరించు చుందురనియు వర్ణించెను. ఇట్టివర్ణనలు చూడఁగా నార్యేతర జాతులవారు కొందఱు ఋగ్వేదకాలమునను నార్యులకుఁ బ్రతిపక్షులుగా నుండిరని తోఁచకపోదు, అయినను, "అసుర దాస దస్యు శబ్దవాచ్యులు తొలుత నార్యజాతి లోనివారే కాని యన్యులుకారు. కర్మహీనులు దేవతారాధనదూరులునగు నందలి కొందఱు జాతిబహిష్కృతులై నీచక్రూరజాతులుగాఁ బరిగణింపఁ బడుచువచ్చిరి." అనెడ వాదమున కాధారములయిన కొన్ని ఋక్కులభావము గూడఁ బరిశీలింతము.

"ఓయింద్రా! ఆర్యులెవరు దస్యులెవరో తెలిసికొని కర్మవిరోధులైన యాదస్యులను వధింపుము. లేక యజమానునికి వశపఱుపుము. దుష్టశిక్షకుఁడ వైన నీవు యజ్ఞ ఘాతుకుల నణఁచి యజమానులచే యాగములను జక్కఁగాఁ జేయింపుము."[4]

1. ఋ. 5-30-7, 9.
2. ఋ. 4-16-18.
3. ఋ. 10-87.
4. ఋ. 1-51-8.

"ఆర్యుఁ డెవఁడో దాసుఁ డెవఁడో తెలిసికొని వారిని వేఱుచేయుచు నేను యజ్ఞమును గూర్చి వచ్చి యజమానుని సోమమును ద్రాగుచున్నాను" అని యింద్రుఁ డనును.[1]

ఇత్యాది స్థలములలోని దాస దస్యుశబ్దము లార్యులలోని యపవ్రతులను వేఱుపఱుచుచు, "దాసులైన యదుతుర్వశరాజులు సావర్ణిమనువునకుఁ బశువు లిచ్చిరి."[2] ఇత్యాదిస్థలములలోనున్న దాసశబ్దమును బోలుచున్నవిగాని వేఱుకాదు. అది గాక, యెవరు హవిస్సుల నింద్రాదులను శించి యగ్నిహోత్రములో హోమము చేయక తమనోళ్లలోనే యాహవిస్సులను బడ చికొను చున్నారో వారసురులనెడి భావము ఋగ్బ్రాహ్మణాదుల వలనఁ దెలియవచ్చుచున్నది.[3]

మఱియు, దివోదాసత్రసదస్యునామకులయిన యార్యుల నామములలోను దాసదస్యు శబ్దములు గనవచ్చుచున్నవి. కావున దాసాదిశబ్దము లార్యేతర బోధకములుగావు. కర్మదూరులైన యార్యులే యట్లు పిలువఁబడుచు వచ్చిరనియా వాదము వారితలంపు.[4]

అనిష్టపరిహర్త తేజశ్శాలి బలశాలి యిత్యాద్యర్థములం దసురశబ్దము దేవ విశేషణముగాఁ బెక్కుస్థలములఁ బ్రయోగింపఁ బడినమాట నిజము.[5] ప్రేష్యుఁడు లేక యుపచార కర్తయనెడి యర్థమందు దాసశబ్దము రాజ విశేషణముగాఁ బ్రయోగింపఁబడినమాటయు నిజము. ఆర్యులలోని వారగు పారసీకులు యజ్ఞదూరులై యసురులని పిలువఁబడుచు వచ్చినమాటయు సత్యము. కాని యింత మాత్రమున నార్యులు రాకమున్ను సప్తసింధుదేశమం దనార్యజాతి యొకటి లేదని చెప్పుటకు వీలు కనఁబడదు. ఇట్లనుటచే నార్యులలోనివారు కొందఱు దురాచారులై యార్యులచేఁ బరిత్యక్తులై వేఱుపడలేదని కాని, యట్టివారి సంతతివారు పూర్తిగా నార్య ధర్మములను మఱచిపోయి మూఢజాతి వారుగాను నీచులుగాను మాఱిపోలేదని కాని చెప్పుటగాదు. వేదములకాలము నుండి యట్టివారును వేఱుగా వచ్చుచునే యున్నారు. ఋగ్వేదమునందు నట్టి యనార్యుల సూచనలు గలవు.

1. ఋ. 10-86-19.
2. ఋ. 10-62-10.
3. ఋ. 1-51-5, 9, కౌషీతకివాజసనేయ బ్రాహ్మణములును.
4. R. V. I. Ch. VII. P. 127-136.
5. ఋ. 1-54-3, 1-24-14, 1-35-10.

"యయాతి యిచ్చినశాపమున నభిషేకదూరులై నవయుచున్న యదుతుర్వశు లనురాజుల వృత్తాంత మంతయుఁ జక్కఁగాఁ దెలిసికొని యింద్రుఁడు వారిని మరల నభిషేకార్హులనుగా నొనర్చెను." ఆర్యులమని చెప్పుకొనుచు యాగదేవపూజా రహితులై సరయూనదీతీరమున వసించియున్న యర్ణచిత్రరథులను రాజుల నింద్రుఁడు సంహరించెను."[1]

"ఇంద్రా! ఎవరు నీ భక్తులమైన మాకంటె వేఱై నినుఁ బూజింపక కర్మ రహితులయిరో వారు నీవారు కారు. యాగాదు లొనర్చునట్టి ఋత్విగ్యజమానుల మైన మేమే నీ వారము."[2]

"ఇంద్రుని జూచిన వాఁడెవఁడున్నాఁడు? ఒకఁడును లేఁడు. కనుక మన మెవని నేమని స్తుతింతుము? ఇంద్రుఁ డున్నాఁడనుట వాదమాత్రమే కాని సత్యము కాదు."[3]

ఇత్యాది వర్ణనలనుబట్టియు, నందందు ప్రయోగింపఁబడిన - అయజ్వ - అవ్రత - అబ్రహ్మ - ఇత్యాది విశేషణములనుబట్టియు నార్యులనుండి వేఱుపడి యనార్యత్వము చెందినవారు కొందఱు కాలమున నుండిరనుట విస్పష్టము. విశ్వామిత్రశప్తు లయిన యతనిపుత్రులంధ్ర పుండ్ర శబర పులింద మూతిబ సంజ్ఞల నీచజాతి విశేషులైరనియు వారిసంతతివారు దస్యులలో (దొంగలలో) నధికులై రనియు నైతరేయబ్రాహ్మణమునఁ గనవచ్చు వర్ణనముగూడఁ గొంద ఱార్యజాతివారు శాపదురాచారసత్కర్మ పరిత్యాగాది కారణముల నీచజాతులవారుగా మాఱిపోయి నట్లు తెలుపుచున్నది. అట్టివారు దస్యుజాతివారికంటె వేఱై తరువాత వారిలో నంతర్భూతులైరనుటకు "ఉదన్త్యా బహవో వైశ్వామిత్రా దస్యూనాం భూయిష్ఠాః" అనువాక్యమే ప్రమాణ మగుచున్నది.[4] అది గాక, అసురదాసాది శబ్దములు కొన్ని యర్థంతరముల నార్యవిశేషణములుగాఁ గనవచ్చుచున్నను, ఎవరు బ్రహ్మద్వేషులు ఘోరచక్షుష్కులు పరుషభాషులు కృష్ణత్వక్కులు నరమాంసభక్షులు మృధ్రవచస్కులు ఘోరరూపులు త్రిశిరస్కులు మొదలగు విశేషణముల నిరూపింపఁబడిరో యట్టిదుష్టులసంఘ మొకటి యార్యుల కంటె వేఱై సప్తసింధుదేశమున ముందుగానే

1. ఋ. 4-30-17-18.
2. ఋ. 5-33-3, 5.
3. ఋ. 8-100-3.
4. ఐ. బ్రా. అ. 33 ఖ 6.

యున్నట్లుగా నాయావర్ణనల వల్ల విదితమగుచుండ దీనికింత చింతయేల ? అయినను దీనిని బలపఱుప నింకొకటి రెండుమాటలు చెప్పి యీ ప్రసంగము చాలింతము.

''కుయవుఁడను పేరుగల యసురుఁడు పరులధన మపహరించుకొని పోయి యితరులకు దురవగాహ మయినట్టిశిఫానదిలోని లోఁతుగుంటలో సకుటుంబముగా వసించుచున్నాఁడు. ఇంద్రా ! వానినివధింపుము'' మహాశూరుఁడైన యాకుయ వాసురుని, అంజసి కులిసి వీరపత్ని యనునదులు రక్షించుచున్నవి.''[1]

ఇంద్రా ! అనార్యనివాసములైన కీటకములనెడి జనపదము లందున్నగోవులు నీ కేమి చేయుచున్నవి ? సోమములోఁ బోసికొనుటకుఁ బాలిచ్చుచున్నావా ? కర్మోప యుక్త మయినపాత్రమును దమపాలచే నలంకరించుచున్నవా ? ఏమీలేదు. ఆ గోవులను దెచ్చి మా కిమ్ము. మఱియు కుసీదవృత్తిచే ధనము పెంచుచున్న మగందునిపుత్రుఁడగు ప్రమగందునివద్దనున్న ధనము తెచ్చి మా కిమ్ము. ఇంకను నైచాశాఖ (నీచజాతివారి) సంబంధమైన ధనము తెచ్చి మా కిమ్ము.''[2]

''కృష్ణుఁడు (నల్లనివాఁడు) అనుపేరు గల యసురుఁడు పదివేలమందియను చరులతోఁ గూడిన యంశుమతీ నదీ తీరమందు వసించియుండెను. ద్రుతగతియుఁ గ్రూరకర్ముఁడునగు వాని నింద్రుఁడు బృహస్పతి సహాయుఁడై పరిమార్చెను.''[3]

ఇత్యాది వర్ణనలవల్ల ఋగ్వేదకాలమం దనార్యజాతియొకటి యుండెనని స్పష్టముగాఁ దెలియవచ్చుటయే కాక, గంగానదికిఁ దూర్పుభాగమున నుండు కీకట మనెడి యనార్యదేశ మా నాఁటి యార్యు లాక్రమించినది కాదని కూడ విదితమగు చున్నది. మఱియు నార్యులు క్రొత్తగా సప్తసింధుదేశమునఁ బ్రవేశించునపుడో లేక యుందే యొకచోటినుండి మఱియొక చోటికిఁ బ్రయాణము చేయునపుడో, దారి కడ్డముగా వచ్చి తమధన మపహరించువారును దారి తప్పించి పెడదారికిఁ ద్రిప్ప యత్నించువారును బందిపోటు దొంగలును బాపాత్ములునగు శత్రువులబారినుండి రక్షింపుమని పూషదేవుని బ్రార్థించుటయే.[4] యనార్యజాతి యొకటి యంతకుమున్నే

1. ఋ. 1-104-3, 4.
2. ఋ. 3-53-14. కీకటానామ, అనార్యనివాసో జనపదః. నిరుక్తము-పిబత ఖాద శాయమేవ లోకో నపర ఇతి వదంతో నాస్తికాః కీకటాః-సాయణభా-(తేషాం నివాసో జనపదః కీకటాః.)
3. ఋ. 8-96-13, 14.
4. ఋ. 1-42-1, 2, 3

యున్నదనుటకుఁ జాలును. ఆ జాతివారు నల్లనివారని కృష్ణవిశేషమువల్లఁ దెలియుచున్నది. వారు దాస దస్యు లనక కొందఱు తలంచినట్లుగా నార్యులలో దురాచారభూయిష్ఠులై వేఱుపడిన దాసదస్యులన్నచో నిదిక్షి మఱియొక యనార్యజాతియగు ననుట కాటంకము కలుగదు. కావున నిఁక వర్ణములనుగూర్చి కొంత పరిశీలింతము.

వర్ణములు :-- దశమమండలములో బ్రాహ్మణ రాజన్య వైశ్యశూద్ర శబ్దములు నాలుగు చతుర్వర్ణ వాచకములుగా నొక్క ఋక్కున మాత్రము ప్రయోగింపఁబడియున్నవి.[1] అందే బ్రహ్మశబ్దము మఱికొన్ని ఋక్కులలో బ్రాహ్మణవర్ణబోధకముగాఁ గనవచ్చుచున్నది.[2] తక్కిన మండలములలో సర్వత్ర యిది ఋత్విఙ్మంత్ర కర్మపరముగానే యున్నదని చెప్పవచ్చును. అట్లే రాజశబ్దము గూడ నితరమండలములలో సంఘపాలకుఁడు ప్రభువు కులనాయకుఁడనెడి యర్థములను దెలుపుచున్నది గాని క్షత్రియవర్ణవాచకముగాఁ గనఁబడదు, వైశ్యశూద్ర శబ్దములా యొకచోటఁ దప్ప మఱెక్కడను ఋగ్వేదములలోఁ గనరాకున్నవి. కావున బ్రాహ్మణక్షత్రియాది చతుర్వర్ణవ్యవస్థ ఋగ్వేదకాలము కడపట నేర్పడినది గాని మొదటినుండియు నున్నది కాదని చరిత్రకారు లూహించుట యుచితమనియే తోఁచుచున్నది. అందుచే వర్ణము లేర్పడినపిదప బయలుదేఱిన నిరుక్తము, ఋగ్వేదములో సర్వత్ర గనవచ్చు పంచజన పంచక్షితి శబ్దములకు నిషాదపంచమములైన చతుర్వర్ణములను నర్థమును నిరూపించుటనుబట్టి భాష్యకారు లా శబ్దముల కట్లర్థము వ్రాసినను దానినిబట్టి వైదికార్యులలో మొదటి నుండియు వర్ణభేదమున్నదని తలంపరాదు గాని ప్రథమమండలాదుల నితరార్థములందు ప్రయుక్తములైన [illegible] రే దశమమండలమునఁ గ్రమముగా బ్రాహ్మణక్షత్రియ వాచకములైనట్లు మాత్రము విశ్వసింపవచ్చును. మఱియు వృత్తిప్రవర్తనాదులనుబట్టి వర్ణభేదసూచకమైన యుత్తమ మధ్యమాధ మవిపక్ష యించుక నడుమవచ్చి యుండునని చెప్పవచ్చును గాని విద్యావివేకాదు లున్నచోట నదియును గణనీయముగా లేదనవచ్చును. ఇందుకుఁ జిన్నయుదాహరణములు రెండు.

ఆర్ష సంప్రదాయమున బ్రహ్మర్షియని ప్రసిద్ధి కెక్కినవాఁడు దీర్ఘతముఁడు. ఇతఁడురచియించిన పెక్కుసూక్తములలో నితనివృత్తాంతము సూచితమైయున్నది.[3] ఇతఁ డంగరాజమహిషికడ దాసిగా నున్న 'ఉశిక్కు' అనుదానియందు కక్షీవంతుఁ

1. ఋ. 10-90-12.

2. ఋ. 10-85-3, 16, 29, 34, 35.

3. ఋ. 1-140-161.

డను సుతునిగనెను. ఈ బాలుఁడు బీజమునుబట్టి దైర్ఘతమసుఁ డాంగిరసుఁడు నయ్యెను. క్షేత్రమునుబట్టి యౌశిజుఁడు దాసుఁడు నయ్యెను. అయినను రూప సంపన్నుఁడు విద్యాపూర్ణుఁడయిన యితనికి భావయవ్యపుత్రుఁడైన స్వనయుఁడను రాజు తన తనయల నిచ్చి పెండ్లిగావించెను.[1] సూక్తద్రష్టలయిన మహర్షులలో నొకఁడై విఖ్యాతి గన్నయితఁడు రచియించిన సూక్తములు ప్రథమ నవమ మండలములలోఁ గలవు.[2]

కవషుఁడను ఋషి దర్శించిననాలుగు సూక్తములు ఋగ్వేద దశమమండలమున నున్నవి.[3] అందు మొదటిసూక్త మపోనప్త్రియమను ప్రసిద్ధి వహించినది. ఈ ఋషిమహత్త్వమును సూచించెడి యీ సూక్తమునుబట్టియు నార్షసంప్రదాయమును బట్టియు నైతరేయకౌషీతకి బ్రాహ్మణములు రెండును గూడ నితనివృత్తాంతము నిట్లు వర్ణించియున్నవి.[4]

ఋషు లందఱు కలిసి సరస్వతీనది తీరమున సత్రయాగము చేయుచుండ నిలూషపుత్రుఁడైన కవషుఁడు వచ్చి వారినడుమఁ గూర్చుండెను. వారతనిని జూచి "నీవు దాసీపుత్రుఁడవు కితవుఁడవు. అబ్రాహ్మణుఁడవు. మా నడుమఁ గూర్చుండఁదగవు" అని పలికి వానిని తీసికొనిపోయి నీళ్ల లేనిచోట విడిచిపెట్టిరి. అతఁ డపుడు పిపాసార్దితుఁడై యబ్దేవతను బ్రార్థించుచు నొకసూక్తము రచియించెను. అదే యపోనప్త్రియము. ఆ స్తుతికి సంతోషించి సరస్వతీనది యతఁడున్న చోటికిఁ బ్రవహించెను. అది చూచి ఋషు లాశ్చర్యపడి యతనికిఁ గితవత్వదోషము లేదని నిర్ణయించి వెంటనే యచ్చటికేగి కవషుని దోడ్కొనివచ్చి తమలోఁ గూర్చుండఁ బెట్టుకొని యతని మంత్రములు వినియోగించి యాగము సాగించిరి. కవషుఁడున్న చోటికి నలుఁగడల సరస్వతీనది పరిసరించుటం జేసి యా చోటికిఁ బరిసారక మనుపేరు వచ్చిన దఁట.

పై రెండుకథలనుబట్టి యా కాలమున బాటింపఁదగిన వర్ణభేదము లేదని తెలియకపోదు. కాని ఋగ్వేదపరిసమాప్తికాలమందా భేదము స్పష్టముగా నేర్పడెననుట నిజము.

1. బృహ-3-143-146.
2. ఋ. 1-116, 9.74.
3. ఋ. 10-30-34.
4. ఐ. బ్రా, 2-19, కౌషీ-11.

వృత్తులు :— ప్రాచీనార్యుల వృత్తులలో నతిముఖ్యములైనవి గోరక్షణము కృషి, అందు గోరక్షణము :— ఆ కాలమున గోవులకున్న ప్రాధాన్యము మఱి దేనికిని లేదు. రాజు పురోహితుని కిచ్చుకానుక గోవు. యజమానుఁడు ఋత్విక్కుల కిచ్చుదక్షిణ గోవు. తండ్రి కూఁతురి కిచ్చునరణము గోవు ఋషులు దేవతలకు మ్రొక్కి కోరునది గోవు. వారి ప్రత్యక్షదేవత గోవు. వేయేల? వారి జీవనమంతయు గోవుతోనే యున్నది. వారు గోవులయెడఁ జూపుభక్తి శ్రద్ధలు వర్ణనాతీతములు. వారు నిత్యము హోమము చేయునది గోఘృతము గోక్షీరము. వారియాహార మావునెయ్యి, ఆవుపాలు అట్టియెడ వారు గోరక్షణ మందతి జాగరూకులయి యుండిరనిన నాశ్చర్య మేమి?

ఒకఋషి కృష్ణాసురుని సంహరించి యతనివద్దనున్న గోవులను దెచ్చి యిమ్మని యింద్రుని బ్రార్థించును మఱియొకఋషి పణినామకాసురుని జయించి తెమ్మని కోరును. మఱికొందఱు 'ఓయగ్నీ! ఓయశ్వదేవతలారా! ఓసోమా! మాకు గోసంపద నొసఁగు'మని ప్రార్థింతురు. వారుపమానముల యందు గూడ గోవులనే యెక్కువగా వాడుట చూచినచో వారికి గోవులయందున్న మహాదరము గోచరించును. ఒకఋషి, యుషోదేవి యెఱ్ఱావులమందవలెఁ దూర్పున గోచరించుచున్నదని వర్ణించెను. మఱియొకఋషి దమదూడలకై పరుగెత్తుగోవుల వలెనే నదులు సముద్రమును గూర్చి యతివేగముగాఁ బోవుచున్నవని వర్ణించెను.

ముద్గలమహర్షి గోవులను దొంగలు తోలుకొనిపోయిరి. ఆ చోరులను బట్టుకొని వారిని జయించి యావులను దీసికొని వచ్చుటకై ముద్గలుఁడు రథారూఢుఁడై బయలుదేఱెను. అతనికి సేనానిగాను సారథిగాను భార్యయగు ముద్గలాని కూడ వెళ్లి భర్తకు సహాయురాలై దొంగలతోఁ బోరు సలిపి వారిని జయించి గోవులను మరల్చుకొని వచ్చెనని.[1] యొక సూక్తమున వర్ణింపఁబడి యున్నది. దీనినిబట్టి చూచినచోఁ బూర్వకాలమున స్త్రీపురుషులు గోరక్షణ మందెంత పట్టుదల గలిగి గోవులే తమసర్వస్వమని తలఁచుచుండెడివారో తెలియవచ్చును. ఇది గాక ప్రత్యేకముగా రెండుసూక్తములు గోదేవతాకములుగాఁ గనవచ్చుటయే పూర్వులు గోవులనెట్లు భావించుచుండిరో తెలుపఁగలదు మథితుఁడు భృగువు చ్యవనుఁడు శబరుఁడు మొదలగు మహర్షులనేకు లనేక విధముల గోవును బ్రశంసించియున్నారు. అందు కొన్నిమాటలు—

1. ఋ. 10-102.

"ఓ సకలదేవతలారా ! నే నొక్కఁడనే పాలు పెరుగు నెయ్యి త్రాగను. మీ కందఱికిని సమర్పింతును. మాకు గోధనము సమకూర్పుఁడు."

"ఇంద్రా ! ఇటు రమ్ము. అటు పోవుచున్న మా గోవులను మళ్లింపుము. ఇంకను గోవులను మాకు దయచేయుము. నీ వనుగ్రహించు నట్టివియుఁ జిర కాలము జీవించునట్టివియునగు గోవులవలన మేము సుఖముగా జీవింతుము. నీవంటి దేవతలకుఁ బయోఘృతరూపమయిన హవిస్సు నొసంగుదుము"

"తప్పిపోయిన గోవులనువెదక బోయినవాఁడును గోవులకొఱ కడవికి వెళ్లిన వాఁడును వనమునఁ దిరుగు గోవుల వెంటనున్నవాఁడును వనమునుండి గోవుల నింటికిఁ దోలుకొనివచ్చువాఁడును నగుగోపాలుఁడు సుఖముగా గోవులతో నింటికి వచ్చుఁగాక."[1]

"మా గోవులకు మంచిగాలి వీచుఁగాక. ఆవులు మంచిబలమిచ్చుతృణా దికము మేయుఁగాక. నిర్మలమయిన జలము త్రాగుఁగాక, ఓ రుద్రా ! గోవులను బాధింపకుము."

"సమానరూపములు విభిన్నరూపములు నేకవర్ణములునైన యీ గోవుల నామము లగ్ని యెఱుఁగును. మహర్షులైన యంగిరస్సులు పశుప్రాప్తిసాధనమైన యాగమొనరించియే గోవుల నీ లోకమునకుఁ దెచ్చిరో, ఆ గోవులకుఁ బర్జన్యుఁడు సుఖము కలిగించుఁగాక."[2]

ఇత్యాది గోవర్ణనము లనేకములు గలవు. వీనినిబట్టి యార్యులు గోసంపా దనమునందును గోరక్షణమందును నెంతటియాదరము చూపుచుండెడివారో తెలియఁ గలదు.

కృషి:— ప్రాచీనార్యులు పొలముదున్ని సేద్యము చేయుట చక్కఁగా నెఱుఁగుదురు. యవలు గోధుమలు తిలలు శ్యామాకనీవారమాషములు మొదలగు ధాన్యములు పండించు నట్టివారు 'ధాన్యకృత్తు' లనఁబడుచుండెడివారు.[3]

కక్షీవంతుఁడను ఋషి కృషినిగూర్చి యిట్లు పలుకుచున్నాఁడు.

1. ఋ. 10-19-7, 6, 5.
2. ఋ. 10-169-1-2.
3. వపంతో బీజమివ ధాన్యకృతః పృంచంతి. ఋ 10-94-13 ధాన్యం బీజం వహాథ్వే-5-53-13.

"ఓయశ్విదేవతలారా! ఆర్యుఁడయిన మనువునిమిత్తము కర్షకులునాఁగళ్ళతో నేలదున్ని యవాదిధాన్యముల విత్తనములు చల్లునట్లు చేసితిరి గదా !.[1]

బుధమహర్షి యిట్లు వర్ణించుచున్నాఁడు.

"మిత్రులారా ! నాఁగళ్ళు సిద్ధముచేయుఁడు. అఱకలు కట్టి పొలము దున్నుఁడు. నాఁగటిచాళ్ళలో విత్తనములు చల్లుడు. మన మనోరథములతోగూడఁ బంటలు పండుఁగాక. మనకొడవళ్ళు పండినపైరు కోయుఁగాక.

సఖులారా ! నీళ్ళతొట్లు నిర్మింపుఁడు. తోలుమోకులు వానికిఁగట్టుఁడు. తఱుఁగనిజెలతో వెలయు నూతులనుండి నీళ్ళు తోడుదము.

మేధావులారా ! గుఱ్ఱములకు లేక యెడ్లకుఁ గడుపునిండ మేఁతవేసి నీళ్ళు పెట్టుడు. పైరుమోపులు లాగుటకుఁ దగినబండ్లు సిద్ధముచేయుఁడు. మోపులన్నియు నొకచోటికి లాగింపుఁడు".[2]

ఇత్యాదిగా నీసూక్తము కర్షకకృత్యములను జక్కఁగాఁ వర్ణించుచున్నది. పూర్వులు కట్టకుండ లోకదానికింద్ర నొకటిగాఁ బెద్దమోకునకుఁ గట్టి దానిని రాతిగిలకమీఁద నుంచి, ఆశ్మచక్ర మనఁబడునాగిలకను ద్రిప్పి యాకుండ లతో నవిచ్ఛిన్నముగా నూతినీరు బయటికి వచ్చునట్లు చేయుచుండిరి. ఈ దృశ మైన జలాకర్షణ సాధనము ఘటీయంత్ర మనఁబడును. ఉత్తర హిందూ దేశమం దిప్పటికి నిట్టి ఘటీయంత్రములు వాడుకలో నున్నవఁట. మఱియు వర్షములవల్ల, కుభాక్రుమునదులు పొంగినపుడు కృషికృత్యము లారంభించినట్లు కూడఁ గొన్ని వర్ణనలు తెలుపుచున్నవి.[3]

వామదేవమహర్షి యిట్లు ప్రసంగించుచున్నాఁడు.

"వృషభములు చక్కఁగా మోయుఁగాక, కర్షకులు శ్రద్ధగాఁ బనిచేయుదురు గాక. నాఁగలి తిన్నగా దున్నుఁగాక. పగ్గములు బాగా మోపులు బిగించుఁగాక. మునికోల విసరి గుఱ్ఱములను నడపింపుము:—

"ఓ నాఁగటిచాలా ! నీకు వందనము లాచరించుచున్నాము. మా కను కూలురాలవు కమ్ము. చక్కని ధాన్యరూపఫలము నొసఁగుదానవు కమ్ము:—

1. యవం వృకే ణాశ్వినా వపంతేషం దుహంతా మనుషాయ దస్రా. 1-117-21.
2. ఋ. 10-101.
3. ఋ. 5-53.

"ఇంద్రుఁడు మేఁడికోల పట్టుకొనుఁగాక. పూషదేవుఁడు నాగఁటిచాలు నియమించుఁగాక. ఏఁటేఁట నాకాశము సస్యానుకూలముగా వర్షించుఁగాక.

మననాఁగళ్లు పొలములను బాగా దున్నుఁగాక. పశువుల కాపరు లెద్దులతో సుఖముగా వత్తురుగాక. మేఘుఁడు తియ్యనిజలము కురియుఁగాక.[1]

అగస్త్యుఁ డిట్లనుచున్నాడు.

"ఓమనసా ! వర్షాధారభూతుఁ డయిన యే యింద్రుఁడు వ్రీహియవాది బీజములను బొలములయం దంకురింపఁజేసి భుక్తి కలిగించుచున్నాఁడో, ఆ యింద్రుని స్తుతింపుము.' [2]

అత్రిమహర్షి యిట్లు పలుకుచున్నాఁడు.

"కర్షకుఁడు యవధాన్యము నుద్దేశించి ప్రతి సంవత్సరము మరల మరల భూమిని దున్నునట్లే పూషదేవుఁడు ప్రతివర్షము నాఋఋతువులను ద్రిప్పుచున్నాఁడు.[3]

కవషుఁడు కృషిమహత్త్వ మిట్లు పొగడుచున్నాఁడు.

"ఓరీ జూదరీ ! గౌరవబుద్ధితో నామాట నమ్ముము. ఎపుడును జూదమాడవద్దు. వ్యవసాయము చేసికొనుము. కృషివల్ల సంపాదించిన ధనముతో నానందింపుము. కృషి యనఁగా నే మనుకొనుచున్నావో ! ఆ వృత్తితో గోవులును వృషభములును నీకుఁ గలుగును. కృషి ఫలించుచున్నచో నీకుఁ బెండ్లి యగును. భార్యవల్ల సుఖింతువు. ఈ ధర్మరహస్యము తెలిపిన మహానుభావుఁడీ దృష్టిగోచరుఁ డగుచున్న సవితృదేవుఁడే. కావునఁ గృషిచేసి సుఖింపుము.[4]

కక్షీవత్పుత్రుఁడైన సుకీర్తి యిట్లు చెప్పుచున్నాఁడు.

"కర్షకు లేపంట ముందు కోఁతకు వచ్చునో దానిని గోయుదురు.[5]

దీనినిబట్టి పూర్వులు గోధూమవ్రీహియవాది ధాన్యములలో నేదిముందు పండునో దాని నెఱిఁగి వ్యవసాయము చేయుచుండెడివారని తెలియవచ్చును. ఇంక

1. ఋ. 4-57-4, 6, 7, 8.
2. ఋ. 1-176-2.
3. ఋ. 1-23-15.
4 ఋ. 10-34-13.
5. ఋ. 10-131-2.

నిట్టి వర్ణన లనేకము కలవు గాని, హైందవార్యులలో నేఁటికిని నూటికిఁ దొంబది మందియే వృత్తివల్ల నుదరపోషణము గావించ యత్నించుచున్నారో, అట్టిసుఖప్రదము స్వతంత్రము నగువృత్తి మానవుని కుత్తమ మని కొన్ని వేల సంవత్సరముల క్రిందట వైదికార్యులు కనిపెట్టి దాని నాచరించుచుండెడి వారనుట కివి చాలును.

వాణిజ్యము:—వైదికార్యులనాఁడు, కొనుట యమ్ముట నావలమీఁద దేశ దేశములకుఁ బోయి సరకులు తెచ్చుట యిచ్చటి వస్తువులు విదేశములకుఁ గొని పోవుట మొదలగు కృత్యములు విరివిగా జరుగుచుండెడివనుటకు ఋగ్వేదమునఁ గొన్ని వర్ణనలు తోడ్పడుచున్నవి.

సవ్యుఁడను ఋషిస్తోతలను వణిజులతో బోల్చి యిట్లు వర్ణించుచున్నాఁడు.

ధనసంపాదన మభిలషించు వణిజులు దానికై సంచారము చేయ నిచ్ఛగించి యోడ లెక్కి సముద్రముమీఁదఁ బ్రయాణమెట్లు సాగింతురో, అట్లే స్తోతలు స్వాభిమత ధనలాభసిద్ధి కింద్రుని స్తుతింతురు."[1]

వామదేవ మహర్షియు నిట్లే మఱియొకచోటఁ బలుకుచున్నాఁడు.

"ఓ ద్యావా భూములారా! ధనసంపాదన పరులు విదేశ సంచారము చేయ దలఁచి సముద్ర మధ్యమందలి ప్రదేశములకుఁ బోవుచు ముందుగా సముద్రము నెట్లు స్తుతింతురో, అట్లే మిమ్ము స్తోత్రము చేయుచున్నాను."[2]

పూర్వోక్తమైన విదేశ వాణిజ్యమును స్థిరపఱుచుట కీ క్రిందివసిష్ఠునిసముద్ర యానవర్ణనముగూడఁ దోడ్పడుచున్నది.

"వరుణుఁడు ప్రసన్నుఁడు కాఁగానే యతఁడును నేనును నావయెక్కితిమి. అట్లెక్కి మా నావను మేము వడిగా సముద్ర మధ్యమునకు నడపి మాకు ముందు పోయిన యితర నావలను గలసికొనునంతలోఁ దరంగములవడి కిట్టటు నొఱగి పోయిన నావలో నుయ్యాలలూఁగి పోయితిమి.[3]

క్రయవిక్రయములలో వెలనుగూర్చి వచ్చిన వివాదమును వామదేవ మహర్షి యిట్లు తీర్చుచున్నాఁడు.

1. ఋ. 1-56-2.
2. ఋ. 4-55-6.
3. ఋ. 7-88-3.

"ఒకఁ డొక వస్తువును మఱియొకనికి విక్రయించి నిర్ణయించుకొన్న వెల పుచ్చుకొని, తరువాతఁ గొన్న వానివద్దకు వెళ్ళి దీనికిఁ దక్కువ వెల యిచ్చితివి. ఇంకను గొంత సొమ్ము రావలసియున్నది. ఆ లోటు పూర్తి చేయవలసినదని యడిగినచోఁ గొన్నవాఁడా లోటు పూర్తిచేయ నక్కఱలేదు. వస్తువు విక్రయించి నపుడు వారేర్పఱుచుకొన్న మూల్యమే యమ్మినవానికి వచ్చును గాని యంతకంటె నెక్కువ రాదు. అట్లుగాక 'దీనిమూల్యము తరువాత విచారించి నిర్ణయించు కొందు' మని సమయము జరిగినచో నపుడు విక్రయించిన వాఁడడిగిన వెల కొన్నవాఁడివ్వ వలసియుండును."[1]

ఈ ఋగ్భావమును బూర్వాచార్యులు శ్లోకములుగా రచయించిరి. సాయ ణులు దాహరించిన యాశ్లోకము లివి:—

"అల్పం యః పరిగృహ్ణాతి మూల్యం పణ్యేన భూయసా
స క్రేతారం పున ర్గచ్ఛ న్నవిక్రీత స్త్వయం మయా.
ఇతి బ్రువ న్కామయతే పున ర్మూల్యస్య పూరణం
స విక్రేతా పున ర్మూల్యం భూయసా న ప్రపూరయేత్.
హీనం న లభతే వస్నం యదా విక్రీతవాన్ పురా
యథా సమయ మేవ స్యా త్తయో ర్న పున రన్యథా.
అయం విక్రయ ఏవేతి సమయ శ్చేత్కృతో భవేత్
అథ ముల్యార్థ మేత త్స్యా ద్విచార్యైవ తు నిర్ణయః.
ఇ త్యేవం సమయోఽకారి తదా మూల్యం ప్రపూర్యతే."

ఇత్యాదిగా నందం దుపమానదృష్టాంతములుగాఁ గ్రయవిక్రయాదులను దెలుపుమాటలు ఋగ్వేదమునఁ గలవు. వీనినిబట్టి యార్యులు స్వదేశ వాణిజ్యమే కాక, నౌకాయానమున విదేశమునకు వెళ్లి వ్యాపారము చేయుట కూడఁ గలదని తెలియుచున్నది. మఱియు నతిప్రాచీనకాలమం దార్యసంఘమందు వృత్తిభేదము కూడ లేదని చెప్పట కవకాశము లేక పోలేదు గాని ఋగ్వేదాంత్య కాలమందు కొన్ని వృత్తులు కొందఱు మాత్రమే చేయుచున్నట్లు కొన్ని సూచనలు కలవు. ఆంగిరసుఁడయిన శిశువనుఋషి యప్పటి వృత్తులయాచరణము నీ క్రింది విధముగా ్రశదీకరించెను. "ఓ సోమమా! మాపనులు నానాజాతీయకములై యనేకములుగా

1. ఋ. 4-24-9, 10.

నున్నవి. ఇతరజనుల పనులును వివిధములుగా నున్నవి. కఱ్ఱపనివాఁడు వడ్రము కోరుచున్నాఁడు. వైద్యుఁడు రోగము కోరుచున్నాఁడు. బ్రాహ్మణుఁడు సోమాభిషవ మొనర్చు యాగకర్మను గోరుచున్నాఁడు. నేను నీ రసము కోరుచున్నాను. ఓ సోమమా ! ఎండువెదురుజూకలు మొదలగు వానితో నొకఁడు బాణములు చేయుచున్నాఁడు. మఱియొకఁ డా బాణములకు శకునపక్షుల యీఁకలతో ఱెక్కలు చేయుచున్నాఁడు. ఇంకొకఁడు బాణాగ్రములు నూఱు ఱాళ్ల చెక్కుచున్నాఁడు. అట్లే యినుపపనివాండ్రు బంగారుపనివాండ్రు మొదలగు కర్మకారులు ధనవంతులగు పురుషులను గోరి వారిపనులు చేయుచున్నారు. నేను నీరసము వాంఛించుచున్నాను. నేను స్తుతిమంత్రములు రచియించువాఁడను. నా తండ్రి వైద్యము చేయువాఁడు. నా తల్లి పిండి విసరునది. ఇట్లు ధనకాములమై నానావిధములైన కర్మము లాచరించుచున్నాము."[1]

పై వాక్యములను బట్టి పూర్వులు బహువిధము లయినవృత్తు లాశ్రయించి క్రయవిక్రయము లాచరించుచుండెడి వారని తెలియనయ్యెడి.

శస్త్రజీవిక :— ప్రాచీనార్యులు యుద్ధకార్యములయందు నిపుణులనుటకు వారొనర్చిన యనేక సంగ్రామములే ప్రమాణము. వారిలో రథికులు సారథులు పదాతులు ఆశ్వికులు గలరు. స్త్రీలుగూడ సారథ్యము చేసినట్లును సేనానిగా నున్నట్లు ముద్గలాని యను స్త్రీ చర్యయే సాక్ష్య మిచ్చుచున్నది. అనార్యుల నణఁచుటకును వారిని బాఱఁదోలుటకును యాగవిఘాతుకులైన క్రవ్యాదులను హింసించుటకును దొంగలను బరిమార్చుటకును దేశ మాక్రమించుటకును వారు పెక్కుపోరాటములు సలిపియున్నారని యాయాసందర్భముల నింతకుమున్ను తెలిసికొని యున్నాము. వారి వృత్తులలో శస్త్రజీవికగూడఁ బ్రధానవృత్తియని ఋగ్వేదములో నెల్లెడఁ గనఁబడువారి విజయములే చాటుచున్నవి. అట్లు మహాశూరులై యనార్యుల నణఁచి పెక్కువిజయములు గాంచిన ప్రాచీనులు గుఱ్ఱములయుపయోగము తొలుత నెఱుఁగరని కొందఱు తలంచిరి గాని యది సరిగాదు. ప్రాచీనులు యజ్ఞములయం దశ్వాలంభము గూడఁ గావించి దాని మాంసమును దేవతల కర్పించి తాము తినుచున్నట్లు.[2] ఋక్కు చెప్పుచుండ, వారు గుఱ్ఱముల నెఱుఁగరనుట యనుచితము. ఇది యిట్లుండ, పురుషుని దనపై నెక్కించుకొని యతివేగముగాఁ బోవుగుఱ్ఱము

1. ఋ. 9-112-1, 2, 3.

2. ఋ. యే వాజినం పరిపశ్యంతి పక్వం 1-162-12.

దధిక్రాఖ్యమనియు నశ్వరూపుఁ డయినయగ్నికి కాపేరు చెల్లుననియు.[1] కనఁబడువర్ణ ననుబట్టి గుఱ్ఱపుస్వారిచేయుట నాఁటి వారెఱుఁగుదురనుట కాటంక ముఁడునా? త్రసదస్యుఁడను రాజర్షి యేమనుచున్నాఁడో చూడుఁడు.

"గుఱ్ఱము లెక్కినయుద్ధభటులు సంగ్రామ మభిలషించుచు నావెంటవచ్చుచున్నారు. ధనవంతుఁడ నైననేను (ఇంద్రుఁడు) యుద్ధము చేయుచున్నాను."[2]

భరద్వాజపుత్రుఁ డయినగర్గుఁ డిట్లనుచున్నాఁడు.

"ఓయింద్రా! శత్రువుల చెంతనున్న మా గోవులను మళ్లింపుము. దుందుభి మ్రోఁగుచున్నది. మాయశ్వములు నాశ్వికపురుషులును యుద్ధమునకు సిద్ధముగా నున్నారు. మారథికులు శత్రువుఁను జయింతురుగాక.[3]

వీనివలె నింక ననేకవర్ణనలు గలవు. వాని నన్నిటినిబట్టి యెక్కి స్వారి చేయుటకు శత్రువులతోఁ బోరుటకు రథములకు బండ్లకుఁ గట్టుటకు దున్నుటకుఁ బ్రాచీనులు గుఱ్ఱములను యథేచ్ఛముగా నుపయోగించుచుండెడి వారని తెల్లమగును.

మృగయ :— మృగయావృత్తికిఁ గూడ వారెక్కువగా నలవాటు పడిన వారని కొన్ని వర్ణనలవల్లఁ దెలియుచున్నది. అరణ్యానీవర్ణనముతోడి సూక్త మొకటి యార్యుల వనవిహారమును జాటుచున్నది.[4] అందు దేవముని యనుఋషి వాక్యము లిట్లున్నవి. "గవయాదిమృగము లందందు మేయుచున్నవి. లతాగుల్మాదులు గృహములవలెఁ గనఁబడుచున్నవి ఈ యడవి, కఱ్ఱలుమోసుకొని పోవుటకు వచ్చినబండ్లను సాయంకాలము విడిచిపెట్టుచున్నది." "సాయంకాలమందు విన వచ్చు నానావిధపక్షి మృగములకూఁతల కడవిలో నడచువారు దొంగల కేకలని భయపడుచున్నారు" అడవికి వచ్చినవారు సుఖముగా రసవంతములైన ఫలములు భక్షించుచున్నారు "ఫలమూలాదులతోఁ గూడిన యీ మహారణ్యము బహువిధ మృగములకుఁ దల్లిగా నున్నది."

'అవరుద్ధః పరిపదం న సింహః,'[5] అనువాక్యమునుబట్టి ప్రాచీనులు వేఁటాడి సింహమును బట్టి తెచ్చి పంజరములో బంధించెడివారని తెలియవచ్చును. ఇందుకుఁ

1. ఋ. ఉత వాజినం పురునిష్షిధ్వానం దధిక్రాము. 4-38-2; 7-44-1, 2. దధిక్రావా. 7-44-3, 4, 5,
2. ఋ. 4-42-5; 3. ఋ. 6-47-31.
4. ఋ. 10-46. 5 ఋ. 10-28-10.

దోడుగా వేఁటసాధనములైన వాగురలను దెల్పుశబ్దములు గూడ నందందు గన వచ్చును.[1] మఱియు, పృషతీభిః - అంజనగంధిం - కృష్ణాః - గౌరః ఇత్యాది ప్రయోగములవలనఁ దెలియవచ్చు దుప్పి - కస్తూరిమృగము - కృష్ణసారము - గౌరమృగము మొదలగు నడవిమృగములను వారు మృగయావ్యాపారమునఁ జూచి యుందురని భావింపవచ్చును.[2] ఒంటెలను దెల్పురజశ్శబ్ద ప్రయోగమునుబట్టి.[3] పూర్వ లుష్ట్రిములనుబట్టి తెచ్చివానిచే బరువులు మోయించుచుండెడి వారని తోఁచు చున్నది. ఇప్పటికిని సింధుదేశమున నీయాచారము కలదు. మఱియు మహిష మృగములను వారడవులనుండి గ్రామములకుఁ దీసికొని వచ్చి వానిని మందలుగాఁ బెంచి వాని మాంసము భుజించుచుండెడివారని "ఇంద్రా! నీవు మూఁడువందల దున్నపోతుల మాంసము తింటివి" అని యర్థమిచ్చు వాక్యమువలనఁ దెలియు చున్నది.[4]

మఱియు గజవర్ణనము గూడ గొన్నిచోట్లఁ గనవచ్చుచున్నది. అట్టి వర్ణ నలనుబట్టి చూడఁగా నార్యు లేనుఁగువేఁటలో నిపుణులై వానినిబట్టి గ్రామములకుఁ గొనివచ్చి యుద్ధములందు వినియోగించుచుండెడి వారనియు, నాయకులగు వా రేనుఁగునెక్కి వెళ్లుచుండెడి వారనియుఁ దెలియఁగలదు.[5]

ఇట్లే వారు పెద్దపులివేఁట గూడ సలిపియుండిరని యొక ఋక్కువలన గోచరించుచున్నది.[6] ఈ ఋక్కులో వారణశబ్దమునకు శార్దూలమని సాయణుల వారర్థము వ్రాసియున్నారు. మఱియు నడవిపందులను వేఁటకుక్కలచేఁ బట్టించు టయు, అసురులు గొనిపోయిన గోవులను వెదకుటకు శ్వానములను పంపుటయు.[7] నాఁటికాలమునఁగలదు. అట్టి వర్ణనలనుబట్టి యార్యులు గృహరక్షణమునకును వేఁట కును గూడ శ్వానములను బెంచుచుండెడివారని తెలియనగును. ఇట్లే వృషాకపి

1. ఋ. వ్రనితిర్వాగురా. 4-4-1.
2. ఋ. 1-37-2, 10-146-6; 10-94-5.
3. ఋ. 8-46-28.
4. ఋ. 5-29-8; 6-17-11.
5. ఋ. మృగా ఇవ హస్తినః ఖాదథావనా. 1-64-7. రాజేవామవా. ఇభేనా. 4-4-1. దానా మృగో న వారణః. 8-33-8. గిరా వపో న యోధిషత్. 8-45-5.
6. యువాం మృగేవ వారణా మృగణ్యవో—10-40-4.
7. 10-86-4.

యనువాఁడు పెంచినకోఁతి యింద్రాణిచేతిలోనున్న హవిస్సులను లాగుకొని పోయినదని[1] యున్న వర్ణననుఁబట్టి వానరములనుబట్టి పెంచుటకూడ నాఁడు కలదని చెప్పవచ్చును. ఇట్లెన్నెని వనమృగములను బక్షులను వారు వేఁటాడినట్లు పెక్కు వర్ణనలు ఋగ్వేదమునలుఁ గడల నాయాసందర్భములఁ గనవచ్చును.

లోహములు:— శత్రువిజయము కృషి వేఁట మొదలగునెల్ల వృత్తులలో నారితేఱినవారు వివిధలోహముల నుపయోగించియుందురని వేఱుగాఁ జెప్పనక్కఱ లేదు. అయిన నొకఁటి రెండు దాహరణములు.

శ్యావాశ్వమహర్షి యిట్లనుచున్నాఁడు.

"ఓమరుత్తులారా ! మీ బుజములమీఁద వాడికత్తులు, మీ పాదముల వీర కటకములు మీ ఱొమ్ములపై హారములు మీ శిరస్సులపై బంగారుతలపాగాలు మిక్కిలి ప్రకాశించుచున్నవి".[2] ఇట్లే ఆయస మైనవజ్రాయుధము హిరణ్మయము లైన యాభరణములు పెక్కుచోట్ల వర్ణింపఁబడినవి.[3]

ఆహారము:— ప్రాచీనార్యులావుపాలు, ఆవునెయ్యి త్రాగుచుండెడివారు. వీనినే దేవతల నుద్దేశించి యగ్నిలో హోమము చేయుచుండెడివారు. యవబియ్యము విసరి యాపిండి నేతితోఁగాని పాలతోఁగాని కలిపి తినుచుండెడివారు. యజ్ఞాదులం దిట్టిదే పురోడాశమని పిలువఁబడుచుండెడిది. గోధుమలు గూడ వారి కాహారముగా నుండెడివి. వేఁపుడు బియ్యము పేలపిండి గూడ వారు భక్షించుచుండెడివారు. వరి జాతిలో నివ్వరి బియ్యము వారి యాహారముగా నుండెడిదని చెప్పవచ్చును. ఇతరములైన వడ్లు వారి కాలమున లేవేమోయని తోఁచుచున్నది. యవప్రశంస పెక్కుచోట్లఁ గనవచ్చుటచే యవధాన్యమే వారెక్కువగాఁ బండించుకొనుచుండెడి వారనియు వానినే నిత్యభోజనమునకును యజ్ఞాదులయందు పురోడాశమునకును వాడుచుండెడివారనియు నిస్సంశయముగా విశ్వసింపవచ్చును. ఆ యవలే యిపుడు బార్లీగింజ లనఁబడుచున్నవి. ధాన్యశబ్దము ఋగ్వేదమునఁ గనవచ్చుటచే వ్రీహి గోధూమ నీవారములు గూడ వారియాహార పదార్థములుగాఁ బరిగణింపబడు చున్నవి గాని యీ శబ్దములు గనరాలేదు. కాని యింతమాత్రముచే వారితర ధాన్య జాతులెఱుఁగరని తలంపరాదు. ప్రసక్తాను ప్రసక్తిగా గొన్నివస్తువులు దాహరింపఁ

1. 10-86-5; 3-31-5,6.
2. ఋ 5-54-11—10-48-3.
3. ఋ. 9-112 1,2,3.

బడినవి. అనేకము లుదాహరింపఁబడలేదు. ముఖ్యముగా నుప్పును దెల్పుశబ్ద మొకటియు ఋగ్వేదమునలేదు. అందుచేఁ గొందఱు పాశ్చాత్యు లూహించినట్లుగా నాఁటియార్యు లుప్పుచేయుట యెఱుఁగరని కాని యుప్పుతినుట యెఱుఁగరని కాని విశ్వసింపవలసినదేనా ? ముఖ్యములయిన ఫలజాతులు పేర్కొనఁబడలేదు. అందుచే వారు వండ్లమొగ మెఱుఁగరని చెప్ప సాహసింపవలసినదేనా ? సముద్రము మీఁద యానముచేసినవారు లవణము చూచి యుండరనుటకంటెను వనముల విహారము సల్పినవారు వివిధ ఫలములు రుచిచూచి యుండరనుటకంటెను సాహసము వేఱుం డునా ? కావున యజుర్వేదమున బేర్కొనఁబడిన సమస్త భోజ్యపదార్థములును ఋగ్వేదకాలమున నుండెననియు వానిని బ్రాచీనార్యులు యథేచ్ఛముగా ననుభవించి రనియు నమ్మవచ్చును.

వారి పానీయములలో సోమరసమతి ముఖ్యము. అది యాయుస్తేజోబల వర్ధకమనివారు విశ్వసించి దానిని సేవించుచుండెడివారు. సార్వత్రికమైనదాని వివిధ వర్ణనములనుబట్టి యజ్ఞాదులందేకాక యితర సమయములందు గూడ వారు సోమ మారగించుచుండెడివారని తెలియఁగలదు. కురుక్షేత్రమునకు నడుమనున్న శర్మణా వంత మనుసరస్సుకడనున్న సోమమును, ఆర్జీకజనపదమందలి సోమమును గొందఱార్యులు మిక్కిలి ప్రేమించినట్లు కనఁబడుచున్నది.[1] ప్రగాధుఁడను ఋషి సోమమహత్త్వమిట్లు పొగడుచున్నాఁడు.

"సోమమా ! నీ వమృతస్వరూపమవు. నిన్నుఁ ద్రాగి మే మమృతుల మగుచున్నాము దేవతలను దెలిసికొనుచున్నాము. ఇఁక మమ్ము శత్రు వేమి చేయఁ గలఁడు ?

సోమమా ! తండ్రి కుమారునికి సౌఖ్యము గలిగించునట్లే నీవు మాయు దరములఁ బ్రవేశించి మాకు సుఖ మొనరింపుము."

"మేము త్రాగినసోమము మమ్ముఁ గర్మాచరణ సమర్థులనుగాఁ జేయుఁగాక. మాకు రోగములు రాకుండ రక్షించుఁగాక.''

"తండ్రిసొత్తు కొడుకనుభవించునట్లే నిన్ను మేమనుభవించు చున్నాము. మాకు దీర్ఘాయు వొసంగుము.[2]

1. ఋ. 9-113-1.

2. —2, ఋ. 8-48.

ఇట్లు ప్రశంసకెక్కిన సుగుణములుగల సోమమును వారు ప్రత్యేకముగాఁ ద్రాగుటయే కాదు, పదార్థాంతరములతోఁ గలిపికూడ దానిని భక్షించుచుండెడి వారు. మేధాతిథి ప్రియమేధులను ఋషులు సోమపానవిధానము నిట్లు వివరించి యున్నారు. "ఇంద్రా! సోమరసమును క్షీరాదికమును గలుపుము. తరువాత ధానాకరంభాదిలక్షణమైన పురోడాశమును సోమమును గలుపుము."[1]

ఇత్యాది వర్ణనలనుబట్టి వారు సోమమును బహువిధముగా సేవించుచుండెడి వారనుట స్పష్టము. ఇంక సురాపానము.

ఆర్యులు సురాపానము చేసెడివారని చరిత్రకారు లందఱును దలంచు చున్నారు. రెండు మూఁడుచోట్ల సురాశబ్దము ఋగ్వేదమునఁ గనవచ్చుచున్నది. కాని సోమపానము చేయుచున్నాననునట్లు సురనుద్రాగుచున్నానని యొక ఋషియుఁ బలికియుండలేదు. పైగా దానియెడ నిరసనభావమే చూపియుండిరి. ఇందుకు రెండు ఋక్కులభావమిందు దాహరించెదను.

"ఇంద్రా! సుర త్రాగినవానికి మత్తెక్కించునట్లే నీవు త్రాగిన సోమములు నీ కడుపులో గుడగుడలాడుచు నీకు మత్తెక్కింపఁ బరస్పర సంఘర్షణము గావించుచున్నవి."[2]

ఇందు సురాపానము మదహేతు వని మేధాతిథి యెఱిఁగినంత మాత్రమున నతఁడు సురాపాయి కావలెనా? త్రాగుడలవాటు లేనివారికిఁ ద్రాగినవాని చేష్టలను బట్టి సురా దుర్గుణములు తెలియకపోవునా? ఉట్టియెడ నిక్కడ సురవలెనే సోమముకూడ మదకారియగు ననుటకు దానిని దృష్టాంతముగా ఋషి గ్రహించి నంత మాత్రమున నాఁటియార్యులు సుర కలవాటు పడినవారని యూహించుట యెట్లు చితమగును? అయిన నీ విషయమున వసిష్ఠమహర్షి యేమి చెప్పుచున్నాఁడో చూతము.

"ఓ వరుణా! సురా రూపమును క్రోధరూపమును అక్ష (పాచికలు) రూపమునునైన దైవగతియే పురుషుని పాపప్రవృత్తికి మూలమగుచున్నది."[3]

దీనినిబట్టి యనర్థహేతువైన సురాపానమెట్లు నిషిద్ధమైనదో తెలియకపోదు. అయినను, త్రాగుకాలమున నున్నది కావుననే యిట్లు నిందింపఁబడిన దఁదురేని యది యనార్యులలో నుండెడిదని యెందుకూహింపరాదు? అట్లుకాక యార్యుల

1 ఋ. 8-2-11.—2. ఋ. 8-2-12.—3. ఋ-7-86-6.

లోనే కొందఱికి దాని యభ్యాసము కలిగియుండునని సాధింపఁజాలరేని యట్లయిన సురాపాన మాకాలమునఁ బుట్టినవెంటనే నిషేధింపఁబడినదని పై ఋషుల యభిప్రాయమున విదితము కాకపోదు. ఇంక మాంసాశనము.

ప్రాచీనార్యులు మాంసము నిరాక్షేపముగాఁ దినుచుండెడివారని యింతకు మున్నే తెలిసికొనియుంటిమి. ఇతర సమయములందే కాదు, యజ్ఞములందును యాగ పశువుల మాంసమును ఋత్విగ్యజమానులు దేవతల నుద్దేశించి హోమము చేయుటయుఁ దాము తినుటయు నాఁటికాలమునఁ గలదు.

ఇంద్రాణీంద్ర వృషాకపుల సంవాద సూక్తమం దింద్రుని మాటలిట్లున్నవి.

"ఉక్ష్ణోహి మే పంచదశ సాకం పచంతి వింశతిం ఊతాహ మద్మి,

పీవ ఇదుభా కుక్షీ పృణంతి మే విశ్వస్మా దింద్ర ఉత్తరః"[1]

నా భార్యయైన యింద్రాణిచేఁ బ్రేరితులై యష్టలు పదియేను వృషభములను, ఇరువది యెద్దులను వండుచున్నారు. నేను వానిని భక్షించుచున్నాను. తిని బలియుచున్నాను. పైగా యాగకర్తలు సోమరసముచే నా డొక్కలు నిండించుచున్నారు. అందుచే లోకమంతటికంటె నేను గొప్పవాఁడ నగుచున్నాను.

ఇట్లే వృషాకపి వసుక్ర భరద్వాజ సోమాహుతి దీర్ఘతమః ప్రభృతులగు ఋషులవాక్యములనుబట్టి యజ్ఞహవిస్సుగా మాంసమును భక్షించుట కలదని యీ క్రిందివిధముగాఁ దెలియవచ్చుచున్నది[2]

"అంగిరస్సు లింద్రునికొఱకు బలిసిన మేషమును వండిరి.'

"ఇంద్రుఁడు యజ్ఞ పశువులైన వృషభములను భక్షించుఁగాక."

"ఇంద్రా! నీ నిమిత్తము యజమానులు వృషభ పశువులను వండుచున్నారు. వాని నారగింపుము."

"అగ్నీ! ఋగ్రూపమయిన హవిస్సు ఋషభపశుమాంస రూపముగాఁ బరిణమించి నీ భక్షణమున కగుఁగాక."

1. ఋ. 10-86-14.

2. క్రమముగా 10-27-17. 10-86-13; 10-28-3; 6-16-47, 1-161-10.

"ఓ యగ్నీ ! గొడ్డావులచేతను బలీవర్దములచేతను పోఁగండ్ల మెకములచేతను ఆరాధింపఁబడిన వాఁడవైతివి."

''ఋభువులలో నొకఁడు రక్తము తీసి యావల బెట్టుచున్నాఁడు. అది రక్షోభాగము. మఱియొకఁడు కత్తితో హృదయజిహ్వా వక్షస్స్థలములయందలి మాంసము కోయుచున్నాఁడు. ఇంకొకఁడు కుక్షిస్థమాంసమును వెలువరించు చున్నాడు. ఋత్విగ్రూపులైన ఋభువులిట్లు చేసినపిదప యజమాన దంపతులు చేఁయదగిన దింకేమున్నది ?''

వీనినిబట్టి యగ్నీంద్రాది దేవతల నుద్దేశించి హోమము చేయుమాంస రూప హవిస్సును వారుకూడ భక్షించెడివారని విదితమగును. ఆ కాలమున నత్యంత శీతలమైన యాదేశమున మాఁసాహారముగూడ నావశ్యకమయ్యేనేమో కాని రాను రాను దేశమున శీతబాధ కొంచెము తగ్గుచువచ్చుట చేతనో లేక మాంసాహార ముచితము గాదని తలంచుటచేతనో తరువాతివారు దానిని నిషేధించిరి. కాని, సురా పానమువలె నది ఋగ్వేదకాలమందు నిషేధింపఁబడక చాలాకాలము వఱకు నాచర ణలోనున్నట్లుగా నితరగ్రంథములలోని యతిథిపూజా కల్పమువల్లఁ గూడ గోచ రించును. ఎట్లయిన నేమి ? ఆర్యులు బౌద్ధమతారంభ కాలమున మాంసమును బూర్తిగా నిషేధించిరనుట నిజము.

సాంఘికాచారములు :— ఋగ్వేదారంభ కాలమునం దార్యులలో జాతిభేదము లేకపోయినను, అందఱు నన్ని వృత్తులు సామాన్యముగా నాచరించుచున్నను, కాల క్రమమునఁ గొందఱు కొందఱు కొన్నికొన్ని వృత్తులయందు స్థిరపడి నట్లాయావర్తన వలన గోచరింపకపోదు. అందు యజన యాజన మంత్రదర్శన మంత్రపఠన పాఠాదులు నియతముగా నాచరించువారు పురోహితవర్గముగాను సంఘపాలన దేశ రక్షణ శత్రుహింసన జైత్రయాత్రాదు లాచరించువారు నాయక వర్గముగాను. కృషి గోరక్షణ వాణిజ్యాదు లాచరించువారు కృషీవల వర్గముగాను, పురోహితాదులకు ధర్మాచరణమునందును నాయకులకు యుద్ధకార్య నిర్వహణమునందును పరిచర్య లొనర్చుచుఁ బరిచారకులుగాను భటులుగాను నుండువారు దాసవర్గముగాను నేర్పడి పరస్పర మైకమత్యమున దేశహితములు సంఘహితములునగు తమ తమ కృత్య ములు నిర్వహించుచువచ్చిరి. అట్లా యా వృత్తులయందు స్థిరపడినవారే కాలక్రమ మున బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రజాతులుగా విడివడిరని దశమ మండలములోని యర్వాచీన ఋక్కులనుబట్టియుఁ దరువాత వెలువడిన బ్రాహ్మణేతిహాసాదులను

బట్టియు మనకు విదితమగుచున్నది. అట్లేర్పడిన యీ నాలుగువర్ణములు గాక మఱియొకటి నిషాదవర్ణమను పేర నగపడుచున్నది. అందు దురాచారములపాల్పడి భ్రష్టులైనవారును, ఆర్యులకు లోబడిన యాదినివాసులయిన యనార్యులును జేరి యుందురని యూహింపనగును. ఆ కాలమున నదియే పంచమజాతి. ఈ కాల మందలి పంచమజాతివారివలె నప్పటి పంచమవర్ణము వారత్యంతగర్హ్యులు కాక పై జాతులవారి యాదరమునకుఁ బాత్రులైనట్లుగా నిషాదపంచమములైన చతుర్వర్ణ ములకు శ్రేయము గలిగింపుఁడని యింద్రాది దేవతలను ప్రార్థించిన ఋషుల వాక్య ముల వల్లనే బోధపడుచున్నది, దశమ మండలములోని సాంఘికాచారవర్ణనలు గుణకర్మవిభాగమును బట్టి చతుర్వర్ణము లేర్పడినవిదపనే బయలువెడలిన వనుట కందందు పేర్కొనఁబడిన బ్రహ్మక్షత్రశబ్దములు తోడ్పడుచున్నవి గాని వైశ్య శూద్రశబ్దము లెటుదును గంతోక్తిగాఁ బేర్కొనఁబడినట్లు కనిపించకపోవుటచే నవి యన్ని జాతులకును సంబంధించినవా ? లేక పై జాతులు రెంటికే సంబంధించినవా ? అట్లయినచోఁ దరువాతికాలమున వెలువడిన ధర్మశాస్త్రాదులందు ద్విజశబ్దవాచ్యు లుగాఁ గనఁబడుచున్న వైశ్యులకు వైదికాచారము లున్నట్లు తెలియవచ్చుచుండఁగాఁ దొలుత లేకుండఁగఁ బోవునా ? యనెడి సందేహము ఉదయించుచున్నను, వానిని దీర్ప నాధారములందు లేమింజేసి యవి యన్నియు నార్యుల ప్రాథమిక సాంఘికా చారములుగా గ్రహింపవలసియున్నది. అట్టివానిలోఁ గొన్నిటి నిందుదాహరించు చున్నాను.

వివాహము :— దశమ మండలమున నలువది యేడుఋక్కుల సూక్త మొకటి వివాహవిషయక మంత్రములతో నిండియున్నది.[1] అందు మొదటఁ గొన్ని ఋక్కులలో సవితృపుత్రియగు సూర్యకును సోమునికిని జరిగిన వివాహము వర్ణింపఁబడినది. తరువాత మనుష్యవివాహవిధి వర్ణింపఁబడెను.

ప్రౌఢలై వరసమాగమకాంక్షిణులగు వధువులు మాత్రమే వివాహయోగ్య లగుదురు. స్త్రీ చిహ్నము లంకురింపక రజోవతులు కాక యుండు కన్యలుమాత్రమే పితృగృహమున నుండఁదగుదురు. వరుని మిత్రులు వధువు తండ్రివద్దకు వచ్చి కన్య నర్థింతురు. కన్యాదాత వరునిసుగుణములను దెలిసికొని యతనికిఁ దనకన్నె నియ్య వాగ్దానము చేయును. తరువాత శాల్మలీకింశుకద్రుమములచే నిర్మింపఁబడి నదియుఁ జక్కఁగా నలంకరింపఁబడినదియు రెండెడ్లను బూన్చినదియునగు రథము

1. ఋ. 10-85

మీఁద వధువును గూర్చుండఁబెట్టి పతిగృహమునకుఁ బంపును. తండ్రి కూఁతురి కిచ్చుగోవులను దక్షిణవస్తువుల నా బండి వెంటఁ బంపును.

వివాహము కన్యయింటఁ గాని వరునియింటఁగాని జరిగెడిది. దానికి నియమములేదు. పెండ్లికి బంధుమిత్రాదు లందఱును విచ్చేయుట కలదు. వివాహసూచకముగా వరుఁడు వధువుహస్తము పట్టుకొనును. అదియే పాణిగ్రహణమని వివాహనామాంతరముగా నేఁటికిని వాడఁబడుచున్నది. వరుఁడట్లు కన్యచేయి పట్టుకొని "కళ్యాణి ! నీకు సౌభాగ్యమును నాకు గార్హపత్యమును గలుగుటకును, నీవు నాతో వార్ధకము గడచునట్లు కడవఱకు నుండుటకును, నీ పాణి గ్రహించుచున్నా" నని పల్కును. పెద్దలు వధూవరుల నాశీర్వదింతురు. అగ్నిలో సమంత్రకముగా వరుఁడాజ్యాదిహోమములు చేయును.

వివాహానంతరము వధువును రథముపై నెక్కించి పతిగృహమునకుఁ బ్రయాణము చేయింతురు. "నీవు భర్తృగృహమున స్వామినివై ప్రజాపతివై నీ భర్త కనుకూలురాలవై యుండు'మని వధూబంధువు లాశీర్వచన పూర్వకముగా హితోక్తులు చెప్పుదురు.

వధూప్రయాణమందు మార్గమధ్యమునఁ బొలిమేరలు తోఁటలు చతుష్పథములు వచ్చినచోట్లఁ గొన్ని మంత్రములు జపింతురు. వధువు పతిగృహమునకు వచ్చినపిదప గృహప్రవేశాంగహోమములు చేయుదురు.

నూతనవధువు ధరియించిన వస్త్రము కృత్యారూపమైనది. దానిని విడిపింతురు ఆ వస్త్రమును వరుఁడు స్పృశింపరాదు. ఇత్యాదిగానున్న వివాహతంత్రమంతయు నించుమించుగా నాఁడు జరిగినట్లే నేఁడును యథోక్తముగా బ్రాహ్మణులలో మాత్రమన్ని దేశములందును జరుగుచున్నది. ఆ విధానములోని కొంత కొంత తక్కిన జాతులందు క్రమముగా లోపించినది.

ఇపుడు వివాహసమయమునఁ బఠించు ప్రధానమంత్రము లన్నియు నీ సూక్తములోనివే. అందు వరుఁడు వధువునుగూర్చి పల్కు కొన్ని మాటలు.

"అర్ధాంగీ ! శుభప్రదమైన నడవడి కలిగి సంచరింపుము. ఎన్నఁడును, కోపదృష్టితో నుండకుము పతికీఁగీడు తలంపకుము. మంచి మనస్సుతోను మంచి రూపముతోను శుచిగా నుండుము. మన పశువుల హితము కోరుచుండుము—వీరులయిన పుత్రులను గనుము. అత్తమామలను బరిచర్యచే రంజింపఁజేయుము. మఱఁదుల నాదరమున రంజింపఁజేయుము. ఆఁడుబిడ్డల నాదరింపుము."

స్వయంవరము:— ఇది ప్రాచీనకాలమున నాచరణలో నున్నట్లు పెక్కు వర్ణనలు కనరావుగాని యొక ఋక్కులోని యుత్తరార్ధము విస్పష్టముగా దీనిని దెలుపుచున్నది.

''భద్రా వధూ ర్భవతి య త్సుపేశాః స్వయం సా మిత్రం వనుతే జనేచిత్."[1]

కల్యాణియు సౌందర్యోపేతయు నగువధువు జనమధ్యమందు కూర్చుండి యుండునట్టియుఁ దనకిష్టుఁడైనట్టియు నొకని భర్తనగాఁ గోరుచున్నదని పైమంత్ర మునర్థము. సాయణాచార్యులు దీనికి భాష్యము వ్రాయుచు 'స్వయంవరధర్మేణ ప్రార్థయతే' యని భావము వ్రాసియున్నారు. కాని యిది సర్వజాతిసామాన్యముగా నుండెడిదో, లేక క్షత్రియజాతియందు మాత్రమే యుండెడిదో నిర్ణయించుట కవకాశములేదు గాని తరువాత నిది రాజకన్యలకు మాత్రమే విహితమైనదనుట ధర్మశాస్త్ర ప్రసిద్ధము.

అనులోమవివాహము ఋగ్వేదకాలమున నాచరణలో నుండెడి దనుటకు రథవీతియను రాజర్షికూఁతురిని శ్యావాశ్వుఁడను బ్రహ్మర్షి పరిణయమగుట మొదలుగా ననేకోదాహరణములు కలవు. విలోమ వివాహములకు యయాతి దేవయానిని బెండ్లాడుట యనునది యుదాహరణ మగునుగాని యీ విషయము ఋగ్వేదమున వర్ణింపఁబడలేదు. కాని యయాతి పేరును, అతని పుత్రులుగా నితిహాసాదులఁ గనవచ్చు యదుతుర్వశాదుల పేళ్ళును ఋగ్వేదమునఁ గలవు. అందుచే నా కాలమందు క్వాచిత్కముగా విలోమవివాహ ముండెనేమో యని యూహింపవలసి యున్నది కాని వేదములోని యయాత్యాదులును బురాణములలోని వారు నొకరేయని నిర్ణయించుట కష్టసాధ్యమగును.

దాయార్హత:— ఒక గృహస్థు పుత్రులు లేనివాఁడయినచో నతనికూఁతురు దాయాదయగును. ఆ కూఁతురికొడుకు కతనికిఁ బుత్రతుల్యుఁ డగును. అన్నదమ్ములు లేనికన్యను దానముచేయునపుడు ''నేను సాలంకృతయైన కన్యను నీకు దానముచేయుచున్నాను. దీనియందు నీకు జన్మించినవాఁడు నాకుఁ బుత్రుఁడగు'నని ముందుగా వరునితోఁజెప్పి వివాహము జరిగించును. అట్టి దౌహిత్రుఁడు పుత్ర

1. ఋ. 10-27-12.

ప్రాయుఁడై మాతామహుల పరలోక క్రియలకుఁ గర్తయగును. పుత్రులులేనిచోటనే పుత్రిక దాయాద యగునుగాని పుత్రు లుదయించినచో నామెకు దాయార్హతలేదు.[1]

అంత్యక్రియాచారములు:—[2] ఋగ్వేదకాలమందు శవఖననము తొలుత నున్నను వెంటనే దహనాచారము ప్రబలినది. మృతకళేబరమును శ్మశానవాటికకుఁ గొనుపోవునపుడు బంధుమిత్రాదులు దానివెంటఁ బోవుట గలదు. భర్త మృతుఁ డయినపుడు భార్యకూడ ననుయాయినియై శ్మశానమునకుఁ బోవుట యాచారము. సహగమనమున కుద్యుక్తురాలయిన యట్టి స్త్రీని మఱఁదిగాని యంతేవాసిగాని ముసలి సేవకుఁడుగాని సమీపించి నీపుత్రాదులను జూచుకొని యీ స్థలము విడిచిరమ్ము, అని మెల్లగా బోధించి యచ్చటినుండి లేవఁదీసికొని వచ్చును. దీనిని బట్టియే యాకాలమున సహగమనము కలదని కొందఱూహించు చున్నారు. మృతుని జ్ఞాతులను సంబోధించి 'మీ పెద్దలందఱును బితృయాణ మార్గమును విడిచి యీ దేవయానమార్గమునఁ బరలోకమున కేగిరి. కావున మీరు చిరకాలజీవులై యజ్ఞాది క్రతువు లాచరించి పుత్ర పౌత్రాదులతో నభివృద్ధి చెంది సకల దురితక్షయమునఁ బరిపూతులై యుండుఁ' డనియొక పెద్ద బోధించును. అశౌచము తొలఁగిపోయిన దినమున దేవాహ్వానరూపమైన పితృమేధము జరుగును.

మృతుని పుత్రాదులకు శీఘ్రమరణము సంభవింపకుండుటకును, వారు సుఖజీవులై శతవత్సరములు భూమిపై నుండుటకును మృత్యు పరిధానభూతమైన యొక పాషాణమును స్థాపించుట నాఁటి యాచారము. దాని ననుసరించి కర్మజ్యేష్ఠుఁడగు వాఁడు మృత్యుదేవతను గప్పిపుచ్చుటకై యొకఱాతిని సమంత్రకముగా స్థాపించును.

క్షత్రియుఁడు మృతుఁడయినపు డతనిచేతిలోని ధనుస్సును గర్మజ్యేష్ఠుఁ డగువాఁడు గ్రహించి 'నీవీ స్థానమున నుండుము. మేము సువీరులమై పుత్ర పౌత్రాదియుక్తులమై యీ లోకమున శత్రువులను జయింతు'మని పలుకును.

దీక్షిత మరణమునందు మృత సంస్కారాది క్రియాకలాపము జరిగినపిదప నతని యస్థులొకచోఁ బాతిపెట్టుచుఁ గొన్ని మంత్రములు పఠించుట యాచారము.[3]

1. ఋ. 3-31-1, 2.
2. ఋ. 10-18.
3. దీనినిబట్టి నాఁడు శవఖననము గలదని కొందఱు తలంచిరి కాని యది పొరపాటు, అది సంచితాస్థి ఖననమని సాయణులవారు వ్రాసియున్నారు. 10-18-10.

ఆ తంత్రమిపుడు సద్యాదులలో విడిచి పెట్టుటగాఁ బరిణమించినది. మొత్తము మీఁదఁ బితృమేధప్రక్రియ యంతయు ననుస్యూతముగా నాఁటినుండి నేఁటివఱకు నట్లే వచ్చుచున్నదనుటయే వైదిక కర్మమార్గమందలి మహత్త్వము తెలుపఁజాలును. పితృయజ్ఞము పితృ దేవతాత్వము నత్యంత మొకసూక్తమున వర్ణింపఁబడినవి.[1]

ధర్మాచరణము:—[2] అన్నదాన మత్యుత్తమము. ఆఁకలిగొన్నవాని కన్నము పెట్టనివాఁడు మృతప్రాయుఁడు. అతని నిహమందు బంధువు లాదరింపరు. పరమందు దేవత లాదరింపరు. క్షుధార్తున కన్నదానము చేయువాఁడును దరిద్రునకు ధనదానము చేయువాఁడును బుణ్యలోకము గాంతురు. అదిగాక ధన మొక్కచోట నిలుచునది కాదు. అది రథచక్రమువలెనే తిరిగి పోవుచుండును. కావున నది యున్నపుడే దానము చేసి ఫలము గాంచుట యుచితము. అనురీతిని దాన మెంతేని పొగడఁబడినది.

ఆ కాలమందలి ప్రజలు సత్యసంధులు న్యాయబద్ధులు సత్కర్మాచరణ పరతంత్రుల కుటిలవర్తనులునై జీవయాత్ర యొనరించుచుండెడి వారనుటకు ఋగ్వేదములో నెల్లెడ నుదాహరణములు లభించును. 'సా మా సత్యోక్తిః పరిపాతు విశ్వతః' సత్యవచనము నన్ను సర్వవిధముల రక్షించుఁగాక యనెడి యానాఁటి విశ్వాసము వారి సత్యప్రియత్వమును వేనోళ్లఁ జాటుచున్నది.[3] మఱియు నాంగిరసుఁడయిన బృహస్పతి మహర్షి రచియించిన విద్యాసూక్త మొకటి నాఁటి విద్యావివేకపద్ధతి నెంతయు విశదీకరించుచున్నది. అందలి వాక్యము లొకటి రెండు.—

"జల్లెడతోఁ బిండి జల్లించునట్లుగా నెవరు శబ్దార్థములను మనస్సునఁ బరిశోధించి సభలో సంభాషింతురో, అట్టి బుద్ధిమంతులగు విద్వాంసులు సమాన శాస్త్ర ప్రతిపత్తికలవారై పరస్పరము సఖ్యమును బొందుచున్నారు. అట్టివారి వాక్కులందు శుభప్రదమైన విజ్ఞానలక్ష్మి నివసించునని తెలియనగును."[4] "ఎవఁడు మనస్సుచేఁ బర్యాలోచన చేయుచునే మాటలభావము కనిపెట్టఁడో, ఎవఁడు వినుచునే మాటలు విననట్లుండఁడో, అట్టివాఁడు తెలివి మాలినవాఁడు. బుద్ధిమంతుఁ డగు విద్వాంసుఁడో, అట్లుగాక, మంచిచీర కట్టుకొని శయన సమయమునఁ దన

1. ఋ. 10-14.
2. ఋ. 10-117.
3. ఋ. 10-37-2.
4. ఋ. 10-71. "సక్తుమివతితఉనాపునంతు మనసావా చమక్రత" ఇత్యాది

ప్రక్కఁ జేరిన యనురక్తురాలగు భార్యను భర్త విస్పష్టముగాఁ జూచి యానందించు నట్లే మాటలను జక్కఁగాఁ గనిపెట్టును, సరిగా వినును, బాగుగాఁ దెలిసికొనును.''

ఇట్లు వాగ్విజ్ఞానమును బ్రశంసించు నీవిద్యా సూక్తమంతయు వేదము చదివి వేదార్థమెఱిఁగి సభలలో సంభాషింపఁదగిన వేత్తృత్వ మార్జింపఁదగునని బోధించుచు నతిమనోహరముగా నున్నది. ఇందలి వేదార్థానభిజ్ఞ నిందాపరమయిన కడపటి వాక్యములిట్లున్నవి.

''వేదజ్ఞులతో సంచరింపక దేవతల నారాధింపక యుండునట్టి విద్యావివేక శూన్యులు బ్రాహ్మణులు కారు, ఋత్విక్కులును గారు. కేవల లౌకిక వాక్కు నాశ్రయించిన యట్టివారు హాలికులై వ్యవసాయము చేసికొనుచునుందురు.''

స్త్రీ—ప్రాచీనకాలమందు సంఘమున స్త్రీ కత్యంత గౌరవమున్నట్లు ఋగ్వేదము విశదీకరించుచున్నమాట నిజము. యజ్ఞాదులయందు పురుషులట్లు యాజమాన్యము వహించి భాగస్వామినులగుదురు. వారును విద్యాభ్యాస మొనర్తురు. గృహములందు స్వతంత్రలై గృహిణీ ధర్మములు నిర్వహింతురు. పురుషులతోఁ గూడఁ బోరాటములకేగి వారికి సహాయపడుదురు. వేయేల? పురుషుల యైహికాముష్మికములకు స్త్రీలే సాధన భూతురాండ్రగుదురు. ఈ స్త్రీ ధర్మములన్నియు నందు సర్వత్ర వర్ణింపఁబడియున్నవి. కాని యర్వాచీనకాలమందు కాఁబోలు, స్త్రీ నిందగూడ నించుక కొన్ని ఋక్కులలోఁ దలచూపినది.[1]

''స్త్రీ హృదయము ప్రబలమగుటచేఁ బురుషునికి శాసింప శక్యము కానిదగును.''

''స్త్రీల సఖ్యములు స్థిరములు కావు. అవి సాలావృకముల హృదయముల వంటివి.'' ఇత్యాదులు కొన్ని సందర్భ విశేషములఁ గలవు.

తత్వజ్ఞానము:— ఋగ్వేదము యజ్ఞక్రియార్థమైన స్తుతిరూప మంత్రరాశియని యాజ్ఞికపక్షము చెప్పుచున్నను, పరిశీలించినచోఁ దరువాత వెలువడిన సకల శాస్త్రేతిహాస పురాణాదులకు బీజభూతములైన వాక్యములన్నియు నందు గోచరించును. మఱియు నర్వాచీనములైన వివిధ వేదాంతములకు నాధారభూతములైన ఋక్కులునందు వెదకినకొలఁదిని బయల్పడును ఆట్టి మహాక్షీరవారాశి

1. స్త్రియా అశాస్యం మనః, 8-33-17-న వై స్త్రైణాని సఖ్యాని సంతి సాలావృకాణాం హృదయా న్యేతా. 10-95-15.

యగు ఋగామ్నాయమును శ్రద్ధాభక్తి సమన్వితమైన ప్రజ్ఞావిశేషమునఁ దరిచి యందలి వివేకామృతము గ్రోలవలసినదే కాని యందలి బిందువులు కొన్ని రుచి చూచినంత మాత్రమునఁ దనివి తీఱదు. అయినను ఋగ్వేదమునాఁటి తత్త్వవిచారణ మిట్టిదనుటకుఁ గొన్ని ఋక్కులభావమిందు తెలిపెదను.

దీర్ఘతమోమహర్షి సృష్టిపూర్వావస్థను జీవేశ్వరులను గూర్చి యిట్లు విచారణ గావించియుండెను.[1]

"కాలాధీనమైన ప్రపంచమునకుఁ బరమేశ్వరుఁడు కారణభూతుఁడు. జాయమానమైన యీ ప్రపంచమంతయు సృష్టికిఁ బూర్వ మీశ్వరాయత్తమైన మాయయందిమిడియున్నది. కావున దాని యవ్యాకృతావస్థనుగాని సృష్టికిఁ గారణభూతుఁడైన యీశ్వరునిగాని చూచినవాఁ డెవఁడును లేఁడు. అది గాక, పంచభూతాత్మకమైన శరీరమునఁ బ్రవేశించిన పురుషుఁ డీశ్వరునికంటె నన్యుఁడు కాని యపుడు ద్రష్టవేఱుగా నెక్కడ నుండును?

"ఏకవిధమైన గమనము నేకవిధమైన రూపమును గల రెండుపక్షులొక్కవృక్ష మాశ్రయించినట్లుగా నైకాత్మ్యసంబంధము గల క్షేత్రజ్ఞపరమాత్మలిద్దఱు నొక్కదేహము నాశ్రయించి యుండిరి. వారిలో జీవాత్మకర్మఫలమనుభవించుచున్నాఁడు. పరమాత్మ కర్మఫలము ననుభవింపక యూరక చూచుచున్నాఁడు." ఈ ఋగర్థము జీవేశ్వరభేదము తెలుపునదిగాదని సాయణాచార్యుల ద్వైతపరముగా దీనిని సమన్వయించి యున్నాఁడు.

"నిజముగా శరీరము నధిష్ఠించియున్నవాఁడు పరమాత్మయొకఁడే. పక్షిద్వయదృష్టాంతమునుబట్టి జీవేశ్వరులు వేఱని తలంపరాదు. అది యౌపాధికభేదము కాని వాస్తవము కాదు. 'సఖాయౌ' అనుటచేఁ బరమాత్మ కేఖ్యానము కలదో, అదియే జీవాత్మకుఁ గూడఁ గలదని తెలియవచ్చుచున్నది గావున నేకరూపప్రకాశులగు వారిరువురికి నైకాత్మ్య ముపపన్న మగుచున్నది. అందుచే జీవేశ్వరులకు వాస్తవభేదము కూడఁ దొలఁగిపోవుచున్నది. శరీరమందు నిగూఢుఁడై యున్న పరమాత్మ తానీశ్వరుఁడయ్యు ననీశత్వబుద్ధిచే మోహముచెంది నేను కర్తను నేను సుఖిని నేను దుఃఖిననుచు జననమరణము లనుభవించుచున్నాఁడు. తా నెపుడు తన్నుఁ దెలిసికొనచున్నాఁడో యపుడు వీతశోకుఁడై దేహవ్యతిరిక్తుఁడై సర్వాత్మత్వసర్వజ్ఞత్వా

1. ఋ. 1-164-4, 20, 38, 39.

మహిమలను గాంచుచున్నాఁడు. లౌకిక దశయందు కర్మఫల మనుభవించెడి యా పరమాత్మయే పారమార్థికదశయందు తనయం దధ్యస్తమైన జగత్తును సాక్షిత్వముచే నీక్షించుచున్నాఁడు. కావున నిజముగాఁ బరమేశ్వరుఁ డొకఁడే. భేదము మోహ కృతమనుట ప్రసిద్ధము." సకలోపనిషద్భాష్యములందును గ్రోడీకరింపఁబడినయా ఋక్కిది.

ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే ।
తయోరన్యః పిప్పలంస్వాద్వత్త్యనశ్నన్నన్యో అభిచాకశీతి ॥

మఱియును ఋషి యిట్లు వివరించుచున్నాఁడు.

"ఆత్మ మరణధర్మమైన దేహముతోఁ గలిసి దేహాత్మత్వభ్రాంతిని జెంది సుకృతదుష్కృతము లాచరించుచుఁ దత్తత్ఫలము లనుభవించుచున్నాఁడు. స్థూల సూక్ష్మోభయశరీర పరిగ్రహమున గుణత్రయాన్వితుఁడై సంసారమునఁ బరిభ్రమించునతఁడు పరమాత్మయే కాని యన్యుఁడు కాఁడు, అయినను, కర్మవాసనా పరీతుఁడై తన్ను దేహాతిరిక్తునిగాఁ దెలియఁజాలకున్నాఁడు. సోపాధికుఁడైన యతఁడే వివేకమున దేహాతిరిక్తుఁడైన యాత్మ కలఁడని భావించుచున్నాడు. కాని దేహ వ్యతిరిక్తుఁడైన యాత్మతానేయని తెలిసికొనఁ జాలకున్నాఁడు అందుచే నాత్మజ్ఞానము దుర్లభమగుచున్నది. కాని జీవాత్మకుఁ బారమార్థికరూపము కలదు.

ఋగాదివేదవేద్యుఁడు ననశ్వరుఁడు సర్వాధిష్ఠానరూపుఁడు సర్వవ్యాపకుఁడు నయిన పరమాత్మయందు సకలదేవతలు సకలవేదములు నధివసించియున్నవి. ఎవఁ డట్టియక్షరరూపుఁడయిన పరమాత్మను దెలియఁజాలఁడో వాఁడు ఋగాదివేదములచేఁ గాని తదుక్తకర్మలచేఁ గాని యేమిచేయును ? ఎవరు నిత్యుఁడయిన యా వేద వేద్యుని దెలిసికొందురో వారే జ్ఞాతలై పునరావృత్తి రహితమైన బ్రహ్మత్వమును బొందుచున్నారు.'

ఇత్యాదిగా నీ సూక్తమంతయు జీవాత్మ పరమాత్మస్వరూపమును, తదైక్యమును బోధించుచున్నది. ఇందలి కొన్ని ఋక్కులకు సాయణుల వారి యా మతములవారి యభిప్రాయములను గూడ వివరించుచు భాష్యము వ్రాసియున్నారు. భువనపుత్రుఁడైన విశ్వకర్మయను ఋషి సృష్ట్యాదుల నిట్లువర్ణించుచున్నాఁడు.

ప్రలయకాలమునఁ బరమేశ్వరుఁడు సకల ప్రపంచ ముపసంహరించి తరువాత మరల సృజింపఁదలఁచి సర్వము సృజించియందు ప్రవిష్టుఁడై యుండెను.'' అని సృష్టిని నిరూపించి 'ఈశ్వరుఁడు జగదాశ్రయభూమ్యాకాశముల కుపాదానకారణమైన సమయమం దధిష్ఠాన మేది ? ఆరంభణమేది ? యని శంకించుకొని "విశ్వతో ముఖుఁడు విశ్వవ్యాపకుఁడు విశ్వరూపుఁడునైన పరమేశ్వరుఁడు తనయందే త్రైలోక్య ముత్పాదించె'ననుచుఁ బ్రశ్నోత్తర రూపమున నద్వితీయ పరమేశ్వరత్వమును సాధించెను.[1]

పరమేష్ఠియను ప్రజాపతిమహర్షి వియదాదిభావములయిన సృష్టిస్థితి లయములకుఁ బరమేశ్వరుఁడే కర్తయని నిరూపించియున్నాఁడు. ఏడు ఋక్కులతోడి యాసూక్తమంతయు "ఈ సృష్టికిఁ బూర్వము సృష్టియున్నది. తత్సంహారమునకును పునస్సృష్టికిని బరమేశ్వరుఁడే కారణము. అనుచు నత్యంతము భావగంభీరములగు ఋక్కులచేఁ దత్త్వ మావిష్కరించియుండెను. మతత్రయమున కవకాశము గలిగించెడి యావాక్యముల భావమును బాఠకలోకము భాష్యములవల్లఁ దెలిసికొనును గాక యని యందలి ముఖ్యములైన కొన్ని ఋక్కులు మాత్రము క్రింద నుదాహరించితిని.[2]

ఇట్లే సృష్టిక్రమము పూర్వజన్మము మరణానంతరజీవుఁడు పరమేశ్వరోపాసనము కైవల్యము మొదలగు తాత్త్వికవిషయములను, బహువిధములైన యైహిక విషయములను బోధించెడిఋక్కు లెన్నేని యందందు గలవు. గ్రంథ విస్తరభీతిచే వాని నెల్ల నిందుదాహరింపఁజాలక, ఖండాంతరవాసులు గూడఁ దమ భాషలలోనికనువదింపఁబడిన ఋగ్వేదమును బఠించి ప్రాచీన భారతీయార్యుల విజ్ఞాన సంపదకు హర్షాశ్చర్య పరీతమానసు లగుచున్నారనుట యెఱిఁగియైనను మనవారు ఋగ్వేద విషయములు గ్రహించి యానందింతురుగాక యని వారికి విడుచుచున్నాను.

1. ఋ. 10-81-1, 2, 3, 4.
2. ఋ. 10-129.

"నాసదాసీ న్నోసదాసీ త్తదానీం నాసీ ద్రజో నో వ్యోమాపరో యత్ ।
కి మావరీవః కుహ కస్య శర్మ న్నంభః కి మాసీ ద్గహనం గభీరం ।"
కో అద్ధా వేద క ఇహ ప్రవోచ త్కుత ఆజాతా కుత ఇయం విసృష్టిః ।
అర్వా గ్దేవా అస్య విసర్జ నేనాథా కో వేద యత ఆబభూవ ॥
ఇయం విసృష్టి ర్యత ఆబభూవ యదివా దధే యది వావ ।
యో అస్యాధ్యక్షః పరమే వ్యోమన్ త్సో అంగ వేద యదివా నవేద ॥"

ఇఁక శక్తికొలఁదిఁ బరిశీలించిన ఋక్సంహితా చరిత్రము ముగించుచు మంగళాంతముగా నైకమత్యము బోధించెడి కడపటిఋక్కు నుదాహరించుచున్నాను.

సమానీవ ఆకూతిః సమానా హృదయాని వః ।
సమాన మస్తు వో మనో యథావః సుసహాసతి ॥

ఇది ఋత్విగ్యజమానులను సంబోధించి చెప్పఁబడినదిగా భాష్యకర్త లర్థము వ్రాసినను, ఈ మంత్ర మందఱికి నన్నికార్యములం దుపదేశింపఁదగిన దివ్యనీతి యని భావింపవచ్చును. దీనియర్థమిది:—

ఆర్యులారా! ఎట్లు మీ యందఱికిని శుభప్రదమైన కూడిక సంభవించునో, అట్లు మీ సంకల్ప మేకవిధమగుఁ గాక. మీ హృదయము లేక మగుఁగాక. మీ యంతఃకరణము లేకీభవించుఁగాక.

ఇది శ్రీ హారితసగోత్ర మల్లాది శ్రీ వెంకమాంబా శ్రీ రామావధాని
పుత్ర సూర్యనారాయణశాస్త్రి ప్రణీతమైన సంస్కృతవాఙ్మయ
చరిత్ర యందలి ప్రథమభాగమగు వైదికవాఙ్మయమునఁ
బ ం చ మా ధ్యా య ము.

షష్ఠాధ్యాయము

సామసంహిత

దీనినిగూర్చి చతుర్థాధ్యాయమున నించుక ముచ్చటించియున్నాము. వేద సంహితలలో నిది రెండవదిగాఁ బరిగణింపఁబడుటకు ఋగ్వేదముతో దీని కెక్కువగా నున్న తాద్రూప్యసంబంధమే ముఖ్యకారణము. ఇందలి మంత్రములలో ౭౫ తప్ప దక్కినవన్నియు ఋక్సంహితలోనివే కాని క్రొత్తవికావు. ఇందు ఋగ్వేదాష్టమ నవమ మండలములలోని ఋక్కు లెక్కువగాను, తక్కిన కొన్ని మండలములలోని ఋక్కులు తక్కువగాను ఋషిచ్ఛందో దైవతములతోఁగూడ సరిగానట్లే కనఁబడుచున్నవి. కావున సోమయాగమునఁ బఠింపఁదగిన క్రమము ననుసరించి వేఱుఁగా గూర్పఁబడిన కొన్ని ఋక్సంహితా మంత్రములే సామసంహితయని చరిత్రకారుఁడు చెప్పకతప్పదు కాని, ఋగ్వేదమంత్రములు సంహితా రూపము తాల్చకముందే యందలి కొన్ని మంత్రములు గానరూపము దాల్చి సామసంహితలోని పూర్వార్చికమయ్యె నేమోయని తోఁచుచున్నది. ఎట్లయిన నేమి? ఋఙ్మంత్రస్వరముకంటె విలక్షణమును శ్రావ్యమును మనోహరమునైన గానస్వరమును దానినిబట్టి వచ్చిన యుచ్చారణభేదమును, ప్రవచనభేదమునుబట్టి వచ్చిన కొన్నిపాఠభేదములును యాగమునందు ప్రత్యేకోపయోగమును, దానినుండి వేఱుపఱిచి దీని ప్రత్యేకతను స్థాపించినవి. అందుచే నిది ప్రత్యేకసంహితయైనను ఋక్సంహితవలెఁ జరిత్రదృష్టిలోఁ బ్రాధాన్యము వహింపలేదు. అయినను గేయ ధర్మమున మహామహత్త్వము వహించిన యిది యనేక శాఖోపశాఖలై వైదికవాఙ్మయమున నగ్రస్థాన మధిష్ఠించియున్నది. తరువాత వెలువడిన సంగీత శాస్త్రమునకు మార్గదర్శకమైన దీనిగానలక్షణమే దీనిగొప్ప కంతకును గారణమనుట విదితము. ఈశ్వరుఁడు సామగాన లోలుఁడనుట ప్రసిద్ధముగదా! అనఁగాఁ బ్రాచీన మహర్షులు సకల జగదాత్మకుఁడగు బరమేశ్వరుని యనుగ్రహమునకుఁ బాత్రులగుటకై గానస్వరము కల్పించి యీ ఋక్కులను యాగములందు గానముచేయుచుఁ దద్రసాస్వాదపరవశులై యాత్మానంద మనుభవించెడి వారనుట. సామసంహితా మహత్త్వమున కింతకంటె వేఱేమి కావలెను?

సామసంహితా విభాగము

దీనివిభాగములు మిక్కిలి గజిబిజిగా నున్నవి. కావున నిందలి భాగములను రెండుపద్ధతులుగాఁ జూపుచున్నాను. ఈ రెండు పద్ధతులుగూడఁ బ్రాచీనములే కాని యిందు రెండవపద్ధతి యించుక సులభముగాఁ గనవచ్చుచున్నది.

౧. సామసంహిత, పూర్వార్చిక ఉత్తరార్చికయని రెండు ప్రధాన భాగములుగా నున్నది. అందు పూర్వార్చిక ౫ అధ్యాయములు ౫౯ ఖండములు. అనఁగా మొదటి నాలుగధ్యాయము లొక్కొకటి పండ్రెండేసి ఖండములు. అయిదవ యధ్యాయము పదునొకండు ఖండములు. పూర్వార్చికకు - ఛందస్సు ఛంద ఆర్చికము - అని నామాంతరములు కలవు.

ఉత్తరార్చిక ౨౧ అధ్యాయములు. ౧౨౦ ఖండములు. ఇందధ్యాయముల ఖండముల లెక్క నియతముగాలేదు. కడపటియధ్యాయ మొక్కటేఖండము. తక్కినవానిలో నాలుగుమొదలుగాఁ బన్నెండువఱకు ఖండములు యథేష్టముగా నున్నవి. ఉత్తరార్చిక కుత్తరయని నామాంతరము.

౨. పూర్వార్చిక ౬ ప్రపాఠకములు. అందొక్కొకటి రెండేసి యర్ధములు అర్ధ మనఁగా నర్ధప్రపాఠకమని యర్థము. ఒక్కొక్కయర్ధమున నైదేసి దశతులున్నవి. పన్నెండవ యర్ధమున మాత్రము నాలుగుదశతులే యున్నవి. దశతి యనఁగాఁ బదిఋక్కుల సముదాయమని యర్థము. కాని కొన్నిదశతులలోఁ బదేసిఋక్కులు కనరాకున్నవి. ఎనిమిది, తొమ్మిది, పన్నెండు, చొప్పున ఋక్కులు గల దశతులు గూడఁ గొన్నిగలవు. దశతి శబ్దార్థమునకు భంగము కలిగించెడి యీ భేదమెట్లు వచ్చినదో చెప్పఁజాలముగాని మొత్తము ౬౦౦ ఋక్కులుండవలసియుండఁగా ౫౮౫ ఋక్కులుమాత్రమే లెక్కకు వచ్చుచున్నవి.

ఉత్తరార్చిక ౯ ప్రపాఠకములు. మొదటియైదు ప్రపాఠకములు రెండేసి యర్ధములు. తక్కిననాలుగు ప్రపాఠకములు మూఁడేసి యర్ధములు. ఒక్కొక యర్ధమున ననియతసంఖ్య గలసూక్తములు గలవు. అవి ౪౦౨ లెక్కకు వచ్చినవి. వానిలో నొక్కొకసూక్తము మూఁడుఋక్కులతో నిబద్ధమైయున్నది. ఆ ఋక్కుల మొత్తము ౧౨౨౬.

పై లెక్కలనుబట్టి రెండు భాగములలోని ఋక్కులు ౧౮౧౧ అని తేలినది[1] ఇందు ౨౬౧ ఋక్కులు పునరుక్తములు. వాని నొక్కమాఱే గణించుట యుచి

1. వీబరుపండితుఁ డిచ్చిన లెక్కప్రకారము ౧౮౧౦ ఋక్కుల మొత్తము.

తముగావున సామసంహితలోని ఋక్కులసంఖ్య ౧౫౩౦ అగుచున్నది.[1] కాని వీబరుపండితుఁడు ౧౫౪౯ యని వచియించెను. లేఖనముద్రణాది ప్రమాదమున ౧౯ ఋక్కులు పోవుటయో పెరుఁగుటయో సంభవించియుండును. అముద్రిత గ్రంథములలో గ్రంథాంతమున నధికముగా వ్రాయఁబడిన కొన్ని ఋక్కులందందు గనవచుచున్నవి. అట్టివి కలిసినను మంత్రసంఖ్య యించుక పెరుఁగవచ్చును. ఇది యిట్లుండ నిఁక సంహితా విశేషములు :—

పూర్వార్చికలోని మొదటియధ్యాయము పండ్రెండుఖండము లాగ్నేయకాండముగాను, రెండుమూఁడునాలు గధ్యాయముల ముప్పదియాఱుఖండము లైంద్రకాండముగాను, అయిదవయధ్యాయము పదునొకండుకాండములు పవమానకాండముగాను, బేర్కొనఁబడినవి. అందు మొదటికాండ మగ్నిని రెండవది చాలవఱకింద్రుని మూఁడవది సోమమును స్తుతింప వినియుక్తము లగుచున్నవి. కాండమునకుఁ బర్వమను నామాంతరము వాడఁబడినది. పవమానపర్వమునకు సౌమ్యపర్వమనియుఁ బేరు కలదు. నాకు లభించిన కలకత్తాముద్రిత పుస్తకమందీ మూఁడు కాండముల గ్రంథముమాత్రమే పూర్వార్చికగాఁ గనవచ్చినది గాని, చెన్నపురి తంజావూరు పుస్తకభాండాగారములలోని యముద్రితసామసంహితా పుస్తకముల వలన - ఆరుణము - శుక్రియము - మహానామ్ని - అను మఱిమూఁడు భాగములు పూర్వార్చికకు సంబంధించినవిగాఁ దెలియుచున్నది. అందును మహానామ్ని భాగమును గొన్ని పుస్తకములు పూర్వార్చికకుఁ జేర్చినవి. కొన్ని చేర్పలేదు దానినిబట్టి యది వేఱుభాగముగాఁ గనఁబడుచున్నది. కాని సామవేదగాన పుస్తకములలోఁ బూర్వార్చికకు సంబంధించిన ప్రకృతి సామములలో నారుణశుక్రియములవలెనే మహానామ్నియుఁ జేరినట్లు పెక్కు ప్రతులలోఁ గనఁబడుచున్నది. దీనినిబట్టి యీ మూఁడు భాగములును సంహితలో గణింపఁబడక ప్రకృతిలో గణింపఁబడినవని తెలియుచున్నది. ఇందుకు భాష్యకర్తయగు భారతస్వామి వచనముగూడఁ బ్రమాణమగుచున్నది.

> "ఆగ్నేయ మాద్యం పర్వైంద్ర పవమానే తతః పరే।
> త్రిపర్వ సామవేదస్య సంహితైవ మధీయతే॥"

1. ౨౬౯ ఋక్కులు పూర్వార్చికలోనివి మరలనుత్తరార్చికలోఁ బఠింపఁబడినవి. వానిలో మూఁడు ఋక్కులు రెండుసార్లు పఠింపఁబడినవి. ఉత్తరార్చికలోని తొమ్మిది ఋక్కులు రెండుసార్లు వచ్చినవి. మొత్తము ౨౬౧.

ఇట్లీయన మూఁడు పర్వములే సంహితయని వచించియు నారుణ శుక్రియ మహానామ్నీ భాగములనుగూడఁ బూర్వార్చికతోఁ జేర్చియే భాష్యము వ్రాసెను. మహానామ్నికి శక్వరియను నామాంతరము కలదు.

ఉత్తరార్చిక పూర్వార్చికకు సమకాలికము కాక యర్వాచీనమనుట నిజము. భగవద్గీతల కుత్తరగీతలు తరువాత వెడలినట్లుగా ఛందస్సునకుఁ దరువాతఁ గొంత కాలమున కుత్తరభాగము వెలువడినది. ఇది బయలుదేఱిన పిదప ఛందస్సు లేక ఛంద ఆర్చికకుఁ బూర్వార్చికయను పేరు వచ్చినది. నిజముగా మొదటి సంహిత యాగ్నేయైంద్రపవమాన కాండములు మాత్రమేయని పూర్వోక్త భారతస్వామి వచనముగూడ సాక్ష్యమిచ్చుచున్నది. కాని దానికి వెనువెంట బయలుదేఱిన యారుణ శుక్రియములు ముందుగాను, తరువాత వెలువడిన మహానామ్ని తరువాతను బూర్వార్చిక కనుబంధములైనవి. వీనికి సమకాలికముగా నో యించుక తరువాతనో యుత్తర భాగముదయించినది. ఇందుకుఁ బూర్వార్చికలోని ఋక్కులనేకములట్లే యిందు మరలఁ బఠింపఁబడుటయు, ఋగ్వేదమునుండి గ్రహింపఁబడిన ఋక్కులు విశేష పాఠభేదము చెందక యట్లే యిందు గనవచ్చుటయుఁ దార్కాణమగుచున్నవి. ఈ యర్చికలో విశేషముగా సోమయాగ ప్రధానములయిన యగ్నీంద్ర సూర్యాది దేవతాస్తుతి రూప మంత్రములు గలవు. అట్టి యీ రెండు భాగములలోని సామములును గానపద్ధతి ననుసరించి బహువిధములుగా నున్నవి.

౧. పూర్వార్చిక – ప్రకృతి తంత్రములు.— ఆగ్నేయము – బహుసామి – ఏకసామి – బృహతి – త్రిష్టుపు – అనుష్టుపు – ఇంద్రపుచ్ఛము – పవమానము – ఆరుణము.[1] శుక్రియము – మహానామ్ని – అనునవి. ఇవియే ప్రకృతి సామములు.

౨. ఉత్తరార్చిక – ఊహ తంత్రములు, రహస్య తంత్రములు.—దశరాత్రము – సంవత్సరము – ఏకాహము – అహీనము – సత్రము - ప్రాయశ్చిత్తము – క్షుద్రము – అనునవి. ఇవియే విషయ భేదమునుబట్టి యూహసామములు రహస్య సామములని ద్వివిధములైనవి.

మొదటిదానిలోని యాగ్నేయాది పవమానాంతములైన ప్రకృతి తంత్రము లందలి శ్రౌతోపయోగులైన సామము లితర సామములతోఁ గలిసి త్రిగుణితములై యూహసామములగుచున్నవి. అట్లే, అరుణ శుక్రియములందలి శ్రౌతోపయోగి

1. ఆరణమని కొన్నిచోట్ల నున్నది.

సామము లితరసామములతోఁ గలసి మూఁడురెట్లై రహస్యసామము లగుచున్నవి.[1] ఊహరహస్య సామములకువలెఁ బ్రకృతి సామములకు సమానసంఖ్యా నియమము లేదు. ఆగ్నేయాది శుక్రియాంతములైన ప్రకృతి సామఖండములు ౨౪ లోను ౧౪౪౬ సామములున్నవి. మఱి మూఁడు భారుండ సామములుగూడ వానికిఁ జేరినవి.[2]

దశరాత్రాది క్షుద్రాంతములైన యూహతంత్రములం దిరువదేపి సామములు చొప్పున నేర్పడిన ౪౮ ఖండములలో ౯౬౦ సామములున్నవి. అట్లే దశరాత్రాది క్షుద్రాంతములైన రహస్యతంత్రములందు పదేసి సామములు చొప్పున నేర్పడిన ౨౦ ఖండములలో ౨౦౦ సామములున్నవి. దీనినిబట్టి సామసంహితా మంత్రముల కంటె గేయములయిన మంత్రముల సంఖ్య సుమారొక సహస్రమధిక మయినట్లు తెలియవచ్చును. ఇది యారుణ శుక్రియ మహానామ్ని భాగములకు సంబంధించిన దనుట స్పష్టము. కాన, చరణ వ్యూహము సామసంఖ్య ౮౦౧౪ అనియు, ఇది గాక యన్యశాఖాసంఖ్య ౯౦౦౦ అనియుఁ జెప్పుచున్నది.[3]

సామసంహితలోని ఋక్కులపాఠము ద్వివిధము. ఒకటి, ఉదాత్తాను దాత్తస్వరితస్వరములతో ఋక్సంహితాదులలో నున్నట్లే యుండును. కాని స్వరసూచన పద్ధతి వేఱుగా నుండును. మఱియు నిందు గ్రహింపఁబడిన ఋక్సంహితలోని మంత్రముల స్వరము కొన్నిచోట్ల నట్లే యుండును. కొన్నిచోట్ల భిన్నముగా నుండును.[4] ఎట్లయినను ఋఙ్మంత్రము సామమంత్రమై స్వరోచ్చారణములలో నించుక మార్పు చెందినమాట సత్యము. ఇందుకు మొదటి మంత్రములోని భాగ ముదాహరణము.

1. ఆగ్నేయాది పవమానాన్తేషు తంత్రేషు యాని సామాని శ్రౌతోపయోగిని తాన్యన్యైస్సామభి స్మిళిత్వా త్రిగుణితా న్యూహసామాని, ఆరుణశుక్రియయో శ్రౌతోపయోగిని సామాని యాని తాన్యన్యైస్సామభి స్మిళిత్వా త్రిగుణితాని రహస్యసామాని – అనుక్రమణి—ఇందు మహానామ్ని చేరక పోవుటచేఁ గూడ నది భాగాంతరమని తెలియుచున్నది.
2. తంజావూరు 482 నంబరు సామవేదపుస్తకము.
3. అష్టౌ సామసహస్రాణి సామానిచ చతుర్దశ, అష్టౌశతాని, నవతి ర్దశతి ర్వాల ఖిల్యకమ్.
4. ముద్రిత గ్రంథములలోని స్వరసూచనపద్ధతి చూడనగును.

అగ్న ఆయాహి వీతయే—ఋక్సంహిత.

అగ్న ఆయా హి వీతయే—సామసంహిత.

రెండవదిగాన పాఠము. ఇది సంహితాపాఠముకంటె మిక్కిలి విలక్షణముగా నుండును. సంహితలోని ఋక్కుగానమందు గుర్తుపట్టుటకు వీలులేనంతగా మాఱిపోవును. గానలక్షణమును బట్టి కొన్ని వర్ణము లధికముగాఁ జేరును. ఇందుకొక యుదాహరణము:—

"అగ్న ఆయాహి వీతయే గృణానో హవ్యదాతయే"

"ఓతగ్నాఇ। ఆఘోయాహీఇరో ఇతోయాౢ్రేఇ।
తోకాయాౢ్రేఇ। గృకాణానోహ। వ్యచోదాతో
యాౢ్రేఇ। తోకాయాౢ్రేఇ॥"

ఋషులు:— సామసంహితలోని ఋక్కులలో ఋగ్వేదమునుండి గ్రహింపఁబడినవాని కందలివారే ఋషులుగానున్నారు. స్వల్పముగా నున్న క్రొత్త ఋక్కులకు - శ్రుతర్షి - తృణపాణి - వార్షహవ్యుఁడు - ముక్త వాహాద్వితుఁడు - ఆయుణ్శ్వాహి - మొదలగు ఋషులు సుమారు ముప్పదిమంది యున్నారు. ఋగ్వేద ఋషులలో సప్తమహర్షులు రచించినవియు, అందును భరద్వాజ వసిష్ఠ గోతములు రచించినవియు నధికముగా నున్నవి ఇతరర్షులలో వామదేవుఁడు నిర్మించిన వెక్కువగా నున్నవి. ఇందుకు భాష్యకర్తయగు భారతస్వామి యుదాహరించిన యీ క్రింది శౌనకోక్తిగూడఁ బ్రమాణమగుచున్నది.

"నస్మర్యన్తఋచాం యాసా మృషయః క్వాపికేచన।
వామదేవ ఋషి స్తాసాంజ్ఞేయ ఇత్యాహ శౌనకః॥"

దీనినిబట్టి సంహితర్షులలో వామదేవుని కెక్కువ ప్రాధాన్యము గలదని విదితమగును. మఱియు ఋక్సంహితాకర్తల నూతన మంత్రములు కూడా కొన్ని యిందు కలవు. ఇందుకొక యుదాహరణము:— కవషుఁడను ఋషి ఋగ్వేదదశమ మండలమున నైదుసూక్తములకు ద్రష్టగా నున్నాఁడు. అందులేని ఋకొక్కటి యిట్లున్నది.

"విస్రుతయో యథా పథా ఇంద్రత్వద్యన్తు రాతయః."[1]

ఓ యింద్రా! రాచబాటనుండి చిన్నత్రోవలు బయలు వెడలునట్లుగా నీ వలన వివిధములైన ధనములు బయలు వెడలివచ్చుఁ గాక యని దీనియర్థము.

ఇఁక సంప్రదాయ ప్రవర్తకులైన ఋషులనేకులు గలరు. వంశ బ్రాహ్మణ మను గ్రంథము వారి పరంపరను రెండు పట్టికలుగాఁ జూపియున్నది.[2] ఆ పట్టికలు రెండును గూడ శిష్యగురుక్రమమున వెనుకకు నడిచినవి. సులభముగాఁ దెలియుటకై వాని నిందు గురుశిష్యక్రమమునఁ జూపుచున్నాను.

సామవేదసంప్రదాయ ప్రవర్తక పట్టిక. ౧.

1. బ్రహ్మ - స్వయంభువు
2. ప్రజాపతి.
3. మృత్యువు
4. వాయువు.
5 ఇంద్రుఁడు.
6. అగ్ని.
7. కశ్యపుఁడు.
8. ఋశ్యశృంగుఁడు-కాశ్యపుఁడు.
9. విభండకుఁడు. ,,
10. మిత్రభువు ,,
11. ఇంద్రభువు. ,,
12. అగ్నిభువు. ,,
13. శవసుఁడు. ,,
14. దేవతరసుఁడు-శావసాయనుఁడు.
15 ప్రతిథి-దైవతరసుఁడు.
16. నికోథకుఁడు-భాయజాత్యుఁడు.
17. వృషశుష్ణుఁడు-వాతావతుఁడు.
18. ఇంద్రోతుఁడు-శౌనకుఁడు.
19. దృతి-ఐంద్రోతుఁడు.
20. దరాలుఁడు-దాత్రేయుఁడు.
21. శూషుఁడు - వాహ్నేయుఁడు, భారద్వాజుఁడు.
22. సుమంతుఁడు-బాభ్రవుఁడు, గౌతముఁడు.
23. ఆరైహణ్యుఁడు - వాసిష్ఠుఁడు, రాజ్యానుఁడు.
24. చైకితానేయుఁడు-వాసిష్ఠుఁడు.
25. స్థిరకుఁడు - గార్గ్యుఁడు.
26. మశకుఁడు-స్థైరకుఁడు.
27. అతిధన్వుఁడు-శౌనకుఁడు.
28. ఉదరశాండిల్యుఁడు.
29. శాండిల్యాయనుఁడు- ఔదరశాండిల్యుఁడు. గర్దభీముఖుఁ(
30. విచక్షణుఁడు-తాండ్యుఁడు.
31. శాకదాసుఁడ -భాండితాయనుఁడ
32. సంవర్గజిత్తు-లామకాయనుఁడు.

1 సా. అ ౪-౫ ౧౧-ఋ. ౭.

2. ఏవం సామవేద ప్రవర్తకా మేకా మృషిపరంపరాం దర్శయిత్వా, అః మపి దర్శయితుం తత్కీర్తనే కించి న్నియమం దర్శయతి వం-బ్రా-భా.

33. గాత - గౌతముఁడు.
34. రాధుఁడు - గాతృపుత్రుఁడు గౌతముఁడు.
35. అమావాస్యుఁడు - శాండిల్యాయనుఁడు.
36. అంశువు - ధానంజయ్యుఁడు.
37. సుతేమనుఁడు - శాండిల్యాయనుఁడు.
38. సునీథుఁడు - కాపటవుఁడు.
39. మిత్రవిందుఁడు - కౌహలుఁడు.
40. కేతువు - వాజ్యుఁడు.
41. ప్రాతరహ్నుఁడు - కౌహలుఁడు.
42. సుశ్రవుఁడు - వార్షగణ్యుఁడు.
43. సాతి - ఔష్ట్రాక్షి.
44. మద్రగారుఁడు - శౌంగాయని
45. కాంబోజుఁడు - ఔపమన్యవుఁడు.
46. శాంబుఁడు - శార్కరాక్ష్యుఁడు.
47. ఆనందుఁడు - చాంధనాయనుఁడు.
48. భానుమంతుఁడు - ఔపమన్యవుఁడు.
49. ఊర్జయంతుఁడు ,,
50. సుశారదుఁడు - శాలంకాయనుఁడు.
51. శ్రవణదత్తుఁడు - కౌహలుఁడు.
52. కుస్తుకుఁడు - శార్కరాక్ష్యుఁడు.
53. భవత్రాతుఁడు - శాయస్తి.
54. బృహస్పతి - శాయస్తి, గుప్తుఁడు.
55. సుప్రతీతుఁడు - ఔలుండ్యుఁడు.
56. మిత్రవర్చసుఁడు - స్థైరకాయనుఁడు.
57. బ్రహ్మవృద్ధి - ఛందోగమాహకి
58. గిరిశర్మ - కాంఠేవిద్ధి.
59. నిగడుఁడు - పార్ణవల్కి.
60. త్రాతుఁడు - ఐషుమతుఁడు.
61. రుద్రభూతి - ద్రాహ్యాయణుఁడు.
62. శర్వదత్తుఁడు - గార్గ్యుఁడు.

బ్రహ్మ ప్రజాపతి మొదలగువారు ఋగ్వేదసంహితలోఁ గూడా ఋషులుగానే కనఁబడుచున్నారు. కావునఁ బైపట్టిక యందలి మొదటియారును బ్రహ్మర్షి నామము లనియే విశ్వసింపఁదగియున్నది. దీనినిబట్టి బ్రహ్మ ప్రజాపతికి నతఁడు మృత్యువునకు నతఁడు వాయువునకు నిట్లే క్రమముగా సామవేదోపదేశమున గురువులగుచు వచ్చిరని విదిత మగుచున్నది.

పట్టిక - ౨.

మొదటి పట్టికలోని ముప్పదినాల్గవ ఋషియగు రాధునికిఁ బైనున్న ముప్పది ముగ్గురు ఋషులను గ్రమముగా నట్లే గ్రహింపఁ దగునని వంశబ్రాహ్మణము చెప్పుచున్నది.[1] కావున నా ముప్పదిమూఁడు నామములను మరల నిందుచూపక రాధర్షి వద్దనుండి చూపుచున్నాను. ఈ రెండవ సామవేద సంప్రదాయ శాఖకు రాధర్షి మొదటివాఁడని తెలియఁదగును. అనఁగా నతని శిష్యులలో, అమావాస్యుని

1. గోభిలో రాధాచ్చ గౌతమాత్ప్రమానం పరమ్.

శిష్యపరంపర యొకటి గోభిలుని శిష్యపరంపర యొకటి వేఱుపడి సామవేదమును లోకమునఁ బ్రవర్తింపఁజేసె ననుట.

1. రాధుఁడు-గౌతముఁడు.
2. గోభిలుఁడు.
3. బృహద్వసుగోభిలుఁడు.
4. గౌల్గలవీపుత్ర గోభిలుఁడు
5. వత్సమిత్రగోభిలుఁడు.
6. మూలమిత్ర గోభిలుఁడు.
7. వరుణమిత్ర గోభిలుఁడు.
8. అశ్వమిత్ర గోభిలుఁడు
9. పూషమిత్ర గోభిలుఁడు.
10. అర్యమరాధ గౌతముఁడు
11. సంకర గౌతముఁడు.
12. పుష్యయశుఁడు-ఔదవ్రజి.
13. భద్రశర్మ- కౌశికుఁడు.
14. అర్యమభూతి-కాలబవుఁడు.
15 నయంతుఁడు.[1]

పై పట్టికలలో పితాపుత్ర క్రమముకూడ నక్కడక్కడఁ గనవచ్చుచున్నను, ఇవి విద్యావంశ క్రమమును దెలుపునవేయని మూలభావమును భాష్యకర్త లావిష్కరించియున్నారు.[2] మఱియు సామగాచార్య పరంపర యొకటియు, సామగాన ప్రవచన కర్తృపరంపర యొకటియు, చరణవ్యూహ పరిశిష్టసూత్ర వ్యాఖ్యలో నిట్లు కనవచ్చుచున్నవి.[3]

౧. సామగాచార్య పరంపర

1. రాణాయని.
2. సాత్యముగ్రి.
3. దుర్వాసుఁడు.
4. భాగురి.
5. భౌరుండుఁడు.
6. గాల్గులవి.
7. ఔపమన్యవుఁడు (భగవాన్)
8. దరాలుఁడు.
9. గార్గ్యసావర్ణి.
10. వార్షగణ్యుఁడు
11. కుథుముఁడు.
12. శాలిహోత్రుఁడు.
13. జైమిని.

1. ఈ పట్టికలోని ఋషులక్రమమున మదరాసుప్రతియు, కలకత్తాప్రతియు నించుక భేదించుచున్నవి.
2. ద్వితీయంతు విద్యాజన్మ—ఉపజాయత = సామవేద మత్రైవ్యష్ట.
3. ఈ గ్రంథము 1888 లో, కాశీపురమున ముద్రితమైనది. ఇది యంతనిర్దుష్టమైనది కాదు.

౨. సామగాన ప్రవచనకర్తృ పరంపర

1. సుమంతుఁడు-జైమినిపుత్రుఁడు.
2. సుమన్వంతుఁడు-జైమినిపౌత్రుఁడు
3. సుకర్ముఁడు-జైమినిశిష్యుఁడు.
4. హిరణ్యనాభుఁడు
5 పౌష్యంజి } సుకర్మ
6. అవంత్యుఁడు } శిష్యులు
7. ఉదీచ్యులు-౫౦౦ వందలమంది.
8. లోగాక్షి
9. లాంగలి
10. కుల్యుఁడు } పౌష్యంజిశిష్యులు
11. కుసీదుఁడు
12. కుక్షి
13. కృతుఁడు-హిరణ్యనాభశిష్యుఁడు.
14. ఉదీచ్యులు — అవంత్యపౌష్యంజుల శిష్యులు ౫౦౦ వందలమంది.

మొదటి పట్టికలోని గార్గులవి స్త్రీ. ఈమె పుత్రుఁడు గోభిలుఁడొకఁడు వెనుకటి రెండవపట్టికలో నున్నాఁడు. ఇట్లే యీ రెండు పరంపరలోని వారికిని వెనుకటి రెండు పరంపరలోని వారికిని సంబంధము చాలావఱకుఁ గనఁబడు చున్నది.

రెండవపట్టిక సామగాన ప్రవర్తకులవరుసను వారిసంఖ్యను దెలుపుచున్నది. దీనినిబట్టి 'సహస్రసాధ్వాసామవేదః' అను సర్వాను క్రమణివృత్తియు, సామ వేదస్యకిల సహస్రభేదా భవంతి, యనుపరిశిష్ట సూత్రమును దెలుపునట్టి వేయి శాఖలనెడి ప్రతీతి ప్రవర్తకుల సంఖ్యనుబట్టి కలిగినదని విదితమగుచున్నది. మఱియుఁ బైపరిశిష్ట సూత్రమే సామశాఖావ్యాప్తినిట్లు తెలుపుచున్నది.

సామశాఖావ్యాప్తి.— "అసురాయణీయ - వాసురాయణీయ - వార్తాన్త - రేయ - ప్రాంజల - ఋగ్వైనవిధ - ప్రాచీనయోగ్య - రాణాయనీయ - సంజ్ఞల సామశాఖ లేడు విధములు-వీనిలోఁ గడపటిది — రాణాయనీయ-శాట్యాయ నీయ-శాట్యముగ్ర - ఖల్వల - మహాఖల్వల - లాంగల - కౌథుమ - గౌతమ - జైమి నీయ సంజ్ఞలఁ దొమ్మిది విధములు. ప్రకారాంతరమున - రాణాయనీయ - సాత్య ముగ్ర - కాలేయ - మహాకాలేయ - లాంగలాయన - శార్దూల - కౌథుమ - భేదమున సప్తవిధము. ఇందు కడపటిది - కౌథుమ - అసురాయణ - వాతా యన - ప్రాంజలిద్వైనిభృత్[1] ప్రాచీనయోగ్య-నైగమీయ భేదమున షడ్విధము.

1. ఈ శబ్దము సందిగ్ధముగా నున్నది.

ఇందు మొదటి విధమున వచ్చిన పదునాలు శాఖలలోను, ఘూర్జర దేశమందు కాథుమీ శాఖయు, కర్ణాటక దేశమందు జైమినీయశాఖయు, మహారాష్ట్ర దేశమున రాణాయ నీయశాఖయుఁ బ్రసిద్ధములు."

రాణాయనీయశాఖ వంగదేశమందును హైదరాబాదు దేశమందునుగూడ వ్యాపించినట్లు తెలియవచ్చును. ఆంధ్రదేశమందీ శాఖ తొలుత వ్యాపించునట్టుగా సామవేదము వారనఁబడు బ్రాహ్మణు లుండుటనుబట్టి యూహింపవచ్చునుగాని ఋగ్వేదమువలెనే యిదియును మనదేశమునఁ గొనయూపిరితో నున్నదని చెప్పవచ్చును. కౌథుమశాఖనుండియే నైగమీయశాఖ విడివడినట్లు తెలియవచ్చునుగాని యందు ద్వితీయార్చికలోని సప్తమ ప్రపాఠకము ప్రథమార్చికలోఁ జేరుటతప్ప భేదమేమియు లేదని ముద్రిత పుస్తకమువల్లఁ దెలియవచ్చుచున్నది.[1]

సామగానపద్ధతి :—[2] సామగానము స్వరనియమము ననుసరించియుండుటచే మిక్కిలి శ్రావ్యముగా నుండును. ఇందలి సప్తస్వరములు తరువాత బయలు దేఱిన భారత సంగీతశాస్త్రమందలి సప్తస్వరములకు సరిపడుచున్నవని నారద శిక్షలోని యీ క్రింది శ్లోకములవలనఁ దెలియుచున్నది.

"య స్సామగానాం ప్రథమ స్స వేణో ర్మధ్యమ స్స్మృతః।
యోఽసౌ ద్వితీయో గాంధార స్తృతీయ స్త్వృషభ స్స్మృతః।
చతుర్థ షడ్జ ఇత్యాహుః పంచమో ధైవతో భవేత్।
షష్ఠో నిషాదో విజ్ఞేయ స్స ప్తమః పంచమ స్స్మృతః॥"

పై శ్లోకములనుబట్టి సామభారతగాన స్వరము లిట్లుండును.

సామ స్వరములు.	భారతగాన స్వరములు.	
౧. ప్రథమము	మధ్యమము	మ
౨. ద్వితీయము	గాంధారము	గ
౩. తృతీయము	ఋషభము	రి
౪. చతుర్థము	షడ్జము	స
౫. పంచమము	ధైవతము	ధ

1. వింటరు H. I. L. 65.

2. డాక్టరు బర్నెల్, ప్రొ. శేషగిరిశాస్త్రి గార్ల ననుసరించి.

౬. షష్ఠము	నిషాదము	ని
౭ సప్తమము	పంచమము	ప

దీనినిబట్టి సామగానములోని ప్రథమాది స్వరములకు భారతస్వరము లిట్లు సరిపడునని గ్రహింపనగును.

౧ - ౨ - ౩ - ౪ - ౫ - ౬ - ౭.
మ - గ - రి - స - ధ - ని - ప.

సామము హైందవగానపద్ధతి ననుసరించి పాడుట కినువుగా నుండుననుట కొక యుదాహరణము.

ఓగ్నా ఇ। ఆయాహి ఇవో ఇతోయా ఆఇ। తోయా ఆ ఇ।
సాసాస। గాగాగరిమామమామాగాగ। మామాగాగ।

గేయసామ విశేషములు:— ప్రథమభాగములోని మొదటి పదియేడు ప్రపాఠకముల గేయగ్రంథము గ్రామగేయగాన మనియుఁ దరువాతి యాఱు ప్రపాఠకములలోని దారణ్యగాన మనియు నొకప్రాచీనాను క్రమణిక చెప్పుచున్నదఁట.[1] ఆ భాగములు ప్రపాఠకములగుట సంశయాస్పదమే కాని, ఆ సంజ్ఞలు తొల్లి వాడుకలో నుండెనని యొక గ్రంథాక్షరముద్రితపుస్తకమందు గేయగాన మనుటకు బదులుగా 'వేయగానమ్ సమాప్తమ్' అని యున్న మాటనుబట్టి యూహింపఁబడుచున్నది.[2] ఆరుణమునకుఁ బెక్కు ప్రతులలో 'ఆరణ' మను సంజ్ఞ గనవచ్చుచున్నది. అది యారణ్యగానముగా మున్ను వాడఁబడినదేమో ! కాని యీ సంజ్ఞలు నేను జూచిన ముద్రితా ముద్రిత గ్రంథములలోఁ గనఁబడలేదు.

గేయసామములలోఁ గొన్నిటికి మంత్ర ద్రష్టలనుబట్టియుఁ గొన్నిటికి గాన స్వరకర్తలను బట్టియుఁ గొన్నిటికి విషయమును విశేష సంజ్ఞలు వాడుకలోనున్నవి. గ్రంథములందును గనఁబడుచున్నవి. నౌధసము వాసుదేవ్యము కాలేయము మొదలగుచున్నవి మంత్రకర్తలనుబట్టి వచ్చినవి. అగ్న ఆయాహి ఇత్యాది మంత్రమునకు భరద్వాజుఁడు కర్త - గానములోనున్న 'గౌతమస్య పర్కః' అను మాటను బట్టి గానస్వరకర్తయగు గౌతమ నిపేర దీనికి వ్యవహార మున్నట్లు కనఁబడుచున్నది. కశ్యపదృష్ట మయిన 'పునానః సోమధారయాపోవసానో అర్షసి' ఇత్యాది

1. చూడు H. I. L. 64.
2. మద్రాసు సంస్కృత గ్రంథపట్టిక Vol. 1. P. 74.

మంత్రము 'రౌరవ' మని పిలువఁబడుచున్నది. ఇట్లెన్నో సామములు ఋషీతర నామముల నొప్పుచున్నవి. దీక్షణీయేష్టి మొదలగు కర్మ విశేషములందు గానము చేయఁబడు - ఆగ్నేవ్రత - లోకద్వార - బహిష్పవమాన - ధేను - జ్యోతిర్గాన - ఆశ్విన ప్రజాదులగు సామములు విషయ ప్రధానములుగా నున్నవి. ఆంధ్రదేశమున నిపుడు సామవేదము పఠనపాఠనములలో మిక్కిలి తక్కువగా నున్నను యాగము లందు శ్రౌతోపయోగి సామములు గాన వ్యవహారమున నున్నవి

య జు ర్వే ద ము

దీని కాలమును గూర్చియు సంహితలలో దీని స్థానమును గూర్చియు ద్వితీయ చతుర్థాధ్యాయములలోఁ గొంత తెలిసికొనియున్నాము గావునఁ గొందఱు పాశ్చాత్యులు వ్రాసినదానినిబట్టి యిది క్రీస్తుపూర్వము వేయి సంవత్సరములనాఁటి దని భ్రాంతిపడవలదు. యాగాచరణ మెపు డారంభమయ్యెనో నాఁడే యజ్ఞార్థముల యిన ఋక్కులతోఁగూడ యజుస్సులు వెలసినవని యంగీకరింపక తప్పదు. ఇందుకు యజుర్మంత్రములులేని యజ్ఞ మాచరణసాధ్యము కాకపోవుటయే కారణము. ఇది యధ్వర్యువేదము. అధ్వర్యుఁ డభిషవ గ్రహణాది క్రియచే యజ్ఞ శరీరము నిర్మించుచున్నాఁడని ఋగ్వేదమే చెప్పుచున్నది.[1] 'అధ్వరం యునక్తీత్యధ్వరయుః' అకారలోపమున నధ్వర్యుఁడు - అనఁగా యజ్ఞమునకు నేతయని యర్థము. యాస్కాచార్యులుగూడ నధ్వర్యువేదము యజ్ఞనిష్పాదకమని వ్రాసి యున్నారు. బ్రహ్మయజ్ఞ జపాదులందు ఋగ్వేదమునకుఁ బ్రాధాన్య మున్నను, యజ్ఞార్థమైన యర్థజ్ఞానమందు యజుర్వేదమునకే ప్రాధాన్యము కలదనియు, అధ్వర్యువేదము ఋక్సామవేదముల కుపజీవ్య మనియు సాయణులు వ్రాసిరి.[2] 'యజుర్వేదో యజ్ఞోపయోగిత్వ సూపయోగాత్సర్వోఽపి వేదో యజుర్వేద ఇత్యుచ్యతే' అని వ్రాసి, దీని కుపోద్బలకముగా 'ఏకఏవ యజుర్వేదస్తం చతుర్ధావ్యకల్పయత్' అను విష్ణుపురాణోక్తిని మహిదాసబుధుఁ డుదాహరించి యున్నాఁడు.[3] వీనినిబట్టి యజుర్వేద మనాదిగా యజ్ఞోపయోగి యనెడి ప్రాచీన సంప్రదాయమే కాక దీని యతి ప్రాచీనత గూడ విదిత మగుచున్నది. కావున నార్యులు యజ్ఞము లాచరింప నారంభించిన నాఁటినుండియు ఘనతకెక్కి భరత ఖండమంతట

1. యజ్ఞస్య మాత్రాం విమిమీత ఉత్వః ఋ. 10-71-11.

2. ఋగ్వేదభాష్యావతారిక.

3. చరణవ్యూహపరిశిష్ట భాష్యము.

ఋక్సామ వేదములకంటె వేఱు రెట్లెక్కుడుగా నేఁటికిని నిత్యపఠన పాఠప్రవచారమందున్న యీ వేదము విధివిహితమైన సకలకర్మకలాపమున కాధారభూతమై యున్న దనుటకంటె దీని మహత్త్వమును వేఱుగాఁ బ్రశంసింప నక్కఱలేదు. అట్టి ప్రాచీనమైన యీ వేదమునుండి పెక్కుశాఖలు వెడలినట్లు తెలియుచున్నది గావునఁ గృష్ణయజుస్సు, లేక తైత్తిరీయ సంహితయను దానిని గూర్చి తెలిసి కొనుటకు ముందుగా యజుశ్శాఖలనుగూర్చి తెలిసికొనవలసి యున్నది.

య జు శ్శా ఖ లు

ఋగ్వేదము సామవేదము, అని యాయాసంహితలకుఁ గూడ వేదసంజ్ఞ గ్రంథములందును వ్యవహారమందును గనఁబడుచున్నను మంత్ర బ్రాహ్మణయో ర్వేదనామధేయమ్ - మంత్ర బ్రాహ్మణాత్మకో హివేదః' అనెడి యాపస్తంబపరిభాషాదులలోని లక్షణములనుబట్టి మంత్రరూపమైన సంహితకును దానికి సంబంధించిన వ్యాఖ్యానరూపమైన బ్రాహ్మణమునకు గలిపియే వేదసంజ్ఞ యుచిత మగు మంత్ర బ్రాహ్మణములు వేఱువేఱుగానున్న యితర వేదములకంటె నవి రెండును పరస్పరము మిశ్రమైయున్న యజుర్వేదమున కత్యంతము సరిపడుటచే నీ లక్షణము యజుర్వేదము ననుసరించియే పుట్టినదని తోఁచుచున్నది. ఏమనఁగా నిందు సంహితలోను మంత్రముతో బ్రాహ్మణము కలిసియున్నది. వేఱుగానున్న బ్రాహ్మణ మందును, అరణ్యకమందును గూడ మంత్రముతో బ్రాహ్మణము కలిసియున్నది. అట్టి మంత్రబ్రాహ్మణాత్మకమైన యీ వేదము తొలుత నొకటిగానేయున్నట్లు "యజుస్తస్మా దజాయత - యద్వై యజ్ఞస్య సామ్నాయజుషా - యజుర్వేదో వాయోః - తస్య యజురేవ శిరః ఋగ్దక్షిణః పక్షః - ఋచ స్సామాని యజూంషి"—ఇత్యాది ఋగాది వాక్యములు తెలుపుచున్నను, అర్వాచీనములైనయుపనిషత్పురాణేతిహాసాదులు కొన్ని వైశంపాయన యాజ్ఞవల్క్యులకు సంబంధించిన యొకగాథతో నిది కృష్ణశుక్ల భేదమున ద్వివిధమైనట్లు తెలుపు చున్నవి. యజుస్సునుండి విడిపోయిన శాఖలలో శుక్లయజుశ్శాఖ మొదటిదియని తెలుపుటకు సహాయపడుచున్న యీ గాథలో యాజ్ఞవల్క్యుఁడు వాజసనేయ శాఖా ప్రవర్తకుఁ డయ్యెననుట తప్పఁ దక్కిన విషయము విశ్వసనీయము గాకున్నను. దానినిందు సంగ్రహముగా నుదాహరించుచున్నాను.

"వేదవ్యాసుఁడు కలసిపోయియున్న వేదరాశిని నాలుగు సంహితలుగా వేఱుపఱిచి పైలునికి బహ్వృచ సంహితను వైశంపాయనునికి యజుస్సంహితను జైమినికి సామసంహితను సుమంతుని కథర్వసంహితను బంచి యిచ్చి వానిని

వ్యాపింపఁజేయుఁడని వారి కానతిచ్చెను. వైశంపాయనునివద్దఁ బెక్కండ్రు చర కాదులు యజుర్వేద మభ్యసించుచుండిరి. వారిలో[1] వాజసని పుత్రుఁడైన యాజ్ఞ వల్క్యుఁ డొకనాఁడు గురువుమాట కెదురు చెప్పఁగా నతఁడు కోపగించి తనవద్ద నేర్చిన విద్యను విడిచిపెట్టుమని శపించెను. అంత యాజ్ఞవల్క్యుఁడు చదివిన దంతయుఁ గక్కెను. దాని నచ్చట నున్నమునులు తిత్తిరిపక్షి రూపమున వచ్చి భక్షించిరి. అందుచే నది తైత్తిరీయ మయ్యెను.

తరువాత యాజ్ఞవల్క్యుఁడు సూర్యునిగూర్చి తపస్సు చేసి వైశంపాయ నునికి రానివేదము తనకుఁ బ్రసాదింపుమని ప్రార్థించెను. సూర్యుఁడతని స్తుతికి మెచ్చి వాజిరూపమున వచ్చి యాతయామములుగాని యజుస్సులతనికిఁ బ్రసాదిం చెను. అది వాజసనే యీ సంజ్ఞగల సంహితమయ్యెను."[2] ఈ కథ భాగవతాది పురాణములలో నీషద్భేదముతోఁ గనవచ్చుచున్నది.[3]

పరిశీలింపఁగాఁ దైత్తిరీయ వాజసనేయ సంహితలలోని మంత్ర భాగములు చాలావఱకొకటిగానే కనఁబడుచుండుటచే వాజసనేయుఁడు సూర్యుని యనుగ్రహము వలనఁ గ్రొత్తగా సంపాదించిన యజుర్మంత్రములు లేవనియుఁ బైకథ యెట్లో పుక్కిటి పురాణమై పొక్కి వాజసనేయ సంహితామహత్త్వము చాటించునదియై పురాణముల కెక్కినదనియు, నందుచే నది విశ్వసనీయము కాదనియుఁ దెలియక పోదు. కాని దీనివల్ల నొక విషయము మాత్రము తెలియవచ్చుచున్నది.

మంత్ర బ్రాహ్మణాత్మకమైన యజుర్వేద పాఠము పుట్టిన నాఁటినుండి యెట్లు సంప్రదాయసిద్ధమై వచ్చుచున్నదో, అట్లే దానిని బ్రవర్తింపఁజేసినవాఁడు తిత్తిరి మహర్షి. ఆ పాఠమున కిష్టపడక సంహితనుండి బ్రాహ్మణమును వేఱుపఱిచి

1. మహీధరాచార్య మంత్రభాష్యమున యాజ్ఞవల్క్యుని తండ్రి 'వాజసని' యని యున్నది. భాగవత విష్ణుపురాణాదులందు దేవరాతుఁడని యున్నది. మహీధరులు 'వాజ మన్నం తస్య సని ర్దాన మ స్యాస్తీతి వాజసనిః' అని వ్యుత్పత్తి వ్రాయుటనుబట్టి చూడఁగా దేవరాతుని ప్రశస్తదాతయగుటచే 'వాజసని' యను బిరుదనామము వచ్చియుండునని తోఁచుచున్నది.—ప్రతిజ్ఞా సూత్ర పరిశిష్ట భాష్యము.
2. వాజిరూపేణ సూర్యేణ వాజేభ్యః కేసరేభ్యః సన్యస్తాః పరిత్యక్తాః (మంత్రాః) సాశాఖా వాజసనేయీ సంజ్ఞా—వాజసనః సూర్యః, తత ఆగతా శాఖా—అని చరణవ్యూహ పరిశిష్ట భాష్యము.
3. భాగవతము ద్వాదశస్కంధము.

కేవల మంత్రభాగమైన సంహితను, అట్లే కేవలమైన బ్రాహ్మణమును ప్రవర్తింపఁ జేసినవాఁడు వాజసనేయ మహర్షి. ఇట్లు యజుర్వేదమునుండి తొలుత విడిపోయిన దగుటచే వాజసనేయశాఖ ప్రథమశాఖయనియు, దాని నవలంబించినవారు ప్రథమ శాఖీయులనియుఁ బిలువఁ బడుచువచ్చిరి. యథాపూర్వముగా యథాస్థితముగా నున్న యజుర్వేదమే తిత్తిరిప్రోక్తమైనను, వాజసనేయ ప్రోక్తము వేఱుగాఁ గనవచ్చుటంజేసి దానికిఁ దైత్తిరీయ శాఖయను పేరు వచ్చినది. అంతే కాని యాద్యమహర్షి దృష్టమైన యజుర్వేదమునకుఁ దైత్తిరీయమన్యము కాదు అది శాఖ కాదు. మంత్ర బ్రాహ్మణములు సంకీర్ణములై యుండఁగా వైశద్యముకొఱకు వాని వేఱుచేయ యత్నించుట నైజముగాని వేఱుగా నున్నవానికి సాంకర్యము గలిగింప యత్నించుట నైజముకాదు గదా! అందుచే మంత్ర బ్రాహ్మణ మిశ్రమై యనాదిగా వచ్చుచున్న యజుర్వేద పాఠమును వేఱు చేసికొని విడిపోయిన వాజసనేయము ప్రథమ శాఖ కావచ్చును గాని యథాపూర్వముగా నున్న పాఠముతో నుండు తైత్తిరీయము తరువాతి శాఖ యెట్లగును? కావునఁ దైత్తిరీయము ప్రాచీన పాఠమనియు, వాజసనేయము దానినుండి విడిపోయిన యర్వాచీన పాఠమనియుఁ జరిత్రకారులు కొందఱూహించుట యుచితమే యగుచున్నది. ఇట్లు విడిపోయిన వాజసనేయ సంహిత తరువాతఁ దనకుఁ గావలసిన యంగములన్నియు సంపాదించుకొని స్వతంత్ర శాఖయైనది. ఇది యిట్లుండ నీ రెంటికిని, కృష్ణ శుక్ల సంజ్ఞలు క్రమముగాఁ గనవచ్చుచున్నవి. వానిమాట యొకింత పరిశీలింతము.

మధ్యాహ్న కాలమున శుక్లవర్ణుఁడైన సూర్యునిచే దత్తమైనది శుక్ల యజుస్సని యొక నిర్వచనము కలదు గాని యది యుచితముగాదు. వేదోపక్రమణమందు చతుర్దశీప్రయుక్త పౌర్ణమాసిని గ్రహించునది శుక్లయజుస్సు, ప్రతిపత్ప్రయుక్త పౌర్ణమాసిని గ్రహించునది కృష్ణయజుస్సు; అనియు,[1] బ్రాహ్మణముచే సంకీర్ణము గాక శుద్ధముగా నున్నది శుక్ల యజుస్సు, మంత్రబ్రాహ్మణ మిశ్రమై తదన్యమైనది కృష్ణయజుస్సు, అనియు మఱిరెండు నిర్వచనములు కలవు.[2] ఇందును మొదటిది యంత సముచితము గాదు. ఉపాకర్మకు శుద్ధచతుర్దశి కలిసిన శ్రావణపూర్ణిమ, కృష్ణపాద్యమి కలసిన శ్రావణపూర్ణిమ ప్రధానములైనంత మాత్రమున సంహితలకుఁ బక్షములపేర శుక్లకృష్ణసంజ్ఞలు వచ్చెననుట భావ్యముగాలేదు. ఇఁక నో కడపటిది

1. చతుర్దశితోఁగూడిన శ్రావణ పౌర్ణమాసినాఁ డుపాకర్మ వేదోపక్రమణములు చేయుట వాజసనేయుల యాచారము.

2. శుక్లయజుః ప్రాతిశాఖ్యా పరిశిష్టచరణ వ్యూహాపరిశిష్ట భాష్యములు.

యుక్తమే కాని యందలి శుక్లకృష్ణశబ్దములకు, తెలుపు నలుపు లర్థమని తలంపరాదు. ఆ విశేషణములనుబట్టి శుద్ధయజుస్సులు, బ్రాహ్మణములచే సంకీర్ణములయినయజుస్సులు, అని గ్రహింపనగును ప్రకరణసంకీర్ణత్వాదులచే బుద్ధిమాలిన్యహేతువైనది కృష్ణమనియు, ప్రకరణముల యేర్పాటు విశదముగా నున్నది శుక్లమనియు శుక్లయజుః ప్రాతిశాఖ్యా పరిశిష్టభాష్యకారుఁడు మఱియొక నిర్వచనము చెప్పియున్నాఁడు [1] ఇట్లు ద్వివిధమైన యజుర్వేదము ప్రవర్తకప్రవచన భేదాదులనుబట్టి బహుశాఖలైనది.

యజుశ్శాఖలను గూర్చియు వానియుత్పత్తిని గూర్చియు వానివ్యాప్తిని గూర్చియు భేదాభిప్రాయము లనేకములు కనఁబడుచున్నవి. ఈ విషయమునఁ జరిత్రకారులును భిన్న మార్గములు త్రొక్కిరి. ఇందుకు నిరాక్షేపమయిన శాఖాబోధక గ్రంధము లభింపకపోవుటయే కారణము. లభించినంతలోఁ గొంతవఱకుఁ బ్రమాణ మనఁదగినది చరణవ్యూహమే కాని యది శాఖాచరిత్రము సమగ్రముగాఁ దెలుపఁబూనిన గ్రంథముకాదు. దానిపరిశిష్ట మొకటి సభాష్యముగా ముద్రితమైయున్నది గాని యది నిర్దుష్టమైనది గాదు. అయినను దానిని బట్టియు నితరానుక్రమణికాదులలోని యందందలి వాక్యములనుబట్టియు యజుశ్శాఖల నెఱుఁగ యత్నింతము.

యజుర్వేదమునకుఁ దొలుత ౨౭ శాఖ లేర్పడినవి. అందు ౧౫ కృష్ణయజుశ్శాఖలు. ౧౨ శుక్లయజుశ్శాఖలు. కృష్ణయజుశ్శాఖ లుపశాఖలతోఁ గలిసి క్రమముగా ౮౬ అయినవి. అందుచే యజుశ్శాఖల మొత్తము ౧౦౧ అగుచున్నది. ఇందుకు 'యజుర్వేదతరో రాసన్‌శాఖా ఏకోత్తరం శతమ్. యజురేక శతాధ్వగమ్' అనెడి యర్వాచీనవచనములే కాదు, 'ఏకశత మధ్వర్యు శాఖాః' అనెడి పతంజలి వాక్యముఁగూడఁ బ్రమాణ మగుచున్నది.[2] అయినను ఇందు సంహితా పాఠభేదమున నేర్పడిన రెండు శాఖలు తప్పఁ దక్కిన పన్నియుఁ బ్రవర్తకుల నామముల వెలసినవేయనుట సత్యము. వీనిలోఁ గొన్ని బ్రాహ్మణారణ్యక సూత్ర కల్పాదుల భేదమునుబట్టి వచ్చినవి. కొన్ని యాచారభేదమున సంభవించినవి. అందుచేతనే సుప్రసిద్ధ ప్రవర్తకులు మాత్రమే కొందఱు గంథ్రములఁ గనవచ్చుట సంభ

1 బుద్ధిమాలిన్య హేతుత్వా త్త ద్యజుః కృష్ణ మీర్యతే
వ్యవస్థిత ప్రకరణం త ద్యజు శ్శుక్ల మీర్యతే.

2. చరణవ్యూహము - సర్వానుక్రమణీ వృత్తి—మహా. 1-1-1.

వించినది. వారిలోఁ గృష్ణయజుశ్శాఖా ప్రవర్తకులు చరకులు వారివలన నేర్పడిన **శాఖాభేదములు ౧౨**

చరక - ఆహ్వారక - కర - ప్రాచ్యకఠ - కపిష్ఠలకఠ - చారాయణీయ - వారాయణీయ - వార్తాన్తవీయ.[1] శ్వేతాశ్వతర - ఔపమన్యవ - పాతాండనీయ మైత్రాయణీయ - అనునవి.

శుక్లయజుశ్శాఖా ప్రవర్తకులు వాజసనేయులు. ప్రాచ్యోదీచ్య నైరృత్యు లయిన వారివల్ల నేర్పడిన శాఖాభేదములు ౧౫.

వాజసనేయ - జాబాల - బౌద్ధాయన - కాణ్వ - మాధ్యందిన - శాపేయ - తాపనీయ - కపోల - పౌండరవత్స - ఆవటిక - పరమావటిక - పారాశర - వైణేయ - అద్ధ - బౌధేయ - అనునవి. మొత్త మీ యిరువది యేడును యజుర్వేదమునకు సంబంధించిన ప్రధానశాఖలని యీ పరిశిష్టము నభిప్రాయము. మఱియు—

ద్వాదశకృష్ణ యజుశ్శాఖలలోఁ గడపటి దగుమైత్రాయణీయశాఖ, మైత్రాయణీయ - మానవ - వారాహ - దుందుభ - ఛాగలేయ - హారిద్రవీయ - శ్యామాయనీయ - భేదమున సప్తవిధ మయినదనియు, మైత్రాయణీయుఁడు వాజసనేయ శాఖాధ్యాయి యనియుఁ దెలుపుచున్నది. కాని మైత్రాయణీయ సంహిత యన్నివిధములఁ దైత్తిరీయ సంహిత బోలియున్నదనుట సత్యమగుటచేఁ బరిశిష్ట భాష్యము చెప్పినది సరిగాదు. ఇది యిట్లుండ—

వ్యాసుఁడు వైశంపాయనునికిని, అతఁడు పైంగియైన యాస్కునికిని.[2] అతఁడు తిత్తిరికిని, అతఁడు ఖునికిని, అతఁడాత్రేయునికిని, క్రమముగా యజుస్సంహిత నుపదేశించుచు వచ్చిరనియు. ఈ యాత్రేయుఁడు దానికి బదపాఠమను పేరఁ బదవిభాగము రచియించెననియు, దానంజేసి యది యాత్రే యీ నమమున

1. ఇది, వారత న్తవీయ, అయి యుండవచ్చును.

2. వైశంపాయనుఁడు యాజ్ఞవల్క్యునికిఁ జెప్పెనని మఱికొన్ని ప్రతులలో నున్నది. కాని భట్టభాస్కరులు పై పాఠము గ్రహించుటచే నదియే సముచిత మని తోఁచినది. యస్కుఁ డని కొన్ని ప్రతులలో నున్నది. ఎట్లున్నను, పైంగియాస్కుఁడు నిరుక్తకార యాస్కుఁడు కాఁ డనుట నిజము. కీతు పండితుని మతముకూడ నిదే.

విలసిల్లెననియుఁ గాండానుక్రమణిక చెప్పుచున్నది. వైశంపాయన శిష్యుఁడు యాస్కుఁడనక, పాఠాంతరమునుబట్టి యాజ్ఞవల్క్యుఁడే యన్నను, యథాస్థిత యజుర్వేద ప్రవక్తయగుతిత్తిరి యాజ్ఞవల్క్యుని శిష్యుఁడనుట పొసఁగదు. దీనిని బట్టి చూడఁగా గృష్ణశుక్ల యజుశ్శాఖలకు వైషమ్యము హెచ్చిన కాలమందు పుట్టిన యాతిత్తిరిపిట్టకట్టుకథ నుదాహరించిన చరణవ్యూహ పరిశిష్టము చూపిన యజుశ్శాఖా ప్రచారక క్రమముగాని, కాండానుక్రమణి చూపిన గురుశిష్య పరంపరగాని యథార్థములనుట కవకాశము కనఁబడకున్నది సరిగదా పైగా నీ గ్రంథములు రెండును బరస్పర విరుద్ధములుగాఁ గూడఁ గనఁబడుచున్నవి. ఈ పరిశిష్టమే మఱియొకచోట :—

తైత్తిరీయశాఖ, ఔఖీయ-ఖాండికీయ-భేదమున ద్వివిధము. అందు ఖాండికీయు. కాలేత-శాట్యాయని-హైరణ్యకేశి-భారద్వాజి—ఆపస్తంబి-అని పంచవిధము అని చెప్పఁగా, దీని వ్యాఖ్యానము - కాలేత శాట్యాయనీ శాఖల స్థానములందు బౌధాయనీ శాఖను ఔఖీయశాఖను గ్రహింపఁదగునని బోధించుచున్నది. ఇట్లు మూల వ్యాఖ్యానములు రెండు నిక్కడ తిత్తిరిని మొదటఁ జేర్చినవి. వెనుకఁ జరకుని మొదటఁ జేర్చినవి ఆ పట్టికలోఁ దిత్తిరి లేఁడు. ఈ పట్టికలోఁ జరకుఁడుఁ లేఁడు. వీరిద్దఱిలో నెవఁడు ప్రాచీనుఁడో, ఎవఁడర్వాచీనుఁడో యీ గ్రంథమునుబట్టి తెలియరాదు. కృష్ణయజుశ్శాఖా ప్రవర్తక విషయమిట్లుండ నీపరిశిష్టమే మఱియొక చోట శుక్లయజుశ్శాఖలు పదియేనింటిలోను కాణ్వశాఖ ముఖ్యమైనదని చెప్పుచున్నది వెనుక వాజసనేయశాఖకుఁ బ్రాధాన్యమిచ్చినది. వాజసన పుత్రుడయిన యాజ్ఞవల్క్యుఁడు శుక్లయజుర్వేదమునకుఁ బ్రధానకారణమని చెప్పినది. లోకములోఁ గూడ వాజసనేయసంహితయే ప్రాచుర్యము చెందియున్నదనుటయు సత్యము. అయినను వాజసనేయ సంహితను బ్రవర్తింపఁజేసినవారిలోఁ బ్రధానుఁడు కాణ్వుఁ డగుటచే నది కాణ్వశాఖ యనఁబరఁగినదని సమాధానము చెప్పకొనవచ్చును గాని, కాణ్వాచార్యుని[1], అతని శాఖలో నధికముగా నున్న మంత్రములను నడుమ నడుమఁ బేర్కొనుచున్నను, కాత్యాయనముని ముఖ్యముగా మాధ్యందిన శాఖననుసరించియే శుక్ల యజుః ప్రాతిశాఖ్యము రచియించెననియు, యాజ్ఞవల్క్యునివల్ల మధ్యందిన మహర్షికి లభించిన శాఖ మాధ్యందినీసంజ్ఞ నొప్పుచున్నదనియు, తత్పరిశిష్టభాష్యము చెప్పుచున్నది. ఇపుడీ రెండు శాఖలలో నేది మొదటి దనఁ గలము ? ఇట్లీవిషయము గజిబిజిగానున్నను తైత్తిరీయ వారత స్త్రవీయ ఖాండికీయ

1. అనుదాత్తం చేత్పూర్వం తిర్యఙ్నిహత్య కాణ్వస్య. శు. ప్రా. 5-128.

ఔఖీయ కఠచరక కాలాప ఛాగలేయి మొదలగు యాజుష శాఖలు పాణిని నాఁటికే వ్యాప్తిలో నున్నట్లు ష్టాధ్యాయివల్లఁ దెలియుచున్నది.[1] కాని, అందలి 'పురాణ ప్రోక్తేషు బ్రాహ్మణకల్పేషు' అను సూత్రమును వివరించుచు భట్టోజీ దీక్షితులు, భల్లుశాట్యాయనులను బురాతనమునులనుగా గణించి యాజ్ఞవల్క్యునట్లు గణింపకపోవుట చూఁడగా వైయాకరణ సంప్రదాయమునుబట్టి యితఁడు శాట్యాయనునికి సమకాలికుఁడు కాఁడని విదితమగుచున్నది.[2] అతనికే సమకాలికుఁడు కాని యాజ్ఞవల్క్యుఁడు శాట్యాయనశాఖ కాధారభూతుఁడైన తిత్తిరికి సమకాలికుఁడనుట యసంభవము కదా! అట్టియెడ నితనికతఁడు గురువగుట యెట్లు పొసఁగును?

పోనీ! కాండానుక్రమణినిబట్టి వైశంపాయన శిష్యుఁడు యాస్కుఁడనియే యనుకొందము. అట్లయినఁ బాణిన్యాచార్యులు ప్రోక్తాధికారమునందు తిత్తిర్యాదుల నెందఱినో పేర్కొని తిత్తిరికి గురువై యాజుషప్రవక్తలలో నగ్రేసరుఁడన నొప్పుయాస్కుని బేర్కొనకుండునా? ఇంతకును యాస్కుఁడు నిరుక్తకారుఁడను ప్రసిద్ధియే కాని వేద ప్రవర్తకుఁడన్న ప్రసిద్ధి యెందును గనరాదు. పోనిందు ఇతనిమాట యటుంచి వైశంపాయనునిగూర్చి యాలోచింతము. ఇతనిని బాణిన్యాచార్యులొక సూత్రమున బేర్కొనిరి గాని, ప్రాచీన సంప్రదాయమును బట్టి దీక్షితులతని శిష్యులనుగా నాలంబులను బేర్కొనెను గాని, యాస్క యాజ్ఞవల్క్యులను గాని తుదకుఁ దిత్తిర్యాదులనుగాని వక్కాణింపలేదు[3] నిజముగా నితఁడు యజుర్వేద పాఠమునకు మొదటి యాచార్యుఁడేయైనచోఁ దైత్తిరీయములో నెందైన నతని పేరు లేకుండునా? కఠప్రోక్తమైన యారణ్యకమున నొకచోట వైశంపాయనుఁడు కనవచ్చునుగాని యందతఁడు గొప్ప వేదప్రవక్తగాఁ గనబడఁడు. కఠాచార్యుఁడు, తనకు సమకాలికుఁడో లేక యించుక పూర్వుఁడోయైన వైశంపాయనుని యభిప్రాయమును సూచించినట్లుగా సందర్భము తెలుపుచున్నది[4] కావున నెట్లయినను

1. అష్టా—4-3-102, 107, 108, 109.

2. అష్టా 4-3-105, పురాణేన చిరంతనేన మునినా ప్రోక్తాః భాల్లవినః - శాట్యాయనినః - పురాణేతి కిమ్, యాజ్ఞవల్క్యాని బ్రాహ్మణాని - వ్యాఖ్య.

3. కలాపి వైశంపాయనాన్తేవాసిభ్యశ్చ - అష్టా. 4-3-104.

4. ఏతద్ధైవాఽఽవృతాఽఽసహస్ర మూర్యతాయా ఇతి వైశంపాయనః. అర. 1-7-5.

జరణవ్యూహము చెప్పిన శాఖాక్రమముగాని కాండానుక్రమణి చూపిన గురుశిష్య క్రమముగాని వాస్తవము గాదనియు, ఏమయినను వాజసనేయశాఖ తైత్తిరీయశాఖ కెంతో తరువాత బయలుదేఱినదనియు నమ్మవచ్చును.

ఇట్లు కొన్ని శాఖలపేళ్ళు తెలిసినను, అనేక శాఖలపేళ్ళు దెలియరాకున్నవి. తెలిసినవానిలోనైనను, అన్నియు సంహితా పాఠభేదమున నేర్పడినవి కావు. అందు శాట్యాయని హారిద్రవీయభాగలేయి మొదలయినవి బ్రాహ్మణ భేదమున నేర్పడినవి. ఆపస్తంబి బౌధాయని సత్యాషాఢి హైరణ్యకేశి భారద్వాజ మొదలయినవి సూత్రభేదమున నేర్పడినవి. అయినను సంహితా పాఠభేదమున లోకమున వ్యాపించిన కొన్ని ప్రధానశాఖలు గలవు. వాని చరిత్ర మించుక గ్రహింతము.

యజుస్సంహిత రూపమున నొకటియయ్యు, నామమున 'కాఠక కాలాప తైత్తిరీయ వాజసనేయ' భేదమునఁ జతుర్విధమై భరతఖండమున వ్యాపించినది. వీనిలో మొదటి రెండును ప్రాచీనములు తరువాతి రెండు నర్వాచీనములని యొకరు, తరువాతివానిలోఁ దైత్తిరీయముకూడఁ బ్రాచీనమేయని మఱియొకరు, తరువాతివి రెండే ప్రధానశాఖలని ఇంకొకరు, ఈ విధముగాఁ బాశ్చాత్యపండితులు వివిధాభిప్రాయములు తెల్పియుండిరి. వారి యభిప్రాయము లన్నియుఁ జర్చించి తైత్తిరీయము ప్రాచీనశాఖ యనెడి యభిప్రాయము తేల్చియు, అది క్రీస్తుపూర్వము ౬౦౦ నాఁటిదని కీతుపండితుఁడు వ్రాసి యుండెను.[1] మన పైశాఖల పౌర్వాపర్య మెట్టిదో విచారింతము.

"పతంజలి మహాభాష్యము, కాఠకకాలాపములు ప్రతి గ్రామమందును బఠన పాఠవ్యవహారమున వినఁబడుచుండెనని చెప్పెను గావునను, అయోధ్యలో నీ రెండు శాఖలవారు గొప్పగా గౌరవింపఁ బడుచుండిరని రామాయణము చెప్పెను గావునను, ఈ శాఖలు రెండును గ్రీస్తుశకారంభమునకుఁ బూర్వమే యెక్కువ వ్యాప్తిని జెందినవని చెప్పవచ్చునుగాని తరువాత బయలుదేఱిన తైత్తిరీయ వాజసనేయ శాఖలు వీని నణఁచివైచినవి" అని మేగ్డోనలుపండితుఁడు వ్రాసెను.[2] పై రెండు గ్రంథములే శాఖల ప్రాచీనతకును వానివ్యాప్తికిని బ్రమాణములయినచోఁ దైత్తిరీయమునకుఁ గూడ నట్టిభాగ్యము పట్టకపోలేదు.

1. ఆంగ్లీకృత కృష్ణ యజుర్వేదపీఠిక. H. O. S. Vol. 18.
2. Sans. Lit. P. 175, 176.

"తిత్తిరి వరతన్తు ఖండి కో ఖాచ్ఛణ్" అనుపాణిని సూత్రమునకు భాష్యము వ్రాయుచుఁ బతంజలి తిత్తిరిణా ప్రోక్తః శ్లోకః'.[1] అనుటచే నతఁడు తైత్తిరీయ సంహితా వ్యాప్తినేకాదు, తైత్తిరీయారణ్యక వ్యాప్తినిగూడ నెఱిఁగి యుండెనని తెలియుచున్నది. తిత్తిరి ప్రోక్తమైన శ్లోకము లారణ్యకమునందు మాత్రమే కలవనుట విదితము, మఱియు, రామాయణములో శ్రీరాముఁడు, కఠకాలాపులను గౌరవించుమని చెప్పుటకు ముందే తైత్తికీయుల యాచార్యుని సత్కరింపుమని సౌమిత్రితోఁ జెప్పినట్లు కనబడుచున్నది.[2] కావున నీ రెంటినిబట్టి కఠకాలాపములకంటెఁ దైత్తిరీయ మర్వాచీనమనుట యుచితము కాదుగదా ! ఇంక వీబరుపండితుఁడు, 'యజుర్వేదమునకుఁ దొలుత నధ్వర్యుశాఖ యనెడి పేరుండెడిది, తరువాతఁ గృష్ణయజుర్వేదమునకుఁ దైత్తిరీయశాఖ యనెడి పేరు వచ్చినది. అని చెప్పుచుఁ, గాండానుక్రమణిక చెప్పిన వైశంపాయనాది గురుశిష్య క్రమ సందర్భముగా నున్నదని, ఖండించుచు, కృష్ణయజుర్వేద భాగములు మిక్కిలి భిన్న భిన్నములై సంకీర్ణములై సులభముగా గ్రహింప వీలులేని రూపముతో నుండుటనుఁబట్టి చూడఁగా దీనికిఁ దిత్తిరిపక్షి పోలికనుబట్టి తైత్తిరీయమను పేరు వచ్చియుండునుగాని తిత్తిరి నామకమహర్షి ప్రోక్తమగుటచేఁ గాదని నిజాభిప్రాయ మావిష్కరించియుండెను.[3] దీనికిఁ గారణమేమి ? యాజ్ఞవల్క్య తిత్తిరిగాథ సత్యము గాకపోయినను, కృష్ణయజుస్సు తిత్తిరి పక్షిరూపమున నున్నదనుటయే దాని యుద్దేశమఁట ! చూచితిరా యెట్లున్నదో ! భారతీయులందున పాణిన్యాదులు మహర్షి యని భావించినవాఁడును వేద ప్రవక్తలలో నగ్రగణ్యుఁడు నైన తిత్తిరి మహర్షి పాశ్చాత్యుల దృష్టిలో మానవుఁడయిన గాకుండఁబోయెను. కావున ఖండాంతర వాసులు మన వేదశాస్త్రములు చదివి తెలసినంతవరకు వాని చరిత్రములు బయటఁ బెట్టి మనకు మార్గదర్శకులైనందుకు సంతోషింపవలసినదే కాని, వారు వ్రాసినదే వేదమని మాత్రము విశ్వసింపరాదని తెలుపుటకుఁ బైయుదాహరణములు రెండును జూపితిని.

1 అష్టా, 4-3-102, భాష్యము.

2. ఆచార్య స్తైత్తిరీయాణా మభిరూపశ్చ వేదవిత్. 15. రా. యో. 32 సర్గ.
తస్య యానంచ దాసీశ్చ సౌమిత్రే సంప్రదాపయ।
కౌశేయాని చ వస్త్రాణి యావ త్తుష్యతి సద్విజః ॥ 16.
పశుకాభిశ్చ సర్వాభి ర్గవాం దశశతేనచ।
యే చే మే కఠకాలాపా బహవో దండమాణవాః ॥ 18......

3. H. I. Lit. P. 87, 88.

మన దేశమునందు 'కాఠకము'లని వాడఁబడుచున్న తైత్తిరీయ బ్రాహ్మణారణ్యకములలోని యెనిమిది భాగములు మాత్రమే కఠప్రోక్తములు కావు. కృష్ణ యజుర్వేద సంహితయంతయు, కఠసంహితయను పేర నొక కాలమున వ్యాపించి యుండెననుట నిజము.[1] అది తొలుతఁ బంచాపదేశమందును దరువాతఁ గాశ్మీర దేశమందును విస్తరించెను. ఇప్పటికిని, కఠశాఖీయులు కాశ్మీరమం దున్నారఁట. దానినుండి కపిష్ఠలయను పేర మఱియొకశాఖ బయలువెడలినది. దానినే కపిష్ఠల కఠశాఖయని చరణవ్యూహము పేర్కొన్నది. 'కపిష్ఠల గోత్రే' యను సూత్రమును బట్టి[2] పాణినినాఁటి కిదియున్నదనుట విదితము. ఈ శాఖవారు తొల్లి కాశ్మీర మందున్నట్లును, ఇపుడు వారి పేరంతరించినట్లును, దెలియవచ్చుచున్నది గాని కపిష్ఠల సంహిత మాత్రము కొంత ముద్రితమై యున్నది. 'దేవ సుమ్నయో ర్యజుషి కాఠకే' అను సూత్రమునుబట్టి.[3] కాఠక యజుశ్శాఖయు, 'కలాపినోఽణ్' అను సూత్రమునుబట్టి.[4] కాలాపయజుశ్శాఖయుఁ బాణిని నాఁటికే ప్రాచీనములనుట స్పష్టమే కాని, రెండవది మైత్రాయణీయశాఖగా మాఱిపోయినదనియు, మైత్రాయణీయులు పూర్వము నర్మదానదీ ముఖద్వారము మొదలుగా నాసికాదేశ పర్యంతము సముద్రమున కిరువది యామడదూరమందు నర్మదా నదీతీరమున నివసించియుండిరనియుఁ గొందఱు వ్రాసిరి.[5] వెనుకఁ జదివినట్లుగా మైత్రాయణీయ శాఖను, దానిభేదములైన మానవాది శాఖలను జరణవ్యూహము చూపుచున్నది గాని, కాలాపము మైత్రాయణీయముగా మాఱినట్లందు గనరాదు. అయినను, పాణినీయ సంప్రదాయమునుబట్టి కలాపిశిష్యుఁడైన హరిద్రువు ప్రవక్తగాఁ దెలియుచున్నది[6] కాని, మైత్రాయణీయుఁడు కలాపుఁడయినట్లు తెలియరాదు. కాని, హారిద్రవము మైత్రాయణీయుల శాఖాభేదమని నిరుక్తవ్యాఖ్య చెప్పుటనుబట్టి[7] కాలాపనామాంతరమో లేక కాలాపరూపాంతరమో మైత్రాయణీయమగునని యూహింపవచ్చును. ఈ కాఠక కాలాప (మైత్రాణీయ) సంహితలు మొన్న మొన్నటివఱకును బ్రచారములో

1. ఋగ్వేదమునకుఁగూడ, కఠశాఖ యున్నది.
   బహ్వృచానా మప్యస్తి కఠశాఖా ఇత్యాది. అష్టా 7-4-38 వ్యాఖ్య.
2. అష్టా. 8-3-91.
3. అష్టా. 7-4-38.
4. 4-3-108.
5. San. Lit. P. 175.
6. కలాపస్యాన్తేవాసిభ్యశ్చ. హారిద్రుణా ప్రోక్త మధీయతే హారిద్రవిణః. సి కౌ
7. హారిద్రవో నామ మైత్రాయణీయానాం శాఖాభేదః. నిరు—10-5.

నున్నట్లు వీని వ్రాఁత ప్రతులవలనఁ దెలియుచున్నది. ఇపుడివి ముద్రితములు నైనవి. కావున నివి తైత్తిరీయ వాజసనేయ సంహితలవలె దేశమంతట వ్యాపింపక పోయినను, ప్రాచీనములనుట నిర్వివాదము. అందుచే నీ నాల్గింటి పౌర్వాపర్యమును వీనిస్వరూపమును గ్రంథవిస్తరము గాకుండ సంగ్రహముగానైన విమర్శించుట యావశ్యకమగుచున్నది.

యజుశ్శాఖల పౌర్వాపర్యాది విచారణ

ఋక్శాఖీయులకు బహ్వృచులనియు సామశాఖీయులకు ఛందోగులనియు సామాన్యసంజ్ఞలున్నట్లు యజుశ్శాఖీయులకు 'అధ్వర్యు'లనెడి వైదిక సంజ్ఞయనాది సిద్ధమైనది. తరువాత వారికిఁ బ్రవర్తకులనుబట్టి బాష్కలరాణాయనీ యాది విశేష సంజ్ఞలు వచ్చినట్లే తిత్తిరిమహర్షి ప్రవక్తగా వీరికిఁ దైత్తిరీయులను పేరు వచ్చినది. ఇది యెపుడు వచ్చినదో చెప్పుట యెవరికిని సాధ్యము కాదు గాని, కాఠకకాలాప సంజ్ఞలకంటె ముందుగా వచ్చినదని మాత్రము చెప్పవచ్చును. ఇందుకుఁ గొన్ని కారణములు.

౧. తైత్తిరీయసంహిత తైత్తిరీయ బ్రాహ్మణము తైత్తిరీయారణ్యకము ననుమూఁడు భాగములకుఁ దైత్తిరీయ విశేషణము వేఱువేఱుగా వ్యవహారమం దున్నను, మొత్తముగా వేదమున కంతకును కృష్ణ యజుర్వేదమను వ్యవహార మున్నట్లుగాఁ దైత్తిరీయవేదమనెడి వ్యవహారమెన్నఁడు నున్నట్లు కనఁబడదు. అందుచే బ్రాహ్మణ ముదయింపక మున్నే యజుస్సంహిత తిత్తిరిమహర్షి ప్రవక్తగాఁ దైత్తిరియ సంజ్ఞఁ జెందినదనుట కెక్కువ యవకాశ మేరడ్పుచున్నది.

౨. పాణిన్యాచార్యులు ప్రోక్తాధికారమందు యాజుష ప్రవక్తల ననేకులను బేర్కొనుచు నందఱికంటె ముందు తిత్తిరి మహర్షిని బేర్కొని యాసూత్రమునందే యతని తరువాతి ప్రవక్తయగు వరతన్తుని, తైత్తిరీయ శాఖను విస్తరింపఁజేసిన - ఉఖ ఖాండికేయులను గూర్చియున్నాఁడు. పాణిని తెలిపిన యీ క్రమము వైదిక సంప్రదాయ సిద్ధమనుటకుఁ జరణవ్యూహ మిచ్చిన తైత్తిరీయార్ష క్రమమును, కాండానుక్రమణిక యిచ్చిన యార్షానుక్రమమును నిదర్శనములగుచున్నవి.

౩. కఠకాలాప (మైత్రాయణీయ)ములకు వేఱుగా బ్రాహ్మణారణ్యకాత్మక మైన గ్రంథము లేదు. తైత్తిరీయ సంహితలోఁ గలిసియున్న మంత్ర బ్రాహ్మణ భాగములు మాత్రమే యక్కడక్కడఁ గొంచెము లోపించియు నందందు కొంచెము

పాఠభేదము చెందియు నెడనెడ నించుక ముందు వెనుకలయ్యు నున్నంతవఱకు సరిగాఁ దైత్తిరీయ సంహితలో నున్నట్లే కఠకలాప సంహితలందు గనవచ్చు చున్నవి. అందుచే నివి రెండును దైత్తిరీయముకంటె భిన్నములు కానివయ్యుఁ బ్రవర్తకుల నామములనుబట్టి కాఠక కాలాపసంజ్ఞలు చెందినవనియు, అందుచేతనే యివి యస్వతంత్రములై సంహితా భాగముతోనే నిలిచిపోయినవనియుఁ దెల్లమగు చున్నది.

౪. కఠముని దృష్టములు[1] లేక కఠప్రోక్తములని యెనిమిది చిన్న భాగము లను దరువాతఁ గఠసంహిత వేఱుగా నార్జించినది. స్వతంత్రమును బురాతనము నైన తైత్తిరీయమునకుఁ గఠశాఖ యనుబంధశాఖ గావుననే యా యెనిమిది భాగ ములు నైదు ప్రపాఠకములుగాఁ దైత్తిరీయ బ్రాహ్మణారణ్యకములందు ప్రవేశింపఁ గలిగినవి. నిజముగాఁ గఠశాఖ తైత్తిరీయమునకు లోఁబడినది కానిచో నా భాగము లిందు చేరుటకుఁ దైత్తిరీయులు నంగీకరింపకుండెడివారు. కఠులును సమ్మతింప కుండెడివారు.

౫. ఆ యెనిమిద భాగములకే ప్పుఁ దక్కిన బ్రాహ్మణాది గ్రంథమునకుఁ గాఠక మనుపేరు లేకుండుటచేతను, ఆ భాగముల కాఱు రెట్లెక్కువగా నున్న ముప్పదిమూఁడు ప్రపాఠకములకుఁ దైత్తిరీయ బ్రాహ్మణారణ్యకములను పేరుండుట చేతను, కఠశాఖకుఁ దైత్తిరీయశాఖలోఁ బడిన దనుటకు పీఱలేదు. ఇది ప్రాచీన తమము గావుననే కఠాదులకంటె నూఱు రెట్లెక్కువగా భరత ఖండమంతట వ్యాపించి నాఁటి వివిధ దేశార్యుల యాదరమునకుఁ బాత్రమైనది.

౬. మైత్రాయణీయ సంహితను బ్రకటించిన శ్రోడరు పండితుఁడు, పైంగియాస్కుఁడు తిత్తిరికి గురువనెడి కాండాను క్రమవచనము విశ్వసించి, అయాస్కుని నిరుక్తమందు కాఠకహారిద్రవ (కాలాప మైత్రాయణీయ)ములు పేర్కొనఁబడెనుగాని తైత్తిరీయము పేర్కొనఁబడలేదు గావున వానికంటె నిది యర్వాచీనమని యొక యభిప్రాయము ప్రకటించెను[2] గాని యిది యనాదరణీయ మనుట కనేక హేతువులున్నవి. కాండా నుక్రమణిలోని గురుశిష్యక్రమము సరి యైనది కాదని యింతకుమున్నే తెలిసికొనియున్నాము. పైంగియాస్కుఁడు తిత్తిరి

1. కఠేన మునినా దృష్టం (ప్రోక్తం) కాఠకం పరికీర్త్యతే. తై. సం. భాష్యము.
2. కీతు యజుర్వేద పీఠిక.

గురువు కాఁడు. నిరుక్తకారుఁడు కాఁడు. గైరిక్షితులైన యాస్కులు వేదోపాధ్యాయులైనట్లుగా, కాఠకము చెప్పుచున్నది [1] కఠశాఖీయుఁడైన యాస్కుఁడు గైరిక్షిత యాస్క గోత్రమునకుఁ జెందినవాఁ డగుటచేఁ గఠసంహితలోని మంత్రముదాహరించెను. ఇంతకు నా మంత్రము కఠసంహితలోని దానికంటె దైత్తిరీయములోని దానినే యెక్కువగాఁ బోలియున్నది. ఆయుదాహరణ మిది.

'యదరుదత్తద్రుద్రస్య రుద్రత్వమ్' ఇతి కాఠకమ్,
'యదరోదీత్తద్రుద్రస్య రుద్రత్వమ్' ఇతి హారిద్రవికమ్.[2]

ఇది కాఠకములో 'యత్ సమరుజత్త ద్రుద్రస్య రుద్రత్వమ్' అని కనఁబడుచున్నది.[3] రెండవదియైన హారిద్రవికపాఠము సరిగానట్లే తైత్తిరీయమునఁ గనవచ్చుచున్నది [4] రెండు సంహితలలో నొకటిగాఁ గనఁబడుచున్నది మొదటి పాఠమనుట యుచితము గావునఁ గాఠకములోనిది మాఱిన పాఠమని తలంచుట యుక్తము. అదిగాక నిరుక్తము తైత్తిరీయము నుదాహరింపక పోయినంత మాత్రమున నిది యర్వాచీన మనుట తగదు గావున నతఁడున్నచోటఁ గాఠక హారిద్రవములకుఁ బ్రచార మెక్కువగా నుండుటచే నతఁడు వాని నొక్కచోట నుదాహరించినను దైత్తిరీయ మెఱుఁగనివాఁడు కాఁడని భావింపవచ్చును. పైకారణములనుబట్టి తక్కిన యజుశ్శాఖ లన్నిటికిని దైత్తిరీయశాఖ తల్లియని నా యభిప్రాయము. వాజసనేయశాఖ కఠకాలాపములకంటె నర్వాచీన మనుట నిజము. ఈ నాలుగు సంహితల యందలి మంత్రభాగము సమాన రూపము. వాజసనేయ సంహితలో బ్రాహ్మణములేదు. ఆ భాగము వేఱుచేయఁబడినది. తక్కిన మూఁడింటిలోను బ్రాహ్మణముకూడ సమానముగానే యున్నది. వాజసనేయ సంహితనుగూర్చి ప్రత్యేకముగాఁ గొంత వ్రాయఁబడునుగాని యిపుడు సంహితైక్యము తెలుపుటకై యొకటి రెండు పోలికలు చూపఁబడుచున్నవి. ఈ సంహితల యేకీభావము చూపుచు, ఏ. బి. కీతుపండితుఁడు పెద్దపట్టిక యొకటి తన యాంగ్లీకృత యజుర్వేద పీఠికలోఁ జూపియున్నాఁడు. విశేషములు దానివల్ల గ్రహింపనగును.

కఠసంహిత నాలుగు కాండములు, ఏఁబదినాలుగు ప్రపాఠకములు. కాండములలోఁ గడపటిది ఖిలకాండమని వ్యవహరింపఁబడుచున్నది. (కాలాప) మైత్రాయ

1. కాఠక సంహిత, 13-12.
2. నిరు - 10-5.
3. 25-1.
4. 1-5-1-1.

ణీయ సంహిత ముప్పదితొమ్మిది ప్రపాఠకములు. ఈ రెండు సంహితలను స్క్రోడరు పండితుఁడు ప్రకటించియుండెను. ఈ రెండు సంహితలలోని భాషయు సమానముగా నేయుండి తైత్తిరీయ సంహితాభాషను బోలియున్నది. వాజసనేయ సంహితలోని స్వరరీతి పీనిస్వరరీతికంటె మాఱినది. అక్కడక్కడ మంత్రముల లోని కొన్ని శబ్దములలో నించించుక మార్పు కనవచ్చు చుండును.

'ఇషేత్వా' యనెడి యనువాకము నాలుగు సంహితలలోను సమానముగా మొదటనే యున్నది. కాని యందు కొంచెము మార్పుకలదు.

ఇషేత్వోర్జేత్వా వాయవస్థోపాయవస్థ దేవోవః సవితా ప్రార్పయతు - తైత్తిరీయము.

ఇషేత్వానుభూతాయ వాయవస్థదేవోవః సవితా-మైత్రాయణీయము.

ఇషేత్వోర్జేత్వా వాయవస్థ దేవోవః సవితా-వాజసనేయము.

'కఠసంహిత నాకు లభింపలేదుగాని యందలిపాఠము చాలావఱకు మైత్రాయిణీయపాఠమునే పోలియుండునని కొందఱు వ్రాసిరి. ఇట్లు తైత్తిరీయములోని కొన్ని శబ్దములు తక్కినవానిలో లేకుండుటయు నందు లేనిశబ్దములు కొన్ని యిందుండుటయు నచ్చటచ్చటఁ గనవచ్చునుగాని, తైత్తిరీయములోనున్న పౌరోడాశి కాధ్వరదక్షిణాపున రాధేయాది విషయము లన్నియుఁ దక్కిన సంహితలందు గలవు. ఇందుకొక యుదాహరణము. రాజసూయము తైత్తిరీయము మొదటికాండమెనిమిదవ ప్రపాఠకము మొదటి యనువాకము. అదే కాఠకమునఁ బదియేనవ ప్రపాఠకము మొదటి యనువాకము. అదే మైత్రాయణీయమున రెండవ కాండమాఱవ ప్రపాఠకము మొదటి రెండను వాకములు.

ఇట్లు పెక్కుశాఖలు గనవచ్చుచున్నను దొలుతఁ జెప్పినట్లుగా గణింపఁ దగిన శాఖలు తైత్తిరీయ వాజసనేయములు రెండే కృష్ణయజుర్వేదమునకు సంబంధించిన కఠాదిశాఖ లన్నియుఁ దైత్తిరీయము రూపాంతరములుగాని యన్యశాఖ లనఁదగవు. ఇట్లే కాణ్వమాధ్యం దినాదిశాఖ లన్నియు శుక్ల యజుర్వేదమునకు సంబంధించిన వాజసనేయము రూపాంతరములే కాని యన్యములు కావు. అందుచేఁ దక్కినవన్నియుఁ గూడ శాఖలుగా వాడఁబడుచున్నను, తొలుతఁ జెప్పినట్లుగా యథాస్థిత యజుస్సంహిత తైత్తిరీయ మనియు దానినుండి విడిపోయిన వాజసనేయ సంహిత మాత్రమే శాఖగా గణింపఁదగిన దనియుఁ దెలియనగును. కావుననే మఱి

దేనికిని ద్వితీయశాఖ తృతీయశాఖ యనెడి వ్యవహారము లోకములో నెన్నఁడు నెక్కడను లేకపోయినను వాజసనేయమునకు మాత్రమే మన దేశమునఁ బ్రథమ శాఖ యనుపేరెల్లో వచ్చినది.

ఇట్టి యజుర్వేదము సరస్వతీదృషద్వతీ శుతుద్రీయము నాతీరముల మహర్షి దృష్టమై వెలసి కురుపాంచాల దేశములందును గంగాతీర భూములందును నర్మదా దక్షిణోత్తరములందును జక్కఁగా వ్యాపించి క్రమముగా ఘూర్జర మహారాష్ట్ర ద్రవిడ కర్ణాటాంధ్రములందు విస్తరించెను. అందు, ఆంధ్ర దేశమున నాగ్నేయ దిశను గోదావరి మొదలుగా సముద్రపర్యంతము తైత్తిరీయ మాపస్తంబి యను పేరను, నైరృతిదిశను సహ్యాద్రి మొదలుగా సముద్రపర్యంతము హైరణ్యకేశి యను పేరను, వాయవ్యదిశను మయూరపర్వతము మొదలుగా గూర్జరదేశ పర్యంతము మైత్రాయణీయ మనుపేరను వ్యాపించినది. వాజసనేయము మాధ్యందిని యనుపేర నంగవంగ కళింగ గూర్జర దేశములందును, కాణ్వశాఖ యనుపేర నఖిల దేశములందును వ్యాపించినది భరతఖండమందలి పుస్తక భాండాగారములలోని వ్రాఁత పుస్తకముల పట్టికలనుబట్టి చూడఁగా నీ రెండు శాఖలు భరతఖండమంతటను జక్కఁగా వ్యాపించినట్లు కనబడుచుగాని, రాను రానుత్తర హిందూదేశమున వాజసనేయశాఖ యెక్కువగాను, తైత్తిరీయశాఖ తక్కువగాను, దక్షిణ హిందూ దేశమునఁ దైత్తిరీయ మెక్కువగాను వాజసనేయము తక్కువగాను బరగ పాత వ్యవహారముల నిలచినట్లు తెలియవచ్చుచున్నది. ఇట్లు బహునామ రూపముల దిగంతములవఱకును వ్యాపించిన యజుర్వేద యథాస్థితరూపమగు తైత్తిరీయ సంహితను ముందుగా గ్రహింతము.

తైత్తిరీయ సంహితా విభాగము

ఈ సంహిత యందలి ప్రధాన భాగములు కాండములు లేక, అష్టకములు. ఒక్కొక్క యష్టకము, ప్రపాఠకములు లేక ప్రశ్నములుగాను; ఒక్కొక్క ప్రశ్న మనువాకములుగాను; ఒక్కొక్క యనువాకము, కండికలు లేక పంచాశత్తులు గాను; విభజింపఁబడినవి.

అష్టకము	ప్రశ్నలు	అనువాకములు
౧	౮	౧౪౬
౨	౬	౭౫
౩	౫	౫౫

అష్టకము	ప్రశ్నలు	అనువాకములు
౪	౭	౮౨
౫	౭	౧౨౦
౬	౬	౬౬
౭	౫	౧౦౭
	౪౪	౬౫౧

పై ౬౫౧ అనువాకములలోను ౨౧౯౮ కండికలు లేక పంచాశత్తులు కలవు. ఏఁబది పదముల సమూహము పంచాశ త్తనఁబడును. ఇది తెలుఁగుదేశము నందు పనసయని చెప్పఁబడుచున్నది. పదపాఠమునుబట్టి వచ్చిన పదములసంఖ్య ౧౯౨౯౦. అక్షరములసంఖ్య ౨౫౩౮౬౮ శాఖావాక్యములసంఖ్య ౧౯౪౮౮.

పైని జూపిన ౪౪ ప్రశ్నలు సంహిత యనఁబడుచున్నను, అది యంతయు మంత్రము కాదు. అందు మంత్రమునకు వ్యాఖ్యానరూపమైన బ్రాహ్మణముగూడ మిశితమైయున్నది. మఱియు బ్రాహ్మణమని చెప్పఁబడు నితరకాండములు మూఁడింటియందును గేవలము బ్రాహ్మణమేలేదు. అందును మంత్రభాగము కలదు. అందలి మంత్రభాగమునకందే బ్రాహ్మణముండుటయే కాదు, బ్రాహ్మణములోని కొంత మంత్రభాగమునకు సంహితలోని కొంత భాగము బ్రాహ్మణముగాఁగూడ నున్నది. అట్లే యారణ్యకమందును గొంత మంత్రము కొంత బ్రాహ్మణముకూడ నున్నది. అందలి మంత్రమునకు బ్రాహ్మణములోఁ గొంత బ్రాహ్మణముగా నున్నది.[1] ఇట్లున్న యీ సంహితా బ్రాహ్మణారణ్యకము లాయాక్రతు విశేషము లందును వ్రతాదులందును వినియోగపడుచున్నను, ఆ వినియోగముననుసరించిన మంత్రక్రమమిందు గనరాదు. అట్టి యీ మూఁడింటిలోని మంత్ర బ్రాహ్మణములు కర్మ వినియోగమునుబట్టి యేఁబదిరెండు కాండములుగా విభజింపఁబడినవి. ప్రజా

1. సం - 1·6 ప్ర. సగమునకు 7. ప్ర. లో. సగము బ్రాహ్మణము—1·7 ప్ర. లో, సగమునకు 1·4 ప్ర. అంతయు బ్రాహ్మణము—4.7 ప్రశ్నలకు 5·4 ప్రశ్నలు బ్రాహ్మణము— 3. అష్టములో మంత్రము బ్రాహ్మణము కలసియున్నవి. బ్రా. 8·5, ప్రశ్నకు, సం. 2·5, 6. ప్రశ్నలు బ్రాహ్మణము. ఆర. చిత్తిస్స్రుగిత్యాది మంత్రములకు, బ్రా. 2·2, 8, ప్రశ్నలు బ్రాహ్మణము—ఆర. 4 ప్రశ్నకు 5 ప్ర. బ్రాహ్మణము. సం - 5·7 ప్రశ్నలకు తుది యనువాకములకు. బ్రా. 8. 8,9. ప్రశ్నలు బ్రాహ్మణము. ఇట్లు సర్వత్ర మంత్ర బ్రాహ్మణముల కలయిక కనవచ్చును.

పత్యాది ఋషులు దర్శించిన యీ కాండము లీమూఁడింటియందుగూడ నందందు గనవచ్చుటంజేసి ఋషులనుబట్టి కాండములు నిర్ణయించుటకై బ్రాహ్మణారణ్యకముల లోని భాగములను గూడ నిక్కడఁ జూపుట యావశ్యక మగుచున్నది. బ్రాహ్మణము మూఁడు కాండములు. అవి యష్టకములుగాను, అష్టకము, ప్రపాఠకములు లేక ప్రశ్నములుగాను, ప్రశ్నము వాకములుగాను విభజింపఁబడినవి. అరణ్యకము, ప్రపాఠకములుగాను, అనువాకములుగాను విభజింపఁబడినది. ఆవిభాగమిట్లు.

తైత్తిరీయ బ్రాహ్మణ విభాగము

అష్టకము	ప్రశ్నలు	అనువాకములు
౧	౮	౭౮
౨	౮	౯౬
౩	౧౨	౧౬౪
	౨౮	౩౩౮
ఆరణ్యకమున ...	౧౦	౨౧౮
పరిశిష్టదశమ ప్రపాఠకమున	... ...	౮౦

సంహితలోని ౪౪ ప్రశ్నలును, బ్రాహ్మణారణ్యకముల ౩౮ ప్రశ్నలును గలసి మొత్తము ౮౨ ప్రశ్నలు. ఈ మొత్తము కృష్ణ యజుర్వేద మనఁబడు చున్నది. ఆర్షక్రమమునుబట్టి కాండానుక్రమణిక యీ ౮౨ ప్రశ్నలను ౫౨ కాండములనుగా విభజించినది. అందుచేఁ జెప్పఁబోవుకాండము లాయాఋషులు దర్శించిన వేదభాగముల గుంపులని యెఱుఁగునది. అట్టి సంహితా బ్రాహ్మణా రణ్యకములలోని యేయేకాండము లేయే ఋషులపేరఁ బ్రసిద్ధికెక్కెనో యీ క్రింది విధముగాఁ దెలియనగును.

కాండములు – ఋషులు[1]

ప్రాజాపత్యకాండములు ౮ – పౌరోడాశిక మంత్రములు – యాజమాన మంత్రములు – యాజమానవిధి-దార్శిక హౌత్రవిధి – దార్శికహౌత్ర మంత్రములు

1. క్రిందఁ జూపుచున్న సంహితా బ్రాహ్మణముల భాగములలోని యంకెలు అష్టక ప్రపాఠకానువాక క్రమమునను, అరణ్యభాగముల యంకెలు ప్రపాఠ కానువాక క్రమమున నుండును. ఒకటియే యంకె యున్నచో మొదటి భాగమే యగును. విశేషమున్నచోట అక్షరము గుర్తుగా నుండును. చిల్లరగా నున్న యనువాకములు చూపఁబడలేదు.

పౌరోడాశికవిధి-హోతృవిధి-హోతృమంత్రములు-పితృమేధము-అనునవి. వీనికిఁ బ్రజాపతి ఋషి. ఇందు మొదటి నాలుగును సంహితలోనివి. తరువాతిమూఁడును బ్రాహ్మణములోనివి కడపటిరెండు నారణ్యకములోనివి.[1]

సౌమ్యకాండములు ౯ - ఆధ్వరము - గ్రహములు - దక్షిణలు - అధ్వర విధి గ్రహవిధి దక్షిణావిధులు - వాజపేయమంత్రములు - వాజపేయవిధి - సవములు - ప్రవర్గ్యము - ప్రవర్గ్యవిధి - అనునవి. వీనికి సోముఁడు ఋషి, ఇందు మొదటియైదును సంహితలోనివి. తరువాతి రెండును బ్రాహ్మణములోనివి. కడపటి. రెండు నారణ్యకములోనివి.[2]

ఆగ్నేయకాండములు ౭.— పునరాధేయమంత్రములు పునరాధేయవిధి - అగ్న్యుపస్థానమంత్రములు తద్విధులు - అగ్ని లేక చయనమంత్రములు - చయన విధులు - చయనోపానువాక్యములు - అగ్న్యాధేయమంత్రములు తద్విధులు - అగ్ని హోత్రవిధి - అనునవి. వీని కగ్ని ఋషి. ఇందు మొదటియైదును సంహితలోనివి. తక్కినరెండును బ్రాహ్మణములోనివి.[3]

వైశ్వదేవకాండములు ౧౬ — రాజసూయము - రాజసూయ బ్రాహ్మణాను బ్రాహ్మణములు - కామ్యపశువులు - కామ్యేష్టులు - ఉపాను వాక్యములు - యాజ్యలు - అశ్వమేధ మంత్రములు - సాత్రాయణము - అశ్వమేధవిధి - సాత్రాయణవిధి - ఉపహోమములు - కౌకిలి, లేక సౌత్రామణి - సూక్తములు - నక్షత్రేష్టి - అచ్ఛిద్రములు - పాశుకహౌత్రము - నృమేధము - అనునవి. వీనికి విశ్వేదేవులు ఋషులు. ఇందు మొదటియేడును సంహితలోనివి. తక్కిన తొమ్మిది బ్రాహ్మణములోనివి.[4]

ఉపనిషత్కాండములు ౩— ఆరణ్యకములోని సప్తమ ప్రపాఠకము సాంహితీయము. దీనిక సాంహిత్యుపనిషత్తు ఋషి.

1. 1.1; 1.6; 1.7.2.5-6 ప్ర—3.5; 3.2-3 ప్ర, 2.2-3 ప్ర;—3; 6;
2. 1.2-3 ప్ర; 1 4; 1-4; 6; 1.7.7-13;—1.3; 2.7;—7, 8;
3. 1.5.1—4, 1.5 5—11; 4; 5.1-4 ప్ర, 5.5—7 ప్ర,—1.1,2, ప్ర; 2.1.
4. 1.8, 1.6—8 ప్ర, 2.1; 2.2—4 ప్ర; 3; 1.1 ప్రశ్న మొదలుగా 4.3 ప్రశ్నాంతి మానువాకమువఱకును 4.4.7; ప్రశ్నల తుది యనువాకములు; 5.7; 7;3.8-9 ప్ర 1.2-4ప్ర; 2.4-5 ప్ర; 2-6 2.8; 3,1; 3-7; 3-6; 3-4.

ఆరణ్యకములోని యష్టమనవమ ప్రపాఠకములు వారుణీయము. దీనికి వారుణ్యుపనిషత్తు ఋషి.

ఆరణ్యకములోని దశమప్రపాఠకము యాజ్ఞికీయము. దీనికి యాజ్ఞిక్యుపనిషత్తు ఋషి.

ఇట్లు పైని జూపిన ౪౪ కాండములును, తిత్తిరిశాఖాకాండము లనఁబడును. ఇంక —

కాఠకములు ౮— అందు సావిత్రము - నాచికేతము - చాతుర్హోత్రము - వైశ్వసృజము - అను నాలుగును హవ్యవాహీయము లనఁబడును. వీనికి హవ్యవాహుఁడు ఋషి. ఇవి బ్రాహ్మణములోనివి.[1]

ఆరణ్యకములోని మొదటి ప్రపాఠక మారుణ కేతుచిత్య మనబడును. దీని కరుణులు ఋషులు.

దివశ్శ్యేనేష్టులు - అపాఘేష్టులు - అనునవి వైశ్వదేవకాండ మనఁబడును. దీనికి విశ్వేదేవులు ఋషులు.[2]

ఆరణ్యకము ద్వితీయ ప్రపాఠకము స్వాయంభువకాండము. దీనికి స్వయంభువు ఋషి.

ఇట్లు చూపిన ౫౨ కాండములుగాక, ప్రసుగ్మన్తేతి ప్రశ్నద్వయమును గొన్ని వైశ్వదేవమంత్రములును, ఏకాగ్నికాండ మనఁబడుచున్నవి. ఈ కాండమునకు విశ్వేదేవులు ఋషులు.

ఇట్లు ప్రజాపత్యాదులపేరఁ గనవచ్చు కాండములు సంహితా బ్రాహ్మణారణ్యకములందు సంకీర్ణములై యున్నను, ఈ పాఠము సరస్వతిదేవి తన పుత్రునికిఁ జెప్పినదగుటచే సర్వవిద్యానిధియైన యా సారస్వతుఁడు పఠించిన క్రమముననే యీ వేదమధ్యయనము చేయవలెను గాని దాని నతిక్రమింపరాదు. ప్రజా పత్యాది కాండర్షులకు బ్రాహ్మణుఁడు శుచియై నిత్యము తర్పణము చేయవలెను. అని కాండానుక్రమణిక శాసించియున్నది. ఈ కాండర్షి తర్పణమును సూత్రములును విధించుచున్నవి.[3] కావునఁ బైకాండములకును బ్రజాపత్యాదులకును గల సంబంధము తెలిసికొన యత్నింతము.

1. తై. బ్రా. 3-10-11. ప్ర; 12. ప్ర. 5-9 అనువాకములు.

2. తై. బ్రా. 3.1 2 ప్ర. 1-4 అనువాకములు.

3. బౌధాయన గృహ్యసూత్రము.

బ్రహ్మయజ్ఞాంగ తర్పణ వ్రతహోమాదులందు "ప్రజాపతిం కాండర్షిం తర్పయామి - సోమం కాండర్షిమ్ - అగ్నిం కాండర్షిమ్ - విశ్వాన్ దేవాన్ కాండర్షీన్ .. సాంహితీ ర్దేవతా ఉపనిషదః - యాజ్ఞికీర్దేవతా ఉపనిషదః - వారుణీ ర్దేవతా ఉపనిషదః - బ్రహ్మాణం స్వయంభువమ్ - సదసస్పతిమ్-" అని తొమ్మండుగురు పేర్కొనఁబడుచున్నారు. వీరిలో మొదటి నలుగురికిని సర్వత్ర కాండర్షి సంజ్ఞ కనవచ్చుచున్నది స్వయంభువునకు వ్రతహోమాదులందు మాత్రము కాండర్షిసంజ్ఞ యొప్పుచున్నది. ఉపనిషత్తులు సర్వత్ర దేవతలుగానే చెప్పఁబడు చున్నారు. వీరెనమండుగురికి మాత్రమే పూర్వోక్త కాండములతో సంబంధము కనఁబడుచున్నది. సదసస్పతికి వానితో సంబంధము లేకపోయినను, కాండర్షి తర్పణ హోమాదులందు సర్వత్ర యతఁడు పేర్కొనఁబడుచున్నాఁడు. హవ్య వాహీయ కాండములకు హవ్యవాహుఁడు ఋషియైనట్లు చెప్పఁబడినను, అతఁడు కాండర్షి తర్పణమునఁ గనరాఁడు. అట్లే, అరుణకేతు చిత్యమున కరుణులు ఋషు లైనట్లున్నను "అరుణాః కాండఋషయః."[1] అని యారణ్యకము చెప్పుచున్నను, వారును గాండర్షి తర్పణమునఁ గనరారు. ఇదంతయుఁ జూడఁగాఁ గాండముల యేర్పాటు మిక్కిలి గజిబిజిగానున్నట్లే కాండర్షుల విషయ మగమ్య గోచరముగా నున్నది. దీనినిబట్టియు, పూర్వోక్తకాండములయందు ప్రజాపతి సోమాగ్ని విశ్వే దేవ స్వయంభువులను దేవ విశేషుల ప్రశంస యధికముగా నుండుటను బట్టియుఁ జూడఁగాఁ గాండర్షులనఁబడువారు యాగవ్రతాదులందు స్తుతింపఁబడుదేవతలే కాని యాజుష మంత్రద్రష్టలు కారేమోయని సంశయింపవలసి వచ్చుచున్నది. ఇందుకు మఱికొన్ని హేతువులు :—

వందలకొలఁదిగా నున్న ఋక్సంహితా ద్రష్టలాయా సూక్తములతో నను క్రమణికలకు లభించినట్లుగా, యాజుషకాండముల ఋషులనఁబడువారు లెక్క కెనమండుగురేయైనను వారిలో ముగ్గురిపేళ్లు కాండానుక్రమణికకు లభింపలేదు. అందుచేతనే సాంహిత్యాదులైన యుపనిషత్తులకు సాంహితీ యాజ్ఞికీవారుణీనామ కోపనిషత్తులే ఋషుః ని చెప్పవలసివచ్చినది. సంహితాధ్యాయ రూపమైనదిసాంహితి, అది శీక్షావల్లి. వరుణునిచేఁ బ్రవర్తింపఁ జేయఁబడినది వారుణి, అది యానందవల్లీ భృగువల్లులు. యజ్ఞోప యుక్తమంత్రములు కొన్ని కలది యాజ్ఞికి, అది నారా యణము. ఉపనిషత్తులస్థితి యిదియని విషయమునుబట్టియు భాష్యాదులనుబట్టియుఁ గూడఁ దెలియవచ్చుచుండఁగా సాంహిత్యాదుల కవియే ఋషులనుటకుఁ గారణమేమి?

1. అర. 1-31.

తద్ద్రష్టల నామములు లభింపకపోవుటయే కదా? దీనినిట్లుంచి తక్కిన కాండర్షి నామములలోఁగూడ నొకదానిని గైకొనిపరిశీలింతము.

సౌమ్య కాండమునందు ప్రధానవిషయము సోమయాగమ్ము. "ప్రపాఠక త్రయే ణాథ సోమయాగః ప్రవక్ష్యతే" అని సాయణాచార్యు లాకాండము మొద టనే యందలి విషయ మిదియని వక్కాణించి యున్నారు. భట్టభాస్కర మిశ్రులు నీ యభిప్రాయమే యావిష్కరించిరి. నిజముగా నాకాండమునందు సోమ సోమ యాగవిధానములే వివరింపఁబడినవి. అయినను, సోముఁ డను నొక మహర్షియే సోమయాగము నట్లు వర్ణించెనని చెప్పినఁ జెప్పవచ్చునుగాని, ద్రష్టల నామములు తెలియక యుపనిషత్తుల కుపనిషత్తులు ఋషు లన్నట్లే సోమమునకు సోముఁడు ఋషి యని కాండానుక్రమణిక భావించినట్లు మాత్రము స్ఫురింపకపోదు. ఇట్లే తక్కిన ఋషుల నామములుగూడఁ దత్తత్కాండ విషయ ప్రధానములై కనవచ్చు చున్నవి. ప్రజాపతి కాండములలో నొకచోట - ఆశ్రావయ - అస్తు శ్రౌషట్ - యజ - యే యజామహే - వౌషట్ అనెడి పదియే డక్షరముల యైదు మంత్రము లును బ్రజాపతిసృష్టములని కనవచ్చుచున్నను.[1] ఆ మంత్రముల భావముగాని ప్రకర ణోద్దేశముగాని చూచినచో మంత్రద్రష్టయైన యొకానొక ఋషి, పై పంచమంత్రము లును లోకస్రష్టయగు ప్రజాపతివల్ల నావిర్భవించి సకల యజ్ఞానుగతములైనవని తన్మంత్ర మహిమను దెలుపుచున్నట్లు కనవచ్చునుగాని యాకాండము ప్రజాపతి మహర్షిదృష్ట మనెడి భావము కనరాదు. ఇది యిట్లుండ మఱియొక విషయము :—

ఈ సంహితలోని నాల్గవయష్టక మగ్నికాండ మనఁబడుచున్నది. అతఁడు కాండర్షి యగుటచే దానికి ద్రష్ట యతఁడని చెప్పవలసినదే. అందలి మంత్రములు చయనమందలి యగ్నిని బ్రతిపాదించుచున్న వనుట సత్యము. అయినను, ఋగ్వేద మందలి యగ్నిఋషివలెనే యతఁడును ఋషియని యంగీకరింతము! ఈ యష్ట కము మొదటి ప్రపాఠకమున నెనిమిదవయను వాకమున నిరువది ఋక్కులున్నవి. అందు కడపటి యెనిమిది ఋక్కులు ఋగ్వేదము ౧౨౧ సూక్తమున సరిగా నొక యక్షరమైన భేదము లేకుండనట్లే కనఁబడుచున్నవి. అవి 'హిరణ్యగర్భ స్సమవర్తతాగ్రే' ఇత్యాదికములు. ఇపు డీఋక్కులను దర్శించిన ఋషి యజుర్వేద సంప్రదాయమునుబట్టి యగ్నియనమా? లేక, ఋగ్వేద సంప్రదాయ

1. ఆశ్రావ యేతి చతు రక్షరమస్తు శ్రౌషడితి చతురక్షరం యజేతి ద్వ్యక్షరం యేయజా మహే ఇతి పంచాక్షరం ద్వ్యక్షరో వషట్కార ఏష వై స ప్తదశః ప్రజాపతి ర్యజ్ఞమన్వాయత్తో య ఏవం వేద—తై. సం. 1-6-11.

మునుబట్టి ప్రజాపతి పుత్రుఁడయిన హిరణ్య గర్భుఁడనమా ? హిరణ్య గర్భరూపుఁడను స్వయంభువును సృష్టికర్తయునగు ప్రజాపతిని వర్ణించు నా సూక్తమునుబట్టి చూచినను, అగ్నివర్ణనముతో నారంభమయిన యాయనువాకమునుబట్టి చూచినను వీరిద్దఱును గూడ మంత్రద్రష్టలు గాక యందలి విషయభూతులైన దేవవిశేషులే యట్లు ఋషులుగాఁ బేర్కొనబడిరని తోఁచుచున్నను, అగ్నియే తొలుత నా మంత్రములను దర్శించెనని యాజుషు లనవచ్చును, హిరణ్యగర్భుఁడే తొలుతఁ జూచెనని బహ్వృచు లనవచ్చును. ఒకరి మంత్రములు మఱియొకరు చూడలేదు. ఎవరికి వారే యట్లామంత్రములు దర్శించి యుందురని మధ్యవర్తు లనవచ్చును. ఎట్లయినను సమాన శబ్దార్థములైన మంత్రములకు ద్వివిధార్షేయత్వము తప్పదు. మఱియు నిట్లే యీ సంహితలోని "అగ్నేత్వం పారయా – అగ్నేనయసుపథారాయే-".[1] అను మంత్రములకుఁ బ్రజాపతి ద్రష్టయైనట్లు కాండాను క్రమణిక చెప్పుచున్నది. ఋగ్వేదములో సరిగా నిట్లేయున్న యీ మంత్రములకు నగస్త్యుఁడు ఋషి యని ఋగ్వేదాను క్రమణిక చెప్పుచున్నది. ఇందేమతము గ్రాహ్యము ? ఏదయినను, వీని కిద్దఱు ద్రష్టలున్నారనక తప్పదు. ఇట్లన్ని కాండములందును సిద్ధమగుచున్న యార్షద్వైవిధ్యము వారించుటకై యీ ఋక్కులను ఋగ్వేదమునుండి యజుర్వేదమో యజుర్వేదమునుండి ఋగ్వేదమో గ్రహించియుండునని చెప్పుదమన్న నిందు మొదటిదానికి వైదిక సంప్రదాయ మంగీకరింపదు, రెండవదానికిఁ జరిత్ర సంప్రదాయ మంగీకరింపదు. ఏమయినను మొదటిపక్ష ముచితమని తలంతమన్న ఋగ్వేదసూక్త ద్రష్టల విషయము గూడ సందిగ్ధముగానే యున్నదిగాని నిర్వివాదముగాఁ గనఁబడదు. వారిలో గోతమ మూర్తి భరద్వాజ విశ్వామిత్ర వసిష్ఠాది మహర్షులు పెక్కండ్రు మర్త్యులైన సూక్తద్రష్టలుగాఁ గనపచ్చుచున్నను, కొన్ని కొన్ని యెడలఁ బరమేష్ఠియైన ప్రజాపతియు, పావకుఁడైన యగ్నియు, దేవశునియైన సరమయు, పక్షిరాజపుత్రుఁడైన సుపర్ణుఁడును, సూక్తద్రష్ట లగుటయు, మఱికొన్నియెడల సూక్తవిషయ భూతదేవతలే సూక్తద్రష్ట లగుటయుఁ గనరాకపోదు. ఇంతకును ద్రష్టల విషయమున వాస్తవ పరిశీలనము గావించినచో ఋగ్వేద ద్రష్టలలో నే పదిమందియో దేవతాది లక్షణములు గలవారుగాఁ గనిపింతురుగాని యజుర్వేదద్రష్ట లందఱుగూడఁ గాండ విషయ భూతులైన దేవతా విశేషులుగానే కనిపింతురు. దానంజేసి తార్కికమైన చరిత్ర సంప్రదాయమును గాదని రెండవ పక్షము గ్రహింతుమేని, యజుర్వేద మన్నిటికంటెఁ బ్రాచీన మగుటచేతనే దాని

1. తై. సం. 1-1-14—ఋ. సం. 10-189.

కాండములను దర్శించినవారి యథార్థ విషయము తెలియరాకపోయినదనియు, బ్రాహ్మణము చెప్పిన ఋక్సామ యజుర్మంత్రములరాశి[1] యజుర్వేదమనియు, నిందలి ఋక్కులు ఋగ్వేదసూక్తములలోఁ బ్రవేశించినవనియుఁ జెప్పవచ్చునుగాని, యితర వేదవాక్యములచే నిది ప్రతిహతము కాకపోదు. ఎటుచూచినను, ఇదమిత్థ మనుటకు వీలులేక విషయ మిట్లజ్ఞేయముగా నున్నది గావునను, 'కఠేన మునినా దృష్టం కాఠకం పరికీర్త్యతే' అని యే సంప్రదాయమునుబట్టియో సాయణులు చెప్పినను, కఠతిత్తిర్యాదులు ప్రవక్తలే కాని ద్రష్టలు కారని మఱియొక ప్రాచీన సంప్రదాయము వైదిక వాఙ్మయమున స్థిరపడియున్నది కావునను యాజుష కాండముల సత్యమైన యార్ష సంప్రదాయము తెలుపు నితరాధారములు లభింపకున్నవి కావునను, ప్రజాపత్యాదులు తత్తత్కాండ విషయభూతులైన దేవతా విశేషులే యైనను[2] వారే కాండద్రష్టలైన కాండర్షులని విశ్వసింపవలసి వచ్చినది.

సంహితా విషయము

ఇందలి ప్రధానవిషయము యాగము. అది, ఏకాహము అహీనము సత్రము నని త్రివిధము. అందు, ఒకదినముతో సమాప్తమగునట్టి యాగము లేకాహములు. అవి జ్యోతిష్టోమ భేదములైన యగ్నిష్టోమము అత్యగ్ని ఉక్థ్యము షోడశి అతిరాత్రము వాజపేయము అప్తోర్యామము మొదలయిన ప్రకృతి యాగములు. రెండు రోజులు మొదలుగాఁ బన్నెండురోజులవఱకు జరగు సుత్యలు వికృతియాగము

1. తై. బ్రా. 1-2-1-26.
2 ప్రజాపతి ర్యజ్ఞ మతనుత - ప్రజాపతి ర్యజ్ఞా నతనుత - ప్రజాపతే ర్విభా న్నామలోకః - ప్రజాపతిః ప్రథమజా ఋతస్య - ప్రజాపతి ర్వైకః - ప్రజాపతిః పరమాం. ప్రజాపతే ర్భాగః - ప్రజాపతి కాండములలో నిట్టి వనేకములు—సోఽగ్ని రబ్రవీత్ - అగ్ని రాహిత ఇచ్ఛమానః - తదగ్ని ర్న్యకామయత - యోఽగ్ని ముద్వాసతే - సప్తతే అగ్నే సమిధః - ఇత్యాదు లగ్ని కాండములలో. ఇంద్ర మరుత్వ ఇహ పాహి సోమం - సోమస్య తనూ రసి- సోమ విక్రయిణి తమః - సోమస్యాఽఽ. తిథ్య మసి విష్ణవే త్వా - ఇ ట్లనేకములు.

విశ్వేదేవా ఇహ మాదయన్తా మిత్యాహ - విశ్వేదేవా స్సజోషసం - యచ్ఛ విశ్వేదేవాః - విశ్వానేవ దేవాన్ త్స్వేన భాగధేయే నోపధావతి - వైశ్వదేవీం బహురూపా మాలభేత - ఇట్లనేకములు.

అజాన్హ వై పృశ్నీ న్త్సపస్యమానాన్ బ్రహ్మ స్వయంభ్వభ్యానర్ష త్త ఋష యోఽభవ న్తదృషీణా మృషిత్వమ్ - ఇత్యాది.

లనఁబడును. ద్వాదశ సుత్యాకము పౌండరీకము. అది సత్రయాగమునకుఁ బ్రకృతి సత్రయాగము పన్నెండు రోజులు మొదలుగాఁ గొన్ని సంవత్సరములవఱకును జరుగునట్టిది. అవి గవామయనాదులు. మఱియుఁ గర్మ జ్ఞానభేదమునఁ గాండ ద్వయాత్మకమైన యీ వేదమందీ భాగము కర్మకాండ మనఁబడుచున్నది. ఇందు నిత్యకర్మలు నైమిత్తిక కర్మలు కామ్యకర్మలు నిషిద్ధకర్మలు ప్రతిపాదింపఁబడును. కావుననే కర్మకాండవిషయమున యజుర్వేదము ప్రాధాన్యము వహించినది. ఆను పూర్విగాఁ గర్మస్వరూపము తెల్పునది యజుర్వేదము కావుననే యిది భిత్తిస్థా నీయముగాను దీని నాధారముగాఁ జేసికొన్న ఋక్సామ వేదములు చిత్రస్థానీయ ములుగాను జెప్పఁబడుచున్నవి. నిరపేక్షములైన దర్శ పూర్ణమా సేష్టులు మొదటి వగుటచేతను, అవి ఋక్సామములందు చెప్పఁబడక యజుర్వేదమునందు మాత్రమే చెప్పఁబడుటచేతను. కర్మవిషయమున యజుర్వేదము భిత్తిస్థానీయమయినదని సూత్రకర్తలు భాష్యకర్తలుగూడ నేకగ్రీవముగాఁ జెప్పుచున్నారు. అట్టి దీనియందలి మంత్రములు ఋక్కులు సామములు యజుస్సులునని త్రివిధములు. అధ్వర్యు వేద మని యనాది సిద్ధమైన ఖ్యాతివహించిన దీనియందు కొన్ని ఋక్కులున్నను, యజుస్సులే బహుళముగా నుండుటచే దీనికి యజుర్వేదమను పేరువచ్చినది. ఇందు సమామ్నాతములైన దర్శ పూర్ణమాసేష్టి మంత్రములు, ఆధ్వర్యవములు యాజ మానములు హౌత్రములు నని మూఁడువిధములు. యజ్ఞమందు, అధ్వర్యుఁడు పఠించున వాధ్వర్యవములు. యజమానుఁడు పఠించునవి యాజమానములు. హోత యనెడి ఋత్విక్కు పఠించునవి హౌత్రములు.

మఱియు నీ వేదము విధ్యర్థవాద మంత్రభేదమునఁ ద్రివిధము. చోదనా రూపములైనవి విధులు. స్తుతిరూపములైన వర్థవాదములు. అను ష్ఠేయార్థ ప్రకా శకములు మంత్రములు. ఇట్లు త్రివిధమైయున్న యిందలి యజుస్సులు కొన్ని ఋగ్వేదమందును సామవేదమందునుగూడఁ గనఁబడుచున్నవి. అందలి ఋక్కు లును సామములును గొన్ని యిందును గనఁబడుచున్నవి. ఇట్లు ఋక్సామములు సంకీర్ణములై యున్నను, ఇందు కొలఁదిగానున్న ఋక్కులు ఋగ్వేదమునుండియు సామములు సామవేదమునుండియు వచ్చి యిందు ప్రవేశించిన వని వైదిక సంప్ర దాయ మంగీకరింపదు. అందుచేతనే వృత్తబద్ధ మంత్రములు ఋక్కులనియు గీత్యుపేతములు సామములనియు వృత్తగీతి వర్జితములు యజుస్సులనియు నిందలి మంత్రములకు లక్షణమేర్పడినది. అట్టివానికి సాయణాచార్యులు చూపిన యుదా హరణములివి.

'దేవోవస్సవితోత్పునా త్వచ్ఛిద్రేణ పవిత్రేణ వసో స్సూర్యస్య రశ్మిభిః' అను మంత్రము యజుర్వేదమందున్నది. ఇది ఋక్కే కాని యజుస్సు కాదని బ్రాహ్మణము నిర్ధారణచేసినది.

"అగ్నయే మథ్యమానా యానుబ్రూహి, హవిర్ధానాభ్యాం ప్రోహ్యమాణాభ్యామనుబ్రూహి'' ఇత్యాది యజుస్సులు ఋగ్వేదమందు పఠింపఁబడియున్నవి. 'ఏతత్సామ గాయన్నాస్తే'— "హా ౩ వు హా ౩ వు హా ౩ వు." ఇత్యాది సామములు యజుర్వేదమందు కలవు.

"అక్షితమసి - అచ్యుతమసి - ప్రాణసంశిత మసి-'' ఇత్యాది యజుస్సులు సామవేదమందున్నవి.[1]

ఋగ్వేద సూక్తములు యజ్ఞార్థములుగా యాజ్ఞికులచే వినియోగింపఁబడుచున్నను, ఇంద్రాగ్నివరుణాది వివిధ దేవతాస్తుతి పరములుగా నున్నయవి దేనికదే వేఱుగా నున్నట్లు కనఁబడునుగాని వానికిఁ బూర్వోత్తర సంబంధముతోఁ గూడిన సమన్వయైక్యము కనరాదు. యాజుష మంత్రములట్లుగాక యొక్కొక్క ప్రధాన విషయమందు సమన్వయైక్యముఁగలిగి పూర్వోత్తర సంబంధముతో విరాజిల్లుచు నఖండమైన యేకాకారముతోఁ గనవచ్చును. అందుచేతనే వైదిక ప్రపంచమందితర వేదములకు లేని మహామహత్త్వము దీనికి సంభవించినది. ఇందు ప్రతిపాదింపఁబడిన కర్మకాండమంతయు బ్రాహ్మణుఁడు వేదాధ్యయనము చేసి తదర్థమెఱిఁగి కర్మానుష్ఠానపరుఁడై సాధనచతుష్టయ సంపన్నుఁడు కావలెనని ప్రేరేపించుచు, శ్రద్ధాభక్తి సమన్వితుఁడై కర్మనిరతుఁడగు వానికిఁ జిత్తశుద్ధిని ధీవైశద్యమును గలిగించి వానిమూలమున నాముష్మికజ్ఞాన ముదయింపఁజేయును. అదేకదా వేదముల ముఖ్యోద్దేశము! అందుకే మానవ జన్మమెత్తినవాఁడు కర్మద్వారమున జ్ఞానమును జ్ఞానద్వారమున మోక్షమునుజెంది యద్వితీయ పరబ్రహ్మైక్యము బడయుఁగాక యను తలంపుతోఁ ద్రికాలవేత్తలగు పురాతనమహర్షులు వేదమంత్రములు సందర్శించి లోకమున కనుగ్రహించిరి. ఇదే వేదమందలి ముఖ్యవిషయము. ఇఁక—

పశుమేధము - నరమేధము

యజుర్వేదము యజ్ఞశరీరమనుట విస్పష్టమే కావునఁ గొన్ని కర్మవిశేషములను గూర్చి మాత్రమే ప్రసంగింతము. జీవహింస చేయరాదని నిషేధ శ్రుతివచన

1. తై. సం. భాష్యావతారిక.

మున్నను, యజ్ఞార్థమయిన పశువును హింసింపవచ్చునని విశేష విధివచనము మఱి యొకటి కలదు.[1] ఈ రెండు వచనములుగూడ ఋక్సామ యజుస్సంహితలకుఁ దరువాతివే యైనను వానియందు గూడ నీ రెండర్థములిచ్చు వాక్యము లనేకములు లేకపోలేదు. కావున యాగములయందు పశువధ యొనరించెడి యాచారము ఋగ్వేద కాలమునుండియు నట్లే వచ్చుచున్నది. కాని యార్యులు స్వేచ్ఛగా మాంసభక్షణము చేయుకాలమందు మేఁకలు గొఱ్ఱెలు ఎద్దులు గోవులు మొదలగు వివిధ మృగములను జంపి చేయుయజ్ఞములలో గోమేధాశ్వ మేధాదియాగము లంతరించినను, నాఁటి నుండి నేఁటికిని ఛాగ పశ్వాలంభము మాత్రము యాగవిహితమై కనవచ్చుచున్నది. మఱియు ఋక్సామయజుస్సంహితలు నరమేధమును విధింపకున్నను, యజుస్సం హితలో బురుషమేధ ప్రసంగము కనిపించుచున్నది. తైత్తిరీయ బ్రాహ్మణములోఁ బురుషాలంభ విధియుఁ గనిపించుచున్నది. వీనినిబట్టి గోమే ధాశ్వమేధములవలెనే నరమేధమొక కాలమున నాచరణలోనుండి వెంటనే యణఁగిపోయినదని యూహింప వలసి వచ్చుచున్నది. అందుచే నరమేధ పశుమేధముల స్వరూప మెట్టిదో కొంత తెలిసికొందము.

ప్రాజాపత్య హవిర్నిష్పాదనమునకై 'ఏకవింశత్యాహూతైః పురుషశీర్ష' మిత్యాది మంత్రములందు.[2] పురుష శిరస్సంపాదనవిధాన మిట్లున్నది.

"యాగకర్త యిరువదియొక్క మినుపగింజలు చేతఁ బుచ్చుకొని బయలు దేఱి వెళ్ళి బాణముచేతనో పిడుగుచేతనో హతుఁడై పడియున్న వైశ్యునిగాని క్షత్రి యుని గాని సమీపించి యతనితలపై నాగింజలుంచి దానిని దెగఁగొట్టి యేడుచిల్లులు గల పుట్ట మట్టిగడ్డ యొకటి యా శిరస్స్థానమునఁ బెట్టి యాక్రియ వలన యాగ యోగ్యమైన యాశిరస్సును దెచ్చి యజ్ఞక్రియ జరిగింపవలెను"

సంహితలోని యీ వాక్యములనుబట్టి యాకస్మికముగా హతుఁడైనవాని శిరస్సు యజ్ఞయోగ్యము గావించుకొని దానితో యాగము జరుపుటకూడఁ గలదని తెలియవచ్చునుగాని సజీవపురుషుఁడు యజ్ఞపశువుగా నుపయోగింపఁబడినట్లు లేదని స్పష్టమగును. అమృతుని శిరస్సునైనను ఏదో యొక యపూర్వ ఫలము కలుగు నని తలంచి యట్లు హవిస్సుగా సమర్పించెడివారు గాని యందలిహుత శేషమును భక్షించుటకుఁ గాదనియు విదితమగును. కాని తైత్తిరీయ బ్రాహ్మణమందు—

1. నహింస్యాత్సర్వభూతాని - అగ్నిషోమీయం పశు మాలభేత.
2. తై సం 5-1-8.

"బ్రాహ్మణే బ్రాహ్మణ మాలభతే, క్షత్రాయ రాజన్యమ్, మరుద్భ్యో వైశ్యమ్, తపసే శూద్రమ్ – ఇత్యాదిగా, ప్రతీక్షాయై కుమారీమ్" అనునంత వఱకు.[1] ౧౮౬ మనుష్యరూప పశువులు చెప్పఁబడినవి. బ్రాహ్మణాది కుమార్యంతరములై యీ నరపశువులు పంచాహమైన సోమయాగ విశేషమందు మధ్య దినమున సవనీయ పశువులతో నాలంభనీయము లగునని బ్రాహ్మణాభి ప్రాయమును సూత్ర మావిష్కరించుచున్నది. దీనినిబట్టి నరమేధ మొకానొకకాలమున నుండె ననుట విశ్వసనీయ మగుచున్నది. ఈ యంశమును సాయణాచార్యులిట్లు తేటపఱిచి యున్నారు.

"ప్రాపాఠకే చతుర్థేతు మేధః పురుషపూర్వకః ।
ఉచ్యతే సూత్రకారేణ సవిస్పష్ట ముదాహృతః॥"

నరమేధ మనునదియైదు దినములు చేయునట్టి సోమయాగ విశేషము. బ్రాహ్మణుఁడుగాని క్షత్రియుఁడుగాని యిట్టియాగ మొనరించి గొప్ప తేజస్సును మహావీర్యమును బొందునని యీ యాగమువలని ఫలమును సూత్రము నిరూపించుచున్నది. ఈ నరపశువులలో బ్రాహ్మణాది చండాల పర్యంతము పదునెనిమిది జాతులవారును గలరు. అందు పండితుఁడు పామరుఁడు వీరుఁడు భీరువు కన్య బ్రహ్మచారి సంసారిణి కులట గాయకుఁడు నటుఁడు కర్షకుఁడు వణిజుఁడు గూనివాఁడు కుంటివాఁడు తెల్లనివాఁడు నల్లనివాఁడు పచ్చనివాఁడు పిల్లికళ్ళవాఁడు వీరు వారన నేల మానవజాతిలోఁ గనవచ్చు నన్ని తెగలవారును గలరు. బ్రహ్మ మొదలుగా లాభ ప్రతీక్షణాభిమాని దేవతవఱకును గలయుత్తమ మధ్య మాధ మదేవతలు ౧౮౬ గురిలోను, ఆయా దేవతయోగ్యతనుబట్టి యాయాజాతి పురుషుఁడో స్త్రీయో పశువుగా విధింపఁబడెను. మఱియు నిందే వాగ్దేవత కొఱకు స్థూలశరీరుఁడైన పురుషుని బశువుఁగా నుపయోగించి యతని ప్రాణపంచకమును వాయుదేవునికి, నేత్రములను సూర్యునికి, మనస్సును జంద్రునికి, శ్రోత్రములను దిక్కులకు, జీవాత్మను బ్రజాపతికి, సమర్పింపవలెనని యొక యనువాకము చెప్పుచున్నది. ఇచ్చటఁ బ్రాణచక్షురా దీంద్రియములకు వాయు సూర్యాదు లధిష్ఠానదేవత లగుటచే మృతుఁడైనవాని యా సూక్ష్మేంద్రియములా దేవతలను చెందిన వనెడి యర్థము చెప్పవచ్చునుగాని, యీ యర్థము భాష్యకర్తలు వ్రాయలేదు. పైగా వాగ్దేవికై స్థూలపురుషుని వధించుట యనుదాని కర్థాంతర మేదియు సరిగాదు. అందుచే

1. తై. బ్రా. 3. 4. 1—19. దీనిని, తెలుఁగు దేశములోని వైదికులు సున్నాల పన్నమందురు.

సంహితలలో సూచితమైన నరమేధాచారము బ్రాహ్మణముల కాలమున వచ్చినదని యంగీకరింపక తప్పదు. ఇందుకైతరేయ బ్రాహ్మణములోని శునశ్శేఫవృత్తాంతము గూడ నిదర్శన మగుచున్నది. ఆ కథ నరమేధమును స్తుతించునది కాకపోయినను, ఈ దురాచారము కలదనుట కుదాహరణము కాఁగలదు. పెద్దదిగానున్న దాని నిందు సంగ్రహించి చూపుచున్నాను.

"ఇక్ష్వాకువంశరాజయిన హరిశ్చంద్రుఁడు తనకుఁ బుత్రుఁడు పుట్టినచో వానిని వరుణుని కర్పించి యజ్ఞము చేయుదునని ప్రతిజ్ఞ చేసెను. వరుణ ప్రసాదమున నతనికి రోహితుఁడను కుమారుఁడు పుట్టెను. కాని, రాజు ప్రతిన చొప్పున యాగము చేయలేదు. రోహితుఁడు యౌవరాజ్యాభిషిక్తుఁడైన తఱివరుణుఁడు వచ్చి ప్రతిజ్ఞ నిర్వహింపుమని హరిశ్చంద్రుని నిర్బంధించెను అందుచే నతఁడు యాగము చేయ నుద్యుక్తుఁడు కాఁగానే రోహితుఁడది తెలిసికొని యడవికిఁ బాఱిపోయెను. అంత వరుణుఁడు జలోదరరోగముచే బాధపడుమని హరిశ్చంద్రుని శపించెను. హరిశ్చంద్రుఁడు రోగముచే నవయుచుండెను. వనములోనున్న రోహితుఁడా వార్త విని విచారించి తనకు బదులొకని పుత్రుని బురమునకుఁ గొనిపోయి తండ్రి కియ్యఁదలంచి యడవిలోఁ దిరుగుచు నొకచోట నాఁకటి బాధచేఁ గృశించి యున్న యజీగర్తుఁడను ఋషిని జూచెను. ఆ ఋషికి ముగ్గురు కొడుకులు కలరు. వారిలో నొకపుత్రు నిచ్చినచో నూఱుగోవుల నిచ్చెదనని రాజపుత్రుఁడు పల్కెను. మధ్యముఁడైన శునశ్శేఫు నిచ్చుట కతనితల్లిదండ్రు లంగీకరించిరి. ఆ ప్రకారము రాజపుత్రుఁ డామునిపుత్రుని దండ్రివద్దకుఁ గొనివచ్చి యావృత్తాంతము దెలిపెను. అపుడు హరిశ్చంద్రుఁడు వరుణుని చెంతకేగి నీకీమునిబాలు నుపయోగించి యజ్ఞము చేయుదునను గ్రహింపుమని వేఁడుకొనెను. అందుకు వరుణుఁడంగీకరించి రాజసూయము చేయుమని సెలవిచ్చెను.

హరిశ్చంద్రుఁడు రాజసూయ మారంభించెను. విశ్వామిత్రాది మహర్షులందఱు వచ్చిరి. శునశ్శేఫునితండ్రియు వచ్చెను. విశ్వామిత్ర జమదగ్న్యాదులు ఋత్విక్కులై యాగము సాగించుచుండిరి. అధ్వర్యుఁడైన జమదగ్ని యాగపశువైన శునశ్శేఫుని మంత్రపూతుని గావించి యతనిని యూపమునకు బంధింపఁ బూనకుండెను. ఆక్రూరకర్మమున కాసభలోని వారెవరును సిద్ధముకాలేదు. అపుడు వానితండ్రి యజీగర్తుఁడు లేచి నాకు మఱినూఱుగోవుల నిచ్చినచో నేను బంధింతుననెను. రాజట్లే యిచ్చెను. ఆ ఋషియునట్లే పుత్రుని బంధించెను.

అనంతరమతనిని హింసింపవలసివచ్చినది. ఆ ఘోరకర్మ కెవ్వరు నిష్టపడలేదు. అపుడజీగర్తుఁడు మరల లేచి యింకొకగోశత మిచ్చినయెడల నేను జంపెదననెను. అట్లే రాజు గోవులనిచ్చెను. అంత నతఁడు కత్తి నూఱుకొని కొడుకును సమీపించెను. అపుడు శునశ్శేఫుఁడు గత్యంతరము లేక ప్రజాపత్యగ్నిసవితృవరుణాదిదేవతలను సమంత్రకముగాఁ బ్రార్థించెను. అంత వారియనుగ్రహమున నతనిబంధములు విడిపోయినవి. హరిశ్చంద్రునిరోగమును శాంతించినది. విశ్వామిత్రాదు లతనిఁ బ్రశంసించిరి."[1]

ఐతరేయ బ్రాహ్మణమునాఁటికే యితిహాసమయిన యీ కథ విశ్వసనీయమైనను గాకపోయినను, నరమేధాదార మంతకు మున్నున్నట్లును దానికి మహర్షులనేకు లిష్టపడకుండినట్లును దీనివలనఁ దెలియకపోదు. కాని, యజుస్సంహితాకాలమందును దానికిఁ బూర్వమందును, తరువాత నైతరేయ బ్రాహ్మణకాలమందును గూడ ఋషిసమ్మతము గానిసజీవనరమేధ మొక్క తైత్తిరీయ బ్రాహ్మణమందుమాత్రమే కనవచ్చుటనుబట్టి చూడఁగా నిజముగా నిట్టియాచార మా కాలమున నున్నదో, లేక యాగపశ్వాలంభమున కిష్టపడని వారెవరయిన నట్టియాచారమునెడ రోఁత పుట్టించునట్లుగా నతినింద్యమయిన నరమేధప్రకరణము నందు ప్రక్షిప్తము గావించిరో మూహింపనలవి కాకున్నది. ఎట్లయినను, కాళికాదేవికి నరబలియిచ్చెడి దురాచారము నిన్న మొన్నటివఱకును, రహస్యముగా నేఁటివఱకును గూడ నుత్తర హిందుదేశమున నుండుటనుబట్టి తుచ్ఛలాభాభిలాషులగు హృదయ శూన్యులు కొందఱాకాలమునఁ గూడఁ దోడిమానవులను యాగములందు హింసించుచుండిరేమో యని తోఁచుచున్నది. ఏమయిన నీ దుష్టపిశాచనీచాచారము పుట్టినవెంటనే యణఁగిపోయినదనుట నిజము. ఇదియే కాదు, గోమేధాశ్వమేధములు గూడ నెంతోకాలము నిలవక సమసిపోయినవి. ఇందుకుఁ దైత్తిరీయసంహితలోని యీ క్రింది ఛాగపశు ప్రశంసయే తార్కాణము.

"సర్వాణి వా ఏ షరూపాణి పశూనాం ప్రత్యాలభ్యతే య చ్ఛ్మశ్రుణ స్తత్ పురుషాణా రూపంయ త్తూపర స్తదశ్వానాం యదన్యతోద న్త ద్గవాం యదవ్యా ఇవ శఫా స్తదవీనాం యద జ స్త ద జా నామ్."[2]

1. ఐ. బ్రా. 33. అధ్యా. 2. తై. సం. 5-5-1.

'ద్విపాదచతుష్పాద పశువుల కే రూపములు కలవో యవి యన్నియు నుండుటచే ఛాగపశువు యాగములందు వధింపఁబడుచున్నది. అది గడ్డముండుటచేఁ బురుషుని బోలియున్నది కొమ్ములు లేకుండుటచే గుఱ్ఱమును బోలియున్నది.[1] నోటిలోఁ క్రింది భాగము మాత్రమే పళ్ళుండుటచే గోవును బోలియున్నది. చిన్న గిట్టలు రెం డుండుటచే గొఱ్ఱెను బోలియున్నది. అజ జాతినిబట్టి యెల్ల మేఁకలను బోలియున్నది."

దీనిచే గోహయ మేధములవలెనే నరమేధముకూడ నీ సంహితకు మున్నే యొకప్పుడుండెననుట కవకాశ మేర్పడుచున్నదిగాని, వానిస్థానమందు మేఁకను బ్రవేశపెట్టి వాని లక్షణములు గలయజమే యజ్ఞపశువగుట కర్హమని ప్రశంసించుటనుబట్టి నరమేధ మీ సంహితకెంతమాత్ర మిష్టము కాదనియు ఛాగపశ్వాలంభమే దీనికి సమ్మతమనియుఁ దెలియవచ్చును. ఇట్టి సంహిత ప్రశంసించిన ఛాగపశువే సర్వసమ్మతమై మాంసభక్షణాచారమున్న యానాఁటినుఁడి మాంసము పరిత్యజించిన నేఁటివఱకునుగూడ యజ్ఞములందు వధింపఁబడుచున్నది. ఈ తత్త్వమెఱిఁగియే కాఁబోలు ద్వైతమతమువారు దీనినిగూడఁ బరిత్యజించి పిష్టపశువుతోనే యాగము లాచరింప నారంభించినారు। ఇఁక నీ సందర్భమున నొక్క మాట:- -

వాజసనేయ సంహిత ౩౦-౩౧ అధ్యాయములలోఁ బురుషమేధవిధి కనవచ్చుచున్నది గాని, యా సంహిత తైత్తిరీయ సంహితతో విడిపోయిన తరువాతఁ దైత్తిరీయ బ్రాహ్మణమునకుఁ బూర్వమందో లేక పరమందో యీ యధ్యాయములు రెండును దానికిఁ జేర్పఁబడినవని తెలియనగును. అందుచేతనే యివి ఖిలాధ్యాయములలోఁ గణింపఁబడుచున్నవి. ఈ విషయముకూడ వాజసనేయ సంహిత తైత్తిరీయ సంహితకంటె నర్వాచీనమనుట కొక కారణమగుచున్నది.

దేవతా చ్ఛందస్సులు

ఋగ్వేదమునందువలెనే యిందును మంత్ర ప్రతిపాదితార్థమే దేవత యనెడి నియమమునుబట్టి యాయా మంత్రములకు భూమ్యంతరిక్షద్యు లోకదేవతలగు నగ్నీంద్ర సోమవరుణాదిత్య వాయునక్షత్ర విష్ణు రుద్రాదులు దేవతా విశేషులై స్తుతింపఁబడుచున్నారు. మఱియు నాయా కర్మవిశేషములందు చేయు హోమ

1. తూపర శబ్దమునకు శృంగరహితమని సాయణు లర్థము వ్రాసిరి. దీనినిబట్టి కొమ్ములురాని మేఁకపిల్ల యజ్ఞపశువుగా నర్హమని తెలియుచున్నది.

విశేషములబట్టి యోషధీ వనస్పతి సరీసృపాది చరాచరము లన్నియు దేవతా విశేషము లగుచుండును.

యజుర్వేదమందున్న ఋక్కులకు ఋగ్వేద ఋక్కులకు వలెనే గాయత్రి త్రిష్టుప్ అనుష్టుప్' మొదలయిన ఛందస్సులు కలవుకాని యిందలి యజుస్సులకు ఛందస్సు లేదు. ఋక్కులకువలెనే, అక్షరమాత్రా సంఖ్య ననుసరించి యజుస్సులకుఁగూడ చందస్సు కల్పింపరాదా యన్నచో నది శ్రుతివిరుద్ధమగును. బ్రాహ్మణము యజుర్మంత్రములకు ఛందస్సు నిషేధించియున్నది కావున వానికి ఛందః కల్పన మశక్యమని భాష్యకర్తలు ప్రాచీనాభిప్రాయ మావిష్కరించియున్నారు. స్వరమును వర్ణానుపూర్వియు దాని జీవము. వర్ణముల కెక్కువ దగ్గఱగా నిబద్ధమైన యజుర్మంత్రముల యుదాత్తానుదాత్తస్వరిత స్వరకల్పనము రసవత్తరమై శ్రోత్రపేయమై పఠించునపుడుగాని వినునపుడుగాని హాయిగొలుపుచుండును. వేద మింతకాలము చెక్కుచెదరకుండఁగా యథాపూర్వముగా భూమిపై నిలుచుటకు దాని స్వరవర్ణానుపూర్వులే కారణము. అవియే దాని గౌరవ మహత్త్వములకు మూలము. అందుచేతనే మంత్రోచ్చారణమున స్వరవర్ణ విపర్యాస మెంతమాత్రము కూడదని నిషేధించుచు, నట్లుచ్చరించుటవలన హాని కలుగునని పూర్వు లొక గాథ నుదాహరించియున్నారు.

"పూర్వ మింద్రుఁ డొకప్పుడు త్వష్టకొడుకైన విశ్వరూపుని హింసించెను. అందుచేఁ ద్వష్టకుపితుఁడై యుండి తానొనరించు సోమయాగమున కింద్రుని బిలువ లేదు. అయినను శక్రుఁడు దానిని గణింపక యతనిజన్నమునకు వెళ్లి సోమము త్రాగి యాగమునకు విఘ్నము కలిగించివచ్చెను. అపుడు త్వష్ట యింద్రునికి హాని కలుగునట్లు గాఁ దక్కినసోమరసముతో నభిచారహోమము చేయఁదలఁచినవాఁడై 'స్వాహేంద్ర శత్రు ర్వర్ధస్వ' అను మంత్రముచ్చరించి హోమముదేసెను. 'ఓ పుట్టబోవుపురుషుఁడా! ఇంద్రునికి ఘాతకుండవై వర్ధిల్లుము' అని త్వష్టయభిప్రాయము. అపుడింద్రశత్రుపదము తత్పురుష సమాసమగును గావున నంతోదాత్తము కావలసియున్నది. కాని ప్రమాదవశమునఁ ద్వష్టదాని నాద్యుదాత్తముగాఁ బ్రయోగించెను. ఆద్యుదాత్తస్వరము బహువ్రీహిసమానమున లభ్యమగుటంజేసి యా పదమున కింద్రుఁడు ఘాతుకుఁడుగాఁ గలవాఁడనెడి యర్థము సిద్ధమైనది. అందుచే నింద్రునిచేఁ జంపఁబడఁదగిన వృత్రుఁ డుదయించెను."[1]

1. మంత్రో హీనః స్వరతో వర్ణతో వా మిథ్యాప్రయుక్తోన తదర్థ మాహ, న వాగ్వజ్రో యజమానం హినస్తి య థేన్ద్రశత్రుః స్వరతోఽపరాధాత్.

దీనినిబట్టి సర్వవిపర్యాసమువలన హాని కలుగుననియే కాదు, అర్థము కూడ మాఱిపోవునని తెలియవచ్చును. అందుచేతనే యర్వాచీనులు వేదస్వరవర్ణము లుచ్చారణమందు విపర్యాసము నొందకుండుటకును లోపింపకుండుటకును బహు విధములైన లక్షణములు రచియించి సంరక్షించుచువచ్చిరి.

సంహితలోని వర్ణనలు

యజుర్వేద కాలమునాఁటి యార్యులు భూమి చక్కఁగా దున్ని వ్యవసాయము చేయుట బహుధములైన విత్తులు చల్లి పండించుట, మళ్ళకు నీరు పెట్టుటకై నూతులు త్రవ్వుట ఏతాములు ఘటీయంత్రములు నుపయోగించి నీరుతోడుట మొదలగు కృషికార్యములన్నియు నెఱుఁగుదురని వేఱువేఱుస్థలముల యందలి ప్రశంసావాక్యములవల్లనే కాక చతుర్థకాండ ద్వితీయ ప్రపాఠకములోని యైదాఱను వాకములందలి విశేషవర్ణనవలనఁ గూడ విస్పష్టమగును. అందు :—

"లాఙ్గలం పవీరవ సుశేవ సుమతి త్సరు ।
ఉదిత్కృషతి గా మవిం ప్రఫర్వ్యంచ పీవరీమ్ ।
ప్రస్థావ ద్రథ వాహనమ్ ।

ఈ నాఁగాలి పెద్దబెద్దలు పెల్లగిల్లునట్లు దున్నుఁగాక. ఇది యెట్టిది ?— వజ్రమువలె వాఁడియైనది. కర్షకుల కాయాసము గలుగకుండ నేలను భేదించునది. మెఱకపల్లములం దడ్డము లేక సమానముగా నడచునది. సేద్యగాండ్రు మంచి నాఁగలియని మెచ్చుకొనఁదగినది. దీనివలన భూమి ఫలించెనేని యజమానునికి మంచియావులు, ఆవుపెయ్యలు గొఱ్ఱెలు గుఱ్ఱములు లభించును. అనఁగాఁ గృషి ఫలించినచో గృహస్థు దానినిబట్టి గవాదిజీవధనము నార్జించునని భావము. మఱియు దున్ని సిద్ధముచేసినక్షేత్రమందు బహువిధములైన యోషధుల విత్తనములు చల్లుట పదునాలుగు మంత్రములచే వర్ణింపఁబడినది. ఇచ్చట, ఓషధిశబ్దమునకు క్షుత్పి పాసాదిశాంతికరమైన మొక్కలని యర్థము. అవి బహువిధములు :—[1]

పువ్వులు మాత్రమే పూచునవి. పూచి కాచునవి. పుష్పించకుండ, కాయలు కాచి ఫలించునవి పువ్వులు కాయలుకూడ లేకుండనుండునవి. తీఁగలుగానుండునవి.

1. తై. సం. 4-2-6.

నే నన్నము కోరుచు నీయోషధులను జేతఁ బట్టినంతనే వేఁటకానిఁ జూచి చెవులపిల్లులు భయపడి చెవులతోఁ గన్నులు మూసికొని భూవివరముల నణఁగి పోవునట్లే క్షుత్పిపాసాదిరోగము లణఁగి పోవుచున్నవి.

ఈ యోషధు లన్నియు, ప్రతిపక్షమందలి శత్రువులను జయించుట కనుకూల పక్షమందలి రాజులందఱు సమకూడినట్లే క్షేత్రములందు సమకూడి ఫలదానమునకు సిద్ధముగా నున్నవి.

ఈ యోషధులలో నొకటి యశ్వలాభమునకుఁ గారణమైనది. మఱియొకటి సోమయాగము చేయుటకై ధాన్యసమృద్ధికి మూలమైనది. ఇంకొకటి బలవృద్ధికరమైనది. వేఱొకటి ధాతుపుష్టికరమైనది.

సోముఁడు రాజుగాఁ గలయోషధులు భూమిని ప్రవేశించి యున్నవి. ఇత్యాదిగా నోషధివర్ణనము కలదు. ఓషధులలో, తిల మాష యవ వ్రీహి ప్రియంగు గోధూమాణువు లేదును గ్రామ్యములు. వేణు శ్యామాక నీవార జర్తిల గవీధుక మర్కటక గార్ముతము లేదు నారణ్యకములు. ఇవియేకాదు, ఇంకను గొన్ని ధాన్యజాతులు చతుర్థ కాండసప్తమ ప్రపాఠకమున వర్ణింపఁబడినవి. ఈ ప్రపాఠకమునకు 'చమక'మను ప్రసిద్ధికలదు. ఇందు—

విభు ప్రభు బహూ భూయః పూర్ణ పూర్ణత రాక్షితు లనఁబడు నేదు నొకదానికంటె నొకటి క్రమముగాఁ బండుట కెక్కువకాలము పట్టునట్టి పెద్ద ధాన్యజాతులు. ఇవియు నింతకుఁ బూర్వము చెప్పఁబడినవియుఁ గాక తక్కువ కాలములో ఫలించునట్టి మఱికొన్ని ధాన్యములు కలవు. అవి, కూయవలు (చిన్నయవలు) ముద్గములు ఖల్వములు మసురములు.[1] మొదలయినవి. దీనినిబట్టి చూడఁగాఁ బ్రాచీనార్యు లీసకలవిధము లయిన ధాన్యజాతుల నాహారమునకై పండించుకొనుచుండెడి వారని తెలియఁగలదు. కాని యీ ధాన్యజాతులలో ననేకముల నామములు క్రమముగా మాఱిపోయినవి. కొన్నిజాతులు నామమాత్రావశిష్టములైనవి. విభు ప్రభుప్రముఖములైన సప్తధాన్యజాతులెట్టివో! అవియే కొన్ని పెద్దవరులనుపేర వాడఁబడుచున్నవేమో!

మఱియుఁ బూర్వోక్తమైన 'చమక' ప్రపాఠకమందలి పదార్థాదుల పట్టికలను జూచినచో నాఁటి యార్యావర్తము కన్నులకుఁ గట్టినట్లుండును. ఆర్యులు

1. ముద్గములు = పెసలు, ఖల్వమసురములు పెసలవంటి పప్పుగింజలు.

వాదనిశ్లోహములేదు చూడని చెట్టులేదు. మెట్టనిమెట్టలేదు. ముట్టని ముత్యము లేదు. పట్టనిఫలములేదు. కాంచనికాననము లేదు. క్రుంకనినదిలేదు. కోరనికోరిక లేదు. వేడనివేల్పు లేడు. చేయనిజన్నము లేదు. ఎఱుఁగని మృగఖగములు లేవు. అనిపించెడి యీ ప్రశ్న మంతయు వారి ప్రపంచజ్ఞానమునకుఁ బుట్టినిల్లై యున్నది.

మఱియు గోవు, ఇడాదేవీరూపమయినదనెడి యర్థవాదమునుబట్టి[1] యానాఁటి వారికి గోవునందుగల భక్తిశ్రద్ధలును దానిరక్షణమందలి యాదరము నెట్టివో తేటపడఁగలవు.

''పూర్వకాలమందు మను వొకనాఁడు యజ్ఞమున కుపయోగించుద్రవ్యమే దయిన భూమిమీఁద దొరకునేమోయని వెదకుచుఁ బోవుచుండఁగా నొక చోట గోపాదాంకితమైన నేలమీఁద నెయ్యి కనవచ్చినది. దానిని దీసికొని యతఁడు దేవసభకు వెళ్లి, 'ఆవు నడచిన యడుగులజాడలో నున్న యీ ఘృతము లౌకిక భోజనమున కుపయోగపడునట్లుగా యాగమున కుపయోగించు నట్లెవరైనఁ జేయఁ గలరా!' యని ప్రశ్నించెను. అది విని మిత్రావరుణులు 'గోఘృతమునకే కాదు, గోవునకే యజ్ఞాంగభావము గల్పింప మేము సమర్థుల'మనుచు నిడారూపమైన ధేనువును భూమికిఁ దీసికొనివచ్చిరి. అపుడా ధేనువడుగు పెట్టినచోట నెల్ల నెయ్యి కాఱుచుండెను. అందుకే గోవునకు ఘృతపదియను పేరు వచ్చినది. ఈ విధ ముగా నిడాదేవికి యజ్ఞభూమియందు జన్మ సంపన్నమైనది." దీనినిబట్టి ప్రాచీనులు గోవునెట్టి పవిత్రమూర్తిఁగా భావించెడివారో తెలియఁగలదు. ఇఁక సకలధర్మము లకు నుత్తమ సాంఘికాచారములకు నా స్థానమైన యజుస్సంహితలో నిట్టి వర్ణనలు కలవనుటకంటె వైదిక వాఙ్మయమున వెలసిన వివిధ గృహ్యసూత్రములకును సామయాచారిక సూత్రములకును ధర్మశాస్త్రములకును నిది పునాదియని యొక్క మాట చెప్పినఁ జాలును. కాని యాసేతుహిమాచలముగల యెల్లగ్రామములలో నూరి కొకబ్రాహ్మణుఁడైన రుద్రాభిషేక మంత్రములు రానివాఁడుండఁడనుట యతి శయోక్తి కాదు గావునఁ చతుర్థకాండ పంచమ ప్రపాఠకమునుగూర్చి కొంచెమైన వ్రాయకుండ నీ ప్రకరణము సమాప్తము చేయఁజాలను.

రుద్రప్రశ్న ప్రశంసి

స్థితినిబట్టి యీ సంహితకు నాభిస్థానమైన యీ ప్రపాఠకము విషయమును బట్టి దీనికి శిరోభూషణముగానున్నది. యాజ్ఞికులు దీనిని యజ్ఞోపయోగి కాండము

1. తై. సం. 2-6-7.

గాను, ఉపాసకు లుపాసనాకాండముగాను, తత్త్వజిజ్ఞాసువులు జ్ఞానకాండముగాను గ్రహింపఁదగిన యిందలి విషయ మమూల్యము. భక్తిమూలము. ముక్తికారణము. వేయేల? మహర్షులెల్లరు నే మహామంత్రము జపించి తరించిరో యాదివ్యమైన పంచాక్షరీమంత్రమున కిదిపుట్టిల్లు. ఈ ప్రపాఠకము ప్రశస్తికంతకు నామంత్రమే. నిదానమనుట నిర్వివాదము.

ఈ ప్రశ్నమంతయు నమశ్శబ్ద భూయిష్ఠమగుటచే దీనికి 'నమక'మనెడి పేరు దేశమునఁ బ్రసిద్ధికెక్కినది కాని రుద్రాధ్యాయమనునది దీనివైదిక సంజ్ఞ. ఇది కర్మకాండమునఁ బఠింపఁబడుటచే దీనికిఁ గర్మాంగత్వము సమ్మతమైనను సర్వోపనిషత్తులు నిది జ్ఞానకారణమనియే ప్రశంసించుచున్నవి. మునులు దీనికి శతరుద్రీయమను నామకరణమొనర్చిరి. శతరుద్రీయ జపముచే నమృతత్వము సిద్ధించునని జాబాలమహర్షి తలంచియుండెను. స్మృత్యాగమ పురాణములయందు రుద్రాధ్యాయ ప్రశంస యధికముగాఁ గనవచ్చుచున్నది. అది రుద్రకల్పమందు సవిస్తరముగాఁ జెప్పఁబడుచున్నదని సాయణాచార్యులు పల్కియున్నారు. ఇంత కంటె దీనిమహత్త్వమిట్టిదని తెలుపనక్కఱలేదు.

ఈ యధ్యాయమందు పదకొండనువాకములు కలవు. ఇందు వర్ణింపఁబడిన రుద్రుని ఘోరరూప శరీరము శివరూపశరీరము శరీరావయవములు ధనుశ్శరాది సాధనములు దుష్టశిక్షణము శిష్టరక్షణము మొదలయినవి సగుణోపాసకులగు శైవు లయభీష్టసిద్ధి కాలవాలమై యుండెను. ఇందలి శివరూప వర్ణనములే తరువాతఁ బురాణములలోని శివకథలుగాను శైవపురాణములుగాను వెలసినవనుట సత్యము. మఱియునిందు వర్ణింపఁబడినశివుని విశ్వరూపత్వము విశ్వవ్యాపకత్వము విశ్వకారణత్వము మొదలయిన వేకేశ్వరత్వ విజ్ఞానమును, గ్రమముగా జీవేశ్వరైక్యజ్ఞానమును గలిగించునవియై యద్వైతభావమున కాలవాలమగుచున్నవి. ఇదే యిందలి విశేషము.

"నమశ్శంభవేచ మయోభవేచ నమశ్శంకరాయచ ।
మయస్కరాయచ నమశ్శివాయచ శివతరాయచ ॥

వాజసనేయ సంహిత

శుక్లయజుస్సంహిత యనఁబడు దీనినిగూర్చి యింతకు మున్ను కొంతచదివి యున్నాము. ఇఁక విశేష విషయములిందు తెలిసికొందము.

ఈ సంహిత నలువది యధ్యాయములుగా విభజింపఁబడినది. అందు మొదటి యిరువదియైదధ్యాయములలోను సామాన్యముగా యజ్ఞవిధులు చెప్పఁబడినవి. అందును, మొదటిదానియందును ద్వితీయాధ్యాయములోని యిరువది యెనిమిది కండికలయందును దర్శపూర్ణమాస మంత్రములు కలవు. రెండవదాని కడపటి కండిక లాటింటియందును బితృయజ్ఞ మంత్రములున్నవి. తృతీయము, నందగ్న్యాధానాగ్ని హోత్రాగ్న్యుపస్థాన చాతుర్మాస్య మంత్రములున్నవి నాల్గవది మొదలుగా నెనిమిదవ యధ్యాయము కడపటివఱకు నగ్నిష్టోమ తత్ప్రసంగిక తృతీయ సవనాదిత్యగ్రహాది మంత్రములు కలవు. నవమములో వాజపేయ రాజసూయ కర్మలించుక చెప్పఁబడినవి. దశమాధ్యాయమునందు రాజసూయ శేషమును, అభిషేక జలాదానాదులును సౌత్రామణియుఁ గలవు. ఏకాదశ ద్వాదశములందు, అగ్నిచయన - ఉఖాసంభరణ - ఉఖాధారణ - గార్హపత్యచయన - క్షేత్రకర్షణ - ఓషధివాపాది మంత్రములున్నవి. పదమూఁడవదానిలోఁ బ్రథమ చితిమంత్రములును, పదునాల్గవదానిలో ద్వితీయ తృతీయ చతుర్థ చితిమంత్రములును గలవు. పదియేనవదానిలోఁ బంచమ చితిమంత్రములును, పదునాఱవదానిలో శతరుద్రీయహోమ మంత్రములును, పదియేడవదానిలో చిత్యపరిషేకాది మంత్రములును, పదునెనిమిదవ దానిలో వసుధారామంత్రములును గలవు. పందొమ్మిది యిరువది యిరువదియొకటి యధ్యాయములందు సౌత్రామణీయాగ మంత్రములును, తరువాతి నాలుగధ్యాయములందు నశ్వమేధ మంత్రములునున్నవి. ఇంకఁ బదియే నధ్యాయములున్నవి. వీనికి ఖిలములనెడి వ్యవహారము కలదు. వీనిలోని విషయములు సాధారణముగా వెనుకటి యధ్యాయములలోని విషయములకు సంబంధించియే యుండును. ఇందు :—

౨౬-వ, యధ్యాయమందనుక్త మంత్రకథనము, ౨౭ లోఁ బంచచితి, ౨౮ లో సౌత్రామణి, ౨౯ లో నశ్వమేధము. ౩౦-౩౧ లోఁ బురుషమేధవిధి, ౩౨-౩౩-౩౪ లో సర్వమేధవిధి, ౩౫ లోఁ బితృమేధము, చెప్పబడినవి. తక్కినవి శుక్రియము లనఁబడును. అందు ౩౬ లో శాంతిపాఠము, ౩౭ లో నగ్న్యాది రౌహిణాంతవిషయము, ౩౮ లో మహావీర నిరూపణము, ౩౯ లో ధర్మాది నిష్కృతి నిరూపణమును గలవు. నలువదియవ యధ్యాయము పరమాత్మ నిరూపణపరము. ఉపనిషద్రూపమైనయిది జ్ఞానకాండ మనఁబడుచున్నది.

ఇట్లు నలువది యధ్యాయములుగాఁ గనవచ్చెడి యీ సంహితలో మొదటి పదునెనిమిది యధ్యాయములలోని గ్రంథమే ప్రాచీన మనియుఁ దరువాతి యధ్యా

యములలోనిది యర్వాచీన మనియుఁ గొందఱి యభిప్రాయము.[1] మొదటి పదునెనిమిదింటిలో నున్న ఋక్కులు యజుస్సులు గూడ మంత్ర శబ్దవాచ్యములగుచుఁ దైత్తిరీయ సంహితనుండి యుద్ధరింపఁబడినట్లు కనవచ్చుచున్నవి. ౨౨ - ౨౩ - ౨౪ - ౨౫ - అధ్యాయములలో మంత్రములు సరిగాఁ దైత్తిరీయము నుండి యుద్ధరింపఁబడినవిగానే యున్నవి. మఱియు మొత్తముమీఁదఁ బరిశీలింపఁగా నీ సంహితలోని కడపటి యిరువది రెండధ్యాయములలోను వర్ణింపఁబడిన విషయము లన్నియుఁ దైత్తిరీయ బ్రాహ్మణారణ్యకములందు గనవచ్చుచున్నవి. గాని వాజసనేయ బ్రాహ్మణారణ్యకములందు గనరావు. అదిగాక, వాజసనేయ బ్రాహ్మణము మొదటి తొమ్మిది కాండములును సంహితలోని మొదటి పదునెనిమిది యధ్యాయములకు వ్యాఖ్యానముగాఁ గనవచ్చును. తరువాతి పదియేడధ్యాయములలోని మంత్రములు కొన్ని బ్రాహ్మణమున నందందు గ్రహింపఁబడినవి. కాని కడపటి యైదధ్యాయములలోని మంత్రముల ప్రసక్తి బ్రాహ్మణమున నెందును గనరాదు. దీనినిబట్టి చూడఁగా నే యధ్యాయములయందలి మంత్రములకు బ్రాహ్మణము ప్రతిపదార్థరూపమున నున్నదో, ఆ పదునెనిమిది యధ్యాయములే ప్రాచీనము లని తెలియవచ్చుచున్నది. ఇందుకుఁ గాత్యాయనుని శుక్ల యజుర్వేదాను క్రమణి, సంహితలోని ౨౬-౩౫ వఱకుఁ గల పది యధ్యాయములును ఖిలములని చెప్పుట గూడఁ బ్రమాణ మగుచున్నది. ఇది యిట్లుండ—

ఇంతకుమున్ను చూపినట్లుగా ౨౬——౨౯ వఱకుఁ గల నాలుగధ్యాయములలోని విషయములును వెనుకటి యధ్యాయములందు విహితమైన యజ్ఞక్రియయందు సమన్వయించుట మాత్రముననే సార్థకము కాఁదగి యుండుటకూడ వీని యర్వాచీతను జాటుచున్నది. ౩౦——౩౯ వఱకుఁ గల యధ్యాయములలో వర్ణింపఁబడిన నరమేధపితృయజ్ఞ విశ్వజిద్యాగాదులైన నూతనక్రియ లీయధ్యాయముల యర్వాచీనత్వమునకుఁ దోడ్పడుచున్న వనుట నిర్వివాదము. ఇంకఁ గడపటి యధ్యాయ మందుమా, యాగక్రియతో నెట్టి సంబంధమును లేనియది సంహిత చివర నెట్లు చేరినదో కాని యది తరువాత వెలువడిన యుపనిషత్తులకు సంబంధించిన దగుటచేఁ దప్పక యర్వాచీనమే యగుచున్నది.

పై విభాగమునుబట్టి చూచినచో నీ సంహిత యందలి మొదటి ౧౮ అధ్యాయములును దొలుతఁ దైత్తిరీయ సంహితనుండి వేఱుపడిన మంత్రార్థ వాద రూపమయిన వాజసనేయ సంహిత యనియుఁ దరువాతి యధ్యాయములు ౨౨ ను, తైత్తిరీయ బ్రాహ్మణారణ్యకములు వెలసిన పిదప నావిర్భవించి యాసంహితకుఁ

1. చూ. మేగ్డో. San. Lit. P. 177.

గాల క్రమమునఁ జేరిన వనియు గోచరించుచున్నది. ఏతాదృశమై కాణ్వమాధ్యం దినభేదమునఁ బ్రధానముగా రెండు శాఖలైన యీ సంహితలోని ఋఙ్మంత్రములు ౧౯౭౫ అనియు, యజుర్మంత్రములు ౧౧౭౫ అనియుఁ దెలియుచున్నది.[1]

అథర్వ సంహిత

దీని ప్రామాణ్యాదికమును గూర్చి చతుర్థాధ్యాయమునఁ గొంత చదివి యున్నాము. తైత్తిరీయారణ్యకాదులఁ బ్రశంసింపఁబడి యజ్ఞోపయోగియై బ్రహ్మ వేద మనుఖ్యాతి గాంచినయిది తక్కిన సంహితలకంటె నర్వాచీన మైనను గొందఱు పాశ్చాత్యులు తలఁచినట్లత్యంత మర్వాచీనము కాదు. దీనికిఁ దొమ్మిది శాఖలున్న వనియు, పదియేనుశాఖలు గల వనియు రెండు పాఠములున్నవి.[2] ప్రవర్తకులను బట్టి వచ్చిన యాశాఖాభేదములను గూర్చి ముందు కొంత తెలియుదము.

అథర్వణ శాఖలు

"అథర్వ సంహితను వ్యాపింపఁజేయుమని వేదవ్యాసుఁడు సుమంతుని కిచ్చినట్లు విష్ణుభాగవతాది పురాణములు చెప్పుచున్నవి. ఆ సుమంతుఁడు దానిని రెండు భాగములుచేసి కబంధుని కిచ్చెను, అతఁడందొక భాగము పథ్యునికిని మఱియొక భాగము వేదస్పర్శునికి నిచ్చెను. వేదస్పర్శుఁడు దానిని నాలుగు భాగములు చేసి మోదుఁడు పిప్పలాదుఁడు శౌక్ల్యాయని తపనుఁడు, అను నలుగురి కిచ్చెను. పథ్యుఁడు తనభాగమును మూఁడుగా విభజించి, జాజలి కుముదాది శౌనకుఁడునను ముగ్గురికిచ్చెను. శౌనకుఁడు తనభాగమును రెండుచేసి బభ్రువు సైంధవుఁడుననువారి కొసంగెను. సైంధవుఁడు ముంజకేశుని కిచ్చెను. అది మరల రెండుశాఖలైనది." అని వాయుపురాణము చెప్పుచున్నది.[3] ముంజకేశుని వల్ల గ్రహించినయిద్దఱిపేళ్లనది పేర్కొనకపోయినను, ఈ సందర్భమందే యొకనోట "ఏత దంగిరసా ప్రోక్త'మ్మనియు, దాని క్రిందనే 'తథా చరణవిద్యానా'మనియుఁ జెప్పుటనుబట్టి, అంగిరసుఁడు చరణవిద్యుఁడునను వారిరువురును శాఖా ప్రవర్తకులని తెలియనయ్యెడి. ఋగ్వేద యజుర్వేదముల ప్రథమ ప్రవక్తలగు పైల

1. చరణవ్యూహ పరిశిష్టము.
2 నవాధ్యాథర్వణోఽన్యేతు ప్రాహుః పంచదశాథ్వగమ్ సర్వా-వృత్తి. అథర్వవేదస్య నవభేదా భవంతి. చరణవ్యూ.
3. వాయుపు-పూర్వ. ౬1. అధ్యా.

వైశంపాయనులు శాఖా ప్రవర్తకులలో గణనకు రానట్లే పైవారిలో సుమంతుఁడు గణనకు రామింజేసి కబంధాదులు పదియేనుమందియు శాఖా ప్రవర్తకులైనట్లు తెలియవచ్చును. ఈ పద్ధతినిబట్టి పదియేనుశాఖలనెడి పాఠాంతరము గూడ సార్థక మగుచున్నది గాని చరణవ్యూహము తొమ్మండుగురు ప్రవర్తకులనే పేర్కొనుచున్నది. ఇది యన్నివేదముల ప్రవర్తకుల పేళ్లను బురాణములనుండియే గ్రహించినది గాని దీనివ్రాఁతప్రతులు నచ్చుప్రతులుఁ గూడ లేఖనముద్రణాది దోషదూషితము లగుటంజేసి యిందు పైవానిలోఁ గొన్ని నామము లపపాఠములుగానున్నవి. మఱికొన్ని క్రొత్తవిగా నున్నవి. చరణవ్యూహములోని కొన్నితప్పులను సవరించుచు దానివ్యాఖ్యానము మఱికొన్ని తప్పులు చూపుచున్నది. వాని నెల్ల దిద్ది వాయుపురాణ పాఠముతో సరిచూడఁగా, మోద - వేదస్పర్శ - పిప్పలాద - తపన - జాజలి - కుముదాది - శౌనక - ఆంగిర - శ్చరణవిద్యులు తొమ్మండుగురు శాఖాప్రవర్తకులనెడి పాఠము సార్థకమగుచున్నది. వీనిలో శౌనక పైప్పలాదశాఖలు రెండుమాత్రమే ముద్రితా ముద్రిత సంహితాపుస్తక రూపమునఁ గనఁబడుచున్నవి. ఈ రెండును దొలుత నొకమూలమే యాధారముగా విడిపోయిన వైనను, తరువాతఁ బ్రవర్తకపాఠ భేదమునుబట్టి గ్రంథము ముందువెనుక లగుటవలనను నూతన గ్రంథము చేరుటవలనను బరస్పరము విభిన్నముగాఁ గనవచ్చుచున్నవి. ఈ రెంటిలోను దొల్లి దేశము నలుఁగడల వ్యాపించి సాయణభాష్యమునకు గుఱియై ఖ్యాతికెక్కినది శౌనకశాఖయనుట యసంశయము. కావున దీనినిబట్టి యథర్వసంహిత యందలి విభాగాదులను ముందుగాఁ దెలిసికొందము.

శౌనకసంహిత ౨౦ కాండములు. అందు ప్రతికాండము కొన్ని ప్రపాఠకములుగాను, ప్రతిప్రపాఠకము కొన్ని యనువాకములుగాను. ప్రత్యనువాకము కొన్ని సూక్తములుగాను విభజింపఁబడినవి. ప్రతిసూక్తమందు ననియతసంఖ్య గల ఋక్కులు లేక, మంత్రములుండును. ఇట్లున్న యీ విభాగముల స్వరూప మీ క్రిందిపట్టిక తెలుపును.

శౌనకీయాథర్వ సంహిత

కాం	ప్రపా	అ	సూక్త	ఋక్కులు
1	1-2	6	35	153
2	3-4	6	36	207
3	5-6	6	31	230
4	7-8-9	8	40	324
5	10-11-12	6	31	
	13-14-15	13	142	
7	16-17	10	118	286
8	18-19	5	10	259
9	20-21	5	10	302
10	22-23	5	10	350
11	24-25	5	10	313
12	26-27	5	5	304
13	28	4	4	18
14	29	2	2	13
	30	2	18	220
16	31	2	9	93
17	32	1	1	30
	33-34	4	4	28
19	...	7	72	456
20	...	9	143	967
	34	111	731	5

పై మొత్తములు సేవకలాలపండితుఁడు ప్రకటించిన ప్రతినిబట్టి యుదాహరింపఁబడినవి [1] రాధ్విట్నీపండితులు ప్రకటించిన బర్లిన్ ప్రతియు.[2] శంకర పాండురంగ పండితుఁడు సాయణభాష్యముతోఁ బ్రకటించిన ప్రతియు.[3] బొంబాయి

1. బొంబాయి. క్రీ. 1884 సం.
2. బర్లిన్ 1856 సం.
3. బొంబాయి 1895. ముద్రణము.

తంజావూరుపుస్తక భాండాగారములలోని వ్రాఁతప్రతులును బై మొత్తములలో ముఖ్యముగా ఋక్కుల మొత్తమునెడ నించించుక వేఱుపడుచున్నవి గాని యా భేదము చాలవఱకుఁ బర్యాయసూక్తము లనఁబడు నర్థసూక్తములయందలి ఋక్కులను గణించుటలో వచ్చినది గాని గ్రంథభేదమునుబట్టి వచ్చినది కాదనుట నిజము. హిందూదేశమందలి ముద్రితాముద్రితప్రతులన్నియుఁ బైని జూపినఋక్కుల మొత్తమునే యీషద్వైషమ్యముగా జూపుచున్నవి గాని బర్లిన్ ప్రతిమాత్రము మిక్కిలి భేదమును ౨౦ వ కాండమునందు చూపుచున్నది. ఆ ప్రతిలో ౨౦ వ, కాండమున ౧౫౦ ఋక్కులు మాత్రమేకలవు. దీనినిబట్టి యీ కాండ మా ప్రతికిఁ బూర్తిగాలభింపలేదని స్పష్టమగుచున్నది. ౧౯ కాండములవఱకును సకలవిధముల బర్లిన్ ప్రతి సేవకలాల ప్రతిని బోలియున్నదని యీ రెండు ప్రతులలోని మొత్తములను సరిగాఁ బరిశీలించుటవలనఁ దెలియవచ్చినది. విట్నీపండితుని యాంగ్లీకృతాథర్వవేదమందలి పీఠికయు [1] బర్లిన్‌ప్రతిలోని ఋక్కులను శంకరపాండురంగ ప్రతిలోని ఋక్కులను, అనుక్రమణికా వచనములనుబట్టి పోల్చి ౧౯ కాండముల వఱకుఁ గల యీషద్భేదము పర్యాయసూక్తగణన భేదమున వచ్చినదనియే తేల్చినది, ౨౦ వ, కాండమును విట్నీ యాంగ్లీకరింపలేదు గాని యందలి ఋక్కులు ౧౫౦ అనియుఁ జెప్పినది. అందుచే ఋక్కులమొత్తములు మూఁడువిధములుగాఁ గనవచ్చుచున్నది

సేవకలాప్రతి	పాండురంగప్రతి	బర్లిన్‌ప్రతి
౫౯౩౪	౬౦౧౫	౫౦౩౮

ఇందు మొదటిదానికిని రెండవదానికిని వచ్చిన ౮౧ ఋక్కులభేదము పర్యయసూక్తమంత్ర గణనభేదమున వచ్చినది కొంత; ౨౦-వ కాండమందలి ఋక్కుల హెచ్చుతగ్గులనుబట్టి వచ్చినది కొంత. అందు ౫౮ ఋక్కులగణన భేదము తీసివేసినచో ౨౩ ఋక్కులు మొదటిప్రతి ౨౦-వ, కాండమున నెక్కువగా నుండును.[2] ఇంక మొదటిదానికిని మూఁడవదానికిని ౮౯౬ ఋక్కులభేదమున్నది. ఇది చాలావఱకు ౨౦-వ, కాండమునుబట్టి వచ్చినదే. కాని, యిట్లున్న మూఁడుమొత్తములను గూడఁ గొంచె మెచ్చుతక్కువగా సమర్థించు ప్రమాణవచనములు గనఁబడుచున్నవి. వాయుపురాణములో :—

1. H. O. S. Lanman. Vol. 7.
2. శం. పా. ప్రతి ౨౦-వ, కాండములోని ఋక్కు ౯౪౧.

"ఋచా మథర్వణాం పంచ సహస్రాణి వినిశ్చయః,
సహస్ర మన్య ద్విజ్ఞేయ మృషిభి ర్వింశతిం వినా.
ఏత దంగిరసా ప్రోక్తమ్.—
తథా చరణవిద్యానాం ప్రమాణం సంహితాం శృణు,
షట్సహస్ర మృచా ముక్త మృచ షడ్వింశతిః పునః."[1]

అని రెండుశ్లోకములున్నవి. ఇందు మొదటిదానినిబట్టి యంగిరశ్శాఖా ప్రమాణము ౫౯౮౦ అనియు, రెండవదానినిబట్టి చరణవిద్యశాఖా ప్రమాణము ౬౦౨౬ అనియుఁ దెలియుచున్నది. ఈ రెండు మొత్తములును గొంచె మించుమించుగా మన మొదటి రెండు ప్రతుల మొత్తములకును సరిపడుచున్నవి. మఱియు మొదటిశ్లోకములోని "అయిదువేలు నిశ్చయము. ఇరువది తక్కువగా వేయి ఋక్కులు వేఱని తెలియఁదగును" అనునర్థ మిచ్చుపదములను బట్టి కడపటి కాండములోని గ్రంథము ప్రాచీనము కాదనియు, బర్లిన్ ముద్రితప్రతి కది పూర్తిగా లభింపలేదనియు, అందుచేఁ బ్రాచీన ఋక్సంఖ్యనుబట్టి మన మూఁడవ మొత్తము గూడ సరిపడుచున్న దనియుఁ దెలియుచున్నది. కాని, యనేకులు తలఁచినట్లుగా నిరువదవకాండ మర్వాచీనమే యైనను, అందలి మంత్ర సంఖ్య బర్లిన్ ప్రతిలోఁ దప్ప మనదేశమందలి వ్రాతప్రతులలో నెల్లఁ దొమ్మిదివందలకుఁ బైగానే కనఁబడుచున్నది.[2] ఇది యిట్లుండ, చరణవ్యూహ మథర్వమంత్ర ప్రమాణము ౧౨ వేలని చెప్పుచున్నది. ఈ ప్రమాణ మెపుడైన నున్నదో లేక యిది శౌనకపైప్పలాద సంహితలను గలిపి చెప్పినదో యూహించుట కేమియు నవకాశములేకున్నది. కావున నిఁక సంహితాస్వరూప స్వభావములను గూర్చి యించుక విచారింతము.

ఈ సంహిత స్వరూప స్వభావములనుబట్టి నాలుగుభాగము లగుచున్నది. అందు ౧ — ౭ వఱకు నేడు కాండములు ప్రథమభాగము. ౮ — ౧౨ వఱకు నైదు కాండములు ద్వితీయభాగము. ౧౩ — ౧౮ వఱకు నాఱు కాండములు తృతీయ భాగము. ౧౯, ౨౦, కాండములు రెండును చతుర్థభాగము. ఇందు మొదటి భాగము మొదటికాండములో సూక్తమునకు నాలుగుచొప్పున, రెండవదానిలో నన్నెైదు చొప్పున, మూఁడవదానిలో నాఱుచొప్పున, నాల్గవదానిలో నేడుచొప్పున,

1. వా. పు. పూ. 61 అధ్యా.
2. బొంబాయి దొరతనమువారి ప్రాచ్యపుస్తక భాండాగారములోని నంబర్లు 862-877. తంజావూరు మహారాజ పుస్తకాలయము. నం-594.

ఆయిదవదానిలో నెనిమిది మొదలుగాఁ బదునెనిమిదివఱకును, ఆఱవదానిలో మూఁడు చొప్పున, ఏడవదానిలోఁ జాలవఱ కొకటి చొప్పుననను, రెండు మొదలుగాఁ దొమ్మిది వఱకును, మంత్రములు గలవు. సూక్తముల ననుసరించిన ఋక్కులనియమమే యీ భాగమందలి యొకవిశేషము. రెండవభాగములో నన్నికాండము లందును, అయిదేసి చొప్పున ననువాకములు సమానముగా నుండుట యొకవిశేషము. సూక్తసంఖ్య కూడ నీ భాగమున గడపటికాండమందు తప్పఁ దక్కిన యన్నిటియందు నొక్క రీతినున్నది. మూఁడవభాగమందలి కాండములు వివిధరూప స్వభావములు కలవి యైనను, అవి యొక్కొక్కవిషయము ననుసరించి యుండుట విశేషము. ఇఁక నాల్గవ భాగములో మొదటిదగు పందొమ్మిదవకాండ మే విషయమునకును ప్రత్యేక ముగా సంబంధింపక పూర్వకాండములకుఁ బరిశిష్టముగా నున్నది. మఱియు నందలి మంత్రములు నిర్దుష్టములు గాక యర్వాచీనతను జాటుచున్నవి. ఇరువది యవకాండ మథర్వమంత్రస్పర్శయే లేకుండ ముప్పాతిక మువ్వీసము సోమయాగ మునకు సంబంధించిన ఋగ్వేదమందలి ఋక్కులతో నిండియున్నది. ఇది యీ భాగమందలి ముఖ్యవిశేషము. అందుచేతనేయిది యర్వాచీనభాగ మనఁబడుచున్నది. స్వరూపమునుబట్టి ౧౬, ౧౭, కాండములు మిక్కిలి చిన్నవైనను, ఆథర్వణ స్వభావము గలిగియున్నవి. అందుచే నథర్వసంహిత యనుసంజ్ఞ మొదటి పదు నెనిమిది కాండములకే చెల్లునని పెక్కండ్రు విమర్శకుల యభిప్రాయము.

సంహితా విషయ విచారము

విషయమునుబట్టి చూచినచో మొదటిపదమూఁడు కాండములలోని మంత్ర ములను బూర్వోత్తరసంబంధము లేక యవ్యవస్థముగాఁ గనిపించునుగాని తక్కిన యైదింటిలోని విషయ మట్లుగాదు. ౧౪-వ, కాండమంతయు వివాహమంత్ర భూయిష్ఠము. ౧౫-వ, కాండము వ్రాత్య మనఁబడును. ఇది యంతయు వ్రాత్య నామకుఁడైన పరమాత్మస్తుతికి వినియుక్తమైనది. ౧౬, ౧౭ కాండములు వశీకరణ మంత్రపరములు. ౧౮-వ, కాండ మంత్యసంస్కారపరము. ఇట్లు తొలుత ౧౮, కాండములుగానున్న యీ సంహితకు వివిధములైన క్షుద్రసూక్తములతో ౧౯-వ, కాండము పరిశిష్టముగాఁ జేరినది. కాని యిదియు యజ్ఞోపయోగి కాదు. అందుచే నీ సంహిత యిట్లు యాగార్థము కాకుండుట కనిపెట్టి తరువాత నథర్వసంహితాభి మానులు ఋగ్వేదమునుండి యెట్టిమార్పు లేకుండఁగా సోమయాగోపయుక్తములైన కొన్ని సూక్తములను దీసికొఁ జేర్చిరి. అదియే ౨౦-వ కాండము. ఈ కాండము చేరినపిదప నిది బ్రహ్మవేదమను ఖ్యాతివహించి యజ్ఞోపయోగియై ప్రామాణ్యమును

జెంది వేదములలోఁ జేరినది. అదియే వేదములు నాలుగనుటకు మొదలు. చతుర్థాధ్యాయములోఁ జెప్పినట్లుగాఁ దైత్తిరీ యైతరేయబ్రాహ్మణముల నాఁటికిఁ గూడ యజ్ఞోపయోగికాని యీ వేదము తరువాత నట్టిస్థితికి వచ్చినదని దీనికి సంబంధించిన గోపథ బ్రాహ్మణములోని యీ క్రింది వాక్యములవల్లఁ దెలియనగును.

"అథహ ప్రజాపతిః సోమేన యక్ష్యమాణో వేదా నువాచ ॥
కం వో హోతారం వృణీయాం క మధ్వర్యుం, క ముద్గాతారం,
కం బ్రహ్మాణ మితి, త ఊచు రృత్విగ్విద మేవ హోతారం వృణీష్వ
యజుర్విద మధ్వర్యుం, సామవిద ముద్గాతార,
మథర్వాఙ్గిరోవిదం బ్రహ్మాణమ్.''

దీనినిబట్టి యజ్ఞమునందు ఋగ్యజుస్సామవేదజ్ఞులు క్రమముగా హోత - అధ్వర్యుఁడు - ఉద్గాత - యగునట్లు, అథర్వవేదజ్ఞుఁడు బ్రహ్మయగునని తెలియుచున్నది ఇందుచేతనే యిది బ్రహ్మవేద మనఁబడుచు వచ్చినది. పురాణముల కాలమున దీనిమహిమ మఱియు హెచ్చినది. కావున దీనిఖ్యాతి కిరుపదియవ కాండమే మూలమనియు నది యర్వాచీనులు దీనికిఁ జేర్చినదనియు భావింపనగును.

ద్వితీయాధ్యాయమున వేదకాల నిర్ణయసందర్భమునందు కృత్తికానక్షత్రము ప్రథమనక్షత్రముగా గణించిన తైత్తిరీయ బ్రాహ్మణాదులలోని కొన్నివాక్యములు చదివియున్నాము. అట్టివాక్యమే యీ సంహితలో ''సుహవం మే కృత్తికా రోహిణీ చాస్తు భద్రం మృగశిరః శమార్ద్రా, పునర్వసూ సూనృతా." ఇత్యాది గాఁగనఁబడుచున్నది.[1] దీనినిబట్టి కృత్తిక ప్రథమనక్షత్రముగా నున్నకాలమున నీ సంహిత పుట్టియుండునని కొందఱు తలంచిరిగాని యది సరికాదు. అనేక హేతువులనుబట్టి యీ సంహిత యర్వాచీన మనియు, అందును గడపటికాండములు మిక్కిలి యర్వాచీనములనియు విదిత మగుచుండఁగాఁ దైత్తిరీయ బ్రాహ్మణాదులలోని వాక్యముల ననుకరించిన పందొమ్మిదవ కాండములోని యీ వాక్యమునుబట్టి యీ సంహిత తైత్తిరీయ బ్రాహ్మణాదులకు సమకాలికమనుట ప్రమాణసిద్ధము కాఁజాలదనుటకంటె నీ విషయము నీ సందర్భమున మరలఁ జర్చించుట యావశ్యకము కాదు. కావున నిరువదియవకాండము మిక్కిలి యర్వాచీనమనుటకుఁ గొన్ని కారణములు తెలిసికొందము.

1. అథ. సం. 19-1-7-2.

౧. తక్కిన కాండములలో నక్కడక్కడ నొకటిరెండు యాగోపయోగి సూక్తములున్నను, మొత్తము మీఁదనవి యాగసంబంధము కలవి కావు. ఇది మాత్రమే సోమయాగమునకు సంబంధించినది. ఇది దీని యపూర్వలక్షణము.

౨. తక్కిన కాండములలో నందందు ఋగ్వేదములోని ఋక్కులున్నవి గాని యవి యించించుక మాఱురూపమునఁ గనవచ్చును. ఇందలి సూక్తములు ఋగ్వేదములలో నున్నట్లే యేమియు మార్పులేక యట్లేయున్నవి. ఇది దీనియభినవలక్షణము.

౩. మొదటి ౧౮ కాండములలోను, ప్రపాఠక విభాగము కలదు. ౧౯-వ కాండమందును, ఇందును నట్టివిభాగము కనరాదు.

౪. అథర్వ ప్రాతిశాఖ్యము ౧౯-వ, కాండమును దీనినిగూడఁ బేర్కొనలేదు.

౫. ఇందు స్వతంత్రములుగాఁ గనవచ్చుదాన స్తుతిపరములయిన కుంతాప సూక్తములకు పదపాఠముకూడఁ గనరాదు.

ఇంక నిట్టిహేతువులు కలవు గాని, దీని యర్వాచీనతను స్థాపించుటకివి చాలును. ఈ దృశలక్షణలక్షితమైన శౌనకసంహితలోని విశేషములు పరిశీలించుటకుముందు దీని సోదరియగు పైప్పలాద సంహిత స్వరూపము తెలిసికొనుట యావశ్యకము.

పైప్పలాద సంహితా చరిత్ర

యజుస్సంహిత తైత్తిరీయవాజసనేయ భేదమున విడివడినట్లే యథర్వసంహిత తొలుత శౌనకపైప్పలాద భేదమున విడిపోయెనని చెప్పవచ్చును. ఈ రెంటిలో నేది ముందో చెప్పుటకుఁ దగిన సదాధారము లేవియు నిపుడు లభింపకున్నవి కావి శౌనక శాఖకున్న వ్యాప్తిలో సహస్రాంశమైనను బైప్పలాదశాఖకు లేదని మాత్రము చెప్పక తప్పదు. ఎచ్చటనో యొకమాఱుమూల నొక్క వ్రాఁతప్రతి నాశ్రయించి యణఁగిపోయి దైవవశమున నెట్లో యిది సజీవమై యుండుటచే నిట్లు చెప్పవలసి వచ్చినది గాని యింతమాత్రమునఁ దొల్లి వైదిక లోకము దీని నెఱుఁగదని తలంపరాదు. బ్రహ్మయజ్ఞపాఠమే మంత్రము నథర్వవేద ప్రథమ మంత్రముగాఁ దెలుపుచుండెనో, "శం నో దేవీ రభిష్టయ ఆపోభవన్తు పీతయే శంయో రభిస్రవన్తునః''

అనెడి యా మంత్రము దీని మొదట మాత్రమే యున్నది.[1] అథర్వవేద సంబంధి యగు గోపథ బ్రాహ్మణముగూడఁ బైమంత్రమే మొదలు చేసికొని యథర్వ వేదము పఠింతురని చెప్పుచున్నది.[2] హలాయుధుని బ్రాహ్మణ సర్వస్వమును, అథర్వవేద పరిశిష్టమునుగూడ నీ మంత్రమే యథర్వవేద ప్రథమ మంత్రమని చెప్పుచున్నవి. మఱియు శౌనక సంహితను బ్రకటించిన రాథవిట్నీ పండితులును, శంకర పాండురంగ పండితుఁడును సంపాదించిన వ్రాఁతప్రతులలో నొకటి రెండింటియందీ మంత్రము మొదట నున్నదని వారు వ్రాసియున్నారు.[3] కాని వారు పెక్కు ప్రతులు శోధించి శౌనక సంహిత మొదటి మంత్రము "యేత్రిషప్తాః పరియన్తి విశ్వా రూపాణి బిభ్రతః వాచస్పతిర్బలా తేషాం తన్వో అద్యధాతుమే" అనునది ప్రథమ మంత్రమని పరిష్కరించుటచేతను సాయణాచార్యులు దీనినే ప్రథమముగాఁ గ్రహించి భాష్యము వ్రాయుటచేతను. శౌనక సంహిత ''శంనోదేవి" రిత్యాది మంత్రముతో నారంభము కాలేదనుట నిశ్చయము. ఈ మంత్ర మీ సంహితలో మొదటికాండ మాఱవసూక్తము మొదటఁ బెక్కువ్రాఁత ప్రతులందు గనవచ్చుటనుబట్టియు, సాయణాచార్యులీ మంత్రమును మొదటిదానినిగా గ్రహించి భాష్యము వ్రాయకపోవుటను బట్టియుఁ బరిష్కర్తలును బ్రకాశకులునుగూడ శౌనక సంహితాద్య మంత్రము శంనో దేవీరిత్యాదికము కాదనియు, యేత్రిషప్తా ఇత్యాదికమే యనియు నిశ్చయించిరనుట స్పష్టము.

ఇట్లు శౌనక సంహితాద్య మంత్రము 'శంనోదేవీ' రిత్యాదికము కాదని ధ్రువపడుటచేతను, దీని యొకటి రెండు వ్రాఁత ప్రతులలో నిది మొదటనుండుటకు బ్రహ్మయజ్ఞాది సంప్రదాయమునుబట్టి లేఖకుఁడు చేసిన ప్రమాదమే కారణమనుట విదితమగుటచేతను, పూర్వోక్త సత్ప్రమాణములనుబట్టి 'శంనోదేవీ' రిత్యాది మంత్ర మథర్వ ప్రథమ మంత్రమని వైదిక సంప్రదాయము ఘోషించుటచేతను, అది యేదో యొకశాఖలో మొదటి మంత్రముగా నుండి యుండవలెననుట నిశ్చయముగావున, లభించిన పైప్పలాద సంహిత వ్రాఁతప్రతిలో మొదటి పత్రము లేకపోయినను, అందలి మొదటి మంత్రము 'శంనోదేవీ' రిత్యాదికమే యని దాని

---

1. చూ. బ్లూంఫీల్డు కౌశికమాత్ర పీఠిక.
2. శంనోదేవిరభిష్టయ ఇత్యేవ మాదిం కృత్వా అథర్వవేద మధీయతే. గో. బ్రా. 1-29.
3. చూ. ఆఙ్గ్లీకృతాథర్వ వేదపీఠిక. పుట. 116.
బొంబాయి సభాప్యా థర్వవేదపీఠిక.

స్వరూప స్వభావము లెఱిఁగిన రాథవిట్నీ పండితులు మొదలగువారు నిశ్చయించి యున్నారు.[1] అనాదిగా బ్రహ్మయజ్ఞాదులందు ప్రథమ మంత్రముగాఁ బఠింపఁ బడుచు వచ్చుచున్న యీ మంత్రము దేశమందు వ్యాపించిన శౌనక సంహిత మొదట లేనపుడును, పైప్పలాద సంహితకంటె మఱియొక యథర్వ సంహిత యున్నదనుట కాధారములు లేనపుడును, శంనో దేవీరిత్యాది మంత్రము పైప్పలాద సంహితలో మొదటి మంత్రమేయని యూహించి నిశ్చయించుట సముచితమే. దీనిని బట్టి శౌనకసంహితకంటె నిదియే ముందని చెప్పఁదగియున్న పైప్పలాద సంహిత చిరకాలము క్రిందటనే యణఁగిపోయినను హృదయము కరఁగించునట్లు దీని చరిత్రము మాత్ర మతివిచిత్రముగా నిట్లు తెలియవచ్చుచున్నది.

భూర్జపత్రములపైఁ గాశ్మీరదేశలిపిలో వ్రాయఁబడిన పైప్పలాదసంహిత ప్రతి యొకటి తొ కాశ్మీరదేశమందుండెను. ఇది క్రీ. 1870 ప్రాంతమున రాసను పేరు గల యా యునికి దొరకునప్పటికి దాదాపు మూఁడువందల పత్రములు గల యీ ప్రతిం రెండు పత్రములు పోయినవి. ఎనిమిది పత్రములు తూట్లుపడి నలఁగియున్నవి. ఇది సంవతు ౯౨ లో వ్రాయఁబడినట్లు దీని యందున్నది. ఇది తరువాతఁ గాశ్మీర రాజధానియగు శ్రీనగరమునకుఁ జేరినది. దీనినే భూర్జపత్ర ప్రతి యనియు, గాశ్మీర ప్రతి యనియుఁ జరిత్ర కారులు వ్యవహరించు చున్నారు.

కాశ్మీరప్రతి వృత్తాంతము తెలిసి జర్మనీలోని రాథ పండితుఁడు 1873 లో శ్రీనగరమున నాగరలిపిలో దీనికి నకలు వ్రాయించి తెప్పించుకొని చదివి దాని మీఁద నొకవ్యాసము 1875 లోఁ బ్రకటించెను. ఈ సమయమునందే బొంబాయి రాజధానిలో రాజకీయోద్యోగిగానున్న బుహ్లరుపండితుఁడు శ్రీనగరములోని భూర్జ పత్రప్రతికి నాగరలిపిలో మఱియొకనకలు వ్రాయించెను. అదియే 1875-76 లో సంపాదింపఁబడిన వ్రాఁతప్రతిగా 378 గ్రంథ సంఖ్యతో నిపుడు పూనా దక్కన్ కాలేజీలోని లిఖితపుస్తక భాండాగారమున నున్నది. మన దేశమున మన యథర్వ వేదశాఖయగు పైప్పలాదసంహిత సజీవమై యున్నదనుటకు బుహ్లరు

1. చూ. విట్నీయాంగ్లి కృతాథర్వ వేదపీఠిక పు. 116.

"In 1875, Roth, in his A. V. in Kashmir P. 16. remarks upon the general agreement in the tradition according to which *'cam no'* etc was the initial stanza of Pipp, and not *'ye' trishapta* as in Vulgate, and regrets all the more on that account that the first leaf of the Pippa. ms. is lost.

పండితుఁడు వ్రాయించిన యీ ప్రతియే యాధారము కాని యిదిగూడఁ బోయినట్లే కనఁబడుచున్నది.[1]

రాథపండితుఁడు తాను వ్రాయించి తెప్పించుకొన్న ప్రతిలోఁ దప్పు లెక్కువగా నున్నవని తలంచి కాశ్మీరప్రతినే సంపాదింప దీక్ష వహించెను. ఇండియా దొరతనమువా రీప్రతిని సంగ్రహించి యితనికి 1876 లో నెరవుగాఁ బంపిరి. అతఁడు దీనినిబట్టి మఱియొక ప్రతి వ్రాసికొని పాఠపరిష్కారము గావించి, యథర్వవేద శౌనకసంహిత నాంగ్లీకరించుచున్న విట్నీపండితునికి 1884 లో నందఁజేసెను. తరువాతఁ గాశ్మీరప్రతి జర్మనీలోని 'టుబింజెన్' విశ్వవిద్యాలయము లోని పుస్తక భాండాగారమునఁ బ్రవేశించెను. పిదప నిది యూరపు ఖండమందలి పండితుల కుపయోగించుటకై బ్లూంఫీల్డు, గార్బు, పండితు లిరువురును 1901 లో రూపగ్రాహక యంత్ర సాహాయ్యమున దీని ప్రతిరూప ప్రతినిదీసి బాల్టిమోరుపురమునఁ బ్రకటించిరి. సర్వవిధములఁ గాశ్మీరప్రతియే యనఁదగిన యీప్రతి రూపప్రతియే తరువాత వైదిక వాఙ్మయమును బరిశోధించు పాశ్చాత్య పండితులకు సహాయపడుచున్నది.[2] అప్పటి భారతీయ ప్రభుత్వము రాథపండితుని కెరవిచ్చిన యీ భూర్జపత్ర ప్రతిమరల శ్రీనగరమునకు వచ్చినట్లెచ్చటను గనఁబడదు. దీనినిబట్టి భరతఖండ హస్తమునుండి యూరపుఖండ హస్తగతములైన విట్టి వెన్ని గ్రంథములు గలవో మన మూహింపఁ జాలముగదా! ఇట్లే కాశ్మీర ప్రతి శ్రీనగరమునుండి టుబింజెన్పురముఁ జేరుట మంచికే యయ్యెనో చెడ్డకే యయ్యెనో యిపుడు విచారించిన లాభములేదు గాని, బుహ్లరుపండితుఁడు పెట్టి నదిభిక్షగా, పూనాకాలేజీలో నున్నదను దీని పుత్రికగూడఁ గనరాకపోయెను గదా యని మాత్రము విచారింపక తప్పదు. భరతమాత గన్న వేదసంహితలలో నొకటి యగుపైప్పలాద సంహితగతి యిట్లయ్యెఁ గదాయని వాఙ్మయ ప్రియుల హృదయ పీఠ చరిత్రము విన్నతఱి నొక్కమాఱు భగ్గు మనక మానదు. ఇఁకఁ గాశ్మీరప్రతి యాశ వదలుకొని పూనాప్రతి యెట్టిదో చూతము.

"ఇది కాగితముల పుస్తకము. వ్రాఁత చక్కఁగానే యున్నది గాని నిర్దుష్టము కాదు. లిపి దేవనాగరియే కాని కాశ్మీరదేశపు కత్తు మొదటి పత్రము పోయి

1 అముద్రిత గ్రంథపట్టికనుబట్టి తెలియవచ్చిన యీ గ్రంథ మొకసారి యెరవుగాఁ బంపుఁడని దక్కన్ కాలేజీ ప్రిన్సిపాలుగారి కాంధ్రవిశ్వకళా పరిషత్తు వారిచే వ్రాయింపఁగా గ్రంథము కనఁబడలేదని జవాబు వచ్చినది.

2. ఈ విషయ మాంగ్లీకృతాథర్వ వేదపీఠికను బట్టియు, పూనాదక్కన్ కాలేజీ వ్రాఁత ప్రతుల పట్టికమబట్టియు సంగ్రహముగా వ్రాయఁబడినది.

నది గాని తక్కిన గ్రంథము పూర్తిగా నున్నది. ఇరువది కాండములు నున్నవి. ఇందు పంక్తికి ౩౮, అక్షరములు చొప్పునఁ బత్రమునకు ౨౪ పంక్తులు కలవు. అట్టి పత్రములు ౨౫౧ కలవు. ఇది బొంబాయిలోను బర్లిన్నగరములోను ముద్రితమైన శౌనక సంహితకంటె వేఱుఁగా గనవచ్చుచున్నది." అని లిఖిత పుస్తక పట్టికా నిర్మాతలు వ్రాసియున్నారు. దీనినిబట్టి. ౩౨ అక్షరము లొక గ్రంథమను సూత్రముచే, బూనా ప్రతిలోని పైప్పలాద సంహితా గ్రంథము సుమారు ౭౧౫౦ ఉన్నట్లు తెలియవచ్చుచున్నది. శౌనక సంహితలోని ఋక్కులు ౬౦౦౦ అన్నను, అందు వందలకొలఁది ఋక్కులు "పాకబలిః - వ్యాప్తః పురుషః" ఇత్యాదిగా నాలుగైదాఱేసి యక్షరములు కలవి యగుటచే ౩౨ అక్షరము లొక గ్రంథమను సూత్రమునుబట్టి యాఱువేల ఋక్కులను గ్రంథములోనికి మార్చినచో మూఁడు వేల గ్రంథము కూడఁగాదేమో యనితోఁచుచున్నది. కాని తంజావూరు లిఖిత పుస్తక పట్టిక, శౌనకీయాథర్వ సంహితలోని గ్రంథము ౬౭౦౦ అని చెప్పుచున్నది.[1] ఈ లెక్క నిజమే యైనచో శౌనక సంహితా ముద్రణమునకు సంపూర్ణ గ్రంథము లభింపలేదనుట నిశ్చయమని విశ్వసింపవచ్చును. ఇదంతయుఁ జూడఁగా నథర్వవేదమంత్ర ప్రమాణము ౧౨ వేలని చెప్పెడి చరణ వ్యూహవచనము సత్యమేమో యనియు, అక్కడక్కడ లుప్తభాగములుగా వ్యాపించిన వ్రాఁత ప్రతులను బట్టి మంత్ర సంఖ్యాపాఠములు వేఱువేఱుగా బయలువెడలి యుండెననియు నూహింపవలసి వచ్చుచున్నది. ఇఁక రెండు సంహితలకుఁ గలసంబంధ మెట్టిదో చూతము.[2]

కొన్ని సూక్తములును మంత్రములును వేఱువేఱుగానున్నను, పెక్కు సూక్తములు తాఱుమాఱుగానున్నను మొత్తముమీఁదఁ జాలవఱకీ రెండు సంహితల లోని మొదటి నాలుగు కాండములును బరస్పరము పోలియున్నవి. మఱియు శౌనక మాఱేడు కాండములలోని కొంత గ్రంథము క్రమముగాఁ బైప్పలాదము పందొమ్మిది యిరువది కాండములలోఁ గనవచ్చుచున్నది. ఎనిమిది మొదలు పన్నెండు వఱకుఁగల కాండములలోని కొంతకొంత గ్రంథము పైప్పలాదము పదునాఱు పదియేడు కాండములలో నున్నది. పదుమూఁడు మొదలు పదునెనిమిది వఱకును శౌనక కాండములలోఁ గనవచ్చు గ్రంథము చాలవఱకుఁ బదునెనిమిదవ పైప్పలాద కాండమున నిమిడియున్నది. ఇట్లు మూఁడువంతుల గ్రంథ మీరెంటి

1. D. C. San. ms. P. 372.
2. H. O. S. Vol. 8. P. 1013-15.

యందు నేకీభవించియున్నట్లు కనఁబడుచున్నను, పాఠభేదములు మాత్రమమితముగా నున్నవి. అందుచే ననేక మంత్రములు స్వభావముచే నొకటియైనను స్వరూపముచే వే అయి కనఁబడును. కొన్ని యర్థముచే నొకటియైనను శబ్దముచే వేఱయి కనఁబడును. మఱియు శౌనక మేడవ కాండమందలి కొంత గ్రంథము పైప్పల మిరువదవ కాండములో నున్నను, తక్కిన యందలి గ్రంథమును, శౌనక మిరువదవ కాండమందలి గ్రంథమును మిక్కిలి వేఱుగాఁ గనవచ్చును. అంతే కాదు. ఈ రెంటిలో నే కాండమందైనను, మొదటి మంత్రములుగాని కడపటి మంత్రములుగాని యొకటిగా నుండవు. ఋగ్వేదమునుండి వచ్చిన ఋక్కులైనను వీనిలో నొకచోట నున్న ట్లింకొకచోట నుండవు. అందుచే సూక్ష్మదృష్టి కీ రెండు సంహితల సంబంధము దగ్గఱగాఁ గనిపించినను స్థూలదృష్టికి దూరముగానే కని పించును. కావుననే యివి తైత్తిరీయ వాజసనేయ సంహితల నెక్కువగాఁ బోలి యుండునని వెనుకఁ జెప్పితిని. ఇఁక నాది నొకటి యయ్యుఁ దరువాత ద్విరూప మైన యథర్వవేదము నితర విషయములను విశ్వవ్యాప్తమైన శౌనక సంహితనుబట్టి తెలిసికొందము.

అథర్వ సంహిత - మంత్ర ద్రష్టలు

ఈ సంహిత కథర్వవేదము - అథర్వాంగిరస్సులు - భృగ్వంగిరస్సులు - బ్రహ్మవేదము - నని నాలుగు నామము లున్నవి. ఇందు మొదటి మూఁడు సంజ్ఞ లాయా ఋషులు ప్రవక్త లగుటనుబట్టియు, కడపటిది యాగములం దీ వేదము బ్రహ్మయను ఋత్విక్కు పఠింపఁదగిన దగుటనుబట్టియు వచ్చినవి. అథర్వ వేదో త్పత్తినిగూర్చి గోపథ బ్రాహ్మణ విష్ణుపురాణాదులు చెప్పెడి కథలయందలి ముఖ్య భావమునుబట్టి చూచినచో, భృగుమహర్షియు నథర్వ మహర్షియు నభిన్నులనియు, అథర్వాంగిరో మహర్షులును వారివారును బ్రధానులుగా నీ వేద మావిర్భవించె ననియుఁ దెలియవచ్చును అయినను, అథర్వమహర్షియు నతని సంతతివారును దర్శించిన సూక్తము లధికముగా నుండుటచే దీని కథర్వవేద మనెడి సంజ్ఞ లోక మున నెక్కువ విఖ్యాతి కెక్కినది. పై విషయమున కీ సంహితయందలి యీ క్రింది మంత్రములే ప్రమాణము.

"సోఽ రసాం పాశా న్మా మోచి ।
స అ రసానాం పాశా న్మా మోచి ।
సోఽ ర్వణాం పాశా న్మా మోచి ।
స అధర్వణానాం పాశా న్మా మోచి ॥[1]

1. అ. సం. 16-9.

ఆఙ్గిరసానా మాద్యైః పఞ్చానువాకైః స్వాహా ।
సప్తమాష్టమాభ్యాం స్వాహా ।
ఆథర్వణానాం చతుర్ఋచేభ్యః స్వాహా...ఏకోనవింశతిః స్వాహా ।
వింశతిః స్వాహా, మహత్కాండాయ స్వాహా ॥[1]

దీనినిబట్టి, అంగిరసుఁడును, ఆంగిరసులును; అథర్వుఁడును ఆథర్వణులును, దర్శించిన యనువాకములును సూక్తములును గలవని తెలియుటయేకాక, ఆథర్వణు లొకటి మొదలుగా నిరువదివఱకు ఋక్కులుగల పెక్కు సూక్తములను గొప్ప కాండమును దర్శించినట్లుకూడఁ దెలియవచ్చును. ఇట్లు ద్వివిధ సంజ్ఞల కాధార భూతులైన యథర్వాంగిరసులేకాక యింకను బెక్కండ్రు సూక్తద్రష్టలు కలరని యనుక్రమణికాదులవల్లఁ దెలియుచున్నది. కాని, వారిలో ననేకులు ఋగ్వేద సూక్త ద్రష్టలే. వారుగాక తక్కినవారు సుమారు ముప్పదిమంది మాత్రమున్నారు. పంచదశ కాండమునకు వ్రాత్యమని పేరు. అందు వ్రాత్యుఁడు లేక, పరమాత్మ దేవతయని యనుక్రమణిక చెప్పుచున్నది. ఇరువదవ కాండమున - ౪౮-౪౯ - సూక్తములును, ౧౨౭-౧౩౬ వఱకుఁగల పది సూక్తములును దప్పఁ దక్కిన సూక్తములన్నియు ఋగ్వేదమునుండి యిందు ప్రవేశించిన వగుటచే నందలి విశ్వామిత్ర గోతమసవ్యా దులే యిందలి సూక్తములకును ద్రష్ట లగుచున్నారు. ఆయా సూక్తములనుబట్టి యా ఋషులను దెలిసికొన వచ్చును గావున ననుబంధమందలి పట్టికలో వారి నామములఁ బేర్కొనలేదు.

ఇరువదవ కాండము నవీనమనుట స్పష్టము ఇది తొలుతఁ బైప్పలాద సంహితకే యనుబంధముగా నుండెడిదనియుఁ దరువాత శౌనక సంహితయందు ప్రక్షిప్తమయ్యెననియు రాథవిట్నీపండితు లభిప్రాయపడియున్నారు. ఇందు పూర్వోక్తములైన పన్నెండు చిన్నసూక్తములు తప్పఁదక్కిన విందలివి కావను నుద్దేశముతోనే బర్లిన్‌ప్రతి యీ కాండమున ౧౩౦ మంత్రములను మాత్రమే చూపినది. ఈ కాండము శౌనకసంహితలోనిది కాదనుతలంపుతోనే విట్నీపండితుఁడు దీని నాంగీకరింపక విడిచిపెట్టెను. ఇందలి సూక్తములు సోమయాగోప యోగు లింద్రదేవతాకములు ఋగ్వేదనిష్ఠములు, కావున నీ కాండమునుగూర్చి వేఱుగాఁ బ్రసంగింపఁబని లేదు.[2]

1. 19-22, 23.
2. చూ. అథర్వవేదఋషి సూక్తపట్టిక - అనుబంధము. ౨.

ఆర్షవిచారణ - ఛందోదేవతాదులు

సర్వానుక్రమణినిబట్టి పట్టికలోని వారథర్వవేద సూక్తద్రష్టలుగా నున్నను బృహదనుక్రమణినిబట్టి - బ్రహ్మ - అథర్వుఁడు - భృగువు - అంగిరసుఁడు - శంతాతి - చాతనుఁడు - శుక్రుఁడు - మాతృనామ్యుఁడు - యముఁడు - అనుతొమ్మండుగురు మాత్రమే యథర్వవేదద్రష్టలగు ఋషులని తెలియవచ్చుచున్నది. అందుచే దీనిఋషులవిషయ మిద మిత్థ మనుటకు వీలు గాకున్నది. ఇందుకు మఱియొక కారణము గూడఁ గలదు.

కడపటికాండమందే కాక తక్కిన కాండములందును ఋగ్వేదములోని పెక్కుసూక్తములు కనవచ్చును. అట్టిసూక్తములద్రష్టలు ఋగ్వేదానుక్రమణిలో నున్నట్లుగా నిందుగనరారు, ఇందు కొకయుదాహరణము. ఋగ్వేదము ౪-౫౭-౪లో 'శునంవాహాః శునంనరః' ఇత్యాదిగాఁ గృషివిషయకమైనయొక మంత్రమున్నది. అది వామదేవనిర్మితమని యందున్నది. ఆ మంత్రమే యథర్వవేదము ౩-౧౭ లో నున్నది. ఇచ్చటనిది విశ్వామిత్ర నిర్మితముగా నున్నది. ఇట్లే యీ సూక్తములోని ఋక్కులనియు ఋగ్వేదమున నందందు వివిధమహర్షులు రచించినట్లు కనఁబడుచుండఁగా నీ సూక్తమంతయు విశ్వామిత్రదృష్టమేయని యథర్వ వేదానుక్రమణి చెప్పుచున్నది. ఇట్టి యుదాహరణము లెన్నేని కనవచ్చును. దీనినిబట్టి చూచినచోఁ బట్టికలోనిఋషులందఱును వేఱు వేఱుగా నథర్వ మంత్రములు రచియించినవారు గారనియు నిందలి స్వతంత్రసూక్తములను బృహదనుక్రమణి చెప్పినట్లుగా నథర్వాదిఋషులు నిర్మించి యుందురనియు ఋగ్వేదమునుండి యిందు ప్రవేశించిన సూక్తములకు ననుక్రమణి యథేష్టముగా ఋషుల నంటఁ గట్టియుంచె ననియు మొత్తముమీఁద నీ వేదమున కథర్వాంగిరో బ్రహ్మభృగువులే ప్రధానకారణభూతులనియు నొకవిధముగాఁ దెలిసికొనవచ్చును. ఇందుకు ముఖ్యములైన ౧౯ కాండములలోని ౫౮౮ సూక్తములలో, అథర్వమహర్షి రచించినవి ౧౭౭, బ్రహ్మర్షి నిర్మించినవి ౯౦, భృగుమహర్షి రచియించినవి ౨౭, అంగిరోమహర్షి దర్శించినవి ౧౬, భృగ్వంగిరసులు కలసి రచియించినవి ౨౯. అథర్వాంగిరసులు కలసి రచించినవి ౧౩, బ్రహ్మాంగిరసులు కలసి రచించినది ౧, మొత్తము ౩౫౩ సూక్తములు. తక్కిన ౨౩౫ సూక్తములు నితరర్షులపేరఁ గనవచ్చుచున్నవి గాని యందధికసంఖ్యాకములు ఋగ్వేదములోనివే. అందుచే బ్రహ్మవేదము, అథర్వాంగిరోవేదము, భృగ్వంగిరోవేదమునని దీని కితరనామములు వాఙ్మయమం దున్నను, అథర్వనిసూక్తము లత్యధికముగా నుండుటచే నథర్వవేదమని యిది లోకమున

ఖ్యాతి నెందినది. పూర్వోక్తులైన నలుగురిలో నథర్వుఁడు తక్కఁదక్కిన వారేదో యొకవిధముగా ఋగ్వేదమునఁ గనవత్తురు. అందుచే నథర్వుఁడు వారికి సమకాలికుఁడనియు, ఈ వేదము ఋగ్వేదమునకు సమకాలికమనియు భావింపరాదు. బ్రహ్మాంగిరో భృగువులు వేఱు వేఱుగాను బరస్పరము కలసియు రచియించిన సూక్తములిందున్న వనుటకు రెండువిధములయిన ప్రమాణములు కనఁబడుచున్నవి. అనుక్రమణీకారుని మాటయొకటి. ఈ వేదములోని కొన్నిమంత్రములలో వీరి నామములు గనవచ్చుట మఱియొకటి. ఇందురెండవది మొదటిదానికి హేతువైనను గావచ్చును. అందుచే రెండవదియే ప్రబలప్రమాణమగును. కాని, యీ ముప్వురును ఋగ్వేదము నాఁటివారో, లేక యాపేళ్ల గలయితరమహర్షులో తెలిసికొన నాధారములులేవు. అది గాక, యాగప్రవర్తకులలోఁ బ్రధానద్రష్టగా బ్రహ్మయను పేరు గల ఋత్విజుఁడుండుటను గనిపెట్టి యీ వేదమునకు యజ్ఞసంబంధము గలిగింపఁదలపెట్టి యిందలి పెక్కు సూక్తములు బ్రహ్మదర్శించినట్లుగా నథర్వవేదాభిమానులు కల్పించి యుండఁగా నా సంప్రదాయమునుబట్టి యనుక్రమణి బ్రహ్మను చేర్చినదేమో! పోనీ! అట్లుగాక, నాఁటివారేయని యూహించినను, ఇందలిసూక్తములను నిర్మించినఋషులు వారి నిందు పేర్కొనినంతమాత్రమున వారు సూక్తద్రష్టలని చెప్పుటకుఁ దగిన యాధారము లభింపదు. అందుచేతను, ఈ వేదము మిక్కిలి యవ్యవస్థరూపముగాఁ గనవచ్చుటచేతను, జక్కఁగాఁ బరిశీలింపఁగా నథర్వుఁడును ఋగ్వేదసంబంధములేని యంగిరసుఁడును, వారి సంతతివారు నీ వేదము ౧౮ కాండములు రచియించి యుందురనియు, అందు గొన్ని సూక్తములును గడపటి రెండు కాండములును దరువాత నెవరో నిర్మించియుందురనియు, అట్టియిందలి కొన్ని పేళ్లనుబట్టియుఁ దననాఁటికి వాడుకలోనున్న సంప్రదాయమునుబట్టియు దీనిని ఋగ్వేదాదులతోఁ బోల్చుటకై యనుక్రమణిక, సూక్తములను వేఱువేఱు ఋషులను నిర్ణయించియుండు ననియుఁ దోఁచుచున్నది. ఎట్లయిననిది యన్నిసంహితలకంటె నర్వాచీనమనుట నిస్సంశయము.

అట్టి యీ వేదమందలి ఋక్కుల మొత్తములలో సుమారు పన్నెండువందలు ఋగ్వేదములోనివి. అందు సుమా రెనిమిదివంద లేమార్పును లేకయే యిరువదవ కాండముననున్నవి. తక్కిన నాలుగువందలు కొన్నికొన్ని మార్పులతో మిగిలిన కాండములందున్నవి. పదునాఱవకాండము చాలవఱకు గద్యమయము. దీనిపై ౧౭-వ, కాండము పరిమాణమందు మిక్కిలి చిన్నది. ఇరువదవ కాండమును దీనికిఁ జేర్చినట్లే యథర్వవేదీయులు దీని యాఱవ కాండమందు సోమయాగ

ప్రశంసగల ౪౭, ౪౮, సూక్తములను, ప్రాయశ్చిత్తీయేష్టులను బ్రతిపాదించు ౧౧౪ సూక్తమును జేర్చియున్నారు.

మఱియు ఋగ్వేదమందువలెనే యిందును, ఇంద్రాగ్ని చంద్రవరుణాదిత్య రుద్రాదులు దేవతలుగా నాయా సూక్తములందు వర్ణింపఁబడియున్నారు. ఋగ్వేద మందున్న ఛందస్సులుకాక నూతన చ్ఛందస్సులుకూడ నిందు మఱికొన్ని కన వచ్చును. అవి, విరాట్గాయత్రి - ప్రస్తారపంక్తి - బార్హత గర్భత్రిష్టుప్ - విరాడతి జగతి - అష్టారపంక్తి - విపరీత పాదలక్ష్మపంక్తి - పురస్తాద్బృహతి - బార్హతవై రాజగర్భజగతి - మొదలయినవి. దీనినిబట్టి ఛందశ్శాస్త్రము దీని నాఁటికి మిక్కిలి విపులమైనదని చెప్పవచ్చును. ఇందలి ఛందోబద్ధ మంత్రములను ఋగ్వేద ఋక్కులకువలెను, గద్యరూప మంత్రములకు యజుర్మంత్రములకువలెను, ఉదాత్తాది స్వర నియమము శౌనక సంహితయందు కనవచ్చును. పైప్పలాద సంహితా పుస్తకమునందు స్వరచిహ్నములు సూచింపఁబడలేదుగాని యందలి మంత్రములు మూఁడువంతులు శౌనక సంహితలోఁ గనవచ్చుచున్నవి కావునను, ఇరువదవ కాండము మూఁడువంతులు పైగా ఋగ్వేదములోనివే కావునను దానికిని స్వర నియమము పూర్తిగా నున్నదనుట స్పష్టము. ఇది యాథర్వణ సంగ్రహ చరిత్ర. ఇఁక దీని యాంతర విషయము.

అథర్వమంత్ర విశేషములు

ఈ వేదము తరువాత బయలువెడలిన మంత్రశాస్త్ర వైద్యశాస్త్రములకు మార్గదర్శకమును జ్యోతిశ్శాస్త్రమున కభివృద్ధి సూచకమును విశేషముగా నైహిక సుఖమార్గముల కుపదేశకమును గొలఁదిగా నాముష్మిక సుఖబోధకమునునై వెలయు చున్నది. తక్కిన వేదములకంటె విలక్షణమైన యిది తననాఁటి వివిధ సాంఘి కాచారములను గరతలామలకము గావించుచు మంత్ర ప్రభావమును బ్రత్యక్షముఁ గావించుచున్నట్లుండును. రాజపురోహితుఁ డథర్వవేదజ్ఞుఁడుగా నుండవలెనన్న కొన్ని పురాణ వచనములనుబట్టి యొక కాలమున రాజులకుఁ బ్రభుమంత్రోత్సాహ శక్తులతో నథర్వమంత్ర శక్తికూడ సహాయపడెనని విశ్వసింపక తప్పదు.[1] రాజు లకుఁ గావలసిన శత్రుస్తంభనము శత్రుపీడనము శత్రుబలదమనము శత్రు సంప న్నాశనము శత్రుమారణము మొదలగునవి మంత్రమహిమ సాధ్యము లైనట్లు తెలుపుచున్న యిందలి మంత్ర విశేషములే యిందుకుఁ బ్రమాణము. ఇది యట్టిది

1. పురోహితం త థాథర్వమంత్ర బ్రాహ్మణపారగమ్. మత్స్య.

కావుననే నాఁడు మంత్ర ప్రభావమును ప్రత్యక్షముగా నెఱిఁగినరాజు లథర్వమంత్ర వేత్తలగు వారిని పురోహితులనుగాఁ దమ యాస్థానములం దుంచుకొని వారివలన నభీష్టసిద్ధిని బడయుచుండెడివారు. నిజముగా మంత్రములం దట్టి శక్తియే లేనిచోఁ బ్రభువు లట్టి మంత్రపాఠకులను గౌరవించియుండరు. నేఁడుగూడఁ బాముమంత్రము తేలుమంత్రము చప్పిమంత్రము మొదలైనవి విషమును విషక్రిమిబాధను హరించు చున్నట్లు మనము కన్నులారఁ గనుచున్నాము, వీనులార వినుచున్నాము పిశాచము లున్నట్లిపు డందఱును నమ్ముచున్నారు. భూతవైద్యముచేఁ గొన్నిచోట్ల వాని బాధ తొలఁగుచున్నట్లును గనుచున్నాము. అట్టియెడ నా కాలమునందు స్థిరచిత్తులై యుద్దిష్ట విషయమున బుద్ధి నిలిపి మంత్రజపము గావించి మానసికశక్తి మహిమచే నాఁటి వా రిష్టార్థమును సాధించెడి వారనుట కాశ్చర్యమేమి? ఇపు డిది మూఢ విశ్వాసమని కొంద ఱనుచున్నారు. కాని యిప్పటి దేశకాల పాత్రములనుబట్టి నాఁటి మంత్ర విషయము నిట్లు నిరసించుట తగదు. ఇది యిపుడు మూఢవిశ్వాసముగాఁ బరిణమించినను, దొల్లి యిందలి విషయము ప్రాజ్ఞ విశ్వాసమునకు గుఱియగుట చేతనే యీ యాథర్వణము వేదత్వమును నార్జించి యుపనిష త్పురాణేతిహాసాదులఁ బ్రశంస కెక్కినదనుట నిజము. కావున నథర్వవేదము కొంతకాలము దేశమున రాజ్యము చేసియుండునని నిశ్చయముగాఁ జెప్పవచ్చును.

ఇందలి మంత్రములు బహువిధములై యనేక విషయములకు సంబంధించి యున్నవి. అందు కొన్ని జ్వరాది వివిధ రోగములు గ్రహములు పిశాచములు బ్రహ్మరక్షస్సులు మొదలగువాని పీడలను దొలఁగించునవి. కొన్ని వ్రణములు కత్తిపోట్లు మొదలైన వాని బాధను మఱపించునవి. కొన్ని యాయుస్సును యశస్సును వర్చస్సును ధన కనకవస్తు వాహనములను వృద్ధిపొందించునవి. కొన్ని శత్రువుల యాయురాదుల నపహరించునవి. కొన్ని వైరులకు హాని కలిగించునవి. కొన్ని విరోధులు చేయు కీడును బరిహరించునవి. కొన్ని స్త్రీలను బురుషులను వశపఱుచునవి. కొన్ని వ్యవసాయమునకుఁ బనికివచ్చునవి. కొన్ని గృహారామాది నిర్మాణమున కుపకరించునవి. మఱికొన్ని వివాహాదులను, గృహ్య సంస్కారములను, అంత్య సంస్కారములను, పృథివ్యాది మహాభూతములను సృష్టి వైచిత్ర్యములను ఇంద్రియ నిగ్రహమును జీవాత్మ పరమాత్మ స్వరూపమును వర్ణించునవి. ఇట్లిది యైహికాముష్మికములైన యనేక విషయములను బోధించుచున్నను, దయ్యాలపోతు కట్టుఁబోతు చేతబడి మంత్రముల కథర్వవేద మాట పట్టనెడి యపఖ్యాతి మాత్రము క్రమముగా లోకమున వ్యాపించినది. అట్టి మంత్రములుగూడఁ

గొన్ని యుండుటచే నది నిర్హేతుక మనఁజాలము. ఇఁకఁ బూర్వోక్త విషయము లకు సంబంధించిన కొన్ని మంత్రము లెట్లున్నవో చవిచూతము.

శీతజ్వరాదులు - వాని ప్రతి క్రియలు:—ప్రతిదినము గాని రోజు విడిచి రోజుగాని, మూఁడవ రోజుగాని వచ్చునట్టి శీతజ్వర సంతత జ్వర వేలాజ్వరములు శాంతించుటకు గొడ్డలి యెఱ్ఱగాఁ గాల్చి నీళలోముంచి యావేఁడినీళ్లు మంత్రించి రోగిమీఁదఁ జల్లుచు 'యదగ్నిరాపో అదహత్ప్రవిశ్య' ఇత్యాది సూక్తము[1] జపించ వలసినదని కౌశికసూత్రాదులు చెప్పుచున్నవి. అందలి రెండుమంత్రములు :—

"యది శోకో యది వాభిశోకో యదివా రాజ్ఞో వరుణస్యాసి పుత్రః ।

హ్రూడు ర్నామాసి హరితస్య దేవ స నః సంవిద్వాన్పరివృఙ్ధి తక్మన్ ॥[2]

నమః శీతాయ తక్మనే నమోరూరాయ శోచిషే కృణోమి ।

యో అన్యేద్యు రుభయద్యు రభ్యేతి తృతీయకాయ నమో అస్తు తక్మనే॥

హ్రూడునామకుఁడవైన యోపచ్చని జ్వరదేవా ! (తక్మన్) నీవు శరీరము కాఁచువాఁడవు, మిక్కిలి వేఁచువాఁడవు. పైగా రాజయిన వరుణదేవుని పుత్రుఁడవు అట్టి నీవు మాయెడ దయదలఁచి యుపకారబుద్ధితో మమ్ము విడిచిపెట్టుము. ఓ శీతజ్వరమా ! నీకు నమస్కారము. ఓ తాపజ్వరమా ! నమస్కారము. రోజు విడిచి వచ్చునట్టియు, నేఁడును రేపును వచ్చునట్టియు, లేక మూఁడవనాఁడు వచ్చు నట్టియు నీకు నమస్కారము.

ఇంకొక సూక్తమందలి జ్వరమంత్రముల యర్థముకొంత :—.[3] "ఓ జ్వరమా ! వగర్పు దగ్గు ఎక్కిళ్లు, అను రోగములతో మైత్రిచేయువద్దు. నీ విక్కడ నుండి వెనుకకు రావద్దు. ఇదే నీకుఁ జెప్పుచున్నాను :— ఓ జ్వరమా ! నీ యన్న

1. అథ. 1-25. 1-4.

2. పై. సం. లో—భిశోకోరుద్రస్యప్రాణోయది వారుణోఽసి—అనియున్నది హ్రూతు పాఠాంతరములు. హూడు, హ్రుడు, హ్రూదు, హ్రూఢ హ్రూఢు-రూఢు-ఇత్యా.—

3. అథ. 5 22. 11, 12.

యగు వగర్పుతోను నీ యప్ప యగుదగ్గుతోను నీయన్నకొడుకగు నెక్కిలితోను మమ్ము విడిచిపెట్టి యితరులవద్దకుఁ బొమ్ము :—

కత్తిదెబ్బతగిలినపుడు కాఱునెత్తు రాఁపుటకు మంత్రతంత్రములు. అయిదు కణుపులకఱ్ఱతో రక్తము స్రవించుచోట నభిమంత్రించి నఱుకుమీఁద వీథిలోని మెత్తనియిసుక దుమ్ము చల్లవలెను గట్టిపడినవండుమట్టి దానిమీఁద వేసికట్టవలెను. అని కౌశికసూత్రము చెప్పుచున్నది. ఇందలిమంత్రముల యర్థము.

క్రిందినాడీ ! ఆఁగిపొమ్ము. మీఁదినాడీ ! ఆఁగిపో. మధ్యనాడీ ! నీవుకూడ నాఁగిపో. చిన్ననాడి నిలిచిపోయినచోఁ బెద్దనాడి యాఁగిపోఁగలదు. రక్తము ప్రవహించునట్టి నూఱుధమనులలోను వేయి సిరలలోను మధ్యనాడు లాఁగిపోయినవి. వీనితోఁ దక్కినవన్నియు నిలిచిపోయినవి.

ఆయుష్యసూక్తము లీ వేదమున రెండువందలవఱకు నున్నవి. అం దాయుర్వృద్ధికరములగు సాధనములలో సువర్ణధారణ ముత్తమమని చెప్పఁబడినది. 'బంగారు రక్షరేకులు బంగారు తాయెతులు బంగారు నగలు పిల్లలకు మేలు కలుగఁ జేయును. నూఱు సంవత్సరముల యాయుర్దాయ మిచ్చును. దేహమునకు వర్చస్సును బలమును గలుగఁజేయును. బంగారము ధరించినవారికి రక్షఃపిశాచబాధ కలుగదు.'[1] ఇత్యాదిగా ననేకము లున్నవి. మఱియు

'ఓ వార్ధకమా ! నీకొఱ కీ బాలుఁడు వర్ధిల్లుఁగాక. ఇతరములైన నూఱు మృత్యువులు నితనిఁ జేరకుండుఁగాక. తల్లి తన కుమారునివలెనే, ఉదార హృదయుఁడైన మిత్రదేవుఁ డీ బాలు నాపదలు రాకుండ రక్షించుఁగాక.'[2]

అగ్నీ ! నీవీ కుమారునికి సంపూర్ణాయు విమ్ము. త్వష్టా ! నీ వితనికి సంతాన మిమ్ము. సవితా ! నీ వితనికి ధనసంపద నొసఁగుము. ఈ బాలుఁడు నూతేండ్లు జీవించుగాక.[3]

ఆభిచారిక పిశాచోచ్చాటనాది మంత్రతంత్రములు

ఇందు గనవచ్చెడి యాభిచారికములైన మంత్రతంత్ర హోమాదులు కొన్ని యానాఁటి సంఘమందలి దౌర్జన్యమును దెలుపుచు హృదయమున కావేగము

1. అథ. 1-35.
2. అథ. 2. 28. 1.
3. 2-29-2

గలిగించున ట్లుండును. శత్రువులను, పిశాచములనువలెనే, అన్నకొడుకులనుగూడ వెళ్ళఁగొట్టుమనియు, పాడుచేయుమనియు, నశింపఁజేయుమనియు[1] కోరుచుఁ జేయునట్టి దుష్ట హోమమంత్రములుకూడ నొకప్పుడు సంఘమందు వ్యాపించెనుగదా యని యీ మంత్రములు చదువునపు డొడలు జలదరింపకపోదు. ఇది యుపదేశించిన యీ క్రూరతంత్రమే నేఁటికి నక్కడక్కడ 'చేతబడి' యనుపేర వినవచ్చుచున్నది. దీని స్మరణమే భయంకర మగుచుండ దీనివలని కార్యసిద్ధి యెంతటి భయంకరమో, ఊహింపవలసినదే, ఇట్టి వానిలో శత్రు వినాశపరములైన కొన్ని సూక్తముల భావము :—

ఓ యగ్ని వాయు సూర్యచంద్ర జలములారా! మమ్మెవఁడు ద్వేషించుచున్నాఁడో, ఎవ్వని మేము ద్వేషించుచున్నామో, అట్టివానిని మీ తాపశక్తిచేఁ దపింపఁజేయుఁడు మీ హరణశక్తిచే క్షీణింపఁజేయుఁడు. మీ దీప్తిశక్తిచే మండింపఁజేయుఁడు. మీ దుఃఖదాయకశక్తిచే శోకింపఁజేయుఁడు. మీ తేజశ్శక్తిచే నిస్తేజస్కునిగాఁ జేయుఁడు.'[2]

ఇతరులుచేసిన ప్రయోగము త్రిప్పుటకును, శత్రువు చేసినయపకారమునకుఁ బ్రతిక్రియ యొనరించుటకును బ్రత్యభిచారమంత్రములు పెక్కుగనవచ్చును. అందుకొన్ని—

"ఉపప్రాగా త్సహస్రాక్షో యుక్త్వా శపథో రథమ్,
శప్తార మన్విచ్ఛ న్మమ వృక ఇవావి మతోగృహమ్.
పరిణో వృఙ్ధి శపథ హ్రద మగ్ని రివాదహన్,
శప్తార మత్ర నో జహి దివో వృక్షమివా శనిః.[3]
యథా సూర్యో నక్షత్రాణా ముద్యం స్తేజాం స్యాదదే.
ఏవా స్త్రీణాంచ పుంసాంచ ద్విషతాం వర్చ ఆదదే.[4]

1. అథ. 2-18, 2. అథ. 2-19—22.
3. అథ. 6-37. 1, 2. 4. అథ, 7-13-1.

పై మంత్రముల భావము క్రమముగా—

"వేయికన్నులు కల యీ శపథము రథమెక్కి వేగముగావెళ్లి, గొఱ్ఱెలవాని యిల్లు తోడేలు వెదకి పట్టుకొన్నట్లే నాకుశాపము పెట్టినవానిని వెదకిపట్టుకొని వానిని హింసించి శీఘ్రముగా నిక్కడికిఁ దిరిగివచ్చుఁగాక.

ఓ శపథమా! మండుచున్న నిప్పుమడుగును విడుచునట్లు మమ్ము దహింపక విడిచిపెట్టుము. ఆకసమునుండి పడునట్టి పిడుగు చెట్టు కాల్చునట్లే నాకు శాపము పెట్టినవానిని గాల్చివేయుము. వానిని విడిచిపెట్టకు.

ఈ శాపము, ఉదయించునట్టి సూర్యుఁడు నక్షత్రముల తేజస్సు లాగివేయు నట్లే నా శత్రువులైన స్త్రీ పురుషుల వర్చస్సును లాగివేయుఁగాక—

బ్రాహ్మణులను ద్వేషింపరాదు, బ్రాహ్మణస్త్రీ నవమానింపరాదు. బ్రాహ్మణ గోవును దొంగిలింపరాదు. బ్రాహ్మణుఁడు కోరినవస్తువు లివ్వవలెను. బ్రాహ్మణులను గౌరవింపవలెననుచు బ్రాహ్మణ ప్రభావము వర్ణించుసూక్తము లనేకము లున్నవి.[1]

అందు బ్రాహ్మణ స్త్రీవిషయకములైన కొన్ని మాటలు

అపహృతురాలయిన బ్రాహ్మణభార్య భయంకరరూపయై యపహరించిన వారిని పరలోకమున బహుబాధలు పెట్టునని దేవతలు చెప్పిరి తపోనిష్ఠులైన సప్తమహర్షులు చెప్పిరి గర్భపాతములు సంభవించుటకును జీవరాశి క్లేశపడుట కును వీరులు పరస్పరము కలహించి మడియుటకును బ్రాహ్మణపత్నియే కారణము. [అనఁగా బ్రాహ్మణస్త్రీ నపహరించినచోట నిట్టివిపత్తులు సంభవించునని భావము.] అంతకు మున్నొక స్త్రీకి బ్రాహ్మణులు కానివారు పదిమంది భర్తలుగా నుండనీ; దాని హస్తమును బ్రాహ్మణుఁడు పరిగ్రహించెనేని నాఁటినుండి దాని కతఁడే పతి యగును. అట్టి స్త్రీకి బ్రాహ్మణుఁడే పతియగునుగాని క్షత్రియుఁడును వైశ్యుఁడును గాఁజాలరని సూర్యదేవుఁడు పంచజాతి మనుష్యుల కుద్ఘోషించుచుఁ బోవుచున్నాఁడు. ఎవనిరాష్ట్రమందు బ్రాహ్మణపత్ని నిరోధింపఁబడునో, ఆ రాజునకు భార్యాసౌఖ్యము నశించును. ఎవనిరాజ్యమందు విప్రుఁ డపహృతభార్యుఁడై యొక్కరాత్రియేని గడపునో వాని దేశమునం దావులు పాలియ్యవు ఎద్దు నేలదున్నవు" ఇత్యాదిగా

1. అథ-5-17-19,—3-19,—7-103,—11-1, 19, ఇత్యాదులు.

నున్నవి. వీనినిబట్టి చూడ నా కాలమందు కన్యలు తక్కువగాను బురుషులు మిక్కిలి యెక్కువగాను నుండుటచే నొక్కస్త్రీని బెక్కం ప్రాసించుచుండిరనియుఁ వివాహితులుగాని పురుషులసంఖ్య యధికమగుటచేఁ బరదారాపహరణము సర్వజాతి సాధారణమైన దురాచారమై యుండెడిదనియు, అందుచే నుత్తమజాతివారగు బ్రాహ్మణులు బాహ్మణదారాపహరణము నరకహేతువు దేశనాశకము రాజ్యహాని కరమని పైవిధముగా సంఘమున కుపదేశించుచువచ్చిరనియుఁ దెలియవచ్చును.

మఱియు - భృగుమహర్షిని హింసపెట్టి పరాభవించిన సృంజయులును వైతహవ్యులును వృద్ధికి రాలేదు. ఉత్తమలోకమును జెందలేము బ్రాహ్మణునిపై నుమ్మి మొదలగు నశుచిపదార్థములు పడునట్లు చేయువారు నెత్తుటికాలువలోఁ గేశ భక్షణము చేయుచుఁ బడియుందురు. బాహ్మణధేను వేదేశమునఁ జంపివండఁ బడునో యా దేశము తేజోహీనమై యణఁగిపోవును. అందు వీరుఁడు పుట్టఁడు - రాజు బ్రాహ్మణుని హింసించెనేని పగిలిపోయిన పడవను నీళ్లు ముంచివేయునట్లుగా నతని రాష్ట్రమును దౌర్భాగ్య మణఁచివేయును, విపహి సకుని మానీడను జేర వద్దని వృక్షములు గూడఁ దఱిమివేయును. బ్రాహ్మణధనము దేవకృతమైన విష మని వరుణుఁడు చెప్పియున్నాఁడు.[1] ఇత్యాది భావములతోఁ యిఁదలి యనేక మంత్రములు చూడఁగా, ఆ కాలమందు గూడ బ్రహ్మద్వేషము సంఘమునఁ గల దనియు, అయినను స్వప్రభావముచే బ్రాహ్మణజాతి తమ్ము హింసించువారి నణఁ గించుచు వచ్చెననియు విదితమగును.

ఇందలికొన్ని సూక్తములు పిశాచోచ్చాటన పరములు. ఈ మంత్రములును, ఇవి బోధించు తంత్రములును గలసి తరువాత భూతవైద్యమున కాధారములైనవి. పిశాచములు బహువిధములుగా నున్నవి. అందు నిస్సాల ధిష్ణ్య మొదలగు పిశాచులు చందుని కూఁతుళ్ళు. కొందఱు ముగుందియను పిశాచి పుత్రికలు. దయ్యమునకు సదాన్వసంజ్ఞ సామాన్యముగా వాడఁబడినది. కొన్ని మంత్రముల యర్థము:—

"ఓ దయ్యములారా! మిమ్ము గోశాలనుండి ధాన్యపుకొట్లనుండి యింటి నుండి వెడలఁగొట్టుచున్నాను - భూతపతి యిచ్చటినుండి పిశాచములను వెడలఁ గొట్టుఁగాక. ఇంటి పునాదుల నాశ్రయించియున్న పిశాచుల నింద్రుఁడు వజ్రాయుధ ముతోఁ గొట్టి తఱిమివేయుఁగాక - ఓ సదాన్వలారా! మీరీదేశమువారే కాని,

1. అధ. 5-19.

యితరులు పంపినవారు కానీ, దస్యులవల్లఁ బుట్టినవారు కానీ, యిచ్చట నుండి లేచి పొండు. ఎక్కడను గనఁబడవద్దు''.[1]

సర్పవృశ్చికాదుల విషము హరించుట కుపయోగించు మంత్రము లిందు సుమా రిరువది యున్నవి. అందు కొన్నిటి భావము.[2]

ఓ విషమా! గరుత్మంతుఁడు నిన్నుఁ బూర్వము భక్షించెను. అందుచే నీ శక్తి హరించినది. నీ వాశ్రయించిన మనుష్యుని మత్తునిగాఁ జేయఁజాలవు. వానికి స్మృతి లేకుండఁ జేయలేవు నీవు వానిలో నన్నమువలె జీర్ణమై పోవుదువుగాక.

విషజంతువు తన హస్తమువంటి సాధనముతో మనుష్యదేహమున నెక్కిం చినవిషమును మంత్రముచే నిర్వీర్యముఁగాఁ జేయుచున్నాను. విషము దిగిపోఁగాక.

నలుదిక్కులనున్న విషము నిర్వీర్యమగుగాక. ఈ మంత్రముతో విషము నశించిపోవుఁగాక.

ఇంద్రాదులును సూర్యద్యులోక భూసరస్వత్యాదులును మనసార నీ విషము హరించు నౌషధము దయచేయుదురు గాక.

ఈ క్రింది మంత్రముతో మంత్రించిన పుట్టమన్ను విషమున్న స్థలమునఁ బట్టించినయెడల విషము విఱిగిపోవును.

''అసురాణాం దుహితాసి సాదేవానా మసి స్వసా
దివస్పృథివ్యాః సంభూతా సాచకర్థార సంవిషమ్''

సాంఘిక లక్షణములు

ఇంక నిట్టివే కాక, మాతాపితృభక్తిని సోదరుల యైకమత్యమును దంపతుల యనురాగమును, మైత్రిని సత్యమును ధర్మ ప్రవర్తనమును బోధించునట్టి సూక్తములు ననేకములు కలవు. ఇట్టి వానినెల్లఁ జూచినపు డథర్వవేదము నాఁటి సంఘస్థితి గన్నులకుఁ గట్టినట్లు కనఁబడును. పృథివిని దాని గుణములను దాని యుపయోగమును వర్ణించునట్టి సూక్తమును, వరుణుని మహత్త్వమును బోధించు సూక్తమును, కోపోపశమన ముపదేశించు సూక్తమును, నాఁటి వారి ప్రపంచ

1. అథ. 2-14. 2—5.
2. 4-6-3, 4; 4. 7-1-2.

జ్ఞానము వెల్లడించుచుండును. తృతీయచతుర్థ కాండములలోని పెక్కు సూక్తములు గృహ నిర్మాణ పద్ధతులను, కృషి విధానమును బహువిధ ధాన్యములు పండించుటను, గోరక్షణ దీక్షను, చేసిన తప్పులకుఁ బ్రాయశ్చిత్తములను, వివరించుచు నాఁటి జనుల సాంసారిక పావనజీవనము నుగ్గడించుచుండును. మఱియు నుషస్సు సూర్యుఁడు ద్యులోకము మొదలగువాని వర్ణనలు నాఁటి విద్వాంసుల సృష్టి విషయక జ్ఞానమును దెలుపుచుండును. కాని, యన్నిటిని మించి 'మాశత్రువులకు హాని కలుగవలెను, మాకు మేలు కలుగవలెను' అను మాటలు మాత్రము సర్వవ్యాపకములై కనిపించును. ప్రతిపనియందును బ్రతికోరిక యందును బై యభిప్రాయము గోచరించుచునే యుండును. దీనినిబట్టి యథర్వ సూక్తములను దొలుత రచియింప నారంభించిన వారి యుద్దేశము పవిత్రమైనదే యైనను, పరాపకార పరాయణులును స్వోపకార పారీణులు నగువారు కొందఱపుడపుడు రచించిన సూక్తములు గూడ నిందు చేరుటచే నిది తుద కిట్టి ఘోరరూపము తాల్చియుండునని యూహింపవలసి వచ్చుచున్నది. ఇందు కాత్మలాభ పరహానిపరములైన యితర సూక్తముల మాట యటుంచి జ్ఞానబోధకముగాఁ గనవచ్చు వ్రాత్యకాండమునే యుదాహరణముగాఁ గై కొందము.

కతిపయకాండ విశేషములు

ఈ వేదమందలి పదియేనవ కాండమునకు వ్రాత్యకాండ మని పేరు. వ్రాత్య మహత్త్వ మెక్కువగా నుండుటచే దీనికి పేరు వచ్చినదనుట నిజము. ఇందలి సూక్తములు కడపటి రెండు కాండములలోని వానివలె నత్యంత మర్వాచీనము లనుటకు వీలులేదు. ఇందలి మంత్రములు గద్యమయములని కొందఱు భావించిరి గాని యది సరిగాదు. ఇందలి ప్రతిమంత్రము ఛందోబద్ధ మైనదేయని యనుక్రమణిక యిందలి మంత్రములకు నిర్దేశించిన సామ్నీపంక్తి - విరాడ్గాయత్రి - బ్రాహ్మీగాయత్రి - దైవీజగతి మొదలగు ఛందస్సుల వలనను, తదనుగుణమైన స్వరచిహ్నాదికమునను దెలియవచ్చు చున్నది. కాని యిందలి విషయ మథర్వవేద స్వభావమున కెక్కువగా సంబంధించినది గాక యిది యొక ప్రత్యేకోద్దేశముతో నిందు ప్రవేశించినట్లు కనఁబడును. ఇందుకుఁ దోడుగా నీకాండమందలి పదునెనిమిది పర్యాయ సూక్తములలోను మొదటి సూక్తమొకటి మాత్రమే పైప్పలాద సంహిత పదునెనిమిదవ కాండములోఁ గనవచ్చుచున్నది.[1] తక్కిన సూక్తము లాసంహిత

1. చూ. H. O. S. Vol. 8. P. 772.

విడిపోవునాఁటికి లేవో, ఉన్నను వాని నదిగ్రహింపలేదో, తెలియరాదు కాని, యెట్లైన నిది సర్వానుక్రమణీకాలమున కథర్వాంతఃపాతియై ప్రాచీనత గాంచిన దనుట సత్యము. అట్టి యీ కాండమునకు సాయణాచార్యులు భాష్యము వ్రాసిరో లేదో, వ్రాసినది నష్టమైనదో, చెప్పఁజాలము కాని దీని భాష్యము మాత్రము కనరాదు ఇది యిట్లుండఁ బరిశోధకులు విమర్శకులుఁ గూడ దీనిని గూర్చి పలు తెఱఁగుల నభిప్రాయపడి యున్నారు. వారిలో శంకర పాండురంగ పండితుల యభిప్రాయమును[1] సంగ్రహించి తెలుఁగునఁ జూపుచున్నాను.

'ఈ కాండమున వ్రాత్యమహిమ వర్ణింపఁబడినది. ఉపనయనాది సంస్కార హీనుఁడు వ్రాత్యుఁడనఁబడును. వాఁడు వేదవిహిత క్రియలాచరింప నధికారికాఁడు, సవ్యవహార యోగ్యుఁడు కాఁడు, అనెడి లోకాభిప్రాయమును మనసులో నుంచుకొని, వ్రాత్యుఁడు సర్వాధికారి సర్వోత్తముఁడు మహాత్ముఁడు దేవాది దేవుఁడనెడి యభి ప్రాయము లోకమున వ్యాపింపఁజేయుటకై యెవరో యిట్లు వ్రాత్యమహిమ వర్ణించి యుందురు. ఈ విశ్వమంతయు వ్రాత్యునితోనే యున్నదనెడి యుత్తమ ప్రశంస యిందు గనవచ్చును గాని, యిది వ్రాత్యులనందఱి నుద్దేశించి చెప్పినది కాదు. ఎవఁడో గొప్ప విద్వాంసుఁడును మహానుభావుఁడు పావనుఁడునగు పూజ్యుఁడైన వ్రాత్యుని వేదోక్త కర్మనిష్ఠులగు బ్రాహ్మణులు నిరసించుటగని యతని భక్తు లెవరో యీ వ్రాత్యమహిమ వర్ణించియుందురు.'

ఇత్యాదికముగా నున్న వీరి యభిప్రాయ మాధునికమేయైనను, ఇది యుక్తి యుక్తముగానే కనఁబడుచున్నది. లోకైక పూజ్యుఁడన్న యర్థమందు వ్రాత్యశబ్ద మెందును గనరాదు. మనుస్మృతి, తాండ్యబ్రాహ్మణము మొదలయినవి, ఉప నయన సంస్కార రహితుఁడు వ్రాత్యుఁడని చెప్పుచున్నవి. దీనినిబట్టి యార్యుల లోనే వేదోక్త కర్మలాచరింపని యొకతెగ క్రమముగా వెలసెననియు, ఆ తెగ వారిని వైదికులు వ్రాత్యులని నిరసించుచు వచ్చిరనియు వారిలో విజ్ఞానులు కొందఱు బయలుదేఱి సర్వోత్కృష్టమయిన వ్రాత్యవర్ణనము చేసియుండనదియే కాలక్రమమున నథర్వవేదమునఁ బ్రవేశించెననియుఁ దెలియవచ్చును. ఈ కాండ మధ్యాత్మ దైవత్యమగుటచే నార్యజనాదరణీయమై యీ వేదమున కలంకారముగా నున్నదనుట సత్యము. జ్ఞానబోధకమైన యీ కాండమును, యజ్ఞపరమైన కడపటి కాండమును దీని గౌరవమునకుఁ పరమ హేతువులనుట నిస్సంశయము. "వ్రాత్యుని

1. అథర్వసంహిత సభాష్యము, సంపుటము 4. బొంబాయి.

కుడికన్ను సూర్యుఁడు, ఎడమకన్ను చంద్రుఁడు, కుడిచెవి యగ్నిహోత్రుఁడు, ఎడమచెవి వాయువు. ముక్కు లహోరాత్రములు, శీర్షకపాలములు దిత్యదితులు. శిరస్సు సంవత్సరము, అట్టి వ్రాత్యునికి నమస్కారము'' అనెడి యర్థమిచ్చు కడపటి మంత్రములు వ్రాత్యుఁడు పరమేశ్వర స్వరూపుఁడని తెలుపుచున్నవి. దీనినిబట్టి యీ కాండ మధ్యాత్మ జ్ఞానబోధకమనుట స్పష్టము. కావున నీకాండము, వ్రాత్యనింద తొలఁగుటకై వ్రాత్యజాతి మహాపురుషులెవరో వ్రాత్యుఁడు సర్వజగద్రూపుఁడనెడి భావము వచ్చునట్లు వర్ణించినదైనను, లేక తక్కిన వేదములవలె నిది యాముష్మికబోధకము గాకున్నదను తలంపుతో నార్యజాతివారు రచియించినదైనను, మొత్తముమీఁద నిది యర్వాచీన మనుటకు మాత్రము సంశయములేదు.

పదుమూఁడవ కాండమునకు రోహితకాండమని పేరు. ఇందలి మంత్రములలో సుమారు సగము పైప్పలాద సంహిత పదునెనిమిదవ కాండమున నున్నవి. రోహిత వర్ణుఁడైన సూర్యదేవుని వర్ణించు నీ కాండము రోహిత రూపుఁడైన సవిత సకల జగన్నిర్మాణ కారణమనియు, సర్వప్రాణి రక్షకుఁడనియు, భూమ్యాకాశముల నియంతయనియు వర్ణించుచు, సృష్టి తత్త్వమును బోధించుచు, నతిమనోహరముగా నున్నది. ఇట్లనేకములైన వర్ణనలతోఁ గూడిన యీ సంహితలోఁ బామర రంజకములును, పరహింసా ప్రతిపాదకములునగు సూక్తములు కొన్నియున్నను; నీతి జ్ఞానదాయకములును, చతుర్వర్గ సాధకములునగు సూక్తములు ననేకములు లేపోలేదు. అందుచేతనే యిది చతుర్వేదములలో గణనకెక్కినది. కావుననే సకల సంహితలకు భాష్యము రచియించిన శ్రీ సాయణాచార్యులవారు తక్కిన వేదములు వలెనే యిదియును బ్రమాణమని నిరూపించుచు దీనికి భాష్యము వ్రాసియున్నారు. ఇట్లు చతుర్వేద సంహితల చరిత్ర మెఱింగిన మనము వేద విజ్ఞానమువలని ఫలము నీ క్రింది శ్లోకమునఁ దెలిసికొని యీ ప్రకరణము ముగింతము.

''ఛన్దస్స్కన్ధ శ్శాఖాశాఖో బ్రాహ్మో వృక్ష స్సాక్షి దేశః ।
యస్తం విద్యాత్స ఋషి ర్విప్రస్స స్వర్గచ్ఛే దాప్త్వా కీర్తిమ్.''

ఇది, ఆంధ్రభాషానుశాసనాంధ్ర దశరూపకాంధ్ర భవిష్య పర్వాద్యనేక కృతికర్తయగు మల్లాది సూర్యనారాయణ శాస్త్రి రచియించిన సంస్కృత వాఙ్మయ చరిత్రమందలి వైదిక వాఙ్మయమున షష్ఠాధ్యాయము

సప్తమాధ్యాయము

బ్రాహ్మణములు

మంత్రాత్మకమైన వేదము బ్రహ్మమనఁబడును. దానికి సంబంధించినది బ్రాహ్మణము. అనఁగా, మంత్రములను యజ్ఞాది క్రియలకు సమన్వయింపఁజేయు వ్యాఖ్యాన రూపమైన వాక్య గ్రంథము బ్రాహ్మణమని భావము. దీనిని బట్టియే మంత్ర బ్రాహ్మణాత్మకము వేదమనెడి లక్షణము సిద్ధమైనది. ఇదియే మంత్రము ముందును బ్రాహ్మణము తరువాతను బుట్టినదని తెలుపఁగలదు. బ్రాహ్మణములు వివిధములైన క్రతువులు విస్తరించిన కాలమందు ప్రబలి యజమానకుల మాశ్రయముగాఁ బ్రతిష్ఠ గాంచినవి, సాధారణముగా బ్రాహ్మణములందు విధి అర్థవాదము ఉపనిషత్తు అను మూఁడు భాగములుండును. కర్మ ప్రతిపాదకములు కర్మ విధాయకములు కర్మ స్వరూప బోధకములు నగు వాక్యములు విధులు. కర్మ ప్రరోచనాపరములయిన వాక్యము లర్థవాదములు. ఇతిహాసరూపములు సంవాదాత్మకములు తత్త్వవిచార పరములు బ్రహ్మ ప్రతిపాదకములునగు భాగము లుపనిషత్తులు.

పై భాగములన్నియు సమకాలికములుగాఁ గానరావు, ధర్మజిజ్ఞాస పెచ్చు పెరిగిన కాలమున బ్రాహ్మణములు జనించినవి. బ్రహ్మజిజ్ఞాస విస్తరించిన కాలమున నుపనిషద్భాగ మావిర్భవించినది. ఇట్లు త్రివిధములైన బ్రాహ్మణములు మంత్రముల యర్థము కర్మ పరముగా వివరించుటయే కాక తరువాత వెలువడిన వివిధ ధర్మ బ్రహ్మసూత్రములకు మార్గదర్శకములుకూడ నయినవి. బ్రాహ్మణములలో నందం దర్వాచీనములనఁదగిన భాగములు కొన్ని యున్నను, కర్మ ప్రతిపాదకమైన యందలి విజ్ఞాన మంతయు సంహితలనాఁటిదై ఋషి పరంపరనుండి క్రమముగా వచ్చినదే కాని యన్యము కాదు. మఱియు నిందలి యుపనిషద్భాగములు కూడ సంహితలలోని బ్రహ్మజ్ఞాన బీజమును మొలకెత్తించి పెంచినవి గాని దానిని క్రొత్తగా సృజింపలేదని సంహితలలో నందందు గనవచ్చు బ్రహ్మ ప్రతిపాదక మంత్రములే చెప్పక చెప్పుచున్నవి. అయినను గర్మకాండము నాముష్మికచింతయు నతిశయించిన కొలఁదిని నూతన విజ్ఞానముతోడి గ్రంథము కూడఁ గొంత బ్రాహ్మణములలో నవతరింపక పోలేదు. ఈ విషయమును ''పురాణప్రోక్తేషు బ్రాహ్మణ

కల్పేషు" అను పాణిని సూత్రము గూడ బలపఱుచుచున్నది. పాణిని నాఁటికి బహుపురాతనములని కొన్నిటికిని, అర్వాచీనములని కొన్నిటికిని వ్యవహారముకలదు కావుననే పురాణమహర్షి ప్రోక్తబ్రాహ్మణములని యతఁడు ప్రత్యేకించి వక్కాణింప వలసివచ్చినది. దీనినిబట్టి ప్రాచీన బ్రాహ్మణములు కొన్ని గలవని విదితమగును. అయినను బ్రాహ్మణములలో నందందు గనిపించు మనోరంజకములయిన కొన్ని యుపాఖ్యానములును గాథలును, కర్మాచరణము నందు భేద భావమును సూచించు చర్చలును, తమ తమ మతము స్థాపింప ఋషు లొనర్చినట్లున్న వాద ప్రతివాదము లును, అర్వాచీనములని యంగీకరింపక తప్పదు.

బ్రాహ్మణములు కేవలము కర్మోపయోగి మంత్రభావమును దెలుపునవియే కావు. అవి తత్తత్కాలము లందలి మత ధర్మములను వర్ణ వ్యవస్థలను సాంఘికా చారములను గూడఁ దెలియఁజేయుచున్నవి. వేదముల వలె బ్రాహ్మణములు ఛందో బద్ధములు కావు. ఇవి గద్య రూపములు. అయినను మంత్రముల వలెనే పఠన పాఠ వ్యవహార సిద్ధములైనవి. అందును దక్కిన బ్రాహ్మణముల కంటెఁ దైత్తిరీయ బ్రాహ్మణమును శతపథ బ్రాహ్మణము నెక్కువగా మంత్ర సదృశములేయై వన్నె గాంచినవి. ఆయా యాగములం దాయాఋక్కుల యుపయోగము ప్రతి పాదించు ఋగ్వేద బ్రాహ్మణము హోత చేయుకృత్యములను బోధించుచున్నది, అట్లే సామ వేద బ్రాహ్మణ ముద్గాతృ కృత్యములను, యజుర్వేద బ్రాహ్మణ మధ్వర్యు కార్య ములను అథర్వ బ్రాహ్మణము బ్రహ్మ కార్యములను బోధించుచున్నవి. అందుచే బ్రాహ్మణములకును యాగములకును, అఙ్గాఙ్గి భావము సిద్ధ మగుచున్నది. అట్టి యీ బ్రాహ్మణముల పౌర్వాపర్య మొకింత విచారింతము.

విషయ విషయక్రమ విషయ వివరణాదులను బట్టియు ముఖ్యోద్దిష్టమైన యజ్ఞ సంబంధమును బట్టియు సంహితోక్త విషయముతో నేకీభవించుట యను ప్రధాన గుణమును బట్టియు భాషాశైలిని బట్టియు విభిన్న కాలికములైన వర్ణనలను బట్టియు విచారింపఁగా బ్రాహ్మణములన్నియు నొక కాలమున జనించినవి కావనియే కాక తైత్తిరీయ బ్రాహ్మణ మన్నిటికంటెఁ బ్రాచీనమని తెలియవచ్చుచున్నది. ఇందుకు, దీనికున్న స్వర నియమమును, ఇందలి ప్రాచీన ప్రయోగ బాహుళ్య మును, ప్రౌఢమైన గద్యశైలియుఁ బ్రధాన కారణములు. ఇంతకంటెను నత్యుత్తమ మైన కారణము దీని యజ్ఞ జీవత్వము. తైత్తిరీయ బ్రాహ్మణము లేనిచో యజ్ఞము లేదనియే చెప్పవచ్చు నన్నంత యాత్యంతిక సంబంధము యాగముతో దీని కున్నట్లుగా నితర బ్రాహ్మణములకు లేదనుట యతిశయోక్తి కాదు. అందుచే

సంహితాత్రయి తరువాతఁ దత్తుల్యమై యావిర్భవించినదియు. నియతస్వరభాసుర మైనదియుఁ దైత్తిరీయమే యనుట యసంశయము. తక్కిన బ్రాహ్మణములలో సామవేద బ్రాహ్మణమైన తాండ్యము స్వరయుక్తమైనట్లు కొందఱు తలంచిరి గాని యాలక్షణము దాని లిఖిత ముద్రిత పుస్తకములందెందును గనరాదు. అయినను భాషారీతినిబట్టి యిది బ్రాహ్మణములలో రెండవదని చెప్పవచ్చును. ఇఁకఁ దక్కిన యైతరేయాదులన్నియు వీని యనంతర మాయా కాలములం దుదయించిన వనుట నిర్వివాదము. తైత్తిరీయేతరములకు విహితమైన స్వరము లేకున్నను, వానిని గూడ వైదికలోక మేదో యొక విలక్షణమును శ్రుతిరమ్యమునైన స్వరముతోనే పఠించుచుండును గాని యది సహజమును స్వరలక్షణబద్ధమును గాదనుట నిజము. ఇట్టి బ్రాహ్మణములలోఁ దైత్తిరీయ మాద్య మగుట ముందు గ్రహింపఁదగిన దైనను, అభ్యస్తమైన సంహితాక్రమమున కనుగుణముగా బ్రాహ్మణ క్రమమును మార్చుకొని పరిశీలింతము.

ఋగ్వేద బ్రాహ్మణములు:— వీనిలో మొదట గణింపఁదగిన దైతరేయ బ్రాహ్మణము. ఇది యెనిమిది పంచికలుగా విభజింపఁబడినది. ఒక్కొక్క పంచిక కైదుచొప్పున నిందు నలువది యధ్యాయములు గలవు. శాకల్య శాఖ కెక్కువగా సంబంధించిన దీనికి బహ్వృచ బ్రాహ్మణ మనియుఁ బేరు గలదు. దీని కైతరేయ మను పేరు వచ్చుటకుఁ గారణమైన సంప్రదాయ విదులయాఖ్యాయికను సాయణా చార్యులు దీని భాష్యము నవతారికలో నుదాహరించి యున్నారు. దాని భావమిది.

"ఒకానొక మహర్షికిఁ బెక్కండ్రు భార్యలు కలరు వారిలో, ఇతర యను పేరు గల ధర్మపత్నియందు మహీదాసుఁడను పుత్రుఁ డుదయించెను. కాని యా మహర్షికిఁ దక్కిన భార్యల పుత్రులయం దున్నట్లుగా నీ కుమారుని యందు ప్రేమ లేదు. దీనికిఁ దగినట్లుగా నొకనాఁటి యాగసభలో నతఁడు మిగిలిన కొడుకులను దనయొడిలోఁ గూర్చుండఁ బెట్టుకొని మహీదాసుని దన చెంతకైనఁ బిలువక యవమాన పఱిచెను. అపుడితరాదేవి ఖిన్నవదనుఁడై యున్న మహీదాసు నెత్తు కొని లాలనచేసి తన కులదేవతయైన భూదేవిని స్మరించెను. అంత భూదేవి దివ్యాంగనా రూపముతోఁ బ్రత్యక్షమై మహీదాసుని కొక దివ్య సింహాసన మిచ్చి యందతనిఁ గూర్చుండఁ బెట్టి సర్వాతి శాయియైన పాండిత్యము కలుగునట్లు వర మిచ్చెను ఆ వరమును ఒట్టి యామహీదాసుని నోటనుండి 'అగ్ని ర్వై దేవానా మవమః – ఇత్యాదిగా, 'ఏనం స్తృణుతే స్తృణుతే' ఇత్యంత మగు చత్వారింశద

ధ్యాయాత్మకమైన గ్రంథ మావిర్భవించెను. మఱియు, మహావ్రత మిత్యాదికమును ఆచార్యాఇత్యన్తమునైన యారణ్యక వ్రతరూప గ్రంథము నావిర్భవించెను."

ఇట్లు మహత్త్వ ప్రశంసా పరముగా నున్న యీ యాఖ్యాయికను బట్టి యితరాపుత్రుఁడైన మహీదాస మహర్షి కర్తగా, ఐతరేయ బ్రాహ్మణమును, ఐతరేయారణ్యకమును వెలసినట్లు తెలియవచ్చుచున్నది. ఈ బ్రాహ్మణము ననుసరించి యాగాదు లొనరించు బహ్వృచు లైతరేయులనెడి వాడుక తరువాత లోకమున వ్యాపించినది.

ఈ బ్రాహ్మణ మందలి మొదటి పదునా ఱధ్యాయములును సోమయాగ విషయకములు. ఇందే కాహసాధ్యమైన యగ్నిష్టోమమును, హోతృ కృత్యములును, అగ్నిష్టోమ విచారణ, ఉక్థ్యము షోడశి యను జ్యోతిష్టోమ భేదములును దెలుఁప బడినవి. తరువాత రెండింటిలో నతి రాత్రములతోఁ గూడిన గవామయనము వర్ణింపఁ బడినది. తరువాతియాఱింటిలో ద్వాదశాహక్రతు విశేషములు వర్ణింపఁ బడినవి. అటుపిదప నెనిమిదింటిలో, అగ్నిహోత్రము యజమాన బ్రహ్మ కర్తవ్యములును, గ్రావస్తుత్తు సుబ్రహ్మణ్యుడు మైత్రావరుణుఁడు బ్రాహ్మణాచ్ఛంసి అచ్ఛావాకుఁడు ననుఋత్విక్కుల కృత్యములును మొదలయినవి వర్ణింపఁబడెను. కడపటి యెనిమిదింటిలో రాజసూయము మహారాజ పట్టాభిషేకము రాజ పురోహిత ప్రశంస మొదలయినవి కలవు.

ఇట్లున్న నలువది యధ్యాయములలోను గడపటి యధ్యాయములు పదియు నర్వాచీనములుగాఁ గనఁబడుచున్నవి. ఇందుకుఁ గొన్ని కారణములు. ఇందలి మొదటి ముప్పది యధ్యాయములోని విషయము ననువదించిన శాంఖాయిన బ్రాహ్మణము దీని కడపటి దశాధ్యాయిలోని విషయము నించుకయు సంగ్రహింపలేదు. కాని శాంఖాయన సూత్రమునందు దాని ప్రసక్తి కలదు. అందుచే శాంఖాయన బ్రాహ్మణము నాఁటి కైతరేయములోని తుది దశాధ్యాయి లేదనియు దాని సూత్రము నాఁటి కది యుదయించి యుండుననియుఁ దెలియవచ్చును. మఱియు ౩౧-౩౨- అధ్యాయములలోని పశువిభాగము, ప్రాయశ్చిత్తము తద్విషయక ప్రశ్నోత్తరములు, మొదలయినవి పూర్వాధ్యాయములలోని విషయములకుఁ బరిశిష్టములుగా నున్నవి కాని ప్రత్యేక విషయములుగా లేవు. తరువాత యధ్యాయములలోని శౌనశ్శేపాఖ్యానములును రాజ కర్తృక క్రియల ప్రత్యేక వర్ణనములును రాజాభిషేకోత్సవములును రాజ పురోహితాధికారములును, విషయమును

బట్టియు భాషాగతిని బట్టియుఁ గూడ నర్వాచీనములుగానే కనఁబడుచున్నవి. అందుచే నీ బ్రాహ్మణమందలి చతుర్థ భాగము తక్కిన మూఁడు భాగములకు సమ కాలికము కాదని తోఁచుచున్నది.

మంత్ర బ్రాహ్మణము - ఈ పేర ఋగ్వేదమునకు సంబంధించిన బ్రాహ్మణ మొకటి యున్నది. ఇది యెందును వ్యాపించినట్లు కనరాదు కాని పూనా దక్కను కాలేజీలోని లిఖిత పుస్తక భాండాగారమున దీని వ్రాఁత ప్రతి యొకటి యున్నది. ఇదైతరేయ బ్రాహ్మణములోని కొన్ని యధ్యాయముల యందలి గ్రంథ మట్లే యున్నది. అందలి కొన్ని యధ్యాయముల గ్రంథ మిందు కనరాదు. అందుచే నెవరో యైతరేయములోని కొంత గ్రంథమును వేఱుచేసి యీ పేరు పెట్టి యుందురని యూహింప వచ్చును గాని, యిందు మొదటి మూఁడు పంచికలలో నక్కడక్కడ నాఱు ఖండికలందున్న గ్రంథ మైతరేయములో నెక్కడను గన రాకున్నది. అందుచే నైతరేయము నుండి యేర్చి కూర్చిన కొంత గ్రంథమును నూతనమైన యీ గ్రంథమును గలసి మంత్ర బ్రాహ్మణ సంజ్ఞతోఁ గొంత దేశమున నొకప్పుడు వ్యవహారములో నున్నట్లు విశ్వసింపవలసి వచ్చుచున్నది. ఇందును మొదటి వాక్య మైతరేయములో నున్నట్లే 'అగ్ని ర్వై దేవానా మవమః' ఇత్యాదికముగానే యున్నది. ఇందలి మొత్తము గ్రంథము సుమారు నాలుగు వేలు.

కౌషీతకి బ్రాహ్మణము—ఇది శాంఖాయన మను మాఱు పేర లోకమునఁ బ్రసిద్ధి కెక్కినది. ఇది ముప్పది యధ్యాముల గ్రంథము. ఇందు మొదటి పదియే నధ్యాయములు పూర్వార్థము, తక్కినవి పదియే నుత్తరార్థము. ఈ బ్రాహ్మణము ఋగ్వేద శాంఖాయన బాష్కల శాఖలకు సంబంధించినది ఐతరేయములోని ముఖ్య విషయములే యిందు సవిస్తరముగా వర్ణింపఁబడినవి. కావున నిదియును సోమ యాగములకుఁ గావలసిన హౌత్రాది కృత్యములను దెలుపుచున్న దనుట సత్యము. కాని యిందలి విషయ క్రమము విభిన్నముగా నున్నది. ఇందు అగ్న్యాధానము అగ్నిహోత్రము దర్శపూర్ణ మాసములు కామ్యేష్టులు చాతుర్మాస్యములు మొదలగు విషయములు క్రమముగాఁ గనవచ్చును. విశదముగా వివరముగా నున్న యిందలి విషయముల యేర్పాటే యిది యైతరేయమునకుఁ దరువాతఁ బుట్టిన దనుటకు నిదర్శన మగుచున్నది. ఇందలి గ్రంథ సంఖ్య సుమారు మూడు వేలుండును.

ఈ శాంఖాయన బ్రాహ్మణమున నందందు విషయచర్చ వచ్చినచోట్లఁ గౌషీతక పైంగ్యతమములు రెండును గూడ గ్రోడీకరింపఁబడుటయు.[1] అందు కౌషీతక మతమే గ్రహింపఁబడుటయుఁ గనవచ్చును. దీనినిబట్టి కౌషీతక మతానుసారియైన దీనికిఁ గౌషీతకి యనుపేరు వచ్చినదనియే కాక, పైంగ్య మనుపేర మఱియొక బ్రాహ్మణము కలదేమోయని సందేహము కలుగుచున్నది. ఇందుకు సాయణాది వ్యాఖ్యాత లక్కడక్కడ 'ఇతి కౌషీతకమ్' అనునట్లే 'ఇతి పైంగ్యమ్' అనుట కూడఁ దోడ్పడుచున్నది. కాని, పాణినీయమతమునుబట్టి 'పైంగీకల్పః' అని పింగమునిప్రోక్తమైన కల్ప సూత్రమున్నట్లు తెలియవచ్చు చున్నది. కాని పైంగ్యబ్రాహ్మణమున్నట్లు తెలియరాదు. అందుచే నందందు వచ్చు చర్చలలో నుదాహరింపఁబడినది పింగమునిమతమే కాని, ఆ మతము గ్రంథరూపము దాల్చిన బ్రాహ్మణము కాదేమోయని తోఁచుచున్నది. ఎట్లయినను, బ్రాహ్మణ విషయమునఁ బైంగిమతమొకటి పురాతనమైనది కలదని విశ్వసింప వచ్చును. ఈ కౌషీతకి పైంగ్యనామములు రెండును గూడ నైతరేయమున నొకచోటఁ గనవచ్చునుగాని యవి తరువాత నెవరో యందు చేర్చిన వనుట నిర్వివాదము గావున నంతమాత్రమున శాంఖాయన మైతరేయమునకుఁ బూర్వ మని కాని సమకాలికమని తలంపరాదు.

ఈ బ్రాహ్మణమునఁ బెక్కుచోట్లఁ గనవచ్చు 'ఇతి హస్మాహ కౌషీతకిః' అను వాక్యమును బట్టి కౌషీతకి మహర్షియే పరమతము లుద్ఘాటించుచు నంత్య నిర్ణయముగా స్వమత మావిష్కరించినట్లు తెలియవచ్చుచున్నది గావున నతఁడే యీ బ్రాహ్మణమును రచియించిన ఋషియని తోఁచుచున్నది. ఇది శాంఖాయన శాఖకుఁ గూడ సంబంధించిన దగుటచే శాంఖాయన మను పేరు గూడ దీనికి వచ్చినను, కర్త యతఁడేయని గ్రంథవిషయ నిర్ణయమునుబట్టి గ్రహింపవచ్చును, ఇందలి మొదటి వాక్యము - అస్మిన్వై లోక ఉభయే దేవమనుష్యా ఆసు స్తే దేవాః స్వర్గం లోకం యన్తో ఽగ్ని మూచుః'— ఇత్యాదిగా నున్నది.

ఇట్లున్న యైతరేయ కౌషీతకి బ్రాహ్మణములు రెండును యాగవర్ణనల కంటె నెక్కువగా నుపాఖ్యానముల వల్లనే వాఙ్మయ ప్రియులహృదయ మాకర్షించుచున్న వనుట సత్యము. అందైతరేయములోని శౌనశ్శేపాఖ్యాన మింతకు మున్ను కొంత యుదాహరింపఁబడినది, దాని శేషమిది.

1. బహ్వృచవ దే వైన్ద్రి ఇతి త్వేవ పైఙ్గ్యస్య స్థితి రా వైన్ద్రాగ్న ఇతి కౌషీతకిః—కౌషీ. బ్రా. 16, అధ్యా. ఇతి పైంగ్యమ్. ఇతిహ స్మాహ కౌషీతకిః. 24 అధ్యా.

"హరిశ్చంద్రుని యాగమందు యూపబద్ధుడై తండ్రియైన యజీగర్తునిచే హింసింపఁబడుటకు సిద్ధుఁడుగా నున్న శునశ్శేపుడు ప్రజాపత్యాది దేవతలను బ్రార్థించి వారి యనుగ్రహమువలన బంధ విముక్తుఁడయ్యెను. అపుడు విశ్వామిత్రాదులతని మహత్త్వమున కచ్చెరువొంది యాయజ్ఞము సమాప్తి గావింపుమని యతనిని గోరిరి. అతఁడట్లే యొనరించిన పిదప నిఁకమీఁద నీ వెవరి పుత్రుడవుగా నుందువని ఋషులడిగిరి. అపుడు శునశ్శేపుఁడు చక్కగా నాలోచించి వచ్చి విశ్వామిత్రుని తొడమీఁదఁ గూర్చుండెను. దానినిబట్టి యతఁడు విశ్వామిత్రుని కొడుకనిపించు కొనుట కిష్టపడెనని తెల్లమైనది. అంత నజీగర్తుడు విశ్వామిత్రుని జూచి, మునీంద్రా! ఇతఁడు నా పుత్రుఁడు వీనిని మరల నాకిమ్మని కోరెను. అపుడు విశ్వామిత్రుఁ 'డయ్యా! ఈ బాలుని బ్రజాపత్యాది దేవతలు రక్షించి నాకిచ్చినారు. కావున నేనితని నివ్వనని పలికెను. శునశ్శేపుఁడు దేవతలచే నియ్యఁబడిన వాఁడు గావున నాఁటినుండి దేవరాతుఁడను సంజ్ఞ చెందెను.

అనంతర మజీగర్తుఁడు శునశ్శేపుని జూచి 'నాయనా! మన యింటికిఁ బోవుదము లేచిరా. నీవు జన్మచే నాంగిరస గోత్రుఁడవు. అజీగర్త పుత్రుఁడవు. విద్వాంసుఁడవు. మంత్ర దర్శనమున ఋషివై పొగడ్త గాంచితివి, కావునఁ బుట్టిన గోత్రము విడిచి యితర గోత్రమునకుఁ బోవలదు. నా మాట మన్నింపుము రమ్ము! అనెను, అంత దేవరాతుఁడు' అయ్యా! నన్నుఁ జంపుటకు నీవు కత్తి యెత్తుట యందఱు చూచి యున్నారు. శూద్ర జాతిలోఁ గూడఁ గనవినరాని క్రూరకృత్యమున కీవొడి గట్టితివి. నన్ను విక్రయించి మూఁడు వందల గోవుల నార్జించితివి. ఇది యొక నీచకృత్యము, కావున నేను నీతో రాను' అని స్పష్టముగాఁ జెప్పెను. అపుడు తండ్రి 'కుమారా! నేను జేసిన తప్పులు నా మనస్సును దహించుచున్నవి. నేను పుచ్చుకొన్న గోవుల నెల్ల నీకుఁ బ్రత్యేకముగా నిచ్చి వేయుచున్నాను. రమ్ము' అని పలికెను, ఆ మాటలు విని పుత్రుడు 'ఓయీ! ఒక పురుషుఁడు ధర్మ శాస్త్రభీతిని, పాప భీతిని విడిచి పాపము చేసెనేని వాఁడు మరల నభ్యాసవశమునఁ బాపము చేయుచునే యుండును. నీవు నీచజాతి వానికంటెను గనిష్ఠుఁడవై చేసిన ఘోరకార్యము నేసు నీ వద్దకు మరల రాఁదగినది కాదు. ఆ పాపము ప్రతి సమాధేయము కాదు కావున నన్ను వదలుకొను' మని తండ్రి కోర్కి నిరాకరించెను, అంత విశ్వామిత్రుఁడు దేవరాతా! నీవు చెప్పినది నిజము, ఇతఁడు చేసిన పాపము ప్రతి సమాధేయము కాదు. నీవు వెళ్లవద్దు, నాకుఁ బుత్రుడవై నాయొద్దనే యుండు' మనెను, అపుడా ఋషిబాలుఁడు "మహర్షీ నీవు పూర్వము నీక్షత్రియత్వమును

బ్రాహ్మణ్యముఁగా మార్చుకొని యుంటివి, ఇపుడు నాయాంగిరసత్వమును వైశ్వామిత్రముగాఁ మార్ప నీవే యర్హుఁడవు. నీ కొడుకు లందఱితోను నన్నుఁ దమ జ్యేష్ఠభ్రాతనుగాఁ జూడవలెనని చెప్పుము,' అని పలికెను. అంత విశ్వామిత్రుఁడు మధుచ్ఛందసుఁడు మొదలగు కొడుకులకందఱిని బిలిచి 'ఓరీ! మీరెల్లరు నీ దేవరాతుని జ్యేష్ఠభ్రాతనుగాఁ జూడవలసినదని యాజ్ఞాపించెను.

విశ్వామిత్రుని కేకశతపుత్రులు గలరు, వారిలో మధుచ్ఛందసుఁడు నడిమి వాఁడు. వానికంటెఁ బెద్దవారేఁబది మంది, చిన్నవాళ్లేఁబది మంది, అందు పెద్ద వాండ్రేఁబది మందియుఁ దండ్రిశాసన ముచితముగాదని నిరాకరించిరి. అంత నమ్మహర్షి కోపగించి 'తా ననువ్యాజహా రాన్తాన్వః ప్రజా భక్షీష్టేతి' ఓరీ! మీ పుత్రాదులు నీచజాతి విశేషములలోఁ గలసి పోవుదురుగాక యని శపించెను. అట్లు శపింపఁబడినవారు, ఆంధ్రులు పుండ్రులు శబరులు పుళిందులు మూతిబులు ననుపంచవిధ నీచజాతి విశేషులైరి, బహువిధులైన యా విశ్వామిత్ర సంతతి జాతులే తస్కరులైన దస్యులలో నత్యధికులైరి.

అట్లు తమ యన్నలకు సంభవించిన శాపము తెలిసిన మధుచ్ఛందనుఁడు మొదలగు తక్కిన వైశ్వామిత్రులందఱును జనకుని యానతి తలఁ దాల్చి శున శ్శేపుఁడు తమ జ్యేష్ఠ సోదరుడుగా నుండుట కంగీకరించిరి. విశ్వామిత్రుఁడును సంతోషించి వారికి హిత ముపదేశించెను."

ఇట్లున్న యీ కథ యందలి తుది భాగమునుబట్టి తొలుత నార్యజాతివారయిన విశ్వామిత్ర పుత్ర సంతతివారు శాపముచే నంధ్రాది పంచవిధనీచ జాతుల వారయి నట్లును, అందలి యంధ్రుల సంతతి వారే మన దేశ మందలి ప్రాచీన నివాసులైన యాంధ్రులయినట్లును గొందఱు చరిత్రకారులూహించియున్నారు. ఆంధ్రులనెడి యొక జాతి యున్నదనుటకు మొదటి యాధారమయిన పై వాక్యమును బట్టియు ఆంధ్రులకు నివాసమయిన యీ జనపద మంధ్రసంజ్ఞ చెందినట్లు కనఁబడుటను బట్టియుఁ బైయూహ యుచిత మని భావింపవచ్చును గాని, వైశ్వామిత్ర సంతత్యంధ్రు లప్పటికి దేశమందున్న నీచ జాతులలోఁ గలసిపోయినట్లు పై శాపము వల్లఁ దెలియవచ్చుటచే వారిజాతి నీచజాతి మిశ్రమైన దనియు వారి యార్యత్వము శాపము చేతనే కాక సాంకర్యముఁచే గూడ నిర్మూల మైనదనియుఁ జెప్పకతప్పదు.

భరతాభిషేక మాహాత్మ్యవర్ణనలో. "దుష్యంతపుత్రుఁడైన భరతచక్రవర్తి మష్టారదేశమం దసంఖ్యాకములైన గజములను, సాచిగుణ దేశమం దగ్నిచయన

మనుయాగ మాచరించి వేలకొలఁది బ్రాహ్మణులకు లెక్కలేని గోవులను దానము చేసె ననియు, యమునాతీరమందు డెబ్బదియెనిమి దశ్వమేధ యాగములను గంగాతీరమందు యేఁబదియైదు హయమేధములును జేసె ననియుఁ గలదు."

"వసిష్ఠగోత్రుఁ డైనసాత్యహవ్యుఁ డనుఋషి జనంపతిపుత్రుఁడైన యత్యరాతియను బ్రాహ్మణున కైంద్రమహాభిషేకవిద్య నుపదేశించెను. దానిమహిమ వలన నతఁడు క్షత్రియుఁడు కాకపోయినను బెక్కండ్రు రాజులను జయించి దేశము లార్జించెను. అంత గురు వొకనాఁడు శిష్యుని యొద్దకు వచ్చి నా విద్యవలన భూమి యార్జించితివి కావున నా కైశ్వర్యము కలుగఁజేయుమని కోరెను. అంత నత్యరాతి 'గురువర్యా ! ఉత్తరకురుభూములను జయించినపిదప నిన్నుఁ బృథివికి రాజును జేసి నేను సేనానాయకుఁడ నయ్యెద' నని బదులు చెప్పెను. అది విని గురువు 'ఓయీ! మేరువున కుత్తరభాగము దేవక్షేత్ర మనఁబడును. దానిని మనుష్యులు జయింపఁ జాలరు నాకు ద్రోహము తలఁచి యేదో యొక నెపము పెట్టి నాకోరిక వ్యర్థము చేసితివి గావున నీ కిచ్చిన విద్యాశక్తిని మరల నాకర్షించుచున్నా" నని చెప్పి వెడలి పోయెను. అపుడు శక్తిహీనుఁ డైనయరాతిని శిబిపుత్రుఁ డైనశుష్మిణుఁ డనురాజు సులభముగా నోడించి యతని రాజ్యము తీసి కొనెను "[1] ఇత్యాదికముగా నభిషేక మాహాత్మ్యమును బురోహిత ప్రభావమును దెలుపుగాథ లెన్నో కలవు.

కౌషీతకి బ్రాహ్మణములోని కవషగాథ పూర్వ ముదాహరింపఁబడినది. ఇందలి షష్ఠాధ్యాయమునకు సరస్వతీకాండ మను పేరు గలదు. అందు ప్రజాపతి తపశ్శక్తివలన నగ్నివాయు సూర్యచంద్రాదు లుదయించినట్లును, భవశర్వపశుపతి మహాదేవాది సంజ్ఞలు గల దివ్యమూర్తి కతఁడే మూలకారణ మయినట్లును, జెప్పెడి చిన్న చిన్న కథ లనేకము లున్నవి.

సామవేద బ్రాహ్మణములు :— ఇవి యెనిమిది విధములు. "అష్టౌహి బ్రాహ్మణాగ్రంథాః ప్రౌఢం బ్రాహ్మణ మాదిమం! షడ్వింశాఖ్యం ద్వితీయం స్యాత్తతః సామవిధి ర్భవేత్। ఆర్షేయం దేవతాధ్యాయో భవే దుపనిషత్తతః। సంహితోపనిష ద్వంశో గ్రంథా అష్టా వి తీరితాః॥

అనెడి వంశబ్రాహ్మణ వ్యాఖ్యానములోని శ్లోకములనుబట్టి, ప్రౌఢము - షడ్వింశము - సామవిధి - ఆర్షేయము - దేవతాధ్యాయము - ఉపనిషత్తు - సంహితోపనిషత్తు - వంశము అను నెనిమిదియు సామబ్రాహ్మణములని విదితమగు

1. ఐ. బ్రా.— 39 9 —2. కౌ. బ్రా. 12. అధ్యా.

చున్నది. వీనికొక నియతస్వరము లేదని తంత్రవార్తికమునఁ గనఁబడుచున్నది.[1] వీనిలో ప్రౌఢబ్రాహ్మణమునకు మహాబ్రాహ్మణము తాండ్యబ్రాహ్మణము పంచవింశబ్రాహ్మణము నను నామాంతరములు కలవు. ఇది యన్నిటిలోను గ్రంథపరిమాణముచేతనే కాక గుణముచేతను విషయముచేతనుగూడ నుత్తమమై మహాబ్రాహ్మణమనెడి నామాంతరమును సార్థకము గావించుచున్నది. ఇది యిరువదియైదధ్యాయముల గ్రంథము. ఇందు ౩౨౦ ఖండములు గలవు. ఇందలి గ్రంథసంఖ్య సుమారు నాలుగువేలు.

దీని కనుబంధముగాఁ దరువాత బయలుదేఱిన యిరువదియాఱవ యధ్యాయమే షడ్వింశబ్రాహ్మణ మనఁబడుచున్నది. అందు ౬ ప్రపాఠకములు ౬౮ ఖండములు ౫౦౦ గ్రంథములు గలవు. వాస్తవముగా నిందలి ప్రపాఠకములైదే కాని కొన్ని ప్రతులలోఁ గడపటి ఖండములు రెండును (౪౬-౪౮) అద్భుతబ్రాహ్మణమను పేర వేఱొక ప్రపాఠకముగాఁ గనవచ్చుచున్నవి.

మహాబ్రాహ్మణమునందలి ౧—౧౦ అధ్యాయములు దశరాత్ర కాండమనియు, ౧౧—౧౫ అధ్యాయములు ద్వాదశాహ కాండమనియు, ౧౬—౧౯ అధ్యాయము లేకాహకాండమనియు, ౨౦—౨౨ అధ్యాయము లహీన కాండమనియు, ౨౩—౨౫ అధ్యాయములు సత్రకాండమనియుఁ జెప్పఁబడుచున్నవి. కాని కొన్ని వ్రాత ప్రతులయందు గనవచ్చెడి యీ సంజ్ఞలు భాష్యమునఁ గనరావు. ఇందు ప్రథమాధ్యాయమున నౌద్గాత్రస్తుతియు ద్వితీయ తృతీయాధ్యాయముల స్తోమప్రకారములును, చతుర్థాధ్యాయము మొదలుగా గవామయనాదులును వర్ణింపఁబడినవి. ఈ బ్రాహ్మణమున నితర యాగముల ప్రశంసకూడనున్నను గవామయనమే యిందు ప్రధానమైనది. కడపటి మూఁడధ్యాయములందు మాత్రము ద్వాదశరాత్ర సత్రము మొదలుగా సహస్ర సంవత్సరసత్రము వఱకుఁ గల వివిధ సత్రయాగములు వివరింపఁబడినవి. ఐతరేయాదులందువలెనే యిందును కురు పాంచాల దేశముల ప్రసక్తియందందు గనవచ్చును. పైగా సరస్వతీ దృషద్వతీ నదుల మధ్య దేశమున బహుయాగము లాచరింపఁబడినట్లు పాఖ్యానములవల్లఁ దెలియవచ్చును.

సామ బ్రాహ్మణములలో, తాండ్యము ప్రధానమైనది. సామవిధి బ్రాహ్మణములో, ఈ బ్రాహ్మణమును బ్రజాపతి బృహస్పతికిని, అతఁడు నారదునికిని,

1. బ్రాహ్మణానిహి యా న్యష్టౌ సరహస్యా న్యధీయతే
ఛందోగా స్తేషు సర్వేషు న కశ్చి న్నియతస్వరః. తం. వా. 1-3-1.

అతఁడు విష్వక్సేనునికిని, అతఁడు పారాశర్య వ్యాసునికిని, అతఁడు జైమినికిని, అతఁడు పౌష్పింద్యునికిని, అతఁడు పారాశర్యాయణునికిని, అతఁడు బాదరాయణునకును, అతఁడు తాండి శాట్యాయనులకును, వారు తరువాతఁ బెకక్రంద్రకుఁ జెప్పినట్లార సంప్రదాయము కనవచ్చుచున్నది. దీనినిబట్టి తాండిమహర్షి ప్రోక్తమైన యిది తాండ్యమను పేరు చెందినట్లు తెలియవచ్చును. దీనికిఁ దోడుగా బ్రాహ్మణ ప్రవచన కర్తలలో శటి - భాల్లవి - తాండి — మొదలగువారిని వంశబ్రాహ్మణము చూపుచున్నది. కాని, బ్రాహ్మణ ప్రవక్తలైన పురాణమునులనుగా భల్లుశాట్యాయనులను బాణినీయ సంప్రదాయము దెలుపుచున్నది. దీనినిబట్టి చూడఁగా సామబ్రాహ్మణమున భాల్లవి శాట్యాయన శాఖలున్నట్లు విదితమగును. ఒకచోటఁ దాండ్యబ్రాహ్మణమున భాల్లవిశాఖుల మతముగూడఁ గనవచ్చుచున్నది. కాని, పాణినీయ సంప్రదాయము పేర్కొనిన యీభల్లుశాట్యాయనుల పేర సామబ్రాహ్మణమెందును గనరాదు. ఇది యంతయుఁ బరిశీలింపఁగా బ్రాహ్మణ ప్రవక్తలు భల్లశాట్యాయనులే యనియు, దానిని బ్రవర్తింపఁ జేసినభాల్లవి తాండి మొదలగువారిని వంశబ్రాహ్మణము ప్రవక్తలలోఁ జేర్చియుండుననియు, ప్రవర్తకులలోఁ దాండి ప్రసిద్ధుఁడగుటచే నతనిపేర నిది ప్రసిద్ధికెక్కెననియుఁ బ్రవర్తకాంతరు లయిన భాల్లవుల మతముగూడ నందందు తాండ్యబ్రాహ్మణము చూపుచు వచ్చెననియుఁ దోఁచుచున్నది. ఎట్లయినను భల్లుశాట్యాయనులు విశేషముగా సామబ్రాహ్మణమునకు సంబంధినట్లు కనవచ్చుచుండఁగా వీరు కృష్ణయజుర్వేద బ్రాహ్మణమునకు సంబంధించిన వారని వీబరుపండితుఁ డూహించుటయైన నెట్టిదో విచారణీయము.

ఈ పంచవింశ బ్రాహ్మణమున కనుబంధముగానున్న షడ్వింశబ్రాహ్మణము కూడ యజ్ఞార్థముగా నున్నను, ఇందొక విశేషము కలదు. సూర్యుఁడు సుబ్రహ్మ శబ్దవాచ్యుఁ డని ప్రారంభించిన దీనిలో నాదిత్య విషయకస్తుతి యధికముగాఁ గలదు. కడపటి దగునద్భుత ప్రపాఠకమునందు దేవతా విశేషుల నవ్వుచు నేడ్చుచుఁ బాడుచు నాడుచు వివిధావస్థ లనుభవించున్నట్లు వర్ణింపఁబడియున్నది. ఇవి యన్నియు సూర్య దేవతా సంబంధము లయినఅద్భుతకృత్యము లైనట్లుగా నిందలి "తా న్యేతాని సర్వాణి సూర్యదైవత్యా న్యద్భుతాని ప్రాయశ్చిత్తాని భవంతి" ఇత్యాదివాక్యముల వలనఁ దెలియనగును. సర్వపాపశమనుఁడు సర్వగ్రహాధిపతి యగునీశ్వరుఁడు సూర్యుఁడే యని యిది బోధించును.

మూఁడవది యగుసామ విధాన బ్రాహ్మణము మూఁడు ప్రపాఠకముల చిన్న గ్రంథము. 'ముందు బ్రహ్మ ముండెను. తత్తేజమే బ్రహ్మ యయ్యెను. అతఁ

దూరక మనస్సున ధ్యానించెను. దానివలనఁ బ్రజాపతి యుదయించెను.' అని యారంభించి యిది ప్రాజాపత్యవిధి నత్యంతము వర్ణించెను. ఇది యాగ క్రియాదులను బోధించుటకంటె నభిచారకర్మానుష్ఠేయము లైన మంత్రముల నెక్కువగా నుపదేశించుచున్నది ఇందలి విషయమునుబట్టి చూడఁగా నిది మిక్కిలి యర్వాచీనమని విదిత మగుచున్నది.

నాల్గవది యార్షేయ బ్రాహ్మణము. ఇఁతకు మున్నుదాహరించిన భాష్యశ్లోకమీపేరే గణించినను, ఇది దీని మొదటి పేరు గాదు, ఇది సంపూర్ణమైన గ్రంథము కాదు. దీని నిజ చరిత్ర మిది :—

ఆర్షేయ బ్రాహ్మణము కౌథుమ మనియు, జైమినీయము లేక, తలవకారమనియు ద్వివిధముగా వ్యవహరింపఁబడెడిది. ఈ రెంటికిని గూడ నార్షేయము లేక, ఆర్షబ్రాహ్మణ మనుపే రున్నట్లు కనబడుచున్నది ఇందు కౌథుమార్ష బ్రాహ్మణము మూఁడు ప్రపాఠకముల గ్రంథము, దీనిని బర్నెలు పండితుఁడు 1876లోఁ బ్రకటించెను. తరువాతనతనికి జైమినీయములేక తలవకారమనెడి యార్షేయబ్రాహ్మణము లభించినది. దీనినిగూడ నతఁడే 1878 లోఁ బ్రకటించెను. ఇదియైదు ప్రపాఠకముల గ్రంథము. కేవల మార్షేయబ్రాహ్మణముతో నున్నదీని వ్రాఁతప్రతులు తంజావూరు పుస్తకాలయమందును, పూనాకాలేజి పుస్తకాలయమందును గలవు గాని, యీ రెంటిలోని వానియందలి ప్రపాఠకసంఖ్యయు, విషయము గూడ భేదించుచున్నది. విషయవిచారణ చేయఁగాఁ బై మూఁడింటితోను విశేషముగాఁ గర్మప్రతిపాదకమై యాగములకు సంబంధించినది జైమినీయమనెడి తలవకార బ్రాహ్మణమే యనియు, అందలి కడపటి కాండము సామవేదర్షులను దెలుపునదగుటచే నార్షేయ బ్రాహ్మణమనుపేర వేఱుగా ఖ్యాతి కెక్కెననియుఁ దెలియవచ్చినది. బర్నెలు పండితుఁడు రెండవసారి ప్రకటించిన తలవకారార్ష బ్రాహ్మణము తంజావూరు ప్రతి ననుసరించినదే కాని యన్యము కాదు. కావునఁ గేవలము ఋషులను దెలుపు నార్షేయ బ్రాహ్మణము దాని భాగమనుట స్పష్టము.

తలవకార బ్రాహ్మణమందలి. ఆగ్నేయ - ఐంద్ర - పవమాన - అరుణ - శుక్రియ - సంజ్ఞల నొప్పునైదు కాండములందు నేనుబదియొక్క ఖండములు గలవు. అందు మొదటి మూఁడు కాండములందును వివిధములైన యాగకర్మలు ప్రతిపాదింపఁబడినవి. నాల్గవకాండమున సామగాచార్యానుక్రమణికలు సావిత్రీమంత్ర విచారమును, ప్రాణముయొక్క పూర్వావస్థయు వర్ణింపఁబడినవి. పంచమ కాండమున సామవేదద్రష్టల వంశానుక్రమణి తెలుపఁబడినది. ఈ విషయము నిందలి

''అథఖల్వార్ష ప్రదేశో భవ త్యృషీణా న్నామధేయ గోత్రోపధారణ' మ్మను మొదటివాక్యమే తెలుపుచున్నది.[1] పూర్వోక్తములైన యిందలి విషయములనుబట్టి చూడఁగా యాగసంబంధ మధికముగాఁ గలయినయును, తాండ్య బ్రహ్మణమువలెనే ప్రాచీనమని గోచరించుచున్నది. ఇందలి కడపటి కాండమయిన శుక్రియకాండమే యార్షేయబ్రాహ్మణమనుపేర మూఁడు ప్రపాఠకములతో వేఱుగా విలసిల్లుచున్నది. కావున నార్షేయము తలవకారములోని భాగమనుట సిద్ధము. ఈ తలవకారమను పేరు వచ్చుటకుఁ గారణము తెలియరాదు కాని దీనియపరనామమునకుఁ గారణ మయిన జైమినిఋషి మాత్రము వంశబ్రాహ్మణములో సామగాచార్యులలోఁ గనవచ్చుచున్నాఁడు. జైమిని ప్రవర్తితమైన దీని నతని ముఖ్యశిష్యుఁడగు తలవ కారుఁడు ప్రవర్తింపఁజేయుటచే దీని కతనిపేరు గూడఁ దరువాత సంభవించెనేమో చెప్పఁజాలము. ఎట్లయినను జైమిని తలవకార నామములు రెండును గూడ భాష్య కర్తలనాఁటికి మఱుఁగుపడి యార్షేయనామమే ప్రసిద్ధమయ్యెననుట నిజము.

అయిదవది దేవతాధ్యాయ బ్రాహ్మణము. దీనికగ్నిబ్రాహ్మణమను నామాంతరము కలదు. ఇది మిక్కిలి చిన్నగ్రంథము. ఇది మొదలుగాఁ గలనాలుగును బ్రాహ్మణములని వ్యవహరింపఁబడుచున్నను వీనికి యాగసంబంధమేమియు లేద నుట సత్యము. ఈ గ్రంథమున సామనిధనములు సామదేవతలు ఛందోవర్ణములు ఛందోదేవతలు మొదలగు విషయములు వర్ణింపఁబడినవి. ''స్వస్తి దేవఋషిభ్యశ్చ బ్రహ్మ సత్యఞ్చ పాతు మామ్'' అను వాక్యముతో నిది సమాప్తినొందుచున్నది.

ఆఱవది, ఉపనిషద్బ్రాహ్మణము. ఇదియే ఛందోగ్యోపనిషత్తని చెప్పఁబడు చున్నది. ఇందలియత్యల్పభాగము మాత్రమే యజ్ఞప్రతిపాదకము గాని, తక్కినది కొంత వివాహవిధులను దేవతాస్తుతులను తెలుపుచున్నది. మిగిలినదంతయు బ్రహ్మ ప్రతిపాదకమైన యుపనిషత్తే.

ఏడవది సంహితోపనిషద్బ్రాహ్మణము, ఇది యైదనువాకముల చిన్న గ్రంథము. బ్రహ్మవిద్యకు ముఖ్యమైన దుపనిషత్తు, అట్టి బ్రాహ్మప్రతిపాదక మయినదీనినే యధ్యాపకులు సంహితాశబ్దముతోఁ జేర్చుటచేఁ బై సంజ్ఞ వచ్చినది. ఇందు వర్ణనీయము లవర్ణనీయములు సంహితాపఠన ఫలాదులను జెప్పఁబడినవి.

1. ఈ విషయమున నాకు లభింపని బ్రాహ్మణ గ్రంథముల వృత్తాంతము నితర గ్రంథములనుండి సంగ్రహించితిని.

ఎనిమిదవది వంశబ్రాహ్మణము. ఇదియు మిక్కిలి చిన్నది. సామసంహితా సందర్భమున దీని ప్రసక్తి వచ్చియున్నది. ఇందు సామవేద సంప్రదాయ ప్రవర్తకుల వంశపరంపరలు వక్కాణింపఁబడినవి. ఇట్లు గణన కెనిమిది వచ్చినను, తాండ్యబ్రాహ్మణమును, తలవకార బ్రాహ్మణములోని సగభాగమును దప్పఁ దక్కినవి బ్రాహ్మణములనెడి ఖ్యాతికిఁ దగినవికావు. అందును మొదటి దొక్కటియే యత్యుత్తమమై సర్వవిధముల బ్రాహ్మణ మనఁదగి యున్నది.

కృష్ణయజుర్వేద బ్రాహ్మణములు :—కృష్ణయజుర్వేదమునకుఁ గలమూఁడు శాఖలలోఁ గఠశాఖకు సంబంధించిన సావిత్రనాచికేతాదు లనఁబడు నెనిమిది భాగముల గ్రంథము తైత్తిరీయ బ్రాహ్మణారణ్యకములలో నంతర్భూతమైనదని తైత్తిరీయ సంహితా విభాగసందర్భమునఁ గనియున్నాము. ఆ యెనిమిది భాగములు కఠసంహితకే సంబంధించిన వనుటకు వానికిఁ గాఠకములను పేరుండుటయే కాక మఱియొక కారణము గూడఁ గన్పట్టుచున్నది

“గౌతమగోత్రుఁడు వాజశ్రవఃపుత్రుఁడు నైనవాజ శ్రవసుఁ డనునుద్దాలక మహర్షి యొకప్పుడు విశ్వజిద్యాగ మాచరించి తనసర్వస్వమును ఋత్విక్కులకు దక్షిణగా నొసంగెను. అతని కుపనయన యోగ్యవయస్కుఁడైన నచికేతుఁడను కుమారుఁడుండెను. అపు డాబాలుఁడు. సర్వస్వదక్షిణాకమైన యీ యాగమందు తనసొత్తైననన్నుఁ గూడ నా తండ్రి ఋత్విక్కులకు దక్షిణగా నిచ్చుట యుచితమగు నని యాలోచించి తండ్రిని సమీపించి, నాయనా ! నన్నే ఋత్విక్కున కిచ్చెదవని యడిగెను పిల్లవాఁడు తెలియక యిట్లడిగెనని యూహించి యుద్దాలకుఁ డూరకుండెను. నచికేతుఁడు మరల నట్లే రెండుసారులడిగెను. అంత నుద్దాలకుఁడు కోపగించి, నిన్ను మృత్యువున కిచ్చితినని పలికెను. అపుడు నచికేతుఁడు తండ్రి యభిప్రాయము సరిగా గ్రహింపలేక పోయియుఁ దన్నెవరికో దానముచేసినట్లు భావించి యితరస్థలమునకుఁ బోవ నుద్యుక్తుడై లేచెను. అపు డశరీరవాణి యా పిల్లవానికిఁ బ్రత్యక్షమై నీ తండ్రి యభిప్రాయమిది యని తెలిపి, ‘నీవు యముఁడింట లేనిసమయము తెలిసికొని యతనిగృహమున కరిగి మూఁడుదినములు నిరాహారుఁడవై యుండుము. అంత యముఁడు వచ్చి యీ మూఁడుదినములేమి భక్షించి యుంటివని యడిగినపుడు. మొదటినాఁడు నీ పిల్లలను, రెండవ నాఁడు నీ పశువులను, మూఁడవనాఁడు నీ సుకృతమును భక్షించి యుంటినని చెప్పుము.’ అని యుపదేశించెను.

నచికేతుఁడట్లే యమమందిరమున కేగి యట్లే యుండెను. తరువాత వచ్చినయముని ప్రశ్నలకు నట్లే బదులుచెప్పెను. అంత యముఁడు "అతిథి భోజనహీనుఁడై పడి యుండెనేని గృహయజమానుని ప్రజాదికము క్రమముగా క్షీణించుననెడి శాస్త్రమునుబట్టి యీ బాలుఁడిట్లు పలికె"నని నిజము గ్రహించి, తన దోషము పోఁగొట్టుకొనఁ దలఁచి, మూఁడువరములు కోరుకొనుమని యా బాలునితో ననెను. అపుడాబాలుఁడు మూఁడువరములడిగి గ్రహించి జీవనముతోఁ దిరిగి వచ్చెను," ఇత్యాదిగాఁ దైత్తిరీయ బ్రాహ్మణమున నొక యుపాఖ్యాన మున్నది.[1] ఈ యుపాఖ్యానము మొదట—

"ఉశన్హ వై వాజశ్రవసః సర్వవేదసం దదౌ
తస్యహ నచికేతా నామ పుత్ర ఆస
తగ్ంహ కుమారగ్ం సన్తమ్
దక్షిణాసు నీయమానాసు శ్రద్ధా ఽఽవివేశ

అను రెండుమంత్రములున్నవి. సరిగా నీ రెండుమంత్రములు కఠోపనిషత్తు మొదటఁ గనఁబడుచున్నవి. పూర్వోక్త మయిన యుపాఖ్యానము కాఠకములోని దగుటయు నందలి యీ మంత్రములు కఠోపనిషత్తులో నుండుటయు, వెనుకఁ జూపిన కాఠకములనెడి యెనిమిది భాగములును కఠశాఖకు సంబంధించిన బ్రాహ్మణ మయ్యుఁ దరువాతఁ దైత్తిరీయ బ్రాహ్మణారణ్యకములలోఁ బ్రవేశించెననెడి సత్యమును దెలుపుచున్నవి.

మైత్రాయణీయశాఖకును వేఱుగా బ్రాహ్మణము కనఁబడదు. ఖిలనామకమైన యందలి చతుర్థకాండమే దాని బ్రాహ్మణముగా నున్నది. విధిరూపముగా నున్న యా కాండము దానిపరిశిష్టమని యింతకుమున్నే తెలిసికొని యున్నాము. ఇంకఁ దైత్తిరీయము—

కేవలము యాగార్థమును సస్వరమునై నిజముగా సంహితకు వ్యాఖ్యాన ముగా నున్న బ్రాహ్మణము తైత్తిరీయమే యనుట సుప్రసిద్ధము. సంహితకు వలె

1. తై. బ్రా. 3-11-8.

దీనికి, పదక్రమజటాదులు లేవు కాని తక్కినయెల్ల విషయములందు నిది సంహితతోఁ దులఁదూఁగుచున్నది. అత్యంతప్రాచీనమైన యీ బ్రాహ్మణమే వివిధ యాగములకు నుపజీవ్యమై యాధ్వర్యవమును బూర్తిగావించినదనుట విస్పష్టము. మంత్రబ్రాహ్మణయోర్వేద నామధేయ మ్మను లక్షణము తక్కినసంహితా బ్రాహ్మణములకు నామమాత్రముగా సమన్వయించుచున్నను, అది తైత్తిరీయసంహితా బ్రాహ్మణముల నుద్దేశించియే పుట్టినదనుట నిజము. కావుననే యీ రెంటిలోని యెనుబదిరెండుప్రశ్న లేకముగాఁ గృష్ణయజుర్వేదమని పిలువఁబడుచున్నవి గాని ఋక్సంహిత ఋగ్వేద మనఁబడునట్లుగా, తైత్తిరీయసంహిత ప్రత్యేకము కృష్ణ యజుర్వేద మనఁబడుట లేదు.

ఈ బ్రాహ్మణము సంహితలోఁ జెప్పఁబడని విషయములను జెప్పుచు, అది వర్ణించిన వానియర్థము వివరించుచు, క్రియాకలాపమునకుఁ బూర్ణత్వ మాపాదించుచున్నది. ఇది విస్తరించి వివరించిన యనేక ముఖ్యవిషయములలో నశ్వమేధ మొకటి. రాజన్యుఁ డాచరింపఁదగిన యీ యాగమున వివిధాచారములు వర్ణింపఁబడినవి. అందొకవిలక్షణమైన యాచార మిట్లున్నది.

"దర్భతాళ్లతో బంధించిన మేధ్యాశ్వమును స్నానము చేయింపఁ నేటికిఁగొని పోవలెను. అచ్చోటికి దానితోఁ గూడ నొకమగకుక్కను దీసికొనిపోవలెను. ఆ కుక్క కన్నులపై భాగమునందు చుక్కలున్నది కావలెను. అట్టిది చతురక్ష మనఁబడును. రెండుకన్నులవంటి రెండుచుక్కలుండుటచే నిది చతురక్షమగును. దాని నడ్డి కొకతాడు గట్టి దాని యొకకొన చేతఁబుచ్చుకొని యజమానుఁడయిన రాజన్యుని మేనత్తకొడుకు ముందు నడవవలెను. రెండవకొన చేతఁబట్టి యజమానుని పినతల్లికొడుకు వెనుక నడవవలెను. అతనివెనుక మంచిచేవకఱ్ఱతోఁ జేసినరోఁకలి బుజమున వైచుకొని యొకజారిణీపుత్రుఁడు పోవలెను.

ఇట్లు ఋత్విగాదులు యజమానునితో నేటికి వత్తురు. గుఱ్ఱమును ఇసుకమును స్నానము చేయింతురు. అనంతర మా కుక్కను దానికాళ్లకు నేల తగులని లోఁతు నీ లోనికిఁ గొనిపోవుదురు. (అపుడది నిలవలేక యీఁది పోలేక గిజగిజ లాడుచుం నన్నమాట) అంత నధ్వర్యుఁడు మంత్రము పఠించి దానిని జంపుటకు జారిణీపుత్రుని నియమించును. వాఁడు రోఁకలియెత్తి దానినడినెత్తి పగులఁగొట్టి చంపును. ఆ చచ్చినకుక్కను గుఱ్ఱము కాళ్లక్రిందికిలాగి దానికుడివైపున విడిచి పెట్టుదురు." ఇత్యాదికము.[1]

1. తై. బ్రా. 3-8-4.

ఈ యాచారము నతిప్రాయము గూడ నిదియేయట్లు తెలుపుచున్నది. "పాప మొకశత్రువు అది కుక్కవంటిది. యజమానుఁడు పాపరహితుఁడై యాగ మాచరింపవలెను. అందుచే, బాపరూపమయిన శునకమును వధించినయెడల యజమానుని పాపరూపశత్రువు నశించినట్లగును" ఇంకి నితరమైన దేమున్నను ఇంతకంటె నీకృత్యమునకు ముఖ్యఫలము కనరాదు. ఈ విధముగాఁ గుక్కను జంపితే యజమానునిపాపము నశించుననెడి విశ్వాసమునకు గుఱియైనశ్వమేధ మశ్వమేధఁమున కంగమై యా కాలమున నుచిత మయ్యెఁగదాయనుట కంటె దీనిని విమర్శింపఁజాలను.

నిత్యబ్రహ్మయజ్ఞమందు చతుస్సంహితల యాద్యమంత్రములవలెనే దీని యాద్యమంత్రమును బఠింపఁబడు నాచారము సనాతనమైనది. దీని సంహితాప్రాయత్వము దెలుపుట కది యొకనిదర్శనము. ఆ మంత్రము 'బ్రహ్మసంధత్తం తన్మే జిన్వతమ్ క్షత్రగ్ సంధత్తం తన్మే జిన్వతమ్' ఇత్యాదికము. ఇందలి బ్రహ్మశబ్దము పరబ్రహ్మవాచకమై, తత్ప్రతిపాదకమైన వేదమును జెప్పునదై, తదధ్యయనాధ్యాపనాధికారిణియగు బ్రాహ్మణజాతిని జెప్పునదియై, ప్రతిపాద్య బ్రహ్మరూప వేదపురుషుని స్మరింపఁజేయునదియై గ్రంథాదియందు మంగళాచరణ మగుచున్నది. అధ్వర్యుప్రతిప్రస్థాతలిద్దరును గ్రమముగా శుక్రమంథి పాత్రములు చేతఁబుచ్చుకొని యుత్తరవేది వెనుక నిలిచి తమచేతులలోని పాత్రము లొకదాని కొకటి తగుల్చుచుఁ బఠించునట్టి పైమంత్రమునకు "ఓ గ్రహములారా! మీరు యజమానునికిని మాకును సంబంధించిన బ్రాహ్మణ జాతి స్వధర్మరహితము కాకుండునట్లు చేయుఁడు. దేశాధిపతికిని బ్రజలమైన మాకును సంబంధించిన పాలకమైన క్షత్రజాతి స్వధర్మహీనము కాకుండునట్లు చేయుఁడు' ఇత్యాదిగా యజ్ఞపరమైన యర్థము. ఇట్టి పవిత్ర భావముతోఁ గూడిన యిందలి బ్రహ్మశబ్దము తరువాత వెలువడిన 'ప్రజ్ఞానం బ్రహ్మ సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ - విజ్ఞానమానందం బ్రహ్మ - ఇత్యాది సకలవేదాంత వాక్యములు ప్రతిపాదించు పరబ్రహ్మమును దెలుపుచుఁ గర్మజ్ఞానములసంబంధ మెఱిఁగించుచుఁ దైత్తిరీయ బ్రాహ్మణము ఘనత కలంకారమై యొప్పుచున్నది.

కృత్తికాదినక్షత్ర విజ్ఞానము, నక్షత్రదేవతలు, పంచసంవత్సరాత్మకయుగములు, సంవత్సర పరివత్సరేదావత్స రానువత్స రేద్వత్సరసంజ్ఞలు, నక్షత్రజ్ఞానమూలకకాలవిజ్ఞానము, మొదలగు ఖగోళజ్ఞానవిషయము లెన్నెని యిందువర్ణింపఁ

బడినవి తరువాత వెలువడిన జ్యోతిశ్శాస్త్రమున కిందలివర్ణనములే యాధారము లయినవనుట సర్వసమ్మతము. వానిలో నభిజిన్నక్షత్రనిరూపణ మిట్లున్నది.

"అభిజిన్నామ నక్షత్రమ్। ఉపరిష్టా దషాఢానామ్।
అవస్తా చ్ఛ్రోణాయై। దేవాసురాః సంయత్తా ఆసన్ ॥ ఇత్యాది—[1]

ఉత్తరాషాఢానక్షత్రము నాల్గవపాదమును. శ్రవణనక్షత్ర ప్రథమపాదమును గలిపిన నక్షత్రసంధి యభిజిత్తనఁబడుచున్నది. పూర్వకాలమందు సురాసురులకు యుద్ధము పొసఁగినపుడు దేవత లీసంధికాలములలో సంగ్రామమునకు వెడలిపోరాడి యసురులను జయించిరి. అందుచే దీని కభిజిత్తనుపేరు వచ్చినది. లోకములో జయము కాంక్షించురా జీనక్షత్రమునఁ బోరికి వెడలెనేని తప్పక శత్రువులనోర్చి జయముకాంచును. ఇత్యాదికముగా నీ మంత్రము చెప్పుచున్నది. దీనినిబట్టి యీ బ్రాహ్మణము కేవలము యజ్ఞపరమైనదే కాక యైహికాముష్మిక రూపమైనసకల ప్రపంచవిజ్ఞానమున కాలవాలమై వెలయుచున్నదని గ్రహింపవచ్చును. వివిధ విజ్ఞానఖనియగు నీ బ్రాహ్మణరాజమును జదివి యిందలి విషయము లెఱిఁగి యానందింపవలసినదేకాని యొకటిరెండుదాహరించినంత మాత్రమునఁ దనివితీఱదు.

శుక్ల యజుర్వేద బ్రాహ్మణము :— శతపథమనుపేర వెలయుచున్న యీ బ్రాహ్మణము గుణమునందును బరిమాణమందును గూడ గొప్పదియై ఖ్యాతికెక్కినది. దీనికి మాధ్యందినమనియు, కాణ్వమనియు రెండుపాఠములుకలవు. అందందు కొన్నిమాటలు కొంచెము భేదించినను మొత్తముమీఁద నీ రెండు పాఠములందును జాలవఱకు గ్రంథమొక్కటేకాని ప్రవర్తకభేదమునుబట్టి మాధ్యందినము పదునాల్గు కాండములుగాను, కాణ్వము పదియేడుకాండములు గాను వ్యాపించినవి. మాధ్యందినపాఠమునుబట్టి యున్నవానిలో ప్రథమ పంచమ చతుర్దశకాండములు మూఁడును, కాణ్వపాఠమున రెండేసికాండము లగుటచే నిందలికాండసంఖ్య పదియేడయినది. ఇదియే యీ రెంటిలోనికాండ సంఖ్యయందలి భేదమునకుఁ గారణము. ఈ భేదము ననుసరించియే కండికల మొత్తమునందుకూడ భేదము కనిపించును గాని దానినిబట్టి గ్రంథమునందు మిక్కిలి యెచ్చుతగ్గు కలదనుటకు వీలులేదు. మాధ్యందినమందలి కండికల కంటెఁ గాణ్వమందలి కండిక లించుక పెద్దవి. అందుచే నందు ౭౬౨౪ కండికలు కనిపించుచుండఁగా నిందు సుమారాఱువేల కండికలుమాత్రమే యున్నట్లు కనఁబడుచున్నది. కాని యెట్లయినను దానిలోని కొన్నిపాఠము లిందుమాఱినట్లే

1. తై. బ్రా. 1-5-2.

యందలి గ్రంథము కూడఁ గొంచెమిందు తగ్గినదని యంగీకరింపక తప్పదు. ఇట్లు గ్రంథమునందు విశేషతారతమ్యము లేకపోవుటచేతనే సాయణాచార్యులు మాధ్యందిన పాఠము ననుసరించి శతపథబ్రాహ్మణమునకు భాష్యము రచియించినట్లు కనఁబడు చున్నది. ఈ భాష్యమందలి కొన్ని ముఖ్యభాగములతోను-ద్వివేద గంగపండితుని యారణ్యక వ్యాఖ్యానముతోను వీబరుపండితుఁడు శతపథబ్రాహ్మణమును బ్రకటించెను. ఇది మూలమాత్రముగాను గూడఁ బ్రకటితమైయున్నది. కావున విశేష వ్యాప్తిచెందియున్న మాధ్యందిన పాఠమునుబట్టియే శతపథబ్రాహ్మణమందలి విశేషములు తెలిసికొందము.

ఈ బ్రాహ్మణమందలి మొదటి తొమ్మిదికాండములును వాజసనేయసంహిత మొదటి పదునెనిమిది యధ్యాయములలోని విషయమున కెక్కువగా సంబంధించి యాగక్రియలను వివరించుచున్నవి. మఱియుఁ దైత్తిరీయసంహితలోనుండి, దాని సోదరియగు వాజసనేయ సంహితలో లేని బ్రాహ్మణగ్రంథను కొంతకొంత యీ కాండములందు గనవచ్చుచున్నది. అందును దైత్తిరీయసంహితా షష్ఠకాండమందలి గ్రంథము నిందలి తృతీయ చతుర్థకాండము లెక్కువగా గ్రహించినవి. ఇఁక నిందలిదశమాది కాండములగ్ని రహస్యమును, పూర్వకాండోక్త విషయములను, మిక్కిలి యనువదించినను గాని యిందు పేర్కొనఁదగిన నూతన విషయమంతగాఁ గనరాదు. కడపటిదిమాత్ర మారణ్యకమనుపేర నొప్పుచుఁ గొంత నూతన విషయము దెలుపుచున్నది. అందును గడపటియధ్యాయములు జ్ఞానబోధకములగుచు బృహదారణ్యకోపనిషత్తనుపేర లోకవిఖ్యాతి గాంచి ముముక్షువులహృదయ మాకర్షించుచున్నవి. మఱియు మొదటి తొమ్మిది కాండములందును యాజ్ఞవల్క్యు మతము ప్రమాణముగా గ్రహింపఁబడినది. కురుపాంచాల కోసలవిదేహసృంజయాది ప్రాగ్దేశీయులును మధ్యదేశీయులును దదను యాయులుగా నిర్దేశింపఁబడిరి. దశమ కాండమందు శాండిల్యమతము ప్రమాణముగాఁ జెప్పఁబడినది. గాంధారసాల్వకేక యాదిపశ్చిమోత్తర దేశీయులు తదనుయాయులుగా నిరూపింపఁబడిరి. అందుచే మొదటి నవకాండగ్రంథము ప్రాచీనమనియుఁ దరువాతి పంచకాండగ్రంథ మర్వాచీన మనియు నూహింపఁబడుచున్నది అయినను పాణినీయమున[1] శతపథశబ్దము కనవచ్చుటంబట్టి యిది దానికిఁ బూర్వమే కాని పరముకాదనుట నిశ్చయము.

---

1. అష్టా-4-2-60 సూత్రముక్రింద-శతషష్టేః ష్ఠికన్ పథః—5-3-100. దేవపథాదిభ్యశ్చ. శతపథాది.

ఈ బ్రాహ్మణమందలి కాండములు క్రమముగా నీ క్రింది విశేషనామములఁ బేర్కొనఁబడుచున్నవి.

హవిర్యజ్ఞము - ఏకపదిక - అధ్వరము - గ్రహము - నవము - ఉఖాసంభరణము - హస్తిఘటశతము - చితి - సంచితి - అగ్ని రహస్యము - అష్టాధ్యాయి - మధ్యమము - అశ్వమేధము - ఆరణ్యకము.

కాణ్వపాఠమందు కాండములకుఁ గ్రమముగా హవ్యవాహము-ఏకవాయువు-ఉద్ధరము - అధ్వరము - గ్రహము - వాజపేయము - రాజసూయము ఉఖాసంభరణము హస్తిఘటము - చితి - శతరుద్రీయము - అష్టాధ్యాయి - మధ్యమము - అశ్వమేధము - అగ్నిరహస్యము - ఆరణ్యము - అను నామములు కలవు. వీనిని బట్టి యాయాకర్మ విశేషములు జ్ఞేయములగును.

ఇందలి "తస్మా దాహుః కురుక్షేత్రం దేవానాం దేవయజన మితి" ఇత్యాది బహువాక్యములనుబట్టి కురుక్షేత్రమునకు దేవయజనసంజ్ఞ యున్నట్లు విదితమగును. మఱియు, జనమేజయుఁడు కురురాజనియు, విదేహరాజగు జనకునిసభలో మహాయాజ్ఞికుఁడైన యారుణికి శిష్యుఁడగు యాజ్ఞవల్క్యుఁడు సభాపతిగా నుండెననియు, ఆ సభకుఁ గురుపాంచాల దేశీయులగు బ్రాహ్మణులు వచ్చివాదప్రతి వాదములు సలిపిరనియుఁ గడపటియైదు కాండములలో నందందు గనవచ్చు వాక్యములనుబట్టి యిది తొలుతఁ గురుపాంచాలదేశముల నావిర్భవించి కోసలవిదేహాది దేశములఁ గ్రమముగా వ్యాపించియుండుననియే కాక, ఆరుణి శిష్యయాజ్ఞవల్క్య మతమునకును శాండిల్యమతమునకును వైరుధ్యము కలదనియు మొదటిమతమును బ్రతిఘటించిన రెండవమతము తరువాత బయలువెడలిన దనియు గోచరించుచున్నది.

ఇందు పెక్కుపౌరాణిక గాథలకు బీజభూతములైన యుపాఖ్యానములు చిన్నచిన్న వనేకములు కలవు. పెక్కండు రాజులును ఋషులును బేర్కొనఁబడిరి. కాని యిందలివారే పురాణోప పురాణములలో వర్ణింపఁబడిన వారని నామసామ్యమును బట్టి భ్రాంతిపడరాదు. కురురాజని చెప్పఁబడిన జనమేజయుఁడు పార్థుని ప్రపౌత్రుఁడని కాని పాండవవంశ్యుఁడని కాని యెందును గనరాదు. ఒకటి రెండుచోట్లఁ బ్రయోగింపఁబడిన యర్జునపద మింద్రపరముగా నున్నదిగాని పాండురాజపుత్రపరముగా లేదు అందుచే నీ జనమేజయుఁడెవఁడో యెప్పటివాఁడో నిర్ణయించుట సులభమైనపని గాదు.

ఋగ్వేదమున సంగ్రహముగా వర్ణింపఁబడిన యూర్వశీపురూరవస్సుల కథ యిందు సవిస్తరముగా వర్ణింపఁబడినవి. శకుంతలాదుష్యంతుల పుత్రుఁడగు భరతునికథయు నిందు గనవచ్చుచున్నది. ఇంకనిట్టి వెన్నేని కలవు. వానిలో ముఖ్యమైనదియు మనువురాకను దెల్పునదియునగు గాథ యార్యుల నివాసమును దెల్పుపట్టునఁ బ్రథమాధ్యాయమున నుదాహరింపఁ బడినది. అట్టివే మఱియొకటి రెండు.

ఒకనాఁడు విదేఘ (విదేహ) రాజయినమాధవుఁడు తనపురోహితుఁడగు గోతమరాహూగణునితోఁ గూడి సరస్వతీనదీ తీరమునఁ గూర్చుండెను. అపుడు వైశ్వానరుఁడయిన యగ్ని భూమి మండించుచుఁ దూర్పుదెస వోవుచుండెను. వారు నాయగ్ని ననుసరించి వెళ్లిరి. వైశ్వానరుఁడు పడమటికొండల నుండిపుట్టి ప్రవహించుచున్న సదానీర యనునది వఱకును దహించుకొనుచుఁ బోయి యా యేటిని మాత్రము దహింపలేదు. అగ్నిదేవుఁడు తాఁకి పవిత్రముచేయలేదని యచ్చటిజను లా నదిని ముట్టుకొనక దానిని దాఁటక బహిష్కరించిరి. ఆ కాలమున దానితూర్పు తీరమంతయు సేద్యములేక యుండెడిది. అగ్నిచే నా ప్రదేశమంతయుఁ బవిత్రీకరింపఁబడినదని తలఁచి బ్రాహ్మణులచ్చట నివాసము లేర్పఱుచుకొని కృషిచేయ నారంభించిరి. ఆ సమయమున విదేఘరాజు వైశ్వానరుని జూచి నన్నెక్కడ నివసింపుమనెదవని యడిగెను. ఈ నది తూర్పుతీరమున నివసింపుమని యగ్ని బదులుచెప్పెను. ఆ నదియే కోసలవిదేహ దేశములకు నడుమ సరిహద్దుగాఁ బ్రవహించుచున్నది. ఈ కథనుబట్టి యార్యులు సదానీరానదీ తీరమును దరువాత నాక్రమించిరని తెలియఁగలదు.

ఇందు చతుర్థకాండమున నున్న సుకన్యాచ్యవనుల కథయే మహాభారతమున నించుక మార్పుతో సౌకన్యాఖ్యానమైనది.

సంవత్సర స్వరూపమును బహువిధముగా వర్ణించియిందలి దశమకాండమున సంవత్సరమే మృత్యువని యిట్లు నిరూపింపఁబడినది

"ఏది సంవత్సర మనఁబడుచున్నదో, అదే మృత్యువు. అదియే, అహోరాత్రములచే మర్త్యులయాయువును క్షీణింపఁజేయుచున్నది. ఇందుచేతనే మనుష్యులు మృతిచెందుచున్నారు. సంవత్సరమే, అంతకుఁడు, అదియే ముదిమితెచ్చి జీవితకాలమును నశింపఁ జేయుచున్నది. దేవతలు ప్రజాపతివద్దకుఁ బోయి, సంవత్సర మహోరాత్రములచే మాయాయుస్సు క్షీణింపఁజేయ కుండఁ జేయవలసిన

దని విన్నవించుకొనిరి. యజ్ఞములు క్రతువులు నొనరించిరి." ఇత్యాదిగానున్నది. మఱియు నిందు దశమ కాండముచివర గురుశిష్యపరంపరా రూపమయిన వంశక్రమ మిట్లున్నది.

స్వయంభుబ్రహ్మ ప్రజాపతి కావషేయుఁడు తురుఁడు శాంబాయనుఁడు యజ్ఞవచసుఁడు కుశ్రి శాండిల్యుఁడు వాత్స్యుఁడు వామకక్షాయణుఁడు మాహిత్థి కౌత్సుఁడు మాండవ్యుఁడు మాండూకాయని సాంజీవీపుత్రుఁడు.

ఇట్టి వంశక్రమములు దీని యారణ్యకమున నింకను గలవు. ఇట్టి యుత్తమ బ్రాహ్మణము సంపూర్ణభాష్యముతో ముద్రింపఁబడకపోవుట వాఙ్మయమున కొక లోపము.

అథర్వణ బ్రాహ్మణము గోపథము. దీని కథర్వసంహితతో నెట్టిసంబంధము లేకపోయినను అథర్వాదిమహర్షుల యుత్పత్తిని. అథర్వాంగిర స్సంహితోత్పత్తిని, యాగస్వరూపమును దెల్పుచునిది యథర్వవేదమునకు బ్రాహ్మణ మనిపించుకొను చున్నది ఇది పూర్వభాగము, ఉత్తరభాగమునని ద్వివిధముగా నున్నది. ఇందు మొదటిదాని యందైదును, రెండవదానియం దాఱును ప్రపాఠకములు కలవు. ఇది ఋగ్యజుస్సామములలోని మంత్రములను గ్రోడీకరించుచు నందందు యజ్ఞమును, అగ్నీంద్రాది దేవతలను బ్రశంసించినను దీనికి యాగక్రియలతో నిజమైన సంబంధము గనిపించదు. బ్రహ్మచర్యము గాయత్రీ మంత్రోపాసనము మొదలగు వేదవిహిత ధర్మములనిది వివరించుచున్నది. భాషనుబట్టి చూచినను శైలినిబట్టి పరికించినను విషయమునుబట్టి పరిశీలించినను గోపథ బ్రాహ్మణము తక్కిన బ్రాహ్మణముల కంటెఁగాదు. ముఖ్యములయిన యనేకోపనిషత్తుల కంటెఁ గూడ నర్వాచీనమని చెప్పవచ్చును.

అథర్వవేదవేత్తయగువాఁడు యజ్ఞములందు బ్రహ్మగా నుండఁదగునన్న విషయమిందలి ప్రథమ భాగమునఁ బ్రధానముగా వర్ణింపఁబడినది. ఇతర బ్రాహ్మణములందు వర్ణింపఁబడిన యజ్ఞతంత్రమే కొంత యిందుగూడ ననువదింపఁబడినది గాని యాగములందు దీనినిగూడ ననుసరించెడి యాచారము పూర్వమున్నదేమో కాని యిపుడు కానరాదు. ఇది బ్రహ్మకృత్యములను బ్రహ్మప్రాధాన్యమును. చాతు ర్మాస్య దర్శపూర్ణ మాసాదికర్మ విశేషములను వివరించినదిగాని యిందు స్వతంత్ర మయిన నూతన విషయమంతగా లేదు. కాని యాగములందలి లోపములను వానికిఁ

దగిన ప్రాయశ్చిత్తములను దెలుపుచున్న యిది బ్రహ్మ సకల యాగలోపములను బూర్తి గావించునని బ్రహ్మకృత్య ప్రాధాన్యమునిట్లు వెల్లడించుచున్నది.

"ప్రాయశ్చిత్తై రనుధ్యానై రనుజ్ఞానాను మంత్రణైః హోమైశ్చ యజ్ఞ విభ్రంశం సర్వం బ్రహ్మ ప్రపూరయేత్.''

'పురుషో వావ సంవత్సరః' అను ప్రధాన వాక్యమాదిగా మూఁడు ఖండములందు[1] పురుషుని సంవత్సరముతోఁ బోల్చుచుఁ గావించిన వర్ణనము నాఁటి శారీరక తత్వశాస్త్రజ్ఞానము నెంతయు నావిష్కరించుచున్నది. అంద లివి కొన్ని మాటలు.

''పురుషుఁ డొక్కఁడు. సంవత్సర మొకటి. కావునఁ బురుషునికిని సంవత్సరమునకు నేకత్వము సమము (ఇట్లే సమత్వము ముందు విషయములలో నెఱుంగునది) సంవత్సరమున కహోరాత్రములు రెండు భాగములు. పురుషుని యందు ప్రాణములు రెండు విధములు. అందు ఋతువులు మూఁడు. పురుష శరీర మందు ప్రాణములు మూఁడు. అందు ఋతువు లాఱు, లేక యేడు. ఇందు నట్లే ప్రాణములు కలవు. అందు పన్నెండు లేక పదమూఁడు మాసములు కలవు. ఇందు నా సంఖ్యలకుఁ దగిన ప్రాణములు కలవు. అం దిరువది నాలుగు పక్షములు కలవు. ఇందు రెండు పాదములు రెండు హస్తములు, ఇరువది వ్రేళ్లు కలవు. అందు ౩౬౦ అహోరాత్రములు, ఇం దన్ని ప్రాణములు. అందు ౭౨౦ అహస్సులు రాత్రులు నున్నవి ఇం దన్ని యెముకలు మజ్జలు నున్నవి. అందు ౧౪౪౦ దివసార్ధ భాగములు రాత్ర్యర్ధ భాగములు కలవు ఇం దన్ని స్థూరామాంసములు కలవు. అందు ౨౮౮౦ అహఃపాదములు రాత్రి పాదములు కలవు. ఇం దన్ని స్నావా బంధ్యలు కలవు. అందు ౧౦౮౦౦ ముహూర్తము లున్నవి. ఇం దన్ని పేశశమరము లున్నవి. ఈ ముహూర్తములు ౧౫ పెట్టి గుణించిన నెన్ని యగునో, అన్ని ప్రాణములు పురుషదేహమం దున్నవి. ఈ ప్రాణములకుఁ బదియేనురెట్లపానములు. వానికిఁ బదియేనురెట్లు వ్యానములు, వానికిఁ బదియేనురెట్లు సమానములు, వానికిఁ బదియేనురెట్లుదానములు, వానికిఁ బదియేనురెట్లేతాదులు, వానియన్ని యేతర్హులు, వానియన్ని స్వేదాయనములు, వానియన్నిక్షిప్రాయణములు, వాని యన్ని రోమకూపములు, వానికిఁ బదియేనురెట్లు వర్షించు ధారలు కలవు. ఇది యంతయుఁగలిసి నూఱు క్రోసుల పరిమాణమగును."

1. గో. బ్రా. పూ. ౫-౩-౫.

ఇది యథర్వవేదమునకు సంబంధించిన వైతాన శ్రౌతసూత్రమునకుఁ దరువాతఁ బుట్టినదని మేగ్డోనలు పండితుఁడు తలంచెనుగాని యది సమీచీనముగాఁ దోఁపదు. ఇందలి పూర్వభాగ పంచమ ప్రపాఠకమున నుత్తరోత్తర ముత్తమ మనెడి యభిప్రాయమును సూచించెడి యజ్ఞక్రమ మిట్లున్నది. — అగ్న్యాధేయము, దానికంటెఁ బూర్ణాహుతి, దానికన్న నగ్నిహోత్రము, దానికంటె దర్శపూర్ణ మాసములు, వానికంటె నాగ్రయణము, అంతకంటె, చాతుర్మాస్యలు, వానికంటెఁ బశుబంధము, దానికన్న నగ్నిష్టోమము, దానికంటె రాజసూయము, దానికన్న వాజపేయము, అంతకంటె నశ్వమేధము, అంతకన్నఁ బురుషమేధము, అంతకంటె సర్వమేధము, ధానికన్న దక్షిణావంతములు, వానికన్న దక్షిణలుఁ అదక్షిణలు సహస్రదక్షిణము. ఇది యజ్ఞ కమము. వైతానసూత్ర మీ యజ్ఞ క్రమమును సరిగా గ్రహించి యే కోరికతో నే యజ్ఞము చేయవలెనో నిర్ణయించుచుఁ గడపట 'యజ్ఞక్రమో బ్రాహ్మణాత్' ఈ యజ్ఞక్రమము బ్రాహ్మణమునుండి గ్రహింపఁబడినదని తెలిపినది [1] ఈ బ్రాహ్మణమేదియన్న ననవచ్చునుగాని పూర్వోక్తయజ్ఞమిందు గాక యితర బ్రాహ్మణములలో నీరీతిని లేదు, పైగా నథర్వ శ్రౌతసూత్ర మథర్వ బ్రాహ్మణమును గాక మఱియొకదాని ననుసరించినదనుట కుచితమైన కారణమును గనఁబడదు మఱియు నిట్లే వైతాన సూత్రమున 'బ్రాహ్మణోక్తమ్' అను మాట రెండు మూడుచోట్లఁ గనవచ్చుచున్నది. అందుచే నీసూత్రము పేర్కొన్న బ్రాహ్మణము గోపథమే యనుట సముచితమగును గావున గోపథము వైతానముకంటె నర్వాచీనము గాదని విశ్వసింపవచ్చును ఇందుకుఁ బ్రాచీన వైదిక ప్రయోగి సంపర్కము వైతాన సూత్రమునకన్న గోపథ బ్రాహ్మణమునకే యెక్కువగాఁ గనఁబడుటగూడ నొక ముఖ్యకారణము.

ఆ ర ణ్య క ము లు

కొన్ని యారణ్యక గ్రంథములు వేఱుగాఁ గనవచ్చుచున్నను, అవి బ్రాహ్మణముల యనుబంధములే కాని యన్యములు కావు. అట్టి యనుబంధ గ్రంథమైనను, అథర్వ బ్రాహ్మణమునకు లేదు. సామబ్రాహ్మణమునఁ గడపటనున్న శుక్రియ కాండమే సామ వేదారణ్యకముగా గణింపఁబడుచున్నదని యింతకుఁ బూర్వము చదివియున్నాము. శుక్లయజుశ్శాఖకు శతపథ బ్రాహ్మణాంతిమకాండ మారణ్యకమని యింతకుమున్న తెలిసికొనియున్నాము. కఠమైత్రాయణీయాది శాఖలకు

1. వై. సూ. 8-45.

బ్రాహ్మణమువలెనే వేఱుగా నారణ్యకమును లేదు. కౌషీత కారణ్యముపేరు విన వచ్చుచున్నది గాని గ్రంథము లభింపలేదు. ఇఁకఁ దైత్తిరీయైత రేయారణ్యకము లున్నవి. వీనిలోఁ దైత్తిరీయ సంహితా విభాగసందర్భమునఁ దైత్తిరీయారణ్యకము లోని విభాగములును వాని నామములును దెలిసికొనియుంటిమి. ఇపుడందలి విశేషములించుక తెలిసికొందము.

తైత్తిరీయ బ్రాహ్మణమువలెఁ దైత్తిరీయారణ్యకమును దక్కిన బ్రాహ్మణా రణ్యకములకంటెఁ బ్రాచీనము. 'అరణ్యేఽధీయీరన్' అను నిందలి వాక్యమును బట్టి యిది యడవిలో నధ్యయనము చేయఁదగినదని తెలియుచున్నను, ఇందలి సావిత్ర నాచికేత చాతుర్హోత్ర వైశ్వసృజ భాగములకీ నియమము లేదని పూర్వా చార్యులు వక్కాణించియున్నారు. ఇందు పది ప్రపాఠకములు కలవు. అందు కడపటిది నారాయణోపనిషత్తు. ఈ ప్రపాఠకము ఖిలమని ప్రాచీనులు వ్యవహరించి యున్నారు. అందుచే నిందలి మొదటి తొమ్మిది ప్రపాఠకములు ప్రాచీనములనియు నంతిమ మర్వాచీనమనియుఁ దెలియుచున్నది. యాజ్ఞిక పక్షమున నీ యారణ్యక మంతయు యజ్ఞోపయోగిగాఁ గనవచ్చుచున్నను, జీవేశ్వర తత్త్వబోధకములగు నుపనిషత్తులే కాక వివిధ జ్ఞానదాయకములగు నితర విషయముఁ గూడ నిందనే కములు కలవు. ఛందోబద్ధమై సస్వరమై సరసపద ఘటితమైన యిది చదువుటకు వినుటకుఁగూడ నింపు పుట్టించుచు నొక మహాపురాణమువలె నుండును.

ఇందలి మొదటి ప్రపాఠక మారుణకేతుక మనఁబడును. సూర్యోపాసకులు దీనినే యరుణమని వ్యవహరింతురు. సకలరోగ నివారకములయిన యిందలి మంత్రములను బఠించుచు నుపాసకులు సూర్యనమస్కారములు గావించునట్టి యాచారము నేఁటికిని భరతఖండమంతటను గలదు. ఇది నిజమైన యారణ్యక భాగములలోని దగుటచే సూర్యోపాసకులు దీనిని దేవాలయములందు గాని యూరి కడ నుండు తోటలలోఁ గాని గోష్ఠములందుగాని గర్భవతులైన స్త్రీలు వినరాని మంత్రములుగూడఁ గొన్ని యిందు గలవు. దీనిని బఠించి దీని ననుసరించి సూర్యనమస్కారము లాచరించువారు రోగ పరిత్యక్తులై యారోగ్యము గాంచుచున్నారనుట నేఁటికి ననుభవ సిద్ధము. ఈ యారణ్యకమునఁ బురాత నార్య విజ్ఞానము కలదనుట కిందలి మేరు గతసూర్యవర్ణనమే ప్రమాణమని ప్రథ మాధ్యాయమునఁ గొంత తెలిసికొనియున్నాము. అందు ప్రశంసింపఁబడిన యుత్తర ధ్రువగోచరమగు సూర్యవిషయక విజ్ఞాన మార్యపరంపరా ప్రాప్తమై యీ యారణ్యకమునఁగూడఁ గనవచ్చును. ఇందు మేరుగతకశ్యపుఁడు సప్తసూర్యులు

సూర్యమహత్త్వము సంవత్సర స్వరూపము మొదలగు నుత్తమ విషయము లనేకములు వర్ణింపఁబడినవి. ఇందు సంవత్సర గర్భములైన వసంతాది ఋతువుల స్వభావవర్ణన మతిమనోహరముగా నున్నది. ఇదియే తరువాత మహాకవులు గావించిన ఋతువర్ణనలకు మార్గదర్శకమని చెప్పవచ్చును. ఇందలి యా మంత్రముల భావము నిందు సంగ్రహముగాఁ దెలుపుచున్నాను

"ముప్పది ముహూర్తము లొక యహోరాత్రము. అట్టి పఱువది యొక ఋతువు. ఒక ఋతువు మఱియొక ఋతువును వెనువెంటనే ప్రేరేపించుచుండును. ఋతువులకుఁ బ్రభువు సంవత్సరము సంవత్సరరూపుఁడైన కాలపురుషుని యాజ్ఞను ఋతువులు నిర్వర్తించుచుండును. వానిలో ముఖ్యము వసంతము. ఇందు జలమతి నిర్మలముగా నుండును. బ్రాహ్మణు లుపనయన వివాహయజ్ఞాది కర్మము లాచరించుచు బంధుమిత్రులను రావింతురు. వైదేశికులగు న యతిథులకు సత్కారము లాచరింతురు. మృష్టాన్న భోజనాదులఁ బ్రజలానందింతురు. గ్రీష్మ స్వభావము వసంత స్వభావముకంటె ననసాధారణముగా నుండును. శుక్లవస్త్రధారియై యేకాదశ రుద్రగణము గ్రీష్మముతో నుండును. ఈ గ్రీష్మర్తువు నిరుపమానమయిన జ్యోతిస్సుచే భూమిని దపింపఁజేయుచుండును తాపాధిక్యము దీని యసాధారణ ధర్మము. వర్షర్తువు ప్రాణికోటికి వ్రీహ్యాది రూపమైన కృష్యాదిఫలము సమకూర్చునది దీనికాదిత్యులు ప్రభువులు వారియనుగ్రహమువల్లనే మరల వర్షర్తువు వచ్చువఱకును బ్రాణికోటికి సరిపడునట్టి వివిధ సస్యఫలములు లభించుచుండును. ఈ ఋతువు నైజముగా దుఃఖసహితము గాకున్నను, ప్రాణులకు నేత్రరోగము కలిగించునదగుటచే దుఃఖదముగాఁ గనిపించును. స్వయముగా నిది పీతవర్ణము గాకున్నను, ప్రజలకుఁ గామిలాది రోగములు కలిగించునదగుటచేఁ గామిల రోగమునఁ బచ్చపడినట్లు కనఁబడును. వానచేతను గాలిచేతను శీతలమయిన యీ ఋతువునందు కంబళాది ప్రావరణముచేతను, అగ్నిసేవచేతను శీతబాధ నివృత్తమగును. ఈ కాలమున రురుమృగము లరణ్యములందు సమృద్ధిగాఁ బెరిఁగిన తృణము భక్షించి వృద్ధినందును. కర్షకులు నాఁగళ్ల చేతఁబూని భూమి దున్ని విత్తనములు చల్లి సస్యములు పోషింతురు. సస్యఫల సందర్శనమునఁ బ్రజలకన్నులు సుఖించును. ఈ ఋతువున సేద్యము చేయనివానికి సంవత్సరమంతయు నన్నము దుర్లభమే యగును. దీనివెంటనే శరదృతువు వచ్చును. ఈ కాలమున నక్షిరోగములు శాంతించును. లోకమంతయుఁ నిష్పంకమై ప్రసన్నముగాఁ గనవచ్చును. ఋతువునకు ఋభువులు ప్రభువులు. వారి యనుగ్రహమున దృష్టి విరోధియగు నీహారాదిక మణఁగిపోవును. ఈ కాలమునఁ బ్రజలు పుష్కలముగా భక్షించి సుఖముగా

జీవింతురు అంగలేపాదుల శరీరసంరక్షణము గావించుకొందురు. అంత హేమంతము సంభవించును. ఇందు మరుద్గణములు విజృంభించును. చలి హెచ్చగును, వాయులోకమునుండి యుద్ధసన్నద్ధమై వచ్చిన యోధసంఘమువలె వాయుగణము తీవ్రముగాఁ గనిపించును. వాయువులతోఁ బోరాడ సిద్ధపడుచున్నట్లుగాఁ గంచుక కంబళశిరోవేష్టనాదులు ధరించి ప్రజలు కనిపింతురు హేమంతపురుషుఁడు క్రుద్ధుఁడు కాకున్నను, అతనికన్ను లెఱ్ఱవాఱియుండును. అతనివెనుక శిశిరర్తువు వచ్చును. ఈ కాలమున దేవలోకములందు త్రాగుటకు నీళ్లు దొరకవు. మనుష్యలోకమందైనను మార్గమధ్యమున జలము లభింపదు. బాటసారులు నీరెక్కడ దొరకునోయని పరితపించుచుఁ బ్రయాణము చేయుచుందురు."

కేవలము స్వభావసిద్ధమైన పై ఋతువర్ణన మానాఁటి సంవత్సర పరివర్తనమును నాఁటిసాంఘిక జీవనమును విశదీకరించుచున్నది. ఈ వర్ణనము కావ్యములఁ గనిపించు ఋతువర్ణనమువలెఁ గల్పనాచాతుర్యమును- ఉత్ప్రేక్షాద్యలంకారములను జూపి పాఠకహృదయ మాకర్షించునట్లు లేకున్నను, స్వభావమధురమై తరువాత వెలువడిన వర్ణనలకు బీజభూతమై యున్నదనుట యతిశయోక్తికాదు.

ద్వితీయ ప్రపాఠకము స్వాధ్యాయ బ్రాహ్మణము. ఇందు యజ్ఞోపవీత ధారణవిధానము తదావశ్యకత తత్ఫలము, అర్ఘ్యప్రదానము, కూష్మాండహోమములు, స్వాధ్యాయవిధానము, దేవయజ్ఞ పితృయజ్ఞ భూతయజ్ఞ మనుష్యయజ్ఞ బ్రహ్మయజ్ఞములను పంచమహాయజ్ఞములు మొదలగు విషయములు వర్ణింపఁబడినవి. ఇందు బ్రహ్మయజ్ఞ సమాచరణవిధి మిక్కిలి చక్కఁగా నుపదేశింపఁబడినది. అగ్నీంద్రవాక్పూషాది దేవతాస్తుతులతోఁ గూడిన ౩-౪-౫. ప్రపాఠకములు సాధారణముగాఁ గర్మపరములు షష్ఠప్రపాఠకము పితృమేధము. ఇందు మృతులైన యాహితాగ్నుల కాచరించు నపరక్రియల స్వరూపము వివరింపఁబడినది. ౭-౮-౯, ప్రపాఠకములు, శీక్షావల్లి ఆనందవల్లి భృగువల్లియని ఖ్యాతికెక్కిన యుపనిషత్తులు. కృష్ణయజుర్వేదమున నివి కడపటివగుటచే వేదాంతములనియు, శాఖపేరఁ దైత్తిరీయోపనిషత్తు లనియుఁ జెప్పఁబడుచున్నవి. ఈ మూఁడును గేవలము బ్రహ్మప్రతిపాదకములై బ్రహ్మానందరస మొలికించుచు నూరక పారాయణము చేయువారి హృదయములను గూడ రంజింపఁ జేయుచుండును. ఆత్మైకత్వవిజ్ఞానమున కాధారములైన యివియే యద్వితీయ పురుషుని యావాసమనుట కంటె వీనిం గూర్చి యిప్పట్టున వేఱుగాఁ బ్రశంసింపఁజాలను.

బృహదారణ్యమందలి సప్తమాష్ట మాధ్యాయముల మాడ్కినిందలి దశమ ప్రపాఠకము ఖిల మనఁబడుచున్నది కర్మోపాసన బ్రహ్మకాండములలోఁ జెప్పఁగా మిలిగినదానిని బూర్తిగాఁ జెప్పునట్టి ప్రకీర్ణరూపమైన గ్రంథము ఖిల మనఁబడును. అట్లే యిది పై మూఁడు విషయములకు సంబంధించిన యవశిష్ట విషయములను జెప్పునదియై ఖిలసంజ్ఞను జెందినది. దీనికిఁ గూడ నుపనిషత్తను పేరు గలదు గాని యిది వల్లీత్రయమువలె శుద్ధముగా బ్రహ్మప్రతిపాదకము కాదు. అయినను, దీనికిని వైదిక వాఙ్మయమున నుత్తమ గౌరవముకలదు. దీనికి యాజ్ఞిక్యుపనిషత్తనెడిసంజ్ఞ వైదిక వాఙ్మయ ప్రసిద్ధము. ఇది 'అంభస్య పారే' ఇత్యాదిమంత్రముల బ్రహ్మతత్త్వమును, 'అదిత్యో వా ఏషఏతన్మండలం తపతి' ఇత్యాదిమంత్రముల నుపాసనమును, 'భూ రన్న మగ్నయే పృథివ్యై స్వాహా' ఇత్యాదిమంత్రముల యాగకర్మను జెప్పుచున్నది. ఇందు కర్మవాచిమంత్రము లెక్కువగా నుండుటను బట్టి దీనికి యాజ్ఞికీయను పేరు మొదట వచ్చినది. 'నారాయణం మహాజ్ఞేయం విశ్వాత్మానంపరాయణమ్' ఇత్యాదిమంత్రముల సకల జగదాత్మకుఁడైన నారాయణుఁడు వర్ణింపఁబడుటను బట్టి దీనికి నారాయణోపనిషత్తనెడి పేరు వ్యాప్తమైనది.

దీని పాఠసంప్రదాయము దేశవిశేషములందు బహువిధముగా నున్నది. ద్రావిడ పాఠమునుబట్టి యిందు ౬౪ అను వాకములును, కర్ణాటక పాఠమును బట్టి కొన్ని చోట్ల ౭౪ అనువాకములును, మఱికొందఱి పాఠమునుబట్టి ౮౦ అనువాకములును గనఁబడుచున్నవి. సాయణాచార్యులు దీనికి భాష్యము వ్రాయుచు ౬౪ అనువాకముల పాఠమునే ప్రధానముగా గ్రహించి పాఠభేదములను గూడ నాయా సందర్భముల సూచించుచువచ్చిరి. ఈ దృశమైన పాఠభేదముగూడ దీని యర్వాచీనతను బలపఱుచుచున్నది.

ఐతరేయబ్రాహ్మణమున కనుబంధమైన యైతరేయారణ్యకాండ మందైదు భాగములు కలవు. వానికిని బ్రథమారణ్యకము ద్వితీయారణ్యకమను రీతి నారణ్యక సంజ్ఞయే కలదు. అందు ప్రథమ ద్వితీయారణ్యకముల నైదేసియధ్యాయములును, తృతీయారణ్యకమున రెండధ్యాయములును, చతుర్థమున నొకటియు, పంచమమున మూఁడు నధ్యాయములు కలవు. ప్రతియధ్యాయమందు ననియతసంఖ్య గల ఖండములున్నవి.

మొదటికాండమందు సంవత్సర సత్రయాగశేషము పూరించుతఱి నపుతో మహావ్రతకర్మము వర్ణింపఁబడినది. ఇంద్రుఁడు వృత్రాసురుని సంహరించి

(మహాన్) మహచ్ఛబ్దవాచ్యుఁడయ్యెను. అట్టి వానినిమిత్తము చేయఁబడు సోమ పాన విశేషాత్మకమైన కర్మ మహావ్రతమయ్యెను. అని యిందలి మొదటి వాక్యము తెలుపుచున్నది. ఈ శబ్దమునకుఁ దైత్తిరీయులు మూఁడువిధములైన నిర్వచనములు చూపియున్నారు. ఈ వ్రతము చేసినవాఁడు గొప్పవాఁడగును గావున నిది మహావ్రతము. గొప్పవాఁడయిన దేవునిగూర్చి చేయునదిగావున మహావ్రతము. గొప్పదియైన వ్రతము కావున మహావ్రతము.

ద్వితీయ తృతీయ కాండములు జ్ఞానబోధకములు. అందుచే నివి యైతరేయోపనిషత్తనఁబడుచున్నవి ఇందలివిషయ మద్వైతమైన యాత్మతత్త్వము. సోదాహరణముగా సోపాఖ్యానముగా నిందు బ్రహ్మతత్త్వ ముపదేశింపఁబడినది. అందును, ఉత్తమ మధ్య మాధమ భేదము విద్యాధికారులైన ముగ్గురిలో నుత్తమునికి బ్రహ్మవిద్యయు మధ్యమునికిఁ బ్రాణవిద్యయు రెండవకాండమున విధింపఁబడినవి. అధమునకు సంహితోపాసనమే గతియని మూఁడవకాండమునఁ దెలుపఁబడినది. పాఠకాభిరుచికై ద్వితీయకాండమందలి రెండువాక్యముల భావమిందు తెలుపుచున్నాను.

"మనము నిత్య ముపాసనచేయునట్టి యాత్మ సోపాధికుఁడా? నిరుపాధికుఁడా? - లౌకికపురుషుఁడు దేనిచేఁ జూచుచున్నాఁడో, అట్టి చాక్షుషచైతన్యమా, లేక శబ్దము వినఁజేయు శ్రోత్రాభివ్యక్త చైతన్యమా, లేక వాగాదీంద్రియాభివ్యక్త చైతన్యమా, లేక హృదయమా, లేక మనస్సా, కాక సంజ్ఞానమా, అజ్ఞానమా, విజ్ఞానమా, ప్రజ్ఞానమా, కాక మేధా దృష్టి ధృతి మనీషలలో నేదయిన నొకటియా, అట్లుకాక వేగస్మృతి సంకల్పాదులలో నేదేని యొకటియా, ఎవఁడాత్మ!" అను సంశయమును దొలఁగించు నిర్ణయమిది.

"పూర్వోక్తములయిన వన్నియుఁ బ్రజ్ఞాన నామధేయములు. నిరుపాధికము సాక్షి చైతన్యమునగు ప్రజ్ఞానమే యాత్మ. అతఁడే పరబ్రహ్మము అతఁడే ప్రజాపతీంద్రాది సకల దేవతలు. పంచమహా భూతములు. సకలసృష్టి."

పై శంకా సమాధానములనుబట్టి యీ యారణ్యకోపనిషత్తు శుద్ధాద్వైత ప్రతిపాదకమని విదితమగును.

మిక్కిలి చిన్నదియగు నాల్గవ కాండమున నరణ్యమునం దధ్యయనము చేయవలసిన మహానామ్నీ నామక మంత్రములు చెప్పఁబడినవి. అయిదవ కాండమున మహావ్రత ప్రయోగము వివరింపఁబడినది. ప్రథమ కాండమందు చెప్పఁబడిన

విషయమే మరల నిందు గ్రహింపఁ బడుటనుబట్టి యీ కడపటి కాండము ప్రథమ కాండ వివరణరూపమైన యర్వాచీన కాండమని తెలియుచున్నది. దీనిని "పంచ మారణ్యక మృషిప్రోక్తం సూత్రమ్, ప్రథమారణ్యకం త్వపౌరుషేయం బ్రాహ్మణమ్" అనెడి సాయణాచార్య వచనముగూడ బలపఱుచుచున్నది. ప్రథమ కాండ మపౌరుషేయమా పౌరుషేయమా యనెడి విచారణతో మన కిపుడు పనిలేదు. "పంచమ కాండము ప్రథమ కాండముతోడిది గాదు, ఇది ఋషిప్రోక్తము" అనెడి వారి విశ్వాసముకూడ నిది యైతరేయారణ్యకమునఁ దరువాతఁ జేరిన దనుటకుఁ జాలును

ఉపనిషత్తులు

ఇది యగాధ మపారమునైన గొప్ప విషయము. ప్రతి వేదమునకును, దానికి సంబంధించిన బ్రాహ్మణమందో యారణ్యకమందో, కొంచెముగానో గొప్పగానో యుపనిషద్భాగముగూడఁ జేరియున్నట్లు మనము తెలిసికొని యున్నాము. నిజముగా నవి కర్మ ప్రతిపాదకములు కాకపోయినను వానిలో నేదుకుఁ జేరినవో మన మిపుడు చర్చింపఁజాలము. కర్మము జ్ఞానార్థమే కావునఁ గర్మనిష్ఠు లగువారికి జ్ఞానమార్గ ముపదేశించుట యావశ్యకమను తలంపుతో నవి యందు చేరియుండును. అది సముచితమే కాని, యజ్ఞాదికర్మలు చేయనీ చేయకపోనీ, వానితోఁ బనిలేకయే సాధన చతుష్టయ సంపన్నబ్ధమైన జ్ఞానమున ముక్తి గాంచవచ్చునని బోధించెడి యుపనిషత్తులు, యాగములలో ముంచి తేల్చునట్టి కేవల కర్మప్రతిపాదక గ్రంథమునకు సంబంధించినవి కావని మాత్రము తోఁచకపోదు. ఇట్లు బ్రాహ్మణారణ్యకములలో నిమిడియున్నవికాక, ఆ యా వేదములకు సంబంధించినవిగాఁ బేరుగాంచిన యుపనిషత్తులును, ఆ యా దేవతల పేరను ఋషుల పేరను వెలసిన యుపనిషత్తులును మఱికొన్ని కలవు. ఈ విధమున లోకమందు వ్యాపించిన యుపనిషత్తులు సుమారు రెండువందల లుండును. వానిలో నిజముగా వేదాంతము లనఁదగినవి దశోపనిషత్తులు మాత్రమే. అవియే శంకరాచార్యాదుల వాక్కులకు గుఱియై భాష్యభాగ్యము గాంచినవి. తక్కిన వన్నియు నాయా కాలములందు మతాభిమానులగు విద్వాంసులు రచించినవని వాని స్వరూప స్వభావములే చెప్పుచున్నవి కాని, యవియును భక్తినో జ్ఞానమునో బోధింప సహాయపడుచున్నవే కాని నిరర్థకములు కావు. అం దనేకములకు వ్యాఖ్యానములుగూడఁ గలవు. ఇట్లున్నవానిలో నేవి యే వేదమునకుఁ జెందినవో లభించినంతవఱకుఁ దెలిసికొనుటకు ముందుగా నొక్క విషయ మాలోచింపవలసి యున్నది.

వర్ణిత విషయమునుబట్టి, ఈ యుపనిషత్తీ వేదమునకు సంబంధించినదని నిర్ణయించుట కవకాశ మెక్కువ కనఁబడదుగాని, ఆయా వేదశాఖలకు సంబంధించిన యార్ష సంప్రదాయమునుబట్టియు, నుపనిషత్తులలో నందందు గనవచ్చు ఋషుల నామములనుబట్టియు, అక్కడక్కడ నుదాహరింపఁబడిన మంత్ర మంత్రార్థములను బట్టియు ఇది యీ వేదమునకు సంబంధించినదని యొక విధముగా నిర్ణయింప వచ్చును. ఇట్లుండఁగా, ఆనందాశ్రమాధికారులు క్రొత్తగాఁ బ్రకటించిన యుపనిషత్సముచ్చయమను గ్రంథమున నథర్వవేదమునకు సంబంధించినవిగా సవ్యాఖ్యానములైన ముప్పదిరెం డుపనిషత్తులు కనఁబడుచున్నవి. వా రే సంప్రదాయమునుబట్టి యవియెల్ల నథర్వ వేదీయములని నిరూపించిరో తెలియదుగాని, అందలి కొన్ని యుపనిషత్తులు ఋక్సామ కృష్ణ శుక్ల యజుశ్శాఖలకు సంబంధించినవిగా వాని యందలి ఋషి నామాదులవలనఁ దెలియవచ్చుచున్నది. ఇందు కొకటి రెం డుదాహరణములు.

జాబాలోపనిషత్తు శుక్ల యజుశ్శాఖకు సంబంధించిన దనుటకు దానియందలి 'అథహ జనకో హవై దేహో యాజ్ఞవల్క్య ముపసమేత్యోవాచ' ఇత్యాది వాక్యములు ప్రమాణ మగుచున్నవి ద్రావిడాంధ్ర దేశములందలి సంప్రదాయముగూడ నిది శుక్ల యజుశ్శాఖా సంబంధియే యని తెలుపుచున్నది. కైవల్యోపనిషత్తు కృష్ణ యజుశ్శాఖీయ మనియు ఋక్శాఖీయ మనియు ద్వివిధమైన సంప్రదాయము నుదేశమునఁ గలదు. అందలి "అథాఽఽశ్వలాయనో భగవన్తం పరమేష్ఠిన ముపసమేత్యోవాచ" అను ప్రథమ వాక్యమునుబట్టి యిది ఋక్శాఖీయముగాఁ గనవచ్చు చున్నది గాని యజుర్వేదీయమని ముక్తికోపనిషత్తు చెప్పుచున్నది. ఇట్లుండ నీ రెంటినిగూడ వా రథర్వవేదమునకుఁ జేర్చుటకుఁ గారణమేమో విచారణీయము. ఇట్లు సందేహాస్పదములయిన వీ గ్రంథమున నింకను గలవు. కావున దీనిని బ్రధానముగాఁ గైకొనక ముక్తికోపనిషత్తు చూపిన మార్గము ననుసరించి యాయా వేదములకు సంబంధించిన యష్టోత్తర శతోపనిషత్తుల నిందు పేర్కొనుచున్నాను. ఋక్శాఖలు ౨౧, యజుశ్శాఖలు ౧౦౯. సామశాఖలు ౧౦౦౦, అథర్వశాఖలు ౧౨, వీని కన్నిటికి నొక్కొక్క యుపనిషత్తు కలదని చెప్పుచు ముక్తికోపనిషత్తు ౧౦౮, ఉపనిషత్తులను మాత్రము చూపినది. ఇవియన్నియు సజీవములు. ఇందనేకములు ముద్రితములు, సభాష్యములు సవ్యాఖ్యానములు. లోకములోఁ గూడ నష్టోత్తరశతోపనిషత్తు లనెడి ప్రతీతి యధికముగాఁ గలదు.

వాఙ్మేమనసీత్యాది శాంతిగల యీ క్రింది పది యుపనిషత్తులును ఋక్శాఖలకు సంబంధించినవి అవి —

* ఐతరేయ కౌషీతకీ ఆత్మప్రబోధ నాదబిందు నిర్వాణ ముద్గల అక్ష మాలికా త్రిపురా సౌభాగ్య బహ్వృచ నామకములు.

ఆప్యాయన్త్విత్యాది శాంతిగల యీ క్రింది పదియాఱుపనిషత్తులును సామ శాఖలకు సంబంధించినవి. అవి—

* కేన * ఛాందోగ్య అరుణి మైత్రాయణీ మైత్రేయీ వజ్రసూచీ యోగ చూడామణి వాసుదేవ సన్న్యాస అవ్యక్త సావిత్రీ రుద్రాక్షజాబాల దర్శనజాబాలి కుండికా మహోపనిషన్నామకములు.

సహనావవత్విత్యాది శాంతిగల యీ క్రింది ముప్పదిరెండును, కృష్ణయజు శ్శాఖలకు సంబంధించినవి. అవి—

* [1]కఠవల్లి * తైత్తిరీయ నారాయణ బ్రహ్మకైవల్య శ్వేతాశ్వతర గర్భ అమృతబిందు అమృతనాద కాలాగ్నిరుద్ర క్షురికా సర్వసార శుకరహస్య తేజో బిందు ధ్యానబిందు బ్రహ్మవిద్యా యోగతత్త్వ దక్షిణామూర్తి కఠ[2] స్కంద శారీరక వరాహ యోగశిఖా ఏకాక్షర అక్షి అవధూత రుద్రహృదయ యోగకుండ లినీ పంచబ్రహ్మ కలిసంతరణ ప్రాణాగ్నిహోత్ర సరస్వతీరహస్య నామకములు.

పూర్ణమదః పూర్ణమిత్యాది శాంతిగల యీ క్రింది పందొమ్మిదియు శుక్లయజు శ్శాఖలకు సంబంధించినవి. అవి—

* ఈశావాస్య* బృహదారణ్య జాబాల సుబాల హంస పరమహంస మంత్రి కానిరాలంబ తారసార త్రిశిఖీ బ్రాహ్మణమండల బ్రాహ్మణ అద్వయతారక పైంగల భిక్షుకా తురీయాతీత అధ్యాత్మ ముక్తికా శాట్యాయనీ యాజ్ఞవల్క్య నామకములు.

భద్రంకర్ణేభి రిత్యాది శాంతిగల యీ క్రింది ముప్పదియొకటియు నథర్వ శాఖలకు సంబంధించినవి. అవి—

* ప్రశ్న * ముండక * మాండూక్య బృహజ్జాబాల నృసింహతాపినీ నారద పరివ్రాజక సీతా శరభ మహానారాయణ రామరహస్య రామతాపినీ శాండిల్య పరమహంస పరివ్రాజక అన్నపూర్ణా సూర్య ఆత్మ పరంబ్రహ్మ పాశుపత త్రిపుర

1. ఇదియే కఠోపనిషత్తనియు, కాఠకోపనిషత్తనియుఁ జెప్పఁబడుచున్నది. ఇదియే దశోపనిషత్తులలోనిది. వాడుకలో నిది కఠోపనిషత్తనఁబడుచున్నది.
2. ఇది కఠవల్లికంటె వేఱయినది. 'దేవాహవై భగవన్తమబ్రువన్' అని దీని మొదలు.

తాపినీ దేవీ భావనా భస్మజాబాల గణపతి మహావాక్య గోపాలతాపినీ కృష్ణ హయగ్రీవ గరుడ దత్తాత్రేయ అథర్వశిఖా అథర్వశిరో నామకములు.

పై వానిలో, పువ్వుగుర్తు కలవి దశోపనిషత్తులని ఖ్యాతి కెక్కినవి. ఇవి గాక, ఇతిహాస తత్త్వ పంచీకరణ వృద్ధజాబాల మాతామ్నాయ విద్యాతారకనామ నీలరుద్ర చిత్తి గాయత్రీ పింద సూర్యతాపినీ చూలికాదులయిన యుపనిషత్తు లింకను శతాధికముగాఁ గలవు. కాని, పై వానిలోను వీనిలోను గూడ ననేకము లష్టకములను శతకములను బోలియున్నవి. అనుష్టుప్ఛందో బద్ధములై ఖండకావ్యములవలెనున్న వీనిలో ముప్పాతికముప్వీస మత్యంత మర్వాచీనములనుట విదితము. అయినను బరమాత్మ విజ్ఞానబోధకము లయిన యివి యుపనిష న్నామమున వ్యవహరింపఁబడుచున్నవి పూర్వోక్తములయిన యష్టోత్తరశతోప నిషత్తుల మహత్త్వమును శ్రీరాముఁడు మారుతికిఁ జెప్పినట్లుగా ముక్తికోపనిషత్తి క్రింది విధముగాఁ జెప్పుచున్నది

ఇయం కైవల్య ముక్తిస్తు కేనోపాయేన సిద్ధ్యతి ?
మాండూక్య మేక మేవాలం ముముక్షూణాం విముక్తయే ॥
తథాఽప్యసిద్ధం చే జ్జ్ఞానం దశోపనిషదం పఠ ।
జ్ఞానం లబ్ధ్వాఽచిరా దేవ మామకం ధామ యాస్యసి ॥
తథాఽపి దృఢతా నో చే ద్విజ్ఞాన స్యాంజనాసుత ।
ద్వాత్రింశాఖ్యోపనిషదం సమభ్యస్య నివర్తయ ॥
విదేహముక్తా విచ్ఛా చే దష్టోత్తరశతం పఠ ।
తాసాం క్రమం సశాంతించ శృణు వక్ష్యామి తత్త్వతః ॥

దీనిఁబట్టి కైవల్యముక్తికి మాండూక్యము దశోపనిషత్తు క్రమముగాఁ బ్రధానములనియు. మొత్తము ౧౦౮ ఉపనిషత్తులు గూడ విదేహముక్తికి సాధనము లనియుఁ దెలియుచున్నది.

ఉపనిషద్విషయము

ఉపనిషత్తులందలి ముఖ్యవిషయము పరమాత్మతత్త్వము. సత్యజ్ఞానానంతరూపుఁడగు పరమేశ్వరుఁ డొకఁడు కలఁడనియు, అతనిచిద్విలాసమే యీ సకల చరాచరప్రపంచ మనియు, అతఁడే పరమాత్మ పరబ్రహ్మాది శబ్దవాచ్యుఁడనియు

జీవాత్మ పరమాత్మ ప్రతిబింబమే యనియు, దృశ్యమయిన సకలజగత్తు నశించు నదేయనియు, అదృశ్యమై సర్వవ్యాపకమైయున్న పరబ్రహ్మ మొకటియే నిత్య మనియు, వీని ముఖ్యమతము. జగత్తనాది. మాయయందు ప్రతిఫలించినపరమే శ్వరుని ప్రతిబింబమే జీవుఁడు. అవిద్యామగ్నుఁడయిన యా జీవుఁడు పూర్వ పూర్వ జన్మకృత పుణ్యపాపఫలము నుత్తరోత్తర జన్మముల ననుభవించుచు జనన మరణ ప్రవాహరూపమైన సంసారమున మునిఁగి తేలుచుండును. దానికిఁ గారణ మవిద్య. అవిద్యావినాశకము జ్ఞానము. అదియే, ఆత్మజ్ఞానము. జీవుఁడాత్మ జ్ఞానమున సమస్తబంధముల నెడఁబాసి ముక్తుఁడగును. అదియే జీవన్ముక్తి. సంసారబంధము నుండి విడివడుటయే ముక్తి. ముక్తునకుఁ బునరావృత్తిలేదు. కావున జీవున కాత్మజ్ఞాన మావశ్యకము.

దేనిచే నోరు మాటాడుచున్నదో మనస్సు తలఁచుచున్నదో కన్ను చూచు చున్నదో చెవి వినుచున్నదో తక్కిన యెల్లయవయవములును దమతమపనులు చేయుచున్నవో, అదే బ్రహ్మమని తెలిసికొనుము అనెడికేన వాక్యముల భావ మునుబట్టి సర్వేంద్రియాధిష్ఠాన చైతన్యస్వరూపమే పరబ్రహ్మమని యవగత మగును.

జాగ్రదవస్థయందు కర్మఫలము ప్రత్యక్షముగా ననుభవించునట్టి యాత్మ బహిఃప్రజ్ఞుఁడు. స్వప్నావస్థయందు తేజోరూపుఁడై సుఖదుఃఖము లనుభవించు వాఁడంతః ప్రజ్ఞుఁడు. సుషుప్త్యవస్థయందు ప్రజ్ఞానఘనుఁ డేకీభూతుఁ డానంద మయుఁడునై యానంద మనుభవించువాఁడు ప్రజ్ఞుఁడు. అతఁడే సర్వజ్ఞుఁడు సర్వేశ్వరుఁడు సర్వాంతర్యామి సర్వకారణుఁడు ఎవఁడీ మూఁడవస్థలలోని తన స్వరూపమును దరువాతి యవస్థయందు శాంతము శివ మద్వైత మంచిత్య మగ్రాహ్య మవ్యవహార్యముఁగాఁ దలంచునో యతఁడే యాత్మ. పరమాత్మ, పరబ్రహ్మము. అనెడి మాండూక్య వాక్యముల భావమునుబట్టి జీవాత్మ పరమాత్మల యభేదము గోచరించుచున్నది.

సంహితా బ్రాహ్మణములందు సగుణుఁడైన ప్రజాపతిచే నిర్మింపఁబడినట్లు వర్ణింపఁబడిన యీ సృష్టి యుపనిషత్తులం దవిద్యాపరికల్పిత మయినదిగా వర్ణింపఁ బడినది. మన కీద్వివిధమైన సృష్టివర్ణనలు పరస్పర విరుద్ధములుగాఁ గనఁబడును గాని యది వ్యావహారికదృష్టితోఁ గావింపఁబడినది. ఇది పారమార్థికదృష్టితోఁ గావింపఁబడినది. అని తలఁచినచో నా విరోధము తొలఁగిపోవును. మఱియు,

ఋగ్వేదకాలమందే, పరమేశ్వరుఁడు జగదభిన్న నిమిత్తోపాదాన కారణమనెడి పార మార్థికమయిన యాత్మతత్త్వజ్ఞాన మంకురించినదని యందలి 'నాసదాసీ న్నోసదాసీ' దిత్యాది ఋక్కులవల్లఁ దెలియవచ్చును. ఆవిజ్ఞానాంకురమే యజురాది సంహితాదులందు విస్తరించి తుద కుపనిషద్రూపమునఁ బరిణమించి వైదికవాఙ్మయ శిరోరత్నమై సకలలోకమున కాత్మతత్త్వము దెలియఁ జేయుదివ్యజ్యోతియై వెలుంగుచున్నదనుట విదితము. విశేష ప్రతిభాశాలులైన విద్వాంసుల వాక్కులకు గుటియైన యీ యుపనిషత్తులు తరువాత వెలువడిన వివిధవేదాంత శాస్త్రములకును విభిన్న మతములకు నవలంబనములైనట్లు కనఁబడుచున్నను, సుప్రసిద్ధములైన యీశకేనకఠతైత్తిరీయాదులన్నియు జీవేశ్వరాభేద వాదమునే చాటుచున్నవని తదర్థ తత్త్వవిచారణచే గోచరింపకపోదు.

ఛాందోగ్యమునం దారుణియైన యుద్దాలకుఁడు తనపుత్రుఁడైన శ్వేతకేతువునకుఁ దత్త్వముపదేశించుచుఁ బల్కిన ''స య ఏషో ఽణి మైతదాత్మ్య మిదం సర్వం తత్సత్యం స ఆత్మా తత్త్వ మసి శ్వేతకేతో'' ఇత్యాదివాక్యములును, బృహదారణ్యములోని "బ్రహ్మవా ఇద మగ్ర ఆసీ త్తదాత్మాన మే వావే దహం బ్రహ్మాస్మీతి తస్మా త్సర్వ మభవత్ య ఏవం వే దాహం బ్రహ్మాస్మీతి స ఇదం సర్వం భవతి" ఇత్యాదివాక్యములును. ఇంక నిట్లే యితరోపనిషద్వాక్యములును బూర్వోక్తమైన జీవేశ్వరాద్వైతమునే బోధించుచున్న వనుట స్పష్టము. ఈ యర్థమునే "పాలలో నెయ్యివలె నాత్మ సర్వజగత్తునందు వ్యాపించియున్న'' దని భంగ్యంతరముగా శ్వేతాశ్వతరోపనిషత్తు చెప్పినది.

మొత్తముమీఁద నుపనిషత్తులన్నియు నజ్ఞానము జననమరణ ప్రవాహ రూప సంసారదుఃఖకారణము, ఆత్మజ్ఞానము ముక్తిహేతువు ననువిషయములను సోపపత్తికముగా సప్రమాణముగా నిరూపించునవేయైనను, ఒక్కొక్కదాని యందొక్కొక్క విశేషలక్షణము గూడ లేకపోలేదు. పూర్వోత్తరజన్మ సద్భావమును ఛాందోగ్యము చక్కఁగా వర్ణించినది. మరణానంతర జీవవిషయక సంశయమును కఠవల్లి తీర్చినది. పరమేశ్వరుఁడు మాయి యనియు, జగము మాయయనియు శ్వేతాశ్వతరము నిరూపించినది. ఉత్తమలోక ప్రాప్తిని దన్మార్గములను బృహదారణ్యాదులు వివరించినవి. ఈ విశ్వమంతయుఁ బరబ్రహ్మమే యని ముండకోపనిషత్తు వక్కాణించినది: సమస్తభూతములను దనయందును, తన్ను సమస్తభూతములందును జూచువాఁడు జ్ఞానియని యీశావాస్యము చెప్పినది ఉపనిషద్రాజ మయిన తైత్తిరీయము 'బ్రహ్మ విదాప్నోతి పర' మిత్యాది వాక్యములచే బ్రహ్మజ్ఞానమున

ముక్తి కలుగునని నిరూపించుచు బ్రహ్మతత్త్వ ముపదేశించినది. ఇట్లే యాయా విశేషము లందందు గనవచ్చుచున్నను మొత్తముమీఁద నుపనిషత్తు లన్నియు జీవేశ్వరుల యద్వైతమునందే సమన్వయము గాంచుచున్నవనుట నిర్వివాదము. ఆత్మ తత్త్వ విషయక ప్రశ్నలన్నిటికి యుక్తిప్రమాణానుభవ సిద్ధముగా సమాధానము లిచ్చిన ప్రశ్నోపనిషత్తే పై యభిప్రాయము ధ్రువపఱుపఁ బరమప్రమాణ మగును. కౌసల్యాశ్వలాయవ వైదర్భిభార్గవ శైబ్య సత్యకామ సుకేశో భరద్వాజ ప్రభృతులైన మహామునులు పరబ్రహ్మము నన్వేషింపఁ గోరినవారై తన్మార్గ ముపదేశింప సమర్థుఁడగు పిప్పలాదమహర్షిని సందర్శించి కొన్ని ప్రశ్నలు వేయఁగా నతఁడన్నిటికి సదుత్తరము లిచ్చి తుదకు ''అహమేత త్పరం బ్రహ్మ వేద నాతః పర మస్తి' అని సమాధానము చెప్పి వారికిఁ దత్త్వ ముపదేశించినట్లు వర్ణింపఁబడి నది. ఇదియే సకలోపనిషత్తులందలి ముఖ్యవిషయము. ఏతాదృశ సత్యవిషయము భారతలోకమును బావనముఁ గావించుచుఁ దత్త్వజిజ్ఞాసువులకుఁ దరణోపాయ మగుటకుఁ గారణము ప్రాచీనమహర్షుల తపఃఫలము గాక మఱేమి ?

సుప్రసిద్ధములైన యుపనిషత్తులలోఁ గొన్ని ప్రాచీనతమము లనఁగా బౌద్ధ మత ప్రాగ్భవములని పాశ్చాత్య విమర్శకులు కొందఱూహించుట యుచితమే కాని యందలి కొన్నిటి ప్రాచీనత తావన్మాత్రమే కాదు. భాషారీతినిబట్టి చూచినచో నారణ్యకములం దంతర్భూతములైన తైత్తిరీయ బృహదారణ్యకోపనిషత్తులు రెండును వాని బ్రాహ్మణముల యవ్యవహితోత్తర కాలములందే యావిర్భవించినవని యంగీకరింపక తప్పదు. వాని గద్యశైలిగూడ నీ విషయమునే దృఢపఱుచు చున్నది. అట్టిదే ఛాందోగ్యమును. కాని యది సామవేద బ్రాహ్మణములలో నాఱవది యగు నుపనిషద్బ్రాహ్మణముకంటె నన్యము గాకపోయినను గొంచెము సరళమైన దాని గద్యశైలి పై రెండింటికంటె దానిని ముందుకు లాగుచున్నది. ఐతరేయ కౌషీతక్యుపనిషత్తు లీ మూఁడింటి తరువాతివని వీని బ్రాహ్మణముల యర్వాచీనతయే తెలుపుచున్నది. అయినను మొత్త మీ యైదు నుపనిషద్వాఙ్మయ మునఁ బ్రథమము లనుట నిరాక్షేపము. గద్యమయములైన వీనికిని, పద్యమయము లైన కఠాదులకును మధ్యకాలమునందు కేనోపనిషత్తు పుట్టియుండునని దాని గద్య పద్యమయత్వమే తెలుపుచున్నది. ముప్పది నాలుగు మంత్రముల చిన్న గ్రంథ మగు నది విషయమునందు ప్రథమ కాలికములనే యనుసరించియున్నది.

తరువాత నుదయించినవి, ఈశావాస్యకఠవల్లీ శ్వేతాశ్వతర ముండకోప నిషత్తులు. విషయ సంపదచేఁ బైవానిని బోలియున్న యివి కవిత్వ సంపదచే

వానినుండి వేఱుపడి యతి మనోహరములై ద్వితీయ కాలికము లనఁదగియున్నవి. ఇందు మొదటిది పదునెనిమిది మంత్రముల చిన్న యుపనిషత్తు. పిదపఁ దృతీయ కాలికములుగా గణింపఁదగినవి ప్రశ్న మైత్రాయణీ మాండూక్యోపనిషత్తులు. వీని యందలి భాష వైదికభాష నించుక స్మరింపఁ జేయుచుండియు నెక్కువగా లౌకిక భాషకుఁ జేరియున్నది. వీనిలో మాండూక్యము మిక్కిలి చిన్నది. ఇందు పండ్రెండు మంత్రములు మాత్రమే కలవు ఇట్లు భిన్నభిన్న కాలముల నవతరించినవానిలో నథర్వవేద సంబంధములగు ముండక ప్రశ్న మాండూక్యములు దశోపనిషత్తులలోఁ జేరుటనుబట్టి చూడఁగా నథర్వవేదోపనిషత్తు లుదయించినపిదప దశోపనిషత్పరి గణనము సంభవించినట్లు తెలియవచ్చును. మఱియు నాయా కాలములం దాయా వేదములకు సంబంధించిన యితరోపనిషత్తులుఁగూడ మఱికొన్ని పుట్టియున్నను, పూర్వులదృష్టి నీ పది మాత్రమే యాకర్షించెననియు నూహింపవచ్చును. అయినను, గుణమునందు కౌషీతకీ మైత్రాయణీ శ్వేతాశ్వతరములు దశోపనిషత్తుల కీడు కావని మాత్రము తలంపరాదు. భాష్యకర్తలు పెక్కు సందర్భముల వీనిలోని వాక్యము లుదాహరించుటయే యిందుకుఁ దార్కాణము. ఇఁకనో యష్టోత్తర శతములోని తక్కిన వన్నియుఁ జతుర్థ కాలికములుగా గణింపఁ దగినవని చెప్పవచ్చును. వానిలో —

మహానారాయణోపనిషత్తు విశిష్టాద్వైత మంకురించిన కాలమున జనియించిన దని యందలి విషయ వివరణమునుబట్టి తెలిసికొనవచ్చును. అందు, పరబ్రహ్మ సాకార నిరాకార స్వరూపము మూలావిద్యా ప్రలయ స్వరూపము పరమాత్మ తత్త్వము సంసార తరణోపాయము పరమ మోక్షమార్గము పరమేశ్వర స్వరూపము పరమ సాయుజ్యముక్త స్వరూపము మొదలగు విషయములు నిరూపింపఁ బడినవి. బహ్వృచోపనిషత్తు మిక్కిలి చిన్నది. ఇది శాక్తమత మంకురించిన కాలమున జనించినది. 'యత్త్రియ మానన్దం త దేత త్సర్వాకారా మహా త్రిపురసుందరీ' ఇత్యాది వాక్యములే యిందుకుఁ బ్రమాణము. ఇట్లే రుద్రహృదయాదులు కొన్ని శైవమతావలంబనములు, సూర్యోపనిషదాదులు కొన్ని సౌరమత ప్రధానములు, గణపత్యాదులు గాణాపత్యమత మూలములునై వెలసినవి. అయినను, ఈ కాల మందలి వానిలోఁ గూడఁ గైవల్యా ద్యుపనిషత్తులు కొన్ని ప్రథమ ద్వితీయ కాలములందలి యుపనిషత్తులవలెఁ బరతత్త్వ వివరణమున సమర్థములు కాకపోలేదు. కైవల్యోపనిషత్తునందలి యిరువది నాలుగు శ్లోకములును సకలోపనిషత్సార భూతములై పరతత్త్వమును సులభముగా బోధించుచున్నవి. అందలివి రెండు శ్లోకములు.

యత్పరం బ్రహ్మ సర్వాత్మా విశ్వస్యాయతనం మహత్ ।
సూక్ష్మాత్ సూక్ష్మతరం నిత్యం తత్త్వమేవ త్వమేవ తత్ ॥

జాగ్రత్స్వప్నసుషుప్త్యాది ప్రపంచం యత్ప్రకాశతే ।
తద్బ్రహ్మాహ మితి జ్ఞాత్వా సర్వబంధైః ప్రముచ్యతే ॥

విశ్వరూపము సకలజగ దధిష్ఠానమునైన పరబ్రహ్మము నీవే. జాగ్రదాద్యవస్థలయం దేది యేకాకారమై ప్రకాశించుచున్నదో, ఆ పరబ్రహ్మము నేనే యని తెలిసికొనువాఁడు సర్వబంధ విముక్తుఁ డగునని వీని భావము ఇట్లే, అధ్యాత్మోపనిషత్తు మహా వాక్యోపనిషత్తు మొదలయినవికూడ నర్వాచీనములలో సహృదయ రంజకములై పరతత్త్వ బోధకము లగుచున్నవి కాని, యద్వైత బోధకములయిన యట్టి వానియందలి ముఖ్యవిషయ మంతయుఁ దైత్తిరీయ బృహదారణ్యాది ప్రధానోప నిషత్తులలోని దానికంటె నన్యముకాదు. అయినను పద్ధతులు వేఱుగా నుండును. ఇంక రామతాపినీ గోపాలతాపినీ హయగ్రీవ రుద్రాక్ష జాబాలాదులు వివిధములైన పౌరాణిక మతములు వెలసినపిదప బయలువెడలినవనుట విస్పష్టము. ఇట్లు పురాణ కాలమున నంకురించిన యుపనిషద్రచనావేశము తుదకు మహమ్మదీయ మతబోధకమైన యల్లోపనిషత్తు వఱకును వచ్చిన దనుటచే నుపనిషత్ప్రపంచ మెంతవఱకు విస్తరించెనో తెలిసికొనవచ్చును.

ఇది, బ్రహ్మసూత్రార్థ దీపికారణోఽనన్తర వివాహ సంస్కృత కృతి
కర్తయు, ఉత్తర రామచరిత భీష్మ ప్రతిజ్ఞా ప్రేమతత్వా
ద్యాంధ్ర కృతికర్తయు నగు మల్లాది సూర్య
నారాయణశాస్త్రి నిర్మించిన సంస్కృత
వాఙ్మయ చరిత్ర ప్రథమభాగ
వైదిక వాఙ్మయమున
సప్తమాధ్యాయము.

అ ష్ట మా ధ్యా య ము

వే దా ఙ్గ ము లు

వేదములకు సంబంధించిన శిక్షాద్యంగములు సూత్ర వాఙ్మయములోఁ జేరఁ దగినవైనను, ఇవి ప్రత్యేక నామమునఁ బ్రసిద్ధి వహించియున్నవి కావున వేఱుగా వీని స్వరూప మొకింత పరిశీలింతము.

'శిక్షా వ్యాకరణం ఛందో నిరుక్తం జ్యోతిషం తథా
కల్ప శ్చేతి షడఙ్గాని వేద స్యాహు ర్మనీషిణః'

అను ప్రసిద్ధ శ్లోకమునఁ గనవచ్చు షడంగములను మాటయు, వాని నామములును బహు గ్రంథములందు గలవు.[1] పాణినీయమునకుఁ బూర్వమైన యాపస్తంబ ధర్మసూత్రమందు ''షడఙ్గో వేదః, ఛందః కల్పో వ్యాకరణం జ్యోతిషం నిరుక్తం శిక్షా ఛందో విచితి రితి'అనియు, దానికంటెను బూర్వమైన ముండకోపనిషత్తునందు 'శిక్షా కల్పో వ్యాకరణం నిరుక్తం ఛందో జ్యోతిష' మ్మనియు, షడంగ సంజ్ఞలు కనవచ్చుచున్నవి. మఱియు నాపస్తంబునిచేఁ బేర్కొనఁబడిన మనుస్మృతి పంక్తిపావనులైన బ్రాహ్మణులను గణించుచు, 'అగ్ర్యా స్సర్వేషు వేదేషు సర్వ ప్రవచనేషు చ' అని వక్కాణించినది. చతుర్వేదము లెఱిఁగిన వారును సకల ప్రవచనము లెఱిఁగినవారును శ్రేష్ఠులని దీని భావము. ఇందలి ప్రవచన శబ్దమునకు 'వేనిచే వేదార్థము చక్కఁగాఁ జెప్పఁబడునో యవి ప్రవచనములు, అవియే వేదాంగము' లనెడి యర్థమును కుల్లూకభట్టు వివరించెను. ప్రవచన శబ్దమునకు బ్రాహ్మణమనియు, వేదము నితరులకుఁ జెప్పుట యనియు నితరార్థము లున్నను, వేదాంగము లనెడి యర్థముకూడఁ గలదని సంప్రదాయ సిద్ధమైన కుల్లూకభట్టువచనము తెలుపకపోదు. అదిగాక యీ యర్థమందే ప్రయోగింపఁబడిన మనుస్మృతిలోని దీని తరువాతి శ్లోకమందలి 'షడఙ్గవిత్' అను ప్రయోగముకూడ దీనిని బలపఱుచుచున్నది.[2] ఇది యిట్లుండ షడ్వింశ బ్రాహ్మణములో 'చత్వారోఽస్యై వేదాః శరీరం షడఙ్గా న్యఙ్గాని' అను వాక్యము కనవచ్చుచున్నది. కావునఁ గొన్ని

1 నిరు. 1-20 ముండకో 1-1.

2. మను 3. 184, 185.

బ్రాహ్మణముల కాలమందే వేదముల యర్థము వివరింప సహాయపడు నంగభూతము లైన గ్రంథము లాఱును గలవని నిశ్చయింపవచ్చును. కాని, ఆ వేదాంగము లెట్టివి? ఆ గ్రంథము లేవి? అను విషయము లిపుడు విచారణీయము లగును.

౧. వర్ణ స్వరస్థాన ప్రయత్నాదులను శిక్షించునది శిక్ష.

౨. ప్రకృతిప్రత్యయ పదస్వరూపతదర్థాదులు వివరించునది వ్యాకరణము.

౩. మంత్రముల వృత్తలక్షణములను నిరూపించునది ఛందస్సు.

౪. శబ్దముల యర్థములను నిరపేక్షముగా నిర్వచించునది నిరుక్తము.

౫. యాగాదుల యాచరణమునకును, తదర్థసిద్ధికిని దగిన గ్రహనక్షత్రాదుల యుదయాస్తమయాదులను దెలుపునది జ్యోతిషము

౬. యాగప్రయోగమును సమర్థించునది కల్పము.

ఏతాదృశ లక్షణలక్షితములై వేదముల కంగము లనఁబడుచున్న వానిలో నొక్కొక్కదానినే గ్రహించి పరీక్షింతము.

౧ శిక్ష :— తైత్తిరీయ లుపనిషదారంభమందు 'శిక్షాం వ్యాఖ్యాస్యామః। వర్ణః స్వరః। మాత్రా బలమ్। సామ సంతానః। ఇత్యుక్తః శిక్షాధ్యాయః, అను వాక్యములను బఠింతురు. కాని యీ యనువాకము తరువాతి యనువాకములం దుపాసనాధ్యాత్మాది విషయములు చెప్పఁబడినవి కాని వర్ణస్వరోచ్చారణాది విషయము చెప్పఁబడలేదు సాయణాచార్యులు పై యనువాకమున కర్థము వివరించుచు ''అకారాదికము వర్ణము, ఉదాత్తాదికము స్వరము, హ్రస్వదీర్ఘాదిక మాత్ర, స్పృష్టాదిక ప్రయత్నము బలము, తొందరగాని యాలస్యము గాని లేకుండ యుక్త కాలమందు విహితమైన స్వరాద్యుచ్చారణసామ్యము సమము, పూర్వోత్తర వర్ణముల సంహిత సంతానము. ఈ వర్ణాదు లాఱును, తత్తల్లక్షణ లక్షితములై పఠనీయము లగును. ఇది శిక్షారూపమైన యధ్యాయము" అని తెలిపి, మఱియొకచోట 'స చాఙ్గభూతశిక్షాగ్రంథే స్పష్ట ముదీరితః' వర్ణాదికము వేదాంగశిక్షలో స్పష్టముగాఁ జెప్పఁబడినది. అని వ్రాయుటనుబట్టి యింతకు మున్నుదాహరించిన తైత్తిరీయాను వాకము శిక్ష కాదనియు, పాణినీయశిక్ష యనుపేరఁ బ్రసిద్ధమైన శిక్షాగ్రంథమే వేదాంగశిక్ష యనియు వైదిక సంప్రదాయ మనుసరించినవారి మతమునఁ దెలియు చున్నది. ఇది ఇట్లుండ విద్యలు పదునాలుగనియు, పదునెనిమిది యనియు రెండు పాఠములు పురాణాది ప్రసిద్ధములై యున్నవి. ఇందు మొదటి దానియందు

నాలుగువేదములు నాఱువేదాంగములు మీమాంసా న్యాయవిస్తరపురాణ ధర్మశాస్త్ర ములను జేరినవి. రెండవపాఠమున నవియును, ఆయుర్వేద ధనుర్వేద గాంధర్వార్థ శాస్త్రములును జేరినవి.[1] ఛాందోగ్యోపనిషత్తు సప్తమ ప్రపాఠకమున నీ యష్టాదశవిద్యలు నిట్లు కనఁబడుచున్నవి.

ఋగాదివేదములు నాలుగు, ఇతిహాసపురాణము వేదముల వేదము— పిత్ర్యము రాశిదైవము నిధి వాకోవాక్యము ఏకాయనము దేవవిద్య బ్రహ్మవిద్య భూతవిద్య క్షత్రవిద్య సర్ప దేవజన్యవిద్య.[2]

వీనిలో వేదముల వేద మనఁగా వేదముల పదవిభాగాది జ్ఞానము కలిగించు వ్యాకరణ మనియు.[3] రాశిదైవ నిధులు మూఁడును గణితోత్పాతమహాకాలాది విజ్ఞానము కలిగించుశాస్త్రము లనియును, దేవవిద్య నిరుక్త మనియు, బ్రహ్మవిద్య యనఁగా వేదములకు సంబంధించిన శిక్షాకల్ప ఛందస్సులనియు, నక్షత్రవిద్య జ్యోతిషమనియు, శంకరభగవత్పాదులు విశదీకరించియున్నారు. దీనినిబట్టి శిక్షాది వేదాంగములు షడ్వింశ బ్రాహ్మణమునకుఁ బూర్వము బ్రహ్మవిద్యాది రూపమున నుండెనని యూహింపవచ్చును. ఇది యిట్లుండ ఛాందోగ్యమునకుఁ బూర్వమైన బృహదారణ్య కోపనిషత్తు చతుర్థాధ్యాయమున, ఋగ్వేదాదులు నాలుగు ఇతిహాసము పురాణము విద్య ఉపనిషత్తులు శ్లోకములు సూత్రములు అనువ్యాఖ్యానములు వ్యాఖ్యానములు, అనునవి పరమేశ్వరనిశ్వసితములని చెప్పఁబడినవి. ఇందితిహాసాదు లెనిమిదియు మంత్ర బ్రాహ్మణాత్మక వేదాంతర్గతములైన యష్టవిధ బ్రాహ్మణభాగములని శంకరాచార్యులు సెలవిచ్చియున్నారు. దీనినిబట్టి చూడఁగా బృహదారణ్యకము నాఁటికి వేదాంగసంజ్ఞ కాని శిక్షావ్యాకరణాది సంజ్ఞలుగాని యాసంజ్ఞలతోడి గ్రంథములుగాని లేవేమోయని సంశయింపవలసి వచ్చుచున్నది సూత్రములనెడి మాట యొకటి యున్నది గాని వేదమందలి వస్తు సంగ్రహ వాక్యములే సూత్రములని

1. గాంధర్వమునకు బదులు నీతిశాస్త్రము కొన్నిటలో నున్నది
2. ఛాం. ఉ. 7. 2. శంకరభాష్యము - పిత్ర్యము - శ్రాద్ధకల్పము, వాకోవాక్యము = తర్కశాస్త్రము. ఏకాయనము = నీతిశాస్త్రము, భూతవిద్య = భూతతంత్రము, క్షత్రవిద్య = ధనుర్వేదము, సర్పవిద్య = గారుడము, దేవజనవిద్య = నృత్తగీత వాద్యశిల్పాదులు.
3. ఛాం. వేదానాం వేదం.— వ్యాకరణేన హి పదాది విభాగశః ఋగ్వేదాదయో జ్ఞాయంతే శం. భా. — వేదానాం వేదం ప్రకృతి ప్రత్యయ విభాగా వేదకం వ్యాకరణ మిత్యర్థః. ఆనందగిరి—

యాచార్యుల వారర్థము వ్రాసియుండుటచే నది వేదాంగమాత్ర పరముకాదని విదితమగుచున్నది. అందుచే వేదశబ్దార్థాది విజ్ఞానమున కందలియష్టవిధ బ్రాహ్మణభాగములే తొల్లి తోడ్పడుచుండెనని భావింపవలసి యున్నది. దీనినిబట్టి మనమిపుడే శిక్షావ్యాకరణాదులు వేదాంగములని తలఁచుచున్నామో, అవి బృహదారణ్యకాలమునఁ గనరావనియు, ఛాందోగ్యకాలమున షడంగములనుపేరు లేకుండ నవి మఱియొకవిధమునఁ గనవచ్చుచున్న వనియు, షడ్వింశ బ్రాహ్మణకాలమున షడంగసంజ్ఞ కనఁబడుచున్నదనియు, ముండకోపనిషదాదుల కాలమున శిక్షాదిషడంగము లేర్పడియుండు ననియు గోచరించుచున్నది. కావున శిక్షయనునది తైత్తిరీయోపనిషత్తులోనియే కానువాకము మాత్రము కాక, పాణినీయశిక్ష యనుపేర విదితమైనదే వేదాంగశిక్షయని పెద్దలవ్రాఁతలను బట్టి విశ్వసింపవలసియున్నది. కాని, యిందొక విప్రతిపత్తి మాత్రము పొడగట్టుచున్నది.

షడ్వింశ బ్రాహ్మణము పాణినీయమునకుఁ బూర్వమగుటచే నది పేర్కొన్న షడంగములలోని శిక్ష పాణినిశిక్ష కాదనుట నిజము సరిగదా, యిది పాణినికృతము కూడఁ గాదు. సిద్ధాంత కౌముదీ పరిశిష్టముగా ముద్రితమైన యఱువది శ్లోకముల యీ చిన్న గ్రంథము పాణిని నిర్మితమని కొందఱు తలఁచుచున్నారు గాని, యది సరి యనరాదు. పాణినీయ మతము ననుసరించి యీ శిక్ష వచియించు చున్నానని గ్రంథకర్త మొదటఁజేసిన ప్రతిజ్ఞయు, త్రినయనముఖ నిఃసృతమైన దీనిని బఠించు బ్రాహ్మణుఁడు సకల శుభములు పొందునని కడపటఁ జెప్పిన ఫలశ్రుతియు 'తస్మై పాణినయే నమః' అని పాణినికి సమర్పించిన నమస్కారమును, ఇది పాణిని కృతము కాదని చాటుచున్నవి. త్రినయనుఁడను విద్వాంసుఁడు వీనిని రచించెనో లేక, ఒకానొక పండితుఁడు దీనిని రచియించి 'అఇఉణ్' మొదలగు మాహేశ్వర సూత్రము లాధారముగాఁ బాణినీయను వెలయుటఁజేసి యిది మహేశ్వరకృత మనెడి విశ్వాసము లోకమునఁ గలిగించుటకై యిది త్రినయనకృత మనెనో సరిగాఁ జెప్పఁజాలము. ఇది యిట్లుండ మఱియొక విశేషము.

ఈ పాణినీయశిక్ష, ఉదాత్తానుదాత్తస్వరిత స్వరకల్పనముతో వారాణసీ పురమున ముద్రితమైనది. దీని కీస్వర మెట్లు వచ్చెనో చెప్పఁజాలము. శిక్షాప్రకాశ మనెడి వ్యాఖ్యగూడ దీనితోనే ముద్రితమై యున్నది. వ్యాఖ్యాత పేరు కనఁబడదుగాని, అతఁడు వ్యాఖ్యానారంభమందలి యుపోద్ఘాతములో, ఛందస్సూత్రకర్త యగు పింగళాచార్యుఁడు పాణినీయమతము ననుసరించి యీ శిక్ష రచియించెనని తెలిపియున్నాఁడు. కాని కడపటనున్న 'త్రినయనముఖనిఃసృతా' మిత్యాది శ్లోక

మైత్రియు నీ పదమునకు మాత్ర మర్థము వ్రాయలేదు. ఈ వ్యాఖ్యాత మతమును బట్టి పింగళాచార్యుఁడు పాణినీయ శిక్షాకర్తయని తలంతమన్న నతనికిఁ బ్రినయనుఁ దను నామాంతరమో లేక బిరుదనామమో యున్న ట్లూహింపవలసియుండును గాని యతని కీ రెండునుగూడఁ బ్రసిద్ధములు గావు. ఇది యెట్లున్నను, దీనినిబట్టి పూర్వోక్తశిక్ష పాణినికృతము కాదని మాత్రము నిశ్చయముగా వక్కాణింప వచ్చును.

మనకంటి కిపుడు గోచరించు శిక్షాగ్రంథము పాణినికృతము గాకపోయినను, ఇందలి విషయము మాత్రము పాణినికి మున్నే యేరూపముననో షడ్వింశాదులు పేర్కొన్న షడంగములలో నుండెడిదనియు, అదియే పాణినీయమున నంత ర్భూతమై తరువాతఁ బాణినిభక్తుని ముఖమున నీగ్రంథరూపము దాల్చి పాణినీయ శిక్ష యనుపేర విదితమయ్యెననియు విశ్వసింపవచ్చును. తక్కిన యంగముల సంగతిగూడ నిట్టిదే. ఇందు కొక చిన్న దృష్టాంతము.

వైదిక సంప్రదాయమునుబట్టి షడ్వింశాదులు పేర్కొన్న షడంగములలో నిరుక్తముకూడ నుండెననుట యుచితముగదా ! అప్పటి కేదో యొక రూపమున నిరుక్తమే లేనిచో యాస్కుఁడు నిరుక్త మారంభించుచు 'వేదాంగాని' యని బహు వచనముగా వేదాంగముల నెట్లు స్మరింపఁ గలుగును ? నిరుక్తముగాక తక్కిన యంగములుండు నందుమేని షడ్వింశ ముండకాదుల షడంగము లెట్లనఁ గలిగినవి ? కావున వెనుక ఛాందోగ్యములోని బ్రహ్మవిద్యాదులకు శంకరాచార్యు లర్థము చెప్పినట్లుగా, అష్టవిధ బ్రాహ్మణములే మంత్రార్థ వివరణాదులకుఁ దోడ్పడుచుండె నవియే కొన్ని కలసియుఁ గొన్ని వేఱుపడియు షడంగ సంజ్ఞను జెందెననియు, అవియే క్రమముగా శిక్షాదిరూపము దాల్చెననియు నూహింపవలసియున్నది. ఇట్లు తెలియవచ్చిన యీ శిక్ష లోకమునందును వేదమునందునుగూడ నున్న శబ్దములను శాసించునదైనను వేదమునకుఁగూడ నుద్దేశింపఁబడిన దగుటచే వేదాంగ శిక్షయై ఖ్యాతి కెక్కినది. ఇఁక నీ సందర్భమునఁ దక్కిన శిక్షా గ్రంథములనుగూర్చి కూడ నించుక ప్రసంగింతము.

వేదాంగశిక్ష యనుపేరు లేకున్నను వేద స్వరవర్ణోచ్చారణ సంధ్యాది లక్షణ ములను వివరించునట్టి శిక్ష లనేకము లున్నవి. అందు కొన్ని నవశిక్షలను ఖ్యాతి గాంచినవి కాని, వానినిగూర్చి పాఠభేదములు కలవు. ఆ నవశిక్షలతోఁగూడ నిపుడు ముద్రితములు నముద్రితములునైన శిక్షలు రమారమి యేఁబది గనఁబడుచున్నవి. అందు కొన్ని ప్రాచీన మహర్షులపేర నున్నవి. కొన్ని యర్వాచీన విద్వాంసులు

రచించినట్లున్నవి. అం దనేకములు పద్యమయములు కొన్ని మాత్రము గద్య మయములు. అవి యన్నియుఁగూడ స్వరవర్ణ పదక్రమ జటాఘనాదులలో నేదేని యొక విషయమును బోధించుచు వేదములకు సంబంధించినవనుట సత్యము. పరి శీలింపఁగా నవి యన్నియుఁ బ్రాతిశాఖ్య గ్రంథములు విస్తరించినపిదపఁ దత్తల్లక్షణ సంగ్రహములుగా బయలుదేఱిన యర్వాచీన లక్షణములని తెలియవచ్చును. పరిమాణమునందు మిక్కిలి చిన్నవయ్యుఁ బ్రాతిశాఖ్యలవలె వివిధ వేదశాఖలకు సంబంధించినవిగాఁ గనవచ్చు నట్టి శిక్షారూప లక్షణములఁ దెలిసికొనుట కిదియే యదను గావునఁ దెలిసినంతవఱకు వానినెల్ల నిందు శాఖా క్రమమునఁ బేర్కొను చున్నాను

పాణిని - వ్యాస - భరద్వాజ - వ్యాళ - వ్యాళి - వాల్మీకి - కౌహల - కాలనిర్ణయ - బోధాయన - సర్వసమ్మత - సిద్ధాంత - ఆరణ్య - హారిత - నామ కములైన పదమూఁడు శిక్షలునెల్ల వేదశాఖలకు సంబంధించినవి. పాణినిశిక్ష ఋక్శాఖకు సంబంధించినదని యొకరనిరి గాని, యది సర్వవేద సంబంధమే యని పెక్కండ్రయాశయము. అందలి విషయముగూడ సర్వసాధారణమైనదిగాని యొక వేదమునకే చెందినది కాదు.

శమానశిక్ష ఋక్శాఖాసంబంధముగాఁ గనవచ్చుచున్నది.

నారద గౌతమ లోమశ శిక్షలు మూఁడును సామశాఖా సంబంధములు.

ఆపిశలి శంభు స్వర ఆత్రేయ శిక్షలునాలుగు కృష్ణయజుశ్శాఖకుఁ జెందినవి.

యాజ్ఞవల్క్య వసిష్ఠ కాత్యాయన పరాశర మాండవ్య అమోఘనందినీ లఘ్వ మోఘనందినీ అమరేశమాధ్యందినీ లఘుమాధ్యందినీ కేశవ కేశవకారికా మల్లశర్మ స్వరాంకుశ స్వరభక్తి స్వరాష్టక షోడశశ్లోకీ అవసాననిర్ణయ క్రమసంధాన గళదృక్ మనస్స్వర ప్రాతిశాఖ్యప్రదీప వేదసూత్రపరిభాషా వేదపరిభాషాకారికా యజుర్విధాన క్రమకారికా శిక్ష లిరువదియాఱును శుక్లయజుశ్శాఖకుఁ జేరినవి. కాని యింధు యజు ర్విధాన క్రమసంధాన క్రమకారికాదులు కొన్ని కృష్ణయజుస్సునకును, స్వరభక్తి స్వరాష్టకాదులు కొన్ని యన్ని శాఖలకును సంబంధించినవిగాఁ గనవచ్చును ఎట్లయినను శుక్లయజుశ్శాఖీయ శిక్షాలక్షణము లెక్కువ యనుట నిజము.

మాండూకశిక్ష యథర్వవేదశాఖకుఁ జేరినది. ఇట్లు తెలియవచ్చిన శిక్షల మొత్తము ౪౮. ఇవిగాక లక్ష్మీ కపిల కాలాదిశిక్షలు మఱికొన్ని యున్నట్లు విన వచ్చుచున్నది. ఇట్లెన్ని యున్నను వేదాంగమనెడి ఖ్యాతి పాణినీయశిక్షకే వచ్చి

యుండుటచే వీనిలో నెల్ల నదియే మొదటిదని నమ్మవచ్చును. ఋక్సామ శుక్లయజుశ్శాఖీయశిక్షలను, శిక్షాసంగ్రహము ప్రకటించినవారు పై విధముగా విభజించినను, వీనిలోఁ గొన్ని సర్వశాఖలకును సంబంధించిన విధులు గూడ లేకపోలేదు. ఇందు కొకి యుదాహరణము.

సామశాఖీయ మనఁబడిన నారదీయశిక్షలో స్వరనిర్ణయము చేయుచు 'కఠ కాలాప తైత్తిరీ యాహ్వరక శాఖలందును ఋగ్వేద సామవేదములందును, ప్రథమ స్వరమే చెప్పవలెను' అనెడియర్థము చెప్పుచున్నయొక శ్లోకమున్నది.[1] ఇట్లే తక్కినశిక్షలలోఁ గొన్నిటియందును, త్రయీశాఖలకు సంబంధించిన విధులందందు గనిపించును. మఱియు సామగాన స్వరములను నిర్ణయించునీ నారదశిక్ష' ఋషభ - షడ్జ - గాంధార - పంచమ - ధైవత - నిషాద - మధ్యమ - స్వరములను వాని వర్ణములను వాని పలుకుబడి విశేషములను వర్ణించుట చూడఁగా నిది సంగీత శాస్త్రారంభ కాలమందుదయించెనని తోఁచుచున్నది.[2] పిల్లనగ్రోవితో గానము చేయు నపుడు పలికించుషడ్జాది స్వరములను గొన్ని మృగవిహంగములకంఠ స్వనములకుఁ బోల్చుచు నిది యిట్లు వర్ణించినది.[3]

షడ్జం మయూరో వదతి గావో రమ్భన్తి చర్షభమ్।
అజావికే తు గాన్ధారం క్రౌఞ్చో వదతి మధ్యమమ్।
పుష్పసాధారణే కాలే కోకిలా వక్తి పఞ్చమమ్।
అశ్వస్తు ధైవతం వక్తి నిషాదం వక్తి కుఞ్జరః ॥

ఇట్లున్న స్వరవిజ్ఞానము పాణినీయ శిక్షకు మున్నే యుదయించినదనుట కందలి వాక్యములుగూడఁ బ్రమాణ మగుచున్నవి. పాణినీయ శిక్షలో—

ఉదాత్త శ్చానుదాత్తశ్చ స్వరితశ్చ స్వరా స్త్రయః।
హ్రస్వో దీర్ఘః ప్లుత ఇతి కాలతో నియమా అచి ॥
ఉదాత్తే నిషాదగాంధారా వనుదాత్త ఋషభధైవతౌ ।
స్వరిత ప్రభవా హ్యేతే షడ్జ మధ్యమ పఞ్చమాః ॥

1. నారదశిక్ష. 1-9.
2. 4-1,2,3.
3. 5-1,2,3

హ్రస్వదీర్ఘప్లుత సంజ్ఞలుగల యచ్చు నాశ్రయించియున్న మూఁడు స్వరములలో నుదాత్తమునుండి నిషాద గాంధారములును, అనుదాత్తమునుండి ఋషభ ధైవతములును, స్వరితమునుండి షడ్జమధ్యమ పంచమములును, పుట్టినవని భావము. దీనినిబట్టి సంగీత శాస్త్రమునకు జీవములయిన షడ్జాది సప్తస్వరములు సామగానము నుండి యేర్పడినవనియు, అవి యేర్పడిన పిదపనే ప్రథమ శిక్షగా గణింపఁబడు పాణినీయశిక్ష యుదయించి యుండుననియు భావింపవచ్చును.

2. వ్యాకరణము :— లౌకిక శబ్దములనువలెనే కొన్ని వైదిక శబ్దములను గూడ ననుశాసించుటచేతను, విశేషించి స్వరవైదిక ప్రక్రియోపయోగి సూత్రము లుండుటచేతను, బ్రహ్మయజ్ఞమునందు వేదాంగముల మొదటి వాక్యములు పఠించుటలో 'వృద్ధిరాదైచ్' సూత్రము చేరుటచేతను, పాణినీయాష్టాధ్యాయియే వేదాంగ వ్యాకరణమని తలంచుచున్నారు కాని, యది యసంగతము పాణినికిఁ బూర్వుఁడైన యాపస్తంబుఁడు పేర్కొన్న షడంగములలోని వ్యాకరణ మతని తరువాతఁ బుట్టిన పాణినీయ మగుట యసంభవముకదా ! అందుచే వెనుకఁ జెప్పినట్లు ఛాందోగ్యోపనిషత్తు పేర్కొన్న వేదవేదమే వేదాంగ వ్యాకరణ మనుట సముచిత మగుచున్నది. అదియే వేదమునకుఁ బ్రత్యేకముగా ననుశాసనమగు ప్రాతిశాఖ్యముగాఁ బరిణమించినది. తొలుత సూక్ష్మాకృతితోనున్న యది ప్రతివేద శాఖకును దరువాత స్థూలరూపమును దాల్చుటచే 'ప్రతిశాఖం భవం ప్రాతిశాఖ్య'మ్మను వ్యుత్పత్తి కనుగుణముగాఁ బ్రాతిశాఖ్యమను పేరుగాంచినది. పిదప వెలువడిన శిక్షా గ్రంథముల కాధారభూతములై సంహితాపాఠ పదపాఠముల కెక్కువగా సంబంధించినవగుచు స్వరసంధి వర్ణోచ్చారణాది వివిధ విషయములు బోధించుచుండుటయే ప్రాతిశాఖ్యల వ్యాకరణరూప వేదాంగత్వమునకుఁ బ్రబల ప్రమాణము. కాని—

''వేదాంగములందు శిక్షా వ్యాకరణములు పఠింపఁబడినవి కాని ప్రాతిశాఖ్యము పేర్కొనఁబడలేదు. విషయ విమర్శనుబట్టి చూడఁగా నిందలి విషయము శిక్షా వ్యాకరణములలోని విషయముకంటె భిన్నము కాదు. కాత్యాయన ప్రాతిశాఖ్య మందలి 'వృద్ధంవృద్ధిః' అను సూత్రమున కర్థము వ్రాయుచు నువ్వటుఁడు శిక్షా విహితము వ్యాకరణ విహితమునైన విషయమును వివరించునట్టి యీ శాస్త్రము పాఠకులగు శిష్యులకు వృద్ధిహేతు వగునని చెప్పియుండెను. వైదికాభరణకర్త యీ ప్రాతిశాఖ్యము శిక్షా వ్యాకరణముల వివరణమని చెప్పియుండెను. గ్రంథాంతమునం దితఁడే ప్రాతిశాఖ్యము వ్యాకరణ ప్రధానమని వక్కాణించియుండెను. కావునఁ బాణినీయము గాకున్న మఱియొక వ్యాకరణము వేదాంగ మగునుగాని

ప్రాతిశాఖ్యము కా"దని కొంద ఱూహింపవచ్చును. సత్యమే. సంస్కృత వాఙ్మయ మందు శబ్దశాస్త్ర మనఁబడు వ్యాకరణ మతి ప్రాచీనమైన యొక మహాశాస్త్ర మగుటయు, వైదిక శబ్దజాలమునకుఁగూడ నది యనుశాసన మగుటయు, అందలి విషయము కొంత ప్రాతిశాఖ్యములఁ గనవచ్చుచుండుటయు నిజము. తక్కినవాని మాట యెట్లున్నను శుక్ల యజురథర్వ ప్రాతిశాఖ్యలు పాణిన్యష్టాధ్యాయికంటెఁ బరము లగుటయు నిక్కము. పాణిన్యాచార్యులకుఁ బూర్వము వ్యాకరణ మున్నదనుటయు నిరాక్షేపము. కాని, శబ్దశాస్త్ర విహితముకాని వైదికసంధి లక్షణములిందుండుటచేతను, ఇవి ప్రత్యేకము వేదము కొఱకే జనించిన వగుటచేతను, ఛాందోగ్యోపనిషత్తులోఁ బేర్కొనఁబడిన వేదవేదము వైదిక వ్యాకరణ మనఁదగియున్నది గావున, దాని వివరణములై దాని రూపాంతరములై వెలసిన ప్రాతిశాఖ్యలే వేదాంగ వ్యాకరణమనుట సముచిత మగుచున్నది. ఐన నీ సందర్భమున వేదాంగములను గూర్చి కుమారిలభట్టేమి తెలిపెనో కొంచెము చూతము.

'బ్రాహ్మణుఁడు షడంగమైన వేద మధ్యయనము చేయవలెనన్న స్మృతివచనమునకు వైదికములైన యర్థవాదములం దంతర్గతములైయున్న నిరుక్త వ్యాకరణాదు లధ్యయనము చేయవలెనని యభిప్రాయము కాని బాహ్య వ్యాకరణాదులు స్వాధ్యాయమువలె నధ్యేయము లనికాదు... పాణినీయాది వ్యాకరణములు వేద స్వరూపవర్జిత పదసంస్కారపరములు. ప్రాతిశాఖ్యములు వేదసంహితాధ్యయనానుగత స్వరసంధ్యాద్యనుసరణము లగుటచే వానికి వేదాంగత్వ మావిష్కృత మగుచున్నది.[1] ఇత్యాది తంత్రవార్తిక వచనముల యభిప్రాయమునుబట్టి వేదాంతర్గతములైన వేదాంగముల వివరణములే శిక్షాది బాహ్య వేదాంగములనియు, ప్రాతిశాఖ్యమునకు వేదాంగత్వము పూర్వసమ్మతమే యనియు విశ్వసింపవచ్చును. కావున నిఁక నీ ప్రాతిశాఖ్యలలో నేది యే వేదశాఖకు సంబంధించినదో క్రమముగాఁ దెలిసి కొందము.

ఋగ్వేద ప్రాతిశాఖ్య :— ఇందలి మంగళాచరణ శ్లోకములోని 'ప్రణమ్యర్చాం లక్షణ మాహ శౌనకః' అను వాక్యమువలన నిది శౌనక విరచితమని తెలియుచున్నది. ఇది పదునెనిమిది పటలముల గ్రంథము. ఇందు స్వరాది విషయకములైన భిన్న మతము లుద్ఘాటించు సందర్భములం దీ క్రింది పూర్వాచార్యులు పేర్కొనఁబడియున్నారు.

1. తం. వా. 1. 3.

శాకల్యుఁడు - స్థవిరుఁడు - మాండూకేయుఁడు - వ్యాళి - గార్గ్యుఁడు - యాస్కుఁడు - వేదమిత్రుఁడు - శాకటాయనుఁడు - బాభ్రవ్యుఁడు ననువారు. వీరిలో శాకల్యుఁడు ఋగ్వేదమునకు, పదపాఠమును, బాభ్రవ్యుఁడు క్రమపాఠమును రచియించినవారు వత్సగోత్ర సంజాతుఁడును, చంపాపురవాసియు నగు దేవమిత్రుని పుత్రుఁడు విష్ణుమిత్రుఁడు తొలుత దీనికి వృత్తివ్రాసెను. తరువాత, దీని కువ్వటాచార్యుఁడు భాష్యము రచియించెను. ఇందలి సూత్రములు కొన్ని పద్యమయము లుగాఁగూడ నున్నవి. ఇందుకు "ఉదాత్త పూర్వం స్వరిత మనుదాత్తం పదేఽక్షరం, అతోఽన్య త్స్వరితం స్వార" మిత్యాదు లుదాహరణము.

సామవేద ప్రాతిశాఖ్యము—పుష్పనామక ముని దీనిని రచియించిన ట్లొకరు వ్రాసిరి గాని యీ గ్రంథ మెందును గనరాదు.

కృష్ణ యజుర్వేద ప్రాతిశాఖ్యము :— తైత్తిరీయ ప్రాతిశాఖ్య మనుపేర నిది లోకప్రసిద్ధమై యున్నది. కాని దీని నెవరు రచియించిరో తెలియరాదు ఇది యిరువదినాలుగధ్యాయముల మహాగ్రంథము. ఇందు నీక్రింది యాచార్యుల మతము లుదాహరింపఁబడినవి.

ఆత్రేయుఁడు - కౌండిన్యుఁడు - గౌతముఁడు - పౌష్కరసాది - ప్లాక్షి - భరద్వాజుఁడు - వాల్మీకి - శైత్యాయనుఁడు - స్థవిర కౌండిన్యుఁడు - అగ్నివేశ్యుఁడు - అగ్నివేశ్యాయనుఁడు - ఉఖ్యుఁడు - ఉత్తమోత్తరీయుఁడు - ప్లాక్షాయణుఁడు - బాడబీకారుఁడు - భారద్వాజుఁడు - మాచికాయుఁడు - వాత్సప్రుఁడు - శాంఖాయనుఁడు - సాంకృత్యుఁడు - కాండమాయనుఁడు - హారీతుఁడు - అనువారు. వీరిలో, భరద్వాజ గౌతమాదులు కొందఱు ఋగ్వేదసూక్తద్రష్టలుగాను, వాత్సప్రుఁడు మొదలగు కొందఱు సూక్తద్రష్టల సంతతివారుగాను, ఉఖ్యుఁడు మొదలగు కొందఱు యజురాదిశాఖా ప్రవర్తకుల వంశమువారుగాను, కనవచ్చుచున్నారు. మొత్తముమీఁద వీరందఱును ఋక్ప్రాతిశాఖ్యములోని పూర్వు లనఁదగిన కొందఱి కంటెఁగూడఁ బ్రాచీనులనుట సాహసము కాఁజాలదు. మఱియు వీరిలోని యాత్రేయుఁడే దీనికిఁ దొలుత భాష్యము రచియించినట్లు కనఁబడుచున్నది. ఇదంతయుఁ జూడఁగా శౌనక ఋక్ప్రాతిశాఖ్యముకంటె నిది ప్రాచీనమని తోఁచుచున్నది.

దీనికి మొదట నాత్రేయుఁడు వరరుచి మాహిషేయుఁడు ననువారు భాష్యములు రచియించినట్లుగా నీ మూఁడింటినిజూచి త్రిభాష్యరత్న మనుపేర వ్యాఖ్యానము వ్రాసిన సోమయార్యుని యీ క్రింది వాక్యమువలనఁ దెలియుచున్నది.

వ్యాఖ్యానం ప్రాతిశాఖ్యస్య వీక్ష్య వారరుచాదికమ్ ।
కృతం త్రిభాష్యరత్నం య ద్భాసతే భూసురప్రియమ్ ॥

ఇం దాత్రేయ మాహిషేయులు పేర్కొనఁబడకపోయినను, ఆదిశబ్దమును బట్టియు, వ్యాఖ్యానమం దాత్రేయ మాహిషేయమతము లుల్లేఖించుటనుబట్టియు.[1] సంప్రదాయమునుబట్టియు వీ రిద్దఱును వరరుచివలెనే దీనికి భాష్యకర్తలని భావింపఁబడుచున్నది. ఈ త్రిభాష్యరత్నమునకుఁ బ్రాతిశాఖ్య వివరణమను నామాంతరము కలదు. ఇందు మహాభారత పాణినీయాది ప్రాచీన గ్రంథములే కాక అమరకోశము గూడ నుదాహరింపఁబడినది. రెండవ వ్యాఖ్యానము వైదికాభరణము. ఇది యాచార్య గార్గ్యగోపాలస్వామి విరచితము. ఈ ప్రాతిశాఖ్యలోఁ దక్కినవాని యందువలె వర్ణసమామ్నాయస్థానప్రయత్న సంహితా సంధి స్వరసవర్ణ దీర్ఘాదులే వివరింపఁబడినవి కాని, యిందలి పద్ధతి ప్రకరణ క్రమమున మిక్కిలి సులభముగా నున్నది.

శుక్ల యజుర్వేద ప్రాతిశాఖ్యము – ఇది కాత్యాయనముని ప్రణీతము, ఎనిమిది యధ్యాయముల గ్రంథము. కాత్యాయన కృతముగానే ప్రతిజ్ఞా పరిశిష్ట సూత్రమను పేర మూఁడు కండికల చిన్న గ్రంథము దీని కనుబంధముగా ముద్రితమైయున్నది. తక్కిన వివిధ పరిశిష్టములవలెనే యిదియు నర్వాచీనమే కాని కాత్యాయనకృతము గాదని చెప్పవలసి యున్నది. ఋక్ప్రాతి శాఖ్యమునకు వ్యాఖ్య రచియించిన యువ్వటాచార్యుఁడే యీ ప్రాతిశాఖ్యకు మాతృమోద మనుపేర భాష్యము రచియించెను. ఉవ్వటుఁ డానందపుర వాస్తవ్యుఁడు వజ్రటపుత్త్రుఁడు. ఇతఁడు ప్రతిజ్ఞా సూత్ర పరిశిష్టమునకుఁగూడ వ్యాఖ్య వ్రాయుచు నది కాత్యాయన కృతమైనట్లు ప్రశంసించుట చూడఁ బరిశిష్టముగూడఁ గాత్యాయనుఁడు రచియించెనేమో యని సంశయము గలుగకపోదు కాని యతని నాఁటికే స్థిరపడిన యట్టిలోక ప్రతీతియే ప్రశంసకుఁ గారణమనుట సముచితము. ఇందు పేర్కొనఁబడిన యాచార్యులు :—

కణ్వుఁడు – శాకటాయనుఁడు – శాకల్యుఁడు – కాశ్యపుఁడు – ఔపశలి – శౌనకుఁడు – దాల్భ్యుఁడు – జాతుకర్ణ్యుఁడు – గార్గ్యుఁడు – అనువారు. పాణిని పేరు కనఁబడదుగాని యతని యష్టాధ్యాయిలోని 'ఉచ్చై రుదాత్తః నీచై రనుదాత్తః' ఇత్యాది సూత్రములు గొన్ని యిందు గలవు అష్టాధ్యాయి సాధింపని యనేక శబ్దముల సాధుత్వమునకు వార్తికములు రచియించి పాణినీయము పూరించిన

1. తై. ప్రా. 5-1; 4-40, ఇత్యాదులు.

యీ కాత్యాయనముని పాణిన్యాచార్యులకుఁ బరుఁడనుట విదితమేకదా! ఇతఁడు పెక్కు స్థలములందు వ్యాకరణ కార్యములకై శాకటాయనమతము గ్రహించి యున్నాఁడు. ఇతఁడు పదములకు గోత్రములను దేవతలను నిర్ణయించుచు, భరద్వాజదృష్టములైన యాఖ్యాతములు భారద్వాజ గోత్రములు లేక భారద్వాజస గోత్రములు ననునట్లు ద్వివిధముగా, అఖ్యాతము భారద్వాజస గోత్రము - నామము భార్గవసగోత్రము - ఉపసర్గము వసిష్ఠసగోత్రము - నిపాతము కాశ్యపసగోత్రము - అని నిర్వచించెను.[1] ఈ ప్రాతిశాఖ్యము మాధ్యందినశాఖ కెక్కువగా సంబంధించిన దని, ఉవ్వటాచార్యుఁడు సమర్థించి యుండెను కాని, యీ ప్రాతిశాఖ్యకే కాణ్వ శాఖీయ సమ్మతముగా భాగీరథీ నాగదేవ భట్టుల పుత్రుఁడైన యనంతభట్టు మఱి యొక భాష్యము రచియించియుండెను. పరిమాణమునఁ బెద్దదయ్యు నర్వాచీనమైన యీ భాష్యము ముద్రితమైనదిగాఁ గనఁబడదు. అఖ్యాత నామోపసర్గ నిపాతములు క్రమముగా సోమవాయ్వగ్ని వరుణదేవతాకము లగుచు, వేదశబ్దము లుపాసించు పురుషుఁడు తదర్థ మెఱుఁగక పోయినను ఫలము గాంచునని యితని మతము. దీనినిబట్టియే యితఁడు మిక్కిలి యర్వాచీనుఁడని తెలియుచున్నది. ఇతఁడు కాణ్వ శాఖుల కిట్లు విన్నవించుచున్నాఁడు.

'అసాధు సాధు వా పద్యం గ్రంథేఽస్మి న్యన్మ యోదితమ్
త త్సర్వం క్షమ్యతాం సన్తః శ్రీమన్తః కాణ్వశాఖినః'

తక్కిన ప్రాతిశాఖ్యలవలె స్వరవర్ణ సంధ్యాదులనే యిది వివరించినను, ఇందలి విషయోపదేశము విస్పష్టమై కనవచ్చును.

అథర్వ ప్రాతిశాఖ్యము— ఇదికూడ శౌనక కృతమని యొకరనిరిగాని యుపలభ్యమానములైన వ్రాఁతప్రతులనుబట్టి యతఁడు కర్తగాఁ గనరాఁడు. ఇది మూఁడు ప్రపాఠకముల గ్రంథము. ఇందు 221 సూత్రములు కలవు ఇందు పదవిధి వర్ణలింగ స్వర విభక్తి వాక్య వర్ణలోప వర్ణాగమ హ్రస్వ దీర్ఘ ప్లుత చ్ఛందః ప్రభృతి విషయములు వివరింపఁబడినవి. ఇదిగాక చతురధ్యాయికయను మఱియొక గ్రంథము శౌనకీయముగా నున్నది. ఇం దొక్కొకటి నాలుగు పాదములు చొప్పున నాలుగధ్యాయములు కలవు. వివిధములైన వ్యాకరణ కార్యములు తెలుపుచున్న యిది శౌనక విరచితమనియే కొందఱిమతము. ప్రాతిశాఖ్యములకు 'పార్షదము' లన నామాంతరము కలదు.

1. శు. ప్రా. 8-50, 51.

౩. ఛందస్సు - పింగళకృతమయినది పాణినీయ శిక్షాదులవలెనే వేదాంగముగా గణింపఁబడుచున్నట్లు దీని మొదటి వాక్యమును బ్రహ్మయజ్ఞమునందు పఠించునట్టి సంప్రదాయమే చెప్పుచున్నది.

మ య ర స త జ భ న లగ సమ్మితం
భ్రమతి వాఙ్మయం జగతి యస్య
స జయతి పింగళనాగః
శివప్రసాదా ద్విశుద్ధమతిః ।

ఇందలి మొదటిపాదము బ్రహ్మయజ్ఞమునఁ బఠింపఁబడుచున్నది. ఇందు మొదటి మకారాద్యక్షరము లెనిమిదియు మగణాదిసూచకములు. తరువాతివి రెండును లఘు గురుసూచకములు. ఏతాదృశమైన ఛందోగ్రంథము రచియించినవాఁడు పింగళనాగుఁడని తృతీయ పాదమున గోచరించుచున్నది దీనినిబట్టి పింగళచ్ఛందస్సనెడి ప్రతీతి కలిగినది. నిజమరయఁగా నిందలి విషయము పాణినీయ విషయమువలెనే వైదిక లౌకికములకు రెంటికిని సంబంధించినది గాని కేవలము వైదిక చ్ఛందస్సులనే యనుసరించినది గాదు. అయినను. ఛందో గ్రంథములలో మొదటిదై వైదికవాఙ్మయ సమనంతర మావిర్భవించినదగుటచే నిది వేదాంగత్వము నార్జించుకొనఁగలిగినది. నిజముగా వేదమునకు సంబంధించిన ఛందో లక్షణములు ఋక్ప్రాతిశాఖ్యము కడపటి మూఁడు పటలములందును, అథర్వ ప్రాతిశాఖ్యము తుదను, సామవేదీయ నిదానసూత్రమందును, కాత్యాయనానుక్రమణి యందునుగూడఁ గనవచ్చుచున్నవి. మఱియు, 'ఏతత్సర్వంతు విజ్ఞేయం ఛందోభాషా మధీయతా' అనెడి తైత్తిరీయ ప్రాతిశాఖ్యాది వాక్యమువలనఁగూడ నానాఁటికే వైదిక చ్ఛందస్సు సిద్ధమైనది కలదని విదితమగును ఇది యిట్లుండఁ బ్రాతిశాఖ్యలకు మున్ను ఛందోవిషయము బ్రాహ్మణములలో నందందు సూక్ష్మరూపమున నున్నట్లు ఛాందోగ్యములోని బ్రహ్మవిద్యాశబ్దమే చెప్పుచున్నది. ఛంద స్సత్త్వ మిట్టిదైనను వేదాంగమనెడి యశస్సు పింగళచ్ఛందస్సునకు సంభవించినదనుట సత్యము. పతంజలి మహర్షి దృష్టినిగూడ నాకర్షించినయిది తొల్లి గొప్ప గౌరవము గాంచినట్లుగా నొక పరిశిష్టములోని: —

"బ్రాహ్మణా త్తండిన శ్చైవ పింగళా చ్చ మహాత్మనః
నిదానా దుక్థశాస్త్రాచ్చ ఛందసాం జ్ఞాన ముద్ధృతం"

అను శ్లోకమువలనఁ దెలియుచున్నది. తండి బ్రాహ్మణమునుండియు, సామవేదీయమైన నిదాన సూత్రమునుండియు, పింగలచ్ఛందస్సునుండియు, ఛందో

జ్ఞానముద్ధరింపఁబడినదను దీనిభావమునుబట్టి బ్రాహ్మణకాలమున ఛందోలక్షణముగల దనియే కాక, పింగళచ్ఛందస్సునకు, తాండ్యబ్రాహ్మణగత ఛందస్సుతోను నిదాన సూత్ర గతచ్ఛందస్సుతోను సమాన ప్రపత్తి కలదనికూడ స్పష్టమగుచున్నది. ఆ గౌరవమే దీనిని వేదాంగముగా గణింపఁజేసినదనుట నిజము.

ఇది యెనిమిదధ్యాయముల చిన్న సూత్రగ్రంథము. ఇందలి విషయ మంతయుఁ బదునెనిమిది వర్గములుగా విభజింపఁబడినది. తరువాత వెలువడిన ఛ దశ్శాస్త్రమందలి యెల్లవిషయములకు ని దలి సూత్రములే ప్రధాన బీజములని యంగీకరింపవచ్చును. గణస్వరూపమును విశదీకరించుచు లోకప్రసిద్ధమైన యీ క్రింది శ్లోకములు దీని యవతారికలోఁ గనవచ్చుచున్నవి.

దీర్ఘం సంయోగపరం తథా ప్లుతం వ్యంజనాన్త మూష్మాన్తమ్।
సానుస్వారం చ గురుం క్వచి దవసానేఽపి లఘ్వన్యమ్॥
ఆది మధ్యావసానేషు య ర తా యాన్తి లాఘవమ్।
భ జ సా గౌరవం యాన్తి మనౌ తు గురులాఘవమ్॥

'త్రిగురుం విద్ధి మకార' మిత్యాదిగానున్న యీ యవతారికలోని యాఱు శ్లోకములును దీనికి వ్యాఖ్యానము రచియించిన హలాయుధునివేమోయని సవ్యాఖ్య ముగా దీనిని బ్రకటించినవీబరుపండితుఁడు సంశయించెను. అదియే నిజమైతే, అవతారిక మొదటి మాటయగు మయరసతజభనలగసమ్మిత'మ్మను దానిని జేర్చుకొన్న బహ్మయజ్ఞ పాఠ సంప్రదాయము హలాయుధవ్యాఖ్యకుఁ దరువాత బయలు వెడలెనని చెప్పవలసివచ్చును. అదిగాక కొన్ని ప్రతులలో నధ్యాయ విభాగమైనను గనరాదు గాని, అన్నిటియందును బదునెనిమిది వర్గముల విభాగము ప్రత్యక్షమగుచున్నది అందీ యవతారిక యాఱు శ్లోకములు ప్రథమ వర్గముగా గణింపబడుచున్నట్లు 'మయద్వాదశ - ధీఃపఞ్చదశ - ' ఇత్యాది గ్రంథాంతాను క్రమణి తెలుపుచున్నది. కావునఁ బ్రథమ వర్గమైన యవతారిక మూలకర్తదే కాని వ్యాఖ్యాతది కాదని విశ్వసింపవచ్చును.

౪. నిరుక్తము - ఇది యాస్కముని ప్రణీతమైన మహాగ్రంథము. వేదాంగముగాఁ బేర్కొనఁబడు నిరుక్తము దీనికంటె మఱియొకటి లేదు. వెనుకఁ జెప్పినట్లుగా బ్రాహ్మణముల కాలమున దేవవిద్య యనుపేర సూక్ష్మాకారముగానున్న నిరుక్తమే యీ మహానిరుక్తమునకు మూలాధారమగుటచేఁ దద్విపుల రూపమైన యిది వేదాంగసంజ్ఞ చెందినది. దీని మొదటి సూత్రమగు 'సమామ్నాయః సమా

మ్నాతః' అనునది బ్రహ్మయజ్ఞమునఁ బఠింపఁబడుచున్నది. కశ్యపప్రజాపతి వేదములందలి దురూహములైన నపదములనెల్ల నొక నిఘంటువుగాఁ గూర్చియుండ దానికి భాష్యముగా యాస్కమునీంద్రుఁడీ నిరుక్తము రచియించినట్లు మహాభారతము చెప్పుచున్నది.[1] కాని, దీనిని బలపఱుచునట్టి ప్రమాణాంతరము గనరామిం జేసి యిది ప్రక్షిప్త మనఁదగియున్నను, యాస్కుని పేరు మాత్రము కొన్ని ప్రాచీన గ్రంథములందు గలదు.

బృహదారణ్యమందును[2] శతపథ బ్రాహ్మణమందును గూడ వంశక్రమ ములలో "ఆసురాయణాచ్చ యాస్కాత్" అను మాటలున్నవి. ఇందు మొదటిది విశేషణమగుటనుబట్టి యాస్కుఁడాసురి మునీంద్రుని పుత్రుఁడని తోఁచుచున్నది. నిరుక్త పరిశిష్టాంతమందలి 'పారస్కరాయ నమోయాస్కాయ' అనుపదములలోని మొదటిది యాస్కుఁడు పారస్కర దేశీయుఁడని తెలుపుచున్నది. పాణిని సూత్ర మందుగూడఁ గనిపించునీ పదము[3] దేశపరమని భగవత్పతంజలియు భట్టోజీ దీక్షితులునుగూడ వ్రాసియున్నారు. 'ఉరో బృహతీ యాస్కస్య' అనుఛంద స్సూత్రమునుబట్టి యాస్కుఁడు పింగళాచార్యునికి సమకాలికుఁడో పూర్వుఁడో యని యూహింపవచ్చునుగాని, ఇందుదాహృతుఁడైన యాస్కుఁడు మననిరుక్తము రచించినవాఁడు కాఁడేమోయని సంశయింపవలసియున్నది. ఇది యిట్లుండ నిరుక్త కారయాస్కుఁడు పాణినికిఁ బూర్వుఁడా పరుడాయని రాథ్ - గోల్డుస్టక్కరు - వీబరు - మాక్సుముల్లరు - మొదలగు పండితులు చర్చించి తుదకుఁ బాణినికంటెఁ బూర్వుఁడేయని సిద్ధాంతీకరించి యున్నారు. 'పాణిని' అను గ్రంథము ప్రకటించిన లీబికు పండితుఁడు పాణినికంటె యాస్కుఁడు పరుఁడని నిర్ణయించి యున్నాఁడు. ఎ. బి. కీతుపండితుఁడు, పాణిని శౌనకులకంటె యాస్కుఁడు పూర్వుఁడని నిర్ణ యించెను.[4] ఇందు పెక్కండ్రమత మంగీకార్య మనఁదగునుగాని యెట్లయిన నిది సందిగ్ధముగానే యున్నది. ఇపుడు వీరిపౌర్వాపర్యమును జర్చింపఁబూనితి మేని గ్రంథవిస్తరమగును గావున సందిగ్ధాంశములు గొన్ని మాత్రము చూపెదను.

1. తస్మా ద్వృషాకపిం పాహ కశ్యపో మాం ప్రజాపతిః ।
   స్తుత్వా మాం శిపివి ష్ట యాస్క ఋషి రుదారధీః ।
   మత్ప్రసాదా దధో ష్టం నిరుక్త మభిజగ్మివాన్. శాం ప. 342. అ.
2. బృ. ఉ 6-3.
3. పారస్కర ప్రభృతీని చ సంజ్ఞాయామ్. అష్టా-6-1-157.
   పారస్కరో దేశః. మ - భాష్య - పారస్కరః కిష్కిన్ధా. సి కౌ.
4. బి. ఆరణ్యక పీఠిక.

శాకటాయనాది వైయాకరణుల నుదాహరించిన నిరుక్తము పాణిని పేరెత్త లేదు. వారిని బేర్కొన్నయష్టాధ్యాయి యాస్కుని జూపలేదు. 'యస్కాదిభ్యో గోత్రే' అను సూత్రమందు[1] యస్కశబ్దము గనవచ్చునుగాని యిది నిరుక్తకార యాస్కు నుద్దేశించినదగునో కాదో! పరస్సన్నికర్షసంహితా' యనెడి యష్టాధ్యాయి లోని సూత్రము[2] నిరుక్తములోఁ గనవచ్చునుగాని.[3] యిది దానినుండి దీనిలోనికి వచ్చెనో దీని నుండి దానిలోకి వెళ్ళెనో లేక, రెంటిలోనికిఁ గూడ మఱియొక దాని నుండి వచ్చెనో ! పాణిని సూత్రములు కొన్ని కాత్యాయన ప్రాతిశాఖ్యలోఁ బాణిని పేరు లేకుండఁ గాత్యాయనుఁడు రచియించినట్టే యున్నవి. అయితే, కాత్యా యనుఁడు పాణిని తరువాతి వాఁడని విస్పష్టముగాఁ దెలియుచున్నది కావుననక్కడ సందేహింపవలసిన పని లేకపోయినది గాని యిక్కడ నట్టి నిర్ధారణ లేదు. పాణినికిఁ బూర్వ మనేకులు వ్యాకరణ కర్తలున్నట్లు తెలియవచ్చుటచే నీ సూత్రము వారిలో నెవరిదైన నైయుండవచ్చును. ఇది యిట్లుండ, ఉపసర్గ నిరూపణమును, తదర్థ నిర్వచనమును, నిరుక్తమందు సంకుచితముగా నున్నవి.[4] అష్టాధ్యాయి యందు విపులముగా నున్నవి. ఈ భేదమును బురస్కరించుకొని పాశ్చాత్య విమర్శకులు, నిరుక్త కాలముకంటె నష్టాధ్యాయికాలమున నుపసర్గతత్త్వజ్ఞాన మభివృద్ధి చెందినది గావునఁ బాణిన్యాచార్యుఁడే పరుఁడని నిర్ణయించిరి తక్కిన వాని కంటె నిది కొంచెము ప్రబలహేతువగును గాని, యిందు నొక విశేషము కలదు. కేవలము వైదికములైన క్లిష్ట శబ్దముల యర్థము నిర్వచింపఁ బూనినవాఁడు యాస్కుఁడు లౌకిక వైదిక సామాన్యముగా నెల్ల శబ్దముల కనుశాసనము చేయఁ బూనినవాఁడు పాణిని. కావున నుపసర్గ నిరూపణము సంకుచితముగానున్న దను కారణమునుబట్టి యాస్కుఁడు పూర్వుఁడనుట యుచితము కాదని తోఁచుచున్నది. ఎట్లయినను, పూర్వులను గొందఱిని బేర్కొని కొందఱిని బేర్కొనక పోవుటయు, నొక దానిలోని వచనము లింకొక దానిలోఁ గనఁబడుటయు, శైలి కఠినముగానో సరళముగానో యుండుటయు, ప్రయోగముల వివిధరూపము లొకదానిలో నుండి యింకొక దానిలో నుండక పోవుటయు మొదలుగాఁగల దుర్బల ప్రమాణములను బట్టి పూర్వ గ్రంథకర్తల పౌర్వాపర్యము నిర్ణయించుట సమంజసము కాదనక తప్పదు ప్రకృతమైన యాస్కపాణినుల విషయ మట్టిది. కావున వీ రిరువురు

1. అష్టా 2-4-63.
2. అష్టా. 1-1-109.
3. నిరు. 1-17.
4. నిరు. 1-3.

వైయాకరణులై యాకాలముననే ప్రసిద్ధి కెక్కినవా రయ్యు నొకరి నొకరు పేర్కొనక పోవుటనుబట్టి కొంచె మెచ్చు తక్కువగా సమకాలికులని నేనభిప్రాయ పడుచున్నాను.

నిరుక్తము పన్నెం డధ్యాయముల గ్రంథము. అందు మొదటి యాఱధ్యాయములు పూర్వషట్క మనియు, తరువాతి వుత్తరషట్క మనియుఁబిలువఁబడు చున్నవి. ప్రత్యధ్యాయ మనియత సంఖ్య గల ఖండములుగా విభజింపఁబడినది. ఇందలి వన్నియు గద్యరూపసూత్రములు. దీనికి రెండధ్యాయముల గ్రంథము పరిశిష్టమనుపేర ననుబంధముగా ముద్రితమైయున్నది. ఈ పదునాలు గధ్యాయము లకును భగవద్దుర్గాచార్యులు నిరుక్తవృత్తియనుపేర ఋజ్వర్థ వ్యాఖ్య రచియించిరి. పరిశిష్టముగూడ యాస్కుఁడు రచించినట్లే కొందఱు భావింతురుగాని, దాని కడపట నున్న నమః పారస్కరాయ నమో యాస్కాయ, యనుదానినిబట్టి యతని శిష్యుఁడో లేక భక్తుఁడో దానిని నిర్మించియుండునని నిశ్చయింపవచ్చును. ఈ నిరుక్తమున నీక్రింది మునీంద్రులు పేర్కొనఁబడియున్నారు.

శాకటాయనుఁడు - గార్గ్యుఁడు - కౌత్సుఁడు - ఔపమన్యవుఁడు - కౌశికుఁడు - ఔఱవనుఁడు - శాకపూణి - స్థౌలాష్ఠివి - ఔదుంబరాయణుఁడు - ఆగ్రాయణుఁడు - ఔర్ణనాభుఁడు - గాలవుఁడు - క్రౌష్టుకి - కాత్థక్యుఁడు - చర్మశిరుఁడు - తైత్తికి - వార్ష్యాయణి - శతబలాక్షుఁడు - మౌద్గల్యుఁడు - అనువారు.

ఇందు మొదటి మూఁడధ్యాయములు నామాఖ్యాతో పసర్గని పాతాదుల వివరణముతోఁగూడిన నైఘంటుక కాండము. వేదములందలి క్లిష్ట శబ్దములను వాని పర్యాయపదముల నొక్కొక్క సూత్రమునఁ జేర్చి వానియర్థములు నిర్వచించునట్టి దగుటచే దీని కీపేరు పెట్టఁబడినది. ఇందుకొక యుదాహరణము గౌః-గ్మా-జ్మా-క్ష్మా-క్షా-క్షమా-క్షోణిః-క్షితిః-మొదలగు నిరువదియొక్క పృథివీ వాచకశబ్దము లొక్కచోఁ జేర్పఁబడినవి. 'దూరం గతా భవతి' దూరమును బొందినది కావున 'గౌః' లేక భూతజాతము దీనియందు నడుచుచున్నది గావున 'గౌః' భూమి. ఇత్యాదిగా నిర్వచనములుండును. ఇట్లే, ఏకార్థముగల యనేక శబ్దములిందు చూపఁబడెను.

నాలుగైదాఱధ్యాయములు మూఁడును నైగమకాండ మనఁబడును. ఇందనే కార్థములైన శబ్దములు చూపఁబడినవి. ఇందుకొక యుదాహరణము.

వృక శబ్దమునకు. చంద్రుఁడు వికృతజ్యోతిష్కుఁడు వివృతజ్యోతిష్కుఁడు ఆదిత్యుఁడు శ్వానము మొదలగు నర్థములు చూపఁబడినవి. పూర్వోక్తములైన పర్యాయ శబ్దములకును, ఈయనేకార్థములకునుగూడ వేదమునుండి యుదాహరణలు చూపఁబడెను ఇది పూర్వషట్కము.

ఉత్తరషట్కమా అధ్యాయములు దైవతకాండ మనఁబడును. ఇందు, ఇంద్రాగ్ని వరుణాదిత్యాది శబ్దముల వ్యుత్పత్తులు విశదీకరింపఁబడినవి. మొత్త మీ మూఁడు కాండములలో నుదాహరింపఁబడిన వానిలోఁ బెక్కు మంత్రములు ఋగ్వేదములోనివి. మఱియుఁ గొన్ని యుపాఖ్యానములు నితిహాసములును ఋగ్వేదాదులనుండి యుదాహరింపఁబడినవి. వేదములందు గోప్యములుగానున్న యనేక విషయము లీ నిరుక్తమున స్పష్టీకరింపఁబడినవి. ఇందు కొక యుదాహరణము.

ఋగ్వేద ప్రథమమండల సప్తమానువాకమునందలి ద్వితీయ సూక్తమునం దెక్కువగా నింద్రవృత్ర వ్యాపారము వర్ణింపఁబడియున్నది. అందలి యింద్రవృత్ర శబ్దములకు బహువిధములైన వ్యుత్పత్తులు చెప్పుచు నా ఋక్కుల యర్థము విడఁగొట్టుచు నీ నిరుక్త మా విషయ మిట్లు వర్ణించినది.[1]

''అయితే, వృత్రుఁ డెవఁడు ? మేఘుఁడని నైరుక్తులందురు. త్వష్టకొడుకైన యసురుఁడని యైతిహాసికు లందురు, నీళ్లను జ్యోతిస్సును గలియుటచే వర్షము పుట్టుచున్నది. వాటికి రూపకల్పన చేయుటచే నింద్రవృత్రుల యుద్ధవర్ణనలు సంభవించినవి" అనఁగా జలరూపుఁడైన మేఘునకు వృత్రరూపమును వైద్యుతజ్యోతిస్సున కింద్రరూపమును గల్పించి వారిద్దఱికియుద్ధము జరిగినట్లుగా నైతిహాసికులు వర్ణించిరని భావము. మారుతావేష్టితమైన యింద్రాఖ్య వైద్యుత జ్యోతిస్సుచే వృత్రాఖ్యుఁడైన మేఘుని యుదరమందలి జలములు తాడ్యమానములై వర్షభావము పొందుచున్నవి గాని యిక్కడ నిజమైన యుద్ధము లేదు కావున వృత్రుఁడనఁగా మేఘుఁడే యనియు నింద్రుఁ డనఁగా జ్యోతిస్సనియు నిక్కడ నర్థమని ఋజ్వర్థ వ్యాఖ్య వివరించినది. ఇట్లనేక సందర్భములం దిట్టి విశేషము లెన్నో యిందు గనిపించును బ్రాహ్మణములు కొంత సహాయపడినను, వేదమునకు వ్యాకరణముగాను నిఘంటువుగాను భాష్యముగానుగూడ నున్న యీ నిరుక్తము మిక్కిలి చేదోడు వాదోడు నగుటచేతనే భాష్యకర్తలు వేదముల యర్థము వివరింపఁగలిగి రనుట కంటె దీని మహత్త్వమును వేఱుగాఁ బొగడఁజాలము. ఈ సందర్భమున దీని యర్థము తేటతెల్లము గావించిన ఋజ్వర్థ వ్యాఖ్యగూడ నత్యంతము ప్రశంసనీయ మగును.

1. నిరు. 2-16.

౬. జ్యోతిషము :— లగధుఁడను ముని రచియించినట్లుగా నలువదిమూఁడు శ్లోకముల పరిమితిగల చిన్న గ్రంథ మొకటి వేదాఙ్గ జ్యోతిష మనుపేర గణింపఁ బడుచున్నది. ఇందుకు బ్రహ్మయజ్ఞమందు దీని మొదటిదగు 'పఞ్చ సంవత్సర మయ'మ్మను మాట పఠింపఁబడుట యొక తార్కాణము కాని, జ్యోతిశ్శాస్త్ర విజ్ఞాన మనునది సంహితా బ్రాహ్మణముల కాలములందే యంకురించి క్రమముగా విస్తృతిచెందినదనియు, ఛాందోగ్యములోఁ జెప్పినట్లుగా నిది రాశి దైవ నక్షత్ర విద్య లను పేరఁ బరఁగుచుండెడిదనియు మనము చదివియున్నాము. దాని ప్రత్యేకరూపమే యీ చిన్న గ్రంథము. అయినను, జ్యోతిష గ్రంథములలో మొదటి దగుటచే నిది వేదాంగములలో గణనీయమైనది. తరువాత నిందలి విజ్ఞానమే వరాహ మిహిరాది మహా ప్రతిభాశాలులవల్ల మహాశాస్త్ర రూపము దాల్చినది. దీని వ్రాఁత ప్రతులలో.

> 'ప్రణమ్య శిరసా కాల మభివాద్య సరస్వతీమ్ ।
> కాలజ్ఞానం ప్రవక్ష్యామి లగధ్యస మహాత్మనః'

అను శ్లోకము కనవచ్చుచున్నది గాని, యన్యుఁడు చెప్పినట్లుగా నున్న యిది సభాష్యముగా ముద్రితమైన యాజుష గ్రంథమున లేదు. ముద్రితమైన యార్చజ్యోతిషమం దున్నది గాని, దీని యచ్చటి స్థితి ప్రామాదిక మని స్పష్టపడు చున్నది లగధుని కాలజ్ఞానమును జెప్పుచున్నా ననుటయే యీ శ్లోకము లగధు నిది కాదనుట కవకాశ మిచ్చుచున్నది. ఇట్టి ప్రక్షిప్తము లీ చిన్న గ్రంథమున నింకను గలవు.

వేదములు యజ్ఞముకొఱకు కుత్పన్నములైనవి. యజ్ఞము లాయా యుక్త కాలములందు విహితము లగుచున్నవి కావున, కాలవిధానశాస్త్రమైన యీ జ్యోతిష మెఱిఁగినవాఁడు యజ్ఞ మెఱిఁగినవాఁడే' అని దీనిఫలము చెప్పిన యీ గ్రంథము దిన మాసాయన నక్షత్ర సంవత్సరాది విజ్ఞాన ముపదేశింపఁ బూనినదని యీ కడపటి శ్లోకమునఁ దెలియుచున్నది.

> ఇ త్యేతన్మాస వర్షాణాం ముహూర్తోదయ పర్వణామ్ ।
> దిన ర్త్వయనమాసానాం వ్యాఖ్యానం లగధోఽబ్రవీత్ ॥"

ఇట్టి యీ గ్రంథమును యజుర్వేదీయులు యజుర్వేదాంగముఁగాను, బహ్వృ చులు ఋగ్వేదాంగముఁగాను భావించియున్నారు. అందుచే దీనికి యాజుషజ్యోతిష మనియు, ఆర్చజ్యోతిషమనియు, ద్వివిధమైన వ్యవహారము కలిగినది. ఇందు

మొదటిదానికి సోమాకరుఁడు సుధాకరుఁడు ననువారు భాష్యములు రచించిరి. రెండవదానికి సుధాకరుఁడు మాత్రము భాష్యము రచించెను. సుధాకరుఁడు వ్రాసిన యాజుషార్చజ్యోతిష భాష్యముల కతని శిష్యుఁడు మురళీధరుఁడు లఘువివరణము వ్రాసెను. ఈ వ్యాఖ్యానము లన్నిటితోఁ గూడిన యీ గ్రంథము కాశీనగరమున ముద్రితమైనది. అయనములను దెల్పునిందలి శ్లోకమొకటి యుదాహరించుచున్నాను.

"ప్రపద్యేతే శ్రవిష్ఠాదౌ సూర్యాచంద్రమసా వుదక్
సార్పార్ధే దక్షిణార్క_స్తుమాఘ శ్రావణయో స్సదా"

సుధాకరుఁడు వ్రాసిన దీని ముఖ్యతాత్పర్యమిది. "మాఘమున ధనిష్ఠా గతుఁడగుటచే సూర్యుని కుత్తరాయణమును, ఆశ్లేషార్ధగతుఁడై కర్కిరాశిగతుఁ డగుటచే శ్రావణమాసమున దక్షిణాయనమును గలుగును', ఇట్లున్న యీ గ్రంథము తరువాత విస్తరించిన శాస్త్రమునకుఁ గావలసిన బీజములన్నియు నాటినదనుట వాస్తవము.

౬. కల్పము : — కల్పసూత్రము లనఁబడు నీ వేదాఙ్గము వైదికవాఙ్మయ మున విశేషస్థల మాక్రమించియున్నది. వేదోక్తములయిన యజ్ఞ యాగాది వివిధ కర్మముల యాచరణమును ససాకల్యముగా విశదీకరించుచున్నయిది యాజ్ఞికుల కత్యంతోపయోగకారియై వైదిక కర్మస్వరూప సందర్శనమున కాదర్శమై వెలయు చున్నది. అట్టి యీ కల్పసూత్రములను గూర్చి సూత్రములను శీర్షిక క్రిందఁ బరిశీలింతము.

సూత్రములు

వైదికవాఙ్మయమునకు సంబంధించిన సూత్రములు కల్పసూత్రములనియు గృహ్యసూత్రములనియు ధర్మసూత్రములనియుఁ ద్రివిధముగా నున్నవి. అన్నిటి కిని గూడ మొత్తముగాఁ గల్పసూత్రములను పేరున్నను, ఈ పేరు శ్రౌతసూత్రము లకు స్థిరపడినది. ఈ శ్రౌతసూత్రములు ఋక్సామకృష్ణ శుక్లయజు రథర్వశాఖా భేదమున నన్ని వేదశాఖలకు సంబంధించి యైదు విధములుగా నున్నవి.

సంహితా బ్రాహ్మణములందలి జ్ఞానకాండమును బ్రతిపాదించునుపనిషత్తులు శ్రుతిసంజ్ఞను జెంది యపౌరుషేయములలోఁ జేరినవిగాని పీనివలెనే వేదముల యందలి కర్మకాండమును బ్రతిపాదించునవియైనను, శ్రుతిసంజ్ఞను జెందక శ్రుత్యుక్త ధర్మాధర్మములను వివరించుచున్న యీ సూత్రములు శ్రౌతములై పౌరుషేయము

త్తైనవి నాస్తికమైన బౌద్ధమత మావిర్భవించిన కాలమందు వైదిక మతావలంబు లగు విద్వాంసులు మేల్కొని బౌద్ధమతము వ్యాపింపకుండుటకును వైదికమతము సంరక్షించుటకును గర్మకాండమును జక్కఁగా విశదీకరించుచు శ్రౌతసూత్రములు రచించియుందురని మాక్డోనలు మొదలగు పాశ్చాత్యులూహించి యున్నారు. వేదోక్త యాగాది కర్మాచరణము బౌద్ధమతావిర్భావ కాలమందే తలయెత్తెనని నిశ్చయింపఁ గలిగినచో వారి యూహ సముచితమై యుండెడిదిగాని యది సాధ్యమైనదిగాదు. ఋగ్వేదసంహితకు మున్నె యార్యులు క్రతువులాచరించెడి వారని ఋక్సంహిత వల్లఁ దెలియుచున్నది. సామయజుస్సంహిత లత్యంతము యాగబోధకములే కాని యన్యములు కావు బ్రాహ్మణములన్నియుఁ గర్మకాండమునే ప్రతిపాదించుచున్న వని వారే యంగీకరించుచున్నారు. అట్టియెడ బౌద్ధమత మంకురించినదను భయముతో నంతకు మున్నులేని యే కర్మకాండమును గ్రొత్తగా శ్రౌతసూత్రములు తెచ్చి పెట్టినవో యూహింప నలవి గాకున్నది. నిజ మరయఁగా వైదికమతమునకుఁ బ్రతిపక్షిగా బౌద్ధమతము బయలుదేఱినది కాని, దాని నణఁగించుటకు వైదికమతము గావించిన నూతన ప్రయత్నమేమియు నాకాలమునఁ గనిపించదు. ఇఁకనో మంత్రములందు చెల్లాచెదరుగా నున్న యాగాది కర్మవిషయమును బ్రాహ్మణములు కొంతవఱకు విశదపఱిచినవి. అందు నింకను దురవగాహములుగా నున్న విషయములతో యాజ్ఞిక ప్రయోగము నంతను సక్రమముగా సూత్రములు నిరూపించినవి. ఈ పద్ధతి వైదిక వాఙ్మయములందు సర్వవిషయములకు సాధారణమైనదే. నిజ మిదియై యుండఁగా వైదికవాఙ్మయ మందలి వివిధగ్రంథముల కాలములను గ్రమముగాఁ గ్రిందికి దిగలాగుయత్నమునకు సరిపుచ్చునుద్దేశముతోఁ గల్పసూత్రములకును బౌద్ధమతమునకును ముడిపెట్టిన వారి యూహలు సందర్భోచితము లెట్లగును ?

కల్పసూత్రము లన్నియు నాయా శాఖల బ్రాహ్మణముల ననుసరించి యావిర్భవించినవి. ఇవి యజ్ఞములందు హోత ఉద్గాత అధ్వర్యుఁడు మొదలగు ఋత్విజులుచేయు కార్యములను బోధించు ప్రయోగశాస్త్రములు. "కల్పసూత్రములు ప్రతిశాఖకు వేఱుగాకపోయినను, కొన్ని శాఖలయెడ నధ్యయనాది భేదమున వేఱుగాఁ గనవచ్చుచున్న'వని హిరణ్య కేశిసూత్ర వ్యాఖ్యానమున మహాదేవ పండితుఁడు చెప్పినట్లుగా వీనియందలి ముఖ్యవిషయ మంతయు సర్వసాధారణము గానే యుండును. అయినను, శాఖాభేదమునుబట్టి సూత్రభేదమును వ్యాపింగాంచినది. అట్లయ్యును, శాకల బాష్కలశాఖలు రెంటికి నాశ్వలాయనసూత్ర మొకటేయనియు, కాణ్వమాధ్యందిన శాఖలు రెంటికిని కాత్యాయన సూత్ర మొకటే యనియు, తైత్తి

రీయ శాఖయందు మాత్రము నానాసూత్రములు గలవనియు, సూత్రభేద శాఖాభేదములు పరస్పరాశ్రయములై యున్నవనియు నీ మహాదేవ పండితుఁడే వచించియున్నాఁడు. ఆశ్వలాయన సూత్రవృత్తికారుఁడగు నారాయణ గార్గ్యుఁడుకూడ నారంభమందు 'శవి తైత్తిరీష పురోరుక్కన్నాప వాలఖిల్య మహానామ్న్యైతరేయ బ్రాహ్మణ సహితములైన శాకల బాష్కలామ్నాయములు రెంటికి నాశ్వలాయన సూత్రమే పయోగశాస్త్రమని వచించియున్నాఁడు [1] వీరి మాటలనుబట్టి బ్రాహ్మణముల ననుసరించి సూత్రము లావిర్భవించినవనియు, ఒక్కొక్క వేదమునకు సంబధించిన కొన్ని కొన్ని శాఖల కొక్కటియే సూత్ర మున్నదనియు తైత్తిరీయమున కధికముగాఁ గలవనియుఁ దెలియుటయేకాక, గార్గ్యుని మాటవల్ల ఋక్శాఖలకు మన మెఱుఁగని బ్రాహ్మణములుగూడఁ గలవని తెలియుచున్నది.

శ్రౌతసూత్రముల పౌర్వాపర్య నిర్ణయము సులభముకాదు. ఈ విషయమునఁ బాశ్చాత్య పరిశోధకులును సందిగ్ధాభిప్రాయములే యిచ్చియున్నారు. ఋగ్వేద సర్వానుక్రమణీవృత్తి వ్రాసిన షడ్గురుశిష్యుఁడు దాని యవతారికలో "శౌనకస్య తు శిష్యో ఽభూ ద్భగవా నాశ్వలాయనః" అని పలికియున్నాఁడు. ఇది యాధారముగా, ఆశ్వలాయనుఁడు శౌనకుని శిష్యుఁడని యొక ప్రతీతియు, ఐతరేయారణ్యకములోని పదియేను వాక్యముల నాల్గవ యధ్యాయము నాశ్వలాయనుడు రచియించెనని మఱియొక ప్రతీతియు బయలుదేఱినవి కాత్యాయనముని ప్రశంస కవతరించిన షడ్గురుశిష్యుని యవతారికలోని విషయ మేమాత్రము విశ్వసనీయ మన్నను, శౌనకాశ్వలాయన కాత్యాయనులు ముగ్గురును గొంచె మెచ్చుతక్కువగా సమకాలికులని చెప్పవలసివచ్చును. ఇది మిక్కిలి యసంగతము మాక్సిమ్యులరు పండితుఁడు గూడ నీ యవతారికా విషయము చర్చించి యిది యసంగతమనెడి యభిప్రాయమే తేల్చెను.[2] ఇది గాక, ఆశ్వలాయనుఁడు తన సూత్రము కడపటి యధ్యాయమున "అపి నానా గోత్రాస్స్యురితి శౌనకః" అని శౌనకుని పేరెత్తుచు, గురుత్వసూచకమైన యాచార్యపద మయినఁ బ్రయోగింపలేదు. సూత్రాదిగ్రంథకర్త లందఱును గురువుమతము తెల్పునపుడు 'ఇత్యాచార్యాః' అనుచు వచ్చిరి గాని, గురువు పేరెవరును గ్రహించియుండలేదు. ఇతఁడు పేరెత్తియుఁ బైగా నాచార్యపదమైన నుపయోగింపలేదు. కావున మొదటిప్రతితీ నమ్మఁదగినది కాదు. ఇదియే యిటులుండ మిక్కిలి నిరాధారమైన రెండవప్రతితీ విశ్వసనీయము కాదని వేఱుగాఁ

1. ఆ. శ్రౌ వృ. 1-1-1.
2. A. Sam. L. 122. P.

జెప్పనేల ? అయినను శౌనకుని బేర్కొన్న యాశ్వలాయనుఁ డతనికంటె నర్వాచీనుఁడనుట సమ్మతమేయగును. ఇఁక నీ శౌనకుఁ డెప్పటి వాఁడనువిషయ మూహలమీఁదనే నిలిచియున్నది గాని సునిశ్చితము కాలేదు. ఎట్లయినను, ఆపస్తంబాశ్వలాయన బౌధాయన కాత్యాయనాది ప్రధానసూత్రకర్తలు క్రీస్తుపూర్వమైదవ శతాబ్ది కావలి వారేకాని యీవలివారు కారనుట సత్యము. ఇందాపస్తంబ కాలమును జర్చించి సిద్ధాంతీకరించిన కొందఱి యభిప్రాయములను సంగ్రహించి చూపెదను.

పాశ్చాత్య పరిశోధకులలో డాక్టరుబుహ్లరు విశేషపరిశోధన చేసి, ఆపస్తంబుఁడు క్రీస్తుపూర్వము పంచమశతాబ్దికిఁ గూడఁ బరుఁడు గాఁడనవచ్చునని నిశ్చయించెను [1] దానినే, సుదర్శనభాష్యముతో నీ సూత్రము ప్రకటించిన మహాదేవశాస్త్రులు బలపఱిచియున్నారు. హరదత్తసుదర్శన వ్యాఖ్యలతో నీ సూత్రము ప్రకటించిన చిన్నస్వామిశాస్త్రిగారు పై మతమంగీకరించుచు నింకను వెనుకకుఁ బోఁదగినసూచనలు చేసియున్నారు.

అపాణినీయములైన యార్షప్రయోగము లాశ్వలాయన బోధాయనాది సూత్రములలోఁ గూడఁ గొన్ని కలవు గాని యాపస్తంబ సూత్రమున నట్టి వెక్కువగాఁ గనవచ్చుచున్నవి ఆపస్తంబుఁడు పాణినికిఁ దరువాతివాఁడే యైనచో 'రాతా - వృక్షనామాః - త్రిస్సప్తైః - పుంస్వః'' ఇత్యాదిపాణినీయవిరుద్ధ ప్రయోగములు[2] గావించి యుండఁడనుట విశ్వసనీయము గావున నితఁడు పాణినికిఁ బూర్వుఁడని యూహింప వచ్చును. పాణిని సప్తమశతాబ్దికిఁ దరువాతి వాఁడు కాఁడనుట పెక్కండ్రు విమర్శకుల యభిమతము గావున నంతకు మున్నే యాపస్తంబుఁడుండె ననుట భావ్యమగుచున్నది

ఇది యట్లుండ, ఆపస్తంబుఁడు బోధాయనశిష్యుఁడని వైదిక సంప్రదాయమొకటి ప్రసిద్ధమైయున్నది. దీని కాధారములు కనరావుగాని, గృహ్యసూత్రములో బోధాయనుఁడు చెప్పని నాకబలి మొదలగు కొన్నిటి నాపస్తంబుఁడు చెప్పుటయు, శ్రౌతసూత్రములో బోధాయనుఁడు "ఇషే త్వోర్జే త్వా, శాఖా మాచ్ఛినత్తి'' అని చెప్పి యుండ, ఆపస్తంబుఁడు ''ఇషేత్వా, శాఖా మాచ్ఛినత్తి'' అని మంత్రమును విభజించుటయు నతనికంటె నితఁడు పరుఁడగుటకు హేతువఁట. కాని యీ మతభేదము వీరి పౌర్వాపర్యము నిర్ణయింప ననుకూలము కాదు సరిగదా, ఇదియే వీరి

1. S. B. E. Vol. II.

2 ఆ. గృ. ఖం. 3-12; 3-18; 9-5; 6-11.

గురుశిష్యభావము కెంతయుఁ బ్రతికూల మగుచున్నది. ఇంతకును బోధాయనుఁడా పస్తంబుని తరువాతివాఁడని ముందు తెలియఁగలదుగాని, ఎట్లయినను, ఆశ్వలాయన శాంఖాయనులలో నెవరు పూర్వులనుటయు, శ్రౌతసూత్రకర్త లందఱిలో నెవరు మొదటివారనుటయు, సందిగ్ధములుగానే యున్నవి.

ఈ శ్రౌతసూత్రముల వ్యాఖ్యానములలో నొకవంతు ముద్రితములైనవి. మూఁడువంతుల ముద్రితములై ప్రచారములేక దేశమున యజ్ఞయాగాదులు క్షీణించుచున్నట్లే క్షీణించుచు, తంజావూరు మదరాసు పుస్తకభాండాగారములలో నణఁగి యున్నవి. శ్రౌతగ్రంథము లన్నియు సంహితా బ్రాహ్మణములు ప్రతిపాదించిన యాగములందు మంత్రవినియోగ ముపదేశించు ప్రయోగ శాస్త్రములని ముందే తెలిసికొనియున్నాము గావున నిఁక వానిస్వరూపము సంగ్రహముగాఁ బరిశీలింతము.

ఋగ్వేదీయ శ్రౌతసూత్రములు :— శౌనకుఁ డొకసూత్రము రచియించినట్లు వినిపించును గాని యది కనిపించదు. ఈ శాఖకు సంబంధించినవి. ఆశ్వలాయన నిర్మితమును, శాంఖాయనకృతమును బ్రసిద్ధములై యున్నవి. ఇందు మొదటి దైతరేయబ్రాహ్మణము ననుసరించినది అది పంద్రెండధ్యాయములు. రెండవది కౌషీతకి బ్రాహ్మణము ననుసరించినది. అది పదునెనిమిదధ్యాయములు. అందు కడపటియధ్యాయములు తరువాతి నెవరో చేర్చినవి గాని శాంఖాయనకృతములు గావని యూహింపఁదగియున్నది. ప్రయోగవిషయమున నీ రెండుసూత్రములు సమానముగానే యున్నవి కాని, శాంఖాయనసూత్రములో క్షత్రియోచిత యాగములు సవిస్తరముగాఁ బ్రతిపాదింపఁబడినవి. శౌనకాయనసూత్రము మఱియొకటి యున్నట్లు మాక్సిముల్లరు వ్రాసియుండెను గాని, అది నాకులభింపలేదు.

ఆశ్వలాయన శ్రౌతసూత్రమునకుఁ దొలుత దేవస్వామి, అనాకుల మనుపేరు గల భాష్యము రచియించినట్లును, దాని ననుసరించి తాను వృత్తి నిర్మించినట్లును నారాయణగార్గ్యుఁ డిట్లు చెప్పియున్నాఁడు.

"ఆశ్వలాయనసూత్రస్య భాష్యం భగవతా కృతమ్
దేవస్వామి సమాఖ్యేన విస్తీర్ణం స దనాకులమ్
తత్ప్రసాదా న్మ యేదానీం క్రియతే వృత్తి రీదృశీ
నారాయణేన గార్గ్యేణ నరసింహస్య సూనునా"

వీరు గాక, యీ సూత్రమునకు సిద్ధాంతి, షడ్గురుశిష్యుఁడు ననువారు వ్యాఖ్యలు రచియించిరి. తరువాత నీ సూత్రమునకు విష్ణుభట్టు తాలవృంతనివాసి త్రైవిద్యవృద్ధుఁడు ననువారు ప్రయోగవృత్తులు వేఱుగా రచియించిరి. ఈ రెండవ యతఁడు శ్రౌతవిషయమున వివిధసూత్రములకుఁ బ్రయోగవృత్తులు ప్రయోగ దీపికలు రచియించినవాఁడు ఇతఁడన్ని గంథములలోను: —

"ఏషా త్రైవిద్యవృద్ధేన తాళవృంత నివాసినా
సోమపేన కృతా వృత్తిః"

అని వ్రాసికొనెను కొన్ని లిఖితపుస్తకములలో, 'తాళబృందనివాసినా' అని యున్నది ఎట్లయిన నిందలి మొదటి మూఁడుపదములు విశేషణముగానే కనవచ్చుచున్నవి గాని, యిందొకటి విశేష్యమనుట నిశ్చయము. కొందఱీవ్యాఖ్యాత పేరు తాళవృంతనివాసి యని నిర్ణయించిరి గాని తాళవృంతశబ్దము గ్రామపరముగాఁ గనఁబడుచున్నది. సోమపశబ్దము సోమయాజియని మాత్రమే చెప్పును. కావున మూఁడువేదము లెఱిఁగిన వాఁడగుటచే వచ్చిన త్రైవిద్యవృద్ధుఁడను బిరుదనామమే యతని పేరుగా స్థిరపడుటచే నితఁడు దానినే వాడుకొనెనని తోఁచినది.

ఇఁక నీ సూత్ర మాధారముగా బయలుదేఱిన శ్రౌతగ్రంథముల సంఖ్యముగా నున్నవి తెలిసినంతవఱకు వాని నిందు పేర్కొనుచున్నాను.

ఆధానాది ప్రయోగము ఆధానహౌత్ర ప్రయోగము బ్రహ్మత్వ ప్రయోగము ప్రవాసవిధి ప్రయోగము ప్రాయశ్చిత్త ప్రయోగము ప్రాయశ్చిత్తకుతూహలము అగ్నిష్టోమ ప్రాయశ్చిత్తము ప్రయోగదీపిక ప్రవాసోపస్థాన హవిర్యజ్ఞ ప్రాయశ్చిత్తము సర్వపృష్ఠాప్తోర్యామ సప్తహౌత్ర ప్రయోగము సర్వపృష్ఠాప్తోర్యా మౌద్గాత్రప్రయోగము శ్రౌతప్రయోగ వృత్తి శ్రౌతప్రాయశ్చిత్తయోగము కూష్మాండ హోమ ప్రయోగము గణహోమ ప్రయోగము కుండలేష్టిప్రయోగము జాలేష్టిప్రయోగము త్రైధాతవీయేష్టి ప్రయోగము పౌండరీక హౌత్ర ప్రయోగము మొదలయినవి. శాంఖాయనుఁడు మహాకౌషీతకి మతము ననుసరించి జ్యోతిష్టోమ పద్ధతియను గ్రంథము రచియించిన ట్లొకచోటఁ గనవచ్చుచున్నది.

శాంఖాయనసూత్ర ప్రయోగమునెడ బ్రహ్మదత్తమత మొకటి ప్రాచీనమైనది కలదని, దానిని విని యీ సూత్రమునకుఁ బద్ధతి వ్రాసిన శివపుర గ్రామనివాసియగు పూర్వోక్తనారాయణ గార్గ్యుని యీ క్రింది వచనము చెప్పుచున్నది.

'బ్రహ్మదత్తమతం సర్వం సంప్రదాయ పురస్సరమ్
శ్రుత్వానారాయణాఖ్యేన పద్ధతిః కథ్యతే స్ఫుటమ్'

శాంఖాయన ద్వాదశాహపద్ధతియను మఱియొకవ్యాఖ్య రఘునాథాధ్వరి రచియించినది కనఁబడుచున్నది ఇది పెద్దవ్యాఖ్య. దీని మొదల నీ శ్లోకమున్నది. ''కౌషీతకిం ప్రణమ్యాదౌ మునిం శాంఖాయనం గురూన్, క్రియతేరఘు నాథేన ద్వాదశాహస్య పద్ధతిః.''

దీనినిబట్టి కౌషీతకి శాంఖాయనుఁడని విదితమగును. ఇందు ద్వాదశస్తుత్యాహ దీక్షలు వివరింపఁబడినవి. ఇతరవ్యాఖ్య లింకేమయిన నుండవచ్చును.

సామవేదీయ శ్రౌతసూత్రములు :— ఇందు మశకాచార్యకృతమైన యార్షేయ కల్పము మొదటిదని తోచుచున్నది. దీనివలెనే ద్రాహ్యాయణ లాట్యాయన కృతము లైన సూత్రములు రెండు ప్రసిద్ధములై యున్నవి. వీరు పెక్కండ్రు వ్యాఖ్యాతల స్తుతికిఁ బాత్రులైరి. ఇందు మొదటిదానికి వరదరాజును, రెండవదానికి ధన్వియు. మూఁడవదానికి అగ్నిస్వామియు వ్యాఖ్యానములు రచియించిరి.

ఈ మూఁడు సూత్రములుగూఁ దాండ్యబ్రాహ్మణమును, పంచవింశబ్రాహ్మణము ననుసరించినదే కాని యాగ యోగములను వివరించుటలో ద్రాహ్యాయణ సూత్రము రాణాయణీయశాఖను, లాట్యాయనసూత్రమున కౌథుమశాఖ నాశ్రయించినవి. ఆర్షేయకల్పమందలి విషయము నీ రెండుసూత్రము లనుసరించినట్లు వ్యాఖ్యాతల వాక్యసరణిని దెలియుచుండుట గూడ దాని యాద్యత్వమును బలపఱుచుచున్నది. ద్రాహ్యాయణ లాట్యాయనములలోని కొన్నివందల సూత్రములు సమానముగా నుండుటచే నిం దేదిముందో చెప్పుటకు సందేహము గలుగుచున్నది గాని, లాట్యాయనములో నొక్కొక్కటిగా నున్నకొన్ని సూత్రములు ద్రాహ్యాయణములో రెండేసి చొప్పున విడిపోవుటయు నందలి మఱికొన్ని సూత్రములిందు సవిశేషముగా నుండుటయు లాట్యాయనమే ముందనుట కవకాశ మిచ్చుచున్నవి. ఇందు గౌతమ శాండిల్య ధానంజప్య శాండిలాయన లామకాయన శాండిల్యాయన శౌచివృక్షి రాణాయనీ పుత్రాదులు పేర్కొనఁబడియున్నారు.

ఆర్షేయకల్పము పదునొకం డధ్యాయముల గ్రంథము. దీనికి వరదరాజు వ్యాఖ్యానము రచియించెను. ద్రాహ్యాయణము ముప్పది రెండుపటలములు. దీనికి ధ్వనియను పండితుఁడు దీపమనుపేర వ్యాఖ్యవ్రాసెను. లాట్యాయనము పదిప్రపాఠకములు. దీని కగ్నిస్వామి భాష్యము నిర్మించెను. ఇవిగాక యితర గ్రంథములు.

ప్రతిహార నిధాన సూత్రమను పేర పదియేను ఖండికలగ్రంథ మొకటికలదు. దీనికి వృత్తివ్రాసిన వరదరాజపండితుఁ డీసూత్రము కాత్యాయనుఁడు రచించినట్లుగా "అథ భగవాన్ కాత్యాయనో వక్ష్యమాణం వస్తు నిర్దిశతి'' అనువాక్యమునఁ దెలుపుచున్నాఁడు. జైమిని నిర్మించిన ప్రతిహార లక్షణమునకు విస్తరణముగా, ఆహిశ్రేణ్యుఁ డనునాచార్యుఁడు నాలుగుపటలముల ప్రతిహార సూత్రము రచియించెను. దీనికి వైనతేయుఁ డనుపండితుఁడు భాష్యము వ్రాసెను ఈ విషయ మీ క్రింది వాక్యములవల్లఁ దెలియవచ్చును.

''భగవదాచార్యేణ జైమినినా ప్రతిహారలక్షణం సామాన్యరూపేణ ప్రతిపాదితమ్......తావతా గ్రంథే నాథునాతనానా మల్పమేధసాం ... సామ ప్రతిహారావగతి రశక్యేతి మత్వా భగవా నాహిశ్రేణ్యో నా మాచార్యః... సామ్నాం వ్యక్తతరం ప్రతిహారా నాచిఖ్యాసురేవ మారబ్ధవాన్."

ఇట్లే పుల్ల సూత్రమను ౧౩౨ ఖండముల గ్రంధమును వరరుచి రచియించినట్లుగా వ్యాఖ్యాతయైన ఉపాధ్యాయాజాత శత్రుపండితుఁడు తెలుపుచున్నాఁడు. ఇవి గాక, ప్రస్తావసూత్రము ఉప గ్రంథసూత్రము క్షుద్రకల్పము మొదలగు మఱికొన్ని సూత్ర గ్రంథములును, సామప్రయోగ వృత్తి మొదలగు వ్యాఖ్యలును గలవు. కాని, యిచ్చట నొక్క విశేషము తాను రచియించిన కాత్యాయన ప్రాతిశాఖ్యవ్యాఖ్యలో వరదరాజపండితుఁడు కల్పసూత్రములు పదియని రెండుశ్లోకములఁ జెప్పియున్నాఁడు

"లాట్యాయన మనుపదం నిదానం కల్ప మేవచ ।
ఉప గ్రంథాశ్చ క్షుద్రాశ్చ తండిలక్షణ మేవచ ।
సూత్రం పంచవిధేయంచ కల్పానుపద మేవచ ।
అనుస్తోత్రంచ విజ్ఞేయం దశసూత్ర ప్రకీర్తనం ॥''

వీనిలో, కల్పమనునది యార్షేయకల్పము. ఇవి యన్నియు సామవేదమునకు సంబంధించిన కల్పములనెడి యభిప్రాయము గనవచ్చుచున్నది గాని, యిం దనేకములు, ఆర్షేయకల్ప లాట్యాయన ద్రాహ్యాయణములచే గతార్థములయిన యల్ప గ్రంథములని తెలియనగును.

కృష్ణయజుర్వేదీయ శ్రౌతసూత్రములు ఇవియును వీని వ్యాఖ్యానములును, అమితముగా నున్నవి. వీనిలో నాపస్తంబము మొదటిదిగాఁ గనవచ్చుచున్నది.

ఇందుకు దీని మొదటిదయిన 'అథాతో దర్శపూర్ణమాసౌ వ్యాఖ్యాస్యామః' అను సూత్రము బ్రహ్మయజ్ఞ పాఠమునఁ జేరుట యొక నిదర్శనము. ఇది ముప్పది ప్రపాఠకముల గ్రంథము. ఇది యంతయు శ్రౌతపరమే యని కొంద ఱభిప్రాయ పడిరి కాని, యిందు మొదటి యిరువదినాలుగు ప్రశ్నలును కడపటి శుల్బప్రశ్నయు మాత్రమే శ్రౌతమునకు సంబంధించినవి తక్కిన యైదు ప్రశ్నలలో ౨౫-౨౬-౨౭ ప్రశ్నలు గృహ్యసూత్రాత్మకములు ౨౮-౨౯ ప్రశ్నలు ధర్మసూత్రాత్మకములు ఈ రెండు విధములైన భాగములును ఖండములను విభాగములతో వేఱు వేఱుగా ముద్రితములై యున్నది. అందుచే ౨౪ ప్రపాఠకములే యీ శ్రౌతసూత్రమనుట నిజము. ఇందు ౨౪-వ ప్రశ్న పరిభాషా ప్రవరఖండ హౌత్ర మంత్రములను దెలుపుచున్నది.

దీని కనేకులు వ్యాఖ్యలు వ్రాసిరిగాని, యం దొకటియుఁ బూర్తిగా లేదు. రుద్రదత్తుఁడు పూర్తిగా రచియించియుండునుగాని, సూత్ర దీపికయను పేరుగల యా వ్యాఖ్య మొదటి పదిహేను ప్రశ్నలకు మాత్రమే లభించినదని గార్బె పండితుఁడు వ్రాసియుండెను. ధూర్తస్వామి రచించిన సామాన్య సూత్రభాష్యమైనను, పరిభాషకు సంబంధించినది మాత్రమే కనవచ్చుచున్నది. అట్లే కపర్దిస్వామి వ్రాసినది శుల్బభాష్యము మాత్రమే కనఁబడుచున్నది ఇట్లే తక్కినవిగూడ నసంపూర్ణములుగా నున్నవి

పై వారు ముగ్గురు గాక, యీ సూత్రమునకు, గురుదేవస్వామి కరవిందస్వామి చౌండపాచార్యుఁడు అహోబలసూరి సుందరరాజు, అను నైదుగురును వ్యాఖ్యలు వ్రాసియున్నారు. ఇందు గురుదేవస్వామి కృతము ప్రాచీనమని కొందఱు తలంచిరి ఈ వ్యాఖ్యలలో, మూలమును సక్రమముగా వివరించినది చౌండపాచార్యుని ప్రయోగ రత్నమాల. ఇందలి యవతారికలో విజయనగర సామ్రాజ్య ప్రభువుల వంశావళి కనవచ్చుచున్నది. కాని, యది రెండు వ్రాతప్రతులలో రెండు విధములుగా నున్నది. ఇం దొకదానిలోని రాజక్రమము తరువాతి క్రమమే రెండవ ప్రతిలో నున్నదిగాని యీ రెండును. చౌండపాచార్యుఁడు నిర్మించినవేనా? లేక, రెండవ దానికి మొదటి వంశక్రమము నితరు లెవరైనఁ జేర్చియుందురా? యని సంశయము గలుగుచున్నది. ఇందుకు సాయణమాధవు లిద్దఱు నొకరేయని తెలుపు వాక్యమే నిదర్శనము. ఇది, సాయణాచార్యులు సర్వశ్రౌత సూత్రసారముగా బౌధాయన మతమును గరతలామలకము గావించునట్టి యజ్ఞతంత్ర సుధానిధి యను గ్రంథము రచించి యందు తాను మాధవాచార్యుని తమ్ముఁడనని చెప్పుకొన్నదానికి

వ్యతిరిక్తముగా నున్నది. ఇది ప్రసక్తము గాకపోయినను, పాఠక ప్రతిపత్తికై పై మూఁడు విధముల వంశక్రమములను జూపుచున్నాను.

చౌండపాచార్యుని కృతిలో నున్నవి—

"క్షీరసముద్రమునుండి చంద్రుఁడు పుట్టెను అతనివలన యాదవకులము పుట్టెను. అందు సంగముఁడు, అతనికి హర్యప - బుక్కేశ - కంప - ముద్దప - మారప - నామకపుత్రులు నుదయించిరి. వీరిలో హర్యపరాజు మాధవాచార్యుని వలన నభ్యుదయము గాంచెను."

"సాయణాచార్యపూర్వజుఁడును వేదవ్యాఖ్యాతయునగు మాధవార్యునివలన హరిహరేశ్వరుఁడు లోకప్రసిద్ధి గాంచెను అతని పుత్రుఁడు యువ బుక్క భూపతి. ఇతనికి తృత్యంబ (తిప్పాంబ) యందు భూపతిరా జుదయించెను. ఇతనికి, పద్మాంబా మల్లాంబలయందు హర్యపేశ - సముద్రేశ - బుక్కభూప - రథీతములు పుట్టిరి. భూపతిరాజు మంత్రి చౌండపాచార్యుఁడు అతఁడు ప్రయోగ రత్నమాల యను వ్యాఖ్య రచియించెను."[1]

సాయణాచార్యుని కృతిలో నున్నది—

"చంద్రవంశమందు సంగమరా జుదయించెను. అతని కొడుకు బుక్కరాజు. అతని కొడుకు హరిహరరాజు. అతని కులగురువు సాయణాచార్యుఁడు. అతఁడు మాయణార్యుని కుమారుఁడు మాధవార్యుని సోదరుఁడు. యజ్ఞతంత్ర సుధానిధికర్త."

ఈ మూఁడింటిలోని రాజక్రమములను దేశ చరిత్రకారులు సరిపుచ్చియున్నారు. ఆ చరిత్ర గ్రంథములను బాఠకు లవలోకింతురుగాక.

పూర్వోక్త వ్యాఖ్యాతలలోని రుద్రదత్తుఁడే మంత్రప్రశ్న భాష్యకర్తయగు హరదత్తుఁడని కొందఱి యభిప్రాయము. రెండు గ్రంథములలోను రెండు విధములయిన నామములను గ్రంథకర్త వాసికొని యుండఁడు గాని, వైదిక గ్రంథ వ్యాఖ్యాతలలో హరదత్తుఁడు ప్రసిద్ధి కెక్కియుండుటచేతను, ప్రధాన కల్పసూత్రమున కతఁడు వ్యాఖ్య వ్రాయక విడువఁడనుట విశ్వాస్యమగుటచేతను వీ రిరువు రొకరేయని భావింపఁబడుచున్నది.

1. తంజా. సం. భా. 2049. 2048. 2599. నంబర్లు.

శ్రౌతసూత్రములలో నాపస్తంబముకంటెఁ గూడ బౌధాయన మెక్కువ ప్రమాణముగా నుండెడిదనుట నిరాక్షేపము. ఇందుకు 'బోధాయనుని శ్రౌతసూత్ర రూపమైన నావయెక్కి విద్వాంసు లధ్వరసముద్రము నావలియొడ్డు గాంచుచున్నా' రనెడి సాయణాచార్య ప్రశంసయే పరమప్రమాణము.[1] అట్టి సూత్ర మాద్యమని మహాదేవయజ్వ రచియించిన యత్యంతార్వాచీనమైన శ్రౌతచంద్రిక యవతారికలోని —

'అస్తి బౌధాయనం సూత్ర మాద్య మాధ్వర్యవాశ్రయమ్' అనువాక్యమును బట్టి తలంత మన్న —

''ఆదిమం బ్రాహ్మణం క్షేమ మధ్యస్థితపరావరమ్
అపాస్తాశేషపాప్మాన మాపస్తంబమునిం స్తుమః.'[2]

అనుభట్టరుద్రదత్తుని సూత్రదీపికావతారికలోని వాక్యమునుబట్టి బ్రాహ్మణులలో నెల్ల నాపస్తంబుఁ డాద్యుఁడని తలంపవలసివచ్చును. ఇవి రెండును నిజముగా సూత్రకర్తల మహత్త్వమును బ్రశంసించునవి యగుటచే వీరిపౌర్వాపర్యనిర్ణయమున కుపకరించునవిగాఁ గనఁబడవు. కాని శ్రౌతసూత్ర పరిగణనమున బౌధాయనము నెక్కువగా గణించుట మాత్ర మధికముగాఁ గనవచ్చును.

ఈ సూత్రము ముప్పది ప్రశ్నలగ్రంథము దీని కనేకవ్యాఖ్యలు కలవుగాని యన్నియు నసంపూర్ణములుగానే కనఁబడుచున్నవి. వానిలో, భావస్వామి నవహస్త శేషనారాయణ ద్వారకానాథయజ్వ మహాదేవయజ్వ యజ్ఞేశ్వరబాల దీక్షిత వాసుదేవదీక్షిత వేంకటేశాధ్వరి గోపాలాయనంతదేవ సింగణసాయణాచార్య కృతములు పదునొకండు నిలిచియున్నవి. ప్రతివ్యాఖ్యాతయు బౌధాయన సూత్ర ప్రయోజనము నెక్కువగాఁ గొనియాడియుండెను. అందు కల్పవివరణకర్తయగు భావస్వామి 'ఒక్కొక్కశాఖకు బ్రాహ్మణము లధికము లగుటచేతను, వానియర్థము దుర్బోధ మగుటచేతను, దాని నంత నొకచోటఁ జేర్చి చక్కఁగా వివరించినయెడల

1. సత్సూత్రాన్విత శాఖశాగమ మహారత్నం విధానం గిరాం, ప్రత్యక్షిత్త ముపాస్మహేవయమమీ బోధాయబోధాయనం, యద్వ్యాఖ్యాన మబంధ్యబంధ మహతీం ప్రాప్యాధ్వరాంభోనిధేః, పారం యాన్తి మనీషిణో బహువిధై స్తంత్రస్య తస్యోర్మిభిః'' యజ్ఞతంత్ర సుధానిధి.
2. గార్బె పండితుఁడు ప్రకటించిన ప్రతిలో—'ఆదిమం బ్రహ్మణః కేశ మధ్యస్థిత పరావర'మ్మను పాఠము కనఁబడుచున్నది.

యియజ్వు లెల్లరు సుఖముగాఁ గర్మము లాచరించుకొందురను తలంపుతో బోధా యనముని యీ కల్ప మారంభించెను' ననుటనుబట్టి దీనిగొప్ప గోచరించును.

తంజాపురీ పరిపాలకుఁడు భోసలవంశ సంజాతుఁడు నగు శరభేంద్ర భూపా లునిపుత్రుఁడగు శివాజీమహీపాలుని యాస్థానమందున్న మహావిద్వాంసులలో నొకఁ డగు బాలదీక్షితులు బోధాయన సూత్రములోఁ గొంతకు, కర్మాన్తపరిభాషాది సంగ్రహమనుపేర వ్యాఖ్య వ్రాయుచు నవతారికలో వ్రాసిన—

"బోధాయనాయ మునివందితపాదపద్మ
ద్వంద్వాయ కణ్వతనయాయ నమోఽస్తు తస్మై."

అను మాటలనుబట్టి బోధాయనుని తండ్రి కణ్వుఁడని తెలియుచున్నది. కణ్వసంజ్ఞగల మహర్షి ఋగ్వేద ద్రష్టలలోను సామగాచార్యులలోను శుక్లయజు శ్శాఖా ప్రవర్తకులలోను గూడఁ గనవచ్చుచున్నాఁడు. ఇట్లు కనవచ్చు ముగ్గురు నొకఁడే యనుటకుఁ గాని, యీ ముగ్గురిలో నొకఁడు బోధాయను జనకుఁడనుటకుఁ గాని యవకాశము కనిపించదు. ఆధారమును లభించదు. అందుచే నీకణ్వముని యెక్కడివాఁడో యెప్పటివాఁడో యూహింపరాకున్నది కాని, మొన్న మొన్నటి వారగుబాల దీక్షితాదుల యిట్టి వచనములు గూడఁ బరిశోధకులు తమ యభిప్రాయ మున కనుకూలముగాఁ గొందఱిని వెనుకకుఁ ద్రోయుటకును మఱికొందఱిని ముందుకు లాగుటకును సహాయపడకపోవు శతాధికములైన బోధాయన సూత్ర వ్యాఖ్యలు పరికించి శ్రౌతసర్వస్వమను నాలుగు పరిచ్ఛేదముల వ్యాఖ్యాగ్రంథము వ్రాసిన శేషనారాయణుఁడు గూడ[1] బోధాయనుని తండ్రిని బేర్కొనలేదు. ఇఁక నీ సందర్భమునఁ బ్రధానశ్రౌత సూత్రములన్నియుఁ దొలుత సర్వశాఖాసామాన్యము లనుట కొక్కయుదాహరణము.

''ఆశ్వలాయనశాఖినో యజమానస్య బోధాయన సోమప్రయోగః, తత్రా ధానం'' ఇత్యాదిగా బోధాయన సోమప్రయోగమను గ్రంథము రచియించిన రుద్ర దేవుఁడు పలికియుండెను. దీనినిబట్టి సర్వశాఖీయులు శ్రౌతసూత్రములన్నిటి నను సరించి యాగము లాచరించుచుండి రనియు, కాలక్రమమున నయ్యాశాఖీయుల యాచారము లించుక మాఱుటచేతఁ గృష్ణయజుర్వేదీయ మనఁబడు బోధాయన

1. బోధాయనస్య సూత్రస్య వ్యాఖ్యాః స్సంతి పరశ్శతాః, శేషోఽ ప్యహ మశేషాస్తాః పరిశృత్య బ్రువేఽల్పశః.

సూత్రము ననుసరించి యాశ్వలాయనుల సోమయాగవిశేషములు బోధించు నీ ప్రయోగము రచియింపవలసివచ్చె ననియుఁ దెలియఁగలదు. తరువాత-

భారద్వాజ శ్రౌతసూత్రము - సప్తమహర్షు లందఱుగూడ సూత్రమో లేక స్మృతియో రచియించినవారేయని వైదికలోకప్రతీతి యొకటిగలదు. ఆ పద్ధతిని బట్టి యిది భరద్వాజమహర్షి రచియించె ననవలసివచ్చును గాని గ్రంథరీతినిబట్టి భరద్వాజగోత్ర మందలి యొకానొక భారద్వాజుఁడు నిర్మించినదిగాఁ గనఁబడు చున్నది. ఇందలిభాగములును, ప్రశ్నలుగానే యున్నవి. ఇదియు దర్శపూర్ణ మాసముల వివరణముతోనే యారంభమైనది.

హిరణ్యకేశి శ్రౌతసూత్రము దీనికి సత్యాషాఢమనియు వాడుక కలదు. ఇది మైత్రాయణీయశాఖకు సంబంధించినది. దీనికి వాంఛేశ్వరసుధి వ్యాఖ్యానము రచియించెను అంతకుఁ బూర్వము మాతృదత్తవిరచిత ప్రయోగముండెను గాని యది సూత్రార్థ సమ్మతముగా లేదని యితఁడే వచియించుచు నాపస్తంబమతము నందందు క్రోడీకరించియున్నాఁడు. సప్తసోమపద్ధతి, మానవ సూత్రముగూడ నీ శాఖకుఁ జేరినవే. రెండవది హిరణ్యకేశి సూత్రమువలెఁ బ్రాచీన సూత్రములలో గణింపఁదగియున్నది. ఇవిగాక, వాధూన సూత్రము లౌగాక్షి సూత్రము మైత్ర సూత్రము కఠసూత్రము వరాహసూత్రము వైఖానససూత్ర మనునవి కృష్ణయజు శ్శాఖలకు సంబంధించినవి వినఁబడుచున్నవి. ఇవి యన్నియు నాపస్తంబ బోధాయ నాది ప్రధాన సూత్రముల కిర్వాచీనములు. ఇందు వైఖానస సూత్రము శ్రీనివాస దీక్షిత వ్యాఖ్యతోఁ గనవచ్చుచున్నది. ఔఖేయశాఖకు సంబంధించిన యీ సూత్ర మును విఖనసుఁడు రచియించినట్లుగా 'ప్రణీతం సూత్ర మౌఖేయం తస్మై విఖనసే నమః' అను వాక్యమున వ్యాఖ్యాత తెలిపియున్నాఁడు. ఇఁక నాపస్తంబాశ్వలాయన బోధాయన సూత్రము లాధారములుగా వెలసిన శ్రౌతసూత్ర ప్రయోగ గ్రంథము లపరిమితముగా నున్నవి. వానిలో సజీవములైన కొన్నిటి నిందు పేర్కొను చున్నాను.

ఆపస్తంబాగ్నిహోత్ర ప్రయోగము అగ్నిహోత్రవిధి ప్రయోగము ఆధానాది ప్రయోగము ఆధానహౌత్ర ప్రయోగము అగ్నిహోత్ర రక్షామణి ఆపస్తంబ సూత్రార్థ ధ్వనితార్థకారిక ఆపస్తంబ నక్షత్రేష్టి ప్రయోగము దర్శపూర్ణమాస ప్రయోగము బోధాయన దర్శపూర్ణమాస పంచప్రయోగము చాతుర్మాస్య ప్రయో

గము ఆశ్వలాయన పశుబంధ మైత్రావరుణ ప్రయోగము ఆపస్తంబ బోధాయన పశుబంధ ప్రయోగములు అగ్నిష్టోమపద్ధతి జ్యోతిష్టోమపద్ధతి వాజపేయపద్ధతి మొదలయినవి.[1] ఇట్టి వన్నియు శ్రౌతసూత్రముల ననుసరించి యొక్కొక్క క్రియను వర్ణించుచు వచ్చినవిగాని సంపూర్ణములు కావు.

శుక్లయజుర్వేదీయ శ్రౌతసూత్రము - కాత్యాయనముని నిర్మించిన శ్రౌత సూత్రము ప్రసిద్ధమైయున్నది. ఇది యధికముగా శతపథ బ్రాహ్మణము ననుసరించి యున్నది ఇరువదియా అధ్యాయముల యీ గ్రంథమునకు, కర్కోపాధ్యాయుఁడు భాష్యము రచియించెను గాని యదియును సూత్రప్రాయముగానే యున్నది. కాత్యాయనుఁడు హౌత్ర మనుపేర మఱియొక సూత్రము రచియించినట్లుగా నీ క్రింది వాక్యములవల్లఁ దెలియవచ్చుచున్నది.

"కాతీయం కల్పసూత్రంచ హౌత్రం కాతీయ మేవచ
అనయోః కర్కభాష్యంచ సంప్రదాయాది విర్ణయాన్.
ఏతా నాలోచ్య యత్నేన శివం సాంబం ప్రణమ్యచ
పదార్థా దర్శసంజ్ఞం తు గ్రంథం కుర్వే గురూక్తితః"

ఈ పదార్థాదర్శము రచియించిన వారి పేరు తెలియదుగాని, యీ శ్లోకముల వలనఁ గాత్యాయన సూత్రమునకు సంప్రదాయము మొదలగు ప్రాచీన వ్యాఖ్యలు గూడఁ గలవని తెలియుచున్నది. ఇందుకు నిదర్శనముగా, కర్కభాష్యములో 'సంప్రదాయేతు' అనెడి యుద్ఘాటనముగూడఁ గనవచ్చుచున్నది. ఇదిగూడఁ బూర్వ సూత్రములంబోలి దర్శపూర్ణమాసాది యాగముల నిరూపించుచున్నది. ఇందలి ప్రథమాధ్యాయమునఁ బేర్కొనఁబడిన వాత్స్యకార్ష్ణాజిన్యాది పూర్వాచార్యులలో లౌగాక్షి భారద్వాజులు కనఁబడుచున్నారు. అందుచే శ్రౌతసూత్రకర్తలైన యీ యిరు వురికంటెఁ గాత్యాయనుఁడు బరుఁడని విదితమగుచున్నది.

ఆథర్వణశ్రౌత సూత్రములు :— కౌశిక సూత్రము వైతానసూత్రము. అనునవి యథర్వశాఖలకు సంబంధించి యున్నవి. ఇవి రెండును క్రమముగా

1. ఇట్టి గ్రంథము లసంఖ్యములుగా, తంజావూరు లైబ్రరీలో నున్నవి.

బ్లూంఫీల్డు గార్బు పండితులచేఁ బ్రకటింపఁబడినవి. వీనికి వ్యాఖ్యానము లున్నట్లు కనరాదు. ఇవి రెండును యాగక్రియాచరణమునఁ బ్రమాణములుగా గ్రహింపబడుచున్న ట్లెందును గనఁబడదు. ఇందు కౌశికసూత్రము, అథర్వవేదమందలి మంత్రముల నెత్తికొని యాయా కర్మలను బ్రతిపాదించుచు వచ్చినది. కౌశిక మతము నుదాహరించుచు వచ్చిన వైతానసూత్రము దీనికంటె నర్వాచీన మనుట స్పష్టము.

శ్రౌతసూత్రములన్నియు, అగ్న్యాధా నాగ్నిహోత్ర దర్శపూర్ణమాసాది సప్తహవిస్సంస్థలను, అగ్నిష్టోమ వాజపేయాతి రాత్రాది సప్తసోమ సంస్థలను బ్రతిపాదించునవి. హవిర్యజ్ఞములందు పయోదధ్యాజ్యవ్రీహ్యాది ద్రవ్యములు ముఖ్యముగా హోమయోగ్యములు. ఈ యాగములలో నగ్నిహోత్ర కర్మము ప్రతి దినము ప్రాతస్సాయంకాలముల నాచరింపఁదగినది. తక్కినవి స్వర్గాదిక వివిధ ఫలాపేక్షచే నాచరింపఁదగినవి. సోమయాగములు సాధారణముగా నొకరోజు మొదలుగాఁ బన్నెండు రోజులవఱకుఁ జేయవలసిన విశేషకర్మలు. అవి హోత్రాది ఋత్విక్కుల సాహాయ్యము నపేక్షించి యజమానుఁ డొనరించునవి. అందు సత్ర యాగము సంవత్సరములకొలఁది కాల మాచరించు నత్యుత్తమయాగము. ఈదృశ మయిన యాగపద్ధతి కేవలము స్వర్గాది ఫలాపేక్షచేఁ గల్పింపఁబడినదని తలంప రాదు. కర్మాచరణము చిత్తశుద్ధికిని వైరాగ్యమునకును గారణమై జ్ఞానోత్పత్తికిఁ బరమసాధనమగుననియే ప్రాచీన మహర్షుల నమ్మిక. జనకాదులు కేవల కర్మముల వలనఁగూడ సిద్ధిగాంచిరని యుపనిషత్పురాణములు చెప్పుచున్నవి. అయినను, కర్మోపాసనాజ్ఞాన కాండాత్మకమైన వేదరాశియందు మొదటిదగు కర్మకాండము జ్ఞానమునకు ద్వారమనుట నిర్వివాదము. అట్టి కర్మకాండమును వర్ణించు నీ శ్రౌత సూత్రములన్నియు సాధారణముగా ఋషుల గోత్ర ప్రవరంబునుగూడ విశదీకరించుచు వచ్చినవి. అట్టివాని నెల్ల నొక్కచో సవిస్తరముగాఁ జూపించునట్టి గోత్ర ప్రవర నిబంధకదంబమను గ్రంథము మైసూరు పురమున ముద్రితమై యున్నది. అం దన్ని గోత్రములవారి ప్రవరలును సవిశేషముగా లభించుచున్నవి. మఱియు, భృగ్వంగిరోమరీచ్యత్రి మహర్షులవలన నుత్పన్నములైన యార్షగోత్రముల పట్టిక యొకటి దాని కనుబంధముగా నున్నది. దానినిబట్టి ఋషుల పరస్పర సంబంధ

స్వరూపము చక్కఁగా గోచరించును. ఇట్లు వేదవేదాఙ్గముల చరిత్ర మొత్తఁత తెలిసికొంటిమి. ఇకఁ దక్కిన సూత్రాదులు.

ఇది, శ్రీ చర్ల బ్రహ్మశాస్త్రి గురువర కరుణాధీత పాణినీయుఁడును, శ్రీ మంథా
చెన్నయశాస్త్రి గురువర కరుణాధీతోత్తర మీమాంసా దర్శనుఁడును,
ఋగ్వేద ప్రథమమండ లాంధ్రీకర్తయు, సంస్కృత కవిజీవి
తాంధ్ర మహావీరచరిత శంకరవిజయాది కృతికర్తయు
నగు మల్లాది సూర్యనారాయణ శాస్త్రి నిర్మించిన
సంస్కృత వాఙ్మయ చరిత్ర ప్రథమభాగ
వైదిక వాఙ్మయమునం
దష్టమాధ్యాయము.

నవమాధ్యాయము

గృహ్యసూత్రములు

శ్రౌతసూత్రములవలెనే గృహ్యసూత్రములును ఆపస్తంబాది మునులు నిర్మించిన వనేకములు కలవు. ఇఁక వాని వ్యాఖ్యానములును వాని ననుసరించి బయలు వెడలిన స్మార్తగ్రంథములు నపారములు. గృహ్యసూత్రములును వివిధ వేదశాఖలకుఁ సంబంధించి భరతఖండము నలుఁగడల వ్యాపించియున్నవి. వీనిలో నాపస్తంబసూత్రము దక్షిణహిందూదేశమున, నందును నాంధ్రదేశమున ననాదిగా నెక్కువ ప్రచారములో నున్నది ఆపస్తంబుని శ్రౌతసూత్రము ప్రకటించిన గార్బుపండితుఁడును, ఇతని ధర్మసూత్రము ప్రకటించిన బుహ్లారుపండితుఁడుఁ గూడ, ఆపస్తంబుఁ డాంధ్రదేశనివాసి యని తమపీఠికలలో వ్రాసియున్నారు. భారతీయులు కాని యిద్దఱుపరిశోధకుల సాక్ష్యమును బట్టి, వైదికసూత్ర కర్తలలో నగ్రగణ్యుఁ డనఁదగిన యాపస్తంబుఁడు మన యాంధ్రుఁడని తెలిసికొనుటకంటె నాంధ్రుల కానందహేతువు మఱేమి కలదు ?

గృహ్యసూత్రములలో, "బోధాయనము ఆపస్తంబము సత్యాషాఢము ద్రాహ్యాయణము ఆగస్త్యము శాండిల్యము అశ్వలాయనము శాంభవము కాత్యాయనము, అనుతొమ్మిదియుఁ బూర్వసూత్రములు. వైఖానసము శౌనకీయము భారద్వాజము ఆగ్నివైశ్యము జైమినీయము వాధూలము మాధ్యందినము కౌండిన్యము కౌషీతకము, అనుతొమ్మిదియుఁ బరసూత్రములు." అని యాగ్నివైశ్య సూత్రము చెప్పుచున్నది. ఇందథర్వశాఖీయ సూత్రములు చేరలేదుగాని, తక్కిన శాఖలలోని వనేకములు చేరినవి. దీనినిబట్టి యీ గణనమునాఁటి కథర్వశాఖీయ కౌశికగృహ్య సూత్రము పుట్టలేదో, లేక యాకాలమున నది ప్రమాణముగా గ్రహింపఁబడలేదో చెప్పఁజాలము. పూర్వోక్తములైన పదునెనిమిది మాత్రమే కాక యింకను గొన్ని సూత్రములు గలవు.

గర్భాధానము పుంసవనము జాతకర్మము మొదలుగా మరణానంతర కర్మవఱకుఁ గల గృహ్యములైన కర్మలను బ్రతిపాదించునవి యగుటచే నివి గృహ్య సూత్రము లనఁబరఁగినవి. వీనియందు మొత్తము నలువదికర్మలు చెప్పఁబడినవి. అందు పదునెనిమిది గర్భాధానము మొదలుగా వివాహపర్యంతము గలకర్మలు.

ఇవి, అష్టాదశ శరీరసంస్కారము లనఁబడుచున్నవి. తక్కినవానిలో నైదు పంచ మహాయజ్ఞము లనియు, మూఁడు పాకయజ్ఞము లనియుఁ బిలువఁబడుచున్నవి. ఇవి నిత్యానుష్ఠేయములైన గృహ్యకర్మలు, తక్కిన పదునాలుగును శ్రౌతములైన యజ్ఞకర్మలు.

ఏతాదృశములైన సూత్రములలో, ఆశ్వలాయనము - కౌషీతకాపరనామ మైన శాంఖాయనము - శాంభవము, అనుమూఁడును ఋక్శాఖీయములు. ఇందు మొదటి దాశ్వలాయన శ్రౌతసూత్రమున కనుబంధమైనది. ఇది నాలుగుకాండ ముల గ్రంథము. రెండవది కౌషీతకి బ్రాహ్మణోక్తములైన యాయాగృహ్యకర్మల నొక్కచోఁ జేర్చి వానిని సవిస్తరముగా వర్ణించిన గ్రంథము. దీనితరువాత బయలు దేఱిన శాంభవసూత్రము దీనిలోనికర్మలనే వివరించునది యైనను విశేషముగాఁ బితృయజ్ఞమును వర్ణించినది. ఈ మూఁడింటిలోను, ఆశ్వలాయన సూత్రమే యెక్కువ ప్రమాణమై యాచరణలో నున్నది దీని ననుసరించి శుక్లవిశ్రామ పుత్రుఁడైన శివరామపండితుఁడు బహ్వృచాహ్నికము రచియించెను. "శాకలోఽహం ప్రయోగంచ వక్ష్యే బహ్వృచకర్మణాం'' అను దానినిబట్టి శాకలుఁడు తన పేర నొక కారిక రచియించినట్లు కనఁబడుచున్నది. ఇది గాక, ఆశ్వలాయన సూత్రప్రదీపిక యను పేర భట్టకుమారిలస్వామి మఱియొక కారిక రచియించెను. ఈ కారిక, ఆశ్వలాయన గృహ్యసూత్రవృత్తికి సంగ్రహమైనట్లు—

> ''ఆశ్వలాయన మాచార్యం నత్వా తద్గృహ్యకర్మణామ్
> ప్రయోగం వచ్మి సంక్షేపాత్ వృత్తికారేణ భాషితమ్".

అను దానివల్లఁ దెలియుచున్నది. ఇంక నిట్టి సంస్కార ప్రయోగాదిగ్రంథము లనేకములు కలవు.

సామశాఖీయ గృహ్యసూత్రములలో లాట్యాయన మతానుసారియైన గోభిలీ సూత్రము మొదటిదిగాఁ గనవచ్చుచున్నది. ఇది నాలుగు ప్రపాఠకముల గ్రంథము. ఇందు స్మార్తాగ్న్యాధానము పంచమహాయజ్ఞములు పశ్వాదిస్థాలీ పాకము దర్శపూర్ణమాస స్వరూపము పిండపితృయజ్ఞము మొదలయిన గృహ్యవిషయము లన్నియు విశదీకరింపఁబడినవి. దీనికి ఛాందోగ్యగృహ్య మనియుఁ బేరుగలదు. దీనికి నారాయణపండితుఁడు వృత్తి రచియించెను మఱియు శివరామ పండితుఁ డను నతఁడిందలి విషయమంతయు సుబోధకమగునట్లు కృత్యచింతామణి రచియిం

చెను. నారాయణ పద్ధతితోఁ గూడిన యీ గ్రంథము కలకత్తా ప్రాచీన పుస్తక భాండాగారమున నున్నది.

ఖాదిరగృహ్యసూత్ర మనునది రాణాయనీయశాఖకుఁ జెందినది మఱియొకటి కలదు. ఇది ద్రాహ్యాయణ మతము ననుసరించినది. కాని విషయమునందిది గోభిలసూత్రమునే పోలియుండి దాని సంగ్రహముగా నున్నదని ఖాదిరసూత్ర ప్రకాశకులు తెలుపుచున్నారు. ఇది నాలుగుపటలముల గ్రంథము. రెంటినిబోల్చి చూతమన్న నాకు గోభిలసూత్రము లభింపలేదు. ఖాదిరసూత్రమందు దర్శపూర్ణ మాసాగ్న్యేయస్థాలీపాక పుంసవనాది కర్మలు ప్రతిపాదింపఁబడినవి. పై గోభిల సూత్ర మాధారముగా నుదయించినది ఛందోగపరిశిష్టము. దీనికర్త కేశవమిశ్రుఁడు. ఈ పరిశిష్టమునకుఁ బ్రకాశమను వ్యాఖ్య వ్రాసిన నారాయణ పండితుఁడిట్లు చెప్పి యున్నాఁడు.

"అథాతో గోభిలోక్తానా మన్యేషాం చైవ కర్మణామ్
అస్పష్టానాం విధిం సమ్యగ్దర్శయిష్యే ప్రదీపవత్."[1]

ఈ పరిశిష్టప్రకాశమునకు సారమంజరి యను వ్యాఖ్యను శ్రీనాథాచార్యుఁడు వ్రాసెను, అతని ప్రతిజ్ఞ యిది.

"శ్రీకరాచార్యపుత్రేణ శ్రీమచ్ఛ్రీనాథశర్మణా
పరిశిష్టప్రకాశస్య క్రియతే సారమంజరీ."

ఇది యంతయుఁ జూడ గోభిలసూత్రము సామశాఖీయ సూత్రములలోఁ బ్రధానమైనదని విదితమగును. మఱియు జైమినిగృహ్య సూత్రము ద్రాహ్యాయణ గృహ్యసూత్రమును గూడ నున్నట్లు వాని ననుసరించి పుట్టిన గ్రంథములను బట్టి తెలియవచ్చుచున్నది. జైమిని గృహ్యసూత్రకారిక జైమినిగృహ్య సూత్రవ్యాఖ్య యను లిఖిత గ్రంథములు చెన్నపురి దొరతనమువారి పుస్తకభాండాగారమున నున్నవి. ద్రాహ్యాయణ గృహ్యపరిశిష్టము గూడ నందేకలదు. ఇది యెవరు రచియించినదో సరిగాఁ దెలియరాదు కాని, గ్రంథారంభమందలి శౌచవిధి వాక్యములచివర 'ఇత్యాహ భగవాన్ రాణాయనిః' అను వాక్యమునుబట్టి రాణాయని,

1. ఈ శ్లోకము కర్మప్రదీపమను మఱియొక గ్రంథము మొదట నున్నట్లు దెలియ వచ్చుచున్నది. నిజముగా నిది యొందలిదో!

ద్రాహ్యాయణ శాఖీయముగా ద్రాహ్యాయణ గృహ్యసూత్రము రచియించెనేమో యని తోఁచుచున్నది. ఇవి గాక జైమిని గోభిల సూత్రముల ననుసరించిన కర్మప్రదీప మను కారికాగ్రంథము మఱియొకటి లండన్ నగరములోని పుస్తకాలయమున నున్నది. అయిదువందల శ్లోకములతోడి యీ గ్రంథము పది ఖండికలుగానున్న దని గైక్వారను పరిశోధకుఁడు తెలుపుచున్నాఁడు.[1] దీని కాశార్కమిశ్రుఁడు భాష్యము రచియించెను. ఇతఁ డారంభమునఁ గావించిన ప్రతిజ్ఞ యిట్లున్నది

"తం బాదరాయణం నౌమి యోఽసౌ జైమినయే దదౌ
కర్మకాండం పరం సామగాయినా మఖికాంక్షితమ్
జైమినిం మునిశార్దూలం మూలం సామ్నాం సగోభిలమ్
నత్వా కర్మప్రదీపార్థవిచారః క్రియతే మయా"

ప్రకరణాంత గద్యములందు భాష్యకర్తపేరు, ఆశాదిత్య మిశ్రుఁడనియు, అతని తండ్రి చక్రధర మిశ్రుఁడనియు నున్నది. ఇంక నిట్టి సామశాఖీయ గృహ్య గ్రంథము లనేకము లుండవచ్చును

కృష్ణయజుశ్శాఖీయ గృహ్యసూత్రములు :— సంహితా పాఠభేదమున నేర్పడిన శాఖలుగాక, ఆయా శాఖలు కొన్ని సూత్రభేదమునఁగూడ వేఱుపడినవి. తైత్తిరీయ శాఖలో, ఆపస్తంబ సూత్రులనియు బౌధాయన సూత్రులనియు నిరు తెఱఁగులవారు కలరు ఆంధ్రదేశమందలి తైత్తిరీయు లందఱు నాపస్తంబసూత్రులే యని చెప్పవచ్చును అట్లే మైత్రాయణీయ శాఖలో హైరణ్యకేశులు మానవులునను భేదము గలదు. ఇట్లేర్పడిన శాఖలవారు తమతమ సూత్రములనే గృహ్యకర్మము లందు ప్రమాణముగాఁ గైకొందురు. అట్టి సూత్రములు, ఆపస్తంబము బౌధాయనము హిరణ్యకేశి మానవము కఠము వైఖానసము, అనునవి ఇవిగాక, భారద్వాజ గృహ్యము శాట్యాయన గృహ్యమునను రెండు సూత్రములు తైత్తిరీయ శాఖకుఁ జెందినవి గలవు కాని, యీ సూత్రములవా రెందైనఁ గలరేమో తెలియదు.

ఆపస్తంబ సూత్రము ౨౩ ఖండముల గ్రంథము. ఇందు ౪౦౫ సూత్రములు కలవు దీనికి హరదత్తుఁ డనాకులావృత్తిని, సుదర్శనాచార్యుఁడు తాత్పర్య దర్శన మును కపర్దిస్వామి భాష్యమును రచియించిరి. ఈ గృహ్యసూత్రము, ఇతని శ్రౌత

1. మన దేశమందలి పుస్తక భాండాగారములో లేని కొన్ని వైదిక గ్రంథము లం దున్నట్లు గ్రంథసూచికవల్లఁ దెలియుచున్నది

సూత్రములోని ౨౭వ, ప్రశ్నమేయని కొందఱును; శ్రౌతసూత్రము ౨౪ ప్రశ్నముల గ్రంథమే తరువాతివి గృహ్యధర్మాదులను బోధించు వేఱు ప్రకరణములు, ఆపస్తంబ సూత్రము లన్నిటి నొక్కటిగాఁజేర్చి వ్రాసినవారి లిఖిత పుస్తకములనుబట్టి యిది శ్రౌతసూత్రమందలి భాగ మనుచున్నారుగాని యది యుచితము కాదని కొందఱును, తలంచుచున్నారు. ఎట్లన్నను ఫలము వేఱుకాదు.

కర్మలు శ్రుతిలక్షణములు, ఆచార లక్షణములునని ద్వివిధములు. ఇందు మొదటివి పూర్వోక్తములయిన వివిధ యాగములు ప్రత్యక్ష శ్రుతిచేఁ దెలియరానివై యాచారమువలనఁ దెలియఁబడుచున్న వివాహాదికర్మ లాచార లక్షణములు. అవియే గృహ్యములు. మొదటి ప్రతిజ్ఞాసూత్ర మీ యభిప్రాయము నిట్లు చెప్పుచున్నది.

'అథ కర్మా ణ్యాచారా ద్యాని గృహ్యంతే' ఆచారాత్ ప్రయోగాత్ గృహ్యన్తే జ్ఞాయన్తే న ప్రత్యక్షశ్రుతేః తాని కర్మాణి వ్యాఖ్యాస్యామః' అని వృత్తికారులు.

"యత్కృతం వేదవ ద్భాష్య మాద్రియన్తే విపశ్చితః
స కపర్దీ చిరం జీయా ద్వేదవేదార్థ తత్త్వవిత్"

అని కపర్దిస్వామిని, అతని భాష్యమును స్తుతించిన సుదర్శనాచార్యుఁడు నిట్లే 'ఫలాపేక్ష లేకుండ శిష్టు లాచరించు నౌపాసనహోమాదులును, యజ్ఞములందధికారము కలిగించునట్టి శరీర సంస్కారార్థములును పాకయజ్ఞ శబ్దవాచ్యములునైన పాణిగ్రహణాదులును, ఏ యాచారమునుండియు ననుమితములైన వేదవాక్యములనుండియుఁ దెలియఁబడుచున్నవో, అవి గృహ్యకర్మములని ప్రతిజ్ఞా సూత్రమున కర్థము వ్రాసెను. దీనినిబట్టి గృహ్యకర్మలు ప్రత్యక్ష శ్రుతివిహితములు గాకపోయినను, అనుమేయ శ్రుతులవల్ల జ్ఞాయమానము లగుచున్నవనియు, శిష్టాచార సిద్ధములైన యట్టి గృహ్యకర్మలను బ్రతిపాదించునవే గృహ్యములు లేక స్మార్త సూత్రములనియుఁ దెలియుచున్నది.

బోధాయన గృహ్యము నాలుగు ప్రశ్నల గ్రంథము. ఇందు ౧౨ అధ్యాయములు గలవు. దీని కనుబంధముగా, రెండు ప్రశ్నల పరిభాషయు, అయిదు ప్రశ్నల గృహ్యశేషము, మూఁడు ప్రశ్నల పితృమేధము నను మూఁడు సూత్ర

గ్రంథములు బోధాయన నిర్మితములుగా ముద్రితములై లభించుచున్నవి.[1] ఈ యను బంధ గ్రంథములు బౌధాయనములో కావో ! కాని, పరిభాషలోఁ బ్రతిషిద్ధ దేశ గమనమున కుదాహరణముగా 'అథాప్యుదాహర న్తి' అని యుల్లేఖింపఁబడిన—

"సౌరాష్ట్రం సింధు సౌవీరా వవ న్తీం దక్షిణాపథమ్
ఏతాని బ్రాహ్మణో గత్వా పున స్సంస్కార మర్హతి."

అను శ్లోకమును; గృహ్యశేషములో నవగ్రహపూజావిధి సందర్భమునం దావాహనీయులైన రవ్యాది గ్రహములను రుద్రాది దేవతలను, కళింగావ న్తీ భోజ కటక యమునా మగధ సింధు సౌరాష్ట్ర బర్బరాంతర్వేది దేశజులనుగాను కాశ్య పాది గోత్రులనుగాన జైమిన్యాది సూత్రులనుగాను వర్ణించిన సూత్రములును శ్లోకములును, పై మూఁడు భాగము లర్వాచీను లెవరో రచియించి బోధాయన గృహ్యమున కనుబంధముగాఁ జేర్చియుందు రనుటకు మాత్ర మెక్కువగా నవకాశ మిచ్చుచున్నవి.

దీని వ్యాఖ్యానము లెందును లభింపలేదనియు, 'శిష్టివ్యాఖ్యాన' మనుపేర నసమగ్రము నపరిశుద్ధము నతి సంక్షిప్తమయిన దొకటి లభించినదిగాని, యది తృప్తికరముగా లేదనియు బోధాయన గృహ్య ప్రకాశకులు వ్రాసియున్నారు.

మైత్రాయణీయ మానవసూత్రము రెండుపురుషములుగా విభజింపఁబడినది. ప్రథమపురుషమం దిరువదిమూఁడు ఖండములును, ద్వితీయ పురుషమందు పదునెని మిది ఖండములును గలవు. బ్రహ్మచారి నియమములతో నారంభమైన యీ సూత్రము పు త్రేష్టియాగముతో సమాప్తినొందుచున్నది ఇందలి సూత్రములతిమి తాక్షరములుగాక ప్రయోగసూచకములై యించుక పెద్దవిగా నున్నవి. దీనికి వ్యాఖ్యాన మున్నట్లుకనఁబడదు. ఇటావానగరవాసులగు భీమసేనశర్మగారు తాము హిందీభాషలో రచియించిన భాష్యవృత్తితో దీనిని బ్రకటించియున్నారు. ఈ సూత్రము వివరించు వివాహాది ప్రయోగము చాలవఱకు మనయాప స్తంబ సూత్ర ప్రయోగమునే యనుసరించియున్నది గాని యందందు దేశాచారమును బట్టి వచ్చిన యాచారభేదములు కనఁబడును. ఆప స్తంబముని కూడ, సమంత్రకములైన గ్రహ పూజాంకురారోపణ ప్రతిసరబంధాదులను అమంత్రకములైన నాకబలియక్ష బలీంద్రాణీ పూజాదులను జనపద గ్రామకులముల యాచారము ననుసరించి చేయఁ దగునని 'ఆవృతశ్చా స్త్రీభ్యః ప్రతీయేరన్' అను సూత్రమునఁ దెలిపియుండెను.[1]

1. మైసూరు మహారాజావారి ముద్రాలయము.
1. ఆప. గృ. 2-15.

కఠగృహ్యసూత్రము లబ్ధము కాలేదు. ఔఖేయశాఖకుఁ జెందిన వైఖానస సూత్రము వ్రాఁతప్రతు లందందు కలవు. ఇది ౧౧ ప్రశ్నలగ్రంథము. 'అథ నిషేకాది సంస్కారాన్ వ్యాఖ్యాస్యామః' అను సూత్రముతో నారంభమైన యిది యును వెనుకటి సూత్రములవలెనే వివిధ గృహ్యకర్మలను వివరించుచున్నది. ఇవి గాక తైత్తిరీయమునకు సంబంధించి, ఆపస్తంబ గృహ్యసూత్రకారిక - ఆపస్తంబ గృహ్యప్రయోగదీపిక - గృహ్యరత్నము - ఆపస్తంబపితృమేధ ప్రశ్న భాష్యము విధానమాల - సంస్కారనిర్ణయము - పాకయజ్ఞనిర్ణయము - మొదలయిన వింకను గలవు.

శుక్లయజుశ్శాఖీయ గృహ్యములలో, పారస్కర గృహ్యసూత్ర మునునది ప్రసిద్ధమై యున్నది. పేరునుబట్టి పారస్కరుఁడు రచియించినట్లు స్పష్టము. కాని, యీ పారస్కరుఁ డన్యుఁడు కాఁడు, వాక్యకారవరరుచియు శ్రౌతసూత్రకర్తయు నైన కాత్యాయనుఁడే యని పెద్దలవాడుక వలనఁ దెలియుచున్నది. ఇది మూఁడు కాండముల గ్రంథము. దీని కనుబంధములుగాఁ గాత్యాయన కృతములుగా, పరిశిష్టకండిక - శౌచసూత్రము- స్నానసూత్రము- శ్రాద్ధ సూత్రము-భోజన సూత్రము- అనునవి కలవు.

ఈ గృహ్యసూత్రమునకు, కర్కోపాధ్యాయుఁడు జయరామాచార్యుఁడు హరిహరాచార్యుఁడు గదాధరదీక్షితులు ననువారు భాష్యములు వ్రాసిరి. వీరిలోఁ గాత్యాయన శ్రౌతసూత్రములకుఁ గూడ వ్యాఖ్యవ్రాసిన కర్కోపాధ్యాయుఁడే ప్రాచీనుఁడు. ఇతఁడు భాష్యారంభమున "శ్రౌతా న్యాధానా దీని కర్మాణ్యుక్తాని తదనన్తరం స్మార్తా న్యనువిధీయన్తే తత్రైతత్ దాదిమం సూత్రమ్. అథాతో గృహ్య స్థాలీపాకానాం కర్మ'' అని వ్రాయుటనుబట్టి కాత్యాయనుఁడు శ్రౌతసూత్రములు రచియించి తరువాత నీ స్మార్తసూత్రములు నిర్మించెనని గోచరించుచున్నది. ఈ పారస్కరాపరనాముఁడైన కాత్యాయనుఁడు విశ్వామిత్ర గోత్రజుఁడైన కతమహర్షి గోత్రాపత్య మయినట్లు హరివంశమువలనఁ దెలియుచున్నది.[1] షోడశసంస్కారాది గృహ్యకర్మలను బ్రతిపాదించు నీ గ్రంథము చతుర్వ్యాఖ్యా పరిశిష్టకండికాది సమేతమై కాశీనగరమున ముద్రితమై యున్నది.

అథర్వశాఖీయ గృహ్యసూత్రము కౌశికమను పేర వెలయుచున్నది. ఇది కౌశిక శ్రౌతసూత్రము ననుబంధము. ఇందు వివాహాది గృహ్యకర్మములే కాక,

1. విశ్వామిత్రస్యతు సుతా దేవరాతాదయః స్మృతాః,
దేవశ్రవాః కతశ్చైవ తతః కాత్యాయనాః స్మృతాః ॥

అథర్వవేదీయములైన యాభిచారిక కర్మలుగూడఁ బ్రతిపాదింపఁబడినవని మాక్డోనలు పండితుఁడు వ్రాయుచున్నాఁడు ఈ గ్రంథము నాకు లభింపలేదు.

ఇట్లు పై నుదాహరించినవియే కాక వాని ననుసరించుచుఁ గాల క్రమమున బయలుదేఱిన మఱికొన్ని గృహ్యగ్రంథములు కలవు. అట్టివానిలో, కమలాకర భట్టు రచియించిన యగ్నినిర్ణయము శ్రౌతగృహ్య లౌకికాగ్నులయం దేకర్మము లాచరింపఁదగు నను విషయము నిర్ణయించుచున్నది. నారాయణభట్టు నిర్మించిన గృహ్యాగ్నిసారము సకలగృహ్య సూత్రోక్తకర్మల సారమును సులభముగా బోధించుచున్నది. గృహ్యకల్పతరు వనెడి మఱియొకటి వైదికకర్మ స్వరూపము వెల్లడించుచున్నది. ఇట్లే యింకను గృహ్యకర్మ విశేషములను దెలుపుగ్రంథము లనేకము లర్వాచీనములు కలవు.

ధర్మసూత్రములు :— ఇవి నాలుగైదు మాత్రమే ప్రసిద్ధికెక్కినవి. ఇందాపస్తంబ హైరణ్యకేశీయ బౌధాయనములు కృష్ణయజుశ్శాఖీయములు. గౌతమ సూత్రము సామశాఖీయము. ఈ గౌతముఁడెవరను విషయము స్మృతిప్రకరణ మున విచారింతము. వైఖానసధర్మ ప్రశ్నమనుపేర నొకసూత గ్రంథము ము దితమైయున్నది. విషయమునం దాపస్తంబాదులను బోలిన యీ యర్వాచీన సూత్రము కృష్ణయజుశ్శాఖీయాంతర్గతమై విఖనసుఁడను మునిచే రచియింపఁబడిన దగుటచే వైఖానస మనఁబడుచున్నది. పై సూత్రములం దుదాహరింపఁబడిన మతాంతరములనుబట్టి తొల్లి మఱికొన్ని ధర్మసూత్రము లుదయించి యుండుననుట కవకాశము కనఁబడుచున్నది. కాని యవి లభింపకున్నవి. కాని, గద్యపద్యాత్మకముగా నున్న వాసిష్ఠస్మృతి యొకటి పూర్వధర్మ శాస్త్రములలో గణింపఁదగినది కనఁబడుచున్నది. అదిస్మృతియైనను ధర్మసూత్ర గౌరవమునకుఁ గూడ నర్హమై యున్నది.

మను హారీత మతము లుద్ఘాటించిన యాపస్తంబము వానికంటెఁ బరము, పాణినీయమునకుఁ బూర్వము. భాల్లవులను బురాతనమునులనుగా నిర్వచించిన పాణినీయ సంప్రదాయమున కాధారభూతమైన భాల్లవిగాథ నుదాహరించిన వాసిష్ఠము పాణినీయమునకుఁ బూర్వము. దీనినుండి కొన్ని వాక్యములు గ్రహించినదియు గౌతముని బేర్కొన్నదియునగు బౌధాయనము హైరణ్యకేశి సూత్రము కంటెఁ బూర్వముగాఁ గనఁబడుచున్నది. క్రీస్తుపూర్వము పంచమశతాబ్దిలోని శిలాశాసన మందలి హిరణ్యకేశి శబ్దమునుబట్టి హైరణ్యకేశి సూత్రమంతకంటెఁ బ్రాచీనమనుట

విదితము. ఇఁక గౌతమాపస్తంబములలో నేది పూర్వమను విషయమున్నది. ఆపస్తంబములో యువతీవివాహమును సూచించు మంత్రలింగములు కొన్ని కల వనుట నిజము కాని, యవి రజస్వలా వివాహజ్ఞాపకములు కావని కొందఱును, అవు నని కొందఱును వాదములు సలుపుచున్నారు. 'శేషం సమావేశనే జపేత్' అనెడి యాపస్తంబ సూత్రమందలి సమావేశన శబ్దమునకు 'భార్యా సహ మైథునార్థం శయనమ్' అని వ్యాఖ్యాత యర్థము వ్రాయుచు, ఇది ఋతుసమావేశన రూపముగా దనియు, రాగము లేక పోయినను, కర్మార్థమైన క్రమజప విధానమనియు వ్రాసి యున్నారు. ఎట్లయిన నిట్టిసూచన లించుక కనవచ్చును గాని గౌతమసూత్రమునఁ గనరావు. తక్కినవానితోఁ బాటు, ఆపద్ధర్మముగా యువతీవివాహమును గౌతమ సూత్రముగూడ నంగీకరించినను, సహజముగా "ప్రదానం ప్రాగృతోః, అప్రయ చ్ఛన్ దోషీ" అని ఋతుపూర్వకాలిక వివాహమునే కంఠోక్తిగా శాసించినది. మఱియు నాపస్తంబ మాటువివాహములు చెప్పియుండఁగ నిది యష్టవిధ వివాహములను జూపినది దీనినిబట్టి యాపస్తంబము పూర్వమనియు గౌతమము పరమనియుఁ జెప్పఁదగియున్నది. అయినను ఒకరిద్దఱు సకలధర్మ సూత్రములకంటెను గౌత మమే యాద్యమని తలంచిరి. అదియైనను, ఊహలమీఁద నాధారపడినదే కాని సత్ప్రమాణబద్ధమైనది కాదుకాని, యెట్లయిన, సూత్రములలో నేమి చెప్పఁబోవు స్మృతులలోనేమి ఒకదానిలోని వాక్యమేదో యొకటియైనను మఱియొక దానిలోఁ గనవచ్చుటనుబట్టి కొందఱు కొన్ని పూర్వములనియు, మఱికొందఱు మఱికొన్ని పూర్వములనియు భావించుట కవకాశము కలుగుచున్న మాట సత్యము. ఇందుకొక యుదాహరణము.

వాసిష్ఠస్మృతి ముప్పదియధ్యాయముల గ్రంథము. ఇందుమను హారీత గౌతమ ప్రజాపతియమ వసిష్ఠుల మతములును, కాఠక భాల్లవి వాజసనేయక మత ములు నుద్ఘాటింపఁబడినవి. 'అబ్రవీ న్మనుః, ఇతి గౌతమః' అనుచునివి యేధర్మ ములను వివరించెనో, అవి యన్నియు మనుస్మృతియందును గౌతమసూత్రమందును గనవచ్చుచున్నవి. కాని, "మానవం శ్లోక ముదాహరన్తి" అనుచునిది యేశ్లోకము లుదాహరించెనో, వానిలో 'యోఽనధీత్య ద్విజో వేద' మిత్యాదిశ్లోకములు కొన్ని ముద్రిత మనుస్మృతిలోఁ గనఁబడుచున్నవి. కొన్ని కనరాకున్నవి. దీనినిబట్టి మనుస్మృతి ముద్రణమునకుఁ గొన్ని శ్లోకములు లభింపలేదనవలెను గాని, యిది యుదాహరించిన శ్లోకములు కొన్ని మనుస్మృతికి మఱియొక గ్రంథమునుండి లభించెనని చెప్పరాదుగదా! మఱియు నిది ప్రాజాపత్య శ్లోకములనుచు నెన్ని యుదాహరించెనో వానిలో నొక్కటియు ముద్రితమైన ప్రజాపతిస్మృతిలోఁ గనఁ

బడకున్నది. దీనినిబట్టి మఱియొక ప్రాజాపత్యస్మృతి ప్రాచీనమైనది కలదని యనుమానింపవలసి వచ్చుచున్నదిగాని మానవధర్మ శాస్త్రము మఱియొకటి ప్రాచీన మైనది కలదని యనుమానింప వలసినపనిలేదు. ఇది నిజస్థితియై యుండఁగా, మాక్డోనలు పండితుఁడు మనుస్మృతికి మూలభూతమైన మానవధర్మ సూత్రమొకటి కలదనియు దానినుండి పెక్కు వాక్యములు వసిష్ఠస్మృతిలోనికి వచ్చెననియు దీని నుండి కొన్ని వాక్యములు మనుస్మృతికివచ్చె ననియు నందుచే వసిష్ఠస్మృతి మను స్మృతికంటెఁ బూర్వమనియు ననుమానించెను. వసిష్ఠస్మృతి ప్రాచీనస్మృతులలోఁ జేరఁదగినదైనను, మనుస్మృతికే కాదు, గౌతమాపస్తంబములకుఁ గూడఁ బరమని నా తలంపు. ఇఁక దీనినిగూర్చి చర్చింపక యీ మతద్వయమును బాఠకలోకము నకు విడుచుచున్నాను.

ధర్మసూత్రములలో నుత్తమఖ్యాతి వహించిన దాపస్తంబము. ఇది ముఖ్య ముగా దక్షిణహిందూ దేశమందలి సకలవర్ణా శ్రమాచారములకును బరమ ప్రమాణ మైనది. దీని మొదటిసూత్రమగు 'అథాత స్సామయాచారికాన్ ధర్మాన్ వ్యాఖ్యా స్యామః' అనునది బ్రహ్మయజ్ఞమందు పఠింపఁబడుట దీని వేదాంగకల్పత్వమునకు గుర్తగును. ఇది రెండు ప్రశ్నల గ్రంథము. ఈ రెండును శ్రౌతసూత్రములోని ౨౮-౨౯ ప్రశ్నలని కొందఱు భావింతురు. దానితో సంబంధములేని వేఱుగ్రంథ మని కొంద ఱందురు. ఎట్లన్నను, కర్త యొకఁడే కావున నిది విచారణీయము కాదు. ఇం దొక్కొక్క ప్రశ్నమునఁ బదునొకండేసి పటలములు గలవు.

ఈ ధర్మసూత్రములు సామయాచారికములైన ధర్మములను బోధించును. సమయ మనఁగాఁ బురుషుఁడు చేసిన వ్యవస్థ. అది, విధి నియమ ప్రతిషేధ భేదమునఁ ద్రివిధము. ఇందు, ప్రవృత్తి ప్రయోజనము విధి. గ్రామాంతరము వెళ్ళివచ్చిన గురువు నానాఁడే చూడవలెననుట విధి యనఁబడును. నివృత్తి ప్రయోజనములు నియమ ప్రతిషేధములు. ఏ దిక్కుగాఁ దిరిగి భోజనము చేసినను, ఆఁకలి తీఱకపోదు గాని, అయినను బ్రాఙ్ముఖముగాఁ గూర్చుండియే భోజనము చేయవలెను, బ్రాహ్మణునిగాని గోవునుగాని కాలితోఁ దన్నఁగూడదు, ఇత్యాదులు. ఏతాదృశ సమయ మూలములైన యాచారములందలి ధర్మములు సామయాచారిక ధర్మము లనఁబడుచున్నవి కర్మజన్యమును, అభ్యుదయ నిశ్శ్రేయస హేతువునైన యాత్మగుణము ధర్మము. అట్టి ధర్మమునకు హేతుభూతములైన కర్మములను విశదీకరించునది యీ శాస్త్రము.

పరహిత కాంక్షియు సకల వేదవేదాంగవేత్తయు నగు నాపస్తంబముని సత్కర్మానుష్ఠానమున మానవ సంఘము తరింపఁగోరి బ్రాహ్మణాది వర్ణములకు విహితములయిన వివిధ ధర్మములను, దేశాచారముల ననుసరించియు మన్వాది పూర్వస్మృతు లవలోకించియు సామయాచారిక ధర్మసూత్రరూపమున లోకమునకుఁ బ్రసాదించెను. మానవజన్మ మెత్తినవాఁడు తన జీవితకాలము నెట్లు గడపవలెను? తన ప్రవర్తన మెట్లు చక్కఁబఱుచుకొనవలెను? అను విషయములను సంపూర్ణముగా నుపదేశించు నీ సూత్రము సంఘ ధర్మశాసనమై ప్రాచీన భారతీయ సంఘ జీవితమున కాదర్శమై వెలయుచున్నది. ఇందు, కౌత్సహారీత కాణ్వ పుష్కరసాది వార్ష్యాయణి శ్వేతకేతుమను ప్రభృతులగు ప్రాచీన మునులు పేర్కొనఁబడిరి.[1] వాజసనేయకమత ముద్ఘాటింపఁబడినది. దీనినిబట్టి ధర్మ నిర్ణయమున నిది మనుస్మృతినిగూడఁ గొన్ని విషయముల ననుసరించినదనియే కాక, దీనికిఁ బూర్వము కౌత్సహారీతాదుల ధర్మనిర్ణయములుగూడఁ గలవనియు, వాజసనేయుల యాచారములు వెలువడిన పిదపనే యిది యవతరించినదనియు, వెనుకఁ జెప్పినట్లుగాఁ బాణిన్యష్టాధ్యాయికంటె నిది పూర్వమగుటచే దీని కాలము క్రీస్తుపూర్వ మెనిమిది లేక తొమ్మిదవ శతాబ్దియై యుండుననియుఁ దెలియనగును. దీనికి హరదత్తుఁ డుజ్జ్వల యనువ్యాఖ్య రచియించెను. పెక్కు గ్రంథములనుండి ప్రమాణవచనములను గ్రోడీకరించుచు సుబోధకముగానున్న యీ వ్యాఖ్యానము లోకప్రసిద్ధమై యున్నది.

ఆపస్తంబమువలెనే హైరణ్యకేశి ధర్మసూత్రముగూడఁ దన కల్పసూత్రమున కనుబంధము. ౨౭ అధ్యాయముల కల్పసూత్రములో ౨౬-౨౭ అధ్యాయములు ధర్మసూత్రాత్మకములు. ఇది మన దేశమున వ్యాపించినది కాదు.

గౌతమ ధర్మసూత్రము మూఁడు ప్రశ్నల గ్రంథము. ఇదియును దక్షిణ హిందూదేశమున నెక్కువ వ్యాప్తినిజెంది, ఆపస్తంబమువలెనే ప్రమాణమగుచున్నది. ఇది జన్మచే సామవేదీయమైనను, ఇందలి విషయము సర్వశాఖా సామాన్యమై వెలయుచున్నది. కాని యిందలి యిరువది యాఱవ యధ్యాయము సామవిధాన బ్రాహ్మణము ననుసరించిన దగుటచే నీ సూత్రము సామశాఖీయమనుట స్పష్టము. దీనికిని హరదత్తుఁడు మితాక్షరవ్యాఖ్య రచియించెను ఇందలి లౌకిక ధర్మములు హిందూధర్మ శాస్త్రమునం దుదాహృతములై యున్నవి క్రియాకాండ

1. ఆప. ధ. సూ. 1-9-18; 2-6-14; 1-5-17;

మనుపేర నీ సూత్రమునకుఁ బరిశిష్ట గ్రంథము కొంత కలదు. కాని, యిది గౌతమ నిర్మితము కాదు.

బౌధాయన ధర్మసూత్రము నాలుగు ప్రశ్నల గ్రంథము. ఇందలి యవాంతర భాగము లధ్యాయములు. దీనికి గోవిందస్వామి రచించిన వ్యాఖ్య ప్రసిద్ధమై యున్నది. ఏ శాఖవారయినను దమ సూత్ర మున్నప్పటికిని బరసూత్రము ననుస రించి యాచరింపవలసి వచ్చెనేని, బౌధాయన సూత్రమునుబట్టి నడచినచో స్వసూత్రము నవలంబించిన ఫలమే చెందునని వృద్ధమనువు చెప్పియున్నాఁడు.

'స్వసూత్రే విద్యమానేతు పరసూత్రేణ వర్తతే।
బౌధాయనమతం కృత్వా స్వసూత్ర ఫలభాగ్భవేత్'

దీనినిబట్టి యీ సూత్రములందువలెనే ధర్మసూత్రములందును సంప్రదాయ భేదములు కొన్ని గనపచ్చుటయే కాదు, దేశ భేదముబట్టి వచ్చిన యాచార భేదములుకూడఁ గొన్ని గనిపించును. వాసిష్ఠమువలెనే యాపస్తంబము షడ్విధ వివాహములు చెప్పినది. గౌతమాదు లష్టవిధ వివాహములు చూపినవి. గాంధర్వము నుత్తమ వివాహములలో నేదియుఁ జేర్చలేదు కాని, షడిత్యేకే, అనుచుఁ గొంద ఱాసుర గంధర్వములు సమ్మతించినట్లు గౌతమ సూత్రము చెప్పినది. బ్రాహ్మార్ష దైవములు మూఁడే ప్రశస్తములని యాపస్తంబమన్నది. దీనికిఁ బ్రాజాపత్యమును జేర్చి నాల్గు ప్రశస్తములని బౌధాయనము వక్కాణించినది.

సూత్రము లన్నిటియందును సాధారణముగా వర్ణవిభాగము ఉపజాతులు తత్తజ్జాతి కృత్యములు ద్విజాతుల యుపనయనము గురుసేవనము వివాహము గార్హస్థ్యము నిత్యనైమిత్తికకర్మలు ప్రాయశ్చిత్తములు అతిథి సత్కారము తత్తజ్జాతి జీవికలు భోజ్యాభోజ్యములు జాతాశౌచమృతాశౌచములు శ్రాద్ధము దానము రాజ ధర్మములు దండవిధులు వానప్రస్థము సన్న్యాసము మొదలయిన సర్వవర్ణాశ్రమాచార సంబంధములయిన సాంఘిక ధర్మము లన్నియు వర్ణింపఁబడినవి. కాలమునుబట్టియు దేశమునుబట్టియు మాఱిన యాయా ధర్మములందందు విశేషముగా గోచరించును. ఇందు విశదీకరింపఁబడిన కట్టుపాట్లు చూచినచో నెపుడైన మానవుఁ డిన్ని నిబంధ నలకు లోఁబడి జీవితకాలము గడపియుండెనా యని మన కిపు డాశ్చర్యము కలుగ వచ్చును గాని, ఆ కాలమున మూఁడు వర్ణములవారును, తరువాతఁ దరువాత బ్రాహ్మణులును వీనిలోని నియమములకు వశ్యులై ప్రవర్తించుచు వచ్చిరనుట యసంశయము. ఇపుడయిన నీ నియమములకు లోఁబడి జీవితకాలము గడపు

మహానుభావుఁడు కోటి కొకఁడైన భరత ఖండమునఁ గనరాకపోఁడు. నిజముగా నీ విధుల ననుసరించి యొక మానవుఁడు ప్రవర్తించెనా, తప్పక యతఁడు చిత్త శుద్ధియు నారోగ్యము నాయుర్వృద్ధియు విజ్ఞానమును గలిగి బ్రహ్మజిజ్ఞాసాధికారియై యాత్మజ్ఞానమున ముక్తుఁ డగుననుట నిరాక్షేపము. అయిననేమి? ధర్మసూత్రము లుపదేశించిన యట్టి పావనజీవన మిపుడు భరతఖండ వాసులకుఁ గలలోని వార్త యయ్యెఁ గదా!

స్మృతులు

ఇది వెనుకటి యన్నిటికంటెను మిక్కిలి చిక్కుగానున్న విషయము. సూత్రకర్తలలో నిద్దఱుమాత్రమే ప్రాచీన మహర్షులుగా నున్నారుకాని, యిపుడు లెక్కకు వచ్చుచున్న రమారమి నలుపదిమంది స్మృతికర్తలలోను నలుగురైదుగురు తప్ప దక్కిన వారందఱు నట్లే కనఁబడుచున్నారు వారి వివర మిది—

కశ్యపుఁడు అత్రి భరద్వాజుఁడు విశ్వామిత్రుఁడు గౌతముఁడు (గోతముఁడు) జమదగ్ని వసిష్ఠుఁడు నను సప్తమహర్షులు ఋగ్వేద సూక్తద్రష్టలు. వీ రందఱిపేర స్మృతులున్నవి. వీరిలో గౌతమ భరద్వాజులు సూత్రకర్తలుగాఁగూడ నున్నారని యిదివఱకుఁ జదివియున్నాము.

అంగిరసుఁడు ఉశనసుఁడు ప్రజాపతి విష్ణువు యముఁడు బృహస్పతి సంవర్తుఁడు దేవలుఁడు నారదుఁడు ముద్గలుఁడు పరాశరుఁడు మనువు ననువారు ఋగ్వేద సూక్తద్రష్టలలో నున్నారు.

యాజ్ఞవల్క్యుఁడు శుక్లయజుస్సుతో సంబంధము గలవాఁడు.

హారీతుఁడు శంఖుఁడు లిఖితుఁడు వ్యాసుఁడు పులస్త్యుఁడు శాతాతపుఁడు దక్షుఁడు మొదలగువారు పురాణేతిహాసములలోనివారు.

ఆపస్తంబుఁడు ఆశ్వలాయనుఁడు బోధాయనుఁడు గోభిలుఁడు కాత్యాయనుఁడు ననువారు సూత్రకర్తలలోనివారు. ఇంకను గొందఱు స్మృతికర్తలు విన వచ్చుచున్నారు. వారిమాట యటుండనిండు. ఇపుడు ముందుగా, అత్రి మొదలుగా మనువు వఱకుఁగల సూక్తద్రష్టలు స్మృతికర్త లగుదురా కారా? యని విచారణ చేయుదము.

వారే వీ రన్నచో నీ స్మృతులు ఋగ్వేద కాలమందే పుట్టినవని వాఙ్మయ చరిత్రకు విరుద్ధముగాఁ జెప్పినట్లగును. ఛందోబద్ధములైన ఋక్కులు రచియించి

వారికి స్మృతి శ్లోకములు నిర్మించుట దుర్లభము కాదుగాని, ఆ భాషకు నీ భాషకు హస్తిమశకాంతర ముండుటచే నివి వారివి కావని యంగీకరింపవలసి వచ్చుచున్నది. అట్లయినచో నెవరో రచియించి వారి పేళ్లిందుకుఁ బెట్టవలసివచ్చినదని యాక్షేపము రావచ్చును. ఇందు కొక్కటే సమాధానము. వంశ పరంపరా ప్రాప్తములు సంక్షేప వాగ్రూపములునగు నమ్మహర్షుల ధర్మసంప్రదాయములకు వారి గోత్రములవారు సవిస్తరమయిన పద్యమయ స్మృతిరూపము గల్పించి వారిపేరఁ బ్రకాశింపఁజేసి యుందురు. లేదా, ప్రాచీన సంప్రదాయముల ననుసరించి వారి పేళ్లగల యర్వాచీనమును లెవరయిన రచియించియుందురు అంతేకాని ఋగ్వేదమునాఁటి ఋషులు మాత్రము వీనిని రచియింపలేదని విశ్వసింపవచ్చును. ఇందుకుఁ గొన్ని కారణములు—

మనుస్మృతి యవతారికలో, మహర్షులందఱు మనువును సమీపించి నమస్కరించి, మహాత్మా! మాకు వర్ణాశ్రమ ధర్మములు చెప్పవలసినదని కోరఁగా నతఁడు ఈ శాస్త్రమును (మనుధర్మ శాస్త్రమును) స్వయంభుబ్రహ్మ నిర్మించి మొదట నాకుఁ జెప్పెను. తరువాత నేను దీనిని మరీచ్యాదులకుఁ జెప్పితిని. ఇపుడు భృగుమహర్షి మీకుఁ జెప్పఁగలఁడు. అతనివలన వినుఁడని చెప్పినట్లున్నది.

అత్రి సంహితాత్రి స్మృతుల మొదల, మునీశ్వరు లందఱును వేదవిద్వరుఁడైన యత్రి మహర్షికి నమస్కరించి సర్వలోక హితకరమైన యర్థము చెప్పుమని కోరఁగా నతఁడు ధర్మములు చెప్పినట్లున్నది.

యాజ్ఞవల్క్యస్మృతి మొదట మిథిలాపురమందున్న యోగీశ్వరుఁడైన యాజ్ఞవల్క్యునికి మునులు మ్రొక్కి వర్ణాశ్రమ ధర్మములు చెప్పుమనఁగా నతఁడు చెప్పినట్లున్నది. ఇట్లే తక్కిన స్మృతులయందు నుపక్రమము కనవచ్చును. ఇది యంతయు, కథలు చెప్పుమని శౌనకాదులు సూతుని, జనమేజయుఁడు వైశంపాయనుని గోరఁగా వారు భారతాదికథలు చెప్పుటను బోలియున్నది. భారతాదులలోని యా కథలకు సూతవైశంపాయనులు కర్తలైనచో వీని కత్రిమను ప్రభృతులు కర్తలనఁదగియుందురు గాని యది సంభవింపకున్నది. పోనిండు, ఈ పోలిక యెందుకు? ఇది శాస్త్ర మహత్త్వ ప్రశంసా పరమయిన యా మహర్షుల శైలీవిశేష మందుమేని మఱియొక యాక్షేపము వచ్చును. అవతారికనుబట్టి ధర్మశాస్త్రము స్వాయంభువు రచియించినట్లు కనఁబడుచుండ దీనికి మానవ ధర్మశాస్త్రమను పేరెట్లు వచ్చినదని శంకించుకొని, కుల్లూకభట్టు, "శాస్త్రశబ్దముచే శాస్త్రార్థమైన విధినిషేధ సమూహమే చెప్పఁబడును. దానిని బ్రహ్మ మనువునకు బోధించెను. మనువు దానిని గ్రంథ

రూపముగా నిర్మించెను'' అని మేధాతిథి మతమునుబట్టి సమర్థించెను. దీనినిబట్టి సప్త మనువులలో మొదటివాఁడయిన స్వాయంభువ మనువు ధర్మశాస్త్ర కర్తయని యంగీకరింతము. అట్లయినచో ఋక్సూక్త ద్రష్టలైన సాంవరణ వైవస్వత మనువులకంటెఁ పూర్వుఁడైన యితని ధర్మశాస్త్రము ఋగ్వేదమునకుఁ బూర్వమగును. నిజముగా నవతారిక యుద్దేశ మిది కల్పాదియందు పుట్టినదనియే. అయిన నిది స్వాయంభువ మనుకృత మనికాని శ్రుత్యర్థము ననుగమించు నిది శ్రుతులకన్న ముందు పుట్టెననికాని భావించుట సముచితమా ? ఇఁక దీని నిట్లుంచి ప్రసిద్ధమైన పరాశర స్మృతి గ్రహింతము.

పరాశర స్మృతిలోఁ బెక్కుచోట్ల ''తం ప్రవక్ష్యా మ్యహం పూర్వం పరాశర వచో యథా'' అను వాక్యము కనఁబడుచున్నది. దీనిఁబట్టి పరాశరుని మతము నన్యుఁ డొకఁ డావిష్కరించెనని విదిత మగుచుండఁగా నిది పరాశరుఁడే నిర్మించెనని యెట్లు చెప్పఁగలము ? ఈ పరాశరుఁడు సూక్తద్రష్టయైన పరాశరుఁడో వ్యాసుని తండ్రియైన పరాశరుఁడో మఱియొకఁడో నిర్ణయించుట యెట్లు ? ఎవరన్నను, పరాశరుని వచన మెట్లున్నదో దాని ననుసరించి చెప్పుచున్నాననెడి గ్రంథకర్త ప్రతిజ్ఞ కర్థమేమి ? తక్కినవాని విషయము నిట్టిదే. కావున నాత్రేయాది మానవాంతస్మృతు లయ్యా మహర్షుల సంప్రదాయములనుబట్టి తరువాతఁ దరువాత వారి గోత్రము వారో వారి పేళ్ళవారో రచియించి యుందురనుట సమంజసము. ఇఁక యవల్క్య క్మృతికర్తృత్వము—

యాజ్ఞవల్క్యుఁడు కశ్యపాత్రి మన్వాదులవలెఁ బురాతనముని కాఁడు. మిథిలాపుర వాసియైన యీ యోగీశ్వరుఁడు శుక్లయజుశ్శాఖకు బ్రాహ్మణము యించినవాఁడనియుఁ జిరంతనముని కాఁడనియుఁ బాణినీయ సంప్రదాయము గూడఁ దెలియుచున్నది అట్టి యితఁడు స్మృతి రచియించియుండునని యంగీ రింపవచ్చును గాని, దాని యవతారికలోని రెండు శ్లోకము లించుక సంశయాస్పద ముగా నున్నవి.

"మ న్వత్రి విష్ణు హారీత యాజ్ఞవ ల్క్యోశనోఽఙ్గిరాః ।
య మాప స్తంబ సంవర్తాః కాత్యాయన బృహస్పతీ ॥
పరాశర వ్యాస శంఖ లిఖితా దక్ష గౌతమౌ ।
శాతాతపో వసిష్ఠశ్చ ధర్మశాస్త్ర ప్రయోజకాః ॥"

యాజ్ఞవల్క్యుఁడే గ్రంథకర్త యైనచో నిట్లు స్మృతి యారంభించుచునే పూర్వ స్మృతికర్తలలోఁ దనపేరు చేర్చుకొనునా? పోనిండు చేర్చుకొనుఁగాక. తక్కినవా రందఱు నితనికిఁ బూర్వులని యంగీకరింతమన్నను, విస్పష్టముగా నితని కర్వాచీనుఁడైన పాణినికిఁ దరువాతి వాఁడని తెలియుచున్న కాత్యాయను నెట్లు పేర్కొనుననెడి యాక్షేపము మాత్రము రాకపోదు. కాని, "పాణినీయ వాక్య కారుఁడును శుక్లయజుః ప్రాతిశాఖ్య శ్రౌతసూత్రాది కర్తయునగు కాత్యాయనుఁడే యితఁడు పేర్కొన్న స్మృతికర్తయగు కాత్యాయనుఁ డనుటకుఁ దగిన ప్రమాణము కనరాదు. అందుచే స్మృతికర్తయైన మఱియొక కాత్యాయనుఁడు యాజ్ఞవల్క్యునికిఁ బూర్వ ముండెననుట కాక్షేప మే''మని సమాధానము రావచ్చును కాని, ఆ యితర కాత్యాయనుఁ డెందును బ్రసిద్ధుఁడై కనరాఁడు. అందుచే నిచ్చట మూఁడే గతులు. స్మృతికర్తయగు కాత్యాయనుఁ డొకఁడు పూర్వుఁడు కలఁడన్నచో, అవతారిక యన్యోక్తిగా నున్నను, అది మహర్షుల శైలియని యంగీకరించి వైదిక యాజ్ఞ వల్క్యుఁడే యీ స్మృతి రచియించె ననవలెను. ఇది వైదికయాజ్ఞ వల్కుఁడు రచించినదే కాని, యట్టి పూర్వ కాత్యాయనుఁడు లేఁ డన్నచోఁ బై శ్లోకములు ప్రక్షిప్తము లనవలెను. అట్లు కావన్నచో వైదిక యాజ్ఞవల్క్యుని సంప్రదాయము ననుసరించి ప్రసిద్ధ కాత్యాయనుని తరువాతి వాఁడగు మఱియొక యాజ్ఞవల్క్యుఁ డీ స్మృతి రచియించె ననవలెను. ఇట్లే పురాణేతి హాసాదులలోని హారీతాదుల స్మృతులను గూర్చియు విచారింపనగును. ఇఁక సూత్రకర్తలగు నాపస్తంబాదుల స్మృతులున్నవి.

వివిధ సూత్రకర్తలైన యాపస్తంబాశ్వలాయన బోధాయన గోభిలకాత్యాయ నాదులు తమ ధర్మసూత్రముల గూఢార్థమునే పద్యమయ స్మృతిరూపమున వెల్ల డించి యుండుననుట కాక్షేపము లేదుగాని వెనుకఁ జెప్పినటే వాని యారంభము లన్యోక్తులుగా నున్నమాట సత్యము. అయినను, వారి ధర్మసూత్రములు ప్రత్యక్ష మగుచుండ స్మృతులు వారివన్నను వారి మాటల సారమన్నను భేదములేదు గావున నవి తత్కృతములుగానే యంగీకరింపవచ్చును.

ఈ స్మృతులలో మఱొక్క విశేషము. ఇదికూడ వెనుక వచ్చిన కర్తృత్వ శంకను బలపఱుచునది గావున నించుక పరిశీలింతము. వీనిలో వృద్ధలఘు విశేష ణములతోఁ గూడినవి సుమారు పదియున్నవి. ఇందు వృద్ధవిశేషణము కొన్నిచోట్ల గ్రంథ పరముగాను, మఱికొన్నిచోట్ల స్మృతికర్తృ పరముగానుగూడఁ గనఁబడు చున్నది. కర్తృపర మయినదానికైనను నియతస్థితి లేదు. వృద్ధమను వృద్ధపరాశర వృద్ధయాజ్ఞవల్క్యాది స్మృతులు మన్వాది స్మృతులకంటె నన్యములని చెప్పక

తప్పదు. వారు పూర్వు లగుటచే వృద్ధవిశేషణము వచ్చినదో, లేక మన్వాదులే ముందు పెద్ద స్మృతులు రచియించి తరువాత వానికి సంగ్రహములు వ్రాయుటచే మొదటివానికిఁ దరువాతివారు వృద్ధ విశేషణములు తగిల్చిరో తెలియదు. అట్లయిన రెండవవానికి లఘువిశేషణము లెందుకు రాలేదనెడి యాక్షేపము సిద్ధమగును. ఇది యిట్లుండ మొదట రచియించినవానికి రెండవవి సంగ్రహమగుటచే లఘు విశేషణము గాంచె నందు మేని వృద్ధహారీత స్మృతికిని లఘుహారీత స్మృతికిని విషయైక్యమే లేదు. అట్లు గాక, ఒకఁడే రెండేసి మూఁడేసి విభిన్న విషయములగు స్మృతులు రచియించెనందుమా, అదియును బొసఁగకున్నది. ఇందుకొక యుదాహరణము.

శాతాతపస్మృతి వృద్ధ శాతాతపస్మృతి లఘు శాతాతపస్మృతి యనునవి మూఁడును ముద్రితములైనవి. ఇందు మొదటిది సుమారు ౨౫౦ శ్లోకములతో నున్నది. ఇది శాతాతపుఁడు తన శిష్యుడైన శరభంగున కుపదేశించినట్లున్నది. కాని యీమాట కొన్ని వ్రాఁతప్రతులలో లేదు. ఈ స్మృతిలోని విషయము కర్మ విపాకము ఇందు ప్రాయశ్చిత్తములు విధింపఁబడినవి.

రెండవదానిలోని మొదటి శ్లోకము, వృద్ధ శాతాతపుఁడు చెప్పిన స్మృతి తంత్రమును సంక్షేపముగాఁ జెప్పుచున్నాననెడి గ్రంథకర్తృ ప్రతిజ్ఞను దెల్పుచున్నది. గ్రంథమధ్యమందు "శాతాతపోఽబ్రవీత్, శాతాతపవచోయథా" అను మాటలు కనవచ్చుచున్నవి. గ్రంథసంఖ్య చూతుమా, అఱువది యెనిమిది శ్లోకములు. విషయము చూతుమా, పూర్వోక్త శాతాతపాదులలోని కొన్ని ప్రాయశ్చిత్తములు. ఇట్టి గ్రంథము వృద్ధ శాతాతపస్మృతి యనఁబడుచున్నది.

మూఁడవదాని మొదట 'శాతాతపస్య మహర్షేర్ధర్మశాస్త్రం వ్యాఖ్యాస్యామః' అను ప్రతిజ్ఞావచనమున్నది. మధ్యమధ్య 'శాతాతపోఽబ్రవీత్' అను వాక్యమై దాఱుచోట్ల నున్నది. ఈ శాతాతప ధర్మశాస్త్ర ముత్తమమని కడపటి శ్లోకము చెప్పుచున్నది. ఇందలి శ్లోకసంఖ్య ౧౭౩. ఇందు బ్రహ్మహత్యాసురాపానాది మహాపాతకములకుఁ బ్రాయశ్చిత్తములు విధింపఁబడినవి. ఇట్టి గ్రంథము లఘు శాతాతప స్మృతియని చెప్పఁబడుచున్నది. దీనినిబట్టి యనేక స్మృతుల నామములు వాని కర్తృత్వములు నెంత సముచితములుగా నున్నవో యాలోచింపవలసినదే కాని, యిఁక దీనింగూర్చి చర్చించుట యనావశ్యకము. కాని, యొకమాట. స్మృతుల నామములకును ఋషులపేళ్లకును ముడిపెట్టి వాని పౌర్వాపర్యమును, ప్రాచీనార్వాచీనతను నిర్ణయించుట యసంగతమని మాత్రము చెప్పవలసియున్నది. ఇట్లనుటచేఁ బ్రాచీనస్మృతులు లేవని నా యభిప్రాయము గాదు. మనుహారీత గౌత

మాపస్తంబ పరాశర వాసిష్ఠయాజ్ఞవల్క్యాది స్మృతులు ప్రాచీనములనుట నిరాక్షేపము. ఇందు మొదటి రెండును ప్రాచీనతమములు. తక్కినవాని పౌర్వాపర్య మజ్ఞేయముగా నున్నది.

ఇట్లున్న యీ ధర్మశాస్త్రములన్నిటిలోను విషయమునుఁబట్టియు గుణమును బట్టియు నాఁటినుండి నేఁటిదనుక లోకమునఁ గొనియాడఁబడుచున్నవి మనుయాజ్ఞవల్క్యపరాశర స్మృతులు. ఇవి దాదాపు మూఁడువేల సంవత్సరములనాఁడు భారతీయుల వర్ణములను ఆశ్రమములను ఆచారములను వ్యవహారములను రాజ పరిపాలనమును సక్రమముగా క్షేమంకరముగా నడపింప నుదయించిన పెద్ద చట్టములు. అంతేకాదు, ప్రపంచ విజ్ఞానమునకు గనులు సౌశీల్యోపదేశమునకు గురువులు. నిష్కాములును నిష్పక్షపాతులును దేశ హితాభిలాషులునగు నమ్మహామునులు పరమేశ్వర ప్రేరితమైన సత్సంకల్పముతో నిర్మించినవి కావుననే, యీ దీర్ఘకాలములో దేశమెన్ని కడగండ్లకు లోఁబడినను, ఎన్నో రాజ్యములు తలక్రిందైనను, వృత్తులు తాఱుమాఱైనను, కాలకర్మవశమున నివి పఠనశ్రవణ వ్యవహారమునకు దూరములైనను, నవీన నాగరికత ప్రబలుచున్నను, కులక్రమాగతమైన వీని యుపదేశసారము నేఁటికిఁగూడ హైందవుల రక్తనాళములయందు కొంచెముగానో గొప్పగానో ప్రవహించుచున్నదనుటయే వీని మహత్త్వమును వేనోళ్లఁ జాటుచున్నది. ఇందు:—

కుల్లూక భట్టవిరచితమైన మన్వర్థముక్తావళీ వ్యాఖ్యతో విలసిల్లు ద్వాదశాధ్యాయ పరిమితమగు మనుస్మృతి సుమారైదు వందల సాంఘిక ధర్మములను బోధించుచు హృదయరంజక మగుచున్నది. ఆచారవ్యవహార ప్రాయశ్చిత్తములను మూఁడధ్యాయములును, వర్ణనిర్ణయ వ్యవహార లక్షణా శౌచవిధానాదులగు నలువదినాలుగు ప్రకరణములును గలిగి విజ్ఞానేశ్వర వినిర్మిత మితాక్షర వ్యాఖ్యతో విరాజిల్లు యాజ్ఞవల్క్యస్మృతియుఁ బట్టే వందలకొలఁది ధర్మముల నావిష్కరించుచున్నది. పరాశరస్మృతి పరిమాణమున వానికంటె మిక్కిలి చిన్నదైనను, సాయణాచార్యుని జ్యేష్ఠ సోదరుఁడును వేదవేదాంగవేత్తయునగు మాధవాచార్యునిచే వ్యాఖ్యాతమై పెద్ద రత్నాపణమైనది. మూలమున కిరువది రెట్లెక్కువగా వ్యాఖ్యయుండుట యొకటే విశేషము కాదు. ఈ వ్యాఖ్యతోఁడి పరాశర స్మృతిచేతిలో నున్నచోఁ దొల్లి యుదయించిన స్మృతులన్నియును ధర్మసూత్రములును బురాణములునుగూడఁ జేతిలో నున్నట్లే. అందుచేతనే దినికిఁ బరాశర మాధవీయమనెడి ఖ్యాతి లోకమున విస్తరించినది. ఇదియును వెనుకటి వానివలెనే సర్వ విధములైన

వర్ణాశ్రమాచార వ్యవహారాదులను బోధించుచు వ్యాఖ్యాన మహిమచే బహువిధ దేశాచార మతభేదముల నొక్కచోఁ దెలుపుచున్నది. అముద్రితములును నామ మాత్రావశిష్టములునైన యెన్నో స్మృతులలోని శ్లోకములు దీనిలోఁ గనవచ్చు చున్నవి బొంబాయిలో, పండిత వామనశాస్త్రిచేఁ బ్రకటింపఁబడిన సవ్యాఖ్య పరాశర ధర్మశాస్త్రము పాఠకుల పాలిటి కల్పతరు వనఁదగినంత విశదముగా నిర్దుష్టముగా నున్నది.

మనుస్మృతిలో ద్వితీయాధ్యాయమున నొక శ్లోక మిట్లున్నది.

"యో ఽవమన్యేత తే మూలే హేతు శాస్త్రాశ్రయా ద్ద్విజః
స సాధుభి ర్బహిష్కార్యో నాస్తికో వేదనిందకః"

వేదవాక్యము విప్రలంభక వాక్యమువంటి వాక్యమే కావున నది ప్రమాణము కాదని హేతువాదము నాశ్రయించి యేద్విజుఁడు శ్రుతిస్మృతుల నవమానించునో, వేదనిందకుఁడైన యట్టి నాస్తికుని శిష్టులు వేదాధ్యయనాది కర్మలనుండి బహిష్కరింపవలెనని దీని భావము. ఇందలి నాస్తికపద మాధారముగాఁ గొని కొందఱు 'మనుస్మృతి బౌద్ధ చార్వాకాది మతములు బయలుదేఱినపిదప నుదయించిన'దని భావించిరి కాని యది సరికాదు. వేదోక్తకర్మ లాచరింపనివారును సోమపానమును యాగపశ్వాలంభమును నిరసించినవారును బ్రాచీనార్యుల కాలమునుండియుఁ గల రనుటకు, వేదోక్త కర్మాచరణమునఁ మతభేద మాశ్రయించి భారతీయ వైదికార్యులతోఁ గలహించి వెడలిపోయిన పారశీకార్యులే నిదర్శనము. అట్టి కర్మనిందకమైన మత మొకటి పారంపర్య ప్రాప్తమై యందందు తలచూపుచుండ వేదోక్తకర్మలు నిందించు ద్విజునకు వేదములు చెప్పరాదను తలంపుతో నిందు నాస్తికశబ్ద ముప యోగింపఁ బడినదిగాని, యిది బౌద్ధచార్వాకాదుల నుద్దేశించి ప్రయోగింపఁబడినది కాదనుట స్పష్టము. కావున స్మృతుల కాలము క్రిందికి దిగలాగుటకైన బయలు వెడలిన యీ వాదము సముచితముగాదు.

మఱికొందఱు గద్యాత్మకములైన సూత్రములు ముందు పుట్టిన వనియు, పద్యాత్మకములైన స్మృతులు తరువాతఁ బుట్టిన వనియు విపరీతవాదము లేవ నెత్తిరి. ఇది యెంతమాత్రమును హేతుబద్ధము కాదనుట కింతవఱకుఁ జూపిన యాయా గ్రంథముల పౌర్వాపర్యమే చాలును. క్రీస్తుపూర్వము పదునాల్గవ శతాబ్ది మొదలుగా నైదవశతాబ్ది కడపటివఱకును సూత్రగ్రంథము లుదయించుచునే యున్నవి. వానిలోఁ గడపటిదిగా భావింపఁబడు వైఖానసధర్మ సూత్రము

కంటెను, పాణినికిఁ బూర్వుఁడైన యాపస్తంబుఁడు స్మరించిన మనుస్మృతి పర నునుట కెవరైన సాహసింపఁగలరా ? పాణిని తరువాతి వాఁడయిన కాత్యాయనుని శౌత గృహ్య సూత్రాదులకంటెను గూడ మనుస్మృతి పరమనుట శక్యమగునా ? కావున నీవాదము నిరాధార మనియు, సూత్రములును, పద్యాత్మక స్మృతులును జనియించుటలోఁ బౌర్వాపర్యము నిర్ణయింప శక్యము గాదనియు విశ్వసింపనగును.

ఇట్లు వర్ణాశ్రమధర్మ శాసనములై శ్రుతుల ననుగమించి బయలు వెడలిన స్మృతుల ననుసరించి యనేకము లయిన నిబంధనగ్రంథము లుదయించినవి వానిలో హేమాద్రి మాధవ కమలాకర భట్టాది పండితోత్తములు రచియించిన నిబంధనములు సాంఘిక ధర్మశాసకములు బహువిధ కాలవిజ్ఞాన దాయకములునై లోకమునఁ బ్రసిద్ధి గాంచియున్నవి. అందు హేమాద్రి మాధవమతములను జక్కఁగాఁ బరిశీలించి కమలాకరభట్టు రచియించిన నిర్ణయసింధువు పరమ ప్రమాణముగాఁ గొనియాడఁబడుచున్నది. ప్రాయశ్చిత్త విధానమున హేమాద్రి సర్వోత్తమముగా వన్నె కెక్కినది. ఇట్లే స్మృతిచంద్రిక స్మృతి ప్రకాశము జ్యోతిర్నిబంధము స్మృతి సారావళి జ్యోతిఃప్రకాశము సంబంధవివేకము శుద్ధి చింతామణి ప్రయోగ పారి జాతము సంస్కారలోపము మదనరత్నము మితాక్షర (మార్కండేయ కృతము) మొదలగునవి బహువిధాచారముల భేదములను, తన్నిర్ణయములను జూపుచున్నవి. ఈ నిబంధన గ్రంథములలోఁ గూడఁ గొన్ని వ్యాసగర్గ వసిష్ఠ శౌనకాదులు రచి యించినవిగానే గ్రంథాంత గద్యములవల్లను, ఇతర నిబంధనకర్తల యుదాహృత వచనములవల్లను దెలియవచ్చునుగాని, యట్టి వన్నియు స్మృతులకంటె నత్యంత మర్వాచీనములగుట సత్యముగావున నవి తత్తత్పూర్వ మహర్షి నిర్మితములని మాత్రము భ్రాంతిపడరాదు. స్మృతీతిహాస పురాణములలోని విశేష విషయములనే దేశాచార భేదములనుబట్టి యీ నిబంధనములు వివరించిన వగుటచే వీనింగూర్చి విశేషించి వ్రాయవలసినది లేదు.

పరిశిష్టములు

ఒక పూర్వ గ్రంథమందు చెప్పఁబడని విషయములను వర్ణించుచుఁ దరువాత దాని కనుబంధమైన గ్రంథశేషము పరిశిష్ట మనఁబడును. దీనికి ఖిలమనియుఁ బేరు కలదు తమకు సంబంధించిన గ్రంథములకు సంపూర్ణత నొసంగ నుదయించిన యీ పరిశిష్టములు వానియందలి విషయములకు సరిపడునవై ప్రాచీన విద్వాంసుల విషయ పరిశోధనమును వాఙ్మయాభిలాషను గ్రంథ నిర్మాణ పద్ధతిని వెల్లడించుచు,

వైదిక సారస్వత గరిమను విస్తరింపఁజేసిన ప్రచారకులో యనునట్లు దేశము నలుఁగడల వ్యాపించినవి. లెక్కకు మిక్కిలి యెక్కువగానున్న యివి ఋగ్వేదము మొదలుగా సూత్రముల తుదివఱకుఁగల వివిధ గ్రంథములలో ననేకములకు సంబంధించి కనవచ్చుచున్నవి గాని, వీనిలో ముప్పాతిక మువ్వీస మెవు డెవరు రచియించిరో చెప్పుటకుఁ దగిన యాధారములు మాత్రము లభింపవు. కడచిన యధ్యాయములందు ఋగ్వేదఖిల సూక్తములు, వాజసనేయ సంహితలోని కడపటి యధ్యాయములు కొన్ని, తైత్తిరీయారణ్యకములోని యాజ్ఞిక్యుపనిషత్తు, నిరుక్త పరిశిష్టము, శుక్లయజుః ప్రాతిశాఖ్య పరిశిష్టము మొదలుగాఁగల పరిశిష్టములను గూర్చి యాయా సందర్భములఁ జదివియున్నాము. ఇపుడు తత్తత్పరిశిష్ట విశేషములు సంగ్రహముగా గ్రహింతము.

ఋగ్వేదమునకుఁ జేరిన ఖిలములను పరిశిష్ట సూక్తములు ముప్పదిరెండున్నను వానిలో ననేకము లొకటి రెండు మూఁడు ఋక్కులతోనే యున్నవి. శ్రీసూక్త మొకటి మాత్రమే ౨౯ ఋక్కులు కలది. దీనిలో మొదటి పదియేను ఋక్కులకు మాత్రమే సాయణులు భాష్యము వ్రాసిరి. ఈ సూక్త మొకటి మాత్రమే లోకమునఁ బ్రసిద్ధి కెక్కినది. తక్కిన సర్పమంత్ర గరుడమంత్రాది రూపములనున్న పెక్కు సూక్తము లథర్వ సంహిత వ్యాప్తిచెందిన తరువాత నవతరించినవి కావచ్చును. ఇందు రాత్రి సూక్తమేధాది సూక్తములు కొన్ని భాషారీతిని బట్టి లౌకికభాష చక్కఁగా వ్యాప్తిపొందిన కాలములోఁ బుట్టినవిగాఁ గనవచ్చుచున్నవి. కాని, యిందలి కొన్ని కొన్ని ఋక్కులు ఋగ్వేదములోనివే యనుట నిజము. ఇంక, సూత్రములకు సంబంధించి బహ్వృచ పరిశిష్టము శాంఖాయన పరిశిష్టము ఆశ్వలాయన గృహ్యపరిశిష్టము మొదలయినవి కొన్ని ఋగ్వేదోక్త కర్మబోధకములు కలవు కాని, యవి శాంఖాయనాది నిర్మితములని మాత్రము తలంపరాదు.

గోభిల సూత్రములకుఁ బరిశేషముగా సామవేదోక్తకర్మలు బోధించునట్టి ఛందోగ పరిశిష్టమను గ్రంథ మొకటి కలదు. అది కాత్యాయనముని రచియించెనని యొక పారస్కరసూత్ర వ్యాఖ్యాత తెలిపెనుగాని, యది విశ్వసనీయము గాలేదు. ఇదిగాక గృహ్య సంగ్రహ మనుపేర గోభిలపుత్త్రుఁడు నిర్మించిన పరిశిష్టమును – సామగచ్ఛందస్సు – క్రతుసంగ్రహము – వినియోగ సంగ్రహము – సోమోత్పత్తి – మొదలయినవి సామవేదమునకు సంబంధించిన వింకను గొన్ని కలవు.

యజుర్వేద పరిశిష్టములు పదునెనిమిది. అందు యూప లక్షణము ఛాగ లక్షణము ప్రతిజ్ఞాను వాక్యము అనువాక సంఖ్య చరణవ్యూహము[1] శ్రాద్ధకల్పము ప్రవరాధ్యాయము ఉక్థశాస్త్రము క్రతుసంఖ్య నైగమము యజ్ఞపార్శ్వము హౌత్రకము పాశవము కూర్మలక్షణము అనునవి వ్యాస నిర్మితములుగాఁ జెప్పఁబడు చున్నవి కాని, యిందుకుఁ దగిన సత్ప్రమాణ మేదియులేదు. ఇవిగాక శుల్బములు ఋగ్యజుస్సులు పార్షదము ఇష్టకాపూరణము అను నాలుగును యాజుష పరిశిష్టములు గానే గణింపఁబడుచున్నవి. వీనిలో యూపలక్షణాదు లనేకములు వాని పేళ్ళను బట్టియే శ్రౌతసూత్ర గ్రంథములకుఁ బరిశిష్టములై శ్రౌతకర్మ విశేషములను బోధించునవని తెలియవచ్చుచున్నది. పార్షద మనునది ప్రాతిశాఖ్యసూత్ర పరిశిష్టముగా నున్నది. వీని కర్తృత్వము సందిగ్ధముగానున్నను, ఇందు కొన్ని కాత్యాయన కృతము లనెడి ప్రతీతికూడ నుండుటనుబట్టి పార్షదాదులు కొన్ని శుక్లయజుస్సంబంధములుగా నూహింపఁబడుచున్నవి. ప్రవరాధ్యాయము కాత్యాయన కృతమని చెప్పెడి యీ క్రింది శ్లోకముగూడ నీ యూహ నొకించుక బలపఱుచుచున్నది.

'కాత్యాయన విరచితో విప్రాణాం హితకామ్యయా
అధ్యాయః ప్రవరాఖ్యో ఽయం పురా బ్రహ్మవినిర్మితః'

నిజముగా నిది కాత్యాయనుఁడు నిర్మించిన దనుటకుఁ దగిన హేతువులు లేవు గాని, యీ గ్రంథము గోత్రనిర్ణయమను గ్రంథము ననుసరించినదిగాఁ గన వచ్చుచున్నది. ఇందు కశ్యపాది సప్తమహర్షుల గోత్రములును, అగస్తి గోత్రమును వివరింపఁబడినవి. నైగమ పరిశిష్టము యాస్కనిరుక్త పరిశేషమే కాని యన్యము కాదు. ఇదియునుగాక, ఉపజ్యోతిషము సాంగలక్షణము నను మఱి రెండు పరిశిష్టములు యజుర్వేదమునకుఁ గలవు.

అథర్వ వేదమునకు సంబంధించిన పరిశిష్టములు సుమారు డెబ్బది వఱకును గలవని చరణ వ్యూహములోని యొక్క వాక్యమునఁ గనవచ్చుచున్నది గాని యవి యలభ్యములుగా నున్నవి. కౌశిక సూత్రకర్తయగు కుశికుఁడే యథర్వ పరిశిష్టముల కర్తయని ప్రతీతి కలదుగాని, యిది వ్యాస కాత్యాయను లాయా పరిశిష్టముల నిర్మాత లనుటవంటిదే కాని వేఱు కాదు.

1. శౌనక నిర్మితచరణ వ్యూహము దీనికంటె వేఱు.

అనుక్రమణికలు

అన్ని వేదములకును, అనుక్రమణికలు కలవు. ఇందు వేదములలోని మండలములు అష్టకములు కాండములు అధ్యాయములు ప్రశ్నలు సూక్తములు వర్గములు మొదలగువాని సరియైన సంఖ్యలను దెలుపునవి కొన్ని, సూక్తములు అనువాకములు పనసలు మొదలగువాని మొదళ్లను దెలుపునవి కొన్ని, వేదములలోని పదములను అక్షరములను దెలుపునవి కొన్ని, దేవతలను ఋషులను ఛందస్సులను దెలుపునవి కొన్ని, ఒక మంత్రము మొదలు తెలిసినచో నది యే వేదమందలి యే ప్రధాన భాగములోని యే యవాంతర భాగములో నెన్నవ మంత్రమో, అనుక్రమణీ సాహాయ్యమునఁ జెప్పవచ్చును. ఒక పదముగాని, యొక యక్షరముగాని తప్పిపోకుండఁగను మాఱిపోకుండఁగను క్రొత్తవి చేరకుండఁగను ప్రాచీన సంప్రదాయము ననుసరించి సంహితాపద పాఠాదులను సక్రమముగా లెక్కించి కట్టుదిట్టము చేసిన యీ యనుక్రమణిక లర్వాచీనములే యైనను వీనివలననే వేదములిపుడు యథోక్తముగా నిలిచియున్నవనుట నిజము. అనుక్రమణికలు రచియించినవారు వీ రని నిర్ణయించుట కవకాశము లేదుగాని, ఆర్షానుక్రమణీ మొదలగు కొన్నిటి కర్తృత్వము మాత్రము శౌనకుని కారోపింపఁబడి యున్నది. సంహితలలోని బహువిధ భాగములను మంత్రములను సూచించునట్టి సూచిక లీ యనుక్రమణిక లనుటచేతనే వీనియందలి విషయము గోచరించునుగాని సర్వానుక్రమణిని గూర్చిమాత్ర మించుక వ్రాయవలసియున్నది.

శౌనకునిపేరఁ జరణవ్యూహ మొకటి గనఁబడుచున్నది. అది నాలుగు వేదములందలి ముఖ్య విషయములను సూచించుచున్నది. సర్వానుక్రమణి ప్రత్యేకముగా ఋగ్వేదమందలి యెల్ల విషయములను గరతలామలకము గావించుచున్నది. ఇదిగాక ఋగ్వేదానుక్రమణి బోస్తలక్షణము సంహితా సూత్రము చతుర్జ్ఞానము మొదలగు మఱికొన్ని యనుక్రమణికలు ఋగ్వేదమునకుఁ గనవచ్చుచున్నవి గాని, యవి దీనివలె వివిధవిషయ సూచికలు కావు. సర్వానుక్రమణి కెవరో యొక టీక రచియించిరిగాని, దానికంటె షడ్గురు శిష్యుని వేదార్థ దీపికయే ప్రశస్తముగానున్నది. ఈ వ్యాఖ్యాత కలి సంవత్సరములు ౪౨౭౦ నిండుతఱి ననఁగా నిప్పటికి ౭౬౦ సంవత్సరముల క్రిందట నీవృత్తి రచియించెనని యితని మాటలవల్లనే

తెలియుచున్నది.[1] కాత్యాయనుని తరువాత సుమారు పదునాఱువందల యేండ్లకు జన్మించిన షడ్గురు శిష్యుఁడు శౌనకాశ్వలాయన కాత్యాయన కృతుల సత్యవృత్తాంత మెఱిఁగి వ్రాసెననుట విశ్వాసపాత్రము గాకపోయినను, అతఁడు తెల్పిన యవతారిక లోని విషయ మిందు సంగ్రహించి చూపెదను.

"తొలుత భారద్వాజకులమున శౌనహోత్రుఁడై పుట్టి తరువాత భృగు కులమున శౌనకుఁడై జన్మించిన మహర్షియే ఋగ్వేద ద్వితీయ మండల ద్రష్ట. అతఁడు పెక్కు గ్రంథములు రచియించెను. అందు కల్పసూత్ర మొకటి. శౌనకుని శిష్యుఁ డాశ్వలాయనుఁడు మఱియొక శ్రౌతసూత్రము నిర్మించి గురువునకు నివేదించెను. అది చూచి శౌనకుఁడు శిష్యుని ప్రీతికై సహస్రఖండ పరిమితమైన తన కల్పసూత్ర గ్రంథమును నశింపఁజేసెను శౌనకుని తక్కిన గ్రంథములు పదియును ఋగ్వేదమును సంరక్షించునవి. అవి, ఆర్షానుక్రమణి - ఛందోఽనుక్రమణి - దేవతానుక్రమణి - అనువాకానుక్రమణి - సూక్తానుక్రమణి - ఋగ్విధానము - పాద విధానము - బృహద్దేవత - ప్రాతిశాఖ్యము - స్మార్తదర్శనము - అనునవి. అశ్వలాయనుఁడు రచియించినవి పన్నెం డధ్యాయముల కల్పసూత్రము నాలుగధ్యాయముల గృహ్యసూత్రము ఐతరేయారణ్యకములోని నాల్గవ యారణ్యకము, అనునవి. ఈ పదమూఁడు గ్రంథము లెఱిఁగిన కాత్యాయనముని, వాజసనేయి శ్రౌత సూత్రము - సామశాఖకుఁ జెందిన యుపగ్రంథము - శ్లోకమయమైన స్మృతి - అథర్వవేద సంబంధి బ్రహ్మకారిక - శుక్లయజుః ప్రాతిశాఖ్యము - పాణినీయ మహోదధికి నావయైన మహా వార్తికములు - ఋగ్వేదమునకు సంబంధించిన సర్వానుక్రమణి - అను గ్రంథములు రచియించెను."

దీనినిబట్టి, ఆశ్వలాయన కాత్యాయనుల కృతులనుగూర్చి యాక్షేపణ లేదు గాని, శౌనకుఁడు పది గ్రంథములు రచియించె ననుటయే యాక్షేపార్హమైయున్నది. నిజముగా శౌనకుఁడు ఋగ్వేదగుప్తి కార్షానుక్రమణికాదు లైదును రచియించెనేని వానిని జూచిన కాత్యాయనుఁడు వానియందలి విషయమే సర్వానుక్రమణికా రచియించి యుండఁడు. శౌనకుఁ డార్షానుక్రమణ్యాదులు రచియించెనని షడ్గురు

1. ఖగోఽన్త్యా న్మేష మాపేతి కల్యహ ర్గణనే సతి
 సర్వానుక్రమణివృత్తి ర్జాతా వేదార్థదీపికా.
 లక్షాణి పంచదశవై పంచషష్టి సహస్రకమ్
 ద్వాత్రింశచ్చ శతం చేతి, దినవాక్యార్థ ఈరితః.

1565132 దినములను 365 చే, భాగింపఁగాఁ ఖై సంవత్సరములు వచ్చినవి.

శిష్యుఁడు మాత్రమే చెప్పెను గాని, వరరుచియను పేరుగల కాత్యాయనుఁడు సర్వానుక్రమణి వ్రాసినట్లుగా నితనివలెనే, ఋగ్వేద వ్యాఖ్య వ్రాసిన యాత్మానందుఁడుగూడ "శౌనకాది మత సంగ్రహీతు ర్వరరుచే రనుక్రమణికా'' యనుచు వచించి యున్నాఁడు. ఇప్పటికిఁ గనవచ్చుచున్న ఋగ్వేదసంబంధి లక్షణ గ్రంథములలో ఋగ్విధానము బృహద్దేవత యను రెండును శౌనకుఁడు రచియించినవని కొందఱు నమ్ముచున్నారు. ఇందు బృహద్దేవతగూడ ఋషిచ్ఛందో దేవతాదులను వివరించిన దగుటచే నాత్మానందుఁడు చెప్పినట్లుగా శౌనకుని బృహద్దేవత మొదలగు వానిని బరిశీలించి సర్వాంగసుందర మగునట్లుగాఁ గాత్యాయనుఁడు సర్వానుక్రమణి రచియించి యుండుననుట సంభావ్య మగుచుండఁగా, నెట్లో తననాఁటికి వ్యాపించిన వైదికలోక ప్రవాదమునుబట్టి శౌనకుఁ డార్షానుక్రమణికాదులు రచియించెనని షడ్గురుశిష్యుఁడు వ్రాసియుండెను. అంతేకాని యతఁ డవి నిర్మించెననుట మాత్రము విశ్వసనీయము కాదు. ఇది యిట్లుండ.

పై యవతారికా విషయమునుబట్టియు నితరాధారములను బట్టియుఁగూడ ఋగ్వేద సర్వానుక్రమణి కాత్యాయన కృతముగా స్పష్టపడుచుండఁ గొన్ని వ్రాత ప్రతులలో శౌనకుని పేరు గనఁబడుచున్నది. ఇదేకాదు, మఱికొన్ని లక్షణ గ్రంథములుగూడ శౌనక కృతములుగానే కనవచ్చుచున్నవని వెనుకనే చదివియున్నాము. ఇట్టివాని కర్తృత్వ మే సంప్రదాయమునుబట్టి లేఖకులు శౌనకుని కారోపించుచు వచ్చిరో యూహింపఁజాలము గాని, దీనినిబట్టి మొదటి నుండియు వైదిక లక్షణ కర్తలలో శౌనకునిపేరు ప్రధానముగా గణింపఁబడుచు వచ్చినదని మాత్రము చెప్ప వచ్చును. అందుచేతనే కొన్ని లక్షణముల కర్తృత్వము సందిగ్ధావస్థలో నున్నది. అయినను షడ్గురుశిష్య వ్యాఖ్యాతమైన సర్వానుక్రమణి కాత్యాయన కృతమేయని విశ్వసింపవచ్చును.

సామవేదాద్యనుక్రమణికలుగూడ నాయా వేదముల వివిధ విషయములను సూచించుచు ఋగ్వేద సర్వానుక్రమణికి సాటి యగుచున్నవి గాని వాని కర్తృత్వ మజ్ఞేయముగా నున్నది. బైబిల్ సంఖ్యయను మఱియొక యనుక్రమణి కలదు. అది ఋగ్యజుస్సామవేదములు మూఁడింటికిఁగూడ సంబంధించినదని బర్నెలు పండితుఁడు వ్రాసియున్నాఁడు. ఇంక నిట్టి యనుక్రమణిక లెన్నో యున్నవి.

వేదలక్షణములు

ఇది క్రొత్తవిషయము కాదు. వెనుకటి యధ్యాయములందు పెక్కు సందర్భముల శిక్షా ప్రాతిశాఖ్యాది బహువిధ లక్షణ గ్రంథములనుగూర్చి చదివియున్నాము.

అం దనుక్తము లయినవియు నయ్యా వేదములకు సంబంధించినవియు నగు మఱి కొన్ని ముఖ్యలక్షణ గ్రంథములను మాత్ర మిందు గ్రహింతము.

'ఋగ్వేదస్తు ఘనాన్త స్స్యా ద్యజుర్వేదో జటాన్తకః
సామవేదః పదాన్త స్స్యా త్సంహితాన్త స్త్వథర్వణః'

అనుయోహి ప్రాప్తిలక్షణములోని శ్లోకమునుబట్టి అథర్వసంహితకుఁ దప్పఁ దక్కినయన్ని సంహితలకును 'పదపాఠ'మను పేరఁ బదవిభాగము కలదనియు, సామ సంహితకుఁ బదపాఠము తప్పఁ గ్రామాదిపాఠములు లేవనియు, యజుర్వేద మునకు ఘనాది పాఠములు లేవనియుఁ దెలియవచ్చును గాని, లోకమునందిపుడు గూడ యజుర్వేద ఘనపాఠము వినవచ్చుటచేతను, పారిశిక్షా వ్యాఖ్యానమగు యాజుష భూషణము రచియించిన చక్రపండితుఁడు—

'పదక్రమ జటా ఘన ధ్వజ రథాదిభేదై ర్యుతా
శ్రుతిః ప్రథితలక్షణా స్ఫురిత పంచవర్ణక్రమా'

అని వచియించి యుండుటచేతను, యజుర్వేదమునకు ఘనాది వికృతులు గూడఁ గలవని విదితమగును. ఋగ్వేద పదపాఠము శాకల్యముని నిర్మితమని శాకల్యదృష్టే పదమేకలక్ష' మిత్యాది శ్లోకమునఁ దెలియుచున్నదిగాని సామ కృష్ణ శుక్లయజుస్సుల పదపాఠముల కర్తలెవరో తెలియరాదు. పదపాఠము సంహి తార్థము తెలియుట కెక్కువ సహాయపడునది యగుటచే నథర్వ సంహితకుఁ గూడఁ బదపాఠముండి యుండుననియే యూహింపవలసి వచ్చుచున్నది. మంత్ర మందలి పదములను విభజించుటయే పదమనఁబడును. అట్టి పదవిభాగము లేక భాష్యకర్త లథర్వవేదమునకు వ్యాఖ్యలు వ్రాసిరనుట యసంగతము కావునఁ బద పాఠమిపుడు వేఱుగాఁ గనరాకపోయినను సాయణాదు లథర్వసంహితాపద పాఠ మెఱిఁగి యుందురనియే భావింపవచ్చును. ఇఁక సంహితా పదక్రమాదుల యుచ్చా రణరీతి నించుక యుదాహరింతము.

అగ్నిమీళే పురోహితం యజ్ఞస్యదేవ మృత్విజమ్ - సంహిత
అగ్నిమ్ - ఈళే - పురోహితమ్ - యజ్ఞస్య - ఇత్యాదిపదము.

ఇట్టున్న మంత్రమందలి ద్వితీయాది పదములు రెండుసార్లు వచ్చునట్లు క్రమముగాఁ బై పదములందుకొనుచుఁ బఠించుట క్రమమనఁబడును.

అగ్ని మీళే ఈళే పురోహితమ్. పురోహితం యజ్ఞస్య – ఇత్యాది 'యాప దస్య షడావృత్తి స్సాజటే త్యభిధీయతే' అను లక్షణమునుబట్టి, ఒక పదమాఱు సార్లు వచ్చునట్లు పఠించుట జటయనఁబడును.

అగ్నిమీళ ఈళేఽగ్ని మగ్నిమీళే, ఈళే పురోహితం పురోహితమీళ ఈళే పురోహితమ్ – ఇత్యాది. ఇందు 'ఈళే' అను పదమాఱు మార్లు వచ్చినది ఇట్లే పురోహితాది పదములు నీ పాఠమున నాఱుసార్లు వచ్చును. జట వికృతులలో మొదటిది.

'జటా మాలా శిఖా రేఖా ధ్వజో దండో రథో ఘనః
అష్టౌ వికృతయః ప్రోక్తాః క్రమపూర్వా మనీషిభిః'

అని వికృతివల్లి. వీనిలో, క్రమమాల, క్రమదండ మిత్యాదిగా నవాంతర వికృతులుగూడఁ గలవు. మంత్రజ్ఞప్తి నత్యంత మభివృద్ధిపఱుచుట కేర్పడిన యీ వికృతులనుగూర్చి యనేక లక్షణ గ్రంథము లుదయించినవి. ఇందలి స్వర వర్ణో చ్చారణ భేదాదులను దెలుప మఱికొన్ని యావిర్భవించినవి. ఇట్టివియును వీని వ్యాఖ్యలును గలిసి వైదిక వాఙ్మయమునం దధికముగాఁ గనవచ్చుచున్నవనుట యతిశయోక్తి కాదు. అందు—ఋగ్వేద లక్షణము ఋగ్వేద పరిభాష సంహితా సూత్రము పదసంఖ్య ఉపలేఖము క్రమరత్నము జటోదాహరణము వర్ణోచ్చారణ లక్షణము రాపణభైటుకము వికృతివల్లి మొదలయినవి ఋగ్వేద సంబంధములు. ఇందు వికృతవల్లి పురాతనమనియు వ్యాళిమహర్షి ప్రోక్తమనియు దానికిఁ గౌముదీవ్యాఖ్య రచియించిన గంగాధరాచార్యుఁడిట్లు చెప్పుచున్నాఁడు.

"గ్రంథే వికృతివల్ల్యాఖ్యే వ్యాళిప్రోక్తే పురాతనే
టీకేయం క్రియతే ఽస్మాభి ర్నామ్నా వికృతి కౌముదీ"

సామవేద లక్షణములు కొలఁదిగాఁ గనవచ్చుచున్నవి. అందు, సామ పరి భాష స్వరనిర్ణాయకము, ఇందు క్రుష్ట ద్వితీయ తృతీయ చతుర్థ మంద్ర స్వర ములు విశదీకరింపఁబడినవి. సామ మంత్రమని మఱియొకటి కలదు. ఇది ఛందోగ సంబంధి వ్యాకరణము, పదసూఁడు ప్రపాఠకముల గ్రంథము. ఇంకను యోహి ప్రాప్తి లక్షణ గాయత్రీగాన లక్షణాదులు మఱికొన్ని కలవు.

కృష్ణ యజుర్వేద లక్షణగ్రంథము లత్యధికముగా నున్నవి కాని యివి చాల వఱకత్యంత మర్వాచీనములనియే తోఁచుచున్నది. అందు, దేవమనీషి పుత్రుఁ

దయిన శ్రీవత్సాంకుఁడు రచియించిన 'అనింగ్య' మనునది పద్యాత్మకము. ఇందు హలాది విభక్తులును యకారాది పదములును బరమగునపుడు స్వరోచ్చారణ మెట్లుండునో వివరింపఁబడినది అంత ప్రదీపమనునది సంహితలోని విరామ స్థలములనున్న దీర్ఘాంతములు విసర్జనీయాంతములునగు శబ్దములను వర్ణక్రమ ప్రకారము తెలుపుచు, పదపాఠమున కెక్కువ సహాయపడుచున్నది. ఇదియును శ్లోకాత్మకమైన చిన్న గ్రంథము. అవర్ణియను మఱియొక లక్షణము సంహితలోఁ బదాదినున్న -ఓ-ఏ- అనువానిలో మొదట నున్నది ఆకారమో అకారమో తెలుప నుపయోగించును. అవర్ణియను పేరు గలవి రెండు మూఁడు లక్షణములున్నవి. వానికి వ్యాఖ్యానములును గలవు. వానిలో, చింతా మహాధిపతియజ్వ రచియించిన యవర్ణి[1] సంహితలో, అవర్ణముతోఁ బ్రారంభమగు పదములను దెలుపును. ఉచ్చ స్వర నిర్ణయము ఉచ్చోదరిక్త యోహిప్రాప్తి యోహి లక్షణము రావణభైటుకము లక్షణ రత్నము షడ్వింశతి సూత్రము సప్తలక్షణము స్వరపంచాశత్తు సర్వభక్తి వేద లక్షణము మొదలయినవి యుదాత్తాది స్వరములు సంధులు మొదలగువానిని శాసించుచున్నవి. త్రిక్రమ లక్షణము క్రమపాఠ శాసకము. థకారధకార సూత్రము వేదములోని తవర్గ ద్వితీయ చతుర్థవర్ణ బోధకము. నపర తపరమను లక్షణము వేదమందలి నకారాంత తకారాంత పదములను దెలుపుచున్నది. ప్లుతాను శాసనము ప్లుతస్వర జ్ఞాపకమగుచున్నది. పూర్వోత్తరోభయదీర్ఘియనునది పూర్వ పదముల తుదనుండు దీర్ఘములను పరపదముల మొదటనుండు దీర్ఘములను విశదపఱుచుచున్నది. జటావలి జటాలక్షణమనునవి జటా వికృతిని వివరించు చున్నవి. పదకారికా రత్నమాలయను పద్యాత్మక లక్షణము శుక్ల యజుర్వేద మందలి విసర్గము అనుస్వారము వేష్టనము మొదలగు వాని స్వరూపము నిర్ణ యించుచుఁ బదపాఠ జ్ఞానమున కుపకరించుచున్నది.

వేదలక్షణాను క్రమణిని బట్టి లక్షణ గ్రంథముల సంఖ్య సుమారేఁబది మాత్రమే కనవచ్చునుగాని పఠనపాఠ వ్యవహారమున లేక పుస్తకాలయములం దణఁగియున్న లక్షణ గ్రంథములు నూటి కెక్కువగానే కనఁబడుచున్నవి. ఇది సప్తలక్షణముల నిట్లు చూపుచున్నది.

'శమానంచ విలంఘ్యంచ నపరం తపరం తథా
అవర్ణ్యావర్ణ్యనింగ్యం చ సప్తలక్షణ ముచ్యతే.'

1. శింత్రిణీకుల సంభూత మహాధిపతి యజ్వనా.

దీనిచే సప్తలక్షణ మనునది యీ సప్తవిధ లక్షణముల కూడికయని తెలియ నగును. వీని కన్నిటికిని వ్యాఖ్యానములు కలవు. ఈ యనుక్రమణి వేదోచ్చారణ క్రమము నియమించుచు నీ క్రిందివారు పాఠకాధములని వక్కాణించుచున్నది.

'గీతీ శీఘ్రీ శిరఃకమ్పీ తథా లిఖితపాఠకః
అనర్థజ్ఞో ఉల్పకంఠశ్చ ష డేతే పాఠకాధమాః.'

సర్వవేద పాఠఫలమను చిన్న గ్రంథము లక్షణజ్ఞుఁడై సంహితా పద క్రమాదులు పఠించువాఁడు బ్రహ్మలోకమును బొందునని చెప్పుచున్నది. దీనిఁబట్టి పూర్వుల వేదపాఠమందలి జాగరూకతయు వేదసంరక్షణ దక్షతయు వేదార్థ జ్ఞాన సంపదయుఁ దెల్లమగుచున్నవి. మఱియు వేదలక్షణ వ్యాఖ్యాతలలో త్రిభాష్యరత్న మను ప్రాతిశాఖ్య వివరణము రచించిన సోమయార్యుఁడు, సర్వసమ్మత శిక్షా వివరణము వ్రాసిన ఆలమూరి మంచిభట్టు, శమానసంధి పదదర్పణము రచియించిన పోగల మల్లయార్యయజ్వ, యోహిప్రాప్తి భరద్వాజశిక్షా వ్యాసశిక్షాదుల వ్యాఖ్యలు రచియించిన[1] వేల్మికన్యాపురపు సూరావధాని మొదలగు విద్వద్వర్యు లాంధ్రు లగుటచే నాంధ్రదేశమునమున్న వేదవిద్య సర్వలక్షణ సంపూర్ణమై యెట్లు వర్ధిల్లినదో తేటపడఁగలదు.

వైదిక చ్ఛందస్సునకు సంబంధించి ఛందోవిచితి ఛందోమంజరి ఛందో నిదర్శనము ఛందోనిర్ణయము నిదానసూత్రము మొదలగు కొన్ని లక్షణములు కనఁబడుచున్నవి. ఇందు మొదటిది పింగళ నాగకృతముగాను రెండవది విష్ణుభట్ట నిర్మితముగాను గొన్ని ప్రతులలోని గద్యలవల్లఁ దెలియుచున్నది. నిదాన సూత్రము సామవేద చ్ఛందో విషయకము. ఇది పతంజలి కృతమని చెప్పఁబడుచున్నది. ఇది పన్నెండు ప్రపాఠకముల గ్రంథము ఇది కాశీపురమున ముద్రితమైనది. ఇట్లిం కను వైదిక లక్షణములును వాని వ్యాఖ్యలును గలవు. అట్టివానిలో గణనీయము లైన కొన్నిటి నిందు గ్రహింతము.

1. ఈ పద మితని కృతులలో వేల్మికన్యాపుర – హోమకన్యాపుర – అని కనఁబడుచున్నది. సూర్యనారాయణ శబ్దముకూడ నవశాకికా శ్లోకములలో నున్నను, గద్యలలో – వేల్మికన్యా సూరావధాని విరచితే—అని కనఁబడు చున్నది. గ్రామనామము సందిగ్ధముగా నున్నను, ఇతఁడు తెలుగువాఁ డగుట సందిగ్ధము కాదు.

యాస్క నిఘంటువునకు దేవరాజయజ్వ విపులమైన భాష్యము రచియించెను. అది యైదధ్యాయముల పెద్ద గ్రంథము. అందు యాస్క నిరుక్తములోని నైఘంటుక కాండమందు నిర్వచింపఁబడని బహు శబ్దముల యర్థము నిరూపింపఁబడినది. ఈ వ్యాఖ్యాత యజ్ఞేశ్వరార్యుని పుత్రుఁడు శ్రీరంగపురీ ప్రాంత గ్రామ నివాసి. ఋగ్యజుర్వేదములందలి బహు క్లిష్ట శబ్దముల యర్థము కరతలామలకము గావించు నీ భాష్యము మంత్రార్థ జ్ఞానమున కెంతయుఁ దోడ్పడుచున్నది. భగవద్దుర్గాచార్యుల నైఘంటుకకాండ వృత్తికంటె నితని భాష్యము మిక్కిలి సంశయ విచ్ఛేదకమై యొప్పుచున్న దనుటకంటె దీనినిగూర్చి వేఱుగా వ్రాయఁ బనిలేదు.

వైదిక కోశమను మఱియొక లక్షణము భాస్కరరాయ దీక్షితుఁడు రచియించినది కలదు. ఇది యాస్కుని నైఘంటుక కాండమును బోలియు నందులేని యనేక శబ్దములను జూపుచున్నది. ఇది నానా పదకాండము, ఏకపద కాండమునని రెండు కాండములుగా నున్నది. ఇందు మొదటిది మూఁడు వర్గములు రెండవది రెండు వర్గములు.

భాస్కరరాయ దీక్షితుఁడు బహు గ్రంథకర్త. ఇతని యింటిపేరు భారతి వారు. ఇతని తండ్రి గంభీరరాజ దీక్షితులు. ఇతని కాలము తెలియఁదగిన యాధారములు లభింపలేదుగాని, యీ వైదిక కోశమునకుఁ బద్యాత్మకమైన సంపూర్ణ వ్యాఖ్య రచియించిన నారాయణయజ్వ గావించిన భాస్కరరాయ ప్రశంస చూడఁగా నతని నాఁటికే యీ వైదిక కోశకర్త ప్రాచీనుఁడుగా గణింపఁబడుచు వచ్చినట్లు తెలియవచ్చును. ఎట్లయినను భాస్కరరాయుఁడు సాయణాచార్యులకుఁ బూర్వుఁడనుట సత్యము. ఇఁక నింతకుమున్ను పెక్కుసార్లు పేర్కొనఁబడిన ఋగ్విధానమునుగూర్చి యించుక తెలిసికొని యీ ప్రకరణము ముగింతము.

ఋగ్విధానము ఋగ్వేద లక్షణ గ్రంథములలో నుత్తమ మనుట నిర్వివాదము. ఋగ్వేద రత్నాకరము ఋగ్విధాన నావ లేకుండ దాఁట శక్యము గాదనియు, ఋగ్విధానము తెలియని ఋగ్వేద పఠనము వ్యర్థమనియు నిందలి యవతారిక ఘోషించుచున్నది. కాని, యీ ఋగ్విధానము శౌనక నిర్మితమనుట కిందలి యవతారికాదులఁ గనఁబడు "నమ శ్శౌనకాయ" యనెడి వాక్య మడ్డుపడుచున్నది. శౌనకుఁడే యిది రచియించినచో నమస్కార పూర్వకముగఁ దన్నే తాను స్మరించుకొనునా? "మహ్య మేవ నమో నమః" అని బ్రహ్మ విద్వర్యులొకటి రెండుచోట్లఁ జెప్పుకొన్నట్లు ప్రతీతి కలదుగాని, యీ గ్రంథ నిర్మాణ విషయ

మట్టిదిగాదు. బృహదృగ్విధానమను మఱియొక గ్రంథ మున్నట్లు తెలియవచ్చు చున్నది. ఆ గ్రంథము నాకు లభింపలేదుగాని, యొకవేళ నది శౌనక నిర్మితమేమో యనియు, దాని సారమునే మఱియెవరో ఋగ్విధానముగా సంగ్రహించియుండ దీని కర్త శౌనకుఁడనెడి ప్రతీతి విస్తరించి యుండునని యుఁ దోఁచుచున్నది. పద్యాత్మకమయిన దీనికి, కనిష్ఠ ఋగ్విధానమను నామాంతరము కలదు. ఇది నాలుగధ్యాయముల గ్రంథము. ఇందు ఋగ్వేద మంత్రముల వినియోగము పూర్తిగాఁ జూపఁబడినది.

వేద భాష్యములు

పూర్వాధ్యాయములందాయా సందర్భముల సంహితా బ్రాహ్మణారణ్యకోపనిషద్భాష్యములను వేదాంగాదుల వ్యాఖ్యానములను యథా సంభవముగాఁ బేర్కొని యున్నాము. ఇపు డందలి ముఖ్య భాష్యములను దత్కర్తలనుగూర్చి యించుక ముచ్చటింతము.

మంత్రముల భావమును బ్రాహ్మణములును, వేదశబ్ద స్వరూపాదులను శిక్షాది లక్షణములును, తదర్థ నిర్వచనమును నిరుక్తాదులును, తద్వినియోగాదులను సూత్రాదులును, వివరిందుచు వచ్చుటచేతను వైదిక భాషకుఁ గొంచెము దగ్గఱగా వచ్చుచున్న లౌకికభాష యార్యవ్యవహారమం దుండుటచేతను వేదార్థ విజ్ఞానమునకు భాష్యము లవతరింపవలసిన యావశ్యకత చిరకాలమువఱకుఁ గలుగలేదు. సంస్కృతము వ్యవహారమునుండి తొలఁగి కేవలము గ్రాంథికమైన పిదపఁగూడ, అది యాగాచరణ పరాయణమగు బ్రాహ్మణజాతికి మిక్కిలి పరిచితమై పఠనపాఠ వ్యవహారమున నుండుటచేతను వేదశ్రౌతము లాకాలమున బ్రాహ్మణజాతి సామాన్యము లగుటచేతను శ్రౌతసాహాయ్యమునఁ గొంతకాలము బ్రాహ్మణులు వేదభావ మెఱిఁగి క్రతువు లాచరించుచుండెడివారు. తరువాతఁ దరువాత సంస్కృతాభ్యాస మొనర్పక శుష్కవేదాధ్యయనము గావించు శుద్ధశ్రోత్రియులు 'జ్ఞాత్వా కర్మాణి కుర్వీత' యనెడి విధివాక్యమునకు విరుద్ధముగా వేదార్థ మెఱుఁగకయే యాగము లాచరించెడి యాచారము సంభవించినతఱి లోకానుగ్రహ తత్పరులును వేదావేదాంగ వేత్తలునగు మహానుభావులు వేదార్థ వివరణమునకుఁ బూనుకొనిరి. అది క్రీస్తు శకారంభమున కీవలిమాట.

వేదావిర్భావమునకును వేదభాష్యోత్పత్తికిని మధ్యకాల మెంత తక్కువగాఁ జూచినను మూఁడు నాలుగువేల సంవత్సరము లుండెను ఈ మధ్యకాలమున

వైదిక శబ్దజాలమునుండి లౌకికభాషకు వచ్చిన బహు శబ్దములు రూపమునందు నర్థమునందుఁగూడ మార్పు చెందుచు వచ్చినవి. ఇందుకు నిరుక్త పాణీయాదులఁ గనవచ్చు ననేక శబ్దముల నిర్వచనములును, ప్రక్రియలు నుదాహరణ మగును. ఈ మధ్యకాలమున నీ మంత్రమున కిది యర్థమని చెప్పెడి సంపూర్ణ గ్రంథ మేదియు నుదయింపలేదు. అట్టి మంత్రార్థ మంతయుఁ గర్మకాండము ననుసరించిన సంప్రదాయమును బట్టియే యవగత మగుచుండెడిది. ఆ కార్మకాండమైనను మొదటి నుండి యొక విధముగానే యున్నది గాదు. అది కాలక్రమమున వివిధాంగ సంపన్నమై విస్తరించినది అందుచేతనే కొన్ని మంత్రముల భావములును, వానిని బట్టి కొన్ని శాఖలవారి కర్మాచరణ పద్ధతులును వేఱగుట సంభవించినది. ఈ హేతువులనుబట్టి కొన్ని మంత్రముల యర్థము భాష్యములందు మాఱుతోవ పట్టిన దని కొందఱు తలంచిరి ఋగ్వేదమందలి కొన్ని ఋక్కుల యర్థము క్లిష్టమై బలాత్కారముగా లాగిన ట్లుండుటనుబట్టి వారి యూహ కొంత సకారణముగాఁ గనఁబడినను, భాష్యములు మంత్రముల సహజార్థ మావిష్కరించుటకే బహు విధములఁ బ్రయత్నించినవని మాత్రము విశ్వసింపక తప్పదు. ఏ మనఁగా ?

వేదములు కర్మార్థము జ్ఞానార్థము నుదయించినవని యందఱు సమ్మతింతురు. ఒక మంత్రము నొక ఋషి దర్శించె నన్నంతనే యది యొక భావమే తెలుపుచు నందే స్థిరపడి యుండె ననవలెనుగాని ద్వ్యర్థికావ్యమువలె నది రెండర్థములు తెలుపు నని కాని, లేక డిత్థాది శబ్దములవలె నిరర్థకమని కాని చెప్ప వలనుపడదు గదా! అట్టిచో నొక మహర్షి నిర్మించిన యొక మంత్ర మతని యాశయముతోనే పఠనపాఠ క్రమమున వచ్చి కర్మోపయోగి యైనపుడు దాని యర్థముం గూర్చి సంశయ మేల కలుగవలెను ? ఆ ట్లేయర్థము సంప్రదాయ సిద్ధమై భాష్యకర్తల మతి కెక్కెనో, యది మూలకర్తల యాశయమున కన్య మెట్లగును ? కావున నేవో కొన్ని శబ్దముల యర్థములు శబ్దశక్తినిబట్టియు సంప్రదాయ ప్రవర్తకుల మతములనుబట్టియు వేఱుగాఁ గనవచ్చినను, మొత్తముమీఁద భాష్యములు మంత్రముల సహజార్థమునే వెల్లడింపఁ బూనినవనుట సత్యము.

ఆయా వేదములకు భాష్యములు రచియించినవారు మఱికొంద ఱున్నను వేదార్థప్రకాశ యశోలక్ష్మి సాయణ మాధవాచార్యులను మాత్రమే వరించినదనుట సర్వజగద్విదితము. తక్కినవారి భాష్యములు వేదార్థ ప్రకాశమువలె సకలార్థ బోధకములు కావు కావ్యములకు మల్లినాథ వ్యాఖ్య యెట్టిదో వేదములకు సాయణ భాష్య మట్టిది. అంత సుఖకరముగా వేదభావము వెల్లడించునది మఱియొకటి

లేదనుట యతిశయోక్తికాదు. సాయణ భాష్యములే యవతరింపకున్నచోఁ గడిచిన యెదువందల సంవత్సరములలో వేదవేత్తయైన పురుషుఁడే లేకుండఁ బోవునేమో! ఇట్లనుటచేఁ దక్కిన భాష్యములు నిరుపయోగములని తలంపరాదు. వేనిని జూచి సాయణుఁ డిట్టి కూలంకషమైన వ్యాఖ్యలు రచియించెనో, ఆ భట్టభాస్కర మిశ్రాదుల భాష్యములు సాయణులకుఁ బూర్వము వేదార్థ జిజ్ఞాసువుల హృదయముల రంజింపఁ జేసినవియే కాక సాయణ భాష్యములకు మార్గదర్శకములై వైదిక లోకమునకు మహోపకార మొనరించి యున్నవనుట మఱవరాని విషయము ఇఁక ఋగాది క్రమమున భాష్యములను, తత్కర్తలను దెలిసికొందము.

ఋగ్భాష్యము :— ఇది, ఆనందతీర్థ భగవత్పాదులు రచియించిన పద్యాత్మక వ్యాఖ్య. కాని, యిది ఋగ్వేదమంచలి యెల్ల మంత్రములను గర్మపరముగా సమన్వయింపఁ బూనినది కాదు. సంసారసాగర పారమును బొందఁ దలఁచిన ముముక్షువులు భగవత్ప్రసాదము లేక ముక్తిని గాంచఁజాలరు గావున, వారి కీశ్వర జ్ఞాన ముపదేశింపఁగోరి భగవత్పరములైన కొన్ని ఋక్కులకు జ్ఞానపరముగా నానంద తీర్థులు భాష్యము రచియించిరని యీ భాష్యమునకు టీక వ్రాసిన జయతీర్థ భిక్షువు వక్కాణించియుండెను. దీనినిబట్టి యీ భాష్యము నుద్దేశమును దీని పద్ధతియు విదితము లగుచున్నవి.

ఆనందతీర్థు లే కాలమువారో తెలియదు. వీరి భాష్యము ముద్రితమైనట్లును గనఁబడదు. అసంపూర్ణములైన దీని వ్రాఁతప్రతులు కొన్ని తంజావూరు పుస్తక భాండాగారమున నున్నవి. ఇది ఋగ్వేద మామూలాగ్రము వివరింపఁ బూనినది కాకున్నను, దేవతా విషయక జ్ఞాన ప్రతిపాదనము మాత్రముచేతనే పరిమాణమున మిక్కిలి పెద్ద గ్రంథమైనది. జయతీర్థులు దీనికి రచియించిన ఋగ్భాష్యార్థ తత్త్వ ప్రకాశికయను టీక యింతకంటెను రెండురెట్లు విపులమై జిజ్ఞాసువులకు విజ్ఞాన దాయకమై యలరారుచున్నది. అయినను, ఏది మన ముద్దేశించితిమో, ఆ ఋగ్వేద భాష్యముమాత్ర మిదికాదు. ఇందలి ముఖ్యవిషయము గాయత్రీమంత్ర పురుష సూక్తార్థ సంగ్రహముగా వర్ణించిన యానందతీర్థుల యీ క్రింది శ్లోకమువల్లనే తెలియుచున్నది

"స ఏ వాఖిల వేదార్థ స్సర్వశాస్త్రార్థ ఏవచ
స ఏ వాఖిల శబ్దార్థ ఇత్యా హోపనిష త్పరా."

జయతీర్థుల ఋగ్భాష్యార్థతత్త్వ ప్రకాశిక ననువర్తించి ఋగర్థ రత్నమాల యను మఱియొక వ్యాఖ్య కనఁబడుచున్నది. ఇది మహీధర పండితుఁడు రచియించి నదిగా బర్నెలు పండితుఁ డూహించెనుగాని యిందుకుఁ దగిన ప్రమాణము చూపఁ బడలేదు ఈ వ్యాఖ్యయు నసంపూర్ణముగానే యున్నట్లు తెలియుచున్నది. విషయ మున నిదియును జ్ఞానార్థకమే యగును. అగ్న్యాది సూక్తములు సకలవేద ముఖ్యుఁడు నోంకార ప్రతిపాద్యుఁడునగు పరమేశ్వరుని బతిపాదించునవిగా సర్వజ్ఞ శిఖామణియు భాష్యకారుఁడు నగు నానంద తీర్థుఁడు సమన్వయించెనను దేని యుపో ద్ఘాతమే యిది పూర్వోక్తతీర్థుల హృదయము ననుసరించి జ్ఞాన ప్రతిపాదక మగు చున్నదని వెల్లడించుచున్నది.

వేదార్థ ప్రకాశము :— ఈ పేర సాయణాచార్య కృతములయిన ఋగాది సంహితా బ్రాహ్మణారణ్యకాదుల భాష్యము లనేకములు వైదికకల్ప భూరుహములై వెలయుచున్నవనుట లోక ప్రసిద్ధము. ఈ భాష్యము లిట్టివని వర్ణించుట కాగడాతో సూర్యుని జూపుటయే యగును. వేదముల పేరెత్తినంతనే యెట్టివారయిన ముందుగా సాయణాచార్యులకుఁ జేయెత్తి మ్రొక్కవలసినదే.

సాయణ భాష్యము లన్నిటి మొదటను మంగళాచరణ శ్లోకములతోడి పద్య మయావతారిక యొకటి యున్నది. అందు ''వాగీశాద్యాస్సు మనస'' ఇత్యాదిగా, 'కృపాళు ర్మాధవాచార్యో వేదార్థం వక్తు ముద్యతః' అను వఱకును గల పద్యము లన్నిటియందు సమానముగానే యున్నవి. ఈ యవతారికనుబట్టి బుక్క మహీపతి యానతిచే మాధవాచార్యులు వేదభాష్యములు రచియించినట్లు కనఁబడునుగాని, అధ్యాయాంత గద్యములనుబట్టి 'శ్రీ వీర బుక్కభూపాల సామ్రాజ్య ధురంధరుఁ డయిన సాయణాచార్యునిచే రచియింపఁబడిన మాధవీయ 'వేదార్థ ప్రకాశ' మనెడి సత్య విషయము గోచరించును. శ్రీమతీ మాయణాచార్యుల పుత్రులయిన మాధవ సాయణు లిద్దఱును వీర బుక్కభూపతి మంత్రులు. వీ రిరువురును వేదవేదాంగ విద్వర్యులు మహా ప్రతిభాశాలులు. రాజు నాజ్ఞచే సాయణుఁడు భాష్యములు రచి యించి వానికిఁ దన యన్న పేర మాధవీయ మనుపేరు పెట్టెను. ఇది యథార్థ మైనను కొందఱు, మాధవాచార్యుఁడే వేదభాష్యములు రచియించెననియు, అతఁడే సన్యసించి విద్యారణ్యుఁ డయ్యెననియు, దానంజేసి వేదభాష్యమునకు విద్యారణ్య మనుపేరు వచ్చెననియుఁ దలంతురు. కాని యది వాస్తవము కాదు. సాయణుఁడే భాష్యములు రచియించెను.

ముద్రిత గ్రంథావతారికలలోఁ గనఁబడని రెండు శ్లోకములు కొన్ని లిఖిత పుస్తకములలోఁ గనవచ్చుచున్నవి. అవి ప్రక్షిప్తము లనఁదగియున్నను, అందలి విషయము మాత్రము సత్యమై గ్రంథాంత గద్యములను బలపఱుచుచున్నది. ఆ శ్లోకము లివి:—

"స ప్రాహ నృపతిం రాజన్ సాయణార్యో మ మానుజః
సర్వం వేత్త్యేష వేదానాం వ్యాఖ్యాతృత్వేన యుజ్యతామ్
ఇత్యుక్తో మాధవార్యేణ వీరబుక్క మహీపతిః
అన్వశా త్సాయణాచార్యం వేదార్థస్య ప్రకాశనే"

దీనినిబట్టి భాష్య రచయిత సాయణార్యుఁడనియు, నతఁ డన్నయందలి భక్తిచే భాష్యమునకు మాధవీయ మనుపేరు పెట్టెననియు విదితమగును. కొందఱు సాయణ మాధవు లిద్దఱు నొకరే యనెడి యభిప్రాయ మావిష్కరించిరి గాని యది యును సరిగాదు. యజ్ఞసుధానిధి యను శ్రౌతగ్రంథము నవతారికలో మాధ వార్యుఁడు తన భ్రాత యైనట్లుగా సాయణాచార్యుఁడే వక్కాణించి యున్నాఁడు. విజయనగర సామ్రాజ్య పరిపాలకుఁడగు వీర బుక్కభూపతి కాలమునుబట్టి క్రీ. శ. పదునాల్గవ శతాబ్ది మధ్యకాలమున సాయణ భాష్యములు విద్వల్లోకమున కానంద దాయకము లయ్యెనని తెలియుచున్నది.

సాయణాచార్యులు తొలుతఁ బూర్వోత్తర మీమాంసలకు సంగ్రహ వ్యాఖ్యలు రచియించి తరువాత నధ్వర్యు వేదమైన కృష్ణ యజుర్వేదమునకు భాష్యము వ్రాసి పిదప ఋగ్వేదమునకు భాష్యము రచియించి, అనంతరము సామాథర్వవేదములకుఁ గ్రమముగా వ్యాఖ్యానములు నిర్మించెను. ఇతఁడు తన భాష్యములందు వివిధ బ్రాహ్మణారణ్య కోపనిషత్తులనుండి ప్రమాణ వాక్యము లుదాహరించుటయే కాక విశేషించి ఋగ్భాష్యమున, యాస్కుఁడు నిరుక్తమున వ్యాఖ్యానము గావించిన యెల్ల ఋక్కుల యర్థము నట్లే తన భాష్యమునకుఁ దోడుగా నుదాహరించి యుండెను.

సామవేద ఋగ్భాష్యము :— దీనిని దొలుత భారతస్వామి రచియించెను. ఇతఁడు కాశ్యపగోత్రుఁడు యజ్ఞదా నారాయణుల పుత్రుఁడు మైసూరు సంస్థానము నకుఁ జెందిన శ్రీరంగపట్టమున నివసించినవాఁడు. హోసలాధీశ్వరుఁడగు రామ నాథుఁడు రాజ్యముచేయు కాలమునఁ దా నీ భాష్యము వ్రాసినట్లుగా నిట్లు చెప్పుకొని

యున్నాఁడు. "హోసలాధీశ్వరే పృథ్వీం రామనాథే ప్రశాసతి వ్యాఖ్యా కృతేయం క్షేమేణ శ్రీరంగే వసతా మయా."

హోసల రాజ్యము కర్ణాట దేశమునకు సంబంధించినది. హోసల వంశ్యులు తొలుత జైనులయ్యుఁ దరువాత వైష్ణవులుగా మాఱిరి. రామనాథుఁడు దేవగిరిలో నుండి క్రీ. శ. ౧౨౭౨-౧౩౧౦ నడుమ రాజ్యము చేసినవాఁ డగుటచే భారత స్వామి పదుమూఁడవ శతాబ్ది కడపటి భాగమున నీ భాష్యము రచియించెననుట తెల్లము. దీనినిబట్టి యితఁడు సాయణాచార్యులకంటె సుమా రఱువది సంవత్సరములు ముందటివాఁ డగుచున్నాఁడు.

సామవేద ఋగ్భాష్యము పూర్వార్చికకును వేదార్థ ప్రకాశ ముత్తరార్చికకును లభించుచున్నవి. ఇది చూడఁగా భారతస్వామి మొదటి భాగమునకు మాత్రమే భాష్యము రచించియుండఁ దరువాత సాయణు లుత్తర భాగమునకు భాష్యము వ్రాసియుండునని గోచరించుచున్నది. భట్టభాస్కర మిశ్రుఁడు ఋగ్వేద సామవేదములకు భాష్యములు రచియించెనని కొంద ఱందురుగాని యవి యెందును గానరాకున్నవి. మొన్నమొన్నటివఱకు నతని కృష్ణయజుర్వేద భాష్యము ప్రకటితము గాకుండుట చూడ నవిగూడ నెందైన మఱుఁగుపడి యుండెనేమో యని యనుమానము కలుగుచున్నది.

కృష్ణయజుర్వేద భాష్యములు :— వీనిలో మొదటిది జ్ఞానయజ్ఞము. దీని కర్త భట్టభాస్కర మిశ్రుఁడు. సకల వేదశాస్త్రము లెఱింగిన యీ మహా విద్వాంసుఁ డాంధ్రుఁడనియు, క్రీ. శ. దశమ శతాబ్ది కడపటివాఁడనియు బర్నెలు మొదలగువారు వ్రాసిరి. ఇతఁడు ద్వాదశ శతాబ్ది ద్వితీయ భాగములోని వాఁడని శేషగిరి శాస్త్రిగారు భావించిరి. ఇతని జ్ఞానయజ్ఞములోని—

'ఏష నిష్పావకే శాకే కౌశికాన్వయ జన్మనా
భట్టభాస్కర మిశ్రేణ జ్ఞానయజ్ఞః ప్రకీర్తితః'

అను శ్లోకమందలి 'అనుము' లర్థమైన నిష్పావక శబ్దమునుబట్టి యితని యింటిపే రనుములవా రనియు, అందుచే నితఁ డాంధ్రుఁడనియు నిర్ణయించి వైదిక లోక సంప్రదాయమునుబట్టి యితఁడు ౯౫౦ ప్రాంతముల వాఁడని బర్నెలు వ్రాసిన దానిని ఖండించుచు, శేషగిరి శాస్త్రిగారు 'నిష్పావక శబ్దము శకసంవత్సర పరముగాని గృహనామపరము కాదనియు, కాని యీ పద మిట్లే యున్నచో నితఁడు

సాయణాచార్యునికిఁ దరువాతివాఁడు కావలసి వచ్చును గావున— 'నిష్పావక' యని సవరించి యితని కాలము శా. శ. ౧౦౧౦. అనగా, క్రీ. శ. ౧౦౮౮, అని చెప్పుట సముచితమనియు నభిప్రాయ మిచ్చిరి. ఆలోచింపఁగా నిష్పావక శబ్దము గృహనామ పరమైతే శాకశబ్ద మెట్లు సార్థక మగుననియు, శకాబ్దపరమైతే యెట్లో కాలము కుదుర్చుటకు, పకారము దిద్దుట యెట్లు సముచితమనియు రెండు పక్షము లందు నాక్షేపణలు సిద్ధమగుచున్నవి. కాని చెన్నపురి ప్రాచ్య పుస్తక భాండా గారములోని ౧౮౯ సంఖ్యగల యొక కృష్ణయజుర్వేదభాష్య లిఖిత పుస్తకము కడపట—

'ఏష నిష్పావకే లోకే కుశికాన్వయ జన్మనా'

అను పాఠము కనఁబడుచున్నది. ఇందలి జనసముదాయార్థకమయిన లోక శబ్దమా వంశపరముగా సమన్వయింపవచ్చును గావున నిష్పావకశబ్ద మనుముల యను నింటిపేరు చెప్పునదిగనే భావింపవచ్చును. ఇపుడు, అనుముల వంశమందు కౌశిక గోత్రమునఁ బుట్టిన భట్టభాస్కర మిశ్రుఁడను భావము విదితమగును. శకాబ్ద ములు చెప్పుటయే కవి యభిప్రాయమైనచో నతఁడు నిష్పావక శబ్దముకంటె విస్పష్టార్థకమైన మఱియొక శబ్ద ముపయోగించి యుండుననియు, అనుము లనెడి విశేషార్థముచ్చు దీనిని బ్రయోగించుటనుబట్టి గృహనామము చెప్పుటయే యతని యభీష్టమనియుఁ లోకే, అను పాఠమే శుద్ధమనియుఁ దోఁచుచున్నది. భట్టభాస్కరుఁ డాంధ్రుఁ డనెడి యనాది ప్రతీతికూడ నీ యభిప్రాయమునకే యెక్కువ యవకాశ మిచ్చుచున్నది. కావున నిష్పావక శబ్దము గృహనామ పరమనియే నా యభి ప్రాయము.

భట్టభాస్కరమిశ్రులు తైత్తిరీయ సంహితాబ్రాహ్మణములు రెంటికిఁ గూడ సంపూర్ణముగా భాష్యములు వ్రాసిరి. ఇపుడు పోల్చిచూడఁగా సాయణభాష్యముల కంటె నివి సంక్షిప్తములుగాఁ గనఁబడును గాని వ్యాకరణకార్యము లెక్కువగా వివ రించుచు మంత్రభావము గ్రహించుట కనుకూలములుగా నున్నయని యా కాలము నందు దేశమున మిక్కిలి వ్యాప్తిని జెందినవనుట నిజము. అవతారికలోని యీ క్రిందిప్రతిజ్ఞా శ్లోకమితని భాష్యపద్ధతిని వెల్లడించుచున్నది.

"మంత్రాణాం వినియోగ మాగమవిధిం ఛందాంస్యృషీన్ దేవతాః
కాండర్షీ న్నిగమా న్నిరుక్త మితిహాసాఖ్యాయికే బ్రాహ్మణమ్,

వాక్యార్థస్వరరూప మర్థమననన్వాంయాం శ్చ వక్ష్యే పృథక్
శద్దానా మనసూయవ స్సుమనసః శృణ్వన్తు జిజ్ఞాసవః."

ఇతఁడు భావస్వామిని బోధాయనమునిని విశేషించి పేర్కొనుటనుబట్టి భావస్వామికృత పూర్వమీమాంసా భాష్యమును బోధాయనకల్ప సూత్రమును భాష్య రచనమున నెక్కుడు ప్రమాణములనుగా గ్రహించెనని విదితమగును. వేదశాస్త్రజ్ఞుని యాధిక్యమును, వేదార్థాధికారిని భట్టభాస్కరుఁడిట్లు నిరూపించెను.

"సేనాపత్యం చ రాజ్యం చ దండనేతృత్వ మేవ చ ।
సర్వలోకాధిపత్యం చ వేదశాస్త్రవి దర్హతి ॥
ఇతిహాసపురాణజ్ఞః పదవాక్యప్రమాణవిత్ ।
అఙ్గోపకారవేదీ చ వేదార్థ జ్ఞాతు మర్హతి ॥"

తైత్తిరీయములోని రుద్రప్రశ్నకుఁ బ్రత్యేకముగా నిద్దఱుమువ్వురు భాష్యములు రచియించిరి గాని వారందఱిపేళ్లు తెలియకున్నవి. ఆ గ్రంథములను దేశమున వ్యాప్తిచెందినవి కావు, ఈ క్రింది శ్లోకమునుబట్టి, అహోబలకవి రుద్రప్రశ్నకు శ్లోకాత్మక భాష్యము రచియించెనని తెలియుచున్నది.

"సంసారసాగరసముత్తరణే ప్రవీణం
శ్రీమా నహోబలమహాకవిరాజరాజః ।
శ్రీరుద్రభాష్యతరు ముజ్జ్వలపద్యరూపం
చక్రే సదాశివకృపాసముపాత్తవిద్యః'

శుక్లయజుర్వేద భాష్యములు :— ఇందు వేదదీపమను భాష్యముత్తమము. ఇది మహీధరాచార్యవిరచితము. కాని దీనికిఁబూర్వము రెండుమూఁడు భాష్యములు కలవు. ఈ వేదదీపము పూర్వోత్తర భాగములందును—

"ప్రణమ్య లక్ష్మీనృహరిం గణేశం భాష్యం విలోక్యౌవటమాధవీయం ।
యజు ర్మనూనాం విలిఖామి చార్థం పరోపకారాయ నిజేక్షణాయ ॥
భాష్యం బుద్ధ్వా సమాలోచ్య మాధవౌవటశాంకరం ।
య న్మయా లిఖితం సంత స్తద్దృష్ట్వా క్షంతు మర్హథ ॥
శ్రీమన్మ హీధరకృతే వేదదీపే మనోహరే ।
వ్యరమ చ్చరమో ఽధ్యాయః పరమాత్మ నిరూపకః"

ఇత్యాదిశ్లోకములు కలవు. వీనినిబట్టి, ఉవటుఁడు మాధవుఁడు శంకరుఁడు ననువారు వాజసనేయిసంహితకు భాష్యములు రచియించిరనియు, ఆ భాష్యములను జూచియే మహీధరుఁడు వేదదీపము వెలయించెననియుఁ దెలియును. పై మువ్వురిలో వజ్రటపుత్రుఁడయిన ఉవటుఁడు శుక్లయజుర్వేదీయ వ్యాఖ్యారచనమునఁ బ్రసిద్ధుఁడు. ఇతఁడు తనవాజసనేయి మంత్రభాష్యమున—

"ఆనందపురవాస్తవ్య వజ్రటాఖ్యస్య సూనునా।
మంత్రభాష్య మిదం క్లృప్తం పదవాక్యైస్సునిశ్చితైః॥
ఋష్యాదీంశ్చ నమస్కృత్య హ్యావన్త్యా ముపటో వసన్।
మంత్రభాష్య మిదం చక్రే భోజే రాజ్యం ప్రశాసతి"

అని వ్రాసికొన్న శ్లోకములనుబట్టి, అవంతీ (ఆనంద) పురవాసి యనియు భోజమహారాజు రాజ్యము చేయుకాలమున ననఁగా. క్రీ. శ. ౧౦౩౦ ప్రాంతమున నీ వేదదీపము రచియించెననియుఁ దెలియుచున్నది. ఇఁక :—

రెండవ భాష్యకర్తయైన మాధవుఁడు సాయణమాధవుఁ డనియు, మూఁడవ యతఁడగు శంకరుఁడు జగద్గురు శంకరాచార్యుఁ డనియు విదితము.[1] ఈ ముగ్గురును నిర్మించిన భాష్యములను జూచిన మహీధరుఁడు వేదదీపము నతి సులభముగాను మిక్కిలి విపులముగాను రచియించెను. ఇది మాధ్యందిన శాఖకు సంబంధించినది.

కాణ్వసంహితకు వేదార్థదీపిక యనుపేర, అనంతాచార్యుఁడు సంపూర్ణ భాష్యము నిర్మించెను. భగీరథినాగదేవభట్టుల పుత్రుఁడును, కాశీనివాసియునగు నీయాచార్యుఁడు సుమారు నూఱు సంవత్సరముల క్రిందటివాఁడు. ఇతఁడు గాక కాణ్వసంహితకు జాతవేదభట్టోపాధ్యాయ పుత్రుఁడగు నానందబోధ భట్టోపాధ్యాయుఁడు మఱియొక భాష్యము రచియించెను.

ఇట్లు పేర్కొన్నసాయణాది పూజ్యపాదుల భాష్యములు గాక చతుర్వేద సంహితలకును గొన్ని బ్రాహ్మణములకును మఱికొందఱు రచియించిన భాష్యములు

1. మాధవ భాష్యము సాయణాచార్య భాష్యమే యనుట నిస్సంశయముకాని, శంకరులు సంహితకు భాష్యము వ్రాసినట్లు కనఁబడదు. వారి బృహదారణ్యకోపనిషద్భాష్యమే మహీధరుఁడు పేర్కొన్నదని తోఁచుచున్నది.

గూడ నముద్రితగ్రంథ పట్టికలందు కనవచ్చుచున్నవి గాని యవి లోకమున వ్యాప్తి చెందినవి కావు.

ఉపనిషద్భాష్యములు :— ఇవియును వీనివృత్తులు టీకలు దీపికలు వివరణములు ననేకము లున్నవి. గ్రంథవిస్తరము గాకుండఁ బ్రధానములైన కొన్నిటిని మాత్రమిందు గ్రహింతము వేద భాష్యములకు సాయణాచార్యులవలెనే వేదాన్త భాష్యములకు శంకరభగవత్పాదులు ప్రసిద్ధికెక్కినరనుట సర్వజగద్విదితము. షణ్మతస్థాపకులను జగద్గురు బిరుదాంకితులు నద్వైతమతాచార్యులునగు శంకరు లద్వైతపరముగా నిర్మించిన యనేక భాష్యములకుఁ దరువాతి వారు బహువిధము లైన వివరణములు రచియించియున్నారు. ఆనందతీర్థులు ద్వైతపరముగా రచియించిన దశోపనిషద్భాష్యములకు మఱికొందఱు వృత్తులు నిర్మించియున్నారు. రంగరామానుజాచార్యాదులు విశిష్టాద్వైత పరముగా, తైత్తిరీయాదులు కొన్ని యుపనిషత్తులకు మాత్రమే వ్యాఖ్యలు నిర్మించిరి. శంకరాచార్యాది ప్రధానపురుషులు రచియించిన భాష్యములన్నియు ముద్రితములై లభించుచున్నవి గాని వాని వివరణాదులనేకములు ముద్రితము లైనట్లు కనఁబడదు.

దశోపనిషత్తులకును జీవేశ్వరా భేదపరముగా భాష్యములు వ్రాసిన శంకరుల వారీశావాస్యము మొదల "ఈశావాస్యమిత్యాది మంత్రములు కర్మవినియుక్తములు కామింజేసి పరమాత్మ ప్రతిపాదకము లగుచున్నవి. ఆత్మయొక్క శుద్ధత్వ దురితదూర త్వైకత్వ నిత్య త్వాశరీరత్వ సర్వగతత్వాది లక్షణముల నీయుపనిషత్తులు నిరూపించుచున్నవి. ఏతాదృశలక్షణములు కర్మవిరుద్ధము లగుటచే నీ మంత్రములకుఁ గర్మలయందు వినియోగము లేకపోవుట యుక్తమేయగుచున్నది." ఇత్యాదిగా వ్రాయుచు నుపనిషత్తులు విజ్ఞానబోధకము లనెడి ముఖ్యాభిప్రాయ మావిష్కరించియున్నారు. మఱియుఁ దమకుఁ బూర్వము వేదాన్తములు వ్యాఖ్యాతములైనను విస్పష్టార్థ ప్రతిపత్తికై గురుప్రసాదము ననే నీ వ్యాఖ్య వ్రాయుచున్నా ననుచు నాచార్యులవారు తైత్తిరీయ భాష్యము మొదల నిట్లు వక్కాణించియున్నారు.

"యైరిమే గురుభిః పూర్వం పదవాక్యప్రమాణతః
వ్యాఖ్యాతా స్సర్వవేదాన్తా స్తాన్నిత్యం ప్రణతో ఽస్మ్యహమ్"

దీనినిబట్టి శంకరభాష్యములకుఁ బూర్వము పూర్వులు రచియించిన యుపనిషద్భాష్యము లున్నవని తెలియవచ్చును. అయినను శంకరులభాష్యము లసమాన

ములై వ్యాపించుటంజేసి యవి యెందో యణఁగిపోయినవి. శంకరాచార్యుని తైత్తిరీయోపనిషద్భాష్యము చూచియే సాయణార్యు లాయుపనిషత్తులకు వ్యాఖ్య రచియించినను, పఠనపాఠ వ్యవహారమున దానికున్న ప్రశస్తి దీనికిలేదనుట స్పష్టము. తైత్తిరీయోప నిషత్తునకు విద్యారణ్యుఁడు చూపిన మార్గము ననుసరించి యొకానొక విద్వాంసుఁడు లఘుదీపిక యనుపేరఁ జిన్న వ్యాఖ్య రచియించినట్లు —

"విద్యారణ్యకృత వ్యాఖ్యాదుగ్ధాబ్ధిం పాతుమక్షమాః
ఏతస్మా దుద్ధృతం సారం తృప్తిదం తే పిబ న్త్వమున్."

అను శ్లోకమునఁ గనవచ్చును. కాని, యీ విద్యారణ్యవ్యాఖ్య సాయణ కృతవ్యాఖ్యకంటె నన్యము కాకపోవుటచే, మాధవాచార్యుఁడే విద్యారణ్యుఁడనెడి ప్రతీతి. చిరకాలము క్రిందటనే బయలుదేఱి స్థిరపడెననుట కీ శ్లోకముగూడఁ నొక ప్రమాణ మగుచున్నది.

జగద్గురువుల తైత్తిరీయోపనిషద్భాష్యమునకు భాష్యవార్తిక మనుపేర వారి శిష్యుఁడగు సురేశ్వరాచార్యుఁడు పద్యయ మయిన పెద్దవ్యాఖ్య రచియించెను. 'ఆనందగిర్యాచార్యులు శంకరతైత్తిరీ యోపనిషద్భాష్యమునకును సురేశ్వరకృత తద్వార్తికమునకును గూడ; టీకలు రచియించెను. వార్తిక టీకాగద్యములఁ గొన్ని చోట్ల 'ఆనందజ్ఞానవిరచితా టికా' యని కనఁబడుచున్నది గాని మంగళాచరణ శ్లోకైక్యమునుబట్టి యీ యానందజ్ఞానుఁ డానందగిరియే యని తెలియుచున్నది. ఆనందజ్ఞానుఁడు శంకరుల బృహదారణ్య కోపనిషద్భాష్యాదులకుఁ గూడ నిట్లే టీకలు వ్రాయుటయు, సురేశ్వరాచార్యులు వార్తికములు వ్రాయుటయుఁ దఱుచుగాఁ గనవచ్చును. శంకరాచార్యులవలెఁ బ్రధానములైన యనేకోపనిషత్తులకు శంకరానందుఁడు దీపికలు రచియించెను. ఈ శంకరానంద భగవత్పాదులు వేదాన్త పంచదశీకారులగు విద్యారణ్యులగురు వేమో యని తోఁచుచున్నది. శంకరానందుల వలెనే నారాయణాశ్రమి గూడ ముండక మాండూక్య బ్రహ్మవిద్యాద్యుపనిషత్తులకు దీపికలనుపేర వ్యాఖ్యలు రచియించెను. శంకరుల పెక్కుభాష్యములకు శివానంద యతి టిప్పణములు నిర్మించెను. తైత్తిరీయాంతర్గతమైన నారాయణమనెడి యాజ్ఞిక్యుపనిషత్తునకు జ్ఞానోత్తమ పూజ్యపాదశిష్యుఁడగు విజ్ఞానాత్ముఁడు గూడ వివరణము నిర్మించెను. ఇతర భాష్యములు చూచినపిదప రచియింపఁబడిన యీ వివరణ మద్వైత జ్ఞానసుఖబోధకమై యున్నది. ఇట్లింక నెందఱేని యుపనిష ద్వ్యాఖ్యలు రచియించిరి గాని శంకరభగవత్పాదు లుద్ధరించిన యద్వైతమును

దన్మార్గ మాశ్రయించి వ్యాఖ్యా వివరణాదుల విస్తరింపఁ జేసినవారిలో సురేశ్వరాచార్యులును, ఆనందగిరిర్యాచార్యులును మిక్కిలి ప్రశంసనీయులగు చున్నారు.

ఈశావాస్యాది ప్రధానోపనిషత్తులకు ద్వైతమతపరముగా భాష్యములు రచియించినవారిలో నగ్రగణ్యు లానందతీర్థులు. మధ్వాచార్యులు పూర్ణప్రజ్ఞుఁడు ననునామాంతరములు గలయీ యానందతీర్థులు మారుతిమూఁడవ యవతారమని యీ క్రింది యితనిమాటలవల్లనే తెలియుచున్నది.

"మధ్వ ఆనందతీర్థ స్స్యాత్ తృతీయా మారుతీతనుః
ఆనందతీర్థ ఇతితు యస్య నామ తృతీయకమ్
పూర్ణప్రజ్ఞేన తే నేదం కృతం భాష్యం హరేః ప్రియమ్."1

ఆనందతీర్థుల భాష్యములలో నీశావాస్యాదికతిపయ భాష్యములకు జయతీర్థభిక్షువును, ఐతరేయాది భాష్యములు కొన్నిటికి విశ్వేశ్వరతీర్థులును, నరసింహయతి, కృష్ణాచార్యాదులును, కఠాది భాష్యములు కొన్నిటికి వ్యాసతీర్థ, వేదేశభిక్షు శ్రీనివాసాచార్యులును, టీకా వివరణాదులు రచియించిరి. ఛాందోగ్య మాండూక్యాదులు కొన్నిటి కానందతీర్థుల భాష్యములుగాక రాఘవేంద్రయతి రచియించిన యర్థ సంగ్రహములు గూడ వేఱుగా నున్నవి. శ్రీనివాసాచార్యుని తైత్తిరీయోప నిషద్భాష్య టీకావతారికనుబట్టి విద్యాధి రాజాది మునీంద్రులు మఱికొందఱు ఛాందోగ్యాదులకు భాష్యములు నిర్మించినట్లు కనఁబడుచున్నది.

రఘూత్తమయతి, బృహదారణ్యక భాష్యమునకు టీక వ్రాయుచు, "ఈ కాణ్వోపనిషత్తునకుఁ గొంద ఱన్యథా వ్యాఖ్యానములు రచియించియుండుట కనిపెట్టి యిందలితత్త్వము వెల్లడింప నానందతీర్థులు తొలుత భాష్యమురచియించిరి. ఇందలి ప్రౌఢిమను బ్రకాశింపఁ జేయుటకై నే నీ పరబ్రహ్మ ప్రకాశికయను వృత్తి రచియించుచున్నాను' అని వక్కాణించి, ద్వైతవేదాన్త భాష్యవివరణమున నానందతీర్థులమత మావిష్కరించినవారిలో జయతీర్థుని, అతనిశిష్యుఁడగు వ్యాసతీర్థునిమిక్కిలి ప్రశంసించియున్నాఁడు. ఇట్లున్న వివిధ వివరణాదులు చూడద్వైతపరమైన యుపనిషన్మత ముద్ధరించిన యాద్యముని యానందతీర్థులని విదితమగును. ఇతఁడు త్రిమతాచార్యులలో నొకఁడు. శంకరాచార్యుల కర్వాచీనుఁడు. ఇంక—

1. ఛాం. ఉ. భా. అవతారిక.

విశిష్టాద్వైత మతపరముగా. తైత్తిరీయ బృహదారణ్యకాద్యుపనిషత్తులు కొన్నిటికి వ్యాఖ్యలు రచియించినవారిలో గణనీయుఁడు రంగరామానుజాచార్యులు. ఇతఁడు వాత్స్యవరదాచార్య పరకాలము నీంద్రులశిష్యుఁడు. కాంచీపురవాసి. విశిష్టాద్వైతమతోద్ధారకులగు రామానుజాచార్యుల సూత్రభాష్యము చక్కఁగాఁ బఠించి, సూత్రభాష్యోపయుక్తోపనిషద్వాక్య వివరణము రచియించిన పండితోత్తముఁడు. ఇతని భాష్యములుగూడ దేశమునఁ బఠనపాఠ వ్యవహారమునఁ బ్రసిద్ధములై యున్నవి.

ఇది

శ్రీ హరితసగోత్రాపస్తంబసూత్రాధీతసకలతంత్ర రామస్వామిశాస్త్రి పౌత్రుండును
వేదవేదాన్తజ్ఞాని శ్రీరామావధాని పుత్రుండును, శబ్దతర్కాద్వైతాచార్య
చర్ల బ్రహ్మశాస్త్రి ప్రియశిష్యుండును, ఆంధ్రవిశ్వకలాపరిషత్కళా
శాలా సంస్కృతాంధ్రాధ్యాపకుండు నగు మల్లాది సూర్య
నారాయణశాస్త్రి రచియించిన సంస్కృతవాఙ్మయ
చరిత్ర ప్రథమభాగమగు వైదిక వాఙ్మయ
చరితయందలి నవమాధ్యాయము
సర్వము.

ఓంతత్సత్ - పరబ్రహ్మార్పణమస్తు.

అనుబంధము - 1

ఋగ్వేదఋషి సూక్తపట్టిక

ఋషి సంఖ్య	ఋషుల పేర్లు	వారిసూక్తముల సంఖ్య
	1. మండలము. 191 సూక్తములు.	
* 1.	మధుచ్ఛందసుఁడు (విశ్వామిత్ర సుతుఁడు)	1-10
2.	జేత (మాధుచ్ఛందసుఁడు)	11
3.	మేధాతిథి(కణ్వపుత్రుఁడు)	12-23
4.	శునశ్శేపుడు (అజీగర్త సుతుఁడు, తరువాత విశ్వామిత్రుని కృత్రిమసుతుఁడై దేవరాతుడనఁబడెను.	24-30
5.	హిరణ్యస్తూపుఁడు (ఆంగిరసుఁడు)	31-35
6.	కణ్వుఁడు (ఘోరుని పుత్రుఁడు)	36-43
7.	ప్రస్కణ్వుఁడు (కణ్వపుత్రుఁడు)	44-50
8.	సవ్యుఁడు (ఆంగిరసుఁడు)	51-57
9.	నోధసుఁడు (గౌతముఁడు)	58-64
10.	పరాశరుఁడు (శక్తిపుత్రుఁడు)	65-73
11.	గోతముఁడు (రహూగణుని సుతుడు)	74-93
12	కుత్సుఁడు (ఆంగిరసుఁడు)	94-98
13.	కశ్యపుఁడు (మరీచిపుత్రుఁడు)	99
14.	ఋజ్రాశ్వుడు (వృషగిరోరాజ పుత్రుఁడు)	100
15.	అంబరీషుఁడు వృషగిరోరాజ పుత్రుఁడు	100
16.	సహదేవుఁడు (వృషగిరోరాజ పుత్రుఁడు.	100
17.	భయమానుఁడు (వృషగిరోరాజ పుత్రుఁడు	100
18	సురాధసుఁడు (వృషగిరోరాజ పుత్రుఁడు.	100
	§ కుత్సుఁడు (ఆంగిరసుఁడు)	101-104
19.	త్రితుఁడుకాని (ఆప్త్యుడు) కుత్సుఁడుకాని (ఆంగిరసుఁడు)	105

* ౧-౧౦ ఇట్లు రెండంకెలున్నచో వాని మధ్యనున్న సూక్తము లన్నియు గ్రాహ్యములు.

౧౧. ఇట్లొకటి మాత్రమున్నచో అన్నవ సూక్తమని గ్రహింపఁదగును.

౧౩, ౧౪. ఇట్లున్నచో వరుసగా, ఆ రెండుసూక్తములేయని తెలియువది,

§ ఎన్నిచోట్లనతని పేరువచ్చినను, ఒక గోత్రములోని సూక్తద్రష్ట యొక్క మాటు మాత్రమే గణింపఁబడును.

ఋషి సంఖ్య	ఋషుల పేర్లు	వారిసూక్తముల సంఖ్య
	—కుత్సుడు (అంగిరసుడు)	106-115
20.	కక్షీవంతుడు (ఉశిక్దీర్ఘతమస్సులకొడుకు*)	116-125
21.	భావయవ్యుడు (రాజర్షి)	126
22	రోమశ (అతనిభార్య)	126
23.	పరుచ్ఛేపుడు (దివోదాసపుత్రుడు)	127-139
24	దీర్ఘతముడు (ఉచథ్యపుత్రుడు)	140-164
25.	ఇంద్రుడు	165
26	అగస్త్యుడు	165
27.	మరుత్తులు	165
	—అగస్త్యుడు	166-169
	—ఇంద్రుడు	170
	—అగస్త్యుడు	171-178
27.	అగస్త్యుడు	179
28.	లోపాముద్ర అగస్త్యపత్ని.	180-191
29.	బ్రహ్మచారి అగస్త్యశిష్యుడు.	180-191
	—అగస్త్యుడు	180-191

2. మండలము 43 సూక్తములు.

ఋషి సంఖ్య	ఋషుల పేర్లు	వారిసూక్తముల సంఖ్య
30.	శౌనకుడు—ఇతడే శౌనహోత్రుడను గృత్సమదుడు.	1
	—గృత్సమదుడు	2-3
31.	సోమాహుతి (భార్గవుడు)	4-7
	—గృత్సమదుడు	9-26
33.	కూర్ముడు (గృత్సమదపుత్రుడు)	27-29
	—గృత్సమదుడు	30-43

3. మండలము. 62 సూక్తములు.

ఋషి సంఖ్య	ఋషుల పేర్లు	వారిసూక్తముల సంఖ్య
33.	విశ్వామిత్రుడు (గాథిసుతుడు)	1-12
34	ఋషభుడు (వైశ్వామిత్రుడు)	13-14
35.	ఉత్కీలుడు (కతగోత్రజుడు)	15-16
36.	కతుడు (వైశ్వామిత్రుడు)	17-18
37.	గాథి (కుశిక పుత్రుడు)	19-22
38	దేవశ్రవుడు (భరతపుత్రులు)—	23
39.	దేవరాతుడు ,,	23
	—విశ్వామిత్రుడు	24-30
40	కుశికుడు (ఇషీరథపుత్రుడు)	31
	—విశ్వామిత్రుడు (గాథినుడు)	31
	—విశ్వామిత్రుడు	32-35
41.	ఘోరుడు (అంగిరసుడు)	36
	—విశ్వామిత్రుడు	36
	—విశ్వామిత్రుడు	37
42	ప్రజాపతి (విశ్వామిత్రపుత్రుడో, వాక్పుత్రుడో)	38
	—విశ్వామిత్రుడు	37-53
	—ప్రజాపతి (వాచ్యుడో వైశ్వామిత్రుడో)	54-56
	—విశ్వామిత్రుడు	57-61
43.	విశ్వామిత్రుడు	62
	జమదగ్ని	62

* 'ఉశిక్' అనునది, అంగరాజ మహిషయొక్క దాసి.

ఋషి సంఖ్య	ఋషుల పేర్లు	వారిసూక్తముల సంఖ్య

4. మండలము. 58 సూక్తములు.

44.	వామదేవుఁడు (గౌతముఁడు)	1-17
44.	వామదేవుఁడు	
	ఇంద్రుఁడు	
	అదితి	18
	—వామదేవుఁడు	19-41
45.	త్రసదస్యుఁడు (పురుకుత్స పుత్రుఁడు రాజర్షి)	42
47.	అజామీఢుఁడు	43,44
48.	పురుమీఢుఁడు (సుహోత్రపుత్రులు	43,44
	వామదేవుఁడు	45-5

5. మండలము 87 సూక్తములు.

49.	బుధుఁడు (అత్రిపుత్రుడు)	1
50.	గవిష్ఠిరుఁడు ,,	1
51.	కుమారుఁడు (ఆత్రేయుఁడు)	2
52.	వృశుఁడు (జనపుత్రుఁడు)	2
53.	వసుశ్రుతుఁడు (ఆత్రేయుఁడు)	3-6
54.	ఇషుఁడు (ఆత్రేయుఁడు)	7,8
55.	గయుఁడు ఆత్రేయుఁడు)	9-10
56.	సుతంభరుఁడు (ఆత్రేయుఁడు)	11-14
57.	ధరుణుఁడు (అంగిరసుఁడు)	15
58.	పురువు (ఆత్రేయుఁడు)	16,17
59	ద్వితుఁడు (ఆత్రేయుఁడు)	18
60.	వవ్రి (ఆత్రేయుఁడు)	19
61.	ప్రయస్వంతులు (ఆత్రేయులు)	20
62.	వసుఁడు (ఆత్రేయుఁడు)	21
63.	విశ్వసాముఁడు (ఆత్రేయుఁడు)	22
64.	ద్యుమ్నుఁడు (విశ్వచర్షణి)	23
65.	సుబంధువు గౌపాయనులు లేక, లౌపాయనులు.	24
66.	శ్రుతబంధువు ,,	24
67.	విప్రబంధువు ,,	24
68	బంధువు ,,	24
69.	వసూయులు (ఆత్రేయులు)	25,26
70.	త్ర్యరుణుఁడు (త్రివృష్ణుఁడు)	27
71.	త్రసదస్యుఁడు (పురుకుత్సుఁడు)	27
72.	అశ్వమేధుఁడు (భరతుఁడు)	27
73.	అత్రి (భౌముఁడు)	27
74.	విశ్వవార (అత్రిపుత్రి)	28
75	గౌరివీతి (శక్తిపుత్రుఁడు)	29
76	బభ్రువు (ఆత్రేయుఁడు)	30
77.	అవస్యువు (ఆత్రేయుఁడు)	31
78.	గాతువు (ఆత్రేయుఁడు)	32
79.	సంవరణుఁడు (ప్రజాపతి పుత్రుఁడు)	33,34
80.	ప్రభూవసువు (అంగిరసుఁడు)	35-36
81.	అత్రి (భౌముఁడు)	37,43
82.	అవత్సారుఁడు (కాశ్యపుఁడు)	44
83.	సదాపృణుఁడు (ఆత్రేయుఁడు)	45
84.	ప్రతిక్షత్రుఁడు ,,	46
85.	ప్రతిరథుఁడు ,,	47
86.	ప్రతిభానువు ,,	48
87.	ప్రతిప్రభుఁడు ,,	49

ఋషి సంఖ్య	ఋషుల పేళ్లు	వారిసూక్తముల సంఖ్య
88.	స్వస్తి ,,	50 51
89	శ్యావాశ్వుఁడు ,,	52-61
90.	శ్రుతవిత్తు ,,	62
91.	అర్చనానుఁడు ,,	63-64
92.	రాతహవ్యుఁడు ,,	65,66
93.	యజతుఁడు ,,	67,68
94.	ఉరుభక్రి ,,	69,70
95.	బాహువృక్తుఁడు ,,	71,72
96.	పౌరుఁడు ,,	73,74
	అవస్యువు ,,	75
	అత్రి (భౌముఁడు)	76,77
97.	సప్తవధ్రి (ఆత్రేయుఁడు)	78
98.	సత్యశ్రవుఁడు ,,	79,80
	శ్యావాశ్వుఁడు ,,	81,82
	అత్రి (భౌముఁడు)	83,86
99.	ఏవయామరుత్తు (ఆత్రేయుఁడు)	87

6 మండలము 75 సూక్తములు.

ఋషి సంఖ్య	ఋషుల పేళ్లు	వారిసూక్తముల సంఖ్య
100.	భరద్వాజుఁడు (బృహస్పతి పుత్రుఁడు)	1-4
101.	వీతహవ్యుఁడు (భారద్వాజుఁడు) *	15
	భరద్వాజుఁడు	16-30
102.	సుహోత్రుఁడు (భారద్వాజుఁడు)	31-32
103.	శునహోత్రుఁడు ,,	33-34
104.	నరుఁడు ,,	35-36
	భరద్వాజుఁడు	37-43
105.	శంయువు (బృహస్పతిజుఁడు)	44-46
106.	గర్గుఁడు (భారద్వాజుఁడు)	47
107.	శంయువు (బృహస్పతిసుతుఁడు)	48
108.	ఋజిశ్వుఁడు § (భారద్వాజుఁడు)	49-52
	భరద్వాజుఁడు	53-74
109.	పాయువు (భారద్వాజుఁడు)	75

7 మండలము 104 సూక్తములు

ఋషి సంఖ్య	ఋషుల పేళ్లు	వారిసూక్తముల సంఖ్య
110.	వసిష్ఠుఁడు (మైత్రావరుణుఁడు)	1-104
111.	శక్తి (వాసిష్ఠుఁడు)	
	వసిష్ఠుఁడు	32
	వసిష్ఠ పుత్రులు-వసిష్ఠుఁడు	33
112.	కుమారుఁడు (అగ్ని పుత్రుఁడు) వసిష్ఠుఁడు ↑	102

8 మండలము 103 సూక్తములు.

ఋషి సంఖ్య	ఋషుల పేళ్లు	వారిసూక్తముల సంఖ్య
113.	ప్రగాథుఁడు (ఇతఁడుఘోర పుత్రుఁడు, తరువాత భ్రాతయైన కణ్వునకుఁ బుత్రప్రాయుఁడై కాణ్వుఁడయ్యెను)	1
114.	మేధాతిథి (కణ్వపుత్రులు)	1
115.	మేధ్యాతిథి ,,	1
116.	అసంగుఁడు (ప్లయోగుని పుత్రుఁడు, రాజర్షి)	1

* అంగిరసుఁడని బృహద్దేవతామతము.

§ ఇతఁడు బృహస్పతి పౌత్రుఁడని బృహద్దేవత.

↑ ౧౦-౨౮, సూక్తములో, ఇతఁడుకూడనుండెనని బృహద్దేవతాదులు.

ఋషి సంఖ్య	ఋషుల పేర్లు	వారిసూక్తముల సంఖ్య
171.	శశ్వతి (ఆసంగుని భార్య అంగిరసుని పుత్రి)	1
118.	ప్రియమేధుఁడు (అంగిరసుఁడు)	2
	మేధాతిథి (కాణ్వుఁడు)	2
	మేధాతిథి ,,	3
119.	దేవాతిథి ,,	4
120.	బ్రహ్మాతిథి ,,	5
121.	వత్సుఁడు ,,	6
122.	పునర్వత్సుఁడు ,,	7
123.	సధ్వంసుఁడు ,,	8
124.	శశకర్ణుఁడు ,,	9
	ప్రగాథుఁడు ,,	10
	వత్సుఁడు ,,	11
125.	పర్వతుఁడు ,,	12
126	నారదుఁడు ,,	13
127.	గోషూక్తి ,,	14,15
128.	అశ్వసూక్తి ,,	14,15
129.	ఇరింబిటి ,,	16-18
130.	సోభరి ,,	19-22
131.	విశ్వమనస్సు (వ్యశ్వపుత్రుఁడు)	23-25
132.	వ్యశ్వుఁడు (అంగిరసుఁడు)	26
	విశ్వమనస్సు (వైయశ్వుఁడు)	26
133.	మనువు (వైవస్వతుఁడు)	27-28
	కశ్యపుఁడు (మారీచుఁడు)	29
	మనువు (వైవస్వతుఁడు)	29
	మనువు ,,	30 31
	మేధాతిథి (కాణ్వుఁడు)	32
	మేధ్యాతిథి ,,	33
134.	నీపాతిథి ,,	34
135.	వసురోచులు (ఆంగిరసులు) వేయిమంది	34
	శ్యావాశ్వుఁడు (ఆత్రేయుఁడు)	35-38
136.	నాభాకుఁడు (కాణ్వుఁడు)	39-41
	అర్చనానుఁడు (కాణ్వులు)	42
	నాభాకుఁడు ,,	42
137.	విరూపుఁడు (ఆంగిరసుఁడు)	43,44
138.	త్రిశోకుఁడు (కాణ్వుఁడు)	45
139.	వశుఁడు (అశ్వపుత్రుఁడు)	46
	త్రితుఁడు (ఆప్త్యుఁడు)	47
	ప్రగాథుఁడు (కాణ్వుఁడు)	48
	ప్రస్కణ్వుఁడు (కాణ్వుఁడు)*	49
140.	పుష్టిగురు ,,	50
141.	శ్రుష్టిగువు ,,	51
142.	ఆయువు ,,	52
143.	మేధ్యుఁడు ,,	53
144.	మాతరిశ్వుఁడు ,,	54
145.	కృశుఁడు ,,	55
146.	వృషధ్రుఁడు ,,	56
	మేధ్యుఁడు ,,	57,58
147	సుపర్ణుఁడు ,,	* 59

* * ఈ పువ్వుల నడుమనున్న ౧౧ సూక్తములు వాలఖిల్యములనఁబడును. సాయణులు వీనికి భాష్యము వ్రాయలేదు, ఋషినిరూపణము చేయలేదు. కాత్యాయనుని సర్వానుక్రమణికకు వ్యాఖ్యవ్రాసిన షడ్గురుశిష్యుఁడును వీనిమాట యెత్తలేదు. తదనుక్రమణికా వివరణములో జగన్నాథుఁడు వీనికి ఋషులు వీరని తెలిపి యున్నాఁడు, ఈ ౧౧ కలిపినపుడే, అష్టమమండల సూక్తములు ౧౦౩ అగుచున్నవి.

ఋషి సంఖ్య	ఋషుల పేర్లు	వారిసూక్తముల సంఖ్య
148	భర్గుఁడు (ప్రగాథపుత్రుఁడు)	60,61
	ప్రగాథుఁడు (కాణ్వుఁడు)	62-65
149.	కలి (ప్రగాథసుతుఁడు)	66
150.	మాన్యుఁడు (మైత్రావరుణి)	67
151.	మత్స్యముని (సాంమదుఁడు)	67
	అతని సహచరులు	67
	ప్రియమేధుఁడు (అంగిరసుఁడు)	68,69
152.	పురుహన్మఁడు (అంగిరసుఁడు)	70
153.	సుదీతి	71
154.	పురుమీల్హుఁడు	71
155.	హర్యతుఁడు (ప్రగాథసుతుఁడు)	72
	సప్తవధ్రి (అత్రేయులు)	73
156.	గోపవనుఁడు ,,	73
	గోపవనుఁడు ,,	74
	విరూపుఁడు (అంగిరసుఁడు)	75
157.	కురుసుతి (కాణ్వుఁడు)	76-77
158.	కృత్స్నువు (భృగుసుతుఁడు)	79
259.	ఏకద్యూవు (నౌధసుఁడు)	80
160.	కుసీదుఁడు (కాణ్వుఁడు)	81-83
161.	ఉశనసుఁడు (కవిపుత్రుఁడు)	84
162.	కృష్ణుఁడు (అంగిరసుఁడు)	85
163	విశ్వకుఁడు (కృష్ణపుత్రుఁడు)	86
	కృష్ణుఁడు (అంగిరసుఁడు)	86
164.	దుమ్నీకుఁడు (వాసిష్ఠుఁడు	
	కృష్ణుఁడు (అంగిరసుఁడు)	
	ప్రియమేధుఁడు	87
	నోధసుఁడు (గౌతముఁడు)	88
165.	నృమేధుఁడు (అంగిరసులు)	89-90
166.	పురుమేధుఁడు ,,	89-90
167.	అపాల (అత్రికూఁతురు)	91
168.	శ్రుతకక్షుఁడు (అంగిరసులు)	92
169.	సుకక్షుఁడు ,,	92
	సుకక్షుఁడు ,,	92
170.	బిందువు (అంగిరసులు)	94
171.	పూతదక్షుఁడు ,,	94
172.	తిరశ్చిషుఁడు ,,	95
	తిరశ్చిషుఁడు ,,	95
173.	ద్యుతానుఁడు (మారుతుఁడు)	96
174.	రేభుఁడు (కాశ్యపుఁడు)	97
	నృమేధుఁడు (అంగిరసుఁడు)	98-99
175.	నేముఁడు (భృగుపుత్రుఁడు)	100
	ఇంద్రుఁడు ,,	100
	జమదగ్ని (భార్గవుఁడు)	101
176.	ప్రయోగుఁడు ,,	
177.	అగ్ని (బృహస్పతిపుత్రుఁడు)	
178.	గృహపతి (సహఃపుత్రులు అగ్నిసంజ్ఞులు)	102
179.	యవిష్ఠుఁడు ,,	102
	సౌభరి. (కాణ్వుఁడు)	103

9 మండలము. 114 సూక్తములు.

ఋషి సంఖ్య	ఋషుల పేర్లు	వారిసూక్తముల సంఖ్య
	మధుచ్ఛందసుఁడు (వైశ్వామిత్రుఁడు)	1
	మేధాతిథి. (కాణ్వుఁడు)	2
	శునశ్శేపుఁడు. (అజీగర్తి)	3
	హిరణ్యస్తూపుఁడు (అంగిరసుఁడు)	4
180.	అసితుఁడు కాశ్యపులు	5-24
181.	దేవలుఁడు ,,	5-24

ఋషి సంఖ్య	ఋషుల పేళ్లు	వారిసూక్తముల సంఖ్య
182.	దృఢచ్యుతుఁడు (అగస్త్యుఁడు)	25
183.	ఇధ్మవాహుఁడు (దృఢచ్యుత సుతుఁడు)	26
	నృమేధుఁడు (ఆంగిరసుఁడు)	27
	ప్రియమేధుఁడు ,,	28
	మేధుఁడు ,,	29
	బిందువు ,,	30
	గోతముఁడు (రాహూగణుఁడు)	31
	శ్యావాశ్వుఁడు (ఆత్రేయుఁడు)	32
	త్రితుఁడు (ఆప్త్యుఁడు)	33,34
184.	ప్రభూవసువు (ఆంగిరసుఁడు)	35.36
185.	రహూగణుఁడు ,,	37,38
186.	బృహన్మతి ,,	39,40
	మేధ్యాతిథి (కాణ్వుఁడు)	41-43
	అయాస్యుఁడు (ఆంగిరసుఁడు)	44-46
187.	కవి (భృగుపుత్రుఁడు)	47-49
188.	ఉచథ్యుఁడు (ఆంగిరసుఁడు)	50-52
	అవత్సారుఁడు (కాశ్యపుఁడు)	53-60
189.	అమహీయుఁడు (ఆంగిరసుఁడు)	61
	జమదగ్ని (భృగుసుతుఁడు)	62

ఋషి సంఖ్య	ఋషుల పేళ్లు	వారిసూక్తముల సంఖ్య
190.	నిధ్రువి (కాశ్యపుఁడు)	63
	కశ్యపుఁడు (మారీచుఁడు)	64
	జమదగ్ని (భృగుపుత్రుఁడు)	65
	భృగువు (వరుణపుత్రుఁడు)	65
191.	వైఖానసులు (వందమంది)	66
	భరద్వాజుఁడు (వీరి తండ్రుల కశ్యపుఁడు-నామము *గోతముఁడు - లింతకుమున్నే వ్రాయఁబడినవి.) అత్రి విశ్వామిత్రుఁడు జమదగ్ని వసిష్ఠుఁడు-అనుసప్తర్షులు.	67
192.	పవిత్రుఁడు (ఆంగిరసుఁడు)	67
193.	వత్సప్రి (భలందనసుతుఁడు)	68
	హిరణ్యస్తూపుఁడు.	69
194.	రేణువు (వైశ్వామిత్రుఁడు)	70
195.	ఋషభుఁడు ,,	71
196.	హరిమంతుఁడు (ఆంగిరసుఁడు)	72
	పవిత్రుఁడు ,,	73
	కక్షీవంతుఁడు (దైర్ఘతమసుఁడు)	74
	కవి (భార్గవుఁడు)	75-79
197.	వసువు (భారద్వాజుఁడు)	80-82
	పవిత్రుఁడు.	83
198.	ప్రజాపతి (వాచ్యుఁడు)	84
199.	వేనుఁడు (భార్గవుఁడు)	85
200.	అకృష్టులు. లేక మాషులు.	86
201.	సికతులు లేక. నివావరులు	86
202.	పృశ్నులు లేక, అజులు అను పేళ్ళుగల ఋషిగణములు*	86

* సప్తర్షుల లెక్క రెండు విధములుగా నున్నది. అందు గౌతముని గణించుట కలదు.

ఋగ్వేదమున నతని తండ్రి గోతముఁడు గణింపఁబడుచున్నాఁడు.

↑ గణాత్రయోఽమీ కథితాశ్చతుర్థ మేషాంతుగోత్రం క్వచిద ప్రసిద్ధమ్. బృహ దేవత పుట 264.

ఋషి సంఖ్య	ఋషుల పేర్లు	వారిసూక్తముల సంఖ్య
	—త్ర్యరుణుఁడు (రాజర్షి)	110
	—త్రసదస్యుఁడు ,,	110
229.	అనానతుఁడు (పరుచ్ఛేప పుత్రుఁడు)	111
230.	శిశువు (అంగిరసుఁడు)	112
	—కశ్యపుఁడు (మారీచుఁడు)	113,114

10 మండలము 191 సూ.

ఋషి సంఖ్య	ఋషుల పేర్లు	వారిసూక్తముల సంఖ్య
	త్రితుఁడు (ఆప్త్యుఁడు)	1-7
231.	త్రిశిరుఁడు (త్వష్టకొడుకు)	8
	—త్రిశిరుఁడు ,,	9
232.	సింధుద్వీపుఁడు (అంబరీష పుత్రుఁడు)	9
	—యముఁడు వైవస్వతుఁడు	10
233.	యమి వైవస్వతి	10
234.	హవిర్ధానుఁడు (అంగపుత్రుడు)	11,12
235.	వివస్వంతుఁడు (అదితిజుఁడు)	13
	—యముఁడు	14
236.	శంఖుఁడు (యమపుత్రుఁడు)	15
	—దమనుఁడు ,,	16
237.	దేవశ్రవుఁడు ,,	17
238.	సంకుసుఁడు ,,	18
239.	మథితుఁడు ,,	19
	—భృగువు (వారుణి)	19
140.	చ్యవనుఁడు (భార్గవుఁడు)	19
241.	వసుకృత్తు (వసుక్రపుత్రుఁడు)	
242.	విమదుఁడు (ప్రజాపతి పుత్రుఁడో ఇంద్రపుత్రుఁడో)	20,26
243.	వసుక్రుఁడు (ఇంద్రపుత్త్రుఁడు)	27
	—ఇంద్రుఁడు	28
	—వసుక్రుఁడు	28
	—వసుక్రుఁడు	29
244.	కవషుఁడు (ఇలూష పుత్రుఁడు)	30-33
	—కవషుఁడు—లేక,	34
245.	అక్షుఁడు (ముజవత్పుత్రుఁడు)	34
246.	లుశుఁడు (ధానాకపుత్రుఁడు)	35,36
247.	అభితపుఁడు (సూర్యపుత్రుఁడు)	37
248	ఇంద్రముని (ముష్కవంతుఁడు)	38
249.	ఘోష—(కక్షీవత్పుత్రి)	39,40
250	సుహస్త్యుఁడు (ఘోషాపుత్రుఁడు)	41
	—కృష్ణుఁడు (ఆంగిరసుఁడు)	42,44
	—వత్సప్రి (భలందనసుతుఁడు)	45,46
251.	సప్తగుఁడు (ఆంగిరసుఁడు)	47
252.	ఇంద్రుఁడు (వైకుంఠుఁడు)	48,50
253.	అగ్ని (సౌచికుఁడు)	51,53
	దేవతలు	51,53
254.	బృహదుక్థుఁడు (వామదేవ్యుఁడు)	54-56
	—శ్రుతబంధువు గౌపాయనుఁడు	57
	—బంధువు ,,	57
	—సుబంధువు ,,	59
	—విప్రబంధువు ,,	59
	—శ్రుతబంధ్వాదులు నలుగురు	60
255.	ఇషా మాత (అగస్త్యస్వస)	60
256	నాభా నేదిష్ఠుఁడు (మనుగోత్రుఁడు)	61,62

ఋషి సంఖ్య	ఋషుల పేళ్లు	వారిసూక్తముల సంఖ్య
257.	గయుఁడు (ప్లుతిపుత్రుఁడు)	63,64
258.	వసుకర్ణుఁడు (వాసుక్రుఁడు)	65-66
	—అయాస్యుఁడు (ఆంగిరసుఁడు)	67-68
259.	సుమిత్రుఁడు (వధ్ర్యశ్వుఁడు)	69-70
	—బృహస్పతి (ఆంగిరసుఁడు)	71
	బృహస్పతికాని ,,	72
260.	బృహస్పతి (లోకపుత్రుఁడుకాని)	72
261.	అదితి (దక్షపుత్రి) కాని	72
	—గౌరివీతి (శాక్త్యుఁడు)	73-74
262.	సింధుక్షిత్తు (ప్రియమేధపుత్రుఁడు)	75
263	జరత్కర్ణుఁడు (ఇరావత్పుత్రుఁడు)	76
264	స్యూమరశ్మి (భృగుపుత్రుఁడు)	77,78
	—అగ్ని (సౌచికుఁడుకాని)	79
265.	అగ్ని (వైశ్వానరుఁడుకాని)	79
266.	సప్తి (వాజంభర పుత్రుఁడుకాని)	79
267.	వైశ్వానరుఁడు (సౌచీకుఁడు)	80
268.	విశ్వకర్మ (భువన పుత్రుఁడు)	81-82
269.	మన్యువు (తపోనామర్షి పుత్రుఁడు)	83-84
270.	సూర్య (సవితృనామర్షిపుత్రి)	85
271.	వృషాకపి (ఇంద్రపుత్రుఁడు)	86
272.	ఇంద్రాణి (ఇంద్రభార్య)	86
	—ఇంద్రుఁడు	86
	—పాయువు (భారద్వాజుఁడు)	87
273.	మూర్ధన్వానుఁడు (ఆంగిరసుఁడో వామదేవ్యుఁడో)	88
274	రేణువు (వైశ్వామిత్రుఁడు)	89
275.	నారాయణ మహర్షి	90
276	అరుణుఁడు (వీతహవ్యుఁడు)	91
277.	శార్యాతుఁడు (మనుపుత్రుఁడు)	92
278	తాన్వుఁడు (పృథుపుత్రుఁడు)	93
279.	అర్బుదుఁడు (కద్రూపుత్రుఁడు)	94
280.	ఊర్వశి (అప్సరస)	95
281.	పురూరవుఁడు (ఇలాపుత్రుఁడు)	95
282.	బరుఁడు (ఆంగిరసుఁడో)	96
283.	సర్వహరి ఇంద్రపుత్రుఁడో	96
284.	భిషక్కు (అథర్వపుత్రుఁడు)	97
285.	దేవాపి (ఋష్టిషేణపుత్రుఁడు)	98
286.	వమ్రుఁడు (వైఖానసుఁడు)	99
287.	దువస్యువు (వందనర్షి పుత్రుఁడు)	100
288.	బుధుఁడు (సోమపుత్రుఁడు)	101
289.	ముద్గలుఁడు (భర్మ్యశ్వసుతుఁడు)	102
290.	అప్రతిరథుఁడు (ఐంద్రుఁడు)	103
291.	అష్టకుఁడు (వైశ్వామిత్రుఁడు)	104
292.	దుర్మిత్రుఁడను సుమిత్రుఁడు (ఐంద్రకుత్సపుత్రుఁడు)	105
293.	భూతాంశుఁడు (కశ్యపసుతుఁడు)	106
294.	దివ్యుఁడు (ఆంగిరసుఁడు)	107

ఋషి సంఖ్య	ఋషుల పేళ్లు	వారిసూక్తముల సంఖ్య
295.	దక్షిణ (ప్రజాపతికూఁతురు)	107
296.	సరమ (దేవశుని)	108
297.	పణినామకాసురుడు	108
298.	* జుహూదేవి (బ్రహ్మవాదిని)	109
299.	ఊర్ధ్వనాభు డు (బ్రహ్మసుతుడు)	109
	—జమదగ్ని - భార్గవుఁడు కాని	110
300.	రాముఁడు-జామదగ్న్యుఁడు కాని	
301.	అష్టాదంష్ట్రుఁడు (విరూపసుఁడు)	111
302.	నభఃప్రభేదనుఁడు (విరూపసుతుఁడు)	112
303.	శతప్రభేదనుఁడు (విరూపసుతుఁడు)	113
304.	సధ్రి (విరూపసుతుఁడు)	
305.	ధర్ముఁడు (తపఃపుత్రుఁడు)	114
306.	ఉపస్తుతుఁడు (వృష్టిహవ్యపుత్రుఁడు)	115
307.	అగ్నియుతుఁడో (స్థూరపుత్రుఁడు)	116
308.	అగ్నియూపుఁడో ,,	116
309.	ధ్రువు (అంగిరసుఁడు)	117
310.	ఉరుక్షయుఁడు (అహమీయు సుతుఁడు)	118
311.	లవుఁడు (ఇంద్రసుతుఁడు)	119
312.	బృహద్దివుఁడు (అథర్వపుత్రుఁడు)	120
313.	హిరణ్యగర్భుఁడు (ప్రజాపతిసుతుఁడు)	121
314.	చిత్రమహుఁడు (వాసిష్ఠుఁడు)	122
	—వేనుఁడు (భృగుసుతుఁడు)	123
	అగ్నిఋషి	124
315.	వరుణుఁడు	124
316.	సోముఁడు	124
317.	వాగ్దేవి (అంభృణర్షిపుత్రి)	125
318.	కుల్మలబర్హిషుఁడు (శైలూషపుత్రు)	126
319	అంహోముఙ్ముని (వామదేవ్యుఁడు)	126
320.	కుశికుఁడు (సౌభరపుత్రుఁడు)	128
321,	రాత్రిదేవి (భరద్వాజపుత్రి)	129
322.	విహవ్యుఁడు (అంగిరసుఁడు)	128
323.	పరమేష్ఠియనుప్రజాపతి	129
324.	యజ్ఞుఁడు (ప్రాజాపత్యుఁడు)	130
325.	సుకీర్తి (కక్షీవత్పుత్రుఁడు)	131
326.	శాకపూతుఁడు (నృమేధపుత్రుఁడు)	132
327.	సుదసుఁడు (పిజవనసుతుఁడు)	133
328.	మాంధాత (యౌవనాశ్వుఁడు)	134
329.	గోధ (బ్రహ్మవాదిని)	134
330.	కుమారుఁడు (యమగోత్రుఁడు)	135
331.	జూతి (వాతరశన పుత్రుఁడు)	136
332.	వాతజూతి ,,	136
333.	విప్రజూతి ,,	136
334.	వృషాణకుఁడు ,,	136
335.	కరిక్రతుఁడు ,,	136

ఋషి సంఖ్య	ఋషుల పేర్లు		వారిసూక్తముల సంఖ్య
336.	పతఙుఁడు	,,	136
337.	ఋష్యశృంగుఁడు సప్తర్షులు, అత్ర్యాదులు	,,	137
338.	అంగుఁడు (ఉరుమునిసుతుఁడు)		138
339.	విశ్వావసువు (గంధర్వుఁడు)		139
340.	అగ్ని (పావకుఁడు)		140
341.	అగ్ని (తాపసుఁడు)		141
342.	జరిత శార్ఙ్గపక్షిపుత్రుడు		
343.	ద్రోణుఁడు	,,	142
344.	సారిసృకుఁడు	,,	142
345.	స్తంబమిత్రుఁడు	,,	142
346.	అత్రి (సంఖ్యమునిపుత్రుఁడు)		143
347.	సుపర్ణుఁడు (తార్క్ష్య పుత్రుఁడు)		144
348.	ఊర్ధ్వకృశనుఁడు (యమగోత్రుఁడు		144
	—ఇంద్రాణి		145
348.	a దేవముని (ఇరంమద పుత్రుఁడు)		146
349.	సువేదసుఁడు (శిరిషపుత్రుఁడు)		147
350.	పృథువు (వేనపుత్రుఁడు)		148
351.	అర్చన్మని (హిరణ్యస్తూపసుతుఁడు)		149
	మృళీకుఁడు (వాసిష్ఠుఁడు		150
352.	శ్రద్ధాదేవి (కామగోత్రజ)		151
353.	శాసుఁడు భారద్వాజుఁడు)		152
354.	ఇంద్రమాతలు (దేవస్వసృభూతలు		153
	—సోముఁడు		144
	—యమి (వివస్వత్పుత్రి)		144
355.	శిరింబిరుఁడు (భారద్వాజుఁడు)		155
356.	కేతువు (అగ్నిమునిసుతుఁడు)		156
357.	భువముఁడు (అప్త్యపుత్రుడుఁ)		157
358	సాధనుఁడు (భువనపుత్రుఁడు)		157
359.	చక్షుర్మని (సూర్యమునిపుత్రుఁడు)		158
360	శచి (పులోమపుత్రి)		159
361	పూరణుఁడు (విశ్వామిత్రగోత్రుడుఁ)		160
362.	యక్ష్మనాశనుఁడు (ప్రజాపతిసుతుఁడు)		161
363	రక్షోహాణుఁడు (బ్రహ్మర్షిపుత్రుఁడు)		162
364.	విపృహాణుఁడు (కశ్యపగోత్రుఁడు)		163
365.	ప్రచేతసుఁడు (అంగిరసుఁడు)		164
366.	కపోతుఁడు (నిర్ఋతిపుత్రుఁడు)		165
367	ఋషభుఁడు వైరాజుఁడో లేక శాక్వరుఁడో)		166
	విశ్వామిత్రుఁడు-గాధిసుతుఁడు జమదగ్ని-భార్గవుఁడు		167
368.	అనిలుఁడు (వాతగోత్రుఁడు)		168
369.	శబరుఁడు (కక్షీవద్గోత్రుఁడు)		169
370	విభ్రాట్టు (సూర్యపుత్రు డు)		170
371	ఇటు డు (భృగుపుత్రుఁడు)		171
372	సంవర్తుఁడు (అంగిరసుఁడు)		172
373.	ధ్రువుఁడు	,,	173
374.	అభీవర్తుఁడు	,,	174
375.	ఊర్ధ్వగ్రావుఁడు (అర్బుదసుతుఁడు)		175

ఋషి సంఖ్య	ఋషుల పేళ్లు	వారిసూక్తముల సంఖ్య
376.	సూనుఁడు (ఋభుపుత్రుఁడు)	176
377.	పతంగుడు (ప్రజాపతిపుత్రుఁడు)	177
378	అరిష్టనేమి (తార్క్ష్యపుత్రుఁడు)	178
379	శిబి ఉశీనర రాజర్షిపుత్రుడు)	178
380	ప్రతర్దనుఁడు (కాశీరాజు)	179
381.	వసుమనస్సు (రోహిదశ్వపుత్రుఁడు)	179
382	జయుఁడు (ఇంద్రసుతుఁ)డు	180
383	ప్రథుఁడు—వాసిష్ఠుఁడు	181
384.	సప్రథుఁడు-భారద్వాజుఁడు	181
385	ఘర్ముఁడు (సౌర్యుఁడు)	181
386.	త్రపుమూర్ధుడు (బృహస్పతిసుతుఁడు)	182
387.	ప్రజావంతుఁడు (ప్రజాపతిపుత్రుఁడు)	183
388.	విష్ణువు ,,	184
	త్వష్ట ,,	184
389	సత్యధృతి-(వరుణపుత్రుఁడు)	185
390	ఉలుఁడు (వాతగోత్రుఁడు)	186
391.	వత్సుఁడు (అగ్నిపుత్రుఁడు)	187
392.	శ్యేనుఁడు (అత్రిపుత్రుఁడు)	188
393.	సార్పరాజ్ఞి	189
394.	అఘమర్షణుఁడు (మధుచ్ఛందసుఁడు)	190
395.	సంవననుఁడు (ఆంగిరసుఁడు)	191
	సూక్తద్రష్టల మొత్తము	391
	సూక్తముల మొత్తము	1028

—o—

అనుబంధము - 2

అథర్వవేదఋషి సూక్తపట్టిక

1 కాండము 35 సూక్తములు

ఋషులు	వారిసూక్తములు
అథర్వుడు	1.3,9-11,15,20,21, 23 27,30,34,35
సింధుద్వీపుడు	4-6
చాతనుడు	7,8,16,28
భృగ్వంగిరసులు	12-14,25
బ్రహ్మ	17,19,22,24,26,31,39
ద్రవిణోదసుడు	18
వసిష్ఠుడు	29
శంతాతి	33

2 కాండము 68 సూక్తములు

ఋషులు	వారిసూక్తములు
వేనుడు	1
మాతృనాముడు	2
అంగిరసుడు	3-35
అథర్వుడు	4,7,13,19-23,29,34
అథర్వణభృగువు	5
శౌనకుడు	6
భృగ్వంగిరసులు	8-10
శుక్రుడు	11
భరద్వాజుడు	12
చాతనుడు	14,18,25
బ్రహ్మ	15-17,24,33
సవిత	26
కపింజలుడు	27
శంభుడు	28
ప్రజాపతి	30
కాణ్వుడు	31,32
పతివేదన	36

3 కాండము 31 సూక్తములు

ఋషులు	వారిసూక్తములు
అథర్వుడు	1-5,8,10,15,16,18, 26,27,30
జగద్బీజంపురుషుడు	6
భృగ్వంగిరసులు	7
వామదేవుడు	9
బ్రహ్మ	11,12,14,23,28,31
భృగువు	13,24,25
విశ్వామిత్రుడు	17
వసిష్ఠుడు	19-22
ఉద్దాలకుడు	29

4 కాండము 40 సూక్తములు

ఋషులు	వారిసూక్తములు
వేనుడు	1,2
అథర్వుడు	3,4,10,15,30,34
బ్రహ్మ	5,16,21,33,
గరుత్మంతుడు	6,7
అథర్వాంగిరసులు	8,11
భృగువు	9,12,14
శంతాతి	13
శుక్రుడు	17-19,40
మాతృనాముడు	20

ఋషులు	వారిసూక్తములు

7 కాండము 1. సూక్తములు

అథర్వుఁడు	1-7,13 14,18,34-38, 46-49,52,56,61 70-73,76 78-81,85-87,91,92,94 97 99,105 106
ఉపరిబాభ్రవ్యుఁడు	10-12
శౌనకుఁడు	10-12,82 83
భృగువు	15-17 55,84,107,108,110
బ్రహ్మ	19-22 24,32 33,53,54 60,66 67,103,104,111
యముఁడు	23,64,100,101
మేధాతిథి	25-29
భృగ్వంగిరసులు	30,31
ప్రస్కణ్వుఁడు	39-45
అంగిరసుఁడు	50,51,77,90
వామదేవుఁడు	57
కౌరుపతి	58
బాదరాయణి	59,109
కశ్యపుఁడు	62,63
శుక్రుఁడు	65
శంతాతి	68
అథర్వాంగిరసులు	74,115-118
ఉపరిబాభ్రవ్యుఁడు	75
గరుత్మంతుఁడు	88
సింధుద్వీపుఁడు	89
భృగ్వంగిరసులు	93
కపింజలుఁడు	95,96
ప్రజాపతి	102
వరుణుఁడు	112
భార్గవుఁడు	113,114

8 కాండము 10 సూక్తములు

బ్రహ్మ	1,2
చాతనుఁడు	3,4
శుక్రుఁడు	5
మాతృనాముఁడు	6
అథర్వుఁడు	7-9
భృగ్వంగిరసులు	8
అథర్వాచార్యుఁడు	10

9 కాండము 0 సూక్తములు

అథర్వుఁడు	1-2
భృగ్వంగిరసులు	3-8
బ్రహ్మ	4-6-7,9-10
భృగువు	5

10 కాండము 10 సూక్తములు

ప్రత్యంగిరసుఁడు	1
నారాయణుఁడు	2
అథర్వుఁడు	3-7-9
గరుత్మంతుఁడు	4
సింధుద్వీప, కౌశిక, బ్రహ్మ విహవ్యుఁడు	5
బృహస్పతి	6
కుత్సుఁడు	8
కశ్యపుఁడు	10

11 కాండము 10 సూక్తములు

బ్రహ్మ	1-5
అథర్వుఁడు	2-3-7
భార్గవుఁడు	4
శంతాతి	6
కౌరుపతి	8
కాంకాయనుఁడు	9
భృగ్వంగిరసులు	10

ఋషులు	వారిసూక్తములు

12 కాండము 5 సూక్తములు

అథర్వుఁడు	1
భృగువు	2
యముఁడు	3
కశ్యపుఁడు	4
అథర్వాచార్యుఁడు	5

13 కాండము 4 సూక్తములు

బ్రహ్మ	1-4

14 కాండము 2 సూక్తములు

సావిత్రీసూర్య	1-2

15 కాండము 18 సూక్తములు

(ఇది యంతయు నేకర్షి దృష్టమే కాని, యతని పేరు తెలియకున్నది.)

16 కాండము 9 సూక్తములు

ప్రజాపతి	1-2
బ్రహ్మ	3-4
యముఁడు	5-9

17 కాండము 1 సూక్తము

బ్రహ్మ	1

ఋషులు	వారిసూక్తములు

18 కాండము 4 సూక్తములు

అథర్వుఁడు	1-4

19 కాండము 72 సూక్తములు

బ్రహ్మ	1-9-12-21-30-28-30-36 40-43-51-52-60-71
సింధుద్వీపుఁడు	2
అథర్వాంగిరసులు	3-5
నారాయణుఁడు	6
గార్గ్యుఁడు	7-8
అప్రతిరథుఁడు	13
అథర్వుఁడు	14-20-23-24-26-37-38
అంగిరసుఁడు	22-34-35
గోపథుఁడు	25-47-50
భృగ్వంగిరసులు	27-38
సవిత	31
భృగువు	32-33-44-45-53-55
ప్రజాపతి	46
యముఁడు	56-57
బ్రహ్మ	72
భృగ్వంగిరసులు	72

20 కాండము 143 సూక్తములు

సంస్కృత వాఙ్మయ చరిత్ర

వైదిక వాఙ్మయము

అకారాదిపదపట్టిక

అ

ఆ

ఖి

గ

గా

గి

గు

మా

మి

మీ

ము

మూ

—o—